# పోతన భాగవత సంగ్రహము

(వ్యావహారిక వచనము)


రచన

**డా. అద్దంకి శ్రీనివాస్**



ప్రకాశకులు

చల్లా సాంబిరెడ్డి

B.A;LLB

అధ్యక్షులు

శ్రీపావని సేవాసమితి

హైదరాబాదు

**2021**

# పోతన భాగవత సంగ్రహము

(వ్యావహారిక వచనము)


రచన : డా. అద్దంకి శ్రీనివాస్

ఇమెయిల్ : draddanki@gmail.com

ప్రథమ ముద్రణ : 2018

ద్వితీయ ముద్రణ : 2019

తృతీయ ముద్రణ : 2019

ప్రతులు : 1000



హక్కులు : ప్రకాశకులవి



**ప్రకాశకులు**

**చల్లా సాంబిరెడ్డి**
**శ్రీపావని సేవా సమితి**
ఇం.నెం. : 3-6-499ఎ,
రోడ్ నెం. 7, హిమాయత్‌నగర్
హైదరాబాదు - 500 029.
sripavanisevasamithi@gmail.com

**ముద్రణ**

**వై.వి. రెడ్డి ప్రింటర్స్ & బైండర్స్,**
దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్ - 500 036.
సెల్ : 9391015317
yvr.postpresssolutions@gmail.com

వెల : అమూల్యం

# శ్రీరామసాక్షాత్కారం

సీ. మెఱుఁగు చెంగటనున్న మేఘంబు కైవడి
  నువిద చెంగటనుండ నొప్పువాఁడు
చంద్రమండల సుధాసారంబు పోలిక
  ముఖమునఁ జిఱునవ్వు మొలచువాఁడు
వల్లీయుత తమాల వసుమతీజము భంగి
  బలువిల్లు మూఁపునఁ బరఁగువాఁడు
నీలనగాగ్రసన్నిహితభానుని భంగి
  ఘనకిరీటము దలఁ గలుగువాఁడు

ఆ.వె. పుండరీకయుగముఁ బోలు కన్నులవాఁడు
వెడఁద యురము వాఁడు విపుల భద్ర
మూర్తివాఁడు రాజముఖ్యుఁ డొక్కరుఁడు నా
కన్నుఁగవకు నెదురఁ గానఁబడియె (1-16)

# భాగవతసారం

**పరహితము సేయు నెవ్వఁడు**
**పరమహితుం డగును భూతపంచకమునకుం**
**బరహితమె పరమధర్మము**
**పరహితునకు నెదురు లేదు పర్వేందుముఖీ!**

(శ్రీమద్భాగవతం స్కం-8; 235)

తనకై ఏ లాభం కోరకుండా ఇతరులకు మేలు చేసేవాడు సకల జీవులకీ ఆత్మీయుడు అవుతాడు. ఇతరులకు మేలు చేయటానికి మించిన ధర్మం మరొకటి లేదు. ఈ విధంగా పరోపకారం చేసేవాడికి ఎదురు లేదు.

**ఏతావత్ జన్మసాఫల్యం**
**దేహినామిహ దేహిషు ।**
**ప్రాణైరర్థైః ధియా వాచా**
**శ్రేయ ఏవాచరేత్ సదా ॥** (శ్రీమద్భాగవతమ్ 10-22-35)

మానవుడన్నవాడు తన ప్రాణాలను గూడా లెక్కచేయకుండా, తనకు గల సంపదలను, తెలివిని, వాక్చాతుర్యాన్నీ ఇతరుల శ్రేయస్సు కోసం ఎంత వినియోగిస్తే అంతవరకే అతని జన్మ చరితార్థం అవుతుంది.

# నా మాట

భారతదేశం వేదాలకు పుట్టినిల్లు. ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వవేదం అని ఈ వేదాలు నాలుగు.

ఒక్కటిగా ఉన్న వేదాన్ని కృష్ణద్వైపాయన మహర్షి నాలుగు వేదాలుగా విభజించాడు. అందుకే ఆ మహర్షికి 'వేదవ్యాసుడు' అని పేరు వచ్చింది. ఈ మహర్షే అష్టాదశ పురాణాల్ని కూడా రచించాడు.

ఈ 18 పురాణాలలో 'పురాణ తిలకం' అని పేరుపొందింది భాగవతం. ఎన్నో రచనలు చేసినప్పటికీ లభించని మనశ్శాంతి వేదవ్యాస మహర్షికి భాగవతాన్ని రచించిన తరువాతే లభించింది. అంత మహిమగల గ్రంథం భాగవతం.

ఈ పురాణాన్ని వ్యాస మహర్షి తన కుమారుడైన శుక మహర్షికి చెప్పాడు. శుకమహర్షి పరీక్షిత్తు అనే ఒక రాజుగారికి చెప్పాడు. ఆ తరువాత ఎందరో మహానుభావులు ఎందరికో ఈ పురాణాన్ని చెప్తూ వస్తున్నారు. చెప్పినవారికీ, విన్నవారికీ ఎంతో మేలును చేకూరుస్తుంది పవిత్రమైన ఈ భాగవత పురాణం.

సంస్కృతంలో ఉన్న ఈ భాగవతాన్ని మధురంగా తెలుగులోనికి అనువదించాడు 'బమ్మెర పోతన' మహాకవి. భక్తిమాధుర్యాన్ని కవిత్వంలో రంగరించి భాగవతం అనే రసాయనాన్ని లోకానికి అందించిన మహనీయుడు ఈ బమ్మెర పోతన. ఆ రసాయనం ప్రతి ఇంట్లోనూ ఉంటే ఏ రకమైన అనారోగ్యాలు దరిచేరవని గట్టిగా నమ్మిన వ్యక్తులలో అగ్రగణ్యులు శ్రీమాన్ చల్లా సాంబిరెడ్డిగారు. వీరు శ్రీపావని సేవాసమితి అనే ఒక ధార్మికరథాన్ని శ్రేయోమార్గంలో నడుపుతున్న మహానుభావులు. వీరి సంకల్పబలమే నన్ను మళ్ళీ ఈ భాగవతంతో మీ ముందుకు వచ్చేలా చేసింది. అందుకు వారికీ, ఆదరిస్తున్న మీకూ నమస్కరిస్తూ స్వాగతం పలుకుతున్నాను.

మీ

**అద్దంకి శ్రీనివాస్**

# సాధువాదం

విద్యావతాం భాగవతే పరీక్షా– అన్నారు. ఇది సంస్కృత భాగవతం మాట. అదొక పనసపండు. జటిలమైన వేదాంత విషయాల మధ్య తొనలను వెదికి పట్టుకోవాలి. విడదీసుకోవాలి. ఆస్వాదించాలి. శ్రమైకసాధ్యం.

ఈ పనసపండును మన పోతన మహాకవి భక్తి అనే మంత్ర జల సంప్రోక్షణతో మామిడిపండుగా, ఆరముగ్గిన ఆమ్రఫలంగా మార్చివేశాడు. దానితో రామాయణ భారతాలను మించిన ప్రాచుర్యం పోతనగారి భాగవతానికి దక్కింది.

దానిని ఇప్పుడు డా. అద్దంకి శ్రీనివాస్ గారు కండగలిగిన సులభ సుందరమైన వాడుక తెలుగులోనే వచనీకరించి లోకానికి అందిస్తున్నారు. మధ్య మధ్య మధురాతి మధురమైన పోతన పద్యాలను వాచవిగా అందిస్తూ దీని రుచిని ద్విగుణం త్రిగుణం చేశారు.

అంతేకాదు మూడు స్థాయిల వారి కోసం అన్నట్టుగా మూడు గ్రంథాలుగా రూపొందించారు.

పిల్లల కోసం తక్కువ పుటలతో ద్రాక్షాఫలంగా మొదటిది. యువత కోసం రెట్టింపు పుటలతో కదళీఫలంగా రెండవది.

ప్రౌఢులకోసం మరిన్ని పుటలతో నారికేళఫలంగా మూడవది.

శ్రీరామాయణాన్ని కూడా వీరు ఇలాగే అందించబోతున్నారు. ఇది చాలా గొప్ప కృషి. సమాజంలో అధిక సంఖ్యాకుల్ని పట్టించుకున్న అనువక్తగా డా. అద్దంకి శ్రీనివాస్ గారు నిలిచిపోతారు.

పుటల హెచ్చు తగ్గుల మాట ఎలా ఉన్నా మూడింటా కథ మాత్రం సమగ్రంగా అందడం చెప్పుకోదగ్గ విశేషం. ఈ విషయంలో వీరు తీసుకున్న జాగ్రత్త, వేసుకున్న ప్రణాళిక అత్యద్భుతం. బహుధా ప్రశంసనీయం.

బిందువుకీ సింధువుకీ పరిమాణంలోనే తేడా. పరమార్థంలో రెండూ ఒకటే. దీన్ని వచనీకరణంలో చూపించారు శ్రీనివాస్ గారు.

మరో చమత్కారం ఏమిటంటే – పిల్లల భాగవతం చదివినవారు యువభాగవతం అందుకుంటారు. అది ముగించినవారు పెద్దల భాగవతం పట్టుకుంటారు. అలా చదివించే ఒక అంతర్గత ప్రణాళికతో ఈ గ్రంథత్రయ ప్రస్థానం జరిగింది.

నేను చెప్పడం ఎందుకు, మీరే చూస్తారుగా! రండి !!

వెంటబడి వీరితో ఇన్ని గ్రంథాలు వ్రాయిస్తున్న పట్టువదలని విక్రమార్కుడు శ్రీ చల్లా సాంబిరెడ్డి గారినీ, ప్రచురిస్తున్న శ్రీ పావని సేవా సమితినీ అభినందిస్తూ పాఠకులకు స్వాగతం పలుకుతున్నాను. సెలవు

భవదీయుడు
**బేతవోలు రామబ్రహ్మం**
**9848169769**

హైదరాబాద్
తేది. 10.03.2018

# విషయసూచిక


| క్ర.సం. | విషయం | పుట |
|---|---|---|
| | **ప్రథమ స్కంధం** | |
| 1. | అవతారిక | 1 |
| 2. | కథా ప్రారంభం | 2 |
| 3. | సూత మహర్షి రాక | 2 |
| 4. | శ్రీహరి అవతారాలు | 4 |
| 5. | అహో! శుకమహర్షీ! | 6 |
| 6. | నారద మహర్షి | 7 |
| 7. | నారద మహర్షి పూర్వజన్మ వృత్తాంతం | 7 |
| 8. | అశ్వత్థామ అవమానం | 9 |
| 9. | ద్రౌపది క్షమాగుణం | 9 |
| 10. | భీష్మాచార్యుని హితబోధ | 11 |
| 11. | శ్రీకృష్ణుడి ద్వారకాప్రయాణం | 13 |
| 12. | ద్వారకా ప్రవేశం | 13 |
| 13. | ఉత్తరా గర్భ సంరక్షణ | 14 |
| 14. | విదురుడి హితవు | 15 |
| 15. | పరీక్షిత్తు పట్టాభిషేకం | 17 |
| 16. | ప్రాయోపవేశం | 19 |
| | **ద్వితీయ స్కంధం** | |
| 17. | ఖట్వాంగుడి కథ | 20 |
| 18. | భక్తిమార్గం | 21 |
| 19. | శ్రీహరి లీలావతారాలు | 23 |
| 20. | బ్రహ్మతపస్సు | 26 |
| | **తృతీయ స్కంధం** | |
| 21. | విదురుడి తీర్థయాత్ర | 28 |
| 22. | ఉద్ధవుడి దుఃఖం | 29 |
| 23. | మైత్రేయ మహర్షి | 30 |
| 24. | కాలస్వరూపం | 31 |
| 25. | వరాహావతార కథ | 32 |
| 26. | జయవిజయుల శాప వృత్తాంతం | 33 |
| 27. | హిరణ్యాక్ష వధ | 34 |
| 28. | సృష్టిక్రమం | 35 |
| 29. | కపిలావతార కథ | 36 |
| 30. | ఆత్మస్వరూపం | 38 |
| 31. | భక్తియోగం | 38 |
| 32. | సదాచారాలు | 39 |
| 33. | బ్రహ్మ మొక్కటే | 39 |
| | **చతుర్థ స్కంధం** | |
| 34. | దక్షయాగం | 41 |
| 35. | భక్త ధ్రువుడు | 44 |
| 36. | నారదుడి ఉపదేశం | 45 |
| 37. | ధ్రువుడి తపస్సు | 46 |
| 38. | ఘనస్వాగతం | 47 |
| 39. | వేనుడి వధ | 48 |
| 40. | పృథుచక్రవర్తి చరిత్ర | 49 |
| 41. | ప్రాచీనబర్హి | 52 |
| 42. | పురంజనోపాఖ్యానం | 53 |
| | **పంచమ స్కంధం** | |
| 43. | ప్రియవ్రతుడి కథ | 56 |
| 44. | ఋషభావతార కథ | 57 |
| 45. | భరతుడి చరిత్ర | 58 |
| 46. | మోక్షమార్గం | 60 |

| క్ర.సం. | విషయం | పుట |
|---|---|---|
| | **షష్ఠ స్కంధం** | |
| 47. | అజామిళుడి కథ | 62 |
| 48. | యముడి శాసనం | 65 |
| 49. | సృష్టి విస్తరణ | 65 |
| 50. | దేవేంద్రుడి గర్వం | 67 |
| 51. | విశ్వరూపుడు – నారాయణకవచం | 67 |
| 52. | వృత్రాసురుడి కథ | 68 |
| 53. | నహుషుడి శాపవృత్తాంతం | 70 |
| 54. | వృత్రాసురుడి పూర్వ జన్మ వృత్తాంతం | 70 |
| 55. | దితి – పుంసవనవ్రతం | 72 |
| | **సప్తమ స్కంధం** | |
| 56. | ధర్మసందేహం | 74 |
| 57. | ప్రహ్లాద చరిత్ర | 75 |
| 58. | హిరణ్యకశిపుడి ఓదార్పు | 76 |
| 59. | హిరణ్యకశిపుడి వరాలు | 77 |
| 60. | ప్రహ్లాదుడి వ్యక్తిత్వం | 77 |
| 61. | ప్రహ్లాదుడి భక్తి | 80 |
| 62. | నవవిధ భక్తి మార్గాలు | 81 |
| 63. | ప్రహ్లాదుడి వివేకం | 83 |
| 64. | చిత్రహింసలు | 84 |
| 65. | శ్రీహరి–అంతర్యామిత్వం | 86 |
| 66. | నరసింహావతారం | 87 |
| 67. | ఉగ్ర నరసింహుడు | 88 |
| 68. | త్రిపురాసుర సంహారం | 89 |
| 69. | శ్రేష్ఠమైన ధర్మాలు | 90 |
| 70. | అజగరోపాఖ్యానం | 91 |
| 71. | వేదమార్గం | 93 |

| క్ర.సం. | విషయం | పుట |
|---|---|---|
| | **అష్టమ స్కంధం** | |
| 72. | గజేంద్రుడి మోక్షం | 94 |
| 73. | ఏనుగుల స్వైరవిహారం | 95 |
| 74. | శరణాగతి | 96 |
| 75. | శ్రీహరి ఆగమనం | 97 |
| 76. | క్షీరసాగర మథనం | 103 |
| 77. | వామనావతారం | 108 |
| 78. | తృప్తిలోనే సుఖం | 111 |
| 79. | శుక్రాచార్యుడి హితవు | 111 |
| 80. | సత్యవ్రతం | 112 |
| 81. | భళీ! బలీ! | 114 |
| 82. | త్రివిక్రమ స్వరూపం | 114 |
| 83. | మత్స్యావతార కథ | 117 |
| | **నవమ స్కంధం** | |
| 84. | వైవస్వతమనువు వంశం | 119 |
| 85. | అంబరీషుడి కథ | 121 |
| 86. | ఏకాదశీవ్రతం | 122 |
| 87. | దుర్వాసుడి కోపం | 122 |
| 88. | ఇక్ష్వాకు వంశ క్రమం | 125 |
| 89. | మాంధాతృ చక్రవర్తి | 126 |
| 90. | సగర పుత్రులు | 127 |
| 91. | కల్మాషపాదుడు | 127 |
| 92. | శ్రీరామ చరిత్ర | 129 |
| 93. | చంద్రవంశం | 136 |
| 94. | పరశురాముడి కథ | 136 |
| 95. | విశ్వామిత్రుడు | 138 |
| 96. | యయాతి చరిత్ర | 139 |
| 97. | రంతిదేవుడి చరిత్ర | 141 |

| క్ర.సం. | విషయం | పుట |
|---|---|---|
| | **దశమ స్కంధం** | |
| 98. | శ్రీకృష్ణావతారం | 145 |
| 99. | కంసుడి హింస | 146 |
| 100. | వసుదేవుడి వేడుకోలు | 147 |
| 101. | నారదుడి రాక | 149 |
| 102. | బలభద్రుడి జననం | 150 |
| 103. | శ్రీకృష్ణావతార ఘట్టం | 151 |
| 104. | సందడే సందడి | 154 |
| 105. | నందుడూ వసుదేవుడూ | 155 |
| 106. | పూతన వధ | 156 |
| 107. | ఆనందం... ఆశ్చర్యం | 157 |
| 108. | తృణావర్తుడి సంహారం | 158 |
| 109. | గర్గ మహర్షి | 159 |
| 110. | శ్రీకృష్ణ బలరాముల బాల్యక్రీడలు | 160 |
| 111. | గోపికల మొర | 161 |
| 112. | విశ్వరూప సందర్శనం | 163 |
| 113. | శ్రీకృష్ణుడి అల్లరి | 164 |
| 114. | ఉలూఖల బంధనం | 165 |
| 115. | మద్దిచెట్లకు మోక్షం | 167 |
| 116. | బృందావన వాసం | 168 |
| 117. | వత్సాసుర సంహారం | 169 |
| 118. | బకాసుర వధ | 169 |
| 119. | చల్దుల ఆరగింపు | 170 |
| 120. | అఘాసుర వధ | 170 |
| 121. | బ్రహ్మదేవుడి మాయ | 171 |
| 122. | ధేనుకాసుర సంహారం | 175 |
| 123. | కాళియ మర్దనం | 176 |
| 124. | నాగస్త్రీల ప్రార్థన | 177 |

| క్ర.సం. | విషయం | పుట |
|---|---|---|
| 125. | ప్రలంబాసుర వధ | 179 |
| 126. | గోపికా వస్త్రాపహరణం | 180 |
| 127. | ముని భార్యల విందు | 181 |
| 128. | ఇంద్రయాగం – గోవర్ధన పర్వత పూజ | 183 |
| 129. | గోపికల ఆగమనం | 184 |
| 130. | గోపికా గీతలు | 186 |
| 131. | రాసక్రీడ | 187 |
| 132. | సుదర్శనుడి శాపవిమోచనం | 187 |
| 133. | శంఖచూడ సంహారం | 188 |
| 134. | వృషభాసుర వధ | 188 |
| 135. | కంసుడి ఆహ్వానం | 188 |
| 136. | కేశి వధ | 189 |
| 137. | వ్యోమాసుర వధ | 189 |
| 138. | అక్రూరుడి రాక | 190 |
| 139. | యమునలో బలరామకృష్ణులు | 190 |
| 140. | మధురానగర ప్రవేశం | 191 |
| 141. | కువలయాపీడం | 193 |
| 142. | కంస వధ | 194 |
| 143. | ఉగ్రసేన మహారాజుకు పట్టాభిషేకం | 194 |
| 144. | సాందీపని మహర్షి | 195 |
| 145. | ఉద్ధవుడి సందేశం | 195 |
| 146. | కృష్ణ జరాసంధుల యుద్ధం | 197 |
| 147. | కాలయవనుడు | 198 |
| 148. | ద్వారకానగరం | 198 |
| 149. | ముచుకుందుడు | 199 |
| 150. | ప్రవర్షణ పర్వతం | 200 |

| క్ర.సం. | విషయం | పుట |
|---|---|---|
| 151. | రుక్మిణీ కల్యాణం | 201 |
| 152. | అగ్నిద్యోతనుడి రాయబారం | 202 |
| 153. | శ్రీకృష్ణుడి రాక | 204 |
| 154. | రుక్మిణి ఆందోళన | 205 |
| 155. | శ్రీకృష్ణుడి విజయం | 207 |
| 156. | ప్రద్యుమ్న కుమార చరిత్ర | 208 |
| 157. | శమంతకమణి | 209 |
| 158. | ఇంద్రప్రస్థ ప్రయాణం | 213 |
| 159. | అష్టమహిషీ కల్యాణం | 213 |
| 160. | నరకాసురుడు | 214 |
| 161. | వీరనారి – సత్యభామ | 215 |
| 162. | పారిజాతాపహరణం | 217 |
| 163. | బలరాముడి విజృంభణ | 218 |
| 164. | బాణాసురుడి తపస్సు | 219 |
| 165. | శివ – కేశవ యుద్ధం | 221 |
| 166. | నృగ మహారాజు | 222 |
| 167. | పౌండ్రక వధ | 223 |
| 168. | ద్వివిదుడి వధ | 225 |
| 169. | బలరాముడి ప్రతాపం | 225 |
| 170. | శ్రీకృష్ణుడి మహిమ | 226 |
| 171. | జరాసంధుడి వధ | 227 |
| 172. | శ్రీకృష్ణ స్తుతి | 229 |
| 173. | శిశుపాల వధ | 229 |
| 174. | సాల్వుడి దండయాత్ర | 231 |
| 175. | దంతవక్త్రుడి వధ | 232 |
| 176. | బలరాముడి తీర్థయాత్రలు | 233 |
| 177. | కుచేలోపాఖ్యానం | 234 |
| 178. | ఆత్మీయుల కలయిక | 238 |
| 179. | వసుదేవుడి యాగం | 240 |
| 180. | సుభద్రా పరిణయం | 241 |
| 181. | మిథిలానగర సందర్శనం | 242 |
| 182. | శ్రుతిగీతలు | 242 |
| 183. | విష్ణు సేవా ప్రాశస్త్యం | 243 |
| 184. | వృకాసుర సంహారం | 243 |
| 185. | భృగు పరీక్ష | 244 |
| 186. | బ్రాహ్మణ పుత్రులు | 245 |


**ఏకాదశ స్కంధం**


| | | |
|---|---|---|
| 187. | మహర్షుల ఆగమనం | 248 |
| 188. | ముసలం పుట్టింది | 249 |
| 189. | విదేహర్షభ సంవాదం | 249 |
| 190. | వైకుంఠానికి ఆహ్వానం | 254 |
| 191. | శ్రీకృష్ణుడి ఉపదేశం | 254 |
| 192. | అవధూత – యదు సంవాదం | 256 |
| 193. | అవతార పరిసమాప్తి | 260 |


**ద్వాదశ స్కంధం**


| | | |
|---|---|---|
| 194. | కల్కి అవతారం | 262 |
| 195. | ధర్మస్వరూపం | 264 |
| 196. | సర్పయాగం | 265 |
| 197. | వేదపురాణాల వ్యాప్తి | 266 |
| 198. | మార్కండేయోపాఖ్యానం | 267 |
| 199. | ద్వాదశాదిత్యులు | 270 |
| 200. | భాగవత పురాణ ప్రాశస్త్యం | 271 |
| 201. | అంతా హరిమయమే | 272 |

**ఉపయుక్త పద్యానుక్రమణిక 273–276**

# ప్రథమ స్కంధం

## అవతారిక

శా. **శ్రీకైవల్య పదంబుఁ జేరుటకునై చింతించెదన్ లోక ర**
**క్షైకారంభకు భక్తపాలన కళాసంరంభకున్ దానవో**
**ద్రేకస్తంభకుఁ గేళిలోల విలసత్‌దృగ్జాల సంభూత నా**
**నాకంజాత భవాండకుంభకు మహానందాంగనాడింభకున్.** (1–1)

'భక్తుల్ని ఆదుకొనేవాడూ, సృష్టికర్తా అయిన బాలకృష్ణుడిని మోక్షంకోసం నేను ప్రార్థిస్తున్నాను' అంటూ ఇష్టదేవతల్ని స్తుతించి భాగవతాన్ని ప్రారంభించాడు పోతన.

తే.గీ. **చేతులారంగ శివునిఁ బూజింపడేని**
**నోరు నొవ్వంగ హరికీర్తి నుడువఁడేని**
**దయయు సత్యంబు లోనుగాఁ దలఁపఁడేని**
**గలుగ నేటికిఁ దల్లుల కడుపు చేటు** (1–14)

చేతులారా శివుణ్ణి పూజించనివాడూ, నోరారా హరిని కీర్తించనివాడూ, దయ, సత్యంలాంటి గుణాలను పాటించనివాడూ జన్మించటం ఎందుకు? అటువంటి వాడి పుట్టుక తల్లుల కడుపుకు చేటు. అంతే! అందుకే శ్రీహరిని కీర్తించే భాగవతాన్ని రచించాలని సంకల్పించాడు ఈ మహాకవి.

సాక్షాత్తూ శ్రీరామచంద్రుడే కలలో కనిపించి భాగవతాన్ని రచించమని అనుజ్ఞ ఇచ్చాడట! అప్పుడు పోతన–

కం. **పలికెడిది భాగవతమఁట!**
**పలికించు విభుండు రామభద్రుండఁట! నేఁ**
**బలికిన భవహరమగునఁట!**
**పలికెద వేఱొండుగాథఁ బలుకఁగ నేలా?** (1–17)

'పలికేది భాగవతమట! పలికించేవాడు శ్రీరాముడేనట! నేను పలికితే నాకు మోక్షం లభిస్తుందట! అలాంటప్పుడు వేరే కథ నాకెందుకు? కల్పవృక్షంలాంటి ఈ భాగవతాన్ని రచించి నా జీవితాన్ని చరితార్థం చేసుకొంటాను' అని ప్రారంభించాడు.

## కథాప్రారంభం

**అ**దుగో! నైమిశారణ్యం. ఎంతో గొప్పది ఆ అరణ్యం! అక్కడ అన్నీ వింతలే! ఎక్కడ చూసినా చెట్లు, పచ్చగా కళకళలాడుతూ ఉంటాయి. ఫలపుష్పాదులతో కళకళలాడుతూ ఉండే ఆ అరణ్యం మహర్షులకు నివాసమై అలరారుతూ ఉంటుంది. జ్ఞానంలేని జంతువులు కూడా జాతివిరోధాన్ని విడిచిపెట్టి ఈశ్వరధ్యానం చేస్తున్నట్లు కన్పిస్తాయి. అందుకే అక్కడ ఏ క్రూరజంతువూ సాధు జంతువుని హింసించదట! మహర్షులు అక్కడ ఎప్పుడూ తపస్సు చేస్తూ, భగవంతుడి కథల్ని చెప్తూ వింటూ కాలం గడుపుతూ ఉంటారట!

ఒకసారి శౌనకుడు మొదలైన మహర్షులంతా కలసి అక్కడ ఒక యాగం తలపెట్టారు. ఆ యాగం పేరు దీర్ఘసత్రం. ఇది వెయ్యి సంవత్సరాలు జరుగుతుంది. దానిని చూడటానికి రాజులు, పండితులు, మునులు, సామాన్య ప్రజలు ఇలా ఒకరేమిటి? ఎందరో తండోపతండాలుగా వస్తున్నారు. అతిథి మర్యాదలకు ఏ లోటూ లేదు. అదీ విశేషం!

## సూత మహర్షి రాక

అలా వచ్చినవారిలో **'సూతుడు'** కూడా ఉన్నాడు. ఇతడు ఒక మహర్షి. నిజానికి ఇతడి పేరు **ఉగ్రశ్రవసుడు.** ఇతడి తండ్రి **రోమహర్షణుడు.** కానీ ఇతడిని అందరూ **'సూతుడు'** అని పిలుస్తారు.

సూత మహర్షి గొప్ప వక్త. వేదపురాణాలు బాగా చదువుకున్నాడు. ఎంతో వినయం. ఎప్పుడూ శ్రీహరిని కీర్తిస్తూనే ఉంటాడు.

**శౌనకాది మహర్షులు** సూతమహర్షికి ఎంతో గౌరవం చేశారు. చేతులు జోడించి ఇలా అడుగుతున్నారు-

"సూతమహర్షీ! నువ్వే మా వద్దకు రావటం మా అదృష్టం సుమా! నువ్వు చాలా గొప్పవాడివి. గొప్పగొప్పవాళ్ల దగ్గర నుంచి ఎన్నో విన్నావు. ఇప్పటివాడివా?

ఎన్ని గ్రంథాలు చదివావో! ఎన్ని శాస్త్రాలు ఆపోశన పట్టావో! నీలాంటి మహానుభావుడు అందుబాటులో ఉన్నప్పుడే సందేహాలు తీర్చుకోవాలి. అందుకే మాదో సందేహం.

**కలియుగంలో మానవులు సోమరిపోతులు, మందమతులు. దీర్ఘకాలం జీవించలేరు. భయంకరమైన రోగాలు పట్టిపీడిస్తాయి. ఒక్కటంటే ఒక్కటైనా మంచి పని చేయరు. ఎవరికీ మనశ్శాంతి ఉండదు. ఇలాంటి కలికాలంలోని ప్రజలకు ఆత్మశాంతి కలగాలంటే, మృత్యుభయం దరిచేరకుండా ఉండాలంటే శ్రీహరికథల్ని వినడం తప్ప వేరే దారిలేదు.**

**కం. భూషణములు వాణికి నఘ**
**పేషణములు మృత్యుచిత్త భీషణములు హృ**
**త్తోషణములు కల్యాణవి**
**శేషణములు హరిగుణోపచితభాషణముల్** (1-46)

శ్రీహరి గురించిన మాటలే సరస్వతీదేవికి అలంకారం. అవే సకల పాపాలకూ గొడ్డలిపెట్టులాంటివి. మృత్యువు మనసుకు భయం కలిగించేవి. భక్తుల హృదయాలకు ఆనందం కలిగిస్తాయి. కళ్యాణకరాలైన ఆ గోవిందుడి కథల్ని వినాలని మా చెవులు తహతహలాడుతున్నాయి.

సముద్రాన్ని దాటాలనుకొనేవారికి మంచి నావికుడు దొరికినట్లు మాకు నువ్వు దొరికావు. కాబట్టి మాకు ఆ గోవిందుడి కథామృతాన్ని ప్రసాదించు."

సూత మహర్షి శాంతంగా విన్నాడు. అలాగేనంటూ -

"మహర్షులారా! మీ ఆందోళన నాకు అర్థమయింది. కలియుగంలో అందరూ తరించే మార్గాన్ని మీకు చెప్తాను" అంటూ ముందుగా మహాయోగి అయిన శుక మహర్షికి నమస్కరించి -

'ఆ మహానుభావుడు సర్వసంగ పరిత్యాగి. సామాన్యుడు కాదు. వేదానికి సారమైన భాగవతం అనే దీపాన్ని లోకానికి చూపించిన దయామయుడు, వ్యాస భగవానుడి కుమారుడు. ఆ శుకయోగి చెప్పిన భాగవతాన్నే నేను మీకు వినిపిస్తాను.

మునీంద్రులారా! హరిభక్తి ఒక్కటే మానవులు ఆచరించదగిన గొప్ప ధర్మం. అదే పరమాత్మకు మనల్ని చేరువ చేస్తుంది. హరిని కీర్తించినా, హరికథల్ని విన్నా

కర్మలు నశిస్తాయి. మోక్షం లభిస్తుంది' అంటూ ప్రారంభించాడు.

## శ్రీహరి అవతారాలు

భగవంతుడైన శ్రీమన్నారాయణుడు లోకాల్ని రక్షించడం కోసం అనేక అవతారాల్ని ధరించాడు. మొట్టమొదట శ్రీహరి ధరించిన అవతారం కౌమారావతారం (అంటే సనక, సనందన, సనాతన, సనత్కుమారులనే పేర్లు కల బాలకుల రూపం).

రెండో అవతారం వరాహావతారం. ఈ అవతారంలోనే రసాతలంలో మునిగిపోయిన భూమిని పైకి ఎత్తాడు.

మూడో అవతారంలో నారదమహర్షిగా జన్మించాడు.

నాలుగో అవతారం నరనారాయణుల అవతారం.

ఐదో అవతారంలో కపిలమహర్షిగా జన్మించి 'సాంఖ్యం' అనే శాస్త్రాన్ని బోధించాడు.

ఆరో అవతారం దత్తాత్రేయుడి అవతారం. అత్రి అనసూయలకు పుత్రుడిగా జన్మించిన అవతారం.

ఏడో అవతారంలో 'యజ్ఞుడు' అనే పేరుతో జన్మించి, స్వాయంభువ మన్వంతరాన్ని రక్షించాడు.

ఎనిమిదో అవతారంలో మేరుదేవికీ, నాభి అనే రాజుకీ 'ఉరుక్రముడు' అనే పేరుతో జన్మించాడు.

తొమ్మిదో అవతారంలో పృథుచక్రవర్తియై పృథివిని ధేనువుగా జేసి సమస్త ఓషధుల్నీ పితికాడు.

పదో అవతారం మత్స్యావతారం. ఈ అవతారంలోనే వైవస్వతమనువునూ, సృష్టికి కావలసిన పదార్థాలనూ ఒక నావలో ఉంచి రక్షించాడు.

పదకొండో అవతారం కూర్మావతారం. పాలకడలిని దేవతలూ రాక్షసులూ మథిస్తూ ఉంటే తాబేలు రూపంలో వెళ్ళి మందర పర్వతం మునిగిపోకుండా తన వీపుపై భరించాడు.

ఆ సముద్రంలో నుంచి పుట్టిన 'ధన్వంతరి' పన్నెండో అవతారం.

ధన్వంతరి చేతిలోని అమృతం కోసం దేవతలూ రాక్షసులూ గొడవపడ్డారు. అప్పుడు శ్రీహరి మోహిని అవతారం ధరించి అమృతాన్ని తెలివిగా దేవతలకు పంచాడు. ఇది పదమూడో అవతారం.

హిరణ్యకశిపుణ్ణి చంపి, ప్రహ్లాదుణ్ణి రక్షించిన నారసింహుడు పద్నాలుగో అవతారం.

బలిచక్రవర్తిని రసాతలానికి పంపిన వామనమూర్తి పదిహేనో అవతారం.

పదహారో అవతారంలో పరశురాముడిగా జన్మించాడు, దుష్టక్షత్రియుల్ని సంహరించాడు.

పదిహేడో అవతారం వేదవ్యాసుడు.

పద్దెనిమిదో అవతారం శ్రీరామావతారం.

పంతొమ్మిదో అవతారం బలరాముడు.

ఇరవయ్యో అవతారంలో శ్రీకృష్ణుడిగా జన్మించాడు.

ఇరవయ్యొకటో అవతారంగా మధ్యగయా ప్రాంతంలో బుద్ధుడిగా అవతరిస్తాడు. అలాగే అధర్మం మితిమీరినప్పుడు 'విష్ణుయశుడు' అనే బ్రాహ్మణుడికి 'కల్కి' అనే పేరుతో జన్మిస్తాడు.

నిజానికి ఆ దేవదేవుడికి అసలు పుట్టుక అన్నదే ఉండదు. ఏ కర్మలూ ఆ స్వామిని అంటుకోవు. తన విలాసం కోసమే ఈ లోకాల్ని సృష్టిస్తాడు. పరిపాలిస్తాడు. లయం చేస్తాడు. అందుకే శ్రీహరి లీలలు ఒక్కపట్టాన అంతుచిక్కవు.

భాగవతం అంటే ఈ భగవానుడి లీలలే. లోకకల్యాణం కోసం **వ్యాసుడు దీనిని రచించి తన కుమారుడైన శుకయోగిచేత చదివించాడు. శుకయోగి పరీక్షిత్తుకు వినిపించాడు.**

'శ్రీకృష్ణుడు తన అవతారాన్ని చాలించడంతో కలియుగంలో ధర్మం క్షీణించింది. కలి ప్రవేశించింది. కలి దోషం అనే చిమ్మచీకట్లు కమ్ముకొని దారి తెలియక

అలమటించే జనులకు భాగవతం సూర్యుడి లాంటిది' అన్నాడు సూత మహర్షి. వెంటనే శౌనకుడు–

## అహో! శుకమహర్షీ!

"మునీంద్రా! శుకమహర్షి సర్వసంగపరిత్యాగి అని ఇంతకుముందే చెప్పావు. అతడి దృష్టికి అన్నీ ఒకేలా కనిపిస్తాయట కదా! బంగారమూ మట్టీ, స్త్రీ–పురుషులూ ఇలా ఏ తేడాలూ అతడికి తెలియనే తెలియవట! అన్నింటిలోనూ పరమాత్మనే దర్శిస్తాడట!"

ఒకసారి శుక మహర్షిని వెతుక్కొంటూ అతడి తండ్రి వేదవ్యాసుడు అడవుల్లోంచి వెళ్తున్నాడట! అక్కడ ఒక సరస్సులో కొందరు దేవతాస్త్రీలు బట్టలు లేకుండా స్నానం చేస్తున్నారట! ముందు శుక మహర్షి అటువైపు వచ్చాడట! వాళ్ళు అతడిని అసలు పట్టించుకోనేలేదు. తరువాత వ్యాసుడు వచ్చాడట! వ్యాసుడిని చూసి వాళ్ళు కంగారు పడి బట్టలు కట్టుకున్నారట! దానికి ఆశ్చర్యపోయిన వ్యాసుడు 'నేను ముసలివాణ్ణి. నా కొడుకు నవయౌవనంలో ఉన్నాడు. అతణ్ణి చూసి అస్సలు పట్టించుకోని మీరు నన్ను చూసి ఇలా కంగారు పడుతున్నారు. ఎందుకు?' అని అడిగాడట!

దానికి వాళ్ళు 'మునీంద్రా! నీ కొడుక్కి స్త్రీ–పురుష భేదం తెలియదు. నీకు తెలుసు' అన్నారట! అదే శుక మహర్షి గొప్పతనం. పెద్దలు చెప్పగా మేము విన్నాం! శుకుడు ఎక్కడా స్థిరంగా ఉండడు. ఆవు పొదుగు నుండి ఒకసారి పాలు పితకడానికి ఎంత సమయం పడుతుందో అంత సమయమే అతడు గృహస్థుల దగ్గర ఉంటాడు. అడగనిదే ఏదీ చెప్పడు. అడిగితే చెప్పకుండా వెళ్ళడు. అతడు నిలిచిన ప్రాంతం పుణ్యతీర్థం అవుతుందని అంటారు. అలాంటి శుక మహర్షిని గురించి తెలుసుకోవాలని ఉంది' అని అడిగాడు.

సూత మహర్షి ఆనందంగా చెప్పటం ప్రారంభించాడు.

మహర్షులారా! అది ఈ మహాయుగంలో మూడవది అయిన ద్వాపరయుగం ముగిసే సమయం. అప్పుడు ఉపరిచర వసువుకు సత్యవతి జన్మించింది. ఈమెకే 'వాసవి' అని మరో పేరు. ఈమెకూ, పరాశరుడు అనే మహర్షికీ ఒక పుత్రుడు జన్మించాడు. అతడే వేదవ్యాసుడు (పైన చెప్పిన విష్ణువు పదిహేడో అవతారమైన వేదవ్యాసుడే ఇతడు).

## నారద మహర్షి

వేదవ్యాసుడు కలియుగంలోని మానవుల్ని ఉద్ధరించడానికి ఏం చేయాలా? అని ఆలోచించి అఖండంగా ఉన్న వేదాన్ని నాలుగు భాగాలుగా చేశాడు. ఇతిహాసాల్నీ, పురాణాల్నీ పంచమ వేదంగా సృష్టించాడు. వీటిని ఆయన శిష్యులు ప్రచారం చేశారు. ఇంత చేసినా వ్యాసుడికి ఏదో చెప్పలేని వెలితి. దానికి కారణం శ్రీహరి కథల్ని కీర్తించే భాగవతాన్ని రచించకపోవటమేనని అతడికి తోచింది. అదే సమయంలో నారద మహర్షి వచ్చాడు. ఆయన కూడా అదే మాట చెప్పాడు.

**మ. హరినామస్తుతిసేయు కావ్యము సువర్ణాంభోజహంసావళీ**
**సురుచిభ్రాజితమైన మానస సరః స్ఫూర్తిన్ వెలుంగొందు శ్రీ**
**హరినామస్తుతి లేని కావ్యము విచిత్రార్థాన్వితంబయ్యు శ్రీ**
**కరమైయుండ దయోగ్యదుర్మదనదత్కాకోలగర్తాకృతిన్** (1-96)

హరినామాన్ని స్తుతించే కావ్యమే గొప్ప కావ్యమనీ అది మానస సరోవరం లాంటిదనీ అలా స్తుతించని కావ్యం ఎంతటి విచిత్రార్థాలు కలదైనా బురదగుంట లాంటిదనీ పోలుస్తూ హరిని సేవించే జన్మమే ఉత్తమ జన్మ అని చెప్పాడు. అంతేకాదు భాగవతాన్ని రచించమని వ్యాసుడిని ప్రోత్సహించాడు నారదుడు. హరిభక్తి ఎంత గొప్పదో వ్యాసుడికి తెలియ చెప్పాలని తన పూర్వజన్మ గురించి చెప్పటం ప్రారంభించాడు.

## నారద మహర్షి పూర్వజన్మ వృత్తాంతం

వ్యాసమహర్షీ! నేను పూర్వం ఒక దాసీపుత్రుణ్ణి. మా యజమానులు నన్ను ఋషులకు సేవకుడిగా నియమించారు. వాళ్ళవల్ల నాకు హరిభక్తి అలవడింది.

కొన్నాళ్ళకు వాళ్ళు దీక్ష ముగించారు. వెళ్తూ వెళ్తూ నాకు 'నారాయణమంత్రం' ఉపదేశించి మరీ వెళ్ళారు.

ఆ తరువాత నా తల్లి పాము కరిచి చనిపోయింది. అయినా నాకు బాధ కలగలేదు. హరినామాన్ని స్మరిస్తూ దేశాలు పట్టి తిరిగాను. ఒక అడవిలో ఒక రావిచెట్టు క్రింద శ్రీహరిని ధ్యానిస్తూ కూర్చున్నాను. మనస్సులో ఆ స్వామి రూపం. కళ్ళు ఆనందంతో వర్షించాయి. మనస్సు ఉప్పొంగిపోయింది.

కళ్ళు తెరిచి చూశాను. ఆ రూపం కనిపించలేదు. అంతా వెతికాను. ఎక్కడా కనిపించలేదు. ఇంతలో ఒక దివ్యవాణి.

'నారదా! ఎందుకు నీకీ వృథా ప్రయాస. ఈ జన్మలో కాదు. నన్ను వచ్చే జన్మలో చూడగలవు. అప్పుడు నువ్వు నా ప్రియభక్తుడివి అవుతావు' అంది ఆ వాణి.

'నా ఆనందం అంతా ఇంతా కాదు. అప్పటి నుండీ శ్రీహరినే స్మరిస్తూ శరీరాన్ని విడిచిపెట్టాను. అంతలో ప్రళయం వచ్చింది. సముద్రం మధ్యలో శ్రీహరి శయనించి ఉన్నాడు. ఆ శ్రీహరి నాభికమలంలో ఉన్న బ్రహ్మదేవుడు నిద్రలో ఉన్నాడు. అతడి ఊపిరి ద్వారా లోపలికి ప్రవేశించాను.

అలా కొన్ని వేల యుగాలు గడిచిపోయాయి. బ్రహ్మదేవుడు మేల్కొని సృష్టి ప్రారంభించాడు. మరీచినీ, నన్నూ ఇంకా కొందరు మహర్షుల్నీ సృష్టించాడు. అప్పటినుండీ నేను శ్రీహరినే స్మరిస్తూ ముల్లోకాలూ తిరుగుతూ ఉన్నాను.

ఇదుగో! నా వీణ. దీని పేరు మహతి. దీనిని మీటుతూ శ్రీహరినే గానం చేస్తుంటాను. యాగాలూ జపాలూ ఎన్ని చేసినా లభించని మనశ్శాంతి శ్రీహరిని స్మరిస్తే లభిస్తుంది. ఇది నా అనుభవంలోంచి వచ్చిన మాట! లే! భాగవతాన్ని రచించు. నీ మనసు కుదుటపడుతుంది' అని చెప్పి నారద మహర్షి వెళ్లిపోయాడు.

వేదవ్యాసుడు బదరీ వనంలో ఉన్న 'శమ్యాప్రాసం' అనే ఆశ్రమంలో కూర్చొని భక్తితో భాగవతాన్ని రచించాడు. మొదట శుక మహర్షి దానిని పఠించాడు. తరువాత కొంతకాలానికి ప్రాయోపవేశం చేయాలనుకున్న పరీక్షిత్తు మహారాజుకు తనే స్వయంగా ఈ భాగవతాన్ని వినిపించాడు. ఎందుకో తెలుసా!!

**కం. నిగమములు వేయుఁ జదివిన**
**సుగమంబులు గావు ముక్తిసుభగత్వంబుల్**
**సుగమంబు భాగవత మను**
**నిగమంబు పఠింప ముక్తి నివసనము బుధా!** (1–140)

**వెయ్యి వేదాల్ని చదివినా లభించని మోక్షం ఒక్క భాగవతాన్ని చదివితే సులభంగా లభిస్తుంది. అందుకే ఆ భాగవతాన్ని మీకు వినిపిస్తున్నాను. శ్రద్ధగా వినండి.** అంటూ సూత మహర్షి చెప్పటం ప్రారంభించాడు.

## అశ్వత్థామ అవమానం

అది కురుక్షేత్ర సంగ్రామం. భీముడి ధాటికి దుర్యోధనుడు తొడలు విరిగి నేలపై కూలిపోయాడు. అశ్వత్థామ దుర్యోధనుడికి ఎలాగైనా ఆనందం కలిగించాలనుకొన్నాడు. పాండవ శిబిరంలో దూరి, రాత్రికి రాత్రి నిద్రలో ఉన్న ఉపపాండవుల తలలు నరికి తీసుకువచ్చాడు.

అది తెలిసి పాండవులు భగ్గుమన్నారు. ద్రౌపది విలవిలలాడిపోయింది. అర్జునుడు శపథం పట్టి మరీ కదిలాడు. అశ్వత్థామను బంధించి తెచ్చి ద్రౌపది కాళ్ళదగ్గర పడవేశాడు.

శ్రీకృష్ణుడితో సహా అందరూ అశ్వత్థామను సంహరించడమే తగిన శిక్ష అన్నారు. అందుకు కారణం అశ్వత్థామ అధర్మానికి పాల్పడ్డాడు. **భయపడ్డవాణ్ణి, మతి లేనివాణ్ణి, నిద్రలో ఉన్నవాణ్ణి, మద్యపానం చేసినవాణ్ణి, పారిపోతున్నవాణ్ణి, శరణు వేడినవాణ్ణి, స్త్రీలనూ చంపటం అధర్మం.**

అశ్వత్థామ సిగ్గుతో తల దించుకొని ఉన్నాడు. ద్రౌపది అతణ్ణి చూసి–

## ద్రౌపది క్షమాగుణం

"గురుపుత్రా! ఎంత పని చేశావయ్యా! అభం శుభం తెలియని నా పుత్రుల్ని పొట్టనపెట్టుకున్నావే! ఇదేనా నీ వీరత్వం? నిద్రపోతున్న అమాయకుల్ని చంపుతావా? వాళ్ళు నీకేం అపకారం చేశారు? నాకు ఇంత కడుపు కోతను మిగిల్చావే!" అంది. అంటూనే కృష్ణార్జునుల్ని చూసి – 'అర్జునుడు ఇతణ్ణి బంధించి తీసుకువచ్చాడని తెలిసి అక్కడ ఇతడి తల్లి ఎంతగా తల్లడిల్లిపోతుందో! నేను అర్థంచేసుకోగలను. ఒక తల్లి కడుపుకోత ఇంకో తల్లికే తెలుస్తుంది. వద్దు! ఇతణ్ణి చంపితే మనకు బ్రహ్మహత్యాపాతకం చుట్టుకుంటుంది' అంది.

ఆమె మాటల్లో ఒకవైపు బాధ, మరోవైపు జాలి.

ద్రౌపది మాటలు సబబుగానే తోచాయి ధర్మరాజుకి. భీముడికైతే అసలు నచ్చలేదు. ఒక్క గుద్దుతో చంపేస్తానంటూ వీరావేశంగా అశ్వత్థామ మీదికి వచ్చాడు భీముడు. ద్రౌపది అడ్డుపడింది. శ్రీకృష్ణుడు కలుగజేసుకొని అందరి కసీ తీరేలా

శిరోముండనం చేయించి అవమానించి పంపమన్నాడు. అర్జునుడు అలాగే చేసి అతడి తలలో మెరుస్తున్న చూడామణిని లాక్కొని తరిమికొట్టాడు.

పాండవులు యుద్ధంలో మరణించినవారందరికీ దహన సంస్కారాలు చేశారు.

శ్రీకృష్ణుడు గాంధారీ ధృతరాష్ట్రులనూ, కుంతీదేవినీ, ద్రౌపదినీ ఇలా అందరినీ ఊరడించాడు, ధైర్యం చెప్పాడు.

ధర్మరాజు తాను రాజు అయిన తరువాత మూడు అశ్వమేధ యాగాలు కూడా చేశాడు. అప్పటిదాకా శ్రీకృష్ణుడు అక్కడే ఉండి తరువాత ద్వారకకు బయలుదేరాడు. ఇంతలో ఉత్తర తత్తరపడుతూ వచ్చి శ్రీకృష్ణుడి కాళ్ళపై పడింది. ఆమె అభిమన్యుడి భార్య.

అశ్వత్థామ అవమానంతో రగిలిపోయాడు. అభిమన్యుడివల్ల ఉత్తర గర్భంలో పెరుగుతున్న పాండవ వంశాన్ని తిరిగి మొలకెత్తకుండా చేయాలని ఆ పిండంపై బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు. అది ఆ శిశువును దహించాలని చూస్తోంది. అందుకే ఉత్తర వచ్చి రక్షించమని శ్రీకృష్ణుణ్ణి వేడుకుంది. శ్రీకృష్ణుడు ఆ శిశువును రక్షించాడు. అప్పుడు కుంతి తన పుత్రుల్నీ ద్రౌపదినీ తీసుకొనివచ్చి శ్రీకృష్ణుణ్ణి కొనియాడింది.

శా. **శ్రీకృష్ణా! యదుభూషణా! నరసఖా! శృంగారరత్నాకరా!**
**లోకద్రోహి నరేంద్ర వంశదహనా! లోకేశ్వరా! దేవతా**
**నీక బ్రాహ్మణగోగణార్తి హరణా! నిర్వాణ సంధాయకా!**
**నీకున్ మ్రొక్కెదఁ ద్రుంపవే! భవలతల్ నిత్యానుకంపానిధీ!** (1-200)

**శ్రీకృష్ణా! యదువంశానికి అలంకారమైనవాడా! నరుడికి స్నేహితుడా! శృంగార సముద్రుడా! లోకద్రోహులైన రాజుల వంశాల్ని సంహరించినవాడా! లోకేశ్వరా! అందరి ఆర్తినీ పోగొట్టేవాడా! మోక్షాన్ని ప్రసాదించేవాడా! దయానిధీ! నీకు నమస్కరిస్తాను. నా ఈ సంసారం అనే తీగల్ని త్రుంచవయ్యా! అని పదే పదే వేడుకొంది.**

శ్రీకృష్ణుడు ఆనందించి, కుంతీదేవి కోరికపై ఇంకా కొన్నాళ్ళు హస్తినాపురంలోనే ఉండిపోయాడు.

## భీష్మాచార్యుని హితబోధ

ధర్మరాజుకు యుద్ధంలో గెలిచామన్న ఆనందం ఏ కోశానా లేదు. రాజ్యం కోసం అయినవాళ్ళందరినీ సంహరించామే అన్న బాధ వెంటాడుతోంది. ఎవరు ఎన్ని రకాలుగా ఓదార్చినా అతడి బాధ తీరేలా లేదు. 'నా పాపానికి నిష్కృతి లేదు' అని తల్లడిల్లిపోతున్నాడు. నోటికి ముద్ద సహించడంలేదు. కంటిమీద కునుకు లేదు. ఏం చేయాలో తోచక అంపశయ్య మీద ఉన్న భీష్మడి దగ్గరకు వెళ్ళాడు. అతడి వెంట శ్రీకృష్ణుడూ, తక్కిన పాండవులూ, కొందరు మహర్షులూ కూడా ఉన్నారు.

భీష్ముడు తాను లేవలేని స్థితిలో ఉండి కూడా ఎవరిని ఎలా గౌరవించాలో అలా గౌరవించాడు. అర్చించాడు కూడా. పాండవుల్ని చూసి–

'నాయనలారా! మీరు మంచివాళ్ళై ఉండి కూడా ఎన్ని ఇబ్బందులు పడ్డారో! పాపం! మీ తల్లి కుంతీదేవి పడ్డ అగచాట్లు వర్ణనాతీతం. ఇదే నాయనా! కాల మహిమ. మహావీరులైన మీరు, శ్రీకృష్ణుడి అండదండలు ఉండి కూడా నానా యాతనలూ పడ్డారు.

ఇదంతా విష్ణుమాయ. ఆ పరమాత్మ ఎప్పుడు ఏం చేస్తాడో ఎవరికి ఎరుక? సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడే తన తేజస్సును బయటపెట్టకుండా సామాన్యుడిలా మీ వెంట తిరుగుతున్నాడు. అతణ్ణి మీరు ఓ మేనత్త కొడుకుగానే చూస్తున్నారు. ఎన్ని రకాలుగా ఉపయోగించుకోవాలో అన్ని రకాలుగానూ ఉపయోగించు కొంటున్నారు. అయినా అతడి గొప్పదనానికి ఏ లోటూ రాదు.

ఆత్మీయులైన భక్తులకు అందుబాటులో ఉండటం ఆ స్వామికి అలవాటు. ఇప్పుడు చూడండి. ఆ దేవదేవుడే స్వయంగా నా చివరి ఘడియల్లో నా దగ్గరికి కోరి మరీ వచ్చాడు. ఇంతకంటే నాకేం కావాలి చెప్పండి? నేను పూర్వజన్మలో ఎంత పుణ్యం చేశానో ఏమో!' అన్నాడు.

పాండవులకు ఎన్నో నీతులు, ధర్మాలూ వివరంగా చెప్పాడు. ఇంతలో ఉత్తరాయణ పుణ్యకాలం సమీపిస్తోంది. భీష్ముడికి తాను కోరినప్పుడే మరణించే వరం ఉంది. అందుకే గోపాలుడి ముఖాన్నే చూస్తూ అతడిపైనే దృష్టిని నిలిపి, శ్రీకృష్ణపరమాత్మను స్తుతిస్తున్నాడు.

సీ. కుప్పించి యెగసినఁ గుంతలంబుల కాంతి
గగనభాగంబెల్ల గప్పికొనఁగ
నుఱికిన నోర్వక యుదరంబులో నున్న
జగముల వ్రేఁగున జగతి గదలఁ
జక్రంబుఁ జేపట్టి చనుదెంచు రయమునఁ
బైనున్న పచ్చని పటము జాఱ
నమ్మితి నాలావు నగుబాటు సేయక
మన్నింపుమని క్రీడి మరలఁ దిగువ

తే.గీ. గరికి లంఘించు సింహంబు కరణి మెఱసి
నేఁడు భీష్ముని జంపుదు నిన్నుఁ గాతు
విడువు మర్జున! యనుచు మద్విశిఖవృష్టిఁ
దెరలి చనుదెంచు దేవుండు దిక్కు నాకు (1-221)

కురుక్షేత్రయుద్ధంలో నేను బాణాలు వేస్తుంటే శ్రీకృష్ణుడికి కోపం వచ్చింది. రథంపైనుండి నాపైకి దూకాడు. అప్పు డాయన ముంగురుల కాంతి ఆకాశమంతా వ్యాపించింది. అలా ఉరికేసరికి పొట్టలో ఉన్న లోకాల బరువుకు భూమి కంపించింది. చక్రాన్ని ధరించి వేగంగా వస్తుంటే పైన ఉన్న ఉత్తరీయమూ జారిపోతోంది. 'నిన్నే నమ్ముకున్నాను. నన్ను నవ్వులపాలు చెయ్యకు' అని అర్జునుడు వెనక్కి లాగుతుండగా నన్ను చంపుతానంటూ నావైపు వస్తున్న ఆ శ్రీకృష్ణుడే నాకు దిక్కు.

మ. ఒక సూర్యుండు సమస్తజీవులకుఁ దానొక్కొక్కఁడై తోఁచుపో
లిక నే దేవుఁడు సర్వకాలము మహాలీలన్ నిజోత్పన్నజ
న్యకదంబంబుల హృత్సరోరుహములన్ నానావిధానూనరూ
పకుఁడై యొప్పుచునుండు నట్టి హరి నేఁ బ్రార్థింతు శుద్ధుండనై
(1-226)

ఒకే సూర్యుడు సమస్త జీవులకూ ఒక్కొక్కడై కనిపిస్తాడు. అలాగే భగవంతుడూ తాను సృష్టించిన ప్రాణుల హృదయాలలో సర్వకాలమూ అనేకరూపాలలో నిత్యమూ ఉంటాడు. ఆ హరిని నేను శుద్ధుడినై ప్రార్థిస్తాను అంటూ భీష్ముడు త్రికరణశుద్ధిగా శ్రీకృష్ణుడినే ధ్యానిస్తూ వాసుదేవుడిలో ఐక్యమైపోయాడు.

ధర్మరాజు భీష్ముడికి అంత్యక్రియలు నిర్వహించి హస్తినాపురానికి తిరిగి వచ్చాడు. శ్రీకృష్ణుడి అనుగ్రహం వల్ల అతడు అందించే అండదండలవల్ల ధర్మరాజు ధర్మబద్ధంగా రాజ్యపాలన చేస్తున్నాడు.

## శ్రీకృష్ణుడి ద్వారకా ప్రయాణం

పనులన్నీ పూర్తయ్యాయి. ఇక ద్వారకా నగరానికి బయలుదేరాడు శ్రీకృష్ణ పరమాత్మ. అందరినీ పేరుపేరునా పలకరించి మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు చెప్పి బయలుదేరాడు.

రథం హస్తినాపురం వీథుల్లోంచి సాగిపోతుంది. ఊరు ఊరంతా కదలివచ్చింది. ఎక్కడ చూసినా జనమే! జయజయ ధ్వానాలు, వాద్యఘోషలు, పుష్పవర్షాలు. ఇలా శ్రీకృష్ణుడికి ఘనంగా వీడ్కోలు పలుకుతోంది హస్తినాపురం. అంతఃపురకాంతలు మిద్దెలపై నిలబడి శ్రీకృష్ణుణ్ణి చూస్తూ పరవశించిపోతున్నారు. అందరినీ ప్రేమగా చూస్తూ, అందరిపై చిరునవ్వుల్ని మోహపు జల్లులా కురిపిస్తూ సాగిపోయాడు నందగోపాలుడు.

## ద్వారకా ప్రవేశం

అదిగో ద్వారక! శ్రీకృష్ణుడి రాక కోసం అందంగా ముస్తాబయింది. పౌరులూ తహతహలాడిపోతున్నారు. అందరూ ఎదురు చూస్తున్న నల్లనయ్య రానే వచ్చాడు. వచ్చి అందరికీ అమితమైన ఆనందాన్ని కలిగించాడు. నగరం నగరమే శ్రీకృష్ణుడి పాదాల దగ్గర మోకరిల్లింది. ఇన్నాళ్ళూ ఏమైపోయావయ్యా! అని కంటతడి పెట్టుకుంది.

శ్రీకృష్ణుడి దర్శనం, అతడి మాటలు, చూపులు, చేష్టలు ద్వారకా పౌరుల్ని మంత్రముగ్ధుల్ని చేశాయి. ఘనంగా స్వాగతం పలికారు శ్రీకృష్ణ పరమాత్మకు. నగర కాంతలు మేడలపై నిలబడి చూస్తూ గోపాలుడి లీలల్ని కొనియాడుతున్నారు.

స్తోత్రాలూ మంగళవాద్యాలూ, వేదాశీర్వచనాలూ, స్త్రీల గానాలూ కొనసాగుతూ ఉంటే శ్రీకృష్ణుడు ద్వారకా నగర వీథుల్లో ఉల్లాసంగా పర్యటించి నేరుగా తన అంతఃపురానికి చేరుకున్నాడు. అక్కడ దేవకీదేవికి నమస్కరించాడు. తక్కిన ఆరుగురు తల్లులకూ నమస్కరించాడు. అప్పుడు ఆ తల్లుల కళ్ళలో ఆనంద బాష్పాలు.

అక్కణ్ణుంచి ఒకేసారి అనేక రూపాలతో తన అంతఃపుర కాంతలందరి దగ్గరికీ వెళ్ళి వాళ్ళనూ ఆనందింపజేశాడు.

ఎవరిని ఎలా తృప్తిపరచాలో శ్రీకృష్ణుడికి బాగా తెలుసు. అంతమందితో కలిసి ఉన్నా వాళ్ళ గుణాలేవీ ఇతడికి సోకవు. అదీ పరమాత్మ లక్షణం. వాళ్ళు మాత్రం ఇతణ్ణి సామాన్యుడిలాగే భావిస్తారు. అడవిలో గాలి ఏం చేస్తుంది? చెట్టూ చెట్టూ ఒరుసుకొనేలా చేసి నిప్పు పుట్టిస్తుంది. ఆ నిప్పు అడవి మొత్తాన్నీ కాల్చి బూడిద చేస్తుంది. శ్రీకృష్ణుడూ అంతే. రాజులందరికీ పరస్పరం వైరం కల్పించాడు. తాను ఆయుధం చేతపట్టకుండానే అందరూ నాశనమయ్యేలా చేశాడు. అంత చేసినవాడు ఇప్పుడు ఎంతో శాంతంగా ఏమీ తెలియనట్లు ఇక్కడ ఈ కాంతల మధ్య వచ్చి కూర్చున్నాడు. అందుకే మహామహా తపస్వులకు సైతం ఈ పరంధాముడి లీలలు అర్థంకావు' అంటూ సూత మహర్షి శ్రీకృష్ణుడి గొప్పతనం చెప్తున్నాడు.

అప్పుడు శౌనక మహర్షి శ్రీకృష్ణుడు పరీక్షిత్తును కాపాడిన వృత్తాంతాన్ని వివరంగా చెప్పమని అడిగాడు. సూత మహర్షి ఆ కథ చెప్పటం మొదలుపెట్టాడు.

## ఉత్తరా గర్భ సంరక్షణ

మహర్షులారా! అశ్వత్థామ ఉత్తరాదేవి గర్భంలోని శిశువుపై బ్రహ్మాస్త్రం ప్రయోగించాడని చెప్పాను కదా! ఆ అస్త్రం అగ్నిజ్వాలలను చిమ్ముతూ శిశువును దహించివేస్తోంది. ఆ వేడికి తాళలేక కడుపులోని శిశువు ఇలా ఆక్రోశిస్తున్నాడు–

'ఓరి భగవంతుడా! ఏడవడానికి కూడా శక్తి చాలటంలేదు. అసలే గర్భ గోళంలో ఉన్నాను. ఏడ్చినా ఎవరికీ వినిపించదు. నాకు దిక్కు ఎవరు? నన్ను ఆదుకొనే నాథుడు ఏడి? పుట్టకముందే పుట్టిన ఈ ఆపదను ఎవరికి చెప్పుకోను? నా మరణంతో మా అమ్మకు కూడా తీరని కడుపు కోత. మా అమ్మ ఎప్పుడూ అంటూ ఉండేది, 'శ్రీహరి ఒక్కడే రక్షకుడు' అని. అది నిజమేనా? ఆ దేవుడు ఇక్కడికి వస్తాడా? నన్ను రక్షిస్తాడా?'

శ్రీమన్నారాయణుడు ఆ శిశువు మొర విన్నాడు. బొటనవేలంత పరిమాణంలో సాక్షాత్కరించాడు. సకల ఆభరణాలూ ధరించాడు. చేతిలో ఒక గద ఉంది. శిశువు చుట్టూ గిరగిరా తిప్పేస్తూ సెగలు కక్కుతున్న బ్రహ్మాస్త్రాన్ని అణచివేసి ఆ

పసికందును రక్షించాడు. ఆ మహానుభావుడు ఎవరా? అని ఈ పసిగుడ్డు కళ్ళు తెరిచి చూసేలోపే కనిపించకుండాపోయాడు.

కొన్నాళ్ళకు ఒక మంచి ముహూర్తంలో ఆ శిశువు లోకంలోనికి వచ్చాడు. ధర్మరాజు తన మనుమడికి జాతకర్మలు జరిపించి 'విష్ణురాతుడు' అని పేరుపెట్టాడు. తల్లి గర్భంలో తను చూసిన దేవుడు ఈ లోకమంతా వ్యాపించి ఉన్నాడని పరీక్షగా చూస్తున్నాడట ఆ బాలుడు. అందుకే అతడికి పరీక్షిత్తు అని పేరు వచ్చింది.

బాలుడు పెరిగి పెద్దవాడై అలరారుతున్నాడు. ధర్మరాజు సోదరులతో కలసి సామ్రాజ్యాన్ని విస్తరింపజేసి అనేక యాగాలు చేసి రాజ్యాన్ని చక్కగా పరిపాలిస్తున్నాడు. కొన్నాళ్ళకు తీర్థయాత్రలకు వెళ్ళిన విదురుడు తిరిగి వచ్చి, ఆ విశేషాల్ని ధృతరాష్ట్రుడు మొదలైనవాళ్ళకు చెప్పాడు. అప్పటికే యాదవులు నశించారు. కానీ ఆ విషయం చెప్పి ధర్మరాజును బాధపెట్టదలచుకోలేదు విదురుడు.

## విదురుడి హితవు

ఒకరోజు రాత్రి విదురుడు ధృతరాష్ట్రుడి వద్దకు వచ్చి కర్తవ్యాన్ని ఇలా ఉపదేశించాడు. 'రాజా! కాలం చాలా గొప్పది. ఎంతటివారినైనా లయం చేస్తుంది. నీ పరిస్థితే చూడు. నీ వైభవమంతా పోయింది. నువ్వు ఎవరికి హాని చేశావో ఆ పాండవుల దగ్గరే ఇప్పుడు దిక్కులేక కుక్కిన పేనులా ఉండవలసి వచ్చింది నీకు. ఇలా ఎంతకాలం? ఇప్పటికైనా మోహాన్ని విడిచిపెట్టు. శరీరం అశాశ్వతమని తెలుసుకో' అన్నాడు.

ధృతరాష్ట్రుడు విదురుడి మాటల్లోని సత్యాన్ని గ్రహించాడు. తన భార్య గాంధారిని తీసుకొని విదురుడితో కలసి హిమాలయాలకు వెళ్ళిపోయాడు.

తెల్లవారింది. ధృతరాష్ట్రుడికి రోజూలాగే నమస్కరించడానికి వచ్చిన ధర్మరాజుకు అక్కడ ఎవరూ కనిపించలేదు. విదురుడూ లేడు. కంగారు పడిపోయాడు. సంజయుడు కనిపించాడు. అతణ్ణి అడిగాడు. అతడూ తెలియదన్నాడు. సరిగ్గా అప్పుడే అక్కడికి నారద తుంబురులు వచ్చారు.

'ధర్మరాజా! ఈ విశ్వం మొత్తం ఈశ్వరుడి అధీనంలో ఉంటుంది. ఆ పరాత్పరుడే అనేక రూపాలలో ఉంటాడు. ఒక జంతువుకు మరో జంతువు ఆహారం. తినేదీ

పరమాత్మే. తినబడేదీ పరమాత్మే. అతడు చేసే ప్రతి పనికీ ఒక అర్థం, పరమార్థం ఉంటుంది. నీ తల్లిదండ్రుల గురించి బాధపడకు. వాళ్ళు హిమాలయాలలో ఉన్నారు. శ్రీహరిని ధ్యానిస్తున్నారు. సరిగ్గా నేటికి ఐదోరోజున వాళ్ళు పరమాత్మలో ఐక్యం అవుతారు. విదురుడు తీర్థయాత్రలకు వెళ్ళిపోతాడు' అని చెప్పి వెళ్ళిపోయారు.

తరువాత ధర్మరాజుకు కొన్ని అపశకునాలు కనిపించాయి. శ్రీకృష్ణుడు ఎలా ఉన్నాడో తెలుసుకొని రమ్మని అర్జునుణ్ణి ద్వారకకు పంపించాడు. అతడు ఇంకా రాలేదు. అదొక ఆందోళన. శ్రీకృష్ణుడు ఎలా ఉన్నాడోనని మరో ఆదుర్దా.

అర్జునుడు వెళ్ళి వచ్చాడు. అతడి ముఖంలో నెత్తురు చుక్క లేదు. కళ్ళు ధారాళంగా వర్షిస్తున్నాయి. ఏమైందో ధర్మరాజుకు అర్థం కాలేదు. భీముడూ అక్కడే ఉన్నాడు. ఆందోళనగా చూస్తూ-

'అర్జునా! ఎందుకలా ఉన్నావు? ఏమయ్యింది?

**కం. ఓడితివో శత్రువులకు?**
**నాడితివో సాధుదూషణాలాపములన్?**
**గూడితివో పరసతులను?**
**వీడితివో మానధనము వీరుల నడుమన్?** (1-352)

**కం. తప్పితివో యిచ్చెదనని?**
**చెప్పితివో కపట సాక్షి? చేసిన మేలుం**
**దెప్పితివో? శరణార్థుల**
**రొప్పితివో ద్విజులఁ బసుల రోగుల సతులన్?** (1-353)

**కం. అడిచితివో భూసురులను?**
**గుడిచితివో బాలవృద్ధ గురువుల వెలిగా?**
**విడిచితివో యాశ్రితులను?**
**ముడిచితివో పరుల విత్తముల లోభమునన్ ?** (1-354)

**శత్రువుల చేతిలో ఓడిపోయావా? మంచివాళ్ళను దూషించావా? పరస్త్రీలను కలిశావా? అభిమానం పోగొట్టుకున్నావా? మాట తప్పావా? దొంగ సాక్ష్యం ఇచ్చావా? చేసిన మేలును దెప్పిపొడిచావా? శరణువేడిన వాళ్లనుగానీ, బ్రాహ్మణులనుగానీ, నోరులేని మూగజీవాల్నిగానీ, రోగుల్నిగానీ, స్త్రీలనుగానీ కోపంతో నిందించావా?**

**బ్రాహ్మణుల్ని కొట్టావా? బాలవృద్ధగురువులకు పెట్టకుండా నువ్వే తిన్నావా? నమ్మిన వాళ్లను విడిచిపెట్టావా? లోభంతో ఇతరుల సంపదలను అనుభవించావా?** అని కంగారుగా ఏవేవో అడుగుతున్నాడు ధర్మరాజు.

అర్జునుడు వెక్కివెక్కి ఏడుస్తూ 'రాజా! ఏమని చెప్పను? ఎలా చెప్పను? మనల్ని అన్నీ తానై నడిపించిన శ్రీకృష్ణుడు, ప్రాణానికి ప్రాణమైన గోపాలుడు మనల్ని విడిచిపెట్టి వెళ్ళిపోయాడు' అంటూ బావురుమన్నాడు.

ధర్మరాజు హతాశుడైపోయాడు. కాళ్ళ క్రింద భూమి కంపించినట్లయింది.

అర్జునుడు– శ్రీకృష్ణుడు చేసిన సహాయాలన్నింటినీ ఏడుస్తూనే ఏకరువు పెడుతున్నాడు. 'ఎన్ని చేశాడు, ఎంతగా ఆదుకొన్నాడు, ఎంత దయ చూపించాడు' అంటూ విలపిస్తున్నాడు. ఇంతలో శ్రీకృష్ణుడు తనకు బోధించిన గీతాసారం అతడికి గుర్తుకు వచ్చింది. దుఃఖాన్ని దిగమింగుకున్నాడు. బుద్ధిని వాసుదేవుడి పాదాలపై కేంద్రీకరించాడు.

శ్రీకృష్ణ మరణవార్త విన్న కుంతీదేవి కూడా శరీరాన్ని విడిచిపెట్టింది.

**ముల్లును ముల్లుతోనే తీయాలి. అలా తీశాక ఆ రెండు ముల్లులనూ కాల్చి వేసేవాడే వివేకవంతుడు. నాటకం అయిపోయాక నటుడు పాత్రలను విడిచి తన సొంత రూపంలో కనిపిస్తాడు. పరమాత్మ కూడా అంతే! ఆయన లోకకంటకులైన దుష్టులను అంతమొందించేందుకు తానుకూడా దేహాన్ని ధరించి, దుష్టసంహారానంతరం తన దేహాన్ని కూడా విడిచిపెట్టాడు. ఇప్పుడు శ్రీకృష్ణావతారం సమాప్తం అయింది. ఇదే కలియుగానికి నాంది.**

## పరీక్షిత్తు పట్టాభిషేకం

ధర్మరాజు పరీక్షిత్తుకు రాజ్యం అప్పగించి శరీరాన్ని విడిచిపెట్టాడు. సోదరులూ ద్రౌపదీ క్రమంగా అతడిని అనుసరించారు. విదురుడు ప్రభాస తీర్థంలో శరీరాన్ని విడిచిపెట్టాడు.

'మహర్షులారా! వీళ్ళందరి చరిత్రలూ ఎంతో గొప్పవి. విన్నా చదివినా పుణ్యం లభిస్తుంది. పరీక్షిత్తు 'ఇరావతి' అనే కన్యను పెళ్ళాడాడు. చక్కగా రాజ్యపాలన చేస్తున్నాడు. కొన్నాళ్ళకు జైత్రయాత్రకు బయలుదేరాడు. దారిలో ఒక విచిత్రమైన పరిస్థితి ఎదురయ్యింది అతడికి.

కలిపురుషుడు ఒక గోవృషభముల జంటను కాలితో తన్నుతున్నాడు. వాడు రాజచిహ్నాలతో శూద్రుడి వేషంలో ఉన్నాడు. ఎద్దురూపంలో ఉన్నది ధర్మదేవుడు. ఆవు రూపంలో ఉన్నది భూమాత. ధర్మదేవుడు ఒంటికాలిపై కుంటుతూ నడుస్తున్నాడు.

**మూగప్రాణుల్నీ అమాయిక జీవుల్నీ హింసించేవాళ్ళను రాజు శిక్షించాలి. అలా చేయని రాజుగారి ఆయువు, ఐశ్వర్యం ఇవన్నీ వృథా.** అందుకే పరీక్షిత్తు కలిపురుషుణ్ణి శిక్షించాడు. తన రాజ్యంలో ప్రవేశించడానికి వీలు లేదని శాసించాడు.

కలి ప్రాధేయపడ్డాడు. 'నేను ఎక్కడ ఉండాలో నువ్వే చెప్పు' అని వేడుకొన్నాడు. దానికి పరీక్షిత్తు–

**'ఓయీ, కలీ! నీకు ప్రాణిహింస, స్త్రీవ్యసనం, జూదం, మద్యపానం అనే నాలుగు స్థానాలిస్తున్నాను' అన్నాడు. కలి ఇంకా కావాలని కోరగా బంగారం (అవసరాన్ని మించిన అధికసంపద) కూడబెట్టడం వల్ల వచ్చే అసత్యం, మదం, కామం, హింస, శత్రుత్వం అనే స్థానాలు కూడా ఇచ్చి, హరిభక్తుల జోలికి వెళ్ళకు'** అని శాసించాడు. అటుపైని– ధర్మదేవుడు కోల్పోయిన తపస్సు, శౌచం, దయ అనే మూడు పాదాలనూ తిరిగి అతడికి ప్రసాదించాడు.

మహర్షులు సూత మహర్షి చెప్పినదంతా విన్నారు. వాళ్ళ మనస్సులు ఆనంద సాగరాలయ్యాయి. కృతజ్ఞతగా చూస్తూ

'మహర్షీ! మా చెవుల్లో విష్ణుకథలు అనే అమృతాన్ని పోసి మమ్మల్ని ధన్యుల్ని చేశావు. **విష్ణు కథలు పవిత్రమైనవి. తాపాలను పోగొట్టి, పాపాలను రూపుమాపి సకల శుభాలను కలిగిస్తాయి సుమా'** అంటూ చేతులు జోడించారు. సూత మహర్షి మళ్ళీ చెప్పటం ప్రారంభించాడు.

'మునులారా! ఒకరోజు పరీక్షిత్తు వేటకు వెళ్ళాడు. వేటాడి అలసిపోయి దగ్గరలో ఉన్న ఒక ఆశ్రమానికి చేరుకున్నాడు. అక్కడ ఒక మహర్షి కళ్ళు మూసుకొని ధ్యానంలో కూర్చొని ఉండటం కనిపించింది. అతణ్ణి చూసి పరీక్షిత్తు పలకరించి, తనకు బాగా దాహంగా ఉందనీ కాస్త నీళ్ళు ఇమ్మనీ వేడుకున్నాడు. మహర్షి ఉలకలేదు, పలకలేదు. ధ్యానంలో ఉన్నాడు కదా! కానీ పరీక్షిత్తు అలా అనుకోలేదు. అది మహర్షి అహంకారంగానూ, తనకు జరిగిన అవమానంగానూ భావించాడు. అక్కడే చచ్చిపడిఉన్న ఒక పామును ఆ మహర్షి మెడలో వేసి వెళ్ళిపోయాడు.

ఆ మహర్షి పేరు శమీకుడు. ఇతడి కొడుకు శృంగి. శృంగి జరిగినదంతా తెలుసుకొని వెంటనే – 'నా తండ్రిని అవమానించినవాడు సరిగ్గా వారం రోజుల్లో 'తక్షకుడు' అనే సర్పంవల్ల మరణిస్తాడు' అని శపించాడు.

శమీకుడు శాంతమూర్తి. శృంగి శాపాన్ని సమర్థించలేదు. పరీక్షిత్తు దేశానికి రాజు. అతడు చేసిన చిన్న తప్పుకు అంత శిక్ష ఏమిటని ప్రశ్నించాడు. సరే! ఇది విధి నిర్ణయం. కాబట్టి ఈ సంగతిని రాజుగారికి తెలియజేయమని తన శిష్యుల్ని పంపాడు.

పరీక్షిత్తు పశ్చాత్తాపం చెందాడు. తానెందుకిలా చేశాడో అర్థం కాలేదతడికి. నిజంగా ఇది కలి పురుషుడి ప్రభావమే. శాప వృత్తాంతం విని బాధపడలేదు. శృంగి శాపమే తనలో విరక్తి కలగడానికి బీజం అవుతున్నదని సంతోషించాడు.

## ప్రాయోపవేశం

అది గంగాతీరం. పరీక్షిత్తు తన పుత్రుడు జనమేజయుడికి రాజ్యం అప్పగించి ప్రాయోపవేశానికి సిద్ధపడ్డాడు. ఆ వార్త తెలిసి అందరూ వస్తున్నారు. అత్రి, విశ్వామిత్ర, మైత్రేయ, భృగు, వసిష్ఠ, పరాశర, చ్యవన, భరద్వాజ, పరశురామ, దేవల, గౌతమ, కశ్యప, కషవ, కణ్వ, కలశసంభవ, వ్యాస, పర్వత, నారదాది మహర్షులూ విచ్చేశారు. పరీక్షిత్తు అందరినీ సాదరంగా ఆహ్వానించి మర్యాదలు చేస్తున్నాడు. తనకు ముక్తిమార్గం చెప్పమని వేడుకొంటున్నాడు.

అంతలో ఒక అవధూత అక్కడికి విచ్చేశాడు. అతడిది చూడచక్కని రూపం. ముఖంలో దివ్యమైన కాంతి. ఒంటిమీద ఒక్క నూలుపోగైనా లేదు. అతడే శుక మహర్షి. ఎవరినీ ఏదీ అడగడు. ఎవరినీ నిందించడు. ఎవరితోనూ ఏ సంబంధమూ పెట్టుకోడు. సర్వసంగ పరిత్యాగి. జ్ఞానం ఒక ఆకారం ధరించి వస్తే ఎలా ఉంటుందో అలా ఉన్నాడు.

పరీక్షిత్తు అతడి పాదాల చెంత కూర్చొని 'యోగిపుంగవా! నాకు ముక్తిమార్గం ప్రసాదించు' అని అభ్యర్థించాడు అన్నాడు– సూత మహర్షి.

ఆ తరువాత ఏమయిందో తెలుసుకోవాలన్న కుతూహలం శౌనకాది మహర్షుల కళ్ళలో స్పష్టంగా కనిపించింది.

# ద్వితీయ స్కంధం

**సూ**త మహర్షి చెబుతున్నాడు.

"మహర్షులారా! శుక మహర్షి చుట్టూ చూశాడు. ఒక చిరునవ్వు నవ్వి

'మహారాజా! మంచి ప్రశ్న వేశావయ్యా! ఆత్మతత్త్వాన్ని తెలిపే ప్రశ్న. సంసారంలో మునిగి ఉన్నవాళ్ళందరినీ దరిజేర్చే ప్రశ్న.

**నువ్వు గొప్ప భాగవతుడివి. శ్రీహరి భక్తుడివి. ముక్తిని కలిగించే సాధనం ఒకటి ఉంది. అదే భాగవతం. నేను దీనిని నీకు వినిపిస్తాను. మోక్షం కావాలనుకొనే వాళ్ళు తప్పక వినవలసిన గ్రంథం ఇది తెలుసా!' అంటూ చెప్పటం ప్రారంభించాడు శుక మహర్షి.**

## ఖట్వాంగుడి కథ

మహారాజా! పూర్వం 'ఖట్వాంగుడు' అనే రాజు ఉండేవాడు. అతడు ఎంతటి వీరుడో చెప్పలేం! రాక్షసుల బారి నుండి కాపాడమని దేవేంద్రుడే ఇతడి సహాయం కోరాడు.

అతడి కోరికపై రాక్షసుల్ని సంహరించాడు ఖట్వాంగుడు. దేవతలు ఆనందించారు. ఏదైనా వరం కోరుకోమన్నారు. అప్పుడు ఖట్వాంగుడు ఇంకా తనకు ఎంత ఆయువు ఉందో చెప్పమన్నాడు. అందుకు దేవతలు 'ఒక్క ముహూర్త కాలం మాత్రమే' అన్నారు.

**ఖట్వాంగుడు మరి ఆలస్యం చేయలేదు. వెంటనే రాజ్యానికి వచ్చి సర్వమూ త్యజించి గోవింద నామాన్ని కీర్తించి మొదటి రెండు ఘడియల్లోనే మోక్షాన్ని పొందాడు.**

'రాజా! నీకు ఏడు రోజుల సమయం ఉంది. ఎంత మంచి అవకాశం! **అవసానదశలో శోకించకూడదు. భయం అంతకన్నా పనికిరాదు. దృష్టిని భగవంతుడిపై కేంద్రీకరించి సాధన ద్వారా విష్ణుపదాన్ని చేరుకోవాలి,** అర్థమయిందా?' అన్నాడు.

ఆ సాధన ఎలా చేయాలో వివరంగా చెప్పమని పరీక్షిత్తు అడిగాడు. దానికి సమాధానంగా విరాట్ పురుషుడి స్వరూపాన్ని వివరించటం మొదలుపెట్టాడు శుకయోగి.

**కం. హరిమయము విశ్వమంతయు;**
**హరి విశ్వమయుండు; సంశయము పనిలే దా**
**హరిమయముగాని ద్రవ్యము**
**పరమాణువు లేదు వంశపావన! వింటే!** (2-17)

**రాజా! విశ్వమంతా హరిమయమే! ఆ శ్రీహరి అంతటా ఉన్నాడు. అతడు లేకుండా ఒక్క పరమాణువు కూడా లేదు. హరిని తెలుసుకొంటే ఏదైనా సాధ్యమే. తెలుసుకోకపోతే అంతా అసాధ్యమే.**

పూర్వం బ్రహ్మదేవుడు కూడా సృష్టి చేయాలని కొన్ని సంవత్సరాలు నానా యాతనలు పడ్డాడు. అతడికి సాధ్యం కాలేదు. శ్రీహరిని ధ్యానించాడు. బుద్ధి వికసించింది. లోకాల్ని సృష్టించే మెళకువ తెలిసింది.

## భక్తిమార్గం

జ్ఞానం లేనివాడు వ్యర్థమైన సుఖాల కోసం ప్రాకులాడుతాడు. మాయలోనే తిరుగుతూ ఉంటాడు. జ్ఞాని అలా కాదు. సంసారం సుఖాన్ని ఇవ్వదని తెలుసుకొని వివేకంతో ప్రవర్తిస్తాడు.

పడుకోవడానికి దూది పరుపులే కావాలా నేల చాలదా? భోజనానికి దోసిళ్ళు సరిపోవూ! వెండి, బంగారు పాత్రలు కావాలా? నారచీరలూ, జింక చర్మాలూ ఉన్నాయి కదా! పట్టువస్త్రాలే కావాలా కట్టుకోవటానికి? ఏం? గుహల్లో ఉండవచ్చు కదా! మేడలూ మిద్దెలూ కావాలా? చెట్లు ఫలాల్నీ, నదులు తియ్యటి జలాల్నీ ప్రసాదిస్తున్నాయి. పుణ్యస్త్రీలు ఎలాగూ భిక్ష వేస్తారు. ఇన్ని సదుపాయాల్ని భగవంతుడే కల్పిస్తుంటే వాణ్ణీ వీణ్ణీ యాచించటం దేనికి?

**కం. రక్షకులు లేనివారల**
**రక్షించెద ననుచుఁ జక్రి రాజైయుండన్**
**రక్షింపు మనుచు నొక నరు**
**నక్షముఁ బ్రార్థింపనేల? యాత్మజ్ఞులకున్.** (2-22)

**ఏ రక్షణా లేనివాళ్ళను రక్షిస్తానంటూ పరమాత్మ చెప్తుంటే ఎవరెవర్నో రక్షించమని వేడుకోవడం మూర్ఖత్వం కాదూ!**

మహారాజా! వివేకవంతుడు ఇలా ఆలోచిస్తాడు. వాసుదేవుడి పాదాలనే కొలుస్తూ ఆనందాన్ని పొందుతాడు. ఇది లేనివాడు నరక ద్వారం వద్ద ఉన్న వైతరణి నదిలో పడిపోతాడు. నరకంలో నానా యాతనలు పడతాడు.

**కాబట్టి అన్ని మార్గాలలోకెల్లా భక్తిమార్గమే ఉత్తమం. అది సులభంగా మోక్షాన్ని అందిస్తుంది.**

విష్ణుభక్తి లేనివాడికీ పశుపక్ష్యాదులకూ పెద్దగా తేడా లేదు నాయనా!

విష్ణువుని కీర్తనను వినని వాడి చెవులు చెవులు కావు, కొండగుహలు. శ్రీహరి పద్యాలు చదవని నాలుక కప్ప నాలుక. అతణ్ణి చూడని కన్నులు నెమలి కన్నులు. అతణ్ణి పూజించని చేతులు శవం చేతులు. అతడి పాద తులసీ దళాన్ని ఆస్వాదించని ముక్కు పందిముక్కు.

శుక మహర్షి మాటలు పరీక్షిత్తుపై బాగా పనిచేస్తున్నాయి. భ్రమలన్నీ ఒక్కొక్కటీ తొలగిపోతున్నాయి. మనస్సు ఎంతో ప్రశాంతంగా ఉంది. ఇంకా ఇంకా వినాలనిపిస్తోంది. అందుకే తనకు విజ్ఞానాన్ని ప్రసాదించమని మళ్ళీ వేడుకొన్నాడు.

శుక మహర్షి చెప్తున్నాడు.

'రాజా! పూర్వం సాక్షాత్తూ నారాయణుడే బ్రహ్మదేవుడికి అపారమైన విజ్ఞానాన్ని అందించాడు. దానిని బ్రహ్మదేవుడు నారదుడికి వివరించాడు. ఆ విజ్ఞానాన్ని నారదుడు నాకు అనుగ్రహించాడు. దానిని నీకు నేను వివరిస్తాను' అంటూ

**కం. విశ్వాత్ముఁడు విశ్వేశుఁడు**
**విశ్వమయుం డఖిలనేత విష్ణుఁ డజుం డీ**

విశ్వములోఁ దానుండును
విశ్వము దనలోనఁ జాల వెలుఁగుచు నుండన్ (2-100)

**విశ్వానికి ఆత్మ, ఈశ్వరుడూ అయిన శ్రీహరి విశ్వమయుడు. సమస్తానికీ నేత. అసలు పుట్టుకే లేనివాడు. విశ్వంలో తాను ఉంటాడు. తనలో ప్రకాశిస్తూ విశ్వం ఉంటుంది. అటువంటి పరమాత్మవల్లనే ఈ ప్రపంచం ఆవిర్భవిస్తోంది అంటూ ప్రపంచం ప్రకారాన్ని వివరంగా తెలియజేశాడు.**

తరువాత శ్రీమన్నారాయణుడి లీలావతారాలనూ వివరించాడు.

## శ్రీహరి లీలావతారాలు

శ్రీహరి లీలలు అనంతమైనవి. లెక్కపెట్టటం కూడా సాధ్యం కాదు. అయినా వాటిలో కొన్ని నీకు వివరిస్తాను. విను.

1. **వరాహావతారం**: పూర్వం హిరణ్యాక్షుడు అనే రాక్షసుడు భూమిని చాపగా చుట్టి తీసుకుపోయాడు. అప్పుడు హరి ఆ రాక్షసుణ్ణి ఈ అవతారంలోనే సంహరించాడు.

2. **సుయజ్ఞావతారం**: 'స్వాయంభువుడు' అనే ఒక మనువు ఉన్నాడు. అతడి కుమార్తె పేరు ఆకృతి. ఈమె భర్త 'రుచి' అనే ఒక ప్రజాపతి. ఈ దంపతులకు పుత్రుడిగా జన్మించి సుయజ్ఞుడిగా పేరుపొందాడు శ్రీహరి. ఈ అవతారంలో ఇతడి భార్య 'దక్షిణ'. వీరి కుమారులు 'సుయములు' అనే దేవతలు.

3. **కపిలావతారం**: కర్దమ ప్రజాపతికీ, దేవహూతికీ జన్మించిన పుత్రుడే కపిలాచార్యుడు. ఇతడికి తొమ్మిదిమంది సోదరీమణులు. సాంఖ్యయోగం ఈ అవతారం ద్వారానే లోకానికి అందింది.

4. **దత్తాత్రేయావతారం**: అత్రి అనసూయలకు పుత్రుడిగా జన్మించిన అవతారం. దత్తాత్రేయుడు పరమపవిత్రుడు. ఇతడి పాదధూళి సోకి హైహయ, యాదవ వంశాలకు మోక్షం లభించింది.

5. **సనకాది అవతారం**: బ్రహ్మదేవుడు సృష్టి చేసే సమయంలో అతడి నోటి నుండి 'సన' అనే ధ్వని పుట్టింది. అప్పుడు పుట్టారు సనకుడూ, సనందుడూ, సనత్కుమారుడూ, సనత్సుజాతుడు. వీళ్ళే సనకాది ఋషులు.

6. **నరనారాయణ అవతారం**: ధర్ముడికీ, దక్షుడి పుత్రిక అయిన మూర్తికీ జన్మించారు నరనారాయణులు. బదరీవనంలో నిత్యం తపస్సు చేసుకొంటూ ఉండేవాళ్ళు. వాళ్ళ తపస్సుకు భంగం కలిగించాలని ఇంద్రుడు అప్సరసలను పంపాడు కానీ వీళ్ళు చలించలేదు. వారిపై కోపగించనూలేదు. నారాయణుడు తన గోటితోనే తొడపై గీరుకున్నాడు. ఆ తొడ నుండి ఊర్వశి పుట్టింది. ఆమె సౌందర్యాన్ని చూసిన అప్సరసలు సిగ్గుతో తలదించుకొని తిరుగుముఖం పట్టారు.

7. **ధ్రువావతారం**: ధ్రువుడు కొడుకు సునీతి – ఉత్తానపాదులకు కొడుకుగా పుట్టాడు. కనీ వినీ ఎరుగని రీతిలో తపస్సు చేసి ధ్రువమండలాన్ని పొందాడు.

8. **పృథుచక్రవర్తి అవతారం**: 'వేనుడు' అని ఒక రాజు ఉండేవాడు. అతడు ఎంతో క్రూరుడు. అందువల్ల బ్రాహ్మణుల శాపానికి గురయ్యాడు. ఈ వేనుడి పుత్రుడే పృథుచక్రవర్తి. భూమిని ఆవుగా చేసి సమస్త వస్తువులను దాని పొదుగు నుండి పిదికిన ఘనుడు.

9. **వృషభావతారం**: నాభి–సుదేవి దంపతులకు శ్రీహరి ఋషభుడి పేరుతో జన్మించిన అవతారం.

10. **హయగ్రీవ అవతారం**: వేదాలు పుట్టడానికి కారణమైన అవతారం. బంగారు వన్నెతో కాంతులీనే హయగ్రీవుడి ముక్కు పుటాల నుండి వేదరాశి పుట్టుకొచ్చింది.

11. **మత్స్యావతారం**: వైవస్వతమనువునూ, సృష్టి చేయడానికి కావలసిన ఔషధాలనూ మహర్షులనూ ఒక నావలో ఉంచి ప్రళయ సమయంలో రక్షించిన అవతారం. అలాగే రాక్షసుల బారినుండి వేదాలను రక్షించిన అవతారమూ ఇదే!

12. **కూర్మావతారం**: దేవతలు – రాక్షసులు అమృతం కోసం క్షీరసాగరాన్ని మథించారు. మందర పర్వతమే దానికి కవ్వం. అది సముద్రంలో మునిగిపోతే ఇదుగో! ఈ అవతారంలోనే దానిని తన వీపుపై ధరించాడు.

13. **నృసింహావతారం**: హిరణ్యకశిపుడు అనే రాక్షసుణ్ణి చంపి ప్రహ్లాదుణ్ణి రక్షించిన అవతారం.

14. **ఆదిమూలావతారం**: మొసలి బారిన పడ్డ ఏనుగును ఈ అవతారంలోనే కాపాడాడు.

15. **వామనావతారం**: శ్రీహరి వామనుడిగా అవతరించి బలిచక్రవర్తిని రసాతలానికి అణగద్రొక్కిన అవతారం.

16. **హంసావతారం**: నారదుడికి ఆత్మతత్త్వం తెలిపే మహాభాగవత పురాణాన్ని చెప్పినది ఈ అవతారంలోనే.

17. **మనువు అవతారం**: చక్రాయుధాన్ని ధరించి లోకాన్ని పాలించటం కోసం తనే మనువుగా అవతరించాడు శ్రీహరి.

18. **ధన్వంతరి అవతారం**: తన పేరు స్మరిస్తే చాలు భూమిపై జనులందరికీ రోగాలు పోగొడుతూ ఆయుర్వేద శాస్త్రాన్ని లోకానికి ప్రసాదించాడు శ్రీహరి ఈ అవతారంలోనే.

19. **పరశురామావతారం**: రేణుకాజమదగ్ని దంపతికి పుత్రుడిగా అవతరించి, దుర్మార్గులైన రాజుల్ని సంహరించాడు. చేతిలో గొడ్డలి (పరశువు) ఉండటంవల్ల పరశురాముడయ్యాడు.

20. **రామావతారం**: త్రేతాయుగంలో కౌసల్యా దశరథులకు శ్రీరాముడిగా అవతరించాడు శ్రీమన్నారాయణుడు. ధర్మం ఎలా ఉంటుందో తాను ఆచరించి లోకానికి చూపిన అవతారం ఇది.

21. **కృష్ణావతారం**: ద్వాపరంలో దుష్టుల్ని శిక్షించటం కోసం యదువంశంలో జన్మించి ఈ అవతారంలో భూభారాన్ని తగ్గించాడు శ్రీమన్నారాయణుడు.

22. **వ్యాసావతారం**: పరాశర మహర్షికి కుమారుడిగా జన్మించి వేదాలను విభాగం చేసిన అవతారం.

23. **బుద్ధావతారం**: ధర్మాన్ని విడిచి కొందరు విచ్చలవిడిగా సంచరిస్తూ ఉన్నప్పుడు ఈ అవతారంలోనే ధర్మాన్ని ప్రబోధించాడు.

24. **కల్కి అవతారం**: కలియుగంలో అధర్మం పెచ్చు మీరినప్పుడు ఈ అవతారాన్ని ధరిస్తాడు. చేతిలో ఖడ్గాన్ని ధరించి, తెల్లగుర్రంపై వచ్చి, తిరిగి ధర్మాన్ని నిలబెడతాడు.

రాజా! శ్రీహరి అవతారాలలో ఇవి కొన్ని మాత్రమే! వీటిలో కొన్ని ఇప్పటికే జరిగిపోయాయి. కొన్ని ముందు జరుగుతాయి. ఒక్కమాట చెప్తాను. గుర్తుపెట్టుకో! ఈ భూమిపై ఉన్న ధూళికణాలనైనా లెక్కపెట్టవచ్చుగానీ శ్రీహరి మహిమల్ని లెక్కించటం ఎవరివల్లా కాదు.

**అన్ని ఆలోచనలూ కట్టిపెట్టి తననే నమ్మి కొలిచేవాళ్లను ఆ స్వామి కంటికి రెప్పలా కాపాడుతూనే ఉంటాడు.**

ఎంతటివారికైనా ఒక్కొక్కసారి అహంకారం తొంగిచూస్తూ ఉంటుంది. బ్రహ్మదేవుడికి కూడా రజోగుణం ప్రకోపిస్తూ ఉంటుంది. అప్పుడు ఆ బ్రహ్మదేవుడికైనా పరమాత్మ తత్త్వం బోధపడదు.

భగవంతుణ్ణి శరణు వేడితే అజ్ఞానం తొలగిపోతుంది. ఇతర శాస్త్రాలపై ఆధారపడకుండా భక్తియోగంతో మాత్రమే ఆ దేవుణ్ణి ఆరాధించాలి. ఇది పుణ్యాత్ములు ఎంచుకొన్న మార్గం. ఎందుకంటావా? విను

**అన్ని జన్మల్లోనూ మానవజన్మ దుర్లభం. కాబట్టి కాలాన్ని వ్యర్థపరచుకోకుండా శ్రీహరిని సేవించటం మంచిది. నిర్మలమైన భక్తి ఉండాలి. ఇది లేకుండా ఎన్ని యజ్ఞాలు, వ్రతాలు, జపాలు చేసినా శ్రీహరి కరుణించడు.**

పూర్వం బ్రహ్మదేవుడు నారద మహర్షికి ఉపదేశించిన భాగవతసారం ఇదే! అదే నేనూ నీకు చెప్పాను. ఇక ఈ సృష్టి ఎలా మొదలయిందో వివరిస్తాను. విను.

## బ్రహ్మతపస్సు

అది కల్ప ప్రారంభ కాలం. బ్రహ్మదేవుడు తాను పుట్టిన పద్మంలో కూర్చొని సృష్టి చేయాలని ప్రయత్నిస్తున్నాడు. ఇంతలో 'తప తప' అన్న శబ్దం (తపస్సు చెయ్యి! తపస్సు చెయ్యి!) వినిపించింది. చుట్టూ చూశాడు. ఎవరూ లేరు. తపస్సు ప్రారంభించాడు.

అప్పుడు శ్రీమన్నారాయణుడు ప్రత్యక్షమయ్యాడు. అలాగే బ్రహ్మదేవుడి కళ్ళముందు వైకుంఠమూ సాక్షాత్కరించింది.

అహా! వైకుంఠం! అక్కడ– 'కేశవుడికంటే గొప్ప దైవం లేదు' అని చిలుకలూ

'ఈ జగమంతా విష్ణుమయం' అని గోరువంకలూ అంటున్నాయి. తక్కిన పక్షులూ శ్రీహరినే కీర్తిస్తున్నాయి.

ఎవరో సేవకులు. భగవంతుణ్ణి కొలుస్తున్నారు. నిజానికి వాళ్ళు సేవకుల్లా లేరు. దివ్యమైన ఆభరణాలతో వెలిగిపోతున్నారు. వాళ్ళలా సేవిస్తూ ఉంటే ఆ వైకుంఠనాథుడు పట్టుపీతాంబరం ధరించి సకల ఆయుధాలతో, దివ్యమైన వస్త్రాలతో, వక్షఃస్థలంలో లక్ష్మీదేవితో అలరారుతున్నాడు. ఆ స్వామి పాదాల నుండి పవిత్రమైన గంగానది పుట్టింది. సూర్యచంద్రులే ఆయన కన్నులు. కళ్ళనిండా కరుణ. శేషుడు ఆయనకు శయ్య. గరుడుడు వాహనం.

అలాంటి స్వామి బ్రహ్మదేవుడికి ప్రత్యక్షమై వరం కోరుకోమన్నాడు.

అప్పుడు బ్రహ్మదేవుడు భక్తి నిండిన హృదయంతో 'స్వామీ! నాకు ఎన్నడూ అహంకారం కలగకుండా ఉండేలా అనుగ్రహించు' అన్నాడు.

'తథాస్తు' అని శ్రీహరి వెళ్ళిపోయాడు.

తర్వాత బ్రహ్మ సృష్టి ప్రారంభించాడు. కొన్నాళ్ళ తర్వాత తపస్సు చేశాడు. ఆ సమయంలో నారద మహర్షి వచ్చి బ్రహ్మదేవుడికి సేవలు చేశాడు. దానికి ఆనందించిన బ్రహ్మదేవుడు నారదమహర్షికి భాగవతాన్ని అనుగ్రహించాడు. దాన్ని నారదుడు వ్యాస మహర్షికీ, ఆయన నాకూ ప్రసాదిస్తే నేను నీకు అనుగ్రహిస్తున్నాను' అన్నాడు.

శ్రీమన్నారాయణుడి విరాట్ స్వరూపాన్ని పూర్తిగా తెలుసుకోవాలన్న జిజ్ఞాస కలిగింది పరీక్షిత్తుకి. వెంటనే అడిగాడు.

శుక మహర్షి ఎంతో విపులంగా చెప్పాడు.

పరీక్షిత్తు ఆనందానికి అవధుల్లేవు. విశ్వం పట్టనంత స్వామిరూపాన్ని కళ్ళకు కట్టినట్లుగా శుక మహర్షి వివరించేసరికి అతడి హృదయం ఆనందసాగరంలో ఓలలాడసాగింది. సూతమహర్షి చెప్తుంటే ఆదమరచి వింటున్న శౌనకాది మహర్షులూ పరవశించిపోయారు.

# తృతీయ స్కంధం

**సూత** మహర్షి తిరిగి భాగవతం ప్రారంభించాడు.

'మహర్షులారా! శుక మహర్షి ఇలా చెప్తున్నాడు:

'రాజా! విదురుడు తీర్థయాత్రలు ముగించుకొని ధర్మరాజు వద్దకు వచ్చాడు. అతణ్ణి చూడగానే ధర్మరాజు ఆప్యాయంగా పలకరించి, సత్కరించి కుశల ప్రశ్నలు వేశాడు. తీర్థయాత్ర విశేషాలు చెప్పమని ప్రార్థించాడు.

## విదురుడి తీర్థయాత్ర

విదురుడు ధర్మస్వరూపుడు. అంటే సాక్షాత్తూ యమధర్మరాజే విదురుడిగా జన్మించాడు. అందుకే మొదటినుండీ కౌరవుల తప్పుల్ని ఖండిస్తూనే వచ్చాడు. అయితే అతడి మాటల్ని దుర్యోధనుడు వింటేగా? పెడచెవిని పెట్టాడు. ధృతరాష్ట్రుడు కూడా ఏమీ మాట్లాడలేకపోయాడు.

శ్రీకృష్ణుడు రాయబారానికి వచ్చినప్పుడు విదురుడి ఇంట్లోనే బసచేశాడు. విదురుడి నీతులు రుచించని దుర్యోధనుడు అతణ్ణి రాజ్యం నుంచి వెళ్ళగొట్టాడు. అందుకే విదురుడు తీర్థయాత్రలకు వెళ్ళిపోయాడు. పుణ్యక్షేత్రాల్ని సందర్శించాడు. మైత్రేయ మహర్షిని కలుసుకొని వేదాంత విషయాలు నేర్చుకొన్నాడు.

విదురుడు ప్రభాస తీర్థంలో ఉన్నప్పుడు కురుక్షేత్ర యుద్ధంలో పాండవులు జయించారన్న వార్త తెలిసింది. తరువాత యమునా తీరానికి వెళ్ళి శ్రీకృష్ణుడి బాల్యస్నేహితుడైన ఉద్ధవుణ్ణి కలుసుకున్నాడు. ఉద్ధవుణ్ణి చూడగానే విదురుని మనస్సు ప్రేమతో ఉప్పొంగి పోయింది. ఆయన శ్రీకృష్ణ బలరాములతో సహా అందరి యోగక్షేమాల గురించి అడిగాడు.

## ఉద్ధవుడి దుఃఖం

పాపం! ఉద్ధవుడు! ఏం చేస్తాడు? ఎలా చెప్తాడు? శ్రీకృష్ణుడు ఈ లోకాన్ని విడిచిపెట్టి వెళ్ళిపోయాడన్న వార్తను ఎలా చెప్పగలడు? **పైగా చిన్నప్పటినుండీ అంటే అయిదేళ్ళ వయస్సు నుంచీ శ్రీకృష్ణుడినే ఆరాధించే పరమ భక్తుడు ఉద్ధవుడు.** శ్రీకృష్ణుడి భక్తిలో ఓలలాడుతూ ఆకలిని కూడా మరిచిపోయేంతటి గొప్ప భక్తుడు. ఇప్పుడు విదురుడు ఇలా అడిగేసరికి దుఃఖం ఇక ఎంతమాత్రం ఆపుకోలేకపోయాడు.

'విదురా! ఏం చెప్పమంటావు? యముడు అనే కాలనాగు బుసకొట్టింది. యాదవులు సర్వనాశనం అయ్యారు. మహర్షుల ముఖాలు అనే పద్మాలు ముడుచుకుపోయాయి. దుర్మార్గుల కలువల కళ్ళు వికసించాయి. రాక్షసుల గర్వం అనే చీకటి అలుముకుంది. ఎందుకో తెలుసా? శ్రీకృష్ణుడు అనే సూర్యభగవానుడు అస్తమించాడు' అని బావురుమన్నాడు.

విదురుడు రాయిలా ఉండిపోయాడు.

మళ్ళీ ఉద్ధవుడే ఇలా అంటున్నాడు.

'ఎంత గొప్పవాడో కదా! శ్రీకృష్ణుడు. తానే ఈ లోకాలన్నింటికీ అధిపతి అయినా ఉగ్రసేనుణ్ణి సింహాసనంపై కూర్చోపెట్టి ఒక సేవకుడిలా సేవించాడే! తనను చంపాలని వచ్చిన పూతనకూ పరమపదాన్ని ఇచ్చాడు. సామాన్యుడిలా పశువులకు కాపలా ఉన్నాడు. కాళియ సర్పాన్ని అణచివేశాడు. గోవుల్నీ గోపాలురనూ ఎన్నిసార్లు ఎన్ని ఆపదల నుంచి గట్టెక్కించాడో చెప్పలేను.

ఇక బృందావనంలో తన వేణుగానంలో లోకాల్ని మోహంలో ముంచెత్తలేదూ! ప్రభాసతీర్థంలో మునిగిపోయిన గురుపుత్రుల్ని తెచ్చి గురువైన సాందీపని మహర్షికి ఇచ్చాడు. అప్పుడు ఆయన కళ్ళల్లోని ఆనందం చూడాల్సిందే! మాటల్లో చెప్పలేం.

స్వర్గానికి వెళ్ళి పారిజాత వృక్షాన్ని పెకలించి తెచ్చి సత్యభామ ఇంటిలో పెరటిచెట్టుగా నాటించాడు. నరకాసురుణ్ణి చంపి అతడు బంధించిన స్త్రీలకు తనే నాథుడయ్యాడు. ఎందరు రాక్షసుల్ని సంహరించాడో, భూభారాన్ని ఎంతగా తగ్గించాడో తనను నమ్మి కొల్చినవారిని ఎన్నిసార్లు ఆదుకొన్నాడో ఆ స్వామికే ఎరుక!

ఒకరోజు ఏం జరిగిందంటే – కొందరు మహర్షులు శ్రీకృష్ణుడి దర్శనం కోసం వచ్చారు. యాదవులు వాళ్ళతో పరాచకాలాడి వాళ్ళకు కోపం తెప్పించారు. దాంతో మహర్షులు 'యాదవులారా! మీరంతా మీలో మీరే కొట్టుకొని చస్తారు' అని శపించారు. అదే జరిగింది.

యాదవులంతా మరణించాక శ్రీకృష్ణుడు నిశ్చలంగా కళ్ళు మూసుకొని ఒక చెట్టుక్రింద కూర్చున్నాడు. నన్ను దగ్గరకు రమ్మని 'ఉద్ధవా! నువ్వు బదరీవనానికి వెళ్ళు' అని ఆజ్ఞాపించి, తానూ ఎటో వెళ్ళిపోయాడు. నేను అంతా వెతికాను. ఎక్కడా కనిపించలేదు. చివరికి ఒక రావిచెట్టు క్రింద ఆ పరమాత్మను చూశాను.

అప్పుడే మైత్రేయ మహర్షి అక్కడకు వచ్చాడు. ఆయన వింటూ ఉండగానే శ్రీకృష్ణుడు నన్ను చూసి 'ఉద్ధవా! పూర్వజన్మలో వసుబ్రహ్మలు చేసిన సత్రయాగంలో నువ్వూ ఒక వసువుగా ఉన్నావు. అప్పుడు నా పాదభక్తి తప్ప మరేమీ కోరలేదు నువ్వు. అందుకే నీకు మళ్ళీ జన్మలేదు. నేను ఇంతకు ముందు బ్రహ్మదేవుడికి ఉపదేశించిన దివ్యజ్ఞానాన్ని నీకూ ఉపదేశిస్తాను' అని నాకు ఉపదేశించాడు.

విదురుడు అంతా విన్నాడు. శ్రీకృష్ణుడు మరణించాడని తెలిసి తట్టుకోలేక పోతున్నాడు. ఎలాగో నిబాళించుకొని 'ఉద్ధవా! ఆ దివ్యజ్ఞానాన్ని నాకూ ఉపదేశించవయ్యా!' అన్నాడు.

ఉద్ధవుడు సరేనంటూ ఉపదేశించి 'విదురా! నువ్వు మైత్రేయ మహర్షిని ఆశ్రయించు. శ్రీహరి తత్వాన్ని ఆ మహర్షి చక్కగా నీకు వివరించగలడు' అని తాను బదరికాశ్రమంవైపు సాగిపోయాడు.

రాజా, చూశావా! శ్రీకృష్ణ పరమాత్మ దూరదృష్టి. తను వెళ్ళిపోతూ కూడా దివ్యజ్ఞానాన్ని లోకానికి ఉద్ధవుడి ద్వారా అందించాడు.

## మైత్రేయ మహర్షి

తరువాత విదురుడు దివ్యతీర్థాలలో స్నానం ఆచరిస్తూ మైత్రేయ మహర్షిని కలుసుకొన్నాడు. అతడి ద్వారా సృష్టి జ్ఞానాన్నీ, పరమాత్మ స్వరూపాన్నీ తెలుసుకున్నాడు.

'ఆకాశంలోని చందమామ నీటిలో కనిపిస్తూ ఉంటుంది. నీరు కదిలితే నీటిలోని చందమామ కూడా కదిలినట్లు ఉంటుంది. కానీ అసలు చందమామ

కదులుతుందా! కదలదు. అలాగే కర్మలనేవి జీవుడికే ఉంటాయి కానీ పరమాత్మకు ఉండవు.

ఆ కర్మలు ఏర్పడటానికి కారణం అవిద్య. భగవంతుడిపై భక్తి ఉంటే అవిద్య తొలగిపోతుంది. బంధాలు వీడిపోతాయి. మోక్షం లభిస్తుందని, భగవంతుడి తత్త్వాన్ని వివరించి చెప్పాడు మైత్రేయుడు.

విదురుడి జ్ఞానతృష్ణ చల్లారలేదు. ఇంకా తెలుసుకోవాలన్న కుతూహలంతో మైత్రేయుణ్ణి అడిగి తెలుసుకున్నాడు. మనుచక్రవర్తుల గురించీ, దేవతల గురించి, పద్నాలుగు లోకాల గురించీ, త్రిగుణాల గురించి, ఆశ్రమ ధర్మాల గురించి, వేదాల గురించి, కాలస్వరూపం గురించీ, తపోదానాల గురించీ ఇలా ఎన్నో విశేషాలు అతణ్ణుంచి విన్నాడు.

రాజా! బ్రహ్మదేవుడు ఎలా ఆవిర్భవించాడో మైత్రేయుడు విదురుడికి చెప్పాడు. సృష్టి తొమ్మిది విధాలుగా ఉంటుందని వివరించాడు. ఆ తరువాత కాలస్వరూపాన్ని చెప్పటం ప్రారంభించాడు.

## కాలస్వరూపం

ఆకాశంలో సూర్యుడి లేత కిరణాలలో 'త్రసరేణువు' ఉంటుంది. దీనిలో ఆరోభాగం పరమాణువు. ఇదే సూక్ష్మమైన కాలం. సూర్యుడు పన్నెండు రాశులలో సంచరించడానికి ఒక సంవత్సరం పడుతుంది. ఇదే మహాకాలం.

రెండు పరమాణువులు ఒక అణువు. మూడు అణువులు ఒక త్రసరేణువు. మూడు త్రసరేణువులు ఒక త్రుటి. నూరు త్రుటులు ఒక వేధ. మూడు వేధలు ఒక లవం. మూడు లవాలు ఒక నిమేషం.

మూడు నిమేషాలు ఒక క్షణం. అయిదు క్షణాలు ఒక కాష్ఠ. పది కాష్ఠలు ఒక లఘువు. పదిహేను లఘువులు ఒక నాడి. రెండు నాడులు ఒక ముహూర్తం. ఈ నాడులు ఆరుగాని ఏడుగాని కలిస్తే మానవులకు ఒక ప్రహరం అవుతుంది. దీనినే యామం అంటారు.

నాలుగు యామాలు ఒక పగలు. అలాగే ఒక రాత్రి. రాత్రీ పగళ్ళు కలిస్తే మానవులకు ఒకరోజు. పదిహేను రోజులు ఒక పక్షం. రెండు పక్షాలు ఒక

మాసం. ఈ నెల పితృదేవతలకు ఒకరోజు. రెండు మాసాలు ఒక ఋతువు. ఆరునెలలు ఒక అయనం. రెండు అయనాలు ఒక సంవత్సరం.

ఒక మానవ సంవత్సరం దేవతలకు ఒక రోజు. మానవులకు ఆయుః ప్రమాణం నూరు సంవత్సరాలు అంటూ సంవత్సరాల గురించి, యుగాల గురించీ ఎంతో వివరించాడు మైత్రేయుడు. చివరిగా ఒక్క మాట అన్నాడు.

'విదురా! కాలానికి ఆ పరమాత్మే కర్త. అంతేకానీ కాలం ఆ పరమాత్మకు కర్త కాదు. ఈ ఒక్కటీ తెలుసుకొంటే కాలస్వరూపుడే శ్రీమన్నారాయణుడు అని అర్థమవుతుంది. అటువంటి దేవదేవుడి ఆజ్ఞను అనుసరించి బ్రహ్మదేవుడు సృష్టిని ప్రారంభించాడు. సనకసనందనాదుల్నీ, మనువుల్నీ, రుద్రగణాల్ని, ప్రజాపతుల్ని సృష్టించి క్రమంగా సృష్టిని విస్తరింపజేశాడు. పరమాత్ముడి దయవల్ల సమస్తాన్నీ సృష్టిస్తాడు బ్రహ్మదేవుడు. మళ్ళీ ఆ పరమాత్ముడే విష్ణుస్వరూపంతో ఆ సృష్టిని పరిపాలిస్తాడు. శివుడిగా దాన్ని విలయం చేస్తాడు.

బ్రహ్మదేవుడు మొదట 'స్వాయంభువుడు' అనే మనువును సృష్టించి ప్రజావృద్ధి కావించమన్నాడు. భూమిని చక్కగా పాలించి ప్రజలను సంరక్షించమని ఆజ్ఞాపించాడు. అయితే అప్పటికే భూమి సముద్రంలో మునిగిపోయింది. దానిని ఎలా బైటకు తేవాలో తెలియలేదు స్వాయంభువుడికి. బ్రహ్మదేవుడినే అడిగాడు. బ్రహ్మ ఆలోచిస్తూ ఉండగానే అతడి ముక్కుపుటాలనుండి 'యజ్ఞవరాహస్వామి' ఆవిర్భవించాడు.

## వరాహావతార కథ

మొదట బొటనవేలంత ఉన్న వరాహమూర్తి బ్రహ్మాండమంత పెరిగిపోయాడు.

ఆ వరాహం ఘుర్ఘుర్మంటోంది. ఆ ధ్వనికి లోకం వణికిపోయింది. దిక్కులు అల్లల్లాడిపోయాయి. ఎగిరి గెంతులు వేస్తోంది. ముట్టెతో దిగ్గజాల్ని పొడుస్తోంది. సప్తసముద్రాల్నీ కలచివేస్తోంది. ఆకాశాన్ని తోకతో కొట్టి పగలగొట్టాలని చూస్తోంది. ఇలా భీకరమైన విన్యాసాలు చేస్తూ సముద్రంలోనికి దూకింది. భూమిని పైకి ఎత్తి, తన ముట్టిపై ఉంచుకుంది. మెల్లగా సముద్రంలో నుంచి బయటకు వచ్చింది.

ఆ దివ్య అవతారాన్ని చూసి బ్రహ్మాదిదేవతలు నుతించారు. ఈ వరాహమే యజ్ఞస్వరూపం. యజ్ఞానికి కావలసినవన్నీ దీనినుండే పుట్టుకొచ్చాయి. అందుకే 'యజ్ఞవరాహం' అని పేరు పొందింది.

దేవతలు స్తుతించిన తరువాత యజ్ఞవరాహమూర్తి భూమిని నీటిపై యథాప్రకారం ఉంచాడు. ఈ సందర్భంలోనే 'హిరణ్యాక్షుడు' అనే రాక్షసుణ్ణి ఈ యజ్ఞవరాహమే సంహరించింది. ఆ కథ చెప్తాను విను.

'విదురా! హిరణ్యాక్ష – హిరణ్యకశిపులనే ఇద్దరు రాక్షస సోదరులు దితికి సంధ్యాసమయంలో జన్మించారు. వీరి తండ్రి కశ్యప ప్రజాపతి. వీళ్ళు లోకాల్ని పట్టి పీడించేవాళ్ళు. దీనికి మహర్షుల శాపమే కారణం. అదీ చెబుతాను విను.

## జయవిజయుల శాపవృత్తాంతం

ఒకసారి సనకసనందనాది మహర్షులు నలుగురూ శ్రీహరి దర్శనం కోసం వైకుంఠానికి వెళ్ళారు. అక్కడ శ్రీహరి ద్వారపాలకులు జయవిజయులు వీళ్ళను లోపలికి వెళ్ళకుండా అడ్డుకున్నారు. మహర్షులకు కోపం వచ్చింది.

'అహంకారంతో మమ్మల్ని అడ్డుకున్న మీరు భూలోకంలో పుట్టి రాక్షసుల్లా ప్రవర్తించండి' అని శపించారు.

జయవిజయులు నిర్ఘాంతపోయి మహర్షుల పాదాలపై పడి మన్నించమని వేడుకొన్నారు. శ్రీమన్నారాయణుడు కూడా లోపల నుండి బయటకు వచ్చాడు. మహర్షుల్ని ఉద్దేశించి –

'మునిపుంగవులారా! వీళ్ళు నా ద్వారపాలకులు. వీళ్ళు తప్పు చేస్తే నేనూ చేసినట్లే. మీ శాపం నాకూ సమ్మతమే! అయితే మీ శాపం ప్రకారం వీళ్ళు భూమిపై పుట్టి పాపఫలాన్ని అనుభవించి త్వరగా నా సన్నిధికి చేరుకొనే అవకాశాన్ని కల్పించండి' అని వేడుకున్నాడు.

అదే పరమాత్మ గొప్పతనం. ఆ శాపాన్ని తప్పించే శక్తి తనకు ఉంది. మహర్షులూ కావాలంటే శాపాన్ని క్షమించేద్దామన్నారు. కానీ శ్రీహరి అలా చేయలేదు. ఎవరైనా సరే కర్మఫలం అనుభవించి తీరవలసిందే!

ఆ శాపంవల్ల జయవిజయులే హిరణ్యాక్ష హిరణ్యకశిపులుగా, రావణ కుంభకర్ణులుగా, శిశుపాల దంతవక్త్రులుగా పుట్టి స్వామిని ద్వేషించారు. స్వామి చేతుల్లోనే మరణించి తిరిగి వైకుంఠాన్ని చేరుకున్నారు. అదుగో అలా జన్మించినవాళ్ళే ఈ హిరణ్యాక్ష హిరణ్యకశిపులు.

హిరణ్యకశిపుడు బ్రహ్మను ఉద్దేశించి తపస్సు చేసి వరాలను పొందాడు. ఆ గర్వంతో ముల్లోకాలనూ గడగడలాడించాడు.

హిరణ్యాక్షుడు ఒక భీకరమైన గదను ధరించి దేవగణాలపై విరుచుకుపడ్డాడు. అష్టదిక్పాలకుల పైకి దండెత్తాడు. స్వర్గాన్ని అల్లకల్లోలం చేశాడు. సముద్రంపై పడ్డాడు. అక్కడ వరుణుడి రాజధాని 'విభావరి' అనే పురం ఉంది. దాన్ని ఆక్రమించుకొన్నాడు.

అప్పుడు వరుణుడు అతణ్ణి మెల్లగా శ్రీహరి మీదికి ఉసిగొల్పి – శ్రీహరి వరాహరూపంలో భూమిని ఉద్ధరించడానికి పాతాళానికి వెళ్ళాడనీ, అక్కడికి వెళ్ళమనీ దారి చూపించాడు.

## హిరణ్యాక్ష వధ

హిరణ్యాక్షుడు రసాతలానికి వెళ్ళి అక్కడ ఉన్న యజ్ఞవరాహమూర్తితో తలపడ్డాడు. అప్పుడు చూడాలి వరాహస్వామి ప్రతాపం. పర్వతాలు తలక్రిందు లవుతున్నాయి. సముద్రాలు కల్లోలాలైపోయాయి. ఒక్కసారి వరాహం తోక తిప్పింది. సూర్యచంద్రులు ఎగిరిపడ్డారు. ఎక్కడ పడ్డారో కూడా తెలియలేదు.

కన్నుల్లోంచి నిప్పులు కురిపిస్తూ విజృంభిస్తున్న వరాహమూర్తిని చూడగానే హిరణ్యాక్షుడికి ప్రాణం పోయినంతపనయ్యింది. కానీ ధైర్యం తెచ్చుకొని వీరోచితంగా పోరాడాడు.

వరాహమూర్తి ఆ రాక్షసుణ్ణి వెంటనే చంపకుండా కాస్త ఆట పట్టించాడు కానీ దేవతలు శ్రీహరిని ఆలస్యం చేయవద్దన్నారు.

'స్వామీ! ఇది 'అభిజిన్ముహూర్తం. సంధ్యాకాలం వస్తే రాక్షసబలం పెరుగుతుంది. వెంటనే సంహరించు' అని వేడుకొన్నారు.

యజ్ఞవరాహమూర్తి ముందుగా రాక్షస మాయను అంతంచేసి తరువాత హిరణ్యాక్షుణ్ణి సంహరించాడు.

**మ. వరయోగీంద్రులు యోగమార్గముల నెవ్వానిన్ మనోవీథి సు**
**స్థిరతన్ లింగశరీరభంగమునకై చింతింతు రా పంకజో**
**దరు పాణ్యాహతిఁ దన్ముఖాంబురుహమున్ దర్శించుచుం జచ్చె దు**
**ర్భరితోత్తంసుని దైత్యవల్లభుని సౌభాగ్యంబు దానెట్టిదో.** (3-703)

'హిరణ్యాక్షుడు ఎంతటి అదృష్టవంతుడో కదా! ఎందరు యోగులు ఎంతగా తపస్సు చేసినా ఈ పురుషోత్తముడి దర్శనం దొరకదే! అలాంటిది ఈ రాక్షసుడు స్వామి ముఖాన్నే చూస్తూ మరణించాడు. ఇది నూటికో కోటికోగానీ దొరకని అదృష్టం' అని బ్రహ్మాది దేవతలు ఆశ్చర్యపోయారు. రాక్షసుడు మరణించినందుకు ఆనందించారు.

విదురా! ఈ రాక్షసులు కూడా బ్రహ్మదేవుడి సృష్టిలోని వారే. నీకు బాగా అర్థం కావడానికి చతుర్ముఖ బ్రహ్మ చేసిన సృష్టిక్రమాన్ని వివరంగా చెబుతాను విను.

## సృష్టిక్రమం

భగవంతుడైన శ్రీమన్నారాయణుడి సంకల్పం వల్ల సత్త్వం, రజస్సు, తమస్సు అనే మూడు గుణాలు పుట్టాయి. వాటిలోని రజోగుణంనుండి మహత్తు, అహంకారం ఉద్భవించాయి. అందులోని అహంకారంనుంచి పంచతన్మాత్రలు, వాటినుండి పంచభూతాలు పుట్టాయి.

ఆ పంచభూతాలకు లోకసృష్టి సాధ్యం కాకపోవడంతో అవి - ఒక సువర్ణ అండాన్ని సృష్టించాయి. ఆ అండం మహాజలంలో తేలియాడుతూ వృద్ధిపొందుతూ ఉంటే - పరబ్రహ్మ - నారాయణుడు అనే పేరుతో వెయ్యి దివ్య సంవత్సరాలు ఆ అండాన్ని అధిష్ఠించి ఉన్నాడు. ఆ శ్రీమన్నారాయణుడి నాభి నుండి ఒక పద్మం పుట్టుకువచ్చింది. ఆ పద్మంలోనుండి చతుర్ముఖుడైన బ్రహ్మ ఆవిర్భవించి, జగత్‌సృష్టిని ప్రారంభించాడు. అందులో భాగంగా మొదట ప్రజాపతులను సృష్టించాడు. వారిలో మొట్టమొదటివాడు కర్దమ ప్రజాపతి.

ఆ తరువాత అవిద్యనూ పుట్టించాడు. అయితే దీనివల్ల బ్రహ్మదేవుడి శరీరం తమస్సుతో నిండిపోయింది. ఆ శరీరాన్ని విడిచిపెట్టాడు. దానినుండే యక్షులూ, రాక్షసులూ పుట్టుకొచ్చారు. పుట్టగానే ఆకలితో తండ్రియైన బ్రహ్మదేవుణ్ణే తినడానికి మీదపడ్డారు. అప్పుడు బ్రహ్మదేవుడు 'మా జక్షత మా రక్షత' అన్నాడు.

'మా జక్షత' అన్న వారికి యక్షులనీ, 'మా రక్షత' అన్నవారికి రాక్షసులనీ ప్రసిద్ధి కలిగింది. తరువాత ఒక దివ్య శరీరంతో దేవతల్ని సృష్టించి దాన్నీ విడిచి పెట్టాడు.

ఇలా బ్రహ్మదేవుడు – శరీరాలను ధరిస్తూ, వాటిని విడిచిపెడుతూ దేవతలు, గంధర్వులు, యక్షులు, సిద్ధులు మొదలైన దేవగణాలను సృష్టించాడు. అయినా బ్రహ్మదేవుడికి తృప్తి కలగలేదు. అప్పుడు ఉత్తములైన మనువుల్ని సృష్టించి, వాళ్ళకు తన పురుషదేహాన్ని ప్రసాదించాడు. తరువాత ఋషిగణాలనూ సృష్టించి, సమాధి, యోగం, ఐశ్వర్యం మొదలైన తన అంశల్ని ఒక్కొక్కరికీ ప్రసాదించాడు. సకల దేవగణాలనూ సమస్త ప్రాణులనూ సృష్టించాడు.

## కపిలావతార కథ

కొంతకాలం తరువాత బ్రహ్మదేవుడు తన సృష్టిని ఇంకా విస్తరింపజేయాలను కున్నాడు. అలా సంకల్పించి, కర్దమమహర్షిని పిలిచి, ప్రజాసృష్టి చేయమని ఆదేశించాడు. అప్పుడు కర్దముడు పదివేల దివ్యసంవత్సరాలు తపస్సు చేసి శ్రీహరిని మెప్పించాడు.

శ్రీహరి ప్రసన్నుడై అతని ముందు ప్రత్యక్షమయ్యాడు. అప్పుడు ఆ స్వామితో కర్దముడు– తాను గృహస్థాశ్రమాన్ని స్వీకరించాలనుకుంటున్నానని చెప్పాడు. అప్పుడు శ్రీహరి –

'కర్దమా! నీ కోరిక తప్పక నెరవేరుతుంది. బ్రహ్మదేవుడి పుత్రుడూ, మొదటి మనువూ అయిన స్వాయంభువుడు బ్రహ్మావర్తదేశంలో ఉంటూ భూమండలాన్ని పరిపాలిస్తున్నాడు. అతడి భార్య శతరూప. వీరికో పుత్రిక ఉంది. ఆమె పేరు దేవహూతి. ఆమె నీకు భార్య అవుతుంది' అని అనుగ్రహించి అంతర్ధానుడయ్యాడు.

ఆ తరువాత కొన్నాళ్లకు స్వాయంభువమనువు, శతరూప తమ కుమార్తె దేవహూతిని వెంటపెట్టుకొని వచ్చి, ఆమెను కర్దముడికి ఇచ్చి వివాహం చేసి వెళ్లిపోయారు.

దేవహూతి ఉత్తమురాలైన ఇల్లాలు. భర్తను దైవంలా భావించి అత్యంత భక్తిశ్రద్ధలతో సేవలు చేస్తూ ఉండేది. తన గురించి అస్సలు పట్టించుకొనేది కాదు. భర్తకు సేవలు చేస్తూ చేస్తూ ఆమె బక్కచిక్కిపోయింది. ఆమె సేవలకు సంతసించిన కర్దముడు ఆమెకు దివ్యదృష్టినీ దివ్యభోగాలనూ ఒక విమానాన్ని బహుమానంగా ఇచ్చాడు. ఆమెతో బిందుసరస్సులో స్నానం చేయించి ఆమె పూర్వ సౌందర్యాన్ని ఆమెకు వచ్చేలా చేశాడు.

కొంతకాలానికి ఆమె కడుపు పండింది. తొమ్మిదిమంది కుమార్తెలు జన్మించారు. ఆ తరువాత మళ్ళీ గర్భం ధరించింది. సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడే 'కపిలుడు' అనే పేరుతో ఆమెకు పుత్రుడిగా జన్మించాడు.

బ్రహ్మదేవుడి ఆదేశం మేరకు కుమార్తెలందరికీ అంతకు ముందే బ్రహ్మదేవుడు సృష్టించిన మహర్షులతో వివాహాలు జరిపించిన కర్దమ మహర్షి శ్రీహరిపైనే తన మనసును లగ్నం చేసి పరమపదాన్ని పొందాడు.

తన కుమారుడు సామాన్యుడు కాదని, దేవహూతికి తెలుసు. జీవకోటికి తత్త్వజ్ఞానం ఉపదేశించటానికి పరమాత్మే కపిలుడై తన కుమారుడిగా జన్మించాడనీ గ్రహించింది. అంతకుముందే బ్రహ్మ చెప్పిన మాటలను గుర్తుకు తెచ్చుకొని, తన పతికి చేసినట్లు తనకూ తత్త్వోపదేశం చెయ్యమని తనయుణ్ణి ఈ విధంగా ప్రార్థించింది–

ఉ. **భూరి మదీయ మోహతమముం బెడఁబాప సమర్థులన్యు లె**
**వ్వారలు నీవ కాక? నిరవద్య! నిరంజన! నిర్వికార! సం**
**సారలతా లవిత్ర! బుధసత్తమ! సర్వశరణ్య! ధర్మవి**
**స్తారక! సర్వలోకశుభదాయక! నిత్యవిభూతినాయకా!** (3-869)

'నాయనా! పుత్రా! నా మోహం అనే తిమిరాన్ని తరిమికొట్టే సమర్థులు నీకన్నా నాకెవ్వ రుంటారు? నీవే అందరికీ రక్షకుడివి. సర్వలోకశుభదాయకా! శరణు! శరణు!'

అప్పుడు ఆమెకు కపిల మహర్షి ఇలా చెప్పటం ప్రారంభించాడు–

## ఆత్మస్వరూపం

'అమ్మా! ఈ ఆత్మ ఉంది చూశావూ! ఇది స్వర్గానికీ భూలోకానికీ తిరుగుతూ ఉంటుంది. వ్యామోహాన్ని విడిచిపెట్టి నన్నే ధ్యానించినవారిని నేనే సంసారం అనే సముద్రాన్ని దాటిస్తాను. ఇది తెలిసినవాళ్ళు నన్ను కొలుస్తారు. తెలియనివాళ్ళు బాధలు పడుతూనే ఉంటారు.

అంతా భగవంతుడి ఇష్టప్రకారమే జరుగుతుందని తెలుసుకోవటమే ఆత్మ జ్ఞానం. ఆ భగవంతుడికి వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ అని నాలుగు వ్యూహాలు ఉన్నాయి. వీటిని అందరూ సేవించాలి.

**ఎవరి పనిని వాళ్ళు చేయాలి. పవిత్రంగా ఉండాలి. నా పాదాలపైనే దృష్టి నిలపాలి. నన్ను సేవించేవారినీ అర్చించాలి. ఆహారాన్ని మితంగా తీసుకోవాలి. అహింసనూ, సత్యాన్నీ పాటించాలి. కావలసినంతవరకే సంపాదించాలి. పరుల సొమ్ము కోసం పాకులాడకూడదు.**

**ప్రాణాయామం చేస్తూ ఇంద్రియాల్ని అదుపులో ఉంచుకోవాలి. సుఖదుఃఖాల్లో ఒకేలా ఉండాలి. కర్మఫలాన్ని అనుభవించే వరకే సంసారం ఉంటుంది. పొగకంటే అగ్ని ఎలా వేరుగా ఉంటుందో ఆత్మ కూడా పరమాత్మతో అలాగే వేరుగా ఉంటుంది. ఇదే ఆత్మస్వరూపం.**

దేవహూతికి ఆత్మస్వరూపం తెలిసింది. తరువాత కపిలాచార్యుడు భక్తియోగాన్ని ఆమెకు వివరిస్తున్నాడు.

## భక్తియోగం

'అమ్మా! ఈ యోగం తామసమూ, రాజసమూ, సాత్త్వికమూ అని మూడు రకాలు. నన్ను ద్వేషిస్తూ అర్చించడమే తామసభక్తి.

ఏ కోరికలూ లేకుండా ప్రతి పనినీ నాకే అర్పిస్తూ అర్చించటం సాత్త్విక భక్తి. ఈ భక్తివల్ల సాలోక్యం, సామీప్యం, సాయుజ్యం, సారూప్యం మొదలైన మోక్షాలను సాధించవచ్చు.

**కదలిక లేని జీవులకంటే కదలిక ఉన్న జీవులు శ్రేష్ఠమైనవి. చైతన్యం ఉన్న జన్మలలో ఉత్తమమైనది మానవజన్మే. మానవులలో అందరికంటే ఉత్తములు ఎవరో తెలుసా? అన్ని ధర్మాల్నీ విడిచిపెట్టి నన్ను మాత్రమే శరణు కోరేవాళ్ళే. అటువంటి పరమ భాగవతులు ఎంచుకొనే మార్గమే భక్తియోగం'** అంటూ కపిలాచార్యుడు తరువాత ఆమెకు పిండోత్పత్తి క్రమం గురించీ, గర్భంలో ఉన్న జీవుడు పడే వేదన గురించీ విపులంగా చెప్పాడు.

## సదాచారాలు

తరువాత మానవులు ఆచరించవలసిన ఆచారాలను ఇలా చెప్తున్నాడు–

'అమ్మా! మానవుడు చెడ్డపనులు చేయటానికి కారణం అజ్ఞానం. **సత్యం, శౌచం, దయ, ధైర్యం, మౌనం, బుద్ధి, ఓర్పు, సిగ్గు, కీర్తి, శాంతం మొదలైనవి ఉత్తమ గుణాలు. ఇవి చెడు సావాసాలవల్ల నశించిపోతాయి.**

**స్త్రీవ్యామోహం అన్నింటికంటే పెద్ద దోషం. అన్ని అనర్థాలకూ ఇదే కారణం. నన్ను సేవించేవాళ్ళకి ఈ దుర్గుణం అంటుకోదు.**

జీవుడు పూర్వజన్మ కర్మల్ని అనుభవిస్తూ కర్మలపై ఆసక్తితో మళ్ళీమళ్ళీ పుడుతూనే ఉంటాడు. ఇది తెలుసుకొని దేహంపై మమకారాన్ని విడిచిపెట్టాలి. గృహస్థుగా ఉంటూ ధర్మార్థకామాల కోసం పాటుపడాలి. దీనివల్ల దేవగణాలు ఆనందిస్తాయి. పితృకర్మలు చేసిన మానవులు చంద్రలోకానికి వెళ్తారు. పుణ్యం నశించాక మళ్ళీ జన్మిస్తారు. అన్నింటినీ విడిచిపెట్టినవాళ్ళు మాత్రమే శ్రీహరి పదాన్ని పొందుతారు. వీళ్ళకు మళ్ళీ జన్మ ఉండదు.

## బ్రహ్మ మొక్కటే

ఒక్క మాట చెప్పనా! 'బ్రహ్మ' ఎప్పుడూ ఒక్కటే! అది అనేక రకాలుగా కనిపిస్తూ ఉంటుంది. ఎన్ని శాస్త్రాలు చదివితేనో ఎన్ని తీర్థాల్లో మునిగితేనో జపం, తపస్సు, అధ్యయనం, యోగం, క్రియ, దానం, ధర్మంలాంటివి ఆచరిస్తేనో కాని నారాయణతత్త్వం బోధపడదు.

**ముందు ఇంద్రియాల్ని గెలవాలి. త్యాగం ద్వారా వైరాగ్యం పొందాలి. అప్పుడే నారాయణతత్త్వం బోధపడుతుంది. జీవులలో ఉత్పత్తి నేనే. నాశనమూ**

**నేనే. ఆత్మతత్త్వం తెలుసుకోవడానికి అవిద్య అడ్డుతగులుతుంది. ఇదే అతిరహస్యమైన సాంఖ్యయోగం. దీనిపై శ్రద్ధకలవారికే దీన్ని చెప్పాలి’** అన్నాడు కపిలాచార్యుడు.

దేవహూతి ముఖం ఇప్పుడు ఎంతో ప్రసన్నంగా ఉంది. అప్పటివరకూ కమ్ముకున్న మబ్బులన్నీ వీడిపోయాయి. ఆనందంతో–

**‘పరంధామా! భక్తవత్సలా! సృష్టి, స్థితి, లయలకు కారణమైన నువ్వు ఇప్పుడు నా పుత్రుడిగా జన్మించటం నా అదృష్టం. నువ్వే దుష్టుల్ని శిక్షించి, శిష్టుల్ని రక్షించడానికి ఎన్నో అవతారాలను ధరిస్తావు. బ్రహ్మాదులకు సైతం నిన్ను వర్ణించటం సాధ్యంకాదు. నేనెంత? నీ నామాన్ని నిత్యం జపిస్తే దరిద్రులు సైతం సంపన్నులౌతారు. యజ్ఞయాగాలు చేసేవాళ్ళకంటే పవిత్రులవుతారు. నీ కథల్ని వింటే సమస్త పుణ్యతీర్థాల్లో స్నానం చేసినట్లే’ అంటూ నమస్కరించింది. కపిలాచార్యుడు వెళ్ళిపోయాడు.**

“విదురా! దేవహూతి అప్పటి నుండి తపస్సు ప్రారంభించింది. మొదట్లో భర్తమీద, పుత్రుడిమీద వ్యామోహాలతో అలమటించింది. కానీ చివరికి శ్రీహరిపైనే దృష్టిని కేంద్రీకరించింది. సరస్వతీ బిందు సరోవరాల్లో త్రిషవణస్నానం చేస్తూ తీవ్రమైన తపస్సు చేసి మోక్షాన్ని పొందింది. ఆవిడ మోక్షం పొందిన ప్రదేశానికే తరువాత ‘సిద్ధపదం’ అని ప్రసిద్ధి వచ్చింది” అన్నాడు.

‘రాజా! ఇదయ్యా విదురుడికి మైత్రేయుడు వివరించిన భక్తియోగం. ఈ కథను చెప్పినవాళ్ళకూ విన్నవాళ్ళకూ మోక్షం లభిస్తుంది’ అన్నాడు శుక మహర్షి.

సూత మహర్షి చెప్పినదంతా విన్న శౌనకాది మహర్షులు పరవశించిపోయారు. హరిభక్తి వాళ్ళ మనసంతా నిండిపోయింది.

# చతుర్థ స్కంధం

సూతుడు తిరిగి ప్రారంభించాడు.

'మహర్షులారా! శుక మహర్షి పరీక్షిత్తును చూసి 'రాజా! మైత్రేయ మహర్షి విదురుడికి స్వాయంభువ మనువు వంశ క్రమాన్ని ఇలా చెప్తున్నాడు–

స్వాయంభువ మనువుకు శతరూప ద్వారా ఆకూతి, దేవహూతి, ప్రసూతి అని ముగ్గురు కుమార్తెలు కలిగారు. వీరితోపాటు ప్రియవ్రతుడు, ఉత్తానపాదుడు అనే పేర్లుగల ఇద్దరు కుమారులు జన్మించారు.

ఆకూతి భర్త 'రుచి' అనే పేరుగల ప్రజాపతి. ఇతడు చాలా గొప్పవాడు. అందుకే సాక్షాత్తూ ఆ శ్రీమన్నారాయణుడే వీళ్ళిద్దరికీ కొడుకుగా పుట్టాడు. అతడి పేరే యజ్ఞుడు. ఈ అవతారంలో జగన్మాత అయిన లక్ష్మీదేవి 'దక్షిణ' అనే పేరుతో జన్మించింది. వీరి సంతానమే యాములు. వాళ్ళెవరో తెలుసా? తోషుడు, ప్రతోషుడు, సంతోషుడు, భద్రుడు, శాంతి, ఇడస్పతి, ఇధ్ముడు, కవి, విభుడు, వహ్ని, సుదేవుడు, రోచనుడు – వీళ్ళే తరువాత తుషితులు అనే దేవగణంగా ప్రసిద్ధి పొందారు.

ప్రియవ్రతుడూ, ఉత్తానపాదుడూ ఈ వంశాన్ని పెంపొందింపజేశారు. ఇక కర్దమ ప్రజాపతి పుత్రికలు కూడా బ్రహ్మర్షులను వివాహం చేసుకొని ఆ వంశాన్ని విస్తరింపజేశారు. దక్షప్రజాపతికి 16 మంది పుత్రికలు. వీళ్ళు తమ సంతానంతో సృష్టిని విస్తరింపజేశారు.

## దక్షయాగం

ఇక్కడో పుణ్యప్రదమైన కథ ఉంది. చెబుతాను విను. దక్షప్రజాపతి 16 మంది పుత్రికలలో సతీదేవి అని ఒక సాధ్వీమణి ఉంది. ఆమె ఎవరో కాదు, పరమేశ్వరుడి భార్య. నవబ్రహ్మలు ఒకసారి సత్రయాగం చేసినప్పుడు అక్కడికి

దక్షప్రజాపతి వచ్చాడు. అందరూ లేచి నిలబడి ఆయనను గౌరవించారు. కానీ శివుడు లేవలేదు. దానివల్ల దక్షుడికి కోపం వచ్చింది. 'నాకు అల్లుడై ఉండి కూడా శివుడు నన్ను గౌరవించలేదు' అని ఉక్రోషంతో శివుణ్ణి నిందించాడు.

అప్పటి నుండి వీళ్ళిద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది. ఇదిలా ఉంటే కొన్నాళ్ళ తర్వాత దక్షుడు ఒక యాగాన్ని తలపెట్టాడు. అందరినీ ఆహ్వానించాడు. కానీ శివుణ్ణి పిలవలేదు. పుట్టింటిపై ఆశ వల్లా అక్కాచెల్లెళ్ళను కలవాలన్న మమకారంతోను సతీదేవి దక్షుడి ఇంటికి వెళ్ళాలనుకుంది. పిలవని పేరంటానికి వెళ్ళటం దేనికి? అని శివుడు అంటాడేమోనని సతీదేవి ముందుగానే ఊహించి ఆయనతో –

**కం. అనఘా! విను లోకంబున**
**జనకుని గేహమునఁ గలుగు సకలసుఖంబుల్**
**దనయలు జని సంప్రీతిన్**
**గనుఁగొన కేరీతి నిల్చుఁ గాయము లభవా!** (4-67)

**పుణ్యాత్ముడా! పుట్టింట్లో కలిగే సుఖాల్ని కూతుళ్ళు చూడకుండా ఉండగలరా?**

**కం. అనయముఁ బిలువకయుండం**
**జన ననుచిత మంటివేని జనక గురు సుహృ**
**జ్జననాయక గేహములకుఁ**
**జనుచుందురు పిలువకున్న సజ్జను లభవా!** (4-68)

**'స్వామీ! తండ్రి, గురువు, మిత్రుడు, రాజు మొదలైనవాళ్ళ ఇళ్ళకు పిలువక పోయినా వెళ్ళవచ్చని పెద్దలు చెబుతారు. నువ్వు నాకు నీ శరీరంలో సగభాగం ఇచ్చి గౌరవించావు. ఇప్పుడు నా మాటను కూడా గౌరవించు'** అంది.

శివుడు చిరునవ్వు చిందించి, **'సతీదేవీ! అవును. నువ్వు అన్నది నిజమే! పిలవకపోయినా వెళ్ళవచ్చు. ఎప్పుడు? వాళ్ళు మంచివాళ్ళు అయితేనే సుమా! విద్య, తపస్సు, ధనం, వయస్సు, రూపం, కులం, సజ్జనులకు ఉంటే అవి గుణా లవుతాయి. అవే దుర్జనులకు ఉంటే అవి దోషాలు అవుతాయి. వాళ్ళ వివేకాన్ని నాశనం చేస్తాయి. అలాంటివాళ్ళు బంధువులే అయినా వాళ్ళ ఇంటికి వెళ్ళకూడదు. వెళ్తే అవమానం తప్పదు.**

నేను నమస్కారం చేయలేదని దక్షుడికి కోపం. సర్వాంతర్యామి అయిన పరమాత్మకే నమస్కారం చేయాలికానీ శరీరంపై మమకారం, అహంకారం ఉన్న వాళ్ళకు కాదు. అందుకే నేను దక్షుడికి నమస్కరించలేదు' అని మౌనం వహించాడు శివుడు.

సతీదేవి దక్షయాగానికి వెళ్ళింది. తల్లీ, అక్కా-చెల్లెళ్ళు ఆదరించారు కానీ దక్షుడు ఆదరించలేదు. దాంతో ఆ అవమానాన్ని సతీదేవి భరించలేకపోయింది. తండ్రిపై ఆమెకు పట్టరానంత కోపం వచ్చింది. ఏదైనా తేడా వస్తే ఆ యాగాన్ని సర్వనాశనం చేయడానికి రుద్రగణం కూడా ఆమెతో వచ్చింది. అయినా సతీదేవి శాంతంగానే తండ్రితో ఇలా అంది-

**'అయ్యా! పరమశివుణ్ణి లోకమంతా కొలుస్తోంది, ఒక్క నువ్వు తప్ప. నీలాంటి అధములకు మంచివాళ్ళ సుగుణాలు ఎలా కనిపిస్తాయిలే! పచ్చకామెర్ల వాడికి లోకమంతా పచ్చగానే ఉంటుంది. దుర్మార్గుడి కళ్ళకు మంచి లక్షణాలు కూడా చెడ్డ లక్షణాలుగానే తోస్తాయి.**

**మధ్యములు ఇతరుల్లో ఉన్న చెడ్డగుణాల్ని గుర్తిస్తారు కానీ బయటకు చెప్పరు. ఇక ఉత్తములు - ఇతరులలో ఉన్న చెడ్డ గుణాలను సైతం మంచి గుణాలుగానే స్వీకరిస్తారు. శివుడు అలాంటి ఉత్తములలో ఉత్తముడు. శివ అనే రెండు అక్షరాలే పాపాలను రూపుమాపుతాయి. సర్వశుభాల్నీ కలుగజేస్తాయి. నేను నీ కుమార్తె నైనందుకు సిగ్గుపడుతున్నాను'** అంటూ సతీదేవి యోగాగ్నిని పుట్టించుకొని ఆ అగ్నిలోనికి దూకి ప్రాణత్యాగం చేసింది.

ఆ హఠాత్పరిణామానికి రుద్రగణంలో తీవ్ర సంచలనం రేగింది. వెంటనే విజృంభించి ఆ యాగాన్ని ధ్వంసం చేయాలని చెలరేగిపోయింది. అప్పుడు భృగువు మొదలైన మహర్షులు అడ్డుపడ్డారు.

నారదుడి ద్వారా ఈ సంగతి విన్న శివుడు తన జటాజూటాన్ని లాగి, అందులోని ఒక జడను విసిరి నేలపై కొట్టాడు. దాని నుండి వీరభద్రుడు ఆవిర్భవించాడు.

శివుడి ఆజ్ఞతో వీరభద్రుడు దక్షయాగంలో వీరవిధ్వంసం సృష్టించాడు. అందరినీ హింసించాడు. చివరికి దక్షుడి తలను ఖండించి హోమగుండంలో విసిరి వేశాడు.

జరిగిన అనర్థాన్ని దేవతలు బ్రహ్మదేవుడికి చెప్పారు. శివుణ్ణి పిలువకుండా యాగం చేయటం తప్పనీ, వెంటనే వెళ్ళి శివుణ్ణి ప్రార్థించమనీ హితవు పలికాడు బ్రహ్మదేవుడు. వాళ్ళతోపాటు తానూ వెళ్ళి దక్షిణామూర్తి స్వరూపుడైన పరమేశ్వరుణ్ణి అనేక విధాలుగా స్తుతించాడు.

శివుడు కనికరించాడు. దక్షుడితోసహా యాగంలో మరణించినవాళ్ళందరినీ బ్రతికించాడు. ఇప్పుడు దక్షుడిలో మునుపటి అహంకారం లేదు. శివుణ్ణి స్తుతించి, యాగాన్ని పూర్తిచేశాడు. వీరభద్రుడివల్ల యాగానికి కలిగిన దోషానికి పరిహారంగా 'విష్ణుయాగం' చేశాడు. దానికి శ్రీహరి ప్రసన్నుడై అక్కడ ప్రత్యక్షమయ్యాడు. అందరూ శ్రీహరిని స్తుతించారు.

దక్షుడి పుత్రిక సతీదేవి మళ్ళీ హిమవంతుడికీ మేనకకూ జన్మించి శివుణ్ణే వివాహం ఆడింది.

సనకాది మహర్షులు, నారదుడు, హంసుడు, అరుణి, ఋభుడు, యతి అనే బ్రహ్మదేవుడి పుత్రులు గృహస్థాశ్రమం స్వీకరించలేదు. అందువల్ల వాళ్ళ ద్వారా వంశాభివృద్ధి జరగలేదు.

'విదురా! దీన్నంతా ప్రతిసర్గ అంటారు. ఇక పుణ్యాత్ముడైన ధ్రువుడి కథను నీకు వినిపిస్తాను, విను' అంటూ చెప్పటం ప్రారంభించాడు.

## భక్త ధ్రువుడు

స్వాయంభువ మనువుకు ప్రియవ్రతుడు, ఉత్తానపాదుడు అని ఇద్దరు పుత్రులని ఇంతకు ముందే చెప్పాను కదా! వారిలో ఉత్తానపాదుడికి ఇద్దరు భార్యలు. పెద్ద భార్య సునీతి. చిన్న భార్య సురుచి. ఉత్తానపాదుడికి చిన్న భార్యంటేనే ఎక్కువ ఇష్టం. సునీతి కొడుకు ధ్రువుడు. సురుచి కొడుకు ఉత్తముడు.

ఒకరోజు ఉత్తముడు తండ్రి ఒళ్ళో కూర్చొని ఉన్నాడు. అది చూశాడు ధ్రువుడు. తనూ తండ్రి ఒళ్ళో కూర్చోవాలని ఉబలాటపడ్డాడు. దగ్గరకు వెళ్ళాడు. అప్పుడు అతడి సవతి తల్లి సురుచి వచ్చి 'నా కడుపున పుట్టినవాడికే ఈ అవకాశం. నీకు లేదు. నీకూ ఇది దక్కాలంటే వెళ్ళు. వెళ్ళి ఆ విష్ణుమూర్తిని ధ్యానించు పో!' అని కసిరింది. ఉత్తానపాదుడు ఏమీ మాట్లాడలేదు. ధ్రువుణ్ణి దగ్గరకు తీసుకోలేదు.

ఆ మాటలూ, తండ్రి చేష్టలూ పసివాడైన ధ్రువుడి మనసును తీవ్రంగా కలిచివేశాయి. ఏడుస్తూ తల్లి సునీతి దగ్గరకు వచ్చి జరిగినదంతా చెప్పాడు.

చెలికత్తెల ద్వారా అప్పటికే ఆ విషయం ఆమెకు తెలిసింది. ధ్రువుణ్ణి బుజ్జగిస్తూ–

**'నాయనా! తెలిసి చెప్పిందో తెలియక చెప్పిందో తెలియదుగానీ సురుచి నిజమే చెప్పింది. మనకింక దిక్కు ఆ వాసుదేవుడే. వెళ్ళు, ఆ శ్రీమన్నారాయణుణ్ణి ధ్యానించు. పూర్వం బ్రహ్మదేవుడు, మీ తాతగారూ ఇంకా ఎందరో యోగులు ఆ పరంధాముడి పాదాలను ఆశ్రయించి మోక్షాన్ని పొందారు.**

## నారదుడి ఉపదేశం

ధ్రువుడు తల్లి మాటలు విన్నాడు. ఇల్లు విడిచి బయలుదేరాడు. దారిలో అతడి ముందు నారద మహర్షి ప్రత్యక్షమయ్యాడు.

ధ్రువుడి ద్వారా జరిగినదంతా విని బుజ్జగిస్తున్నట్లుగా –

'నాయనా! ఇవన్నీ చాలా చిన్న విషయాలు. పంతాలకు పోవటం మంచిది కాదు. నువ్వా! ముక్కుపచ్చలారని పసిబాలుడివి. నీ తల్లి నీకు చూపించిన మార్గం ఎంతో కష్టమైనది. మహామహా యోగులే ఈ మార్గంలో వెళ్ళటానికి అష్టకష్టాలూ పడుతుంటారు. నువ్వెంత? వెనక్కి తిరిగి వెళ్ళు.

**సుఖానికీ దుఃఖానికీ రెండింటికీ కారకుడు ఆ భగవంతుడే. ఈ విషయం తెలిసినవాడే జ్ఞాని.**

**గుణవంతుణ్ణి చూసి సంతోషించాలి. గుణహీనుణ్ణి చూసి జాలిపడాలి. తనతో సమానమైనవాడితోనే స్నేహం చేయాలి. నీకు ఈ మార్గం తగదు' అన్నాడు.**

కానీ ధ్రువుడు మనసు మార్చుకోలేదు. శ్రీహరి అనుగ్రహాన్ని పొందే మార్గం చెప్పమని పదేపదే వేడుకొన్నాడు. నారదుడు చిరునవ్వు చిందిస్తూ–

**కం. పురుషుఁడు దవిలి చతుర్విధ**
**పురుషార్థ శ్రేయ మాత్మఁ బొందెద ననినన్**
**ధరఁ దత్ప్రాప్తికి హేతువు**
**హరిపదయుగళంబు దక్క నన్యము గలదే?** (4-244)

'నాయనా! పురుషార్థాల్ని సాధించాలనుకొనేవాడికి దిక్కు ఆ శ్రీహరి పాదపద్మాలే! నిన్ను చూస్తుంటే ముచ్చటేస్తుంది. పట్టిన పట్టు విడిచిపెట్టేలా లేవు. సరే! ఇక్కడికి దగ్గరలో యమునానది ఉంది. ఆ నదీతీరంలో ఒక అద్భుతమైన వనం ఉంది. దాని పేరు మధువనం. అక్కడికి వెళ్ళి తపస్సు ప్రారంభించు. అది శ్రీహరికి నెలవు. నీకు ఆ శ్రీహరి రూపం గురించీ, గుణాల గురించీ చెప్తాను. వాటినే తలచుకొంటూ ధ్యానం చేయి. నీ కోరిక నెరవేరుతుంది' అంటూ **'ఓం నమో భగవతే వాసుదేవాయ'** అన్న ద్వాదశాక్షరీ మంత్రాన్ని ఉపదేశించి తను వెళ్ళిపోయాడు.

## ధ్రువుడి తపస్సు

ధ్రువుడు బాలుడే అయినా పరమయోగులు కూడా చేయలేని తీవ్రమైన తపస్సు ప్రారంభించాడు. అష్టదిక్కులూ వణకిపోయాయి. దిక్పాలకులకు గుండెదడ మొదలైంది. దేవతలంతా పరుగుతీసి విష్ణుమూర్తిని శరణుజొచ్చారు.

> **చం. హరి! పరమాత్మ! కేశవ! చరాచరభూతశరీరధారివై**
> **పరఁగుదు వీవు నిట్టులుగఁ బ్రాణనిరోధమెఱుంగ మెందు ముం**
> **దిరవుగ దేవదేవ! జగదీశ్వర! సర్వశరణ్య! నీ పదాం**
> **బురుహము లర్థిమై శరణుఁ బొందెద మార్తి హరించి కావవే!** (4-276)

హరీ! పరమాత్మా! కేశవా! నువ్వు చరాచరభూతాల శరీరాల్ని ధరించి ఉంటావు. ఈ విధంగా ప్రాణనిరోధం మాకు ఎప్పుడూ కలగలేదు. నీ పాదాలు శరణువేడుతున్నాం. మమ్మల్ని రక్షించుదేవా! అని వేడుకొన్నాడు.

విష్ణుమూర్తి భక్తప్రియుడు కాబట్టి వెంటనే గరుడ వాహనంపై మధువనానికి విచ్చేశాడు.

ధ్రువుడు తపస్సు చేస్తున్నాడు. ఎదురుగా వాసుదేవుడు. ధ్రువుడు తన మనసులో ఆ వాసుదేవుణ్ణే చూస్తున్నాడు. అందుకే బయట ఉన్న వాసుదేవుణ్ణి దర్శించలేకపోయాడు. అంతలో లోపలి దేవుడు మాయమయ్యాడు. ధ్రువుడు కళ్ళు తెరిచాడు. ఎదురుగా కమలాక్షుడు. తను ఇంతకాలం హృదయంలో దర్శించిన శ్రీమన్నారాయణుడు ఎదురుగా సాక్షాత్కరించేసరికి ఆనందంతో ఉబ్బితబ్బిబ్బై

పోయాడు. కళ్ళవెంబడి ఆనందబాష్పాలు ధారలు కడుతుంటే స్వామికి సాష్టాంగ నమస్కారం చేశాడు. నోరారా కీర్తించాలని ఉంది. మాటలు రావటంలేదు.

అప్పుడు శ్రీహరి తన పాంచజన్యంతో ధ్రువుడి చెక్కిలిపై రాశాడు. ధ్రువుడికి తత్త్వం బోధపడింది. నోటివెంట స్తుతివాక్యాలు వరదకట్టాయి. తనివితీరా పరమాత్మను స్తుతించాడు.

ధ్రువుడిపై అనురాగ వర్షాన్ని కురిపిస్తూ శ్రీహరి 'నాయనా! ధ్రువకుమారా! నీ దీక్ష అమోఘం. నీకు ధ్రువమండలాన్ని ప్రసాదిస్తున్నాను. 26 వేల సంవత్సరాల తర్వాత అది నీకు లభిస్తుంది. అన్ని గ్రహాలు ఈ మండలం చుట్టూ తిరుగుతూ ఉంటాయి. అన్నింటికంటే ఎత్తులో ఉండే ఈ మండలం ప్రళయకాలంలో కూడా అలాగే ఉంటుంది' అని ఆశీర్వదించి వెళ్ళిపోయాడు.

## ఘనస్వాగతం

ధ్రువుడు ఎంతో భాగ్యవంతుడు. శ్రీహరి సాక్షాత్కారం అతడికి లభించింది. అందుకే అతడికి ఘనస్వాగతం పలికింది నగరం. తండ్రి తన తప్పు తెలుసుకున్నాడు. కుమారుడి గొప్పతనానికి ఉప్పొంగిపోయాడు. ఏనుగుపై ఊరేగిస్తూ నగరమంతా తిప్పారు.

రాజా! **శ్రీహరిని ఆశ్రయించినవాళ్ళ వైభవానికి కొరత ఏముంటుంది?** తరువాత ధ్రువుడు పెరిగి పెద్దవాడై 'భ్రమి' అనే కన్యను పెళ్ళిచేసుకొని రాజ్యాన్ని చక్కగా పరిపాలిస్తున్నాడు. అతడికి ఇద్దరు కొడుకులు పుట్టారు. వాళ్ళు కల్పుడు, వత్సరుడు. ధ్రువుడి తమ్ముడు ఉత్తముడు వేటకు వెళ్ళి ఒక యక్షుడి చేతిలో మరణించాడు. కొడుకును వెతుక్కుంటూ వెళ్ళి సురుచి కూడా దావానలంలో చిక్కి మరణించింది. అప్పటికే తండ్రి ఉత్తానపాదుడు తపస్సు కోసం అడవులకు వెళ్ళిపోయాడు.

తన సోదరుణ్ణి మట్టుపెట్టిన యక్షుల పైకి ధ్రువుడు దండయాత్ర సాగించాడు. కుబేరుడి అనుచరులైన గుహ్యకులతో యుద్ధంచేసి నారాయణాస్త్రాన్ని ప్రయోగించి అందరినీ సంహరించాడు. అయినా అతడి కోపం చల్లారలేదు. అప్పుడు అతడి తాత స్వాయంభువమనువు అక్కడకు వచ్చి ఇలా హితవు పలికాడు –

'నాయనా! ధ్రువా! నీ తమ్ముడు ఒక్కడిని చంపారన్న కోపంతో ఇంతమందిని చంపడం న్యాయంకాదు. నువ్వు పుణ్యాత్ముడివి. నీకు ఇంతటి క్రోధం ఎందుకయ్యా! విడిచిపెట్టు.

**శ్రీహరి భక్తులు జీవహింస చేయరు. మనకంటే గొప్పవాడిపట్ల సహనం, సమానమైనవాడిపట్ల స్నేహం, తక్కువవారిపట్ల దయ, ఇతర ప్రాణులపట్ల సమభావం ఉండాలి. అటువంటివాడినే భగవంతుడు అనుగ్రహిస్తాడు.** అన్ని కర్మలూ ఆ స్వామి అధీనంలోనే ఉంటాయి. నీ తమ్ముణ్ణి చంపడానికి యక్షులెవరు? చావడానికి వాడెవడు? చంపడమూ, చావడమూ ఎవరి చేతుల్లోనూ లేదు' అని చెప్తున్నాడు. అంతలో యక్షరాజైన కుబేరుడే అక్కడికి విచ్చేశాడు.

తాతగారి ఆజ్ఞ మేరకు ధ్రువుడు విరోధాన్ని విడిచిపెట్టి కుబేరుడికి నమస్కరించాడు. కుబేరుడూ ఆనందించి శ్రీహరి ధ్యానం అతడి మనసులో స్థిరంగా ఉండేలా వరాన్ని ప్రసాదించి వెళ్ళిపోయాడు.

ధ్రువుడు ఆ తరువాత 26 వేల సంవత్సరాలు రాజ్యపాలన చేసి, రాజ్యాన్ని కుమారులకు అప్పగించి బదరీవనంలో తపస్సు చేసుకొంటూ కాలం గడిపాడు. కొంతకాలం తర్వాత శ్రీమన్నారాయణుడు ఒక దివ్యవిమానాన్ని పంపాడు. దానిలో హిరణ్మయ రూపాన్ని ధరించి తన తల్లి సునీతితో సహా విష్ణుపదాన్ని చేరుకున్నాడు ధ్రువుడు.

'విదురా! విన్నావుగా ధ్రువ చరిత్ర. ఈ చరిత్రను నారద మహర్షి స్వయంగా ప్రచేతసులు చేసిన సత్రయాగంలో అందరికీ గానం చేస్తూ వినిపించాడు. ఈ కథను విన్నా, పఠించినా, స్మరించినా ఉత్తమ గతులు కలుగుతాయి. ఇదే వంశంలో కొన్ని తరాల తర్వాత 'వేనుడు' అనే లోకకంటకుడు జన్మించాడు. అతడి గురించీ చెప్తాను విను.

## వేనుడి వధ

వేనుడి తండ్రి అంగరాజు. తల్లి సునీథ. సంతానం కోసం అంగరాజు పుత్రకామేష్టి చేశాడు. అందులో నుండి యజ్ఞపురుషుడు వచ్చి ఒక పాయస పాత్రను ఇచ్చాడు. దానిని స్వీకరించింది సునీథ. కొన్నాళ్ళకు ఈ వేనుడు జన్మించాడు.

**వేనుడు పరమ దుర్మార్గుడు. అతడికి దయ, ఏ కోశానా లేదు. అందరినీ హింసించటమే అతని ధ్యేయం. వాడి దుండగాలను భరించలేక అంగరాజు ఇల్లు విడిచి వెళ్ళిపోయాడు. ఇంకేముంది? తప్పనిసరి పరిస్థితుల్లో వేనుడే రాజు అయ్యాడు. వాడి అఘాయిత్యాలకు అదుపే లేకుండా పోయింది. చూశారు చూశారు మహర్షులు. సహనం చచ్చిపోయింది. ఒక్కసారి హుంకరించారు. అంతే! వేనుడి ప్రాణాలు ఆ హుంకారానికి గాలిలో కలసిపోయాయి.**

పుత్రుడి మరణానికి తల్లడిల్లిపోయింది సునీథ. కొడుకుపై మమకారం చావక అతడి శరీరాన్ని భద్రపరిచింది. **రాజులేని రాజ్యం చోరులకూ జారులకూ నిలయమైపోతుంది.** అందుకే మునులు ఆ వేనుడి కళేబరంలోని తొడను మథించారు. అందులో నుంచి నల్లగా భీకరంగా ఉన్న ఒక వేటగాడు వచ్చాడు. వాడు పుట్టీ పుట్టగానే 'నేను ఏం చేయాలి?' అని అడిగాడు. మహర్షులు కూర్చో (నిషీద) అన్నారు. అప్పటినుండీ వాడు నిషాదుడు అయ్యాడు.

ఈసారి మహర్షులు వేనుడి హస్తాల్ని మథించారు. అందులో నుండి ఒక అవతార పురుషుల జంట ఆవిర్భవించింది. ఆ జంటే పృథుచక్రవర్తి, అర్చి.

లోకకళ్యాణం కోసమే ఈ జంట ఆవిర్భవించింది. దేవగణాల్లో ఆనందం వెల్లివిరిసింది.

పృథుచక్రవర్తి చేతిలో చక్రాలు, పాదాలలో శుభరేఖలూ ఉన్నాయి. అవి చూసి అందరూ ఆశ్చర్యపోయారు.

## పృథుచక్రవర్తి చరిత్ర

తరువాత పృథువు చక్రవర్తి అయ్యాడు. వందిమాగధులు అతణ్ణి స్తుతిస్తుంటే వారితో ఇలా అన్నాడు–

'నన్నెందుకు స్తుతిస్తున్నారు? నాలో ఏ మహిమా లేదు. ఇదంతా శ్రీహరి అనుగ్రహమే! మీరు కీర్తించవలసినది ఆ శ్రీమన్నారాయణుణ్ణే. నన్ను కాదు. మహాత్ములలో గొప్ప గుణాలు ఉంటాయి. వాళ్ళను స్తుతించవచ్చు. కానీ నాలాంటి సామాన్యుణ్ణి కాదు. తాను తపస్సు ద్వారా మంచి లక్షణాలను సంపాదిస్తానని

ఎవరైనా చెప్పవచ్చు. కానీ అలా అన్నవాణ్ణి చూసి అందరూ నవ్వుతారు! **గొప్పవాళ్ళు ఆత్మస్తుతినీ పరనిందనూ అసహ్యించుకుంటారు సుమా!'** అన్నాడు. అదీ పృథుచక్రవర్తి సంస్కారం.

పృథుచక్రవర్తి రాజ్యపాలన చేస్తుంటే ఒకసారి అతడి రాజ్యంలో తీవ్రమైన కరువు తాండవించింది. ప్రజలు తిండిలేక నానా అగచాట్లు పడుతున్నారు. దానికి కారణమైన భూదేవిని దండించాలని పృథువు బయలుదేరాడు.

అది తెలిసి భూమి ఆవు రూపాన్ని ధరించి పారిపోయింది. రాజు వెంటపడ్డాడు. అప్పుడు 'రాజా! నన్ను రక్షించవలసినవాడివి నువ్వే. నువ్వే నన్ను శిక్షిస్తే నేను ఎవరికి చెప్పుకోను? అసలు విషయం చెప్తాను విను.

పువ్వు వాడిపోయేలోపే తేనెటీగ తేనెను చాకచక్యంగా ఆస్వాదిస్తుంది. విద్వాంసుడూ అంతే. దేనికైనా ఒక పద్ధతి ఉంటుంది. ఎంత విద్వాంసుడైనా పెద్దలు చూపిన పద్ధతుల్ని తప్పి ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తే ఫలితం పొందలేడు. పూర్వం బ్రహ్మదేవుడు నాలో ఉంచిన ఓషధులను దుర్జనులు పీల్చి పిప్పి చేశారు. ఒకవైపు యజ్ఞయాగాదులు లేవు. నాకు ఆదరణే కరువయింది. మిగిలిన కొద్దో గొప్పో ఓషధుల్ని నేను మింగివేశాను. అవి నాలో జీర్ణించుకుపోయాయి. వాటిని నువ్వు తిరిగి పొందాలంటే 'దోహనక్రియ' చేపట్టాలి. అప్పుడు నా పొదుగు నుండి వాటిని పొందవచ్చు' అని చెప్పింది.

పృథువు ఆమె చెప్పినట్లుగా మనువును దూడగా చేశాడు. తానే పాలు పితికే వాడి అవతారం ఎత్తి పితికాడు. ఓషధులు లభించాయి. జనులంతా సంతోషించారు.

ఆ తర్వాత మహర్షులూ దేవగణాలూ ఎవరికి కావలసినవాటిని వాళ్ళు భూమి నుండి పిండుకున్నారు.

పృథువు పాలనలో సుఖశాంతులు వెల్లివిరిశాయి. నూరు అశ్వమేధయాగాలు చేయాలని సంకల్పించాడు పృథువు. 99 పూర్తి చేశాడు. నూరో యాగం కోసం విడిచిన యాగాశ్వాన్ని ఇంద్రుడు రెండుసార్లు అపహరించాడు.

పృథువు కుమారుడు రెండుసార్లు ఇంద్రుణ్ణి ఓడించి ఆ అశ్వాన్ని తీసుకు వచ్చాడు. అందువల్ల ఇతడికి 'జితాశ్వుడు' అనే పేరు వచ్చింది. ఇంద్రుణ్ణి

శిక్షిద్దామని బయలుదేరాడు. కానీ బ్రహ్మదేవుడి మాటపై ఇంద్రుణ్ణి క్షమించాడు పృథుచక్రవర్తి. 99 యాగాలు చేసిన ఫలం మాత్రమే అతడికి లభించింది.

యజ్ఞభోక్త శ్రీమన్నారాయణుడే ఇంద్రుణ్ణి వెంటబెట్టుకొని వచ్చాడు. ఇంద్రుణ్ణి క్షమించమని హితవు పలికాడు.

'సజ్జనులకు శరీరంపై అభిమానం ఉండదు. అందుకే వాళ్ళు ఎవరికీ ద్రోహం తలపెట్టరు. నువ్వు తొందరపడి ఇంద్రుణ్ణి శిక్షిస్తే ఇప్పటివరకూ నువ్వు సంపాదించు కొన్న పుణ్యమంతా పోతుంది.

**శరీరం, ఆత్మ ఒకటి కాదు. ఇది తెలిస్తే శరీర గుణాలు ఆత్మకు అంటుకోవు. స్వధర్మాన్ని ఆచరిస్తూ ఏ కోరికా లేకుండా నిత్యం నన్నే సేవించేవాడి మనసెప్పుడూ ప్రశాంతంగా ఉంటుంది. కాబట్టి సుఖదుఃఖాలను ఒకేలా చూడు. జితేంద్రియుడివై ఈ లోకాన్ని పరిపాలించు.**

రాజుకు ప్రజారక్షణ ప్రథమ కర్తవ్యం. ప్రజలు చేసిన పుణ్యంలో ఆరోవంతు రాజుకు దక్కుతుంది. పరిపాలన సరిగ్గా చేయని రాజుకు ప్రజలు చేసిన పాపాలు చుట్టుకుంటాయి. ధర్మాన్ని పాటిస్తూ రాజ్యపాలన చెయ్యి. నేను యాగాలు, తపస్సులూ చేసినా లొంగను. సమచిత్తులైన సజ్జనులకు వశమౌతాను' అని వెళ్ళిపోయాడు.

పృథువు తిరిగి రాజ్యానికి వచ్చి ధర్మమార్గంలో పరిపాలన చేస్తున్నాడు. ఒకరోజు తన సభాసదుల్ని ఉద్దేశించి ఇలా హితవు పలికాడు.

'మహానుభావులారా! **ప్రజలు చేసే మంచి పనులే రాజుకు రక్ష. ధనం మీద వ్యామోహంతో రాజు పన్ను వసూలు చేయకూడదు. అలా చేస్తే ప్రజలు చేసిన పాపాలు రాజుకే సంక్రమిస్తాయి. మీరూ మంచి పనులే చేయండి. అన్ని కర్మల్నీ వాసుదేవుడికే అర్పించండి. అదే మీరు నాకు చేసే మేలు'** అన్నాడు.

'రాజా! దుర్మార్గుడైన నీ తండ్రి కూడా నీవల్ల చరితార్థుడయ్యాడు సుమా!' అని అందరూ పృథుచక్రవర్తిని కొనియాడారు.

సరిగ్గా అదేసమయానికి సనకాది మహర్షులు అక్కడికి విచ్చేశారు. అంతటి చక్రవర్తి కూడా ఎంతో వినయంగా వాళ్ళకు అతిథి మర్యాదలు చేశాడు. భక్తి

పూర్వకంగా చేతులు జోడించి ఈ సంసారాన్ని దాటగలిగే ఉపాయాన్ని చెప్పమని వాళ్ళను అర్థించాడు.

మహర్షులు అతడి వినయ సంపదకు సంతోషించి ముక్తిమార్గాన్ని ఉపదేశించారు.

ఆ మార్గంలో సాధన చేసి పృథుచక్రవర్తి ముక్తిని పొందాడు. అతడి భార్య కూడా అతణ్ణే అనుసరించింది.

ఈ పృథుచక్రవర్తి చరిత్ర పరమ పవిత్రమైనది. చదివినవారికి, విన్నవారికీ ఎన్నో పుణ్యాలను కలిగిస్తుంది.

పృథువు తర్వాత విజితాశ్వుడు రాజు అయ్యాడు. ఇతడి భార్య శిఖండిని. వీరికి పావకుడు, పవమానుడు, శుచి అనే పేర్లతో త్రేతాగ్నులే పుత్రులై జన్మించారు.

## ప్రాచీనబర్హి

ఇలా వృద్ధిచెందిన ఈ వంశక్రమంలో 'బర్హిష్మదుడు' అనే రాజు గొప్పవాడు. ఈ భూమండలాన్ని యజ్ఞవాటికలతో ముంచెత్తాడు. తూర్పుదిక్కున కొనలు కలిగిన దర్భల్ని భూమండలమంతా పరిచి 'ప్రాచీనబర్హి'గా పేరుపొందాడు. ఇతడి భార్య శతధృతి. వీరికి 'ప్రచేతసులు' అని పదిమంది పుత్రులు.

తండ్రి ఆజ్ఞపై ప్రచేతసులు ప్రజాసృష్టి కోసం తపస్సుకు బయలుదేరారు. దారిలో 'రుద్రుడు' కన్పించి నారాయణ స్తోత్రాన్ని ఉపదేశించాడు. ఈ స్తోత్రాన్ని పూర్వం బ్రహ్మదేవుడు సనకసనందనాది మహర్షులకు చెప్పాడట! ఆ స్తోత్రానికే యోగాదేశ స్తోత్రమనీ పేరు.

ప్రచేతసులు పదివేల సంవత్సరాలు ఆ స్తోత్రాన్ని పఠిస్తూ నీటి మధ్యలో ఉండి తపస్సు చేశారు. ఆ తపస్సు లోకాల్ని కంపింప జేసింది. సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడే స్వయంగా విచ్చేసి వారికి ఎన్నో వరాలను ప్రసాదించాడు. రాబోయే కాలంలో వాళ్ళు ఏమేమి చేయాలో కూడా వారికి ఆజ్ఞాపించి అంతర్ధానమయ్యాడు.

ప్రచేతసులు తపస్సు చాలించి నీటిలో నుంచి బయటకు వచ్చారు. చుట్టూ చూశారు. ఎక్కడ చూసినా చెట్లే. కాలు మోపే వీలు లేదు. కోపం వచ్చింది

వాళ్ళకు. తమ ముఖం నుండి అగ్నితో కూడిన గాలుల్ని సృష్టించారు. ఆ వేడికి చెట్లు మలమల మాడిపోతున్నాయి.

అప్పుడు బ్రహ్మదేవుడే కదలివచ్చి వాళ్ళను శాంతింపజేశాడు. చెట్లన్నీ వచ్చి తమ పుత్రిక అయిన మారిషను వీరికి సమర్పించాయి. బ్రహ్మదేవుడి ఆజ్ఞతో వాళ్ళు మారిషను వివాహం చేసుకున్నారు. పూర్వం శివుణ్ణి నిందించిన దక్షుడున్నాడే! అతడే వీరికి పుత్రుడుగా జన్మించాడు.

అక్కడ ప్రాచీనబర్హికి జ్ఞానమార్గం చూపాలని నారదుడే స్వయంగా విచ్చేసి అతడికి ఒక చక్కని కథ చెప్తున్నాడు.

## పురంజనోపాఖ్యానం

'రాజా! పూర్వం 'పురంజనుడు' అనే ఒక రాజు ఉండేవాడు. అతడికో మిత్రుడు. పేరు అవిజ్ఞాతుడు. పురంజనుడు ఒక పురం కోసం వెతుకుతున్నాడు. హిమాలయ పర్వతాల దక్షిణ సానువుల్లో ఒక పురాన్ని చూశాడు. అది అతడికి బాగా నచ్చింది.

ఆ పురంలో ఒక వనం. అందులో ఓ అందమైన యువతి. వెనుక పదిమంది అనుచరులు. ఆ పదిమందీ ఒక్కొక్కడూ నూరుగురికి నాయకుడు. ఆమెకు రక్షణగా అయిదు తలల పాము ముందు నడుస్తోంది.

రాజూ ఆ యువతి పరస్పరం ఇష్టపడి వివాహం చేసుకున్నారు. ఆమే సర్వస్వంగా రాజు కాలం గడుపుతున్నాడు. ఒకరోజు అడవికి వెళ్ళి వేటాడి ఇంటికి తిరిగి వచ్చాడు. ఇంట్లో భార్య కనిపించలేదు.

**కం. పొగడొందు జననిగానీ**
**తగవున వర్తించునట్టి దయితయకానీ**
**తగనుండని గృహమున నుం**
**టగుఁ జక్రవిహీన రథమునందుం టరయన్** (4-780)

**'స్తుతించదగిన తల్లిగానీ, ఇల్లాలుగానీ లేని ఇంట్లో ఉండటం అంటే చక్రాలు లేని రథంపై కూర్చోవటమే.'** అందుకే ఆమె ఎక్కడ ఉందా! అని వెతికి వెతికి చివరికి అంతఃపురంలో అలకలో ఉందని తెలుసుకున్నాడు. ఆమె అలక తీర్చాడు.

మళ్ళీ యథాప్రకారంగా భార్యే లోకంగా బతుకుతున్నాడు. తక్కినవేమీ పట్టించుకోడు. రాత్రీ పగలూ తేడా లేదు. ఆమెపై వ్యామోహం పోవటంలేదు. అప్పటికే అతడి సంతానం వందల్లోకి చేరుకుంది. ఆ పిల్లలకి పిల్లలు కూడా పుట్టారు. వంశం తామరతంపరగా పెరిగింది. అయినా భార్యపై ఉన్న వ్యామోహం పోలేదు. ముసలితనం వచ్చింది. ఇతడి వారసులు ఇంటి సొమ్మునే దొంగిలించే చోరులుగా మారారు. ఒకవైపు గంధర్వులు రాజ్యాన్ని ఆక్రమిస్తున్నారు. వాళ్ళతో యుద్ధం చేస్తూనే ఉన్నాడు.

ఇదిలా ఉంటే కాలుడి పుత్రిక 'దుర్భగ' 'ప్రజ్వారుడు' అనేవాడిని పెళ్ళాడింది. వీడు 'భయుడు' అనేవాడి తమ్ముడు. ఈ ప్రజ్వారుడు, కాలకన్య భయుడి సేనలతో పురంజనుడి పురాన్ని ముట్టడించారు. అన్ని ద్వారాల నుండీ సైన్యం లోపలికి ప్రవేశించింది.

పురంజనుడికి మమకారం చావలేదు. ఆ పురాన్ని విడిచిపెట్టి వెళ్ళలేక పోతున్నాడు.

ప్రజ్వారుడు ఆ నగరాన్ని దహించివేశాడు. పురంజనుణ్ణి భయుడు పశువులా ఈడ్చుకుపోతున్నాడు. అప్పటికీ పురంజయుడికి సంసార వ్యామోహం వీడిపోలేదు. మరణించాడు. నరకంలో అనేక బాధలు అనుభవించాడు. నిరంతరం భార్యనే తలుస్తూ ఉండటంవల్ల తరువాత జన్మలో స్త్రీగా విదర్భ రాజకుమార్తెగా జన్మించాడు. ఈమెను పాండ్యరాజు 'మలయకేతనుడు' వివాహమాడాడు. వీళ్ళకు అర్బుద సంఖ్యలో పుత్రులు కలిగారు.

తరువాత రాజు నూరు దివ్యసంవత్సరాలు తపస్సు చేసి పరమ పదాన్ని పొందాడు. భార్య కూడా సహగమనానికి పూనుకుంది. అప్పుడు ఒక విజ్ఞానియైన బ్రాహ్మణుడు ఆమెవద్దకు వచ్చాడు. 'మిత్రమా! గుర్తున్నానా! నేను నీ మిత్రుణ్ణి. పూర్వజన్మలో మనం హంసలం. మానస సరోవరంలో విహరించేవాళ్ళం. తరువాత నువ్వు ఒక పురాన్ని చూసి అందులోనికి ప్రవేశించావు. అలా ప్రవేశించిన పురంజనుడివి నువ్వే! అంటూ ఆ కథను గుర్తుచేసి ఆ పురమే శరీరమని విపులంగా చెప్పాడు ఆ బ్రాహ్మణుడు.

ఇదంతా నా మాయే. మనమిద్దరం హంసలం. నువ్వు జీవాత్మవి. నేను పరమాత్మని. జీవుడు తొమ్మిది ద్వారాలలో రెండు చేతులు, రెండు పాదాలు ఉండే శరీరంలోనికి ప్రవేశించాలనుకొంటాడు. ఆ దేహమే పురం. పురంజనుడిగా నువ్వు ప్రవేశించిన పురం అదే. నువ్వు పురంజనుడిగా ఉన్నప్పుడు నీ మిత్రుడు విజ్ఞాతుడు ఉన్నాడే. అది నేనే. పరమాత్మను.

జీవుడు బుద్ధిని ఆశ్రయించి ఇంద్రియాలతో సుఖాలను పొందుతాడు. నువ్వు చేపట్టింది బుద్ధి అనే స్త్రీని. అయిదు ఇంద్రియాలు బుద్ధికి స్నేహితులు. అందుకే అయిదుగురు ఆమెతో ఉన్నారు.

అయిదు తలల పాము అయిదు రూపాలలో ఉండే ప్రాణం. ఆ పురం చుట్టూ ఉండే తొమ్మిది ద్వారాలే నవరంధ్రాలు అంటూ శరీరానికీ పురానికీ పోలికలు చెప్తూ వివరించాడు.

**కాబట్టి జీవుడికి ఈ సంసారం తొలగిపోవాలంటే వాసుదేవుడి పాదాలే దిక్కు. అందుకు ఏం చేయాలంటే భాగవతుల్ని సేవించాలి. భగవంతుడి కథల్ని వినాలి. శ్రీహరినే నమ్ముకోవాలి. ఏకాగ్రతతో ధ్యానించాలి' అంటూ నారదుడు ఉపదేశించాడు. 'ప్రాచీనబర్హి' ఆ మార్గంలోనే సాధన చేసి విముక్తిని పొందాడు.**

ఇతడి కుమారులు ప్రచేతసులు కూడా తిరిగి తపస్సు ప్రారంభించారు. వీళ్ళ దగ్గరికీ నారద మహర్షి విచ్చేశాడు.

**'మహాత్ములారా! గోవిందుణ్ణి సేవించే జన్మే జన్మ. ఆ పురుషోత్తముడి కీర్తన లేకుండా ఎన్ని కర్మలు చేసినా అవన్నీ బూడిదలో పోసిన పన్నీరే. కాబట్టి ఆ శ్రీమన్నారాయణుడినే నిరంతరం ధ్యానించండి'** అని హితవు పలికాడు.

**మైత్రేయుడి మాటలు విన్న విదురుడూ, శుక మహర్షి బోధనల ద్వారా పరీక్షిన్మహారాజూ, సూత మహర్షి వ్యాఖ్యానం వల్ల శౌనకాది మహర్షులూ శ్రీహరి తత్త్వం తెలుసుకొని భక్తితో శ్రీమన్నారాయణుడిని ధ్యానించారు.**

# పంచమ స్కంధం

'శౌనకాది మహర్షులారా! పరీక్షిన్మహారాజు ప్రియవ్రతుడి వృత్తాంతాన్ని చెప్పమని వేడుకొన్నాడు. శుక మహర్షి చెబుతున్నాడు.

## ప్రియవ్రతుడి కథ

'రాజా! పూర్వం ప్రియవ్రతుడు' 'అధ్యాత్మ సత్రయాగం' అనే ఒక యాగాన్ని తలపెట్టాడు. తండ్రి ఇతణ్ణి రాజ్యపాలన చేయమన్నాడు. ఇతడు వినలేదు. చివరికి బ్రహ్మదేవుడే వచ్చి 'ఇది నారాయణుడి ఆజ్ఞ. లోకంలో ఎవరికీ స్వాతంత్ర్యం లేదు. ఆ పరంధాముడి ఇష్టం ప్రకారం నడుచుకోవలసిందే!' అని హితవు పలికాడు. ప్రియవ్రతుడు ఒప్పుకొన్నాడు.

పట్టాభిషేకం జరిగింది. ప్రియవ్రతుడు రాజై విశ్వకర్మ కుమార్తె అయిన బర్హిష్మతిని పెళ్ళాడాడు. వీళ్ళకు పదిమంది పుత్రులు, ఒక కుమార్తె కలిగారు. వీళ్ళలో ముగ్గురు బ్రహ్మచర్యం చేపట్టి తపస్సు చేసుకొంటూ ముక్తిని పొందారు. అప్పుడు ప్రియవ్రతుడు మరో భార్య ద్వారా ముగ్గురు కుమారుల్ని పొందాడు. వాళ్ళు ఉత్తముడు, తామసుడు, రైవతుడు. తరువాత ప్రియవ్రతుడు పదకొండు అర్బుద సంవత్సరాలు రాజ్యాన్ని పాలించాడు.

ఒకసారి ఇతడు సూర్యుడికి అవతల ఉండే చీకటిని రూపుమాపాలని రథంపై బయలుదేరాడు. ఆ రథచక్రాల రాపిడికి గాడిపడి సప్తసముద్రాలు ఏర్పడ్డాయి. వాటి మధ్య భాగంలోని భూములే సప్తద్వీపాలయ్యాయి. అవే జంబూ, ప్లక్ష, శాల్మలీ, కుశ, క్రౌంచ, శాక, పుష్కర ద్వీపాలు. వాటిలో జంబూద్వీపం లక్ష యోజనాల విస్తీర్ణం కలది.

ఈ ద్వీపాలు ఒకదానికంటే ఒకటి రెట్టింపు వైశాల్యంలో ఉంటాయి. ఈ ద్వీపాల మధ్యలో ఉప్పు, చెరకు, మద్యం, నెయ్యి, పాలు, పెరుగు, మంచినీటి

సముద్రాలు ఉన్నాయి. ఒక ద్వీపంతో ఇంకో ద్వీపం కలసిపోకుండా ఉండేందుకే ఈ సముద్రాలు ఏర్పడ్డాయి. ఇది ఒక అద్భుతం.

ప్రియవ్రతుడు తన మొదటి ఏడుగురు కుమారులకూ ఒక్కొక్క ద్వీపాన్ని ఇచ్చాడు. కుమార్తెను భార్గవుడికి ఇచ్చి వివాహం చేశాడు. చివరికి అన్నీ విడిచి ముక్తిని పొందాడు. ఇతడి వంశం క్రమంగా వృద్ధి చెందింది.

ఇతడి వంశంలోనే 'నాభి' అనే చక్రవర్తి ఉన్నాడు. అతడి భార్య మేరుదేవి. వీరికి శ్రీమన్నారాయణుడే పుత్రుడిగా అవతరించాడు, పేరు ఋషభుడు.

## ఋషభావతార కథ

సంతానం కోసం నాభి మేరుదేవితో కలసి వాసుదేవుణ్ణి పూజించాడు. ఆ పుణ్యం వల్ల శ్రీహరి తానే ఆ పుణ్యదంపతులకు 'ఋషభుడు' అనే పేరుతో అవతరించాడు.

ఋషభుడు పెరిగి పెద్దవాడైన తరువాత నాభి అతడికి రాజ్యాన్ని అప్పగించి తాను బదరికాశ్రమానికి వెళ్ళిపోయాడు.

ఋషభుడి భార్య ఇంద్రుడి కుమార్తె జయంతి. వీరికి భరతుడు మొదలైన వందమంది పుత్రులు జన్మించారు. ఈ భరతుడి పేరుమీదనే అప్పటివరకు అజనాభం అనే పేరు కలిగిన వర్షం **భరతవర్షంగా** ప్రసిద్ధికెక్కింది.

భరతుడు తన సోదరులలో తొమ్మిదిమందిని తొమ్మిది ప్రాంతాలకు ప్రధానులుగా నియమించాడు. ఆ ప్రాంతాలకూ వారివారి పేర్లమీదనే ప్రసిద్ధి లభించింది. తక్కిన సోదరులూ అన్నగారి మాటను జవదాటని ఉత్తములు.

ఋషభుడు కొంతకాలం రాజ్యపాలన చేసి, తరువాత రాజ్యాన్ని కొడుకులకు అప్పగించాలనుకొన్నాడు. ఒకరోజు అందర్నీ రమ్మని పిలిచి ఇలా అన్నాడు–

'నాయనలారా! **కామానికి లొంగితే కుక్కపాట్లు పడాలి. తపస్సు వల్లనే సుఖమూ, ఆనందమూ లభిస్తాయి. కోరికలకు దూరంగా ఉండండి. తపస్సుకు దగ్గరవ్వండి. దీనుల్ని, వృద్ధుల్ని రక్షించండి. స్త్రీవ్యామోహం సంసారాన్ని నరకం చేస్తుంది. సజ్జన సాంగత్యం మోక్షానికి బాటలు వేస్తుంది. శరీరం అశాశ్వతం!**

**దానికోసం పాపాలు చేయకండి. నామీదే దృష్టి నిలపండి. మీకు నాపై భక్తి కుదరనంతవరకూ తిప్పలు తప్పవు. ఎంతటి విద్యావంతులైనా శరీర సుఖం కోసం అర్రులు చాస్తే పతనం తప్పదు. నేను, నాది అన్న వ్యామోహమే సంసారిని అష్టకష్టాల పాలు చేస్తుంది. మీకు మోక్షాన్ని పొందే మార్గాలు చెప్తాను వినండి.**

**నిశ్చలమైన భక్తి, ఇంద్రియ నిగ్రహం, కోరికలు లేకపోవటం, సహనం, సహానుభూతి, జ్ఞానం, తపస్సు, సత్కథాశ్రవణం, భగవంతుడి గుణాలను కీర్తించడం, సమబుద్ధి, నిరహంకారం, యోగం, కర్తవ్యనిష్ఠ, శ్రద్ధ, బ్రహ్మచర్యం, అన్నింటిలో నన్నే చూడటం మొదలైనవి ముక్తిమార్గాలు. ఇవి అందరికీ తెలియవు. తెలిసినవాడు చెప్పాలి. అందుకే నేను మీకు చెప్తున్నాను. వీటిని మీరు ఆచరించండి. మీ అన్న భరతుడు చెప్పినట్లు నడుచుకోండి'** అంటూ ఇంకా ఎన్నో ధర్మాలు, సృష్టిరహస్యాలూ పుత్రులకు ఉపదేశించాడు ఋషభుడు. తరువాత రాజ్యాన్ని భరతుడికి అప్పగించి జడుడిలా, చెవిటివాడిలా, మూగవాడిలా, పిచ్చివాడిలా తిరుగుతూ కాలం గడిపాడు. తనను ఎవరూ గుర్తుపట్టకూడదని కొన్నాళ్ళు కొండచిలువలా పడి ఉన్నాడు. చివరికి పరబ్రహ్మంలో ఐక్యమైపోయాడు.

## భరతుడి చరిత్ర

భరతుడు రాజ్యాన్ని చేపట్టి విశ్వరూపుడి పుత్రిక అయిన 'పంచజని'ని వివాహమాడాడు. వీళ్ళకు ఐదుగురు పుత్రులు జన్మించారు.

భరతుడు వేదోక్తంగా కర్మల్ని ఆచరిస్తూ యాభైలక్షల సంవత్సరాలు రాజ్య పాలన చేసి చివరికి పుత్రులకు రాజ్యాన్ని అప్పగించి పులహాశ్రమానికి వెళ్ళాడు. అక్కడ తపస్సు చేసుకోవటం ప్రారంభించాడు. ఒకరోజు నీటిలో నిలబడి సంధ్యా వందనం చేస్తున్నాడు. నిండు చూలాలుగా ఉన్న ఒక జింక వచ్చి ఆ నదిలోనే నీళ్ళు తాగుతోంది. అంతలో సింహగర్జన విని భయంతో ఒక్క గెంతు గెంతింది ఆ జింక. అంతే! దాని గర్భంలో నుండి పిల్ల జారి నీటిలో పడింది. జింక మరణించింది. తల్లిలేని పిల్లను చూచి భరతుడు జాలితో దాన్ని రక్షించాడు. తన ఆశ్రమానికి తీసుకువెళ్ళాడు.

అప్పటినుండీ దాని ఆలనా పాలనా చూడటంతోనే సరిపోయేది భరతుడికి. క్రమంగా తపస్సు, అనుష్ఠానం అన్నీ అటకెక్కేశాయి. ఒకసారి ఆ జింకపిల్ల

కనిపించకుండా పోయింది. తల్లడిల్లిపోయాడు భరతుడు. చివరికి తిరిగి వచ్చింది. అప్పటికిగానీ భరతుడి మనస్సు కుదుటపడలేదు. ఈ విధంగా ఆ జింకనే తలుచు కుంటూ చివరికి మరణించాడు. అలా మరణించటంవల్ల తరువాత జన్మలో జింకగా పుట్టాడు. అయితే హరిభక్తి కారణంగా అతడికి పూర్వజన్మజ్ఞానం వచ్చింది. తాను ఇలా ఎందుకయ్యాడో కూడా తెలిసివచ్చింది. జింకలా సంచరిస్తూ మళ్ళీ పులహాశ్రమానికి చేరుకున్నాడు. అక్కడ ఆ జింక శరీరాన్ని విడిచిపెట్టాడు. తరువాత జన్మలో ఒక బ్రాహ్మణుడికి జన్మించాడు.

ఈ జన్మలోనూ అతడికి పుట్టుక నుంచీ హరిభక్తి అలవడింది. నిత్యం శ్రీహరినే ధ్యానిస్తూ ఉంటే అతడిని చూసి అందరూ పిచ్చివాడేమోననుకున్నారు. కొంతకాలానికి తండ్రి మరణించాడు. సవతి సోదరుల దగ్గరే ఇతడు ఉండేవాడు. వాళ్ళు మూర్ఖులు. ఇతణ్ణి నానా మాటలూ అనేవాళ్ళు. అడ్డమైన పనులూ చేయించేవాళ్ళు. వాళ్ళు అంతలా రాచిరంపాన పెట్టినా భరతుడికి ఎంతమాత్రం బాధ కలిగేది కాదు. సోదరులు ఇతణ్ణి పొలానికి కాపలాపెట్టారు.

వీళ్ళు ఉంటున్న రాజ్యానికి రాజు వృషలుడు. ఇతడికి సంతానం లేదు. ఎవరినైనా భద్రకాళికి బలి ఇస్తే సంతానం కలుగుతుందని ఎవరో చెప్పారు. ఎవరినైనా తీసుకురమ్మని భటుల్ని పంపాడు. ఆ భటులు ఈ భరతుణ్ణి పట్టుకొని తీసుకువచ్చారు. బలిపీఠంపై ఎక్కించి బలి ఇవ్వబోయారు. అంతలో కాళికాదేవి ప్రత్యక్షమయ్యింది.

భరతుడి ముఖంలోని బ్రహ్మతేజస్సు చూసి 'భద్రకాళి' వణికిపోయింది. రాజు పైనా అతడి పరివారంపైనా విరుచుకుపడింది. ఎక్కడివాళ్ళు అక్కడ పారిపోయారు.

భరతుడు ఇంటికి తిరిగివచ్చి యథాప్రకారం పొలానికి కాపలా ఉంటున్నాడు. కొంతకాలం తర్వాత సింధుదేశపు రాజు 'రహూగణుడు' కపిల మహర్షిని కలిసి అతడి నుండి తత్త్వజ్ఞానం పొందాలని పల్లకిపై అటువైపు వెళ్తున్నాడు. ఆ పల్లకి బోయీలు ఈ భరతుడిచేత పల్లకి మోయించారు.

పల్లకి మోయటం అలవాటులేదు భరతుడికి. ఎలాబడితే అలా నడుస్తున్నాడు. దానివల్ల రాజుకు అసౌకర్యంగా ఉంది. కారణం తెలుసుకొని రాజు భరతుణ్ణి నిందించాడు. ఆ మాటలకు భరతుడు బాధపడలేదు. చిరునవ్వు చిందిస్తూ

'రాజా! నీ మాటలు నన్ను బాధపెట్టలేవు. ఏమీ పట్టని జడుడిలా ఉన్న నన్ను ఏమన్నా ప్రయోజనం లేదు. రాజునన్న అహంకారంతో నువ్వు నన్ను నిందిస్తున్నావు' అంతే! అన్నాడు.

రాజు నిర్ఘాంతపోయాడు. అతడెవరో మహానుభావుడనుకొని పల్లకి దిగి కాళ్ళపైపడ్డాడు. 'మహానుభావా! నన్ను అనుగ్రహించడానికి మారువేషంలో వచ్చిన కపిల మహర్షివా? ఎందుకిలా సంచరిస్తున్నావు?' అని అడిగాడు.

భరతుడు ఇలా సమాధానం ఇచ్చాడు –

## మోక్షమార్గం

రాజా! పొయ్యిమీద పెట్టిన కుండ వేడెక్కుతుంది. ఆ వేడివల్ల అన్నం ఉడుకుతుంది. అలాగే జీవుడు శరీరాన్ని ఆశ్రయించి సంసారంలో శిక్షను అనుభవిస్తాడు. శ్రీహరిని సేవిస్తే దానినుండి విముక్తి లభిస్తుంది.

ఈ ప్రపంచం మిథ్య. గుణాలు ఉన్నంతకాలం ధర్మాధర్మాలు పుడుతూనే ఉంటాయి. గుణాలు నశిస్తేనే ముక్తి. అందుకే ముందు మనస్సును బంధించాలి. దానికి ఆయుధం హరిభక్తి.

ఫలానికి మూలం కర్మ. దానికి కారణం సంసారం. సంసారంలో మనస్సు చిక్కుకొని తిరుగుతున్నంతసేపూ తత్త్వం బోధపడదు. నీకు అహంకారం ఉంది. శరీరంపై మమకారమూ కావలసినంత. అందుకే ఈ గర్వం. జనుల్ని బెదిరిస్తున్నావు. కాబట్టి నీకు పూజార్హత లేదు.

అవిద్య, మనస్సులచే కల్పితమైన మాయవల్ల ఈ జగత్తు పుట్టింది. బ్రహ్మ ఒక్కటే సత్యం. అదే భగవంతుడు. జగత్తు మిథ్య. తపస్సు ద్వారా కూడా లభించని బ్రహ్మజ్ఞానం భాగవతుల్ని సేవిస్తే లభిస్తుందని పెద్దలు చెబుతారు. అదే మోక్షమార్గం. నేను పూర్వం భరతుడు అనే పేరుగల చక్రవర్తిని. ఇప్పుడు అన్నీ విడిచిపెట్టిన వాణ్ణి.

పెద్దలను సేవించినవాడు సంసారమోహంలో పడడు. మోక్షాన్ని పొందుతాడు. మాయకు లోబడ్డవాడు దేశాలుపట్టి ఏదో కావాలని తిరుగుతూ ఉంటాడు.

**ఈ సంసారం ఒక పెద్ద అడవి. కామం క్రోధం మొదలైనవి దొంగలు. ఇంద్రియాలకు వశమైన మానవుల్ని ఈ దొంగలు పట్టి పీడిస్తారు. దాచుకున్న పుణ్యం అనే ధనాన్ని దోచుకుంటారు. భార్యాపుత్రులు తోడేళ్ళలాంటివాళ్ళు. అడవిలో కొరివి దెయ్యాన్ని చూసి నిప్పు అని భ్రమపడినట్లు ధనం కోసం మానవుడు అందరి చుట్టూ తిరుగుతాడు. తాపత్రయాలు, కక్షలు, కార్పణ్యాలు ముళ్ళై గుచ్చు కుంటాయి. కాబట్టి రాజా! జ్ఞానం అనే ఖడ్గంతో ఈ ముళ్ళదారిని సరిచేసుకోవాలి. ఎల్లప్పుడూ శ్రీహరినే మనసులో నిలుపుకోవాలి' అంటూ హితబోధ చేశాడు.**

రాజుకు జ్ఞానోదయం అయింది.

భరతుడి తరువాత అతడి కొడుకులు రాజులై రాజ్యపాలన చేశారు. ఇతడి వంశమూ పుత్రపౌత్రాభివృద్ధిగా విస్తరించింది. ఈ వంశంలోనే 'గయుడు' అనే ఒక సద్గుణ సంపన్నుడు విష్ణుభక్తుడిగా ఉత్తముడిగా పేరుతెచ్చుకున్నాడు. సత్కర్మలను ఆచరిస్తూ విష్ణుభక్తులను సేవిస్తూ చక్కగా పరిపాలన సాగించాడు. ప్రియవ్రతుడి వంశంలో చివరివాడు విరజుడు. ఇతడూ ఉత్తముడని పేరుతెచ్చుకున్నాడు.

'రాజా! ఇదయ్యా ప్రియవ్రతుడి వంశ చరిత్ర' అంటూ శుక మహర్షి ఇంకా భూగోళం గురించీ, భగోళం (నక్షత్రగోళం) గురించీ విపులంగా చెప్పాడు. ఆ తర్వాత నరక లోకం గురించీ పూసగుచ్చినట్లు వివరించాడు.

మునులారా! అంతా విన్న పరీక్షిత్తు ఎంతో ఆనందించాడు. హరిభక్తి గొప్పతనాన్ని తెలుసుకొని తన్మయత్వంతో శ్రీహరికి నమస్కరించాడు.' అన్నాడు సూతమహర్షి.

ఆ సూత మహర్షి మాటలు విన్న శౌనకాది మహర్షులు తాము అమితమైన జ్ఞానాన్ని పొందామని ఆనందంతో కృతజ్ఞతగా సూతమహర్షికి నమస్కరించారు.

# షష్ఠ స్కంధం

భాగవతం ఒక మహామంత్రం. నైమిశారణ్యంలో ఆ మంత్రాన్నే జపిస్తున్నారు సూతమహర్షి, శౌనకాది మహామునులూ, గంగానదీ తీరంలో శుక మహర్షి, పరీక్షిత్తూ.

సూత మహర్షి ఇలా అన్నాడు –

'మునులారా! పరీక్షిత్తు కోరికపై శుక మహర్షి ఇలా చెప్తున్నాడు.

'రాజా! దేనికైనా త్రికరణశుద్ధి ఉండాలి. అది లేకపోతే నరకయాతనలు పడక తప్పదు. తెలివైన వైద్యుడు రోగానికి కల మూలకారణాన్ని కనిపెడతాడు. దాన్ని తొలగిస్తే చాలు రోగం తగ్గిపోతుంది. అలాగే మానవుడు పాపాలకు ఏది కారణమో దాన్ని అంతం చేసుకోవాలి' అన్నాడు. పరీక్షిత్తు దీర్ఘంగా ఆలోచిస్తూ–

మహర్షీ! 'పాపమే నరకహేతువు' అని అందరికీ తెలుసు. కానీ ఎవడైనా పాపం చేయకుండా ఉంటున్నాడా? లేదే. పాపం చేయటం, అయ్యో అనుకోవటం, మళ్ళీ పాపం చేయటం ఇదే అలవాటైపోయింది. తెలిసికూడా పాపం చేసే ఇలాంటి మూఢుడికి పాపపరిహారం ఉంటుందా? అని అడిగాడు.

దానికి సమాధానంగా ఒక చిరునవ్వు నవ్వి, శుక మహర్షి ఇలా ప్రారంభించాడు.

## అజామిళుడి కథ

రాజా! పూర్వం 'అజామిళుడు' అనే పేరుగల ఒక బ్రాహ్మణుడు కన్యాకుబ్జం అనే నగరంలో ఉండేవాడు. ఇతడికి లేని చెడ్డ గుణం లేదు. కటిక దరిద్రుడు. పదిమంది కొడుకులు. చేయకూడనివన్నీ చేశాడు. చివరికి ముసలితనంలో కాటికి కాలుచాచి చావడానికి సిద్ధంగా ఉన్నాడు. అయితే అతడి కొడుకులలో చిట్టచివరివాడి

పేరు నారాయణుడు. వాడంటే అజామిళుడికి ఎంతో ఇష్టం. ఆ చివరి ఘడియల్లో కొడుకుపై వ్యామోహంతో 'నారాయణా! నారాయణా! అని అరుస్తున్నాడు.

అజామిళుడి ప్రాణాలు తీసుకువెళ్ళటానికి యమకింకరులు వచ్చారు. వాళ్ళను చూసిన అజామిళుడు వణికిపోయాడు. ఒకప్రక్క కొడుకుపై మమకారంతో, నారాయణ! నారాయణ! అంటూనే ఉన్నాడు.

యమకింకరులు పాశం వేసి అతడి ప్రాణాలు గుంజుతున్నారు. ఇంతలో 'ఆగండి, ఏమిటి మీరు చేస్తున్న పని?' అన్న మాటలు వినిపించాయి. అటువైపు చూశారు యమకింకరులు. ఎవరో దివ్యపురుషులు, ధగధగా వెలిగిపోతున్నారు.

అప్పుడు యమకింకరులు 'అయ్యా! మీరెవరు? ఇది యమధర్మరాజు ఆజ్ఞ' అన్నారు.

ఓహో! మీరు యమకింకరులా! సరే! మేం విష్ణుదూతలం. ఇతడు ఏం పాపం చేశాడని మీరు ఇలా శిక్షిస్తున్నారు? అసలు పాపం అంటే ఏమిటి? చెప్పండి! అని గద్దించారు.

యమకింకరులు వినయంగా

**కం. వేదప్రణిహితమే యను**
**మోదంబుగ ధర్మమయ్యె మున్ను తదన్యం**
**బేదియగు నది యధర్మం**
**బాదియు హరిరూపు వేదమన విను కతనన్** (6-84)

'అయ్యా! వేదాలలో చెప్పిన విధంగా అందరూ ఆచరించేదే ధర్మం. వేదాల్లో చెప్పనిది ఏదైనా అధర్మమే. ఆ ధర్మం నారాయణ స్వరూపం. సమస్త ప్రాణులకూ వాటివాటి కర్మలనుబట్టి శిక్షలు ఉంటాయి. ఇప్పుడు మీరు ఈ క్రమానికి అడ్డు తగిలారు. **లోకంలో జనులు మూడు రకాలుగా ఉంటారు. కొందరు శాంతమూర్తులు. వీరిది ధర్మమార్గం. మరికొందరు ఘోరమైన స్వభావం కలవాళ్ళు. వీళ్ళది అధర్మ మార్గం. ఇంకొందరు మూర్ఖులు. వీళ్ళు అటూ ఇటూ కాకుండా ఉంటారు.**

యమధర్మరాజు ధర్మస్వరూపుడు. ఏది ధర్మమో ఏది అధర్మమో ఆయనే నిర్ణయిస్తాడు. ఈ అజామిళుడు పూర్వజన్మలో కొన్ని మంచి పనులు చేశాడు.

అందుకే ఈ జన్మలో ఉత్తముడిగా పుట్టాడు. కానీ ఏం లాభం? మొదట మంచివాడే. తరువాత కామానికి వశుడైపోయాడు. స్త్రీకి దాసుడైపోయాడు. చేయకూడని పనులన్నీ చేసిన పాపాత్ముడు వీడు. అందుకే నరకానికి తీసుకుపోతున్నాం' అన్నారు.

అప్పుడు విష్ణుదూతలు నవ్వుతూ 'ఓహో! ఇదేనా? మీ వివేకం. ఇలాంటి పుణ్యాత్ముణ్ణి నరకానికి తీసుకువెళ్తారా?

**ఆ.వె. ఎఱుక గలుగు నాతఁ డేది యొనర్చిన**
**నదియ చేతు రితరులైన వార**
**లతఁడు సత్యమిట్టి దనెనేని లోకంబు**
**తత్ప్రవర్తనమునఁ దగిలియుండు.** (6-113)

**'జ్ఞానం కలవాడు ఏది చేస్తే దాన్నే లోకం అనుసరిస్తుంది. అతడు నిర్ణయించినదే సత్యం. అజామిళుడు ఎన్నో పాపాలు చేశాడు. నిజమే! కానీ చివరి దశలో శ్రీహరి నామాన్ని పలికి, పుణ్యాత్ముడు అయ్యాడు.**

**కం. డెందంబు పుత్రువలనన్**
**జెందినదని తలఁపవలదు శ్రీపతి పేరే**
**చందమున నైనఁ బలికిన**
**నందకధరుఁ డందె కలఁడు నాథుం డగుచున్** (6-121)

**ఇతడు కొడుకుపై ప్రేమతో నారాయణా! అని పిలిచాడు గానీ భక్తితో కాదు కదా! అన్న సందేహం వద్దు. ఏ రూపంగా పిలిచినా అందులో శ్రీమన్నారాయణుడు ఉంటాడు. బ్రహ్మ మొదలైనవారికి కూడా అందని మోక్షం హరినామస్మరణ వల్ల కలుగుతుంది. ఏ రకంగా చేసినా ఫలితం వచ్చి తీరుతుంది**' అన్నారు.

యమకింకరులకు కనువిప్పు కలిగింది. అజామిళుడి బంధనాలు తొలగించి విష్ణుదూతలకు నమస్కరించి వెళ్ళిపోయారు.

అజామిళుడు ఊపిరి పీల్చుకొన్నాడు. విష్ణుదూతలకు నమస్కరించాడు. వాళ్ళు వైకుంఠానికి వెళ్ళిపోయారు. **తరువాత అజామిళుడు బుద్ధి తెచ్చుకుని శ్రీహరినే ధ్యానిస్తూ ముక్తిని పొందాడు.**

**కం. హరిభక్తులతో మాటలు**
**ధర నెన్నఁడుఁ జెడని పుణ్యధనముల మూటల్**
**వరముక్తికాంత తోటలు**
**నరిషడ్వర్గంబు చొరని యరుదగు కోటల్** (6-153)

**హరిభక్తుల మాటలు నాశనం లేని పుణ్యాల మూటలు. ముక్తి అనే కాంత విహరించే తోటలు. అరిషడ్వర్గం చొరబడని అరుదైన కోటలు.**

## యముడి శాసనం

యమకింకరులు వెళ్ళి జరిగినదంతా యమధర్మరాజుకు చెప్పారు. అప్పుడు యముడు తన సేవకులతో 'హరినామ సంకీర్తన గొప్పతనం ఇప్పటికైనా అర్థ మయ్యిందా? ఇకనుండి హరిభక్తుల జోలికి వెళ్ళకండి. హరిభక్తులు కానివాళ్ళను మాత్రం రెక్కలు విరిచిమరీ ఇక్కడికి తీసుకురండి' అని ఆజ్ఞాపించాడు.

**రాజా! యథాలాపంగా హరిని స్మరించినందుకే అజామిళుడు మోక్షాన్ని పొందాడే! మరి ఇష్టంగా ఆ శ్రీహరిని ధ్యానిస్తే ఎంత ఫలితం వస్తుందో వేరే చెప్పాలా? అంటూ తన ప్రవచనాన్ని కొనసాగించాడు.**

## సృష్టి విస్తరణ

'రాజా! ప్రచేతసులకూ, మారిష అనే కన్యకూ దక్షుడే తిరిగి జన్మించాడని చెప్పాను కదా! ఆ దక్షుడు సృష్టిని విస్తరింపజేయడానికి పూనుకున్నాడు. సుర-గరుడ-ఉరగ-యక్ష-కింనర-కింపురుషాది గణాలను, పర్వతాలను, నదులను, వృక్షాలను సృష్టించాడు. అయినా తృప్తి కలగలేదు. తపస్సు చేశాడు. శ్రీమన్నారాయణుడు ప్రత్యక్షమయ్యాడు. అప్పుడు దక్షుడు 'హంసగుహ్యస్తవరాజం' అనే స్తోత్రంతో శ్రీహరిని స్తుతించాడు.

తరువాత శ్రీహరి ఆజ్ఞమేరకు పంచజన ప్రజాపతి కుమార్తె 'అసిక్ని'ని వివాహం చేసుకొని ప్రజాసృష్టికి నాందిపలికాడు. వీళ్ళకు హర్యశ్వులు అనే పేరు కలిగిన పదివేలమంది పుత్రులు కలిగారు. వీళ్ళు సంసారంవద్దు. మోక్షంకోసం ప్రయత్నిస్తామన్నారు. వీళ్ళకి ఈ ఆలోచన కలిగించినది నారదమహర్షి.

నారదుడి హితబోధలో వాళ్ళందరూ నివృత్తిమార్గం వెతుక్కుంటూ వెళ్ళిపోయారు. ఈసారి దక్షుడు 'శబళాశ్వులు' అనే వేయిమంది పుత్రుల్ని పొందాడు. వాళ్ళనూ నారదుడు అదే బాట పట్టించాడు.

ఇలా చేసినందుకు దక్షుడికి నారదుడిపై కోపం వచ్చింది. 'నువ్వు లోక సంచారం చేస్తూ ఉంటావు' అని నారదుణ్ణి శపించాడు. తనను శపించినా నారదుడు అతణ్ణి ఏమీ అనలేదు. తాను బాధపడనూలేదు. అంతటి శాంతమూర్తి నారద మహర్షి.

దక్ష ప్రజాపతి ఈసారి 60 మంది పుత్రికల్ని పొందాడు. వాళ్ళందరినీ పెంచి పెద్దచేసి వివాహాలు జరిపించాడు. వీళ్ళ ద్వారానే సమస్త గణాలూ పుట్టాయి.

కశ్యపుడి భార్యలలో వినత, కద్రువ, పతంగి, యామిని మొదలైన వాళ్ళున్నారు. వినతకు అనూరుడు, గరుత్మంతుడూ జన్మించారు. అనూరుడు సూర్యుడికి సారథి అయ్యాడు. గరుత్మంతుడు శ్రీమహావిష్ణువుకు వాహనం అయ్యాడు. కద్రువకు నాగులు, పతంగికి పక్షులు, యామినికి మిడతలు సంతానం. దనువుకు దానవులూ తిమికి జలచరాలూ, అరిష్టకు గంధర్వులూ సంతానం.

దనువు సంతానంలో వృషపర్వుడు అనే దానవుడికి 18 మంది పుత్రులు. వారిలో స్వర్భానువు ఒకడు. ఇతడికి సుప్రభ అనే కుమార్తె ఉంది. ఈమెను 'నముచి' పెళ్ళి చేసుకున్నాడు. వృషపర్వుడికి శర్మిష్ఠ అనే మరో కుమార్తె ఉంది. ఆమెను యయాతి మహారాజు పెళ్ళిచేసుకున్నాడు.

పురాణపురుషుడైన శ్రీమన్నారాయణుడే అదితికి పుత్రుడై జన్మించాడు. ఇంకా అదితికి కలిగిన 12 మంది పుత్రులలో వామనుడు ఒకడు. ద్వాదశ ఆదిత్యులలో ఒకడైన వివస్వంతుడికి (సూర్యుడికి) సంజ్ఞాదేవియందు మనువు, యముడు, యమున, అశ్వినీదేవతలూ, ఛాయాదేవియందు శనైశ్చరుడు, సావర్ణి అనే పుత్రులూ, తపతి అనే కుమార్తె కలిగారు. తపతి సంవరణుణ్ణి వివాహమాడింది. అదితి పుత్రుడైన అర్యముడికీ, అతడి భార్య మాతృకకూ చర్షణులు పుట్టారు. వీరి ద్వారా మనుష్యజాతి విస్తరించింది.

## దేవేంద్రుడి గర్వం

దేవేంద్రుడు అధికారగర్వంతో ఒకసారి బృహస్పతిని సరిగా గౌరవించలేదు. బృహస్పతికి కోపం వచ్చింది. దేవేంద్రుడు తన తప్పు తెలుసుకొని బృహస్పతి ఇంటికి వెళ్ళాడు కానీ బృహస్పతి ఎక్కడా కనిపించలేదు. ఇదే తగిన సమయమని దానవులు దేవతలపై దండెత్తారు.

'గురువును గౌరవించకపోవడమే ఈ అనర్థానికి కారణం. ప్రజాపతియైన త్వష్ట కుమారుడు విశ్వరూపుణ్ణి గురువుగా ఉండమని అభ్యర్థించండి' అని బ్రహ్మదేవుడు దేవతలకు సలహా ఇచ్చాడు.

## విశ్వరూపుడు - నారాయణకవచం

దేవతలు వెళ్ళి విశ్వరూపుణ్ణి ప్రార్థించారు. దానికి విశ్వరూపుడు 'నేను మీకు ఆచార్యుడిగా ఉంటే నా తేజస్సు తగ్గిపోతుంది. అయినా అంగీకరిస్తున్నాను. గురువు ప్రత్యేకంగా ధనాన్ని కూడబెట్టవలసిన అవసరం లేదు. శిష్యులే గురువుకు తరగని ధనం.' అంటూ వారిని అనుగ్రహించాడు. శుక్రాచార్యుడు తన విద్యచేత దోచి మరీ దనుజుల కిచ్చిన స్వర్గసంపదకు రెట్టింపు ఐశ్వర్యం దేవతలకు వచ్చేలా చేశాడు. ఇంద్రుడికి నారాయణ కవచాన్ని ఇలా ఉపదేశించాడు.

'సకల ఆయుధాలను ధరించి గరుడ వాహనంపై సంచరించే శ్రీమన్నారాయణుడు వివిధ అవతారాల ద్వారా మాకు రక్షణ కల్పించుగాక!' ఇదే ఆ నారాయణ కవచ సారాంశం. ఈ స్తోత్రాన్ని నిష్ఠగా పఠించాలి. పూర్వం ఈ స్తోత్రాన్ని పఠించి 'కౌశికుడు' అనే బ్రాహ్మణుడు శరీరాన్ని త్యజించాడు. అతడి అస్థిపంజరం ఉన్న ప్రాంతంలో పైనుండి విమానంలో చిత్రరథుడు అనే గంధర్వుడు వెళ్తున్నాడు. అకస్మాత్తుగా అతడి విమానం ఆగిపోయింది. నేలకు ఒరిగిపోయింది కూడా. అప్పుడు 'వాలఖిల్యుడు' అనే ముని వచ్చి 'విష్ణుభక్తుల అస్థికలను సైతం ఎవరూ దాటి వెళ్ళలేరు. ఇవిగో! కౌశికుడి అస్థికలు. వీటిని తీసుకువెళ్ళి సరస్వతీ నదిలో నిమజ్జనం చెయ్యి' అని చెప్పాడు. చిత్రరథుడు అలాగే చేసి తన లోకానికి వెళ్ళిపోయాడు.

విశ్వరూపుడికి మూడు తలలు. అవి సుర, సోమ, అన్నాలను స్వీకరిస్తాయి. విశ్వరూపుడికి రాక్షసుల కన్నతల్లి దితి అంటే ఇష్టం. అందుకే యజ్ఞభాగంలో

కొంత దితికి ఇచ్చేవాడు. అది తెలిసి ఇంద్రుడు అతడి తలల్ని ఖండించాడు. దానివల్ల అతడికి బ్రహ్మహత్యా పాతకం చుట్టుకుంది. ఒక ఏడాదికాలం దానిని ఇంద్రుడు అనుభవించి, ఆ పాపాన్ని భూమికీ, నీటికీ, చెట్లకూ, స్త్రీలకూ ఇచ్చి అందుకు ప్రతిగా కొన్ని వరాలను ప్రసాదించాడు. ఈ వరప్రభావం వల్లనే భూమిలో పాతిపెట్టినదల్లా మట్టిలో కలిసి పోతుంది. ఎన్ని కల్మషాల్ని కడిగినా నీరు పవిత్రంగానే ఉంటుంది. మొదలంటా నరికినా చెట్లు తిరిగి చిగురిస్తాయి. స్త్రీలకు ఎల్లప్పుడూ కామ సుఖం కలుగుతుంది.

## వృత్రాసురుడి కథ

విశ్వరూపుడి తండ్రి త్వష్ట తన కొడుకును చంపిన ఇంద్రుడిపై పగబట్టి ఒక మారణహోమం చేశాడు. అందులో నుంచి ఒక భీకరుడు పుట్టుకొచ్చాడు. అతడే వృత్రాసురుడు.

వృత్రాసురుడు దేవతలను హింసించటం మొదలుపెట్టాడు. వృత్రాసురుణ్ణి సంహరించాలంటే ఒక ఆయుధం కావాలి. అందుకోసం దధీచి మహర్షిని ప్రార్థించ మని శ్రీమహావిష్ణువు చెప్పటంతో దేవతలు వెళ్ళి దధీచిని ఇలా ప్రార్థించారు–

'మహర్షీ! మేము నీ దగ్గరకు యాచకులుగా వచ్చాం. ఎవ్వరూ కోరని కోరిక కోరుతున్నాం. యాచకులకు దయ ఉండదు. అందుకే మేము నీ శరీరాన్ని యాచిస్తున్నాం. ప్రసాదించు' అన్నారు.

వాళ్ళు కోరినది లోకవిరుద్ధమే అయినా అతడు మహాదాత కాబట్టి వెంటనే ప్రాణం విడిచిపెట్టాడు. అప్పుడు ఆ మహర్షి ఎముకలతో విశ్వకర్మ వజ్రాయుధాన్ని తయారుచేశాడు. ఆ ఆయుధం ధరించి ఇంద్రుడు వృత్రాసురుడితో తలపడ్డాడు.

నర్మదా నదీతీరం. యుద్ధం భయంకరంగా సాగుతోంది. ఎక్కడ చూసినా మృతకళేబరాలే. ఆ యుద్ధభూమిలో, భూతాలు మెళ్ళో ప్రేవులు వేళ్ళాడేసుకొని స్వైరవిహారం చేస్తున్నాయి.

కృతయుగంలో ప్రారంభమయిన ఈ యుద్ధం త్రేతాయుగం దాకా సాగింది. దేవతల ధాటికి తట్టుకోలేక దానవులు పారిపోవడానికి సిద్ధపడుతున్నారు. అప్పుడు వృత్రాసురుడు–

శా. చావు ధ్రువమైన ప్రాణికిఁ
జావులు రెండరసికొనుఁడు సమరమునందున్
భావింప యోగమందును
జావంగా లేని చెడుగు చావుం జావే? (6-382)

'దానవవీరులారా! పుట్టిన ప్రతి జీవీ గిట్టక తప్పదు. అయితే యుద్ధంలో కానీ, యోగసాధన చేస్తూగానీ మరణించటమే మంచిది. ఇలాకాక వేరేవిధంగా మరణిస్తే ఆ మరణం నీచమైనది' అంటూ వాళ్ళకు ధైర్యాన్ని నూరిపోశాడు. తాను వీరోచితంగా పోరాడుతూ –

'ఇంద్రా! నా సోదరుడైన విశ్వరూపుణ్ణి సంహరించావు. మేలు చేసిన గురువునే పొట్టనపెట్టుకున్న నీకంటే పాపాత్ముడు ఎవరుంటారు? నీలాంటి కృతఘ్నుడి మాంసాన్ని కాకులూ, గద్దలూ, నక్కలూ కూడా ముట్టుకోవు. ఇంకా ఆలోచిస్తా వెందుకు? రా! ఆ వజ్రాయుధాన్ని నాపై ప్రయోగించు. విష్ణువు తేజస్సు అందులో ఉంది. అది నన్ను సంహరిస్తుంది. **విష్ణుదేవుడు ఎక్కడ ఉంటే అక్కడే విజయం'** అంటూ శ్రీహరినే ధ్యానిస్తూ ఇంద్రుడిపైకి వచ్చాడు.

ఇంద్రుడు వజ్రాయుధంతో వృత్రాసురుడి చేయి నరికిపారేశాడు. అయినా ఒంటిచేత్తో ఒక పెద్ద గుదియను తీసుకొని వృత్రాసురుడు ఇంద్రుణ్ణి ఒక్కటి వేశాడు. దెబ్బకు ఇంద్రుడు మూర్ఛపోయాడు. వజ్రాయుధం చేతిలోంచి జారిపోయింది. ఇంద్రుడు తేరుకున్నాక వృత్రాసురుడు –

'ఇంద్రా! రా, ఆయుధం తీసుకో! చేతిలో ఆయుధం లేనివాణ్ణి నేను సంహరించను'. ఇదంతా విష్ణుమాయ. గెలుపు ఆ స్వామిదే. అది తెలియక గెలుపుకు కారణం మేమేనని లోకులు విర్రవీగుతూ ఉంటారు. నన్నే చూడు. ఒక చెయ్యి విరిగినా నిన్ను చంపాలని చూస్తున్నాను. అయితే చంపేదీ చచ్చేదీ ఆ ఆదినారాయణుడే' అన్నాడు.

అతని మాటలు విన్న ఇంద్రుడికి తల గిర్రున తిరిగిపోయింది. ఆ రాక్షసుడి జ్ఞానానికి ఆశ్చర్యపోతూనే అతడి మరో చెయ్యి నరికాడు. అయినా వృత్రాసురుడు గర్జిస్తూ ఇంద్రుణ్ణి మింగేశాడు.

నారాయణ కవచం రక్షణలో ఉన్నందువల్ల ఇంద్రుడు క్షేమంగా అతడి పొట్టలో నుంచి బయటపడ్డాడు. వాడి తలను వజ్రాయుధంతో నరికాడు. వృత్రాసురుడు కుప్పకూలిపోయాడు. దేవదుందుభులు మార్మోగాయి. అంతటా ఆనందం వెల్లివిరిసింది.

వృత్రాసురుణ్ణి చంపటంవల్ల ఇంద్రుడికి మళ్ళీ బ్రహ్మహత్యాపాతకం చుట్టుకుంది. అది ఈసారి భీకరమైన రూపంలో ఇంద్రుడి వెంట పడింది. ఇంద్రుడు ఈశాన్య దిక్కున ఉన్న మానస సరోవరంలోని ఒక తామర తూడులో దాక్కున్నాడు. అది శివుడి రాజ్యం. అందుకే ఆ పాతకం అక్కడికి వెళ్ళలేకపోయింది.

## నహుషుడి శాపవృత్తాంతం

ఇంద్రుడు లేని ఈ సమయంలో నహుషుడు ఇంద్ర పదవిని పొందాడు. అయితే అతడు శచీదేవిపై కన్నేశాడు. తనకు భార్యగా ఉండమని ఆజ్ఞాపించాడు. అప్పుడు ఆమె అతడి పీడ వదిలించుకోవాలనుకుంది.

బృహస్పతి ఒక ఉపాయం చెప్పాడు. దాని ప్రకారం ఆమె నహుషుడితో 'నువ్వు సప్తర్షులే బోయీలై మోస్తున్న పల్లకిలో కూర్చొని వచ్చి నన్ను చేపట్టు' అని చెప్పింది. అధికార మదం, స్త్రీ వ్యామోహం కల నహుషుడు సప్తర్షుల్ని బోయీలుగా చేసుకున్నాడు. దానికి ఆ మహర్షులు ఆగ్రహించి అతణ్ణి కొండచిలువగా మారిపొమ్మని శపించారు.

కొంతకాలం తరువాత దేవేంద్రుడు తిరిగి వచ్చాడు. ఇన్నాళ్ళూ శ్రీహరినే కొలుస్తూ ఉండటంవల్ల అతడి పాపం పోయింది. వచ్చి అశ్వమేధ యాగం చేసి వాసుదేవుణ్ణి ప్రసన్నం చేసుకొన్నాడు.

## వృత్రాసురుడి పూర్వ జన్మ వృత్తాంతం

రాజా! వృత్రాసురుడు ఎంతటి వివేకవంతుడో విన్నావుకదా! నిజానికి ఇతడు పూర్వజన్మలో 'చిత్రకేతువు' అనే రాజు. సంతానం కోసం పుత్రకామేష్టి చేసి తన భార్య 'కృతద్యుతి' ద్వారా ఒక పుత్రుణ్ణి పొందాడు. అయితే కృతద్యుతి సవతులు అసూయతో ఆ బాలుడికి విషంపెట్టి చంపేశారు. ఈ చిత్రకేతువూ కృతద్యుతి కన్నీరు మున్నీరుగా విలపిస్తుంటే అక్కడికి అంగిరస మహర్షి వచ్చి ఇలా అన్నాడు–

'రాజా! ఈ లోకంలో ఏదీ శాశ్వతం కాదు నాయనా! అన్నీ దుఃఖానికి హేతువులే. **శ్రీహరి భక్తి ఒక్కటే శాశ్వతమైన సుఖాన్ని ప్రసాదిస్తుంది.** నీకూ ఈ కుమారుడికీ ఏ సంబంధమూ లేదు. కావాలంటే చూడు!' అని శవంగా ఉన్న ఆ బాలుడిని ఉద్దేశించి–

'నాయనా! నీకోసం నీ తల్లిదండ్రులు విలపిస్తున్నారు. రా! ఈ శరీరంలో ప్రవేశించు. రాజ్యాన్ని చేపట్టి పరిపాలించు. నీ తల్లిదండ్రుల దుఃఖాన్ని తొలగించు' అన్నాడు.

దానికా బాలుడు –

'మునీంద్రా! ఇప్పుడు నేను వీళ్ళ దుఃఖాన్ని తొలగిస్తే మరి నా పూర్వజన్మలలో ఉన్న తల్లిదండ్రుల దుఃఖాన్ని ఎవరు తొలగిస్తారు? జీవుడికి ఏ బంధమూ అంటుకోదు' అన్నాడు.

చిత్రకేతుడికి జ్ఞానోదయం అయింది. అంగిరస మహర్షి ద్వారా నారాయణ మంత్రాన్ని ఉపదేశంగా పొంది, ఆ స్వామినే ఆరాధించి విద్యాధర చక్రవర్తిత్వాన్నీ, ఒక దివ్య విమానాన్నీ పొందాడు.

కొన్నాళ్ళ తర్వాత ఆ విమానంపై విహరిస్తూ చిత్రకేతుడు ఒకసారి కైలాసానికి వెళ్ళి శివపార్వతులను దర్శించాడు. నిండు కొలువులో శివుడు పార్వతీదేవిని కౌగిలించుకొని కనిపించాడు. అదిచూసి చిత్రకేతుడు ఆక్షేపించాడు. అవహేళన చేశాడు. పార్వతీ దేవి ఆగ్రహించి ఇతణ్ణి రాక్షసుడివై పుట్టమని శపించింది.

ఆమె శపించినా కొంచెం కూడా బాధపడలేదు చిత్రకేతుడు. అయితే తాను ఎందుకలా ఆక్షేపించానా? అని పశ్చాత్తాపం చెందాడు. నమస్కరించి వెళ్ళిపోయాడు.

అప్పుడు శివుడు పార్వతీదేవితో 'దేవీ! చూశావా! ఇతడు నిజమైన విష్ణుభక్తుడు. అందుకే అంత నిర్లిప్తంగా ఉన్నాడు. **విష్ణుభక్తులు అంతటా శ్రీహరినే దర్శిస్తారు. అందువల్ల వారికి సుఖదుఃఖాలు, హెచ్చుతగ్గులూ ఉండవు'** అని ప్రశంసించాడు.

ఆ చిత్రకేతుడే ఈ వృత్రాసురుడు. అందుకే అతడికి అంత జ్ఞానం.

రాజా! అదితి సంతానమైన 12 మంది ద్వారా వాళ్ళ వంశం శాఖోప శాఖలుగా విస్తరించింది. ఇక దితి గురించి చెప్తాను విను. దితికి హిరణ్యాక్ష, హిరణ్యకశిపులు పుత్రులు. వీళ్ళ ద్వారా దైత్యవంశం వృద్ధి చెందింది. ప్రహ్లాదుడు, బలిచక్రవర్తి, బాణాసురుడు ఇలా ఎందరో దైత్యవీరులు ఈ వంశంలోనివాళ్ళే. అలాగే దితిపుత్రులు 'మరుత్తులు' అనీ ఉన్నారు. వీళ్ళ వృత్తాంతం చెబుతాను విను.

## దితి – పుంసవనవ్రతం

ఒకసారి దితి ఇంద్రుణ్ణి సంహరించగల పుత్రుణ్ణి ప్రసాదించమని కశ్యప ప్రజాపతిని వేడుకుంది.

కశ్యపుడు ఆలోచించి ఆమెను 'పుంసవన వ్రతం' చేయమని ఆదేశించాడు.

'నిర్మలమైన మనస్సుతో శుచిగా నియమాలను అతిక్రమించకుండా ఈ వ్రతాన్ని ఒక ఏడాదిపాటు చేయాలి. చేస్తే నీ కోరిక నెరవేరుతుంది' అంటూ వ్రత నియమాలు వివరంగా చెప్పాడు. వ్రతభంగం కాకుండా చూసుకోమనీ ఆమెను హెచ్చరించాడు.

దితి వ్రతాన్ని ప్రారంభించింది. కొన్నాళ్ళకి గర్భాన్ని ధరించింది. ఈ సంగతి తెలిసి ఇంద్రుడు దితికి సేవచేసే నెపంతో ఆమె దగ్గర చేరాడు. ఎప్పుడు అవకాశం వస్తుందా? అని ఎదురు చూస్తున్నాడు. ఆ అవకాశం రానే వచ్చింది.

ఒకరోజు 'దితి' వ్రతం చేసి అలసిపోయింది. అది సంధ్యాసమయం. భోజనం చేసి, కాళ్ళూ చేతులూ కడుక్కోకుండా నిద్రపోయింది. దాంతో వ్రతభంగం అయింది.

ఇదే అదనుగా ఇంద్రుడు ఆమె గర్భంలోనికి ప్రవేశించి లోపలి శిశువును వజ్రాయుధంతో ఏడు ముక్కలుగా నరికాడు. ఆ ముక్కలు ఏడుపు మొదలుపెట్టాయి. 'మా రుద, మా రుద' అంటూ మళ్ళీ ఒక్కో ముక్కను ఏడు ముక్కలుగా నరికాడు. మొత్తం 49 ముక్కలు 49 మంది బాలురుగా మారిపోయారు.

సూర్యసమానమైన కాంతితో దివ్యపురుషుల్లా వెలిగిపోతున్నారు వాళ్ళంతా. ఇంద్రుడు వాళ్ళను తీసుకొని గర్భం నుండి బయటకు వచ్చాడు. జరిగిన ఘోరం

తెలుసుకొని దితి తల్లడిల్లిపోయింది. ఇంద్రుడిపై ఆగ్రహించింది. ఇంద్రుడు ఆమె పాదాలపై పడ్డాడు.

'తల్లీ! నన్ను క్షమించు. పాపాత్ముణ్ణి. నీ వ్రతం భంగం కావడంతో దాన్ని ఆసరాగా తీసుకొని ఇంతటి అకృత్యానికి ఒడిగట్టాను. నీ వ్రత ప్రభావం చాలా గొప్పది. అందుకే ముక్కలుగా నరికినా నీ పుత్రులు దివ్యపురుషులై ప్రకాశిస్తున్నారు.

ఆ పరంధాముణ్ణి అర్చిస్తే ఏ కీడూ రాదు. వీళ్ళు ఇకనుండి మరుద్గణాలుగా వర్ధిల్లుతారు. నేను వీళ్ళను నాతోపాటు స్వర్గానికి తీసుకువెళ్తాను. అనుమతించు' అన్నాడు.

దితి శాంతించింది. ఇంద్రుడు వాళ్ళను తీసుకొని స్వర్గానికి వెళ్ళిపోయాడు.

'రాజా! ఈ కథ అత్యంత పవిత్రమైనది. దీనిని విన్నా, పఠించినా సత్వరం పుణ్యం సిద్ధిస్తుంది' అన్నాడు శుక మహర్షి.

సూతుడి మాటలు విన్న శౌనకాది మునీంద్రులు ఆనందంగా శ్రీహరిని నోరారా కీర్తించారు.

# సప్తమ స్కంధం

## ధర్మసందేహం

'పరీక్షిత్తు మహారాజుకు ఒక సందేహం కలిగింది. విష్ణుమూర్తి దృష్టిలో అందరూ సమానమే కదా! దేవతలకు మేలు చెయ్యడం కోసం అతడు రాక్షసుల్ని ఎందుకు వెతికి వెతికి మరీ చంపుతున్నాడు? దానివల్ల ఆయనకు ఒరిగిందేమిటి?

ఈ సందేహాన్ని దాచుకోకుండా శుక మహర్షి ముందు ఉంచాడు' అన్నాడు సూత మహర్షి. శౌనకాది ఋషులు ఆసక్తిగా వింటున్నారు. సూతుడు చెప్తున్నాడు.

'అప్పుడు శుకయోగీంద్రుడిలా అన్నాడు: 'రాజా! విష్ణుదేవుడి కథలు చిత్రమైనవే కాదు పవిత్రమైనవి సుమా! వాటివల్ల ముల్లోకాలూ పావనమవుతాయి. సంసారం అనే తీగలు తెగిపోతాయి. నీకు వచ్చిన సందేహంలాంటిదే ఒకసారి మీ తాత ధర్మరాజుకూ వచ్చింది.

ధర్మరాజు రాజసూయ యాగం చేసి ఆ యాగంలో శ్రీకృష్ణుడికి అర్ఘ్యం ఇచ్చి సత్కరించాడు. అది సహించలేని శిశుపాలుడు శ్రీకృష్ణుణ్ణి నానా మాటలూ అన్నాడు. అప్పుడు శ్రీకృష్ణుడు చక్రంతో అతడి తలను ఖండించాడు. ఇదంతా నీకు తెలుసుకదా! అయితే అక్కడో విచిత్రం జరిగింది. అందరూ చూస్తుండగా శిశుపాలుడి శరీరం నుండి ఒక జ్యోతి బయటకు వచ్చి శ్రీకృష్ణ పరమాత్మలో ఐక్యమైపోయింది. అది చూసిన ధర్మరాజు అక్కడే ఉన్న నారద మహర్షిని ఇలా అడిగాడు: 'మునీంద్రా! ఈ శిశుపాలుడు దుర్మార్గుడు. చిన్నప్పటి నుండీ శ్రీకృష్ణుణ్ణి నిందిస్తూనే ఉన్నాడు. మేం చూస్తూనే ఉన్నాం. అలాంటిది ఇతడి ఆత్మ శ్రీకృష్ణుడిలో ఐక్యమైపోవటమేమిటి? విచిత్రంగా ఉందే!' దానికి నారదుడు ఇలా చెప్పటం ప్రారంభించాడు:

వాస్తవానికి పరమాత్మకు దేవతలపై పక్షపాతం లేదు. ఆయన దృష్టిలో దేవతలూ, రాక్షసులూ కూడా సమానులే. అయితే వారిలో సజ్జనులు ఏ జాతివారైనా ఆయన వారిని రక్షించాడు (ఉదా. ప్రహ్లాదుడు). దుష్టులు దేవతల్లో ఉన్నా వారి దోషానికి తగిన శిక్ష లభించేట్లు చేశాడు. (ఉదా. దేవేంద్రుడు)

శా. **కామోత్కంఠత గోపికల్, భయమునన్ గంసుండు, వైరక్రియా**
**సామగ్రిన్ శిశుపాలముఖ్య నృపతుల్, సంబంధులై వృష్ణులున్,**
**ప్రేమన్ మీరలు, భక్తి నేము నిదె చక్రింగంటి మెట్లైన ను**
**ద్దామధ్యానగరిష్ఠుఁడైన హరిఁ జెందన్ వచ్చు ధాత్రీశ్వరా!** (7-18)

ధర్మరాజా! కామంతో గోపికలు, భయంతో కంసుడు, వైరంతో శిశుపాలాది రాజులు, సంబంధంతో వృష్ణివంశీయులు, ప్రేమతో మీరు, భక్తితో మేము ఈ విష్ణుమూర్తిని కొలుస్తున్నాం. ఎవరైనా సరే! ఏ మార్గంలో ధ్యానం చేసినా శ్రీహరిని పొందవచ్చు. ఈ శిశుపాలుడూ, ఇతడి సోదరుడైన దంతవక్త్రుడు ఎవరో కాదు. శ్రీహరి ద్వారపాలకులైన జయవిజయులే. సనకసనందనాది ఋషుల శాపానికి గురై ఇలా జన్మించారు. పూర్వం హరిని ద్వేషించి హరి చేతిలో మరణించిన హిరణ్యాక్ష, హిరణ్య కశిపులూ, రావణ కుంభకర్ణులు కూడా జయవిజయులే అంటూ జయ విజయులు ఎలా శాపానికి గురయ్యారో వివరంగా చెప్పాడు. ఇది వీళ్ళకు మూడో జన్మ. ఈ జన్మ తరువాత వైకుంఠానికి వెళ్ళాలి. అందుకే శిశు పాలుడి ఆత్మ శ్రీకృష్ణుడిలో ఐక్యమయింది' అన్నాడు.

## ప్రహ్లాద చరిత్ర

ఆ తరువాత ధర్మరాజు తనకు ప్రహ్లాదుడి చరిత్రను చెప్పమని నారదుణ్ణి అడిగాడు. నారదుడు ఇలా చెప్తున్నాడు.

'రాజా! హిరణ్యాక్షుణ్ణి శ్రీహరి వరాహరూపం ధరించి సంహరించాడు. అప్పటి నుండీ హిరణ్యాక్షుడి సోదరుడైన హిరణ్యకశిపుడు శ్రీహరిపై కక్ష గట్టాడు. దేవగణాల్ని హింసించటం మొదలుపెట్టాడు. అతడి తల్లి పుత్రశోకంతో అలమటించింది. ఆమెను హిరణ్యకశిపుడు ఇలా ఓదార్చాడు:

## హిరణ్యకశిపుడి ఓదార్పు

'అమ్మా! ఈ సంసారంలో ఎవరూ ఎక్కువ కాలం ఉండరు. చలివేంద్రంలోనికి వచ్చి దాహం తీర్చుకొని వెళ్ళిపోయే బాటసారుల్లా వస్తూ పోతూ ఉంటారు. నీ కుమారుడు వీరుడు. అందుకే వీరస్వర్గాన్ని అలంకరించాడు. ఈ లోకంలో అంతా ఈశ్వరాధీనమే! తన మాయతో ఆ భగవంతుడే ఇవన్నీ కల్పిస్తూ ఉంటాడు. నీకో కథ చెప్తాను విను.

పూర్వం 'సుయజ్ఞుడు' అనే ఒక రాజు ఉండేవాడు. అతడు యుద్ధంలో మరణించాడు. అతడి శవం చుట్టూ చేరి అందరూ ఏడుస్తుంటే యమధర్మరాజు ఒక బాలుడి రూపంలో వచ్చి ఇలా హితవు పలికాడు:

'ఓ అజ్ఞానులారా! కాలం చెల్లినవాడి కోసం ఇంతగా బాధపడుతున్నా రెందుకు? పుట్టిన ప్రతి జీవీ గిట్టక తప్పదు.

**పరమేశ్వరుడి దయ ఉంటే ఎలాంటి ఆపదలైనా తొలగిపోతాయి.**

**మానవ శరీరం ఒక ఇల్లు. అందులోనికి ప్రవేశించిన ఆత్మ, కర్మల్ని అనుభవించి అవి తీరిపోగానే ఖాళీ చేసి వెళ్ళిపోతుంది. శరీరం శాశ్వతం కాదు. ఆత్మ శాశ్వతం.**

వెనకటికి ఒక వేటగాడి చేతిలో చిక్కిందొక పక్షి. అది ఆడది. దాని జంటపక్షి చెట్టుమీదే ఉంది. అది ఎంతగానో విలపించింది. బ్రహ్మదేవుడు తనకు అన్యాయం చేశాడనీ, పిల్లలకు ఇంకా రెక్కలు రాలేదనీ తలచుకొని తలచుకొని కుమిలిపోయింది. ఇంతలో ఒక బాణం రివ్వున దూసుకువచ్చి ఆ మగపిచ్చుక గుండెల్లో దిగబడింది. ఆడ పక్షికంటే ముందే ఈ మగ పక్షి మరణించింది. కాబట్టి ప్రాణం పోకడ ఇలాగే ఉంటుంది. **ఆయుష్షు తీరిపోతే ఎంతటివాళ్ళైనా మరణించాల్సిందే!'**

ఆ మాటలు విన్న ఆ రాజు బంధువులకు కర్తవ్యం బోధపడింది.

అమ్మా! ఎవరికి ఎవరు శత్రువులు? ఆలోచిస్తే అంతా ఒకటే! ఈ జ్ఞానం లేకపోవటంవల్లనే ఈ తర తమ భేదాలు, అని హితబోధ చేశాడు హిరణ్య కశిపుడు. దితి కొంత తెప్పరిల్లింది.

## హిరణ్యకశిపుడి వరాలు

తర్వాత హిరణ్య కశిపుడు బ్రహ్మదేవుణ్ణి ఉద్దేశించి ఘోరమైన తపస్సు చేశాడు. అతడి చుట్టూ చీమలు పుట్టలు పెట్టాయి. అయినా ఆయన చలించలేదు. చివరికి బ్రహ్మదేవుడు ప్రత్యక్షమై అతని తీవ్ర తపస్సుకు సంతోషించాడు. నీకిష్టమైన కోరికలు కోరుకోమన్నాడు. అప్పుడు హిరణ్యకశిపుడు

**శా. గాలిం గుంభిని నగ్ని నంబువుల నాకాశస్థలిన్ దిక్కులన్**
**రేలన్ ఘస్రములం దమఃప్రభల భూరిగ్రాహ రక్షోమృగ**
**వ్యాళాదిత్యనరాది జంతుకలహవ్యాప్తిన్ సమస్తాస్త్ర శ**
**స్త్రాళిన్ మృత్యువులేని జీవనము లోకాధీశ! యిప్పింపవే!** (7-90)

లోకేశ్వరా! గాలి, నేల, అగ్ని, నీళ్ళు, ఆకాశం, దిక్కులు, రాత్రివేళ, పగలు, చీకటి, వెలుగు, జలచరాలు, రాక్షసులు, మృగాలు, సర్పాలు, ఆదిత్యులు, నరులు, అస్త్రాలు, శస్త్రాలు ఇలా ఎక్కడా, ఎవరిచేతా, వేటివల్లా మరణం రాకుండా వరాన్ని పొందాడు.

వరగర్వంతో విజృంభించాడు. త్వరలోనే అతణ్ణి సంహరిస్తానని శ్రీహరి దేవతలకు అభయమిచ్చాడు.

## ప్రహ్లాదుడి వ్యక్తిత్వం

రాజా! హిరణ్యకశిపుడికి నలుగురు కొడుకులు. వారిలో ప్రహ్లాదుడు ఒకడు. అతడు చాలా గొప్పవాడు.

**సీ. తనయందు నఖిలభూతములయందు నొకభంగి**
**సమహితత్వంబున బరగువాడు**
**పెద్దలఁ బొడగన్న భృత్యుని కైవడిఁ**
**జేరి నమస్కృతుల్ సేయువాఁడు**
**కన్నుదోయికి నన్యకాంత లడ్డంబైన**
**మాతృభావన సేసి మరలువాఁడు**
**తల్లిదండ్రులభంగి ధర్మవత్సలతను**
**దీనులఁ గావఁ జింతించువాఁడు**

**తే.గీ. సఖులయెడ సోదరస్థితి జరుపువాఁడు**
**దైవతములంచు గురువులఁ దలఁచువాఁడు**
**లీలలందును బొంకులు లేనివాఁడు**
**లలిత మర్యాదుఁడైన ప్రహ్లాదుఁడధిప!** (7-115)

అన్ని ప్రాణులనూ తనలాగే చూసేవాడూ, పెద్దలను సేవించేవాడూ, కళ్ళ ముందు పరస్త్రీలు ఎదురుపడినా తల్లిలా భావించేవాడు, దీనులపట్ల తల్లిదండ్రుల ప్రేమను చూపేవాడూ, స్నేహితుల్ని తోబుట్టువుల్లా ఆదరించేవాడు, గురువుల్ని దైవంగా భావించేవాడు, సరదాకి కూడా అబద్ధం ఆడనివాడు - ఇన్ని మంచి గుణాలకు నెలవైన ప్రహ్లాదుడు మంచికీ మర్యాదకూ చిరునామా! రూపం, విద్య, ఐశ్వర్యం ఇలా అన్నీ ఉన్నా అహంకారం అతడికి లేనేలేదు. సంపదలపై ఆశలేదు. అసలు ఏ కోరికా లేదు. **నిరంతరం హరినే స్మరిస్తూ ఉంటాడు.** దేవతలు కూడా అతణ్ణి కీర్తిస్తారు.

**శా. పానీయంబులు ద్రావుచుం గుడుచుచున్ భాషించుచున్ హాసలీ**
**లానిద్రాదులు సేయుచుం దిరుగుచున్ లక్షించుచున్ సంతత**
**శ్రీనారాయణ పాదపద్మయుగళీ చింతామృతాస్వాద సం**
**ధానుండై మఱచెన్ సురారిసుతుఁ డేతద్విశ్వమున్ భూవరా!** (7-123)

**రాజా! ఆ ప్రహ్లాదుడు నీళ్ళు తాగుతున్నా, అన్నం తింటున్నా, మాట్లాడుతున్నా, నవ్వుతున్నా, ఆటలాడుతున్నా ఇలా ఏ పనిచేస్తున్నా శ్రీహరి పాదాలనే ధ్యానిస్తూ ఉంటాడు. ఆ ధ్యాసలో పడి ఈ లోకాన్నే మర్చిపోతాడు.** అంతటి ఉత్తముణ్ణి పాపాత్ముడైన హిరణ్యకశిపుడు చంపడానికి కూడా వెనుకాడలేదు.

ప్రహ్లాదుడి ప్రవర్తన వింతగా అనిపించింది తండ్రికి. 'రాక్షసుల బుద్ధులు ఒక్కటి కూడా రాలేదు వీడికి. పోనీ, చదువు చెప్పిస్తే దారిలోనికి వస్తాడేమో!' అనుకొని తన కుమారుణ్ణి పిలిచి, నాయనా!

**కం. చదువనివాఁ డజ్ఞుండగుఁ**
**జదివిన సదసద్వివేక చతురత గలుగుం**
**జదువఁగవలయును జనులకుఁ**
**జదివించెద నార్యులొద్దఁ జదువుము తండ్రీ!** (7-130)

చదువు లేనివాడు అజ్ఞాని. చదువుకొంటే మంచీ చెడూ తెలుసుకొనే నైపుణ్యం. కాబట్టి నిన్ను పెద్దల దగ్గర పెట్టి చదివిస్తాను. చదువుకో!, అంటూ తమ కుల గురువులైన శుక్రాచార్యుడి పుత్రులు చండుడినీ, అమర్కుడినీ పిలిపించి ప్రహ్లాదుణ్ణి అప్పగించాడు.

కొన్ని రోజులు గడిచాయి. కుమారుడి విద్యాభ్యాసం ఎలా సాగుతుందో తెలుసుకోవాలని తన దగ్గరకు పిలిపించుకొన్నాడు.

ప్రహ్లాదుడు వచ్చాడు. కొడుకును చూడగానే హిరణ్యకశిపుడికి పుత్ర వాత్సల్యం పొంగుకు వచ్చింది. దగ్గరకు తీసుకొని గుండెలకి హత్తుకొన్నాడు. ముద్దు చేస్తూ లాలనగా –

'నాయనా! ఎలా ఉన్నావురా? నీ చదువు ఎంతవరకూ వచ్చింది? ఏమేమి నేర్చుకొన్నావు? ఏదీ నువ్వు చదివిన వాటిలోంచి ఏవైనా నీకు ఇష్టమైనవి చెప్పు? అని అడిగాడు ప్రేమగా.

ప్రహ్లాదుడు వినయంగా –

**ఉ. ఎల్ల శరీరధారులకు నిల్లను చీఁకటి నూతి లోపలం**
**ద్రెళ్ళక వీరు నేమను మతిభ్రమణంబున ఖిన్నులై ప్రవ**
**ర్తిల్లక సర్వమున్నతని దివ్యకళామయమంచు విష్ణునం**
**దుల్లముఁజేర్చి తా రడవి నుండుట మేలు నిశాచరాగ్రణీ!** (7–142)

'నాన్నగారూ! 'ఇల్లు' అనేది ఒక చీకటి నుయ్యి. అందులో పడి అందరూ నశిస్తూ ఉంటారు. అలాకాక ఈ సృష్టి మొత్తం దేవదేవుడి కళామయమేనన్న సత్యాన్ని గ్రహించి అడవులలో తపస్సు చేసుకొంటూ ఉండటమే మంచిది' అన్నాడు.

హిరణ్యకశిపుడికి నోట మాట రాలేదు. వీడేమిటి? ఈ మాటలేమిటి? పిల్లలకేమి తెలుసు? పెద్దలు ఏం చెబితే అదే చెప్తారు. ఎవరో కానిమాటలు నూరిపోసినట్టున్నారు. అని మనసులో అనుకొని

'ప్రహ్లాదా! ఏమిటీ మాటలు? ఎవరు నేర్పించారు? ఆ శ్రీహరి మనకు శత్రువు. అతణ్ణి నువ్వు కీర్తిస్తున్నావు?' అన్నాడు కొంచెం కర్కశంగా.

## ప్రహ్లాదుడి భక్తి

అప్పుడు ప్రహ్లాదుడు గురువులను చూసి **'జ్ఞానులైనవాళ్ళు శ్రీహరిని తప్ప ఇతరుల్ని ఊహించుకోలేరు.** నేనూ అంతే! ఇనుము అయస్కాంతానికి ఎలా హత్తుకుంటుందో నా మనస్సూ శ్రీహరిపై అలాగే లగ్నమయింది.

**సీ. మందార మకరంద మాధుర్యమునఁ దేలు**
**మధుపంబు వోవునే మదనములకు?**
**నిర్మల మందాకినీ వీచికలఁ దూఁగు**
**రాయంచ సనునె తరంగిణులకు?**
**లలిత రసాల పల్లవ ఖాదియై చొక్కు**
**కోయిల సేరునే కుటజములకుఁ?**
**బూర్ణేందుచంద్రికాస్ఫురిత చకోరకం**
**బరుగునే సాంద్ర నీహారములకు?**

**తే.గీ. నంబుజోదర దివ్యపాదారవింద**
**చింతనామృతపాన విశేష మత్త**
**చిత్త మేరీతి నితరంబుఁ జేర నేర్చు?**
**వినుతగుణశీల! మాటలు వేయునేల?** (7-150)

ఆచార్యా! మందార పుష్పాలలోని తేనెను ఆస్వాదించే తుమ్మెద ఉమ్మెత్త పువ్వుల దగ్గరికి వెళ్తుందా? ఆకాశ గంగలో విహరించే రాజహంస చిన్నచిన్న వాగులవైపు వెళుతుందా? లేత మామిడిచివుళ్ళను తింటూ పరవశించే కోకిల కొండ మల్లెపువ్వుల వద్దకు వెళ్తుందా? ఆ శ్రీహరి పాదాలను చింతించటం అనే అమృతాన్ని త్రాగి మత్తెక్కిన మనస్సు వేరే వాటివైపు వెళ్తుందా? వెళ్ళదు కాక వెళ్ళదు' అన్నాడు. ఆ మాటలు హిరణ్యకశిపుడికే కాదు గురువులకు కూడా కోపాన్ని తెప్పించాయి.

'డింభకా! ఏమిటా మాటలు? శత్రువును కీర్తిస్తావా? మేం చెప్పినది చెప్పకుండా కుతర్కాలు చేస్తావా? దైత్యులు అనే చందనవనంలో పుట్టిన ముళ్ళచెట్టులా ఉన్నావే! నాలుగు తగిలిస్తేగానీ దారిలోకి రావు' అంటూ హిరణ్యకశిపుడి వైపు తిరిగి 'రాజా! మమ్మల్ని మన్నించు. మేము చెప్పినదొక్కటి. వీడు చెప్తున్నదొకటి.

మాకు మరో అవకాశం ఇవ్వు. ఈసారి ఇంకా జాగ్రత్తగా పాఠాలు చెప్పి ప్రహ్లాదుణ్ణి తీర్చిదిద్దుతాం' అన్నారు.

హిరణ్యకశిపుడి అనుమతితో ప్రహ్లాదుణ్ణి తిరిగి తీసుకువెళ్ళారు. శ్రద్ధగా గురువులు వివిధ శాస్త్రాలను బోధిస్తున్నారు. రోజులు గడుస్తున్నాయి.

కొన్నాళ్ళ తర్వాత మళ్ళీ గురువులు హిరణ్యకశిపుడి వద్దకు తీసుకువచ్చారు. ముందుగానే హెచ్చరించారు. మా పరువు తియ్యవద్దనీ, మేం చెప్పిన వేటినీ తిప్పి చెప్పవద్దనీ బతిమిలాడుకున్నారు.

ఏం చెప్పి ఏం లాభం? హరిభక్తికి ఒక పురుష రూపం ఇస్తే ప్రహ్లాదుడు అవుతాడు. అంతటి భక్తుడు, నిరంతరం శ్రీహరినే ధ్యానిస్తూ తనని తాను మరచి పోయే పుణ్యాత్ముడూ, సకల సుగుణాల రాశి అయిన ప్రహ్లాదుడు తన సహజమైన ధోరణిని మార్చుకుంటాడా? లేదు.

తండ్రికి నమస్కరించాడు ప్రహ్లాదుడు. హిరణ్యకశిపుడు ఆప్యాయంగా కొడుకును ముద్దాడాడు. 'ఏదీ నువ్వు చదివిన శాస్త్రాలలోంచి ఒక్క పద్యం చదివి అర్థం చెప్పు నాయనా' అని అడిగాడు. ప్రహ్లాదుడు వెంటనే వినయంగా–

**కం. చదివించిరి నను గురువులు**
**చదివితి ధర్మార్థ ముఖ్య శాస్త్రంబులు నేఁ**
**జదివినవి గలవు పెక్కులు**
**చదువులలో మర్మమెల్లఁ జదివితిఁ దండ్రీ !** (7–166)

తండ్రీ! నన్ను గురువులు చదివించారు. నేనూ ఎన్నో శాస్త్రాలు చదివాను. అయితే ఆ చదువులలోని మర్మం తెలుసుకున్నాను. చెబుతాను విను.

## నవవిధ భక్తి మార్గాలు

**మ. తనుహృద్భాషల సఖ్యమున్ శ్రవణమున్ దాసత్వమున్ వందనా**
**ర్చనముల్ సేవయు నాత్మలో నెఱుకయున్ సంకీర్తనల్, చింతనం**
**బను నీ తొమ్మిది భక్తిమార్గముల సర్వాత్మున్ హరిన్నమ్మి స**
**జ్జనుఁడై యుండుట భద్రమంచుఁ దలఁతున్ సత్యంబు దైత్యోత్తమా!**
(7–167)

రాజా! శరీరమూ, హృదయమూ, మాటలూ అనే త్రికరణాలతో సఖ్యత, శ్రవణం, దాస్యం, వందనం, అర్చన, సేవ, ఆత్మనివేదన, సంకీర్తన, చింతన అనే తొమ్మిది భక్తిమార్గాల ద్వారా ఆ శ్రీహరిని నమ్మి కొలుస్తూ సజ్జనుడిలా కాలం గడపటమే మంచిదని నిజంగా భావిస్తాను.

హరిభక్తి లేని వారి సంసారం గుడ్డివాడికి చంద్రోదయం చూపించినట్లు, చెవిటివాడి ముందు శంఖం ఊదినట్లు వ్యర్థమైనది.

**సీ. కమలాక్షు నర్చించు కరములు కరములు**
**శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ**
**సురరక్షకునిఁ జూచు చూడ్కులు చూడ్కులు**
**శేషశాయికి మ్రొక్కు శిరము శిరము**
**విష్ణు నాకర్ణించు వీనులు వీనులు**
**మధువైరిఁ దవిలిన మనము మనము**
**భగవంతు వలగొను పదములు పదములు**
**పురుషోత్తముని మీఁది బుద్ధి బుద్ధి**

**తే.గీ. దేవదేవుని జింతించు దినము దినము**
**చక్రహస్తునిఁ బ్రకటించు చదువు చదువు**
**కుంభినీధవుఁ జెప్పెడి గురుఁడు గురుఁడు**
**తండ్రిఁ హరిఁ జేరు మనియెడి తండ్రి తండ్రి!** (7-169)

**ఆ విష్ణుమూర్తిని అర్చించే చేతులే చేతులు. వర్ణించే నాలుకే నాలుక. చూసే చూపులే చూపులు. నమస్కరించే శిరస్సే శిరస్సు. వినే చెవులే చెవులు. ధ్యానించే మనస్సే మనస్సు. ప్రదక్షిణం చేసే పాదాలే పాదాలు. స్మరించే బుద్ధే బుద్ధి. చింతించే రోజే రోజు. చదివే చదువే చదువు. బోధించే గురువే గురుడు. తండ్రీ! ఆ శ్రీహరిని చేరమని చెప్పే తండ్రే తండ్రి!**

ఆ పరమాత్ముడి సేవకు ఉపయోగపడని శరీరమూ ఒక శరీరమేనా? గాలితో నింపిన తోలు తిత్తిగాని. అతణ్ణి పొగడని నోరూ ఒక నోరేనా? ఢమఢమలాడే ఢక్క గాని. హరిపూజ చేయని చేయీ ఒక చేయేనా? చెట్టు కొమ్మతో చేసిన తెడ్డు గాని. అతణ్ణి చూడని కన్నులూ కన్నులేనా? శరీరం అనే గోడకు పెట్టిన రంధ్రాలుగాని. విష్ణు భక్తి లేని పండితుడూ ఒక పండితుడేనా? రెండు కాళ్ళ పశువుగాక!

అయినా హరిదాస్యం అనే పెనుగాలి లేకుండా ఈ సంసారం అనే మేఘాలు విడిపోతాయా? విష్ణుసేవ అనే వర్షం లేకుండా తాపత్రయాలు అనే అగ్నులు ఆరిపోతాయా? హరిపై కోరిక అనే బడబాగ్ని లేకుండా పాపాల సముద్రాలు ఇంకుతాయా? శ్రీహరిస్తుతి అనే సూర్యకాంతి లేకుండా ఆపదలు అనే చీకట్లు నశిస్తాయా? శ్రీహరి చింతన అనే అంజనం లేకుండా ముక్తి అనే నిధి కనిపిస్తుందా?

ప్రహ్లాదుడు ధాటిగా చెప్తున్నాడు. ఆ మాటలు హిరణ్యకశిపుడి హృదయాన్ని కలిచివేశాయి. కోపం తారాస్థాయికి చేరుకుంది. చెక్కిళ్ళు అదిరిపడుతున్నాయి. పళ్ళు పటపటా కొరుకుతూ ఆచార్యులను చూసి –

**'నమ్మి పిల్లవాణ్ణి అప్పగిస్తే ఇదా మీరు చేసే నిర్వాకం? ఈ పాపం ఊరికే పోదు. చెడ్డ పనులు చేసేవాళ్ళను రోగాలు పీక్కుతిన్నట్లు మిమ్మల్నీ ఈ పాపం పీడిస్తుంది'** అన్నాడు తీవ్రమైన కంఠంతో.

'దానవనాథా! ఇందులో మా తప్పేమీ లేదు. మేము చెప్పినవి కావివి. అయినా శత్రువుల గురించి చెప్పడానికి మేమేమైనా మీ శత్రువులమా?' అన్నారు గురువులు దీనంగా.

ఈసారి హిరణ్యకశిపుడు ప్రహ్లాదుణ్ణే నిలదీశాడు. ప్రహ్లాదా! చెప్పు. ఎవరు చెప్పారు నీకివన్నీ? ఈ బుద్ధి నీకు ఎలా పుట్టింది' అని గద్దించాడు. దానికి ప్రహ్లాదుడు –

## ప్రహ్లాదుడి వివేకం

**'తండ్రీ! సంసారంలో పడి అలమటించేవాళ్ళకు హరిభక్తి ఒకపట్టాన కలుగుతుందా? కర్మబద్ధులైనవాళ్ళు శ్రీహరిని దర్శించగలరా? విష్ణుభక్తుల పాద ధూళిని శిరస్సున ధరించే పుణ్యాత్ములు మాత్రమే శ్రీహరిని దర్శించగలరు. సరే! ఇన్ని మాటలు దేనికి? అన్ని శాస్త్రాలూ శోధించి శోధించి నేను ఒక విషయం తెలుసుకున్నాను.**

**'ఈ సంసారం ఒక సముద్రం. భార్యాపుత్రులు తిమింగలాలు. మదమూ, క్రోధమూ అనేవి కెరటాలు. ఈ సముద్రాన్ని దాటాలి అంటే ఒక నావ కావాలి. ఆ నావ శ్రీహరిపై లగ్నమైన బుద్ధి. దీనితో తప్ప సొంత తెలివితో ఈ సముద్రాన్ని దాటటం అసంభవం' అన్నాడు.**

హిరణ్యకశిపుడు ఉలిక్కిపడ్డాడు. అప్పటిదాకా ఏ మూలో ఉన్న పుత్రవాత్సల్యం పూర్తిగా ఆవిరైపోయింది. ఒక్క ఉదుటున తన తొడమీదనుండి ప్రహ్లాదుణ్ణి కిందికి త్రోశాడు. ఉరుమురిమి చూశాడు. మంత్రుల్ని ఇలా ఆదేశించాడు –

## చిత్రహింసలు

'వీడు నా కడుపున పుట్టిన శత్రువు. వేలెడంత లేడు. నాకే నీతులు చెప్తున్నాడు. కులద్రోహి. వీణ్ణి సంహరించి వంశాన్ని కాపాడతాను. శరీరంలో ఏదైనా ఒక అవయవం పాడైపోతే వైద్యుడు దాన్ని తొలగించి మిగిలిన శరీరాన్ని రక్షిస్తాడు. నేనూ అదే చేస్తాను. వెళ్లండి. వీణ్ణి తీసుకువెళ్ళి వధించండి. ఎంతమాత్రం కనికరం చూపకండి ఇది నా ఆజ్ఞ' అన్నాడు భీకరంగా అరుస్తూ.

రాక్షసులు సత్వరం బాలుణ్ణి తీసుకువెళ్ళిపోయారు. కనీ వినీ ఎరుగని రీతిలో హింసించటం మొదలుపెట్టారు. రాజా! విచిత్రమేమిటంటే వాళ్ళు ఎంత హింసిస్తున్నా ప్రహ్లాదుడు–

ఉ. **తన్ను నిశాచరుల్ పొడువ దైత్యకుమారుఁడు మాటిమాటి 'కో**
**పన్నగశాయి! యో దనుజభంజన! యో జగదీశ! యో మహా**
**పన్నశరణ్య! యో నిఖిలపావన!' యంచు నుతించుగాని తాఁ**
**గన్నుల నీరు దేఁడు భయకంపసమేతుఁడు గాఁడు భూవరా!** (7–193)

రాక్షసులు ఒక పక్క తనను ఆయుధాలతో పొడుస్తూ ఉన్నా మాటిమాటికీ ఈ ప్రహ్లాదుడు ఓ పన్నగశాయీ! దనుజ భంజనా! అంటూ శ్రీమన్నారాయణుణ్ణి నుతిస్తాడే గానీ కంటతడి పెట్టడు. పోనీ భయంతో వణికిపోవటమూ లేదు. తండ్రిని కనీసం పల్లెత్తు మాటైనా అనడు. ఎవరికీ చెప్పడు. ఎవరినీ శరణు కోరడు. దీనికంతటికీ కారణం అతడి మనస్సు పూర్తిగా పరమాత్మపై లగ్నం కావటమే.

అందుకే హిరణ్యకశిపుడు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. తన కొడుకును ఇంకా క్రూరంగా ఘోరంగా హింసించమన్నాడు. హిరణ్యకశిపుడు ఏనుగులతో తొక్కించమన్నాడు. విషసర్పాలతో కరిపించమన్నాడు. అగ్నిలోనికి తోసెయ్యమన్నాడు. సముద్రంలోకి విసిరెయ్యమన్నాడు. కొండలమీద నుండి తొయ్యమన్నాడు. కానీ ఏ ప్రయత్నమూ ఫలించలేదు.

హిరణ్యకశిపుడికి అంతా అయోమయంగా ఉంది. ఏమీ అర్థంకావటం లేదు. ఏం చేయాలో పాలుపోవటంలేదు. ఇంతలో ఆచార్యులు మళ్ళీ వచ్చి మరోసారి చదువు చెప్పి ప్రహ్లాదుణ్ణి మార్చే ప్రయత్నం చేస్తామని తీసుకువెళ్ళారు.

ఈసారి ఆచార్యులు ప్రహ్లాదుడికి వివాహం అయినవారికి చెప్పే శాస్త్రాలు చెప్తున్నారు. అవేమీ తనకు మేలు చేయవని అతడికి తెలుసు. ఇలా లాభంలేదని గురువులు లేనప్పుడు రాక్షసబాలు రందరినీ పోగుచేసి వాళ్ళకీ హరిభక్తిని రుచి చూపించాడు ప్రహ్లాదుడు. ఇది తెలిసిన గురువులు లబోదిబోమంటూ వచ్చి హిరణ్యకశిపుడి దగ్గర మొరపెట్టుకున్నారు.

హిరణ్యకశిపుడి సహనం పూర్తిగా నశించింది. 'దుర్మార్గుడా! నన్ను చూసి ముల్లోకాలూ గడగడలాడిపోతాయి. నువ్వెంత? నీ శ్రీహరి ఎంత? నీ పిచ్చి ముదిరి పాకాన పడింది. ఇలాగే వదిలివేస్తే రాక్షస వంశాన్నే నాశనం చేసేట్టున్నావు. నిన్ను చంపి, నా వంశాన్ని నిష్కళంకం చేస్తాను.

ఇప్పుడు చెప్పు? నిన్ను చంపితే ఎవడ్రా నీకు దిక్కు? ఆ మాటకొస్తే నీకు దిక్కే లేదు. అన్ని దిక్కులూ నావే? ఎవరి బలం చూసుకొని విర్రవీగుతున్నావు? చెప్పు' అరిచాడు రోషంగా హిరణ్యకశిపుడు. దానికి ప్రహ్లాదుడు–

**కం. బలయుతులకు దుర్బలులకు**
**బలమెవ్వఁడు నీకు నాకు బ్రహ్మాదులకున్**
**బలమెవ్వఁడు ప్రాణులకును**
**బలమెవ్వం డట్టి విభుఁడు బల మసురేంద్రా!** (7–264)

'రాజా! బలవంతులకు, బలహీనులకు, నీకు, నాకు, బ్రహ్మాదులకు ఇలా అన్ని ప్రాణులకూ ఎవడు బలమో నాకూ అతడే బలం. ఆ బలం శ్రీహరి. ఆ దిక్కు శ్రీమన్నారాయణుడు. అతడే అంతటా ఉన్నాడు.

**శా. లోకము లన్నియున్ గడియలోన జయించినవాఁడ వింద్రియా**
**నీకముఁ జిత్తమున్ గెలువనేరవు! నిన్ను నిబద్ధుఁ జేయు నీ**
**భీకర శత్రు లార్వురఁ బ్రభిన్నులఁ జేసినఁ బ్రాణికోటిలో**
**నీకు విరోధి లేఁడొకఁడు నేర్పునఁ జూడుము దానవేశ్వరా!** (7–267)

అయినా తండ్రీ! నువ్వు లోకాలన్నీ చిటికెలో జయించావు. కానీ నీలోనే ఉన్న ఆ ఆరుగురు– ఇంద్రియసమూహమనే శత్రువుల్ని జయించలేకపోతున్నావు. నిన్ను బంధిస్తూ ఉన్న ఈ భయంకరులైన ఆరుగురు శత్రువుల్నీ జయించావంటే ఈ లోకంలో నీకు శత్రువు అంటూ ఎవడూ ఉండడు. దీన్ని నేర్పుతో గుర్తించు' అన్నాడు.

ఆ మాటలు విన్న హిరణ్యకశిపుడి కోపం– అగ్నికి ఆజ్యం పోసినట్లు రెట్టింపయింది.

## శ్రీహరి – అంతర్యామిత్వం

'నాతోనే వాదిస్తావా? నాతో సమానమైనవాడు ఈ లోకంలోనే లేడు. నా సోదరుణ్ణి చంపిన శ్రీహరి కోసం నేను అంతా వెతికాను. వాడు ఎక్కడా లేడు. నీకు తెలిస్తే చెప్పు. అతడు ఎక్కడ ఉన్నాడు? ఎలా ఉంటాడు? ఏం చేస్తుంటాడు? ఇప్పుడే నీ సంగతీ ఆ విష్ణుమూర్తి సంగతీ తేల్చేస్తాను చెప్పరా' అన్నాడు. దానికి ప్రహ్లాదుడు–

**మ. కలఁడంభోధిఁ గలండు గాలిఁ గలఁ డాకాశంబునం గుంభినిం**
**గలఁ డగ్నిన్ దిశలం బగళ్ళ నిశలన్ ఖద్యోత చంద్రాత్మలం**
**గలఁ డోంకారమునం ద్రిమూర్తులఁ ద్రిలింగవ్యక్తులం దంతటం**
**గలఁ డీశుండు గలండు తండ్రి! వెదకంగా నేల నీ యా యెడన్**

(7–274)

తండ్రీ! సముద్రంలో, గాలిలో, ఆకాశంలో, భూమిపై, అగ్నిలో, దిక్కుల్లో, పగళ్ళలో, రాత్రులలో, సూర్యచంద్రుల్లో, ఓంకారంలో, త్రిమూర్తులలో, త్రిలింగ వ్యక్తులలో (స్త్రీలలో, పురుషుల్లో, ఈ ఉభయులూ కాని వారిలోనూ) ఇలా అంతటా ఆ ఈశ్వరుడు తానై ఉంటే ఇక్కడా అక్కడా వెదకటం ఎందుకు?

**కం. ఇందుఁ గలఁ డందు లేఁడని**
**సందేహము వలదు చక్రి సర్వోపగతుం**
**డెందెందు వెదకి చూచిన**
**నందందే కలఁడు దానవాగ్రణి! వింటే!** (7–275)

'రాజా! ఇందులో ఉన్నాడనీ, అందులో లేడనీ సందేహం వద్దు. శ్రీహరి అంతటా ఉన్నాడు. ఎక్కడ వెదికితే అక్కడే ఉంటాడు. విన్నావా' అన్నాడు ప్రహ్లాదుడు గట్టిగా.

లేదు! లేదు! లేదు! గట్టిగా అరిచాడు హిరణ్యకశిపుడు.

'నరసింహుడి రూపంలో అన్ని ప్రాణులలోను ఉన్నాడు' అని కచ్చితంగా చెప్పాడు ప్రహ్లాదుడు.

## నారసింహావతారం

'ఓరీ! డింభకా! అయితే నీ చక్రినీ గిక్రినీ ఈ స్తంభంలో చూపించు' అంటూ తన అరచేత్తో ఆ స్తంభాన్ని కొట్టాడు హుంకరిస్తూ. అంతే! వెంటనే బీటలువారి దాని నుండి ఒక దివ్య తేజస్సు బయటకు దూకింది. అదే నారసింహావతారం.

సగం మనిషి, సగం సింహం. ఆ రూపాన్ని చూసిన హిరణ్యకశిపుడికి నోట మాట రాలేదు. భయపడిపోయాడు. గత్యంతరం లేక ఎలాగో ధైర్యం కూడ గట్టుకొని నరసింహస్వామితో తలపడ్డాడు.

నరసింహస్వామి సింహమైతే హిరణ్యకశిపుడు ఏనుగు. నరసింహుడు గరుత్మంతుడైతే హిరణ్యకశిపుడు ఒక బురద పాము.

అమాంతంగా ఆ రాక్షసుణ్ణి ఒడిసిపట్టుకొని తన తొడపై పెట్టుకొని వాడి రొమ్మును చీల్చి ప్రేవులు మెళ్ళో వేసుకున్నాడు నరసింహస్వామి. హిరణ్యకశిపుడు మరణించాడు.

చంపింది పూర్తిగా పురుషుడూ, మృగమూ కాని రూపం. సమయం రాత్రీ కాదు పగలూ కాదు. సంధ్యవేళ. ప్రదేశం లోపలా కాదు బయటా కాదు. గుమ్మం పైన. ఆకాశంలో కాదూ భూమీ మీదా కాదు. తొడలమీద. ఆయుధాలు ప్రాణం ఉన్నవీ కావు లేనివీ కావు. గోళ్ళు.

తక్కిన రాక్షసులందరినీ సుదర్శన చక్రం మట్టుపెట్టింది.

## ఉగ్ర నరసింహుడు

నరసింహస్వామి ఉగ్రస్వరూపుడై ఉంటే బ్రహ్మాది దేవతలు వచ్చి స్తుతించారు. అయినా నరసింహుడు శాంతించలేదు. అక్కడే ఉన్న సింహాసనంపై కూర్చొని ఉన్నాడు. ఎవరూ దగ్గరకు వెళ్ళే సాహసం చేయలేకపోయారు.

బ్రహ్మదేవుడి ప్రార్థనతో లక్ష్మీదేవి స్వామి దగ్గరకు వెళ్ళాలని వచ్చింది. కానీ కనీ వినీ ఎరుగని ఆ ఉగ్రస్వరూపాన్ని చూసి భయపడింది. అప్పుడు బ్రహ్మదేవుడు 'ప్రహ్లాదా! శ్రీహరి నీ కోసమే అవతరించాడు. నీ విన్నపాన్నే అతడు మన్నిస్తాడు. వెళ్ళు, స్వామిని స్తుతించి శాంతింపచేయి' అన్నాడు.

ప్రహ్లాదుడు నిర్భయంగా వెళ్ళాడు. వాత్సల్య స్వరూపుడైన నారసింహుడు ప్రహ్లాదుణ్ణి చూసి దగ్గరకు రమ్మని ఆప్యాయంగా తన హస్తంతో తల నిమిరాడు.

శ్రీహరి కరస్పర్శతో ప్రహ్లాదుడు పులకించిపోయి తన్మయుడై ఇలా స్తుతించాడు –

'దేవా! బ్రహ్మాది దేవతలు సైతం నిన్ను స్తుతించలేరు. నేనా బాలుణ్ణి. పైగా రాక్షస కుమారుణ్ణి. నేను నిన్ను వర్ణించగలనా? మా వద్ద ఎన్ని ఉపాయాలు, నైపుణ్యాలూ ఉన్నా నిన్ను సంతోషపెట్టటం సాధ్యమేనా? నిన్ను మెప్పించే సాధనం భక్తి ఒక్కటే. ఆ భక్తికే నువ్వు వశమౌతావు.

స్వామీ! నీ భీకర రూపాన్ని చూసి నేను ఎంతమాత్రం భయపడటంలేదు. కానీ సంసారం అనే దావాగ్నిని చూసి వణకిపోతున్నాను. నన్ను కరుణించి నీ పాదసేవను నాకు అనుగ్రహించు.

**ఒక బాలుణ్ణి తలిదండ్రులు ఎలా రక్షిస్తారో, రోగిని ఔషధం ఎలా కోలుకొనేలా చేస్తుందో, సముద్రంలో మునిగిపోతున్న వారిని నావ ఎలా ఒడ్డుకు చేరుస్తుందో నువ్వూ భక్తుల్ని అలాగే రక్షిస్తావు.** లోకంలో ధర్మాన్ని నిలబెట్టటం కోసమే నువ్వు అనేక అవతారాలను ధరిస్తావు. నిన్ను సేవించనివాడికి ముక్తి ఎలా లభిస్తుంది?' అంటూ పలువిధాలుగా కీర్తించాడు ప్రహ్లాదుడు.

ఉగ్రనారసింహుడి ముఖంలో చిరునవ్వు తళుక్కున మెరిసింది.

'ప్రహ్లాదా! నీ స్తుతికి మెచ్చాను. నీలాంటి జ్ఞానులకు ఏ కోరికా ఉండదు. నువ్వు దానవ చక్రవర్తివై ఒక మన్వంతరకాలంపాటు సకలభోగాలు అనుభవించి నన్ను చేరుకుంటావు. నువ్వు నా భక్తుడివి కావటంవల్లనే నీ తండ్రి కూడా తన ముందు ఏడు తరాలతో సహా ఉత్తమగతుల్ని పొందుతాడు' అని నారసింహస్వామి అంతర్ధానమయ్యాడు.

**'రాజా! పరమ పవిత్రమైన ప్రహ్లాద చరిత్రను విన్నవారికీ చదివినవారికీ పుణ్యలోకాలు లభిస్తాయి. నువ్వు ఎంతో అదృష్టవంతుడివయ్యా! లోకాలన్నింటికీ అధిపతి అయిన శ్రీమన్నారాయణుడే శ్రీకృష్ణుడిగా అవతరించి మీకు చెలికాడై సంచరించాడు. ఆ పరమాత్మ తన భక్తులపై ఈగను కూడా వాలనివ్వడు. నీకు త్రిపురాసుర సంహారం గురించి చెబుతాను విను.**

## త్రిపురాసుర సంహారం

పూర్వం రాక్షసులు దేవతల్ని జయించటం కోసం మయుణ్ణి ఆశ్రయించారు. మయుడు వాళ్ళకు ఇనుము, వెండి, బంగారాలతో చేసిన మూడు పురాలను నిర్మించి ఇచ్చాడు. ఈ పురాలు దుర్భేద్యమైనవి. అవి ఒకచోట నుండి మరోచోటికి ప్రయాణించగలవు. ఆ పురాలపై సంచరిస్తూ దానవులు దేవతల్ని హింసించటం మొదలుపెట్టారు.

దేవతలంతా వెళ్ళి పరమ శివుణ్ణి ఆశ్రయించారు. శివుడు ధనువు చేతపట్టి ఒక దివ్యమైన బాణాన్ని సంధించాడు. ఆ బాణాగ్ని జ్వాలలలో పడి రాక్షసులు మరణిస్తున్నారు. అయితే మయుడు తన యోగబలంలో ఒక సిద్ధరసకూపాన్ని తయారు చేశాడు. ఆ కూపంలో వేస్తే చచ్చిన రాక్షసులు సైతం బతికి బయటకు వచ్చి రెట్టింపు బలంతో దేవతలపై విరుచుకుపడుతున్నారు.

తన బాణం వ్యర్థం కావటంతో పరమ శివుడు మనస్తాపం చెందాడు. అది తన భక్తుడైన శివుడికి జరిగిన అవమానంగా భావించాడు శ్రీమహావిష్ణువు. దాన్ని పోగొట్టాలని తనే ఒక అందమైన ఆవు రూపాన్ని ధరించాడు. బ్రహ్మదేవుడు దూడగా మారి వచ్చాడు. ఈ ఆవూ దూడా వెళ్ళి సిద్ధకూపంలో ఉన్న రసాన్ని త్రాగివేశాయి. దాంతో రాక్షసులు లబోదిబోమని మళ్ళీ మయుడి వద్దకు వచ్చారు.

మయుడు ఇది దైవసంకల్పమని భావించాడు. తరువాత విష్ణుమూర్తి తన శక్తులన్నింటినీ ఉపయోగించి శివుడికి యుద్ధపరికరాలన్నీ తయారు చేశాడు. అప్పుడు

శివుడు యుద్ధానికి వెళ్ళి ఆ త్రిపురాసురుల్ని సంహరించాడు. ఇలా ఆ శ్రీహరి తన భక్తుల్ని కంటికి రెప్పగా కాపాడుతూ ఉంటాడు' అన్నాడు.

ధర్మరాజు ఎంతగానో ఆనందించాడు. ఇంకా నారద మహర్షి ద్వారా మరిన్ని మంచి విషయాలను వినాలని అతనికి ఉంది. అందుకే 'మహర్షీ! ఈ లోకంలో అందరూ ఆచరించవలసిన ధర్మాల గురించి వివరించండి' అని వేడుకొన్నాడు.

నారద మహర్షి ప్రారంభించాడు.

## శ్రేష్ఠమైన ధర్మాలు

**'ధర్మరాజా! సత్యం, సమదృష్టి, విచక్షణ, శౌచం, క్షమ, దయ, దానం, ఇంద్రియ నిగ్రహం, సేవ, బ్రహ్మచర్యం, అహింస, శ్రీహరిసేవ మొదలైన సద్గుణాలను అన్ని వర్గాల వారూ తప్పని సరిగా పాటించాలి.**

**బ్రాహ్మణులు కులాచారాల్ని పాటిస్తూ జపహోమ దానాదులతో పవిత్రంగా జీవించాలి. దానం ఇవ్వటం, పుచ్చుకోవటం రెండూ బ్రాహ్మణులకు విధులే.**

**బ్రాహ్మణ విధుల్లో దానం తీసుకోవటం తప్ప తక్కినవాటిని అన్నింటినీ క్షత్రియులు పాటించాలి. ధర్మబద్ధంగా రాజ్యపాలన చేయాలి.**

**వ్యవసాయం, వాణిజ్యం, పశుపాలన, బ్రాహ్మణ కులాన్ని అనుసరించటం వైశ్యుల ధర్యాలు.**

**చౌర్యం లేకుండా ఉండటం, శుచిగా ఉండటం, స్తుతించటం, యజమానుల్ని నిష్కపటంగా సేవించటం, మంత్రం చెప్పకుండా పంచయజ్ఞాలను నిర్వహించటం, పండితుల్ని గౌరవించటం, గోరక్షణ, న్యాయంగా జీవించటం చతుర్థ వర్ణానికి చెందినవాళ్ళు పాటించవలసిన ధర్మాలు.**

**గృహిణి చక్కగా ఇంటిని చక్కదిద్దాలి. ఎప్పుడూ కళకళలాడుతూ ప్రియంగా మాట్లాడుతూ, సత్యాన్ని పాటిస్తూ భర్త మనసును ఆకర్షించాలి. భర్తను దైవంగా భావిస్తూ సేవించే భార్యామణికి వేరే వ్రతాలూ, తపస్సులూ అవసరంలేదు.**

ఇవన్నీ వర్ణాలవారీగా ఆచరించదగిన విధులు. అయినా **జాతిమాత్రంచేత తెగను నిర్ణయించకూడదు. గుణంచేతనే నిర్ణయించాలి.**

ధర్మరాజా! ఇప్పుడు ఆశ్రమ ధర్మాలు చెప్తాను విను.

**బ్రహ్మచారి ముంజ మొలత్రాడు, గోచి, యజ్ఞోపవీతం, జింకచర్మం, పలాశ దండం, కమండలం ధరించాలి. కేశసంస్కారం చేసుకోకూడదు. గాయత్రీజపం చేస్తూ, గురువులను సేవిస్తూ, కొన్ని గృహాల నుంచి మాత్రమే నియమంగా భిక్ష స్వీకరిస్తూ, స్త్రీలకు దూరంగా ఉంటూ పవిత్రంగా జీవించాలి.**

**గృహస్థు– శుచినీ శుభ్రతనూ పాటిస్తూ, పెద్దలను, గురువులను, అతిథులను సేవిస్తూ, వేదాల్ని అధ్యయనం చేస్తూ పవిత్రంగా జీవించాలి. వానప్రస్థాశ్రమం స్వీకరించినవారు మహర్షుల్లాగా అడవుల్లో జీవించాలి. ముని నియమాలను పాటించి శ్రీహరిని ధ్యానించినవాడే మోక్షాన్ని పొందుతాడు. ఈ ఆశ్రమంలో ధర్మాల్ని పాటిస్తూ కోర్కెల్ని త్యజించి సన్యాసాశ్రమం స్వీకరించాలి.**

**సన్యాస ఆశ్రమంలో ఉన్నవాళ్ళు నిత్యం సమాధి నిష్ఠలో ఉంటూ సన్యాసి ధర్మాలను విధిగా పాటిస్తూ ఆత్మజ్ఞానాన్ని పొందాలి. అప్పుడే మోక్షం లభిస్తుంది' అంటూ నారదుడు ధర్మరాజుకు అజగరోపాఖ్యానం చెప్పటం ప్రారంభించాడు.**

## అజగరోపాఖ్యానం

మహాభక్తుడైన ప్రహ్లాదుడు చక్రవర్తియై రాజ్యపాలన చేస్తూ ఒకసారి లోక సంచారానికి బయలుదేరాడు. అలా వెళ్ళివెళ్ళి సహ్యపర్వత సానువుల్లో అజగర మహర్షిని దర్శించాడు.

ఆ మహర్షి ఒక కొండచిలువలా నేలపై దొర్లుతూ ఉన్నాడు. ఒళ్ళంతా దుమ్ముకొట్టుకుపోయి ఉన్నా ముఖంలో దివ్యతేజస్సు ప్రస్ఫుటంగా కనిపిస్తోంది.

వెంటనే ఆ మహర్షి దగ్గరకు వెళ్ళి చేతులు జోడించి–

'స్వామీ! తమరు ఎవరు? ఎందుకిలా ఉన్నారు? అని అడిగాడు. దానికా మహర్షి ఇలా చెప్పటం మొదలుపెట్టాడు–

**'ప్రహ్లాదా! నేనూ ఇంతకు ముందు అందరిలాగే సంసారంలో తలమునకలై ఉన్నవాడినే. అయితే ఎంత అనుభవించినా తృప్తి కలగలేదు. ఆ అసంతృప్తితో ఎన్నో జన్మలు ఎత్తాను. చివరికి ఈ మానవ జన్మను పొందాను. కర్మబంధాల నుండి విముక్తి పొందాలని ఇలా పడి ఉన్నాను.**

**తేనెటీగలు కూడబెట్టిన తేనె పరులపాలు అవుతుంది. లోభుల ధనమూ అంతే. దొరికినదాన్నే తింటూ పెద్ద పాము కూడా కదలకుండా పడి ఉండి చిరకాలం జీవిస్తుంది.** తేనెటీగ, కొండచిలువ నాకు గురువులు.

నాకు ఏది దొరికితే అదే తింటాను. ఏది లభిస్తే అదే కట్టుకుంటాను. లేకపోతే దిగంబరంగానే ఉండిపోతాను. ఎక్కడైనా పడుకుంటాను. ఒకరిని ఏదీ అడగను. దొరకలేదని బాధపడను. ప్రేమ-ద్వేషం, సుఖం-దుఃఖం ఇలాంటివేవీ నాకు లేవు. ఎవరినీ నిందించను. ఎవరినీ స్తుతించను. ఎప్పుడూ నిశ్చింతగా, తృప్తిగా ఉండడానికి ప్రయత్నిస్తాను.

కొన్నాళ్ళు దిగంబర పిశాచంలా ఉన్నాను. ఇప్పుడు చాలా కాలం నుండీ ఇలా కొండచిలువలా ఉంటున్నాను. నువ్వు భాగవతోత్తముడివి కాబట్టి నీకు ఇదంతా చెప్పాను' అన్నాడు మహర్షి. అంతా విన్న ప్రహ్లాదుడు ఆ మహర్షికి భక్తితో నమస్కరించి వెళ్ళిపోయాడు.

ధర్మరాజా! **గృహస్థుగా ఉంటూ కూడా మోక్షాన్ని పొందవచ్చు. ప్రతి పనినీ భగవంతుడికే అర్పిస్తూ, నిత్యం భగవంతుణ్ణే స్మరిస్తూ, వ్యామోహాలు విడిచిపెట్టి ఇతరులకు సహాయం చేస్తూ, అతిథుల్ని ఆదరిస్తూ ధర్మమార్గంలో జీవించి పరమ పదాన్ని చేరుకోవచ్చు.**

**కం. హరియందు జగము లుండును**
**హరిరూపము సాధుపాత్రమం దుండు శివం**
**కరమగు పాత్రము గలిగిన**
**నరయఁగ నదిపుణ్య దేశ మనఘచరిత్రా!** (7-450)

శ్రీహరి ఉదరంలోనే సమస్త లోకాలూ ఉంటాయి. అలాంటి శ్రీహరి సజ్జనులలో ఉంటాడు. ఆ సజ్జనుల్ని సేవిస్తే పుణ్యక్షేత్రాలను దర్శించిన ఫలం లభిస్తుంది. బ్రహ్మాండం అనే వృక్షానికి మూలం ఆ శ్రీమహావిష్ణువే. కాబట్టి శ్రీమన్నారాయణుడికి సంతర్పణ చేస్తే సమస్త ప్రాణులకూ చేసినట్లే. ఆ పరంధాముడి మహిమను తెలియజేసే గురువు సామాన్యుడు కాడు.

శరీరమే రథం. బుద్ధి దానికి సారథి. ఇంద్రియాలు గుర్రాలు. మనస్సు పగ్గం. ప్రాణాలు పదీ ఇరుసులు. ధర్మాధర్మాలు రథచక్రాలు. చిత్తం బంధం. శబ్ద,

రస, రూప, స్పర్శ, గంధాలనే తన్మాత్రలు ఈ రథం సంచరించే ప్రదేశాలు. అహంకారి అయిన జీవుడే రథికుడు. ఓంకారం ధనువు. శుద్ధజీవమే బాణం. బ్రహ్మమే పరమ లక్ష్యం. అరిషడ్వర్గమే బద్ధశత్రువు. కాబట్టి ఈ శరీరం అనే రథాన్ని మానవుడు అదుపులో ఉంచుకోవాలి. భక్తుల పాదసేవ అనే ఖడ్గంతో కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు అనే ఆరు శత్రువులను నాశనం చేయాలి.

## వేదమార్గం

వేదాలు మనకు రెండు మార్గాలను చూపిస్తున్నాయి. 1. ప్రవృత్తి మార్గం 2. నివృత్తి మార్గం.

మొదటిది పునర్జన్మను కలిగిస్తే రెండోది మోక్షాన్ని అందిస్తుంది. వీటిని అర్థం చేసుకున్నవాడు మోహాలకు లొంగిపోడు.

అంతెందుకు? నేనూ పూర్వజన్మలో స్త్రీలోలుడినే. ఒకసారి ప్రజాపతులు చేసిన సత్రయాగంలో విష్ణుకథల్ని గానం చేస్తూ మధ్యలో స్త్రీవ్యామోహంలో మైమరచి పోయాను. అందుకు ప్రజాపతులు ఆగ్రహించి, నన్ను శూద్రస్త్రీకి జన్మించమని శపించారు.

ఆ శాపంవల్ల ఒక శూద్రస్త్రీకి పుత్రుడిగా జన్మించాను. అయితే అదృష్టంకొద్దీ బ్రహ్మవేత్తలకు సేవచేశాను. దానివల్ల బ్రహ్మమానస పుత్రుడిగా జన్మించాను.

కాబట్టి సంసారంలో ఉంటూ కూడా నిశ్చలమైన భక్తితో శ్రీహరినిగానీ, శ్రీహరిభక్తుల్నిగానీ సేవిస్తే విముక్తి లభిస్తుంది. మీరెంతో అదృష్టవంతులు. సమస్త లోకాలకూ అధినాయకుడైన ఆ శ్రీహరి శ్రీకృష్ణుడుగా అవతరించి మీలో ఒకడిగా మీతో కలసిమెలసి తిరిగాడు. ఇంతటి భాగ్యానికి నోచుకున్న నీ మహిమను ఎంతని చెప్పను? అన్నాడు నారదుడు. అంతా విన్న ధర్మరాజు తన యాగమండపంలో చిద్విలాసంగా ప్రకాశిస్తున్న శ్రీకృష్ణుణ్ణి భక్తితో సేవించాడు.

'మహర్షులారా! ఈ విధంగా నారదుడు ధర్మరాజుకు వివరించిన విషయా లన్నింటినీ శుక మహర్షి విపులంగా పరీక్షిత్తుకు వినిపించాడు' అన్నాడు సూత మహర్షి.

# అష్టమ స్కంధం

**సూ**త మహర్షి ఇలా అన్నాడు: 'మహర్షులారా! పరీక్షిత్తు కోరికపై శుకమహర్షి యజ్ఞుడి కథ చెప్పటం ప్రారంభించాడు.

రాజా! స్వాయంభువ మనువు తన భార్య శతరూపతో కలసి అడవులకు వెళ్ళిపోయాడు. అక్కడ తీవ్రమైన తపస్సు సాగించాడు. అతడిని శ్రీమన్నారాయణుడే రాక్షసుల బారినుండి రక్షించాడు. ఈ స్వాయంభువుడు పరిపాలించిన మన్వంతరమే మొట్టమొదటిది.

రెండో మనువు స్వారోచిషుడు. ఇతడి కాలంలోనే విష్ణుమూర్తి 'విభుడు' అనే పేరుతో అవతరించాడు.

ఉత్తముడు మూడో మనువు. ఇతడి కాలంలో 'సత్యసేనుడు' అనే పేరుతో శ్రీహరి అవతరించి దుష్టశిక్షణ గావించాడు.

నాలుగో మనువైన తామసుడి కాలంలోనే శ్రీహరి గజేంద్రుణ్ణి రక్షించాడు అన్నాడు శుకమహర్షి. దానికి పరీక్షిత్తు వెంటనే అందుకొని

'మహర్షీ! ఆ వృత్తాంతాన్ని వినాలని ఆసక్తిగా ఉంది. వివరించండి' అన్నాడు. శుకమహర్షి ప్రారంభించాడు.

## గజేంద్రుడి మోక్షం

రాజా! క్షీరసాగరం మధ్యలో ఒక అందమైన పర్వతం ఉంది. దాని పేరు త్రికూటం. దానికి మూడే శిఖరాలు. వాటిలో ఒకటి బంగారం. రెండు వెండి. మూడోది ఇనుము. ఆ సుందర పర్వతంపై దేవతలు విహరిస్తూ ఉంటారు.

అక్కడ జంతువులన్నీ ఒక ఎత్తు. ఏనుగులు మాత్రం ఒక ఎత్తు. మహామహా క్రూరమృగాలు సైతం అక్కడి ఏనుగుల్ని చూసి తోక ముడవవలసిందే. ఒక్కో ఏనుగూ దిగ్గజాల్ని తలదన్నేలా ఉంటుంది.

ఎంతో దర్పంతో మదించి ఉండే ఆ ఏనుగులు ఒకసారి అడవిలో విహారానికి బయలుదేరాయి. అన్ని ఏనుగులు గుంపులుగా వచ్చేసరికి తక్కిన జంతువులన్నీ ఎక్కడికక్కడ సర్దుకున్నాయి.

అడవిని అతలాకుతలం చేస్తూ అటూ ఇటూ తిరుగుతూ, చెట్లను పెకలిస్తూ, కావలసినవి తింటూ తిరుగుతున్నాయి ఆ ఏనుగులు.

## ఏనుగుల స్వైరవిహారం

ఆ ఏనుగుల సమూహంలో ఒక గజరాజు తన ప్రియురాళ్లతో కలసి మంద నుండి విడిపోయాడు. దారి తప్పాడు. ఎటో వెళ్ళిపోయాడు.

ఈ గజరాజుకూ అతడి చుట్టూ ఉన్న తక్కిన ఏనుగులకీ ఒకటే దాహంగా ఉంది. నీళ్ళ కోసం వెతుకుతున్న సమయంలో అక్కడికి దగ్గర్లోనే ఒక అందమైన సరస్సు కనిపించింది. వెంటనే గజరాజు తన ఏనుగులతో సహా అందులోనికి చొరబడ్డాడు.

కడుపు నిండా నీళ్ళు తాగి, ఒకదానిపై ఒకటి నీళ్ళు చిమ్ముకొంటూ సేద తీరుతున్నాయి ఏనుగులన్నీ.

ఇంతలో ఒక మొసలి చటుక్కున ఈ గజరాజు కాలు పట్టుకుంది.

గజేంద్రుడు ఆ పట్టు తప్పించుకొని తొండంతో ఒక్కటి వేశాడు దాన్ని. దెబ్బకి ఆ మొసలి చచ్చిన పాములా నీళ్లలో పడింది. కానీ వెంటనే తేరుకొని గజేంద్రుడి ముందరికాళ్ళు పట్టుకుంది.

ఈసారి దంతంతో పొడిచాడు గజేంద్రుడు. మొసలి కోపంతో గజేంద్రుడి తోకను కరిచింది.

**కం. కరిఁదిగుచు మకరి సరసికిఁ**
**గరి దరికిని మకరిఁదిగుచుఁ గరకరి బెరయన్**
**గరికి మకరి మకరికిఁ గరి**
**భరమనుచును నతలకుతల భటు లదురుపడన్** (8–54)

మకరి = మొసలి, కరిని = ఏనుగును సరస్సులోనికి ఈడుస్తుంటే కరి మకరిని గట్టుమీదికి లాగుతోంది. ఇలా ఉన్న వాటిని చూసి కరి గొప్పదంటే

మకరి గొప్పదని అతలంలోనూ కుతలంలోనూ ఉన్న భటులు ఆశ్చర్యపోతున్నారు. ఆడ ఏనుగులు పక్కనే ఉన్నాయిగానీ ఏమీ చేయలేక గజేంద్రుణ్ణి విడిచి రాలేక నిస్సహాయంగా చూస్తూ ఉండిపోయాయి.

మొసలికి నీరే స్థానబలం. కాబట్టి అంతకంతకూ దాని బలం పెరుగుతోంది. గజేంద్రుడి బలం తగ్గిపోతోంది. ఇక ఆ మొసలి ఇంకా రెచ్చిపోయింది. నానారకాలుగా హింసించింది. రెండు పాదాలనూ నేలపై అదిమిపట్టింది. గాలిని బంధించింది. ఒక యోగీంద్రుడిలా స్థిరంగా పట్టువిడువకుండా ఏకాగ్రతతో ఏనుగు పాదాల్ని గట్టిగా పట్టుకుంది.

సంసారంలో చిక్కుకొనే మానవుడి పరిస్థితిలాగే ఉంది గజేంద్రుడి స్థితి. యుద్ధం జరుగుతూనే ఉంది. శక్తినంతా కూడదీసుకొని మరీ గజేంద్రుడు పోరాడుతున్నాడు. అలా ఆ యుద్ధం వెయ్యి సంవత్సరాలపాటు సాగింది. ఇంకా సాగుతూనే ఉంది.

## శరణాగతి

గజేంద్రుడు ఆలోచనలో పడ్డాడు. 'దీన్ని ఎలా గెలవటం? ఎవరి సహాయం తీసుకోవాలి? నాకు దిక్కు ఎవరు? నన్ను ఆదుకొనేవాళ్ళే లేరా? ఇన్నాళ్ళూ ఎంత వైభవంగా జీవితాన్ని గడిపాను. బుద్ధి గడ్డితిని ఇలా వచ్చాను. ఇప్పుడు అనుభవిస్తున్నాను. భగవంతుడా! ఇప్పుడెలా స్వామీ! నా కష్టం తీరేదెలా?

ఉ. **ఎవ్వనిచే జనించు జగ మెవ్వని లోపలనుండు లీనమై**
**యెవ్వనియందు డిందుఁ బరమేశ్వరుఁ డెవ్వఁడు మూలకారణం**
**బెవ్వఁ డనాదిమధ్యలయుఁ డెవ్వఁడు సర్వముఁ దాన యైనవాఁ**
**డెవ్వఁడు వాని నాత్మభవు నీశ్వరు నే శరణంబు వేఁడెదన్.** (8-73)

ఈ జగము ఎవరివల్ల పుడుతోంది? ఎవరిలో ఉంటోంది? ఎవరిలో కలుస్తోంది? పరమేశ్వరుడు ఎవడు? మూలకారణం ఎవడు? మొదలూ నడుమా తుదీ లేనివాడు ఎవడు? అంతా తానే అయినవాడు ఎవడు? అలాంటివాడూ, తనంతట తానే పుట్టినవాడూ, ఈశ్వరుడూ అయినవాడినే నేను శరణు వేడుతాను.

**కం. లోకంబులు లోకేశులు**
**లోకస్థులుఁ దెగినఁ దుది నలోకంబగు పెం**
**జీఁకటి కవ్వల నెవ్వం**
**డేకాకృతి వెలుఁగు నతని నే సేవింతున్** (8-75)

లోకాలూ, లోకాధిపతులూ, లోకంలోని ప్రజలూ ఇలా అందరూ నశించిన తరువాత చూడశక్యంకాని పెద్ద చీకటి ఆవహిస్తుంది. ఆ చీకటికి అవతల ఒకే ఒక జ్యోతిస్వరూపం వెలుగుతూ ఉంటుంది. అలా ఎవరు వెలుగుతారో అతణ్ణే నేను సేవిస్తాను.

**కం. నర్తకుని భంగిఁ బెక్కగు**
**మూర్తులతో నెవ్వఁడాడు? మునులు దివిజులుం**
**గీర్తింపనేర రెవ్వని**
**వర్తన మొరు లెఱుఁగ రట్టివాని నుతింతున్** (8-76)

అనేకరూపాలతో నర్తకుడిలా ఎవడు నాట్యం చేస్తాడో, మునులూ దేవతలూ కూడా ఎవరిని కీర్తించలేరో, ఇతరులకు ఎవరి ప్రవర్తన అర్థం కాదో అటువంటి వాడినే నేను నుతిస్తాను. అంటూ పరమాత్మ తత్త్వాన్ని అనేక విధాలుగా ఊహించాడు. భగవంతుడి గుణాలనూ లక్షణాలనూ కమనీయంగా వినుతించాడు.

## శ్రీహరి ఆగమనం

అనేక గుణాలకు నెలవైన మనస్సు కలవాడు, కర్మబంధాలను పోగొట్టేవాడు, ఏ దిక్కూ లేని నాలాంటి పశువుల పాపాన్ని అణగద్రొక్కేవాడు, అందరిలోనూ అంతర్యామియై వెలిగేవాడు, నాశనంలేనివాడు, భగవంతుడు అయిన వాడికి నేను వందన మాచరిస్తాను.

ప్రశాంతుడు, మోక్షసుఖం ఎరిగినవాడు, ఉత్తమ వరాలను ప్రసాదించేవాడు, పరిపూర్ణుడు, మహాత్ముడు, బ్రహ్మ స్వరూపుడు, శ్రేష్ఠుడు, ఇంద్రియాతీతుడు, పరమ దయాళువు, స్వయం ప్రకాశకుడు, స్థూలసూక్ష్మస్వరూపుడు అయిన మహాత్ముణ్ణి నేను సేవిస్తాను.

కం. కలఁ డందురు దీనుల యెడఁ
గలఁడందురు పరమయోగిగణములపాలం
గలఁడందు రన్ని దిశలను
గలఁడు కలం డనెడువాఁడు గలఁడో లేఁడో! (8–86)

ఆ భగవంతుడు దీనులపట్ల ఉన్నాడని అందరూ అంటుంటారే! అలాగే శ్రేష్ఠులైన మహామునుల దగ్గరా ఉన్నాడంటారే! అన్ని దిక్కుల్లోనూ ఉన్నాడనీ అంటారే! ఇలా ఉన్నాడు ఉన్నాడు అనేవాడు అసలు ఉన్నాడా? లేడా?

సీ. కలుగఁడే నా పాలి కలిమి సందేహింపఁ
గలిమి లేములు లేక కలుగువాఁడు
నా కడ్డపడరాఁడె నలి నసాధువులచేఁ
బడిన సాధుల కడ్డపడెడువాఁడు
చూడఁడే నా పాటుఁ జూపులఁ జూడక
చూచువారలఁ గృపఁ జూచువాఁడు
లీలతో నా మొఱాలింపఁడే మొఱఁగుల
మొఱ లెఱుంగుచుఁ దన్ను మొఱఁగువాఁడు

తే.గీ. అఖిల రూపముల్ దనరూపమైనవాఁడు
నాదిమధ్యాంతములు లేక యడరువాఁడు
భక్తజనముల దీనుల పాలివాఁడు
వినఁడె! చూడఁడె! తలపఁడె! వేగ రాఁడె?! (8–87)

అతడు నాపట్ల ఉన్నాడో లేడో అని నేను ఒకపక్క సందేహిస్తూ ఉంటే తాను కలిమిలేములకు అతీతంగా వర్తిల్లేవాడై ఉండికూడా నా దగ్గరకు రాడేమిటి? మంచివాళ్లకోసం ఉన్నపళంగా అడ్డుపడతాడే? మరి నాకు అడ్డుపడడే? కళ్ళతో చూడకుండానే చూడగలవాడూ, తనను దర్శించేవారిని దయతో చూసేవాడూ నా తిప్పల్ని ఇప్పుడు ఎందుకు చూడడు? వంచకుల మొరలైతే తెలుసుకొంటాడే! మరి తనకు తానుగా దాగి ఉంటాడే! లీలతో నా మొర వినడెందుకు? అన్ని రూపాలూ తన రూపమే అయినవాడూ, ఆదిమధ్యాంతాలు లేకుండా ప్రకాశించేవాడూ, భక్త జనుల పక్షానా, దీనుల పక్షానా నిలిచేవాడూ ఇప్పుడు నా మొర వినడెందుకు?

నన్ను చూడడెందుకు? కనీసం నా గురించి ఆలోచించడెందుకు? నా కోసం వేగంగా రాడెందుకు?

విశ్వానికి సృష్టికర్త, విశ్వానికి దూరంగా ఉండేవాడూ, విశ్వానికి అంతరాత్మ విశ్వం ద్వారా తెలియబడేవాడూ, (విశ్వానికి తెలుసుకోదగినవాడూ), విశ్వమే తానైనా విశ్వాతీతుడూ, విశ్వంకంటే భిన్నమైనవాడూ, శాశ్వతుడూ, పుట్టుకలేనివాడూ, బ్రహ్మకు ప్రభువు, లోకాలను నడిపేవాడూ అయిన పరమపురుషుణ్ణే నేను భజిస్తాను' అని మనస్సులో ఆ భగవంతుణ్ణి నిలుపుకొని గజేంద్రుడు ఇలా ప్రార్థిస్తున్నాడు.

శా. **లావొక్కింతయు లేదు ధైర్యము విలోలంబయ్యెఁ బ్రాణంబులున్**
**ఠావుల్ దప్పెను మూర్ఛ వచ్చెఁ దనువున్ డస్సెన్ శ్రమంబయ్యెడిన్**
**నీవే తప్ప నితఃపరం బెఱుఁగ మన్నింపం దగున్ దీనునిన్**
**రావే! ఈశ్వర! కావవే! వరద! సంరక్షింపు భద్రాత్మకా!** (8-90)

శక్తి మొత్తం క్షీణించిపోతోంది. ధైర్యమా? అదీ సడలి పోయింది. ప్రాణాలేమో గతులు తప్పి, పోవడానికి సిద్ధంగా ఉన్నాయి. మూర్ఛ వచ్చేసింది. శరీరం బాగా అలసిపోయింది. శ్రమగా ఉంది. నావల్ల కావడం లేదు. నువ్వు తప్ప నాకు వేరే దిక్కు లేదు. ఈ దీనుణ్ణి మన్నించు. ఓ ఈశ్వరా! రా! వరదుడా! కాపాడు! భద్రాత్మకుడా! రక్షించు.

కం. **వినుదుఁట జీవుల మాటలు**
**చనుదుఁట చనరాని చోట్ల శరణార్థుల కో**
**యనుదుఁట పిలిచిన సర్వముఁ**
**గనుదుఁట సందేహ మయ్యెఁ గరుణావార్ధీ!** (8-91)

దయాసముద్రుడా! ఎవరు ఏమన్నా నువ్వు వింటావటగా! వెళ్ళరాని చోట్లకూ వెళ్తావట! శరణార్థులు పిలిస్తే 'ఓ' అంటావట! పిలిస్తే చాలు అంతా నువ్వే చూసు కుంటావట! మరి నాకెందుకో సందేహంగా ఉంది. నిజమేనా?

ఉ. **ఓ కమలాప్త! యో వరద! యో ప్రతిపక్ష విపక్ష దూర! కు**
**య్యో! కవియోగివంద్య! సుగుణోత్తమ! యో శరణాగతామరా**
**నోకహ! యో మునీశ్వరమనోహర! యో విమలప్రభావ! రా**
**వే! కరుణింపవే! తలఁపవే! శరణార్థిని నన్నుఁ గావవే!** (8-92)

లక్ష్మీదేవికి ఆప్తుడా! వరదుడా! నీకు సాటియైన శత్రువులే లేనివాడా! కవుల చేతా యోగులచేతా నమస్కరించబడేవాడా! సుగుణోత్తమ (సుగుణులలో ఉత్తముడా!) శరణాగత కల్పవృక్షమా! ముని మనోహరా! విమలమైన ప్రభావం కలవాడా! రావే! కరుణించవే! నా గురించి ఆలోచించవే! శరణార్థిని నన్ను రక్షించవే! అని ప్రార్థించాడు.

రక్షణలేనివాళ్ళను రక్షించే భగవంతుడే ఆపదలో ఉన్న నన్నూ ఆదుకొంటాడు అని గజరాజుకు నమ్మకం కలిగింది. నింగివైపు చూస్తూ ఆకాశానికి చెవులప్పగించి ఎవరైనా వచ్చే అలికిడి ఉందా అని వింటూ ప్రార్థిస్తున్నాడు. ఆ సమయంలో –

**ఆ.వె. విశ్వమయత లేమి వినియు నూరక యుండి**
**రంబుజాసనాదు లడ్డ పడక**
**విశ్వమయుఁడు విభుఁడు విష్ణుండు జిష్ణుండు**
**భక్తియుతున కడ్డపడఁ దలంచె.** (8–94)

అతడి ఆర్తనాదం తక్కిన దేవతలకూ వినిపించింది. కానీ వాళ్ళెవరికీ అంతటా వ్యాపించి ఉండే గుణం లేదు. అందుకే వాళ్ళు గజేంద్రుణ్ణి కాపాడటానికి సిద్ధపడలేకపోతున్నారు. అంతటా వ్యాపించినవాడూ, ఆపద్బాంధవుడూ అయిన విష్ణుదేవుడు ఈ గజేంద్రుణ్ణి కాపాడాలి' అనుకొన్నాడు.

**మ. అల వైకుంఠపురంబులో నగరిలో నా మూలసౌధంబు దా**
**పల మందారవనాంతరామృత సరః ప్రాంతేందుకాంతోపలో**
**త్పల పర్యంక రమావినోదియగు నాపన్నప్రసన్నుండు వి**
**హ్వలనాగేంద్రము 'పాహి పాహి' యనఁ గుయ్యాలించి సంరంభియై.**
(8–95)

వైకుంఠపురంలో ఒక అంతఃపురం ఉంది. దాని లోపలి ఒక ప్రధాన భవనం. దాని లోపల మందారవనం. అందులో అమృత సరస్సు. ఆ ప్రక్కనే చంద్రకాంత శిలావేదిక. దానిపై ఉంది ఒక కలువపూల పానుపు. దానిపై కూర్చొని లక్ష్మీదేవితో సరదాగా కబుర్లు చెప్తున్నాడు స్వామి. అప్పుడు ఆ లక్ష్మీదేవి చీర కొంగు ఆయన చేతిలో ఉంది. దానిని (విడిచివేయటం కూడా మరచి) అలాగే పట్టుకొని గజేంద్రుడి ఆర్తనాదం వినగానే ఉన్నపళంగా బయలుదేరాడు.

**మ. సిరికిం జెప్పఁడు శంఖచక్రయుగముం జేదోయి సంధింపఁ డే**
**పరివారంబును జీరఁ డభ్రగపతిం బన్నింపఁ డాకర్ణికాం**
**తరథమ్మిల్లముఁ జక్కనొత్తఁడు వివాదప్రోత్థిత శ్రీభుజో**
**పరిచేలాంచలమైన వీడఁడు గజప్రాణావనోత్సాహియై.** (8–96)

లక్ష్మీదేవికి చెప్పలేదు. శంఖచక్రాల్ని ధరించలేదు. ఎవరినీ పిలవలేదు. గరుడ వాహనాన్ని ఎక్కలేదు. కనీసం లక్ష్మీదేవి చీర కొంగునైనా విడిచిపెట్టలేదు. పరుగుపరుగున బయలుదేరాడు హరి. హరి వెనుక సిరి. ఆమె వెనుక పరివారం. వారి తరువాత గరుడుడు, వెనుక పంచాయుధాలు, నారదుడు, విష్వక్సేనుడు ఇలా వైకుంఠంలో ఉన్న ఆబాల గోపాలమూ కదిలింది.

**మ. తన వేంచేయు పదంబుఁ బేర్కొనఁ డనాథస్త్రీ జనాలాపముల్**
**వినెనో! మ్రుచ్చులు మ్రుచ్చులించిరొ ఖలుల్ వేద ప్రపంచంబులన్,**
**దనుజానీకము దేవతానగరిపై దండెత్తెనో! భక్తులం**
**గని చక్రాయుధుఁడేడి చూపుఁడని ధిక్కారించిరో! దుర్జనుల్** (8–100)

ఎక్కడికి వెళ్తున్నాడో చెప్పడు, అనాథస్త్రీల ఆర్తనాదాలు విన్నాడా? వేదాల్ని ఎవరైనా అపహరించారా? రాక్షసులు దేవతలనగరంపైకి దండెత్తివచ్చారా? భక్తుల్ని పట్టుకొని శ్రీహరి ఎక్కడ? చెప్పండి అంటూ దుర్మార్గులు కొడుతున్నారా? అని లక్ష్మీదేవికి మనసులో ఆందోళన. ఏం జరిగిందోనని. అడుగుదామని ముందుకు వెళ్తోంది. కానీ మళ్ళీ భయం. వెనక్కి వస్తోంది. అలా వెళ్తున్న వీళ్ళందరినీ ఆకాశంలో దేవతలు 'అడుగో శ్రీహరి! అదిగో లక్ష్మీదేవి!' అంటూ సంబరంగా చూస్తున్నారు. భక్తితో చేతులెత్తి మొక్కుతున్నారు.

విష్ణుమూర్తి గజరాజును కాపాడాలనే తొందరలోనే ఉన్నాడు. అందువల్ల దేవతల నమస్కారాలను పెద్దగా పట్టించుకోలేదు. ఆ సరస్సు చేరి తన సుదర్శన చక్రాన్ని వెంటనే ఆ మొసలిపై ప్రయోగించాడు. ఎంతో వేగంగా వెళ్ళి ఆ చక్రం మొసలి తలను ఖండించివేసింది.

చిక్కి శల్యమైన గజేంద్రుడు 'బతుకు జీవుడా!' అంటూ బయటపడ్డాడు. మొసలి నోట్లో నుంచి విడిపడ్డ తన కాలును హాయిగా అటూ ఇటూ ఆడించాడు.

ఆడ ఏనుగుల ఆనందానికి అవధుల్లేవు. ప్రేమగా దగ్గరికి వచ్చాయి. గజేంద్రుడిపై నీళ్ళు చిలకరించి అభిషేకం చేశాయి.

**శా. పూరించెన్ హరి పాంచజన్యముఁ గృపాంభోరాశి సౌజన్యమున్**
**భూరిధ్వాన చలాచలీకృత మహాభూత ప్రచైతన్యమున్**
**సారోదారసిత ప్రభాచకిత పర్జన్యాది రాజన్యమున్**
**దూరీభూత విపన్నదైన్యమును నిర్ధూతద్విషత్సైన్యమున్** (8-116)

కృపవిషయంలో సముద్రమంతటి సౌజన్యం కలదీ, తన గొప్ప ధ్వనివల్ల స్థావర జంగమాల చైతన్యాన్ని తారుమారు చేసేదీ, తన తెల్లనికాంతులవల్ల చకితులైపోయిన ఇంద్రాది దిక్పాలకులు కలదీ, దూరం చేసిన విపన్నుల దైన్యం కలదీ, ఎగురగొట్టబడిన శత్రుసైన్యం కలదీ అయిన పాంచజన్యాన్ని పూరించాడు శ్రీహరి. దిక్కులు పిక్కటిల్లి పోయాయి. ఆ పరంధాముడి భక్తవత్సలతను చూసిన దేవతలు పులకించిపోయారు. దేవ దుందుభులు మ్రోగాయి. పూలవానలు కురిశాయి.

శ్రీమన్నారాయణుడే గజేంద్రుణ్ణి ప్రేమగా నిమిరి సరస్సు నుంచి బయటకు తీసుకువచ్చాడు. శ్రీహరి స్పర్శతో ఆ గజేంద్రుడికి వెయ్యి ఏనుగుల బలం వచ్చినట్లయింది. ఒళ్ళంతా పులకించింది.

రాజా! నిజానికి ఈ మొసలి 'హూహూ' అనే గంధర్వుడు. ఈ గజేంద్రుడు 'ఇంద్రద్యుమ్నుడు' అనే చక్రవర్తి.

హూహూ - దేవలుడు అనే మహర్షి శాపంవల్ల ఇదుగో ఇలా మొసలిగా ఉన్నాడు. ఇప్పటికిగానీ అతడికి విముక్తి లభించలేదు.

ఇంద్రద్యుమ్నుడు అగస్త్య మహర్షిని గౌరవించకపోవటంవల్ల అతడి శాపానికి గురై ఏనుగుగా పుట్టాడు. అతడి పరివారమూ ఏనుగులుగా పుట్టాయి. చివరికి గజేంద్రుడు తన పరివారంతో సహా విష్ణుభక్తి వల్లనే తరించాడు.

రాజా! ఆ తరువాత శ్రీహరి లక్ష్మీదేవిని తమాషాగా ఒక ప్రశ్న వేశాడు. 'లక్ష్మీ! నేను అలా నీకు చెప్పా పెట్టకుండా వెళ్తుంటే నీకేమనిపించింది? అయినా నా సంగతి నీకు తెలుసు కదా!

**కం. ఎఱుఁగుదు తెఱవా! యెప్పుడు**
**మఱవను సకలంబు నన్ను మఱచినయెడలన్**
**మఱతునని యెఱిఁగి మొఱఁగక**
**మఱవక మొఱయిడిరయేని మఱినన్యములన్.** (8-130)

**నన్ను నమ్ముకున్నవాళ్ళు ఏదైనా కష్టంలో ఉంటే వాళ్ళను వెంటనే రక్షిస్తాను. నన్ను గుర్తుంచుకున్నవాళ్ళను నేను గుర్తుంచుకుంటాను. నన్ను మర్చిపోయిన వాళ్ళని నేనూ మర్చిపోతాను, ఇది తెలిసి, కష్టాల్లో ఇతరుల్ని ఆశ్రయించక, నాతో మొరపెట్టుకున్న వారిని ఎన్నటికీ విడువను'** అన్నాడు.

అప్పుడు లక్ష్మీదేవి 'స్వామీ! నాకు మీ పాదాలను ధ్యానించటం తప్ప వేరే ఆలోచన ఉంటుందా? దీనుల ఆర్తిని వినటం, వాళ్ళను రక్షించటం మీకే చెల్లింది. మీరు దీనులకు అధీనులై ఉంటారు కదా!' అని కొనియాడింది.

**రాజా! అందుకే ఈ కథ పుణ్యప్రదమైనది. ఎవరు ఈ కథను భక్తిశ్రద్ధలతో వింటారో, చదువుతారో వారికి ఎల్లప్పుడూ శుభమే జరుగుతుంది. ఈ వృత్తాంతం నాలుగో మనువు కాలంలో జరిగింది.**

తరువాత రైవతుడు అనే చక్రవర్తి ఐదో మనువై భూమిని పాలించాడు. ఈ కాలంలోనే శ్రీహరి - శుభ్రుడికి, వికుంఠ ద్వారా 'వైకుంఠుడు' అనే పేరుతో అవతరించాడు. వైకుంఠ లోకాన్ని సృష్టించాడు.

ఆరో మనువు చాక్షుషుడు. ఇతడి కాలంలోనే క్షీరసాగర మథనం జరిగింది. ఆ కథ చెప్తాను విను.

## క్షీరసాగరమథనం

దేవతలు - రాక్షసుల దారుణాలను భరించలేక శ్రీహరిని శరణు వేడారు. దుర్వాస మహర్షి శాపం వల్ల దేవతల ఐశ్వర్యం గంగపాలైపోయింది. దిక్కులేని స్థితిలో 'శ్రీమన్నారాయణా! నువ్వే దిక్కు' - అంటూ మొరపెట్టుకున్నారు.

ఆ పరంధాముడు వీళ్ళ మొరను ఆలకించాడు. 'దేవతలారా! కొన్నాళ్ళు రాక్షసులను మచ్చిక చేసుకొని, వాళ్ళను క్షీరసాగర మథనానికి ఒప్పించండి. అమృతాన్ని సాధించండి. నేను మీకు అండగా ఉంటాను' అని అభయమిచ్చాడు.

దేవతలు ఎగిరి గంతేశారు. వెనక్కి వెళ్ళి రాక్షసులతో చెలిమి చేశారు. దేవేంద్రుడు బలిచక్రవర్తిని సేవిస్తూ క్షీరసాగర మథనానికి వాళ్ళను ఒప్పించాడు.

దేవతలూ రాక్షసులూ కదిలారు. మందర పర్వతాన్ని పెకలించారు. కానీ దాన్ని ఎత్తలేక చతికిలపడ్డారు. కొంతమంది దాని కింద పడి ప్రాణాలు కోల్పోయారు. కొందరు చిక్కుకొనిపోయి విలవిలలాడారు. ఒకానొక సమయంలో 'అసలెందుకిదంతా?' అన్న నిరాశ ఆవహించింది దేవతల్ని.

అప్పుడే అచ్యుతుడు అక్కడికి వచ్చాడు. ఒక బంతిని చేతితో కదిల్చినట్లుగా మందరపర్వతాన్ని కదిపాడు. కొందరు బతికి బయటపడ్డారు. శ్రీహరి గరుడుడిని పిలిచాడు. మందర పర్వతాన్ని, శ్రీహరిని తన మూపుపై ఉంచుకొని రివ్వున గాలిలోకి కదిలాడు గరుత్మంతుడు. దాన్ని క్షీరసాగరంలో ఉంచి వెళ్ళిపోయాడు.

దేవదానవులు వాసుకిని ప్రార్థించారు. ఇప్పుడు మందర పర్వతం కవ్వం అయితే వాసుకి కవ్వపు తాడు అయ్యాడు. వాసుకిని రాక్షసులు తోకవైపు దేవతలు తలవైపు పట్టుకున్నారు. అది అవమానంగా భావించి తాము తలవైపే ఉంటామన్నారు రాక్షసులు. శ్రీహరి సరేనన్నాడు.

మథనం ప్రారంభమయింది. అలా మొదలయ్యిందో లేదో మందరం బుడబుడ మని మునిగిపోయింది. అప్పుడు శ్రీమన్నారాయణుడే కూర్మరూపాన్ని ధరించి సముద్రం అడుక్కి వెళ్ళి పర్వతాన్ని వీపుపై ఉంచుకొని పైకి ఎత్తాడు.

పర్వతం లేచింది. జై శ్రీమన్నారాయణ! జై శ్రీమన్నారాయణ! అన్న నినాదాలు మిన్నుముట్టాయి.

అంతా తానే అయి ఈ కార్యక్రమం నడిపిస్తున్నాడు పరమాత్మ. పర్వతం సముద్రంలో గుబగుబలాడుతూ తిరుగుతోంది.

అటు రాక్షసులూ ఇటు దేవతలూ ఉత్సాహంగా చిలుకుతున్నారు. అట్టహాసాలు, కేకలు, హెచ్చరికలు. వీటితో దిక్కులు పిక్కటిల్లిపోతున్నాయి.

వాళ్ల వేగానికి సముద్రం అల్లకల్లోలమైపోయింది. అందరూ చూస్తుండగానే సముద్రంలోంచి హాలాహలం పుట్టుకొచ్చింది. ఒక్క క్షణంలోనే భుగభుగమనే జ్వాలలతో సముద్రాన్నే కాదు బ్రహ్మాండమంతా విస్తరించింది.

దేవదానవులు హడలిపోయారు. బ్రహ్మదేవుణ్ణి తీసుకొని వెళ్ళి ఈశ్వరుణ్ణి శరణు వేడారు.

శివుడు పరమ దయామయుడు. కష్టంలో ఉన్నవాళ్ల కష్టాన్ని తీర్చటం ప్రభువుల విధి.

**కం. పరహితము సేయు నెవ్వఁడు**
**పరమహితుం డగును భూతపంచకమునకున్**
**బరహితమె పరమధర్మము**
**పరహితునకు నెదురు లేదు పర్వేందుముఖీ!** (8–235)

**'పరహితం చేసేవాడే పంచభూతాలకూ హితుడు. పరహితమే శ్రేష్ఠమైన ధర్మం. పరహితం కోసం పాటుపడేవాడికి ఎదురే లేదు.**

ఏమంటావు పార్వతీ!, అన్నాడు. పార్వతీదేవి సరేనంది. ఆ తల్లి కూడా ఎంతటి దయామయురాలో!

**కం. మ్రింగెడు వాడు విభుండని**
**మ్రింగెడిదియు గరళమనియు మేలని ప్రజకున్**
**మ్రింగుమనె సర్వమంగళ**
**మంగళసూత్రంబు నెంత మది నమ్మినదో.** (8–241)

మింగేవాడు తన భర్త అనీ, మింగబోయేది హాలాహలవిషమనీ, మింగితే లోకానికి మంచి జరుగుతుందనీ తెలుసు. తెలిసీ ఆ సర్వమంగళ తానే స్వయంగా అంగీకరించిందంటే ఆ తల్లికి తన మంగళసూత్రం గట్టిదన్న నమ్మకం ఎంత ఉన్నదో కదా!

శివుడు ఇంక ఆలస్యం చేయలేదు. ఆ గరళాన్ని చిన్న ఫలరసంలా మ్రింగి కంఠంలోనే ఉంచాడు. ఎందుకంటే ఆయన పొట్టలో సకల లోకాలూ ఉన్నాయి కాబట్టి. అయినా ఇంత సాహసం ఒక్క శివుడికి తప్ప మరొకరికి సాధ్యమయ్యేదేనా?

ఆటంకం తొలగిపోవటంతో దేవదానవులు మళ్ళీ మథనాన్ని ప్రారంభించారు. ఈసారి వరుసగా సాగరంలోంచి కామధేనువు, ఉచ్చైశ్శ్రవం, ఐరావతం, కల్పవృక్షం, అప్సరసలు, చంద్రుడు, లక్ష్మీదేవి ఆవిర్భవించటంతో వాళ్ళు ఇంకా ఉత్సాహంగా మథిస్తున్నారు.

లక్ష్మీదేవి విష్ణువును వరించింది. తరువాత 'వారుణి' పుట్టింది. దానిని రాక్షసులు తీసుకున్నారు.

ఆ తరువాత ధన్వంతరి, చేతిలో అమృతభాండంతో దివ్యకాంతులు వెదజల్లుతూ ఆవిర్భవించాడు. దానికోసం దేవదానవుల్లో యుద్ధం మొదలయ్యింది.

అప్పుడు శ్రీమన్నారాయణుడు 'మోహిని' అవతారం ధరించాడు. మోహిని అతిలోక సౌందర్యంతో రాక్షసుల్ని మోహంలో ముంచెత్తింది. దేవతల్నీ రాక్షసుల్నీ విడిగా రెండు వరుసల్లో కూర్చోబెట్టింది. రాక్షసులకు ఒయ్యారాల్ని ఒలకబోస్తూ, దేవతలకు అమృతాన్ని ధారబోసింది. అది గమనించాడు రాహువు. దేవతల వరుసలో కూర్చొని అమృతాన్ని త్రాగడం మొదలుపెట్టాడు. సూర్యచంద్రులు అది పసిగట్టి మోహినికి సైగ చేశారు.

అంతే! మోహిని ఆదేశం, సుదర్శనుడి ఆగమనం వెంటవెంటనే జరిగాయి. రాహువు తల తెగి క్రింద పడింది. కానీ అమృతం త్రాగిన కారణంగా అది మరణించలేదు. మొండెం మాత్రం నేలకూలింది.

జరిగిన మోసాన్ని అప్పటికిగానీ తెలుసుకోలేకపోయారు రాక్షసులు. తెలిసే సరికి అమృతాన్ని పూర్తిగా దేవతలకే పంచటం పూర్తిచేసింది మోహిని. అవతారాన్ని చాలించిన శ్రీమన్నారాయణుడు గరుడ వాహనంపై వెళ్ళిపోయాడు. రాక్షసులు పట్టరాని కోపంతో దేవతలపై విరుచుకు పడ్డారు.

బాణాలు, గండ్రగొడ్డళ్ళు, చక్రాలు, కొరడాలు, గదలు, కత్తులు, ఈటెలు, గుదియలు ఆకాశంలో ఎగురుతున్నాయి. దేవేంద్రుడు వీరవిజృంభణ చేస్తున్నాడు. అప్పుడు బలిచక్రవర్తి రాక్షసమాయ సృష్టించాడు. దేవతలు ఆ మాయకు తాళలేక శ్రీహరిని ప్రార్థించారు.

శ్రీహరి వచ్చాడు. అతడి రాకతో రాక్షసమాయ మటుమాయమైపోయింది. తన పైకి వచ్చిన కాలనేమి, సుమాలి, మాల్యవంతుడు అనే రాక్షసుల్ని శ్రీహరి వధించాడు.

విష్ణువు రంగప్రవేశంతో ఇంద్రుడు మళ్ళీ విజృంభించాడు. బలిచక్రవర్తి పైకి దూకాడు. వీళ్ళిద్దరికీ యుద్ధం సాగుతోంది. మధ్యలో అడ్డువచ్చిన బలాసురుణ్ణీ, పాకాసురుణ్ణీ, నముచినీ ఇంద్రుడు వధించాడు. ఇంతలో నారద మహర్షి వచ్చి ఇరుపక్షాలకు సర్దిచెప్పి యుద్ధాన్ని విరమించేలా చేశాడు.

రాక్షసులు బలిచక్రవర్తితో కలిసి పడమటి కొండవైపుకు చేరుకున్నారు. శుక్రాచార్యుడు మృతసంజీవిని విద్య ద్వారా రాక్షసుల్ని తిరిగి బతికించాడు.

రాజా! ఇదిలా ఉండగా శివుడికి మోహినీ అవతారం చూడాలనిపించింది. వెళ్ళి శ్రీహరిని అడిగాడు. వెంటనే శ్రీహరి అదృశ్యమైపోయాడు.

అక్కడే శివుడి ముందు ఒక అందమైన ఉద్యానవనం కనిపించింది. అందులో ఒక సౌందర్యవతి. ఆమె అందం అంతా ఇంతా కాదు. ముల్లోకాల్లోనూ ఎక్కడా లేనంత అందం. శివుడి మనసు చలించిపోయింది. సుందరీ! అంటూ ఆమె వెంటపడ్డాడు.

అలా శివుణ్ణి కూడా మోహంలో ముంచెత్తేలా చేసిన ఆ సౌందర్యవతి ఎవరో కాదు సాక్షాత్తూ మోహినీ అవతారాన్ని దాల్చిన విష్ణుమూర్తియే.

ఆమె శివుణ్ణి ప్రపంచం మొత్తం తిప్పించింది. తిరిగి తిరిగి ఇది విష్ణుమాయ అని గ్రహించాడు శివుడు. అందరిలా మోహినీ మాయలో పడకుండా తత్త్వం తెలుసుకున్నాడు. అందుకే శివుణ్ణి విష్ణుమూర్తి మెచ్చుకున్నాడు.

'పరీక్షిన్మహారాజా! ఈ క్షీర సాగర మథనం, మోహినీ అవతార గాథ ఎంతో పవిత్రమైనవి. వింటే చాలు సకల శుభాలనూ కలిగిస్తాయి' అంటూ రాజు కోరికపై తిరిగి ఇలా చెప్తున్నాడు శుకమహర్షి.

'రాజా! ఇప్పుడు ఏడో మనువు వైవస్వతుడి కాలం. ఎనిమిదో మనువు సావర్ణి. అతడి తరువాత దక్షసావర్ణి, బ్రహ్మసావర్ణి, ధర్మసావర్ణి, దేవసావర్ణి, ఇంద్రసావర్ణి వరుసగా మనువులవుతారు.

ఎంతటి చక్రవర్తులయినా శ్రీమన్నారాయణుడి ఆజ్ఞకు కట్టుబడి ఉండవలసిందే. దీనికి నీకు వామనావతార గాథ చెప్తాను విను.

## వామనావతారం

బలిచక్రవర్తి శుక్రాచార్యుడి దయవల్ల 'విశ్వజిత్' యాగం చేసి సర్వవిధాలా సంపన్నుడయ్యాడు. శక్తిమంతమైన ఆయుధాలను సంపాదించి దేవతల్ని జయించాడు. ఇంద్రనగరి అమరావతిని ఆక్రమించాడు. దేవతలు చేసేదేమీ లేక పారిపోయారు.

ముల్లోకాలలోనూ తిరుగులేని ఆధిపత్యంతో ఉన్నాడు బలి చక్రవర్తి.

దేవతలను ఆదుకోవటం తప్పనిసరి అయింది. కశ్యపప్రజాపతి, అదితి దంపతులకు శ్రీమన్నారాయణుడు తానే పుత్రుడిగా జన్మించాలని సంకల్పించాడు.

అదితి – కశ్యపుడి ఆదేశంతో 'పయోభక్షణం' అనే వ్రతం ఆచరించింది. ఆ వ్రతఫలంగా శ్రీహరి ప్రసన్నుడై ఆ దంపతులకు ఒక శుభ ముహూర్తంలో చతుర్భుజాలతో, పంచాయుధాలతో అవతరించాడు.

అదితి పరమానందభరితురాలయింది. లోకమంతటా ఆనందం వెల్లివిరిసింది.

తరువాత స్వామి ఆ రూపాన్ని విడిచి వామనుడి రూపాన్ని ధరించాడు. సరిగ్గా ఉపనయనం చేసే వయస్సు. అందుకే కశ్యప ప్రజాపతి ఆ ఉత్సవాన్ని నిర్వహించాడు.

సాక్షాత్తు సూర్యుడే వామనుడికి సావిత్రీ మంత్రాన్ని ఉపదేశించాడు. బృహస్పతి యజ్ఞోపవీతాన్నీ, కశ్యపుడు ముంజినీ, అదితి కౌపీనాన్నీ, భూమి జింక చర్మాన్నీ, చంద్రుడు దండాన్నీ, ఆకాశం గొడుగునూ, బ్రహ్మ కమండలాన్నీ, సరస్వతి జపమాలనూ, సప్తర్షులు దర్భల్నీ ఇచ్చారు.

కుబేరుడు భిక్షాపాత్రను ఇస్తే పార్వతీదేవి పూర్ణభిక్షను పెట్టింది. అందరూ మనసారా దీవించారు.

అక్కడికి వచ్చిన పెద్దల ద్వారా బలిచక్రవర్తి గురించి విని అతడు మహాదాత అని తెలుసుకొని ఆయనవద్దకు బయలుదేరాడు వామనమూర్తి.

**కం. హరిహరి! సిరి యురమునఁ గల**
**హరి హరిహయుకొఱకు దనుజు నడుగం జనియెం**
**బరహితరతిమతియుతులగు**
**దొరలకు నడుగుటయు నొడలి తొడవగుఁబుడమిన్** (8–526)

సాక్షాత్తూ లక్ష్మీదేవిని తన వక్షఃస్థలంలో నిలుపుకున్న శ్రీమంతుడైన శ్రీహరి ఇప్పుడు ఇంద్రుడి ఐశ్వర్యం కోసం బలిచక్రవర్తిని యాచించడానికి వెళ్తున్నాడు. **లోకహితం కోసం బిచ్చమెత్తితే - దొరలకు అది కూడా అలంకారమే కదూ!**

నర్మదా నదిని దాటాడు. బలి అక్కడ యాగం చేస్తున్నాడు. దూరంగా ఆ యాగశాల కనిపించింది.

అటువైపు బుడిబుడి అడుగులు వేశాడు వామనుడు.

ముద్దులొలికే ఆ చిన్నారిని చూస్తున్న వాళ్ళంతా అలాగే చూస్తూ ఉండి పోయారు. ఎంత చూసినా తనివితీరటం లేదు వాళ్ళకు.

దారిలో కొందరిని పలకరిస్తూ, కొందరితో కలిసి వేదం చదువుతూ, కొందరితో చర్చిస్తూ, బిత్తర చూపులు చూస్తూ, నవ్వుతూ, నవ్విస్తూ సాగిపోతున్నాడు.

**కం. వెడవెడ నడకలు నడచుచు**
**నెడనెడ నడుగిడఁగ నదరి యిలఁ దిగఁబడఁగా**
**బుడిబుడి నొడువులు నొడువుచుఁ**
**జిడిముడి తడఁబడఁగ వడుగు సేరెన్ రాజున్.** (8-541)

అడుగులో అడుగు వేస్తూ వామనుడు నడుస్తుంటే భూమి క్రుంగిపోతోంది. మధ్యలో చిట్టిపొట్టి మాటలు, కొంచెం గాబరా నటిస్తున్నాడు. అలా రకరకాలుగా ప్రవర్తిస్తూ బలిచక్రవర్తిని చేరుకున్నాడు.

బలిచక్రవర్తిని చూడగానే ఆశీర్వదించాడు.

ఆ వామనుణ్ణి అతడి తేజస్సునూ చూసిన బలిచక్రవర్తికి నోట మాట రాలేదు. సాదరంగా ఆహ్వానించాడు. అన్ని మర్యాదలూ చేసి,

'ఓ పొట్టి వడుగా! ఎంత ముద్దు వస్తున్నావో! అసలు నువ్వు ఎవరు? ఎక్కడ ఉంటావు? ఇక్కడికి ఏ పనిమీద వచ్చావు?

నీ రాకవల్ల నేనూ, నా జన్మ, నా వంశం ధన్యమయ్యాయి.

చూడు. ఈ హోమాగ్నులు కూడా బాగా జ్వలిస్తున్నాయి. ఇది శుభసూచకం.

చెప్పు. నీకేం కావాలి? మంచిమంచి వస్త్రాలా? మాడలా? ఫలాలా? ఉద్యానవనాలా? ఆవులా? గుర్రాలా? రత్నాలా? రథాలా? విందులా? భవనాలా? కన్యలా? ఏనుగులా? పోనీ బంగారమా? రాజ్యం కావాలా? ఇంకేమైనానా? చెప్పు. ఏమీ సంకోచించకు.

ప్రేమగా అడిగాడు బలిచక్రవర్తి. ఆ మాటలకు వామనమూర్తి సమాధానంగా–

'రాజా! నేను అంతటా ఉంటాను. తిరుగుతూ ఉంటాను. నా అంతట నేనే వర్తిస్తూ ఉంటాను. నాకు రానిది లేదు. నాకెవ్వరూ లేరు. నేను అందరివాణ్ణి. పైగా ఒంటరిని. ఇంతకుముందు ఐశ్వర్యం ఉండేది. ఇప్పుడు లేదు. **మంచివాళ్ళు ఎక్కడ ఉంటే నేనూ అక్కడే!**

నువ్వు సామాన్యుడివి కావు. గొప్ప దాతవు. నీ వంశమూ ఎంతో గొప్పది. కాబట్టి నేను నిన్ను ఒకటి అడగాలని వచ్చాను. అదేమిటో చెప్తాను విను.

**ఆ.వె. ఒంటివాఁడ నాకు నొకటి రెండడుగులు**
**మేర యిమ్ము; సొమ్ము మేర యొల్లఁ**
**గోర్కి దీర బ్రహ్మకూఁకటి ముట్టెద**
**దానకుతుకసాంద్ర! దానవేంద్ర!** (8–566)

'దానవరాజా! నేను ఒంటరిని. నాకు ఒకటి రెండడుగులు (= మూడడుగులు) నేల చాలు. దానిని దానంగా ఇవ్వు. ఇప్పుడు నువ్వు అడిగినవేవీ నాకు అవసరం లేదు. ఈ కోర్కె తీర్చు. అదే నాకు బ్రహ్మానందం' అన్నాడు.

బలిచక్రవర్తి ఆశ్చర్యపోయాడు. నచ్చచెప్పాలని చూశాడు. ఇంకేమైనా విలువైన వాటిని కోరుకోమన్నాడు. అతడు ఎంత ప్రయత్నించినా వామనుడు మరేమీ కోరలేదు. పైగా ఇలా అన్నాడు –

'రాజా! నేనా బ్రహ్మచారిని. నాకు గొడుగో, జంధ్యమో, కమండలమో, ముంజియో, దండమో కావాలిగానీ ఇవన్నీ నాకెందుకు? వడుగునైన నేనెక్కడ? ఏనుగులు, గుర్రాలు, స్త్రీలు మొదలైనవన్నీ ఎక్కడ? పైగా అవన్నీ నా నిత్యకృత్యాలకు ఆటంకాలు. నేను అడిగిన మూడడుగుల నేలను కాదనకుండా ఇవ్వవయ్యా! అదే నాకు బ్రహ్మాండంతో సమానం.

## తృప్తిలోనే సుఖం

కం. వ్యాప్తిం బొందక వగవక
ప్రాప్తంబగు లేశమైనఁ బదివే లనుచుం
దృప్తిం జెందని మనుజుఁడు
సప్తద్వీపముల నయినఁ జక్కంబడునే? (8–574)

**పేరాసకు పోకుండా, ఐశ్వర్యం లేదే అని చింతించకుండా తనకు తానుగా లభించింది కొంచెమే అయినా దాన్నే పదివే లనుకొని తృప్తిపడనివాడు సప్తద్వీపాలు లభించినా ఎక్కడైనా తృప్తి పడగలడా నువ్వే చెప్పు?**

శా. ఆశాపాశము దాఁ గడు న్నిడుపు లేదంతంబు రాజేంద్ర! వా
రాశిప్రావృత మేదినీవలయ సామ్రాజ్యంబు సేకూడియుం
గాసిం బొందిరి గాక వైన్యగయభూకాంతాదులు న్నర్థకా
మాశం బాయఁగ నేర్చిరే! మును నిజాశాంతంబులం జూచిరే!
(8–575)

**రాజా! ఈ ఆశ అనేది ఉంది చూశావూ? అది చాలా పొడవు. దానికి అంతం లేదు. మహామహా చక్రవర్తులు సైతం ఆశకు దాసులైపోయారు. ఏ లోకంలోనైనా పరమ పూజ్యుడు ఎవరో తెలుసా? తృప్తిని పొందినవాడే! అతడికి ఎప్పుడూ సుఖమే. తృప్తి లేకపోవటమే సంసారానికి హేతువు. తృప్తి ఉంటే తేజస్సూ పెరుగుతుంది.**

నువ్వు రాజువు కాబట్టి నీ దగ్గర ఉన్నవన్నీ అడగటం భావ్యం కాదు. నాకు తగినదే నేను అడుగుతున్నాను. అది ఇవ్వు చాలు' అన్నాడు.

ఇలా వీళ్ళ సంభాషణ కొనసాగుతోంది.

## శుక్రాచార్యుడి హితవు

అప్పుడక్కడికి శుక్రాచార్యుడు వచ్చాడు. ఇతడు రాక్షసుల గురువు. వచ్చి

'రాక్షసరాజా! ఇతడు ఎవరనుకొంటున్నావు? సాక్షాత్తు శ్రీమన్నారాయణుడు. నిన్నూ నీ వంశాన్ని నాశనం చేయడానికే ఇలా కపటవేషంలో వచ్చాడు. అతడు కోరింది ఇచ్చావో! నీ గతి అధోగతే. జాగ్రత్త!

తనకు మాలిన దానం పనికి రాదు. ఇస్తానని మాట ఇచ్చాను కదా! దాన్ని తప్పటం ఎలా? అసత్యదోషం అంటుకోదూ అంటావేమో! విను.

**ఆ.వె. వారిజాక్షులందు వైవాహికములందుఁ**
**బ్రాణవిత్తమానభంగమందు**
**జకిత గోకులాగ్రజన్మ రక్షణమందు**
**బొంకవచ్చు నఘము వొంద దధిప!** (8–585)

స్త్రీల విషయంలో, వివాహం సందర్భంలో, ప్రాణానికిగానీ, ధనానికిగానీ, గౌరవానికిగానీ భంగం కలిగే పరిస్థితుల్లో అలాగే గోబ్రాహ్మణులను రక్షించే సందర్భంలో అసత్యం ఆడవచ్చు. దానివల్ల పాపం కలుగదని శాస్త్రం చెబుతోంది.

నువ్వు గొప్ప దాతవే! కాదనను. ఈ దానం ఇచ్చి నీ వంశ నాశనాన్ని నువ్వే కోరి తెచ్చుకోవద్దు. నా మాట విను. ఈ పొట్టివాడు మూడడుగుల నేలను తీసుకొని త్రివిక్రముడై బ్రహ్మాండాన్ని ఆక్రమిస్తాడు' అని హితవు పలికాడు.

## సత్యవ్రతం

అంతా విన్నాడు బలిచక్రవర్తి. విని

'గురువర్యా! ఏమంటున్నారు? **ఆడిన మాటను తప్పమంటున్నారా? అంతకంటే పాపం మరొకటి ఉందా? భూమాత ఎవర్నైనా భరిస్తుందిగానీ మాట తప్పినవాణ్ణి మాత్రం భరించనుగాక భరించను అని చెప్పలేదూ!**

రైతుకు మంచి పొలము, విత్తనాలు దొరకటం ఎంత కష్టమో దాతకు తగిన ధనమూ, పాత్రుడైన యాచకుడూ దొరకటం అంతే కష్టం. నా అదృష్టం. ఇప్పుడు నాకు ఆ అవకాశం వచ్చింది.

**శా. కారే రాజులు? రాజ్యముల్ గలుగవే? గర్వోన్నతిం బొందరే?**
**వారేరీ? సిరి మూటగట్టుకొని పోవం జాలిరే? భూమిపైఁ**
**బేరైనంగలదే? శిబిప్రముఖులుం బ్రీతిన్ యశఃకాములై**
**యీరే కోర్కులు? వారలన్ మఱచిరే యిక్కాలమున్? భార్గవా!**
(8–590)

భార్గవా! ఎందరో గొప్ప గొప్ప చక్రవర్తులు. వాళ్ళంతా రాజులు కారూ, వాళ్ళకు రాజ్యాలు లేవూ! గర్వంతో విర్రవీగలేదా? వాళ్ళందరూ ఇప్పుడు ఎక్కడ? వెళ్ళేటప్పుడు సిరినేమైనా మూటగట్టుకుపోగలిగారా? కనీసం వాళ్ళ పేరైనా నిలబడిందా? ఎవరో కొందరు శిబిచక్రవర్తిలాంటి వాళ్ళ పేర్లు మాత్రమే నిలిచి ఉన్నాయి. ఎందుకు? కీర్తిని కోరుకొంటూ అడిగినవాళ్ళకు లేదనకుండా ఇచ్చారు కాబట్టి. వాళ్ళను లోకం ఎప్పటికీ మరిచిపోదు.

ఎన్ని యాగాలు చేస్తే శ్రీహరి దర్శనం లభిస్తుంది? అంతటి శ్రీమన్నారాయణుడు నాలాంటి సామాన్యుడి దగ్గర చేయి చాచాడంటే అంతకంటే భాగ్యం వేరే ఉంటుందా? లక్ష్మీదేవి కొప్పుమీదా, శరీరం మీదా, భుజాల మీదా నడయాడిన ఆ శ్రీహరి దివ్యహస్తం ఇప్పుడు కింద ఉండటం, నా చెయ్యి పైన ఉండటం నాకు మేలుకాదా? రాజ్యం గీజ్యం శాశ్వతమా? ఈ శరీరం ఏమైనా అపాయం లేనిదా?

**మ. నిరయంబైన నిబద్ధమైన ధరణీనిర్మూలనంబైన దు**
**ర్మరణంబైనఁ గులాంతమైన నిజమున్ రానిమ్ము కానిమ్ము పో**
**హరుఁ డైనన్ హరియైన నీరజభవుం డభ్యాగతుండైన నౌఁ**
**దిరుగన్నేరదు నాదు జిహ్వ వినుమా! ధీవర్య, వేయేటికిన్?** (8–593)

**గురువర్యా! రానీ, రానీ! నరకం, బంధనం, నాశనం ఏదైనా రానీ! ఏమైనా సరే! ఎవ్వరు వచ్చినా సరే! నా నాలుక అబద్ధం ఆడదు.**

శుక్రాచార్యుడికి సహనం నశించింది. ఎంత చెప్తున్నా పట్టించుకోని బలిచక్రవర్తిపై కోపం కట్టలు తెంచుకుంది. 'నువ్వు త్వరలోనే పదవీ భ్రష్టుడివి అవుతావు' అని శపించాడు. అయినా బలిచక్రవర్తి చలించలేదు. పరీక్షిన్మహారాజా! ఎందుకో తెలుసా!

**ఆ.వె. బ్రదుకవచ్చుఁగాక బహుబంధనములైన**
**వచ్చుఁగాక లేమి వచ్చుఁ గాక**
**జీవధనములైన జెడుఁగాక పడుఁగాక**
**మాటఁ దిరుగలేరు మానధనులు** (8–598)

**ప్రాణం పోయినా సరే! మానధనులు ఆడిన మాటను తప్పరు తెలుసా? బలిచక్రవర్తి మానధనుడు. అందుకే మాటకు కట్టుబడ్డాడు.**

ఇంతలో బలిచక్రవర్తి భార్య వింధ్యావళి వచ్చింది. కలశంతో నీళ్ళు తెచ్చింది. ఆమెతో కలిసి వామనుడికి నమస్కరించి అతడి పాదాలు కడిగి ఆ నీళ్ళు తలపై జల్లుకొని దానం ఇస్తున్నాడు బలిచక్రవర్తి. మంత్రపూర్వకంగా జలధార వదులుతూ మూడడుగుల నేలను ధారపోస్తున్నాడు.

శుక్రాచార్యుడు కమండలంలో దూరాడు. నీటి ధారకు అడ్డుపడ్డాడు. అది గమనించిన వామనుడు ఒక దర్భతో ఆ కమండలం రంధ్రంలో పొడిచాడు. అది శుక్రాచార్యుడి కంట్లో గుచ్చుకొని అతడి ఒక కన్ను పోయింది. నాటినుంచి శుక్రుడు ఏకాక్షిగా ప్రసిద్ధుడయ్యాడు.

## భళీ! బలీ!

**పరీక్షిన్మహారాజా! చూశావా? బలిచక్రవర్తి. వచ్చినవాడు శ్రీహరి అనీ, దానం ఇస్తే తనకు నాశనం తప్పదనీ తెలిసీ దానం ఇచ్చాడు. అంతటి దాత ఇంకొకడు ఎక్కడైనా ఉంటాడా?**

దానం స్వీకరించిన వామనుడు ప్రీతుడై –

'బలిచక్రవర్తీ! నువ్వు ఇచ్చిన ఈ మూడడుగులతో ముల్లోకాలనూ ఇచ్చినట్లే సుమా!' అన్నాడు నవ్వుతూ.

బలిచక్రవర్తికి అర్థం కాలేదు. ఆశ్చర్యపోయాడు. 'ఏమిటీ పొట్టివడుగు మాటలు? ఇలాంటి బుద్ధులు ఇతడు పుడుతూ నేర్చుకున్నాడా? పుట్టకముందే నేర్చుకున్నాడా? అమ్మో! ఇతడి పొట్టలో ఇంకెన్ని మాయలున్నాయో!' అనుకున్నాడు.

బలి ఇచ్చిన దానానికి లోకమే హర్షించింది. పుష్పవర్షం కురిసింది. వామనుడు దానం పుచ్చుకొన్నాడో లేదో క్రమంగా పెరిగిపోతున్నాడు.

## త్రివిక్రమ స్వరూపం

శా. **ఇంతింతై వటుఁ డింతయై మఱియుఁ దానింతై నభోవీథిపై**
**నంతై తోయదమండలాగ్రమున కల్లంతై ప్రభారాశిపై**
**నంతై చంద్రుని కంతయై ధ్రువుని పైనంతై మహర్వాటి పై**
**నంతై సత్యపదోన్నతుం డగుచు బ్రహ్మాండాంత సంవర్ధియై** (8–622)

వటుడు ఇంతింతై పెరుగుతూ క్రమంగా ఆకాశాన్నీ, మేఘ మండలాన్నీ, పాలపుంతను, చంద్రుణ్ణీ, ధ్రువుణ్ణీ దాటి, మహర్లోక, సత్యలోకాలను మించిపోయి చివరికి బ్రహ్మాండమంత పెరిగిపోయాడు.

అలా వామనుడు పెరిగిపోతుంటే ఆకాశంలో ఉన్న సూర్యుడు మొదట వామనుడికి గొడుగులా కనిపించాడు. ఆ తరువాత శిరోరత్నంలా, తరువాత చెవి పోగులా, అనంతరం కంఠాభరణంలా, పిమ్మట భుజకీర్తిలా, చేతి కంకణంలా కనిపించాడు.

వామనుడు ఇంకా పెరిగాడు. అప్పుడు సూర్యుడు వామనుడి నడుముకు వ్రేళ్ళాడే మొలత్రాడు గంటలా కనిపించాడు. తరువాత కాలి అందెలా, ఆ తరువాత పాదపీఠంలా ప్రకాశించాడు.

అలా పెరిగిన వామనుడు ఒక అడుగుతో పైలోకాల్నీ, మరో అడుగుతో కింది లోకాల్నీ ఆక్రమించాడు. బ్రహ్మాండం పటపటలాడింది. త్రివిక్రముడు మళ్ళీ వామనమూర్తిగా మారిపోయి బలిచక్రవర్తి ముందు నిలిచి –

'రాజా! మూడో అడుగుకు చోటు ఎక్కడ? చూపిస్తావా? అసత్య దోషానికి నరకానికి పోతావా?' అన్నాడు. అప్పుడు బలిచక్రవర్తి ధైర్యంగా తన శిరస్సును చూపిస్తూ –

**మ. చెలియే మృత్యువు? చుట్టమే యముడు? సంసేవార్థులే కింకరుల్?**
**శిలలం జేసెనె బ్రహ్మ దన్ను? ధృఢమే జీవంబు? నో చెల్లరే!**
**చలితంబౌట యెఱుంగ కీ కపటసంసారంబు నిక్కంబుగాఁ**
**దలఁచున్ మూఢుఁడు సత్యదానకరుణా ధర్మాదినిర్మూఢుఁడై** (8–647)

'మహానుభావా! మృత్యువేమైనా నాకు నేస్తమా? యముడు చుట్టమా? ఈ సేవకులు నిజమైనవాళ్ళేనా? బ్రహ్మదేవుడు నన్నేమన్నా మహాశిలలతో చేశాడా? ఈ బొందిలో ప్రాణం శాశ్వతమా? చెక్కుచెదరనిదా? కాదు. అందరూ ఎప్పుడో ఒకప్పుడు మరణించ వలసిందే. **తుచ్ఛమైన ఈ శరీరం కోసం సత్యం, దానం, దయ, ధర్మం మొదలైన వాటిని విడిచిపెట్టటం అవివేకం.**

సీ. చుట్టాలు దొంగలు సుతులు ఋణస్థులు
కాంతలు సంసార కారణములు
ధనము లస్థిరములు దను వతిచంచల
గార్యార్థు లన్యులు గడచుఁగాల
మాయువు సత్వర మైశ్వర్య మతిశీఘ్ర
మని కాదె తమ తండ్రి నతకరించి
మా తాత సాధుసమ్మతుఁడు ప్రహ్లాదుండు
నీ పాదకమలంబు నియతిఁ జేసె

గీ. భద్రుఁ డతనికి మృతిలేని బ్రదుకు గలిగె
వైరులై కాని తొల్లి మావారు గాన
రర్థివై వచ్చి నీవు నన్నడుగు టెల్లఁ
బద్మలోచన! మా పుణ్య ఫలము గాదె! (8-648)

ఈ చుట్టా లందరూ దొంగలు. కొడుకులు ఋణం ఉన్నవాళ్ళు. స్త్రీలు సంసారానికి కారకురాళ్ళు. ధనం శాశ్వతం కాదు. శరీరం చంచలం. మిగిలిన వాళ్ళందరూ ఏదో ఒక అవసరం కోసం వచ్చేవాళ్ళే.

**ఆయువు క్షణక్షణానికీ క్షీణించిపోతూ ఉంటుంది. ఐశ్వర్యం చేజారిపోతుంది. అందుకే మా తాత ప్రహ్లాదుడు నిన్ను సేవించి ధన్యుడయ్యాడు. నీ అంతట నువ్వే నా దగ్గరకు యాచకుడిగా రావటం నా పుణ్యంకాక మరేమిటి?** అన్నాడు.

అంతలో ప్రహ్లాదుడు అక్కడికి వచ్చాడు. స్వామిని దర్శించి పులకించి పోయాడు. బలిచక్రవర్తి భార్య వరుణపాశాలలో బందీగా ఉన్న తన భర్తను చూసి కన్నీరు మున్నీరైపోయింది.

'స్వామీ! నువ్వు కోరినదల్లా ఇచ్చాడు కదా? అయినా ఏమిటిది?' అని అడిగింది. అప్పుడు స్వామి ఇలా సెలవిచ్చాడు:

**'నేను ఎవరిని అనుగ్రహిస్తానో వాళ్ళ ఐశ్వర్యాన్ని ముందు హరిస్తాను. ఏ గర్వానికీ, ఇంద్రియాలకూ లొంగనివాణ్ణే నేను రక్షిస్తాను. నీ భర్త పుణ్యాత్ముడు. అందుకే అతణ్ణి అనుగ్రహించాను. ఇతడికి ఇంక ఏ దుఃఖమూ అంటదు. సుతల**

**లోకంలో హాయిగా ఉంటాడు. నేనే స్వయంగా రక్షిస్తాను'** అంటూ బలిచక్రవర్తిని సుతలానికి వెళ్ళమని ఆజ్ఞాపించాడు.

బలిచక్రవర్తి కళ్ళలో ఆనంద బాష్పాలు స్రవించసాగాయి. 'స్వామీ! ఈ దీనుడిపై ఇంతటి దయను చూపించావా? నిన్ను నమ్మినవారికి ఏ కష్టమూ ఉండదు. అంటూ స్వామిని స్తుతిస్తూ ప్రహ్లాదుడితో కలిసి తన రాక్షస పరివారాన్ని తీసుకొని బలిచక్రవర్తి సుతలానికి వెళ్ళిపోయాడు.

రాజా! తరవాత విష్ణుమూర్తి ఆజ్ఞప్రకారం శుక్రాచార్యుడు, ఆ యాగాన్ని పూర్తిచేశాడు. విష్ణువు దేవేంద్రుడికి తమ్ముడిగా పుట్టి ఉపేంద్రుడై అన్నగారి ఐశ్వర్యాన్ని తిరిగి ప్రసాదించాడు. ఇలాంటి సోదరుడు ఉంటే ఎలాంటి అన్నగారికైనా తీరని కోర్కెలంటూ ఉంటాయా?

ఈ వామనావతార చరిత్ర ఎంతో పుణ్యప్రదమైనది, సకల శుభాలనూ కలుగజేస్తుంది.

## మత్స్యావతార కథ

రాజా! ఇవన్నీ శ్రీహరి లీలలు నాయనా! పూర్వకల్పాంతంలో 'సత్యవ్రతుడు' ద్రవిడ దేశానికి రాజుగా ఉండేవాడు. అతడు ఒకరోజు నదిలోనికి దిగి తర్పణం వదలటం కోసమని దోసిట్లోకి నీళ్ళు తీసుకున్నాడు. ఆ నీళ్ళతోపాటు ఒక చేప అతడి చేతిలోనికి వచ్చింది. దానిని మళ్ళీ నీళ్ళలో విడిచిపెట్టాడు రాజు.

అప్పుడా చేప 'రాజా! ఈ నదిలో ఉంటే నాకు మరణం తప్పదు. నాకన్నా పెద్ద చేపలు నన్ను తినేస్తాయి. లేకపోతే ఏ వేటగాడో వలవేసి మరీ చంపేస్తాడు. అందుకే ప్రాణభయంతో నీ చేతుల్లోకి వచ్చాను. నువ్వేమో రక్షించకుండా– నమ్మి వచ్చిన నన్ను మళ్ళీ నట్టేట్లో ముంచేశావు. ఇది నీకు భావ్యమా? అని నిలదీసింది.

రాజు చలించిపోయాడు. దయతో దానిని తీసి తన కమండలంలో వేసి ఇంటికి వెళ్ళాడు. మరునాడు చూసేసరికి ఆ చేప కమండలం పట్టనంతగా పెరిగిపోయింది. దాన్ని తీసి ఒక తొట్టెలో ఉంచాడు. కాస్సేపటికే ఆ తొట్టె కూడా ఇరుకైపోయింది. పెద్దదైపోయింది చేప. ఈసారి దాన్ని ఒక మడుగులో ఉంచాడు. అదీ సరిపోలేదు దానికి. ఆ తరువాత సరస్సులో ఉంచాడు. అదీ పట్టలేదు.

ఇక చివరికి ఆ చేపను సముద్రంలో వదిలాడు.

అప్పుడా చేప – 'ఏమయ్యా! రాజా! ఇంతకాలం నన్ను కాపాడినవాడివి ఇప్పుడు సముద్రంలో వదిలేస్తావా? ఇక్కడ నన్ను ఏ మొసలో తినివేస్తే ఏంకాను?' అని నిలదీసింది.

ఆ రాజుకు అర్థమైపోయింది. 'ఇది సామాన్యమైన చేప కాదు. సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడే ఇలా వచ్చాడు. ఇదంతా విష్ణుమాయ' అనుకొని –

'స్వామీ! ఏమిటి ఈ రూపం? ఇందులోని పరమార్థం ఏమిటి? అని అడిగాడు చేతులు జోడిస్తూ. అప్పుడా దేవదేవుడు–

'రాజా! ఇది కల్పాంతం. ప్రళయం రాబోతోంది. నేటికి సరిగ్గా ఏడో రోజున సముద్రంలో ఒక నావ నీ దగ్గరకు వస్తుంది. అప్పుడు నువ్వు ఓషధుల్ని తీసుకొని ఆ నావను అధిరోహించు. నేను మత్స్యరూపంలో ఆ నావను రక్షిస్తాను' అని అదృశ్యమైపోయాడు.

ప్రళయం రానే వచ్చింది. బ్రహ్మదేవుడు నిద్రలోనికి జారుకున్నాడు. అప్పుడు అతడి ముఖాల నుండి వేదాలు వెలువడ్డాయి. వాటిని తీసుకొని 'హయగ్రీవుడు' అనే రాక్షసుడు పారిపోయాడు. అప్పుడు శ్రీమన్నారాయణుడు ఆ రాక్షసుణ్ణి చంపి వేదాలను తెచ్చి బ్రహ్మదేవుడికి ఇచ్చాడు.

అలాగే సత్యవ్రతుడికి చెప్పినట్లుగా ఆ నావనూ సంరక్షించాడు. ఈ సత్యవ్రతుడే వివస్వంతుడికి (సూర్యుడికి) వైవస్వతుడు అనే పేరుతో పుట్టి విష్ణువు దయవల్ల ఈ కల్పంలో ఏడవ మనువు అయ్యాడు. రాజా! చూశావుగా! **విష్ణుమూర్తిని అర్చిస్తే ఎంత గొప్ప పదవి అయినా, ఎంతటి ఐశ్వర్యమైనా లభించి తీరవలసిందే.**

పుణ్యప్రదమైన ఈ మత్స్యావతార వృత్తాంతాన్ని విన్నా, చదివినా కోరికలన్నీ సిద్ధిస్తాయి. మోక్ష పదం కూడా లభిస్తుంది అన్నాడు శుకయోగీంద్రుడు.

పరీక్షిత్తు ఆనంద పారవశ్యంలో ఓలలాడుతూ తల ఊపాడు.

# నవమ స్కంధం

సూతమహర్షి ఇలా వివరిస్తున్నారు-

మహర్షులారా! శుకమహర్షి ఈసారి వైవస్వతమనువు వంశ క్రమాన్ని చెప్పటం ప్రారంభించాడు.

## వైవస్వతమనువు వంశం

'రాజా! దక్షుడి కుమార్తె అదితికీ, కశ్యప ప్రజాపతికి 'ఆదిత్యుడు' అనే కుమారుడు జన్మించాడు. అతడే సూర్యభగవానుడు. ఇతడికి సంజ్ఞ (ఈమె విశ్వకర్మ కూతురు) అనే భార్య ద్వారా శ్రాద్ధదేవుడు (వైవస్వతుడు) అనే పుత్రుడు జన్మించాడు. ఇతడు పూర్వజన్మలో, మత్స్యావతారంలో విష్ణువు అనుగ్రహించిన సత్యవ్రతుడు అనే ద్రవిడరాజు.

శ్రాద్ధదేవుడు శ్రీహరి అనుగ్రహం వల్ల మనువు అయ్యాడు. ఇతడికి శ్రద్ధ అనే భార్య ఉంది. ఈమె ద్వారా ఇతడికి ఇక్ష్వాకుడు మొదలైన పదిమంది పుత్రులు కలిగారు. వీరిలో పృషధ్రుడు అనే ఒక పుత్రుడికి ఒక వింత పరిస్థితి ఎదురయ్యింది. చెప్తాను, విను.

పృషధ్రుడు తండ్రి ఆజ్ఞపై కొన్ని ఆవులను అడవికి తీసుకువెళ్ళి మేపుకొని వస్తుండేవాడు. ఒకరోజు తిరిగి వస్తూ ఉంటే దారిలో పెద్ద గాలివాన వచ్చింది. ప్రయాణం కష్టమయ్యింది. ఆ రాత్రికి అక్కడే ఉండవలసి వచ్చింది.

అప్పుడు ఒక పెద్దపులి ఆవులపై పడింది. దాన్ని చంపి ఆవుల్ని కాపాడాలను కొన్నాడు పృషధ్రుడు. కత్తి దూశాడు. పొరపాటున అది పులికి కాక ఒక ఆవుకు తగిలింది. ఆవు తల తెగి కింద పడిపోయింది.

ఆ సంగతి తెలిసి వసిష్ఠ మహర్షి ఇతణ్ణి 'శూద్రుడివి కమ్మని' శపించాడు.

శాపవిమోచనం చెప్పమని ప్రాధేయపడ్డాడు పృషధ్రుడు.

దానికి వసిష్ఠుడు 'నువ్వు ఎవరినీ ఏమీ యాచించకుండా దొరికినదానితోనే సంతృప్తిని పొంది, ఇంద్రియాల్ని జయించి శ్రీహరిని ధ్యానం చెయ్యి. నీకు విముక్తి కలుగుతుంది' అని అనుగ్రహించాడు.

పృషధ్రుడు అలాగే జీవిస్తూ ఒక జడుడిలా, అడవుల్లోనే తిరుగుతూ ఒక కారుచిచ్చులో పడి మరణించి మోక్షాన్ని పొందాడు.

రాజా! వైవస్వత మనువుకు మరో కుమారుడు శర్యాతి. ఇతడి కుమార్తె సుకన్య. ఈమె చ్యవన మహర్షి ఆశ్రమ ప్రాంతంలో సంచరిస్తూ ఒక పుట్ట దగ్గరకు వెళ్ళింది. ఆ పుట్టలో రెండు జ్యోతులు ప్రకాశిస్తూ కనిపించాయి. వాటిని మిణుగురు పురుగు లనుకొని ఒక కర్రతో పొడిచింది. కానీ అవి చ్యవన మహర్షి కళ్ళు. ఆ పుట్టలో ఉన్నది ఆ మహర్షే. అతడి కళ్ళ నుండి రక్తం కారింది. అలా చేసినందు వల్ల శర్యాతి వెంట ఉన్న అంతరంగిక భటుల మల మూత్రాలు బంధించినట్లు అయిపోయాయి.

తన కుమార్తె తెలియక చేసిన అపరాధం గురించీ మహర్షి ఇచ్చిన శాపం గురించీ తెలుసుకున్న శర్యాతి హుటాహుటిన చ్యవన మహర్షి వద్దకు వచ్చి క్షమించ మని వేడుకొన్నాడు. అప్పుడు మహర్షి సుకన్యను తనకు ఇచ్చి వివాహం చేస్తే క్షమిస్తానన్నాడు.

శర్యాతి అలాగేనంటూ సుకన్యను అతడికిచ్చి వివాహం జరిపించి వెళ్ళి పోయాడు.

కొంతకాలం తర్వాత శర్యాతి చ్యవన మహర్షి ఆశ్రమానికి వచ్చాడు. అక్కడ తన కుమార్తెను, ఆమె ప్రక్కనే ఉన్న మరో అందమైన యువకుణ్ణీ చూశాడు. అయితే అతడికి అసలు విషయం తెలియదు.

చ్యవన మహర్షి అశ్వినీ దేవతల అనుగ్రహంతో తన ముసలితనాన్ని పోగొట్టుకొని యువకుడైపోయాడు.

శర్యాతి చూసిన యువకుడు చ్యవన మహర్షే. అది తెలియకపోవటంవల్ల తన కుమార్తెను అపార్థం చేసుకొన్నాడు. తొందరపడి నిందించాడు.

అప్పుడు సుకన్య నవ్వుతూ అసలు విషయం చెప్పింది.

తరువాత చ్యవనుడు శర్యాతిచేత యాగం చేయించాడు. ఆ యాగంలో అశ్వినీ దేవతలకు సోమపానం చేసే అధికారాన్ని ప్రసాదించాడు.

శర్యాతికి ముగ్గురు పుత్రులు. వారిలో 'ఆవర్తుడు' అనేవాడికి రైవతుడు అనే ఒక కుమారుడు కలిగాడు. ఇతడికి కకుద్మి మొదలైన నూరుగురు పుత్రులు జన్మించారు.

రైవతుడికి రేవతి అనే ఒక కుమార్తె కూడా ఉంది. బ్రహ్మదేవుడి ఆదేశంతో రేవతిని బలరాముడికి ఇచ్చి వివాహం జరిపించాడు రైవతుడు.

రాజా! వైవస్వత మనువు పుత్రులలో 'నాభాగుడు' అనే పుత్రుడు చాలా గొప్పవాడు. ఇతడి కుమారుడే అంబరీషుడు. ఇతడు మహాభక్తుడు.

## అంబరీషుడి కథ

అంబరీషుడు సమస్త భూమండలానికీ చక్రవర్తి. గొప్ప ఐశ్వర్యవంతుడు. అయినా ఏ అవలక్షణమూ అతడికి లేదు. ఎప్పుడూ శ్రీహరినే ధ్యానిస్తూ, విష్ణుభక్తుల్ని సేవిస్తూ కాలం గడుపుతూ ఉండేవాడు.

**అంబరీషుడి మనస్సు ఎప్పుడూ శ్రీహరి పాదాల మీదే లగ్నమై ఉండేది. విష్ణువునే ఆరాధిస్తూ విష్ణుభక్తుల్ని కొలుస్తూ, చేసే ప్రతి పనినీ శ్రీహరికే సమర్పిస్తూ ఎంతో పవిత్రంగా జీవనం సాగిస్తున్నాడు.**

అతడెన్ని యాగాలు చేశాడో, ఎన్ని దానాలు చేశాడో లెక్కలేదు. అతడి దృష్టిలో మట్టి, బంగారం రెండూ ఒకటే. ఒకవైపు రాజ్యపాలన, మరోవైపు శ్రీహరి ధ్యానం చేస్తూ నిజమైన రాజర్షిలా అతడు ఒప్పుతున్నాడు. అంతేనా?

**కం. హరియని సంభావించును**
**హరియని దర్శించు నంటు నాఘ్రాణించున్**
**హరియని రుచిగొనఁ దలచును**
**హరిహరి ఘను నంబరీషు నలవియె పొగడన్.** (9-86)

**రాజా! ఆ అంబరీషుడు హరి అంటూ మాట్లాడతాడు. హరి అంటూ దర్శిస్తాడు.**

**హరి అంటూ స్పృశిస్తాడు. ఆఘ్రాణిస్తాడు. రుచి చూస్తాడు. హరినామ స్మరణ లేకుండా ఏదీ చెయ్యడు. అలాంటి మహాభక్తుడు కాబట్టే శ్రీమన్నారాయణుడు తన సుదర్శన చక్రాన్ని అంబరీషుడికి రక్షణగా ఉండమని పంపించాడు. అంతటి పుణ్యాత్ముడు ఈ అంబరీషుడు.**

## ఏకాదశీవ్రతం

ఒకసారి అంబరీషుడు ఏకాదశీ వ్రతాన్ని చేసుకొంటున్నాడు. ఒక సంవత్సర కాలం చేయాలి ఆ వ్రతం. చేశాడు. వ్రతం పూర్తికావస్తోంది. అది కార్తికమాసం. ఆ మాసంలో మూడు రాత్రులు ఉపవాసం ఉన్నాడు. యమునానదిలో స్నానం చేసి మధువనంలో ఉన్న శ్రీహరికి అభిషేకం చేశాడు. అనేక దానాలు చేశాడు. అతిథులందరికీ గొప్ప విందును ఏర్పాటు చేసి వాళ్ళందరూ భోజనాలు చేశాక తాను కూడా పారణ చేయడానికి సిద్ధపడ్డాడు.

సరిగ్గా అప్పుడు దుర్వాస మహర్షి అక్కడికి విచ్చేశాడు.

అంత గొప్ప మహర్షి తనంతట తానుగా అతిథిగా రావటంతో అంబరీషుడికి చెప్పలేని ఆనందం కలిగింది. మహర్షినీ భోజనానికి ఆహ్వానించాడు.

దుర్వాసుడు స్నానం చేసి వస్తానని కాళిందీ నదికి బయలుదేరి వెళ్ళాడు. వెళ్ళిన మహర్షి వస్తేనా? అవతల ద్వాదశి ఘడియలు మించిపోతున్నాయి. ఆలోపే పారణ చేయాలి. లేకపోతే వ్రతఫలం దక్కదు.

అప్పుడు పెద్దల సూచనమేరకు అంబరీషుడు తీర్థాన్ని మాత్రం స్వీకరించాడు. నీటిని పుచ్చుకుంటే దోషం ఉండదట. ఫలితం దక్కుతుంది.

## దుర్వాసుడికోపం

తనను పిలిచి తను రాకుండా తీర్థాన్ని పుచ్చుకున్న అంబరీషుడిపై పట్టరాని కోపం వచ్చింది దుర్వాస మహర్షికి. వెంటనే చకచకా వచ్చాడు. చురచురా చూశాడు. పెటపెటమని పళ్ళు కొరుకుతూ కళ్ళల్లో ఫెళఫెళమని నిప్పులు కురిపిస్తూ

'చూశారా! ఈ అంబరీషుడికి ఎంత కండకావరం? నన్ను భోజనానికి పిలిచి నేను రాకుండానే తాను పారణ చేసి నన్ను అవమానించాడు' అని హుంకరించి తన జడల్లో ఒకదాన్ని పెరికి నేలపై కొట్టాడు.

దానినుండి కృత్య అనే రాక్షసి పుట్టుకువచ్చి అంబరీషుడిపైకి లంఘించింది.

అప్పుడు అంబరీషుడికి రక్షణగా ఉన్న సుదర్శన చక్రం అడ్డుపడి, ఆ కృత్యను ఒక్క క్షణంలోనే నామరూపాలు లేకుండా చేసి దుర్వాసుడి వెంటపడింది.

అనుకోని ఈ పరిణామానికి దుర్వాస మహర్షి హతాశుడైపోయాడు. భయంతో గజగజ వణికిపోయి, పరుగులు పెట్టాడు.

సుదర్శనం అతడి వెంటబడింది.

దుర్వాసుడు ఎక్కడికి వెళ్తే అక్కడికి వస్తోంది ఆ సుదర్శన చక్రం. ఏం చేయాలో పాలుపోక దుర్వాసుడు బ్రహ్మదేవుణ్ణి ఆశ్రయించాడు. బ్రహ్మదేవుడు నా వల్ల కాదన్నాడు. శివుడి కాళ్ళు పట్టుకున్నాడు. శివుడూ సహకరించలేనన్నాడు. చివరికి శ్రీ మహావిష్ణువునే శరణు వేడాడు.

అప్పుడు శ్రీమన్నారాయణుడు దుర్వాస మహర్షితో **'మహర్షీ! నేను భక్తులకు అధీనుణ్ణి. బుద్ధిమంతులైన నా భక్తులు నా మనసును కొల్లగొట్టిపోతుంటారు. బలమైన తీగలతో ఒక మత్తగజాన్ని బంధించినట్లు నన్ను భక్తి అనే లతలతో బంధిస్తుంటారు. నేను ఆ బంధనాల్లో చిక్కుకొని ఎటూ వెళ్ళలేను. నాకు వాళ్ళంటే అంత ప్రేమ!**

**ఆ.వె. నాకు మేలుఁగోరు నా భక్తుఁడగువాఁడు**
**భక్తజనుల కేన పరమగతియు**
**భక్తుఁ డెందుఁ జనినఁ బఱతెంతు వెనువెంట**
**గోవువెంటఁ దగులు కోడెభంగి.** (9-119)

**నాకూ, నా భక్తులకూ సంబంధం విడదీయరానిది. నిజమైన నా భక్తుడు నా మేలునే కోరతాడు. నా భక్తులకు దిక్కు నేనే! కాబట్టి నా భక్తుడు ఎక్కడకు వెళ్తే నేనూ అక్కడికే వెళ్తాను. ఎలాగో తెలుసా? ఆవు వెనక పరిగెత్తే కోడెలాగా.**

**ఆ.వె. తనువు మనువు విడిచి తనయులఁ జుట్టాల**
**నాలి విడిచి సంపదాళి విడిచి**
**నన్నె కాని యన్య మెన్నడు నెఱుఁగని**
**వారి విడువ నెట్టివారినైన** (9-121)

**అన్నింటినీ విడిచిపెట్టి నేను తప్ప వేరే ఇంకేమీ తెలియని వాళ్ళను - వాళ్ళు ఎలాంటివాళ్ళైనా నేను విడిచిపెట్టను.**

**కం. సాధుల హృదయము నాయది**
**సాధుల హృదయంబు నేను, జగములనెల్లన్**
**సాధుల నేన యెఱుంగుదు**
**సాధు లెఱుంగుదురు నాదు చరితము విప్రా!** (9-123)

**మంచివారి హృదయం నాదే! నేనే వాళ్ళ హృదయం. నేనేంటో వాళ్ళకు తెలుసు. వాళ్ళేంటో నాకు తెలుసు.**

**తపస్సు, విద్య, సద్బ్రాహ్మణులకు ముక్తిని కలిగిస్తాయి. అవే చెడ్డవారికి కీడును కలిగిస్తాయి. సాధుజనుల్లో నా తేజస్సు ఉంటుంది. ఆ తేజస్సే సాధువుల్ని బాధించేవారిని శిక్షిస్తుంది. కాబట్టి నిన్ను రక్షించవలసినవాడు అంబరీషుడే. వెళ్ళు. అతణ్ణే ఆశ్రయించు**' అన్నాడు.

దుర్వాస మహర్షి గత్యంతరం లేక వచ్చి అంబరీషుడి కాళ్ళపై పడ్డాడు. అంబరీషుడు దయామయుడు. సుదర్శన స్వామిని శాంతింపజేయడం కోసం భక్తితో స్తుతించాడు. సుదర్శనుడు ప్రసన్నుడయ్యాడు. దుర్వాసుణ్ణి విడిచి అక్కడ నుండి వెళ్ళిపోయాడు.

దుర్వాస మహర్షి బతుకు జీవుడా! అనుకొంటూ అంబరీషుడితో 'రాజా! నాకు పెద్ద ఉపకారం చేశావు. నా తప్పు మన్నించావు. నీ భక్తి, వినయం, పెద్దలపట్ల నీకు గల గౌరవం సాటిలేనివి సుమా! నీ కరుణ అనన్య సామాన్యమైనది.

**మ. ఒక మాటెవ్వని పేరు కర్ణములలో నొయ్యారమై సోకినన్**
**సకలాఘంబులు పల్లటిల్లి తొలఁగున్ సంభ్రాంతితో నట్టి స**
**త్సుకరున్ మంగళతీర్థపాదు హరి విష్ణున్ దేవదేవేశుఁ దా**
**నకలంకస్థితి గొల్చు భక్తులకు లేదడ్డంబు రాజాగ్రణీ!** (9-142)

**ఓ రాజా! ఒక్కసారి ఎవరి పేరు చెవులకు సోకగానే సమస్త పాపాలూ పటాపంచలై పోతాయో అటువంటి భక్త సుకరుడూ, మంగళకరమైన తీర్థాన్ని పాదాలలో కలిగి ఉన్నవాడూ అయిన విష్ణుమూర్తిని స్వచ్ఛంగా కొలిచే**

**నీలాంటి విష్ణుభక్తులకు తిరుగులేదని నిరూపించావు. నీ కీర్తి చిరస్థాయిగా నిలిచి పోతుంది'** అని ఆశీర్వదించి, ఆతిథ్యం స్వీకరించి తృప్తిగా వెళ్ళిపోయాడు దుర్వాస మహర్షి.

**కం. హరిఁ గొల్చుచుండువారికిఁ**
**బరమేష్ఠి పదంబు మొదలు పద భోగంబుల్**
**నరకసమములను తలఁపున**
**ధరణీరాజ్యంబుతోడి తగులము మానెన్** (9–150)

'హరిని సేవించే వారికి బ్రహ్మలోకంతో సహా సమస్త లోకాలూ నరకాలతో సమానం' అనే భావనతో అంబరీషుడు రాజ్యంపై మోహాన్ని త్యజించి, ఆ రాజ్య భారాన్ని కొడుకులకు అప్పగించి శ్రీహరి కటాక్షం కోసం తపస్సు చేసుకోవడానికి అడవులకు వెళ్ళిపోయాడు. శ్రీహరినీ, శ్రీహరి భక్తుల్నీ సేవిస్తూ మోక్షాన్ని పొందాడు. రాజా! ఈ పరమ భక్తుడైన అంబరీషుడి చరిత్రను విన్నా, చదివినా, కీర్తించినా సమస్త దోషాలూ తొలగిపోయి పుణ్యలోకాలు లభిస్తాయి. ఇక ఇక్ష్వాకు వంశం గురించి వివరిస్తాను విను.

## ఇక్ష్వాకు వంశ క్రమం

ఒకరోజు మనుచక్రవర్తికి తుమ్ము వచ్చింది. అతడి ముక్కుపుటాల నుండి ఇక్ష్వాకువు జన్మించాడు. ఇతడే సూర్యవంశానికి రాజు అయ్యాడు. ఇతడికి వందమంది పుత్రులు. వారిలో వికుక్షి, నిమి, దండకుడు ప్రముఖులు.

ఇక్ష్వాకు మహారాజు అష్టకా శ్రాద్ధం చేయాలని సంకల్పించాడు. అందుకు కొంత మాంసం కావాలి. దానిని తీసుకురావడానికి వికుక్షి అడవికి వెళ్ళాడు. అక్కడ అతడికి బాగా ఆకలివేసింది. ఒక కుందేలును చంపి దాని మాంసాన్ని కొంత తాను తిని, మిగిలినదాన్ని యాగం కోసం తీసుకువచ్చాడు. ఎంగిలిమాంసం (ఉచ్ఛిష్టం) శ్రాద్ధానికి పనికిరాదన్నాడు వశిష్ఠ మహర్షి. తండ్రికి కోపం వచ్చింది. వికుక్షిని తన రాజ్యంలో ఉండవద్దన్నాడు.

వికుక్షి దేశం విడిచి వెళ్ళిపోయి, యోగమార్గంలో శరీరాన్ని త్యజించాడు. కుందేలు మాంసం తిన్నందువల్ల ఇతడికి శశాదుడు అని పేరు వచ్చింది. వికుక్షి కుమారుడు పురంజయుడు. రాక్షసుల్ని సంహరించడం కోసం శ్రీమన్నారాయణుడు

పురంజయుడిలో ఆవహించి ఉన్నాడు. ఇంద్రుడు ఆంబోతుగా మారాడు. ఆ ఆంబోతు కకుత్స్థము (మూపు) మీద ఎక్కి పురంజయుడు రాక్షసుల్ని సంహరించాడు. అందుకే ఇతడికి అమరేంద్ర వాహనుడు, కకుత్స్థుడు అనే పేర్లు వచ్చాయి.

పురంజయుడి కుమారుడు అనేనసుడు. ఇతడి కుమారుడు పృథువు. కొన్ని తరాల తర్వాత ఈ వంశంలోనే కువలయాశ్వుడు జన్మించాడు. ఇతడు బృహదశ్వుడి కుమారుడు. ఇతడి 21 వేల మంది కుమారులలో ముగ్గురు తప్ప అందరూ దుందుడు అనే రాక్షసుడివల్ల మరణించారు, మరణించగా మిగిలిన వాళ్ళు దృఢాశ్వుడు, కపిలాశ్వుడు, భద్రాశ్వుడు మాత్రమే.

## మాంధాతృ చక్రవర్తి

దృఢాశ్వుడి వంశంవాడైన యువనాశ్వుడు తన వందమంది భార్యలతో యజ్ఞం చేశాడు. ఆ యజ్ఞానికి ఫలంగా ఇతడికి 'మాంధాత' అనే కుమారుడు జన్మించాడు.

మాంధాత చాలా గొప్ప చక్రవర్తి. అనేక యాగాలు చేశాడు. శ్రీహరిని మెప్పించాడు. అతడి భార్య బిందుమతి. పురుకుత్సుడు, అంబరీషుడు, ముచుకుందుడు కుమారులు. వీళ్ళేకాక 50 మంది పుత్రికలు. సౌభరి అనే మహర్షి ఈ కన్యలను వివాహం చేసుకున్నాడు. అతడి తపస్సు మొత్తం వ్యర్థమయింది. చివరికి తప్పు తెలుసుకొని మళ్ళీ ఘోరమైన తపస్సు చేసి ముక్తిని పొందాడు. అతడి భార్యలూ అతడినే అనుసరించారు.

మాంధాత రెండో కొడుకు పురుకుత్సుడు నాగకన్య అయిన నర్మదను పెళ్ళి చేసుకున్నాడు. ఇతడి వారసుడే సత్యవ్రతుడు.

సత్యవ్రతుడికి త్రిశంకుడు అని పేరు. విశ్వామిత్ర మహర్షి ప్రభావంతో బతికి ఉండగానే స్వర్గానికి వెళ్ళాడు. దేవతలు ఇతణ్ణి రానివ్వలేదు. విశ్వామిత్రుడు ఇతణ్ణి ఆకాశంలోనే నిలిపాడు. ఇతడి కొడుకే హరిశ్చంద్రుడు.

హరిశ్చంద్రుడి చేత అసత్యమాడించాలని విశ్వామిత్రుడు ఎంతగానో హింసించాడు కానీ హరిశ్చంద్రుడు అసత్యమాడలేదు. ఇతడి సత్యనిష్ఠకు మెచ్చి విశ్వామిత్రుడు హరిశ్చంద్రుడికి దివ్య జ్ఞానాన్ని బోధించాడు.

రాజా! ఈ వంశంలోనే ‘సగరుడు’ అనే చక్రవర్తి ఉండేవాడు. ఇతడి తండ్రి బాహుకుడు. ఇతడు కడుపులో ఉండగా ఇతడి సవతి తల్లులు ఇతడి తల్లికి విషం పెట్టారు. ఆ విషం ఇతడిని ఏమీ చేయలేకపోయింది. పైగా గరం (విషం) తో పాటుగా జన్మించి ‘సగరుడు’ అనే ప్రసిద్ధిని పొందాడు. ఇతడికి సుమతి, కేశిని అని ఇద్దరు భార్యలు.

## సగర పుత్రులు

రాజా! సగరుడు అశ్వమేధ యాగం చేస్తూ యాగాశ్వాన్ని విడిచిపెట్టాడు. ఆ అశ్వం కోసం వెళ్ళారు సగర పుత్రులు 60 వేల మంది. ఆ అశ్వం పాతాళ లోకంలో కపిల మహర్షి పక్కనే ఉంది. ఆ మహర్షే ఈ అశ్వాన్ని దాచిపెట్టాడని అతడిపైకి దూకారు వీళ్ళంతా. ఆ మహర్షి కోపాగ్నికి బలై భస్మమైపోయారు.

సగర పుత్రులు సుమతి సంతానం. కేశినికి అసమంజసుడు అనే కుమారుడు ఉన్నాడు. అతడికి కొడుకు అంశుమంతుడు. తన మనుమడైన అంశుమంతుణ్ణి యాగాశ్వం కోసం పంపించాడు సగరుడు. అంశుమంతుడు పాతాళానికి వెళ్ళి కపిల మహర్షిని మెప్పించి అశ్వాన్ని తీసుకువచ్చాడు. సగరుడు యాగం పూర్తి చేశాడు.

గంగాజలం భస్మంపై ప్రవహిస్తే సగర పుత్రులకు శాపవిమోచనం కలుగుతుందని కపిల మహర్షి చెప్పాడు. అంశుమంతుడు ప్రయత్నించాడు కానీ అతడి కోరిక తీరకుండానే మరణించాడు. ఇతడి కుమారుడు దిలీపుడు. దిలీపుని కుమారుడు భగీరథుడే గంగను పాతాళం వరకూ ప్రవహింపజేసి సగర పుత్రులకు శాప విమోచనం కలిగించాడు.

## కల్మాషపాదుడు

రాజా! భగీరథుడి తర్వాత ఈ వంశంలో చెప్పుకోదగిన చక్రవర్తి కల్మాషపాదుడు.

ఇతడి అసలు పేరు సుదాసుడు. ఒకరోజు వేటకు వెళ్ళి అక్కడ ఒక రాక్షసుణ్ణి సంహరించి, అతడి తమ్ముణ్ణి విడిచిపెట్టాడు. వాడు ఇతడిపై పగబట్టి ఇతడి దగ్గరే మారురూపంలో వంటవాడిగా చేరాడు.

ఒకరోజు వసిష్ఠ మహర్షికి నరమాంసాన్ని వండి వడ్డించాడు ఆ వంటవాడు. దానికి ఆగ్రహించిన వశిష్ఠుడు రాజును రాక్షసుడివి కమ్మని శపించాడు.

రాజు కూడా తిరిగి వశిష్ఠుణ్ణి శపించడం కోసం చేతిలోనికి నీళ్ళు తీసుకున్నాడు. కానీ అతడి భార్య వద్దని వారించటంతో ఆగిపోయాడు. చేతిలో ఉన్న మంత్రించిన నీళ్ళను ఎక్కడ పోయాలో తెలియక తన పాదాలపైనే చల్లుకొని కల్మాషపాదుడిగా ప్రసిద్ధి చెందాడు.

నల్లని పాదాలతో రాక్షసుడిగా మారి అడవుల్లో తిరుగుతూ ఉండేవాడు. ఒకటే ఆకలి. ఎదురుగా బ్రాహ్మణ దంపతులు. వారిలో భర్తను పట్టుకొని తినబోయాడు కల్మాషపాదుడు. అప్పుడా బ్రాహ్మణ స్త్రీ –

**కం. మానుషదేహము గలుగుట**
**భూనాయక! దుర్లభంబు పుట్టిన మీఁదన్**
**దానము పరోపకారము**
**భూనుత కీర్తియును వలదె పురుషునకెందున్** (9–243)

**'ఓ రాజా! మానవ దేహం లభించటమే కష్టం. మనిషై పుట్టాక దానగుణము, పరోపకార బుద్ధీ, గొప్ప కీర్తి ఉండాలి కదా! నీ వంశం ఎంత గొప్పదో నాకు తెలుసు. బ్రాహ్మణులను దైవంగా కొలిచే సూర్యవంశంలో పుట్టి, ఇప్పుడీ అఘాయిత్యానికి ఒడిగడతావా? నీకేం కావాలో చెప్పు. నేను వండి వడ్డిస్తాను. నన్ను నీ చెల్లెల్ని అనుకో–కాదంటావా? రా! ముందు నన్ను చంపుకు తిను'** అంది.

ఇంత చెప్పినా అతడి మనస్సు మారితేనా? రాక్షసుడు కదా! అతి జుగుప్సాకరంగా బ్రాహ్మణుడిని అతడి భార్య కళ్ళముందే తినివేశాడు కల్మాషపాదుడు. అందుకా బ్రాహ్మణ స్త్రీ చలించిపోయింది. కన్నుల్లో నిప్పులు కురిపిస్తూ

'రాజా! కామార్త నైన నాకు నా భర్తే సర్వస్వం. అటువంటి నా భర్తను క్రూరంగా చంపి తిన్నావు కాబట్టి నువ్వు స్త్రీలను కలిశావో వెంటనే మరణిస్తావు! అని శపించి తానూ అగ్నిప్రవేశం చేసింది.

రాజా! ఈ సూర్యవంశంలోనే ఖట్వాంగుడు, రఘువు, అజుడులాంటి ఎందరో గొప్ప చక్రవర్తులు జన్మించారు. వారిలో అజమహారాజు కుమారుడు దశరథుడు.

దశరథుడి పుత్రుడే శ్రీరామచంద్రుడు. దేవతల కోరికపై సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడే శ్రీరాముడిగా అవతరించి రావణాసురుణ్ణి సంహరించాడు. ఆ వృత్తాంతం చెబుతాను విను.

## శ్రీరామ చరిత్ర

తూర్పుదిక్కున నిండు చంద్రుడు ఉదయించినట్లుగా కౌసల్యాదేవి గర్భంలో శ్రీరామచంద్రుడు అవతరించాడు. బాల్యంలోనే తండ్రి ఆజ్ఞను శిరసావహిస్తూ విశ్వామిత్రుడివెంట నడిచాడు.

తాటకనూ, సుబాహువునూ సంహరించి, మారీచుణ్ణి తరిమికొట్టి, విశ్వామిత్రుడి యాగాన్ని సంరక్షించాడు.

మిథిలకు వెళ్ళాడు. శివధనువును అవలీలగా విరిచాడు. విరిచి –

**కం. భూతల నాథుఁడు రాముఁడు**
**ప్రీతుండై పెండ్లియాడెఁ బృథుగుణమణిసం**
**ఘాతన్ భాగ్యోపేతన్**
**సీతన్ ముఖకాంతివిజితసితఖద్యోతన్.** (9–263)

ప్రీతుడై, గొప్ప గుణాలకు నెలవైనదీ, ముఖకాంతిలో చంద్రుణ్ణి జయించినదీ భాగ్యవంతురాలూ అయిన సీతను పెళ్ళాడాడు. తిరిగి అయోధ్యకు వస్తూ దారిలో పరశురాముడి గర్వాన్ని అణిచి వేశాడు. తండ్రి ఆజ్ఞను తలదాల్చి, సీతాలక్ష్మణ సమేతుడై అడవులకు వెళ్ళాడు. దండకారణ్యంలో నివసించాడు.

రావణుడి చెల్లెలు శూర్పణఖ కామంతో వచ్చి శ్రీరాముడిమీద పడింది. అప్పుడు లక్ష్మణుడు ఆమె ముక్కు చెవులు కోసి బుద్ధి చెప్పాడు.

రగిలిపోయింది శూర్పణఖ. వెళ్ళి ఖరదూషణాది రాక్షసుల్ని రెచ్చగొట్టింది. శ్రీరాముడి మీదికి ఉసిగొల్పింది. వాళ్ళందరినీ శ్రీరాముడు తన బాణాగ్నితో భస్మం చేశాడు.

శూర్పణఖ వెళ్ళి ఈసారి తన గోడు రావణుడికి చెప్పుకొంది. సీత అంద చందాలను పొగిడి, అతడు సీతపై మనసు పడేలా చేసింది.

రావణుడు కదిలాడు, మారీచుణ్ణి బంగారు లేడిగా పంపి, రామలక్ష్మణులు లేని సమయంచూసి సీతాదేవిని అపహరించాడు. శ్రీరాముడు మారీచుణ్ణి చంపి తిరిగి వచ్చాడు. చూస్తే సీత కన్పించలేదు.

సీతకోసం పరితపిస్తూ అన్వేషణ ప్రారంభించారు శ్రీరామలక్ష్మణులు.

సీతాదేవిని రావణాసురుడు తీసుకుపోతుంటే చూసి ఆకాశమార్గంలో అడ్డు తగిలాడు జటాయువు. రావణుడు జటాయువు రెక్కల్ని క్రూరంగా కత్తితో ఖండించాడు. శ్రీరాముడు సీతను వెదుకుతూ జటాయువును కలిశాడు. తనకోసం ప్రాణాలు అర్పించిన ఆ జటాయువుకు అంత్యక్రియలు తానే నిర్వహించాడు.

తర్వాత ఋష్యమూక పర్వతానికి చేరుకొని అక్కడ సుగ్రీవుణ్ణి కలిశాడు. అతడికి అభయమిచ్చి ఒకే ఒక్క బాణంతో వాలిని సంహరించాడు.

సుగ్రీవుడి సహాయంతో సీతాన్వేషణ కోసం వానరుల్ని పంపాడు.

వారితో హనుమంతుడు సముద్రాన్ని దాటి సీతను సందర్శించాడు. తిరిగి వస్తూ అక్షకుమారాది రాక్షసుల్ని సంహరించి, లంకకు నిప్పంటించి మరీ వచ్చాడు.

శ్రీరాముడు వానరసైన్యంతో లంకానగరానికి బయలుదేరాడు. సముద్రంపై సేతువు నిర్మించి దాన్ని దాటాడు.

రావణుడి సోదరుడు విభీషణుడు వచ్చి శ్రీరాముణ్ణి శరణువేడాడు.

శ్రీరాముడు అతడికి అభయమిచ్చాడు. విభీషణుడి సూచనలతో శ్రీరాముడు లంకానగరంలోనికి వానరసైన్యంతో ప్రవేశించాడు.

యుద్ధం భీకరంగా సాగుతోంది.

కుంభ, నికుంభ, ధూమ్రాక్ష, విరూపాక్ష, సురాంతక, దుర్ముఖ, ప్రహస్తాది మహావీరులు రాక్షససైన్యంలో ఉన్నారు.

ఇటుపక్క వానరసైన్యంలో సుగ్రీవ, హనుమత్, పనస, గజ, గవయ, గంధ మాదన, నీల, అంగద, కుముద, జాంబవదాది అరివీరభయంకరులు ఉన్నారు.

లక్ష్మణుడు అతికాయుణ్ణి మట్టుపెట్టాడు. రామచంద్రుడు కుంభకర్ణుణ్ణి సంహరించాడు.

లక్ష్మణుడు మేఘనాదుణ్ణీ సంహరించాడు.

రాక్షసవీరులందరూ ఒక్కొక్కరూ రాలిపోవడంతో రావణుడే నేరుగా శ్రీరాముడితో యుద్ధానికి తలపడ్డాడు.

శ్రీరాముడు దివ్యరథాన్ని అధిరోహించి -

**మ. చపలత్వంబున డాఁగి హేమమృగమున్ సంప్రీతిఁ బుత్తెంచుటో**
**కపట బ్రాహ్మణమూర్తివై యబల నా కాంతారమధ్యంబునం**
**దపలాపించుటయో మదీయశిత దివ్యామోఘ బాణాగ్ని సం**
**తపనం బేగతి నోర్చువాఁడవు దురంతం బెంతయున్ రావణా!** (9-300)

ఓ రావణా! నాతో యుద్ధం అంటే దొంగలాగా దాక్కొని బంగారు లేడిని పంపించడం అనుకున్నావా? దొంగ బ్రాహ్మణవేషంతో వచ్చి ఒక అబలను మోసం చెయ్యడమనుకున్నావా? ఇప్పుడు నా బాణాగ్నిజ్వాలలకు ఎలా తట్టుకుంటావో చూస్తాను. నువ్వు చేసిన పాపాలకు యముడిదాకా ఎందుకు? ఇప్పుడే ఇక్కడే అందరూ చూస్తుండగానే నిన్ను చంపుతాను' అని ప్రళయాగ్నిలాంటి బాణాన్ని ప్రయోగించాడు.

ఆ బాణం రావణుడి హృదయాన్ని చీల్చుకొని వచ్చింది. అతడి పంచ ప్రాణాలూ అనంతవాయువుల్లో కలిసిపోయాయి.

రావణుడి మరణవార్త విన్న అంతఃపురం స్త్రీలు లబోదిబోమంటూ యుద్ధ భూమికి వచ్చారు. వారిలో రావణుడి పట్టపురాణి మండోదరి కూడా ఉంది. ఆమె రావణుడి కళేబరాన్ని చూసి విలపిస్తూ -

'హా! ప్రాణనాథా! మహా మహా దేవతాశ్రేష్ఠుల్ని సైతం గెల్చిన నువ్వు ఒకే ఒక్క మన్మథుడికి ఓడిపోయావే! శ్రీరాముడి భార్యను ఎందుకు తెచ్చావో! తప్పని చెప్పినా విన్నావు కాదే! ఇప్పుడిలా కాలానికి వశమై నేలరాలిపోయావు. ఇప్పుడు నేనూ అనాథనే, లంకానగరమూ అనాథే' అంటూ కన్నీరుమున్నీరయ్యింది.

విభీషణుడు రావణుడికి దహనక్రియలు నిర్వహించాడు. శ్రీరాముడు సీతను అగ్నిప్రవేశం చేయించి, ఆమెలో ఏ దోషము లేదని లోకానికి ప్రకటించి తన ఇల్లాలిగా స్వీకరించాడు.

విభీషణుడికి లంకాసామ్రాజ్య పట్టాభిషేకం చేసి, సీతాలక్ష్మణసమేతుడై పుష్పక విమానంపై నందిగ్రామానికి విచ్చేశాడు శ్రీరామచంద్రుడు.

నందిగ్రామంలో భరతుడితోపాటూ అక్కడ ఉన్న మహర్షులూ, బ్రాహ్మణులూ, ప్రజలూ అందరూ శ్రీరాముణ్ణి దర్శించారు. ఆనందంలో ఉబ్బితబ్బిబ్బయ్యారు.

సుగ్రీవుడు, విభీషణుడు రెండువైపులా వింజామరలు వీస్తుంటే శ్రీరాముడికి హనుమంతుడు తెల్లగొడుగు పట్టాడు. భరతుడు శ్రీరామపాదుకల్ని చేత ధరించి వచ్చాడు. శత్రుఘ్నుడు విల్లు తీసుకువచ్చాడు. లక్ష్మణుడు సేవకుడై దారి చూపుతున్నాడు. సీత జలపాత్రతో వెంట నడిచింది.

అంగదుడు కాంచనఖడ్గాన్ని జాంబవంతుడు బంగారుడాలునూ ధరించి శ్రీరాముణ్ణి సేవిస్తున్నారు. అలా శ్రీరామచంద్రుడు సమస్త గ్రహాలచేత సేవించబడుతున్న పూర్ణచంద్రుడిలా అయోధ్యానగరానికి విచ్చేశాడు.

అయోధ్యలోని ప్రజలు శ్రీరాముడికి ఘనస్వాగతం పలికారు. భర్త రాకకు కరిగిపోయే భార్యలా ఆ పురం ఏనుగుల మదజలంతో తడిసిపోయింది. సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యింది.

శ్రీరాముడు రాజమార్గంలో నడుస్తున్నాడు. అప్పుడు శ్రీరాముణ్ణి అతడి పరివారాన్ని చూస్తూ మేడల మీద ఉన్న స్త్రీలు కళ్ళు ఇంతింత చేసుకొని –

**మ. ఇతఁడే రామనరేంద్రుఁ డీ యబల కా యింద్రారి ఖండించె న**
**ల్లతఁడే లక్ష్మణుఁ డాతఁడే కపివరుం డా పొంతవాఁడే మరు**
**త్సుతుఁ డా చెంగట నా విభీషణుఁ డటంచుం జేతులం జూపుచున్**
**సతులెల్లన్ బరికించి చూచిరి పురీసౌధాగ్రభాగంబులన్** (9–325)

‘ఇతడే! రామచంద్రుడు! అదుగో సీత! ఈమెకోసమే శ్రీరాముడు ఆ రావణుణ్ణి సంహరించాడు. అల్లదుగో! అతడే లక్ష్మణుడు, అడుగో సుగ్రీవుడు, ఆ పక్కనున్నాడే! అతడే హనుమంతుడు. ఆ ప్రక్కన ఉన్నాడే అతడే విభీషణుడు.’ అని చెప్పుకొంటున్నారు.

శ్రీరాముడు రాజప్రాసాదంలోనికి ప్రవేశించాడు. తల్లులకు నమస్కరించాడు. పండితులకు వినమ్రుడయ్యాడు. స్నేహితుల్నీ సోదరుల్నీ ఆదరంగా కౌగిలించు

కొన్నాడు. మంత్రుల్నీ, సేవకుల్నీ మన్నన చేశాడు. వాళ్ళందరికీ పోయిన ప్రాణాలు తిరిగివచ్చినట్లుయ్యింది.

తరువాత వసిష్ఠులవారి ఆదేశానుసారం శాస్త్రోక్తంగా శ్రీరామచంద్ర ప్రభువుకు పట్టాభిషేకం జరిగింది.

రాజా! శ్రీరాముడు ప్రజారంజకంగా పరిపాలన సాగించాడు. కన్నతండ్రిలా శ్రీరాముడు తమను రక్షిస్తుంటే ప్రజలు తమ సొంత తండ్రుల్ని సైతం మర్చిపోయారు. సుఖశాంతులతో వర్ధిల్లారు.

శ్రీరామచంద్రుడు లోకోత్తర గుణసంపన్నుడు. భగవంతుడు, మరో విశేషం చెప్పనా? తనను గురించి తానే యాగాలు చేసుకొన్న మహాత్ముడు యాగం చేసి బ్రాహ్మణులకు సమస్త రాజ్యాన్ని దానం చేశాడు. అంతటి గొప్పదాత శ్రీరామచంద్రుడు తిరిగి ఆ రాజ్యాన్ని వారి ప్రార్థన మేరకే స్వీకరించి వారికి ప్రతినిధిగా పరిపాలించాడు. లోకం సుభిక్షంగా ఉంది.

ఒక రోజు శ్రీరాముడు ప్రజాభిప్రాయ సేకరణకోసం మారువేషంలో నగర సంచారం చేస్తున్నాడు. ఒకచోట ఒక భార్యాభర్తల గొడవ జరుగుతోంది. అందులో భర్త – 'పరాయివాడి ఇంట్లో ఉండి వచ్చిన ఇల్లాలిని తిరిగి చేపట్టాడానికి నేనేమైనా వెర్రి రాముణ్ణనుకున్నావా? మారుమాట్లాడకుండా పో!' అన్నాడు భార్యతో.

ఆ మాటలు విని రాముడు మారుమాట్లాడకుండా అంతఃపురానికి వచ్చాడు. గూఢచారుల్ని పంపి తెలుసుకొని రమ్మన్నాడు. ఈ విషయాన్నే నగరం మొత్తం కోడై కూస్తోందని తెలిసింది. సీతకు ఇదేమీ చెప్పకుండా ఆ రాత్రికి రాత్రే ఆమెను వాల్మీకి పర్ణశాల దగ్గరకు పంపించాడు.

సీత అప్పటికే గర్భవతి, వాల్మీకి ఆశ్రమంలోనే ఇద్దరు పుత్రులకు జన్మనిచ్చింది సీత. వాల్మీకి మహర్షి వారికి కుశుడు, లవుడు అని నామకరణం చేశాడు.

అక్కడ లక్ష్మణుడికి అంగదుడు, చంద్రకేతుడు, భరతుడికి తక్షుడు, పుష్కలుడు, శత్రుఘ్నుడికి సుబాహుడు, శ్రుతసేనుడు అనే పుత్రులు జన్మించారు.

భరతుడు దిగ్విజయయాత్ర చేశాడు. శత్రుఘ్నుడు లవణాసురుణ్ణి సంహరించి మధువనంలో మధుపురాన్ని నిర్మించాడు.

కొంతకాలం గడిచింది.

వాల్మీకి మహర్షి ఆశ్రమంలో కుశలవులు పెరిగి పెద్దవాళ్ళవుతున్నారు. వాల్మీకి వద్ద సకలవిద్యలూ అభ్యసించారు. అనేక సభల్లో రాగయుక్తంగా శ్రీరామకథను గానం చేస్తున్నారు. వారి గానానికి లోకం పరవశించిపోతోంది.

అలా గానం చేస్తూ ఒకరోజు శ్రీరాముడి యజ్ఞశాలకు వచ్చారు కుశలవులు. అక్కడ కూడా తమ గానామృతంతో శ్రీ రామచంద్రుడితో సహా అందర్నీ మంత్ర ముగ్ధుల్ని చేశారు. శ్రీరాముడు వాళ్ళను చూసి అమితానందంతో –

**ఆ.వె. చిన్నయన్నలార! శీతాంశుముఖులార!**
**నళినదళవిశాలనయనులార!**
**మధురభాషులార! మహిమీఁద నెవ్వరు**
**తల్లి దండ్రి మీకు ధన్యులార!** (9–353)

'పిల్లలారా! చంద్రుడితో సమానమైన ముఖాలూ, పద్మపత్రాలలాంటి విశాల నేత్రాలూ, మధురమైన వాక్కులూ కల పసికూనలారా! మిమ్మల్ని కన్న తల్లిదండ్రులు ఎంతో అదృష్టవంతులు కదా! ఆ ధన్య జీవులెవరో కాస్త చెప్పండి' అని అడిగారు.

కుశలవులు తాము వాల్మీకి మహర్షి శిష్యులమనీ, ఈ యాగాన్ని చూడాలని వచ్చామనీ చెప్పారు. అప్పుడు శ్రీరాముడు 'సరే! రేపు ఉదయం మీ తండ్రి ఎవరో మీకు తెలుస్తుంది. రేపటిదాకా ఇక్కడే ఉండండి' అని వాళ్ళను సత్కరించాడు.

తరువాత రోజు వాల్మీకిమహర్షి సీతాదేవినీ, కుశలవుల్ని వెంటతీసుకొని వచ్చాడు అనేక విధాలుగా శ్రీరాముణ్ణి స్తుతించి ఇలా అన్నాడు.

'శ్రీరామచంద్రా! ఇదుగో! సీత. ఈమె పవిత్రురాలు, పతివ్రత, పుణ్యాత్మురాలు, ఇకనైనా ఈమెను స్వీకరించు' అన్నాడు.

సీతాదేవి కుశలవులను వాల్మీకి మహర్షికి అప్పగించింది. తాను శ్రీరామ చంద్రుడి పాదపద్మాలను ధ్యానిస్తూ భూగర్భంలోనికి వెళ్ళిపోయింది.

ఆ హఠాత్పరిణామానికి శ్రీరాముడు దిగ్భ్రాంతిచెందాడు. సీతా! సీతా! అని పలవరిస్తూ అంతులేని దుఃఖంతో విలపించాడు.

పరీక్షిన్మహారాజా! అలా దుఃఖసాగరంలో మునిగిపోయిన కరుణాసాగరుడు శ్రీరామచంద్రుడు ఆ తరువాత బ్రహ్మచర్యాన్ని చేపట్టి పదమూడువేల సంవత్సరాలు ఎడతెరిపిలేకుండా అగ్నిహోత్రాల్ని నిర్వహించి పరమపదం చేరుకున్నాడు.

ఇదంతా ఆ శ్రీమన్నారాయణుడి, లీలలో ఒక భాగమే. లేకపోతే ఆదిదేవుడైన ఆ శ్రీరామచంద్రుడికి వానరుల సహాయం ఎందుకు? అందరికీ తన లీలల్ని తెలియజేయడం కోసమే ఈ అవతారాలన్నీ. అందుకే –

**ఉ. నల్లనివాఁడు పద్మనయనంబులవాఁడు మహాశుగంబులన్**
**విల్లును దాల్చువాఁడు గడువిప్పగు వక్షమువాఁడు మేలు పైఁ**
**జల్లెడువాఁడు నిక్కిన భుజంబులవాఁడు యశంబు దిక్కులం**
**జల్లెడువాఁడు నైన రఘుసత్తముఁ డీవుత మా కభీష్టముల్** (9–361)

నల్లనివాడు, పద్మనేత్రాలవాడు, విల్లూ బాణాలూ ధరించినవాడు, విశాలమైన వక్షస్థలం కలవాడు, శుభాలను కలిగించేవాడు, ఎత్తయిన భుజాలవాడు, కీర్తి మంతుడు, రఘుశ్రేష్ఠుడైన శ్రీరాముడే మా కోరికలను నెరవేర్చుగాక! అటువంటి శ్రీరాముడి సాంగత్యం లభించిన వాళ్ళందరూ ముక్తిని పొందారు.

**కం. మంతనములు సద్గతులకు**
**పొంతనములు ఘనములైన పుణ్యముల కిదా**
**నీంతన పూర్వమహాఘ ని**
**కృంతనములు రామనామకృతిచింతనముల్.** (9–363)

**రాజా! శ్రీరామనామస్మరణలు ఉత్తమగతుల్ని అందించే మంతనాలు, గొప్ప పుణ్యాలకు సాటియైనవి. ప్రస్తుతమూ, పూర్వమూ చేసిన అన్ని జన్మలలోని పాపాలన్నింటినీ నాశనం చేసేవి.**

**రాజా! ఇదంతా శ్రీమన్నారాయణుడి లీల. తాను లోకనాయకుడై ఉండి కూడా ధర్మాన్ని ఆచరించి చూపడానికీ తాను సామాన్యుడిగా జీవించాడు.** అందుకే శ్రీరామ చరిత్ర ఉత్తమ గతుల్ని అందిస్తుంది. పాపాలన్నింటినీ పటాపంచలు చేస్తుంది – అంటూ సూర్యవంశంలో జన్మించిన తరువాతి చక్రవర్తుల గురించీ, భవిష్యత్తులో జన్మించబోయే రాజుల గురించి విపులంగా చెప్పాడు శుక మహర్షి.

పరీక్షిన్మహారాజు చంద్రవంశం గురించి చెప్పమని శుకమహర్షిని అడిగాడు. శుకమహర్షి ప్రారంభించాడు.

## చంద్రవంశం

రాజా! బ్రహ్మదేవుడి కుమారుడైన అత్రిమహర్షి క్రీగంటి చూపు నుండి చంద్రుడు ఉదయించాడు. ఇతడి కుమారుడు బుధుడు.

బుధుడికి ఇలాకన్య ద్వారా పురూరవుడు జన్మించాడు. మిత్రావరుణుల శాపంవల్ల భూలోకంలో జన్మించిన ఊర్వశి ఈ పురూరవుణ్ణి వివాహం చేసుకుంది. వీరికి ఆయువు, శ్రుతాయువు, సత్యాయువు, రయుడు, జయుడు, విజయుడు అనే ఆరుగురు కుమారులు జన్మించారు. వీరి ద్వారా చంద్రవంశం వృద్ధి చెందింది.

ఈ వంశంలోనే కొన్నాళ్ళ తర్వాత గాధి అనే గొప్ప చక్రవర్తి జన్మించాడు. గాధి కుమార్తె సత్యవతి. 'ఋచికుడు' అనే మహర్షి తెల్లని శరీరం, నల్లని చెవులు కల వెయ్యి గుఱ్ఱాలను కన్యాశుల్కంగా ఇచ్చి సత్యవతిని పెళ్ళాడాడు.

కొంతకాలం గడిచింది. సత్యవతి, ఆమె తల్లీ ఇద్దరూ ఒకేసారి పుత్రసంతానం కోసం ఋచికుణ్ణి యాగం నిర్వహించమన్నారు. ఆ యాగంలో వీళ్ళిద్దరికీ వేరు వేరుగా చరువులను (యజ్ఞప్రసాదాలను) ప్రసాదించాడు ఋచికుడు. అయితే వాళ్ళు ఒకరి చరువును మరొకరు స్వీకరించారు. దానివల్ల సత్యవతికి క్రూరుడు, క్షత్రియ ధర్మాలు కలవాడు అయిన పుత్రుడూ, ఆమె తల్లికి బ్రహ్మజ్ఞాని అయిన పుత్రుడూ జన్మిస్తారని ఋచికుడు చెప్పాడు.

ఆ మాటలకు సత్యవతి భయపడిపోయింది. ఋచికుణ్ణి ప్రార్థించింది. అప్పుడు ఋచికుడు సత్యవతీ! బాధపడకు, నీకు పుట్టబోయే కొడుకు, శాంత స్వభావం కలవాడిగానే ఉంటాడు కానీ అతడి కొడుకు మాత్రం క్షత్రియధర్మాలతో జన్మిస్తాడు, అని చెప్పాడు. ఆ సత్యవతికి పుట్టిన వాడే జమదగ్నిమహర్షి. ఈ మహర్షి కుమారుడే పరశురాముడు. సత్యవతి తల్లికి విశ్వామిత్రుడు జన్మించాడు.

## పరశురాముడి కథ

ఒకసారి హైహయ వంశానికి చెందిన 'కార్తవీర్యార్జునుడు' అనే చక్రవర్తి జమదగ్ని మహర్షి ఆశ్రమానికి వచ్చాడు. జమదగ్ని వద్ద ఉన్న హోమధేనువును

చూసి మోజుపడి దాన్ని తనతో తీసుకువెళ్ళాడు. అప్పుడు పరశురాముడు ఆశ్రమంలో లేడు. ఆ విషయం తెలుసుకొని పరశురాముడు కాలాగ్నిరుద్రుడై కార్తవీర్యార్జునుడి రాజధానియైన మాహిష్మతీ నగరానికి వెళ్ళి తన గండ్రగొడ్డలితో కార్తవీర్యార్జునుడి శిరస్సును ఖండించి హోమధేనువును తెచ్చి తన తండ్రికి సమర్పించాడు. పరశురాముడు చేసిన పనికి జమదగ్ని బాధపడ్డాడు. తన కొడుకుకు ఇలా హితబోధ చేశాడు.

**శా. తాలిమి మనకును ధర్మము**
**తాలిమి మూలంబు ధర్మతత్త్వంబునకున్**
**దాలిమి గలదని యీశుం**
**డేలించును బ్రహ్మపదము నెల్లన్ మనలన్** (9-462)

'నాయనా! సహనంతో ఉండటమే మన ధర్మం. సహనమే అన్ని ధర్మాలకూ మూలం. ఈ ఓర్పు వల్లనే పరమాత్మ మనల్ని బ్రహ్మస్థానంలో నిలబెట్టాడు.

**కం. క్షమ గలిగిన సిరిగలుగును**
**క్షమగలిగిన వాణి గలుగు సౌఖ్యములెల్లన్**
**క్షమగలుగఁ దోన కలుగును**
**క్షమ గలిగిన మెచ్చు శౌరి సదయుఁడు తండ్రీ!** (9-463)

క్షమ ఉంటే సంపదలు, విద్య, సమస్త సుఖాలూ లభిస్తాయి. దయామయుడైన శ్రీహరి కూడా మెచ్చుకొనేది క్షమకలవాళ్ళనే. ఒక దేశానికి రాజును సంహరించడం మంచిది కాదు. అది బ్రహ్మ హత్యా పాతకం కంటే ఘోరమైన పాపం. పాప పరిహారం కోసం పుణ్యతీర్థాలను సేవించు' అని ఆజ్ఞాపించాడు.

పరశురాముడు వెళ్ళి, పుణ్యతీర్థాలు సేవించి వచ్చాడు.

జమదగ్ని భార్య రేణుకాదేవి. ఆమె నీటికోసం గంగానదికి వెళ్ళింది. రావటానికి ఆలస్యం అయింది. దానికి కోపగించిన జమదగ్ని ఆమెను సంహరించమని తన పుత్రుల్ని ఆజ్ఞాపించాడు. ఒక్క పరశురాముడు తప్ప తక్కిన పుత్రులు తల్లిని చంపడానికి నిరాకరించారు.

తన మాటను కాదన్న పుత్రుల్నీ వధించమని పరశురాముణ్ణి ఆదేశించాడు జమదగ్ని మహర్షి. పరశురాముడు తన తల్లినీ, సోదరుల్నీ వధించి, తండ్రి ద్వారా వరాన్ని పొంది మరణించినవాళ్ళందరినీ తిరిగి బ్రతికించాడు.

జమదగ్నికి మరణించిన వాళ్ళను బ్రతికించే శక్తి ఉంది. అది పరశురాముడికి తెలుసు. అందుకే తండ్రి చెప్పిన పని చేసి, అతణ్ణి ప్రసన్నుణ్ణి చేసుకొని మళ్ళీ తనవాళ్ళను బ్రతికించుకొన్నాడు. రాజా! పరశురాముడు చేశాడు కదా అని మనం మన సోదరుల్నీ, తల్లినీ వధించకూడదు.

కొంతకాలం తర్వాత కార్తవీర్యార్జునుడి పుత్రులు పరశురాముడు లేని సమయం చూసి జమదగ్నిని సంహరించారు. పరశురాముడి తల్లి ఏడుస్తూ 21 సార్లు పరశురాముణ్ణి పిలిచింది. అందుకే తరువాత పరశురాముడు 21 సార్లు భూమండలాన్ని చుట్టివచ్చి దుర్మార్గులైన క్షత్రియులందరినీ సంహరించాడు. ఆ రాజుల రక్తంతో 'శమంత పంచకం' అనే ప్రాంతంలో తొమ్మిది మడుగులు ఏర్పడ్డాయి.

కార్తవీర్యార్జునుడి కుమారులు తెంచిన తన తండ్రి తలను తెచ్చి, మొండెంతో కూర్చి, యాగం చేశాడు. అలా తన ఆప్తుడైన కుమారుడి వల్ల శరీరాన్ని పొంది బ్రతికిన జమదగ్ని– తన తపోబలంతో సప్తర్షి మండలంలో చేరాడు. ఏడో మహర్షియై ప్రకాశించాడు.

తరువాత పరశురాముడు శాంతించి మహేంద్రపర్వతంపై తపస్సు చేసుకొంటూ కాలం గడిపాడు. ఇతడే తరువాత మన్వంతరాల్లో సప్తర్షులలో ఒకడౌతాడు. ఇదంతా శ్రీహరి లీలలో ఒక భాగమే.

## విశ్వామిత్రుడు

ఇక గాధికి విశ్వామిత్రుడు అనే పుత్రుడు జన్మించాడు. అగ్ని తేజస్సుకల ఈ మహర్షి రాజధర్మాన్ని విడిచిపెట్టి తపస్సు చేసి బ్రహ్మర్షి అయ్యాడు. ఇతడికి 101 మంది పుత్రులు.

ఆ సమయంలోనే భృగు వంశంలో జన్మించిన 'అజీగర్తుడు' అనే బ్రాహ్మణుడి పుత్రుడైన శునశ్శేఫుడు హరిశ్చంద్రుడి యాగానికి 'బలిపశువు' అయ్యాడు. కన్న తల్లిదండ్రులే ఇతణ్ణి హరిశ్చంద్రుడికి అమ్మివేశారు. చివరికి అతడు దేవతలను స్తోత్రం చేసి, మెప్పించి, వారి అనుగ్రహం వల్ల బ్రతికి బయటపడ్డాడు. ఇతడంటే విశ్వామిత్రుడికి చాలా ఇష్టం.

శునశ్శేఫుణ్ణి అన్నగా అంగీకరించమని తన పుత్రుల్ని కోరాడు విశ్వామిత్రుడు. అలా అంగీకరించని వాళ్ళని మ్లేచ్ఛుల్లో పుట్టమని శపించాడు కూడా! వారిలో మధుచ్ఛందుడు మొదలైన 50 మంది పుత్రులు తండ్రి మాటను మన్నించారు. అప్పటి నుండి విశ్వామిత్రుడి వంశంలో రెండు శాఖలు ఏర్పడ్డాయి.

పురూరవుడి వంశం దినదిన ప్రవర్ధమానమయింది. నహుషుడు పురూరవుడి మనుమడు. నూరు యాగాలు చేసి ఇంద్ర పదవిని పొందాడు. నహుషుడి కుమారులలో యయాతి చక్రవర్తి ఒకడు. ఇతడు శుక్రుడి పుత్రిక అయిన దేవయానినీ, వృషపర్వుడి కుమార్తె అయిన శర్మిష్ఠనూ పెళ్ళాడాడు.

## యయాతి చరిత్ర

వృషపర్వుడు అసురులకు రాజు. అతడి కుమార్తె శర్మిష్ఠ. శుక్రాచార్యుడు అసురులకు గురువు. అతడి కుమార్తె దేవయాని. శర్మిష్ఠ, దేవయాని ఒకసారి ఒక సరస్సులో జలక్రీడలాడుతున్నారు. అదే సమయంలో పార్వతీ పరమేశ్వరులు అటుగా రావడం చూసి శర్మిష్ఠ కంగారులో దేవయాని వస్త్రాలు ధరించింది. దానివల్ల దేవయానీ శర్మిష్ఠలకు గొడవ జరిగింది. దేవయానిని శర్మిష్ఠ నూతిలోనికి తోసి వెళ్ళిపోయింది.

కొంతసేపు అయ్యాక యయాతి మహారాజు అక్కడికి వచ్చాడు. నూతిలో ఉన్న దేవయానికి తన చేతిని అందించి పైకి తీశాడు.

అప్పుడు దేవయాని 'రాజా! నీకూ నాకూ పాణిగ్రహణం జరిగింది. బృహస్పతి పుత్రుడైన కచుడు మా నాన్నగారివద్ద మృతసంజీవని విద్యను నేర్చుకొనేవాడు. నేను అతణ్ణి ఇష్టపడ్డాను. అతడు కాదన్నాడు. నువ్వు నేర్చుకున్న విద్య నీకు ఉపయోగపడదని నేను అతణ్ణి శపించాను. నిన్ను బ్రాహ్మణుడెవడూ వివాహ మాడడు అని అతడు నన్ను శపించాడు. ఇది దైవనిర్ణయం కాబట్టి నువ్వే నా భర్త' అంది. యయాతి అంగీకరించాడు.

శుక్రాచార్యుడు తన కుమార్తెకు జరిగిన అవమానానికి బాధతో వృషపర్వుడి రాజ్యాన్ని విడిచి వెళ్ళిపోవడానికి సిద్ధపడ్డాడు. శుక్రాచార్యుడు లేకపోతే తను దేవతల్ని గెలవటం కష్టం. అందుకే వెళ్ళవద్దని ప్రాధేయపడ్డాడు వృషపర్వుడు.

శుక్రుడి కోరిక మేరకు తన కుమార్తె శర్మిష్ఠను దేవయానికి దాసిగా నియమించాడు. శర్మిష్ఠ దేవయానికి దాసిగా యయాతి మహారాజు రాజ్యంలోనే ఉండేది. శర్మిష్ఠను కలవకూడదని శుక్రాచార్యుడు యయాతికి షరతు విధించాడు. అయినా యయాతి ఆమెను కలిశాడు. వాళ్ళకు ద్రుహ్యుడు, అనువు, పూరుడు అనే పుత్రులు జన్మించారు.

యయాతి చేసిన మోసానికి భగ్గుమన్న శుక్రాచార్యుడు యయాతిని ముసలి వాడివి కమ్మని శపించాడు. శాపాన్ని సడలించమని యయాతి వేడుకున్నాడు. ఎవరైనా వాళ్ళ యౌవనాన్ని నీకు ఇచ్చి, నీ వృద్ధాప్యాన్ని వాళ్ళు స్వీకరిస్తే ముసలితనం పోతుందని చెప్పాడు శుక్రాచార్యుడు.

దేవయాని పుత్రులైన యదుతుర్వసులు కూడా తమ యౌవనాన్ని తండ్రికి ఇవ్వడానికి ముందుకు రాలేదు. శర్మిష్ఠ పుత్రుడైన పూరుడు ఒక్కడే అంగీకరించి–

**కం. పనుపక చేయుదు రధికులు**
**పనిచిన మధ్యములు పొందుపఱతురు తండ్రుల్**
**పనిచెప్పి కోరి పనిచిన**
**ననిశము మాఱాడు పుత్త్రు లధములు తండ్రీ** (9–559)

**'నాన్నగారూ! తండ్రి చెప్పక ముందే అవసరాన్ని గుర్తించి పనిచేసిపెట్టే వాళ్ళు ఉత్తమ పుత్రులు. చెప్పిన తర్వాత మాత్రమే చేసేవాళ్ళు మధ్యములు. చెప్పిన పని చేయకుండా ఎదురు చెప్పేవాళ్ళు అధములు. ఇంతమాత్రానికే మీరు ఇంతగా అడగాలా?'** అంటూ తన యౌవనాన్ని తండ్రికి ధారపోసి తండ్రి ముసలితనాన్ని తాను సంతోషంగా స్వీకరించాడు.

**తరువాత యయాతి నవయౌవనంతో సకల భోగాలు అనుభవించి ఎంతకీ తృప్తిని పొందక చివరికి జ్ఞానోదయాన్ని పొంది, తపస్సు చేసి ముక్తిని పొందాడు. తరువాత పూరుడు చక్రవర్తి అయ్యాడు. ఇతడి ద్వారా వంశం వృద్ధి చెందింది.**

ఈ వంశంలోనే రైభ్యుడు అనే చక్రవర్తికి దుష్యంతుడు జన్మించాడు. ఈ దుష్యంతుడు ఒకసారి వేటకు వెళ్ళి అడవిలో కణ్వాశ్రమంలో ఉన్న శకుంతలను గాంధర్వ పద్ధతిలో పెళ్ళిచేసుకున్నాడు. శకుంతల విశ్వామిత్ర మహర్షికి మేనకకూ జన్మించిన కుమార్తె.

దుష్యంతుడు శకుంతలను విడిచి నగరానికి వెళ్ళిపోయాడు. అతడు వెళ్ళాక శకుంతల ఒక పుత్రుణ్ణి కన్నది. అతడే భరతుడు. కణ్వమహర్షి శకుంతలనూ, భరతుణ్ణీ దుష్యంతుడి వద్దకు పంపాడు. మొదట దుష్యంతుడు వాళ్ళను ఆదరించలేదు కానీ అశరీరవాణి చెప్పటంతో శకుంతల తన భార్య అనీ, భరతుడు తన పుత్రుడనీ అంగీకరించి వీళ్ళను ఆదరించాడు.

దుష్యంతుడి తర్వాత భరతుడు చక్రవర్తి అయ్యాడు. **ఇతడే భరత వంశానికి వంశకర్త. తరువాతి కాలంలో ఋషభుడి కుమారుల్లో ఒకడైన భరతుని వల్ల అప్పటివరకు అజనాభం అనే పేరు కల భూభాగం భరతవర్షంగా ప్రసిద్ధి పొందింది.** దుష్యంతుడి కొడుకు భరతునివల్ల పూరువంశం భరతవంశంగా ప్రశస్తి గడించింది.

ఇతడి పుత్రుడు భరద్వాజుడు. గొప్ప దాతగా ప్రసిద్ధి చెందిన రంతి దేవుడు కూడా ఈ వంశంలోనివాడే. అతడి చరిత్ర చెబుతాను విను.

## రంతిదేవుడి చరిత్ర

**రాజా! రంతిదేవుడు మహాదాత. తన సర్వస్వాన్నీ దీనులకు దానంచేసి పేదవాడు అయ్యాడు.** కొన్ని రోజులు తినడానికి ఏమీ దొరకలేదు. కుటుంబం మొత్తం ఆకలికి అలమటించింది. అలాంటి స్థితిలో ఒకరోజు అతడికి కొద్దిగా పాయసం, నీళ్ళు, నెయ్యి మొదలైనవి లభించాయి. వాటిని తిని ప్రాణం నిలుపుకోవాలని అతడు సిద్ధపడుతుంటే ఒక బ్రాహ్మణుడు, శూద్రుడు, కుక్కల గుంపుతో మరొకడు వరుసగా ఒకరి తర్వాత ఒకరు వచ్చారు. వాళ్ళందరికీ ఆ పదార్థాలను దానం చేశాడు. ఇక మిగిలిన నీళ్ళనైనా తాగుదామనుకున్నాడు. ఇంతలో ఒక చండాలుడు వచ్చి 'దాహంగా ఉంది. కాసిన్ని నీళ్ళు ఉంటే దానం చెయ్యండి' అని అడిగాడు. దానికి రంతి దేవుడు ఎంతో ప్రేమగా–

ఉ. **అన్నము లేదు కొన్ని మధురాంబువు లున్నవి, ద్రావుమన్న రా**
**వన్న శరీరధారులకు నాపదవచ్చిన వారి యాపదల్**
**గ్రన్నన మాన్చి వారికి సుఖంబులు సేయుటకంటె నొండు మే**
**లున్నదె? నాకు దిక్కు పురుషోత్తముఁడొక్కఁడ సుమ్ము పుల్కసా!**

(9–648)

**ఓ అన్నా! పుల్కసా! నా వద్ద అన్నం లేదు. కొన్ని తియ్యటి నీళ్ళు మాత్రమే ఉన్నాయి. రా! త్రాగు. తోటివారికి ఆపదవస్తే ఆ ఆపదను తీర్చి వెంటనే సుఖం కలిగించటం కంటే మేలు ఇంకేదైనా ఉంటుందా? ఇక నాకు దిక్కు ఆ పురుషోత్తముడే! అంటూ ఉన్న నీళ్ళు కూడా అతడికి దానం చేశాడు.**

రాజా! బ్రహ్మాది దేవతలే అలా మారువేషాల్లో వచ్చి రంతి దేవుణ్ణి పరీక్షించారు. అంతటి మహాదాత రంతి దేవుడి చరిత్ర పరమ పావనమైనది.

ఈ వంశంలోనే 'దివోదాసుడు' అనే రాజు ఉండేవాడు. ఇతనికి అహల్య సోదరి. ఈమె గౌతముణ్ణి వివాహం చేసుకుంది. వీరికి శతానందుడు జన్మించాడు. ద్రుపదుడు ఇతడి సంతతివాడే. ఇతని కొడుకు ధృష్టద్యుమ్నుడు. కుమార్తె ద్రౌపది.

సంవరణుడు అనే రాజు సూర్యపుత్రిక అయిన తపతిని వివాహం చేసుకున్నాడు. వీరికి పుట్టినవాడే కురుచక్రవర్తి. ఇతడి పేరుమీదే కురువంశం వృద్ధిలోనికి వచ్చింది. తరువాత ఇతడి వంశంలోనే బృహద్రథుడు అనే రాజుకు రెండు విడి విడి ముక్కలుగా ఒక కుమారుడు జన్మించాడు. జర అనే రాక్షస స్త్రీ ఆ ముక్కల్ని కలపటంవల్ల ఆ బాలుడు ప్రాణం పోసుకుని జరాసంధుడు అని ప్రసిద్ధిలోనికి వచ్చాడు. ఇతడి వంశమూ దినదిన ప్రవర్ధమానమయింది. ఈ వంశంలోనే ప్రతీపుడు అనే రాజుకు దేవాపి, శంతనుడు, బాహ్లికుడు అనే ముగ్గురు కుమారులు కలిగారు. ఈ శంతను మహారాజుకీ, గంగాదేవికి భీష్ముడు ఉదయించాడు.

శంతను మహారాజుకీ దాశకన్య అయిన సత్యవతికీ చిత్రాంగదుడు, విచిత్ర వీర్యుడు అనే పేర్లు గల పుత్రులు జన్మించారు.

చిత్రాంగదుడు గంధర్వులతో యుద్ధం చేసి మరణించాడు.

భీష్ముడు కాశీరాజ కుమార్తెలైన అంబిక, అంబాలికలను తెచ్చి విచిత్ర వీర్యుడికి ఇచ్చి వివాహం జరిపించాడు. కానీ సంతానాన్ని పొందకుండానే విచిత్రవీర్యుడు మరణించాడు.

అప్పుడు సత్యవతి తనకు పరాశర మహర్షి ద్వారా జన్మించిన వ్యాసుడిని ప్రార్థించింది. అంబిక, అంబాలికలకు పుత్ర భిక్ష పెట్టమని ఆదేశించింది. అలా జన్మించినవాళ్ళే ధృతరాష్ట్రుడు, పాండురాజు. వ్యాసుడికి దాసి వల్ల జన్మించినవాడు విదురుడు.

ధృతరాష్ట్రుడి కుమారులు వందమందికీ కౌరవులనీ, పాండురాజు కుమారులు ఐదుగురికి పాండవులనీ ప్రసిద్ధికలిగింది. పాండవుల భార్య ద్రౌపది. ద్రౌపదికి పాండవుల ద్వారా ఐదుగురు కుమారులు కలిగారు.

భీముడికి హిడింబవల్ల ఘటోత్కచుడు, అర్జునుడికి ఉలూపి అనే నాగకన్య వల్ల ఇరావంతుడు, చిత్రాంగద వల్ల బభ్రువాహనుడు, సుభద్రవల్ల నీ తండ్రి అభిమన్యుడు జన్మించాడు.

రాజా! నువ్వు తక్షకుడు అనే సర్పంవల్ల మరణిస్తావు. నీ కుమారులలో ఒకడైన జనమేజయుడు సర్పయాగం చేస్తాడు అంటూ పరీక్షిత్తు వంశంలోని భవిష్యద్రాజుల చరిత్రలను, ఇలా మగధ చక్రవర్తుల చరిత్రనూ, యదువంశ రాజుల చరిత్రనూ విపులంగా చెప్పాడు. ఆ తరువాత వసుదేవుడి వంశం గురించి చెప్పడం ప్రారంభించాడు.

యదువంశానికి చెందిన రాజు ఉగ్రసేనుడు. ఇతడి కొడుకు కంసుడు. దేవకుడు ఉగ్రసేనుడి సోదరుడు. ఇతడికి ఏడుగురు కుమార్తెలు. వారిలో దేవకి కూడా ఉంది. ఈ ఏడుగురినీ వసుదేవుడే పెళ్ళి చేసుకున్నాడు.

వసుదేవుడి తండ్రి శూరుడు. ఇతడి కుమార్తె పృథ. శూరుడు తన మిత్రుడైన కుంతి భోజుడికి సంతానం లేకపోవటంవల్ల తన కుమార్తె పృథను అతడికి దత్తత ఇచ్చాడు కాబట్టి పృథ వసుదేవుడి సోదరి. కుంతి భోజుడికి దత్తపుత్రిక కాబట్టి ఈమెకే కుంతి అనే పేరు ఏర్పడింది. పాండవుల తల్లి. ఈమె దుర్వాస మహర్షి వరంవల్ల సూర్యుణ్ణి ఆహ్వానించి అతడి ద్వారా ఒక పుత్రుడిని పొందింది. ఆ బాలుణ్ణి పెట్టెలో పెట్టి గంగానదిలో విడిచిపెట్టింది. అతడే కర్ణుడు.

కుంతి చెల్లెలు శ్రుతదేవ. ఈమె భర్త వృద్ధశర్మ. వీరి కుమారుడే దంతవక్త్రుడు. పృథకు మరో సోదరి అయిన శ్రుతశ్రవస, దమఘోషుణ్ణి పెళ్ళాడింది. వీళ్ళ కుమారుడే శిశుపాలుడు.

రాజా! వసుదేవుడికి రోహిణి ద్వారా బలరాముడు మొదలైన ఎనిమిదిమంది కుమారులు, పౌరవి అనే భార్య ద్వారా సుభద్రుడు మొదలైన 12 మంది కుమారులు జన్మించారు. చివరిగా దేవకి గర్భంలో ఎనిమిదో కుమారుడిగా శ్రీకృష్ణుడు జన్మించాడు. తరువాత సుభద్ర అనే కుమార్తె కూడా జన్మించింది.

**కం. ఎప్పుడు ధర్మక్షయమగు**
**నెప్పుడు పాపంబు పొడము నీ లోకములో**
**నప్పుడు విశ్వేశుఁడు హరి**
**దప్పక విభుఁడయ్యుఁ దన్నుఁ దా సృజియించున్.** (9-726)

రాజా! లోకంలో ధర్మం నశించి, పాపం పెరిగినప్పుడు శ్రీమన్నారాయణుడు తప్పక అవతరిస్తాడు. లోకంలో ఏది జరిగినా అది విష్ణులీలా విలాసమే! దుష్టశిక్షణ కోసం, శిష్ట రక్షణ కోసం స్వయంగా తానే భూమిపై అవతరించిన ఆ పరంధాముడి చరిత్ర పరమ పావనమైనది.

**కం. మంగళహరికీర్తి మహా**
**గంగామృత మించుకైనఁ గర్ణాంజలులన్**
**సంగతము సేసి ద్రావఁ దొ**
**లంగును గర్మంబు లావిలం బగుచు నృపా!** (9-731)

మంగళకరమైన ఆ శ్రీహరి కీర్తి అనే గంగాజలాన్ని కొంతైనా సేవిస్తే సమస్త కర్మలూ నశిస్తాయి.

**చం. నగుమొగమున్ సుమధ్యమును నల్లనిదేహము లచ్చి కాట ప**
**ట్టగు నురమున్ మహోభుజము లంచితకుండలకర్ణముల్ మదే**
**భగతియు నీలవేణియుఁ గృపారసదృష్టియుఁ గల్గు వెన్నుఁ డి**
**మ్ముగఁ బొడసూపుఁ గాతఁ గనుమూసిన యప్పుడు విచ్చునప్పుడున్.**
(9-733)

నగుమోమూ, చక్కటి నడుమూ, నల్లటి దేహము, లక్ష్మీదేవికి ఆటపట్టు అయిన వక్షఃస్థలము, గొప్ప భుజాలు, మంచి కుండలాలు ధరించిన చెవులు, మత్తగజాన్ని పోలిన నడక, నల్లని కురులూ దయను కురిపించే చూపులూ కల ఆ విష్ణుమూర్తి దివ్యసుందర విగ్రహమే నాకు కళ్ళు మూసినా తెరిచినా సాక్షాత్కరించు గాక!' అంటూ శుకమహర్షి శ్రీహరిని భక్తితో ధ్యానించాడు' అన్నాడు సూత మహర్షి.

శౌనకాది మునులూ శ్రీహరి పాదపద్మాలపై దృష్టి నిలిపి స్వామిని స్తుతించారు.

# దశమ స్కంధం

సూతమహర్షి శౌనకాది మహర్షులను ఉద్దేశించి ఇలా చెప్తున్నాడు–

“మునిశ్రేష్ఠులారా! ఆ పరీక్షిన్మహారాజు శుకమహర్షిని ఈ విధంగా అభ్యర్థిస్తున్నాడు –

**ఆ.వె. నీ ముఖాంబుజాత నిర్ముక్త హరికథా**
**మృతముఁ ద్రావఁద్రావ మేను వొదలె**
**వంతమానె నీరువట్టు నాఁకలియును**
**దూరమయ్యె మనము దొంగలించె** (10–1–11)

మహర్షీ! నీ ముఖపద్మం నుండి జాలువారే హరికథ అనే అమృతాన్ని త్రాగిన కొద్దీ నా శరీరం పులకించిపోతోంది. ఇక మరణదుఃఖం అంటావా?! అదెప్పుడో సమసిపోయింది. ఆకలిదప్పులు మటుమాయం అయ్యాయి. మనసైతే ఆనందంతో పరవళ్ళు తొక్కుతోంది. అందుకే ఇంకా ఇంకా వినాలని ఉంది.

‘మహర్షీ! మహాత్ముడూ, ముల్లోకాలకూ ఈశ్వరుడూ అయిన శ్రీ మహావిష్ణువు ఆ యదువంశంలో ఎందుకు పుట్టవలసి వచ్చింది? పుట్టి ఆ వంశంలో ఎలా మెలిగాడు? ఎప్పుడెప్పుడు ఏమేమి చేశాడు? ఈ వివరాలన్నీ వినాలని ఉంది. దయచేసి చెప్పవూ!’

ఆ మాటలు విన్నాడు శుకయోగీంద్రుడు. వెంటనే ఇలా అంటున్నాడు:

## శ్రీకృష్ణావతారం

రాజేంద్రా! అంతా వివరంగా చెబుతాను. శ్రద్ధగా విను.

పూర్వం కొందరు దానవులు తామే రాజులమంటూ విర్రవీగిపోయారు. భూమి బ్రహ్మదేవుడి దగ్గర కన్నీరు మున్నీరుగా విలపించింది. దేవతలూ మొరపెట్టుకున్నారు.

బ్రహ్మదేవుడు – భూమినీ దేవతలనూ వెంటబెట్టుకొని శ్రీ మహావిష్ణువు సందర్శనానికి బయలుదేరాడు. పురుష సూక్తం చదివి, సమాధి స్థితిలోనికి వెళ్ళాడు. అప్పుడు బ్రహ్మదేవుడికి ఒక దివ్య వాక్కు వినబడింది. అది విని మహానందంతో–

'ఓ భూదేవీ! దేవతలారా! నేను విన్నది చెబుతాను. వినండి. బయలుదేరండి! మీరంతా మీమీ అంశలతో భూమిపై యాదవ కులంలో జన్మించండి. శ్రీహరి వసుదేవుడికి పుత్రుడిగా జన్మించి భూభారం తొలగించబోతున్నాడు.

ఓ సురకన్యలారా! హరిని పూజించటం కోసం మీరూ సుందరాంగులుగా అవతరించండి. ఆదిశేషుడూ శ్రీహరికి అన్నగా అవతరిస్తున్నాడు. ఈ ప్రపంచాన్ని మోహంలో ముంచెత్తే యోగమాయ కూడా విష్ణుమూర్తి ఆజ్ఞను శిరసా వహించింది. తన కర్తవ్యాన్ని నిర్వహించటం కోసం భూమిపై జన్మిస్తోంది' అన్నాడు.

దేవతలందరూ ఆమోదించారు. బ్రహ్మదేవుడు తన లోకానికి వెళ్ళిపోయాడు.

పరీక్షిన్మహారాజా! అది మథురానగరం. పూర్వం భూలోకంలో యాదవ చక్రవర్తులందరికీ రాజధాని. సిరిసంపదలతో విలసిల్లుతూ ఉండే నగరం. సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడు తన దివ్యపాదాలతో నడయాడిన నగరం.

## కంసుడి హింస

వసుదేవుడి ఇల్లాలు దేవకీదేవి. దేవకుడు అనే రాజుగారి ముద్దులపట్టి. ఈ దేవకుడికి ఒక అన్నగారు ఉన్నాడు. అతడు ఉగ్రసేన మహారాజు. అతడి కొడుకు కంసుడు.

అప్పుడే దేవకీ వసుదేవుల పెళ్ళి వైభవంగా జరిగింది. పెళ్ళి కాగానే వసుదేవుడు దేవకీ దేవిని వెంటబెట్టుకొని రథంపై బయలుదేరాడు. దేవకీ దేవి అన్నగారైన కంసుడే స్వయంగా పగ్గాలు చేతపట్టి రథం నడుపుతున్నాడు.

ఇంతలో అకస్మాత్తుగా అశరీరవాణి గుండె లదిరిపోయేలా ఇలా పలికింది–

'ఓరీ, కంసుడా! నీ చెల్లెలి మెప్పుకోసం ప్రేమతో కోరి మరీ రథం నడుపుతున్నావు గానీ ఏం జరుగబోతోందో నీకు తెలుసా? నీ ఈ ముద్దుల చెల్లెలికి అష్టమగర్భంలో పుట్టబోయేవాడే నిన్ను సంహరిస్తాడు.' అని.

ఆ మాటలకు కంసుడు ఉలిక్కిపడ్డాడు. భుజాలు అదిరిపడ్డాయి. మరో ఆలోచన లేదు. వెంటనే కత్తిదూశాడు. చెల్లెలి కొప్పు పట్టుకొని ఆమెను కిందికి లాగాడు. తోడబుట్టిందని కూడా కనికరించలేదు. తెగించి ఆమెను చంపడం కోసం కత్తి పైకి ఎత్తాడు.

పక్కనే ఉన్న వసుదేవుడు విస్తుపోయాడు. అయినా వెంటనే తేరుకొని ముందుకు వచ్చి కంసుడికి అడ్డుపడ్డాడు.

కంసుడు అసలే దుర్మార్గుడు! పైగా కోపం. అగ్నిశిఖలా రగిలిపోతున్నాడు. అతణ్ణి శాంతింపజేయాలని వసుదేవుడి తపన. అమృతం ధారలు కట్టే తన చల్లటి మాటలతో ఇలా అన్నాడు:

## వసుదేవుడి వేడుకోలు

'అయ్యయ్యో! బావా! నువ్వు స్వయానా దేవకీ దేవికి అన్నగారివే! తోడబుట్టిన దానికి మాడలో చీరలో ఇవ్వాలి. మధురంగా మాట్లాడాలి. ఆడబడుచును మన్నన చేయాలి అంతేగాని ఇదేమిటయ్యా! అవేవో ఆకాశంలో వినిపించిన చప్పుళ్ళు విని అవే నిజమనుకొంటే ఎలా? సొంత చెల్లెల్నే చంపుకుంటావా? వద్దయ్యా! ఆపవయ్యా! నిన్ను వేడుకొంటానయ్యా! ఇది నీకు తగదు.

చూడు నీ చెల్లెలు ఎంత అమాయకురాలో! చిన్న పిల్ల. అభం శుభం ఎరుగని అబల. పిచ్చిది. ఎప్పుడూ నీ క్షేమాన్నే కోరుతూ ఉంటుంది. ఏ పాపమూ ఎరుగదు. ఈమెను చంపటం న్యాయమేనా చెప్పు? పవిత్రమైన భోజ వంశంలో పుట్టిన పుణ్యమూర్తివే! అందరికీ నాయకుడివే! నీకిది ధర్మమా! ఇది నీ ప్రతిష్ఠకు భంగం కాదూ! ఒక్కసారి ఆలోచించు.

**అందరూ కర్మల్నిబట్టి నడుచుకోవాలి. అలాంటప్పుడు ఇంక అందరిలో తప్పులెన్నడం దేనికయ్యా! ఇతరుల్ని హింసించటం మంచిది కాదు. తన మేలు కోసం ఎదుటివాళ్ళను బాధపెడితే ఆ పాపం ఊరికే పోతుందా?! అనుభవించక తప్పదు.'**

'నీకు చేతులెత్తి నమస్కరిస్తున్నా! చూడు నీ చెల్లెలు ఇప్పటికే బెదిరిపోయింది. ఆమెను రక్షించు. శిక్షించకు' అంటూ వసుదేవుడు అనునయంగా చెప్పిచూశాడు.

కంసుడు వింటేనా?! అతడిలో జాలి ఏ కోశానా లేదు. పైగా చూపుల్లో క్రోధం. కన్నుల్లో నిప్పులు కురిపిస్తూ దేవకీ దేవిని చంపబోయాడు.

అతడి మూర్ఖత్వాన్ని గమనించాడు వసుదేవుడు. ఎలాగైనా కంసుడి ఆగడాన్ని ఆపాలనే పట్టుదల అతడిది. ఆత్మబలంతో గట్టిగా నిలబడ్డాడు. చివరి క్షణం దాకా ప్రయత్నించాలన్న స్థిర సంకల్పంతో ఉన్నాడు.

కంసుడు చేస్తున్నదానికి అతని గుండె రగిలిపోతోంది. అయినా కోపానికి ఇది సమయం కాదు. అందుకే దాన్ని అణచిపెట్టుకొని కంసుణ్ణి స్తుతించి –

'బావా! ఈమెకు పుట్టిన కొడుకుల్ని పురిట్లోనే నీకు అప్పగిస్తాను. వాళ్ళను చంపు. అప్పుడు నీకు ఏ సమస్యా ఉండదు' అన్నాడు అనునయంగా.

ఏ బుద్ధిన ఉన్నాడో గానీ ఈ ఉపాయం బాగానే ఉందనిపించింది కంసుడికి. తల పంకించాడు. కత్తి దించాడు. చేతిలోని చెల్లెలి కొప్పును విడిచిపెట్టాడు. చరచరా అక్కణ్ణుంచి వెళ్ళిపోయాడు.

పరీక్షిన్మహారాజా! **సత్యంపైనే స్థిరమైన మనస్సు కలవాడికి కష్టమైన పని అంటూ ఏదీ ఉండదు.**

కాలచక్రం గిర్రున తిరుగుతోంది. దేవకీదేవికి ఏడాదికి ఒకడు చొప్పున పుత్రులు జన్మిస్తున్నారు. మొదటి పుత్రుడు పుట్టగానే వసుదేవుడు తీసుకువెళ్లి కంసుడికి అప్పగించాడు. అలా అప్పగించేటప్పుడు వసుదేవుడు చలించడం లేదు. బాధ ఇసుమంతైనా లేదు. ఎంతటి ధైర్యం! కన్న కొడుకుల్ని చంపేస్తాడని తెలిసీ శత్రువుకు ఇలా అప్పగించగల ధీరుడు వసుదేవుడు గాక ఇంకెవరైనా ఉంటారా? ఈ లోకంలో?

**ఆ.వె. మానవేంద్ర! సత్యమతికి దుష్కరమెయ్యి**
**దెఱుక గలుగువాని కిష్టమెయ్యి**
**దీశభక్తిరతుని కీరాని దెయ్యది?**
**యెఱుక లేనివాని కేదికీడు?** (10-1-48)

**రాజా! సత్యంపైనే నిలబడిన బుద్ధిమంతుడికి కష్టమైనదంటూ ఉంటుందా? జ్ఞానికి ఇష్టమంటూ ఉంటుందా? అజ్ఞానానికి అపకారం అంటూ వేరే ఉండదు.**

**హరి భక్తుడికి ఇతరులకు ఇవ్వకూడనిదంటూ ఏదీ ఉండదు. దేనైన్నా సులభంగా ఇవ్వగలడు. అందుకే ఇలా అప్పగించాడు.**

అప్పుడు కంసుడన్నాడు కదా! 'వసుదేవా! నాకు వీడితో పనిలేదు. నువ్వే తీసుకుపో! నేను చంపను. అష్టమ గర్భంలో పుట్టినవాడివల్లనే నాకు మృత్యువు కలుగుతుందని ఆకాశవాణి చెప్పింది. కాబట్టి వాడు పుట్టగానే వధిస్తాను.

## నారదుడి రాక

తర్వాత కొన్నాళ్ళకి నారద మహర్షి కంసుడి వద్దకు పనిగట్టుకొని మరీ వచ్చాడు. వచ్చి ఏకాంతంలో ఇలా అన్నాడు–

'కంసరాజా! విను. వ్రేపల్లెలో ఉన్నారే! నందుడూ మొదలైనవాళ్ళు. వాళ్ళంతా ఎవరనుకొన్నావు? సామాన్య మానవులు కాదు. సాక్షాత్తు దేవతలే. భూలోకంలో పుట్టి సంచరిస్తున్నారు. ఎందుకో తెలుసా?! శ్రీహరి దేవకీ గర్భంలో పుడుతున్నాడట! దుష్ట రాక్షసుల్ని సంహరించడానికే ఈ అవతారమట! మరి నువ్వు కూడా రాక్షసుడివేగా! జాగ్రత్త నాయనా!' అని ఒక మాట వేసి వెళ్ళిపోయాడు.

కంసుడికి ఒకటే ఆరాటం. మరో ప్రక్క పట్టరాని క్రోధం. శ్రీకృష్ణుడు ఎప్పుడు పుడతాడా అని కంసుడు ఎదురుచూస్తున్నాడు. ఆ శ్రీహరితో శత్రుత్వం వల్లనే అయినా అన్నీ విడిచి, అన్నింటినీ మరచి అతణ్ణే ధ్యానిస్తున్నాడు.

**కం. తిరుగుచుఁ గుడుచుచుఁ ద్రాగుచు**
**నరుగుచుఁ గూర్చుండి లేచు చనవరతంబున్**
**హరిఁ దలఁచి తలఁచి జగ మా**
**హరిమయమని చూచెఁ గంసుఁ డాఱని యలుకన్** (10–1–85)

ఏ పని చేస్తున్నా శ్రీహరినే ధ్యానిస్తూ, ఈ లోకమంతా హరిమయమే ననుకొంటున్నాడు.

వెంటనే దేవకీవసుదేవుల్ని పట్టి బంధించాడు. అప్పటిదాకా పుట్టిన కొడుకుల్ని ఇప్పుడు వదలాలనిపించలేదు. వాళ్ళూ విష్ణుస్వరూపులే కాబట్టి పట్టి సంహరించాడు. అంతటితో ఆగలేదు. యదు, భోజ, అంధకాది దేశాలను పాలిస్తున్న తన తండ్రి ఉగ్రసేనుణ్ణి తెచ్చి చెరసాలలోనికి తోసివేశాడు. ఆ శూరసేన రాజ్యాలనూ తానే హస్తగతం చేసుకున్నాడు. పరీక్షిన్మహారాజా! రాజ్యకాంక్ష అంతటిది మరి!

రాజ్యం కోసం ఎంతకైనా తెగిస్తారు. ఎవరినైనా చంపుతారు. చివరికి తల్లిదండ్రుల్ని, తోడబుట్టినవాళ్ళనీ, బంధుమిత్రుల్నీ మట్టుపెడతారు, తమ జీవితాల్ని నిలుపుకోవడం కోసం. అలా ఆక్రమించిన రాజ్యాధిపతుల్లో బాణుడు, భీముడు, మాగధుడు, మహాశనుడు, కేశి, ధేనుకుడు, బకుడు, ప్రలంబుడు, తృణావర్తుడు, చాణూరుడు, ముష్టికుడు, అరిష్టుడు, ద్వివిదుడు, పూతనాది రాక్షసులు కంసుడి అనుచరులయ్యారు. వారందరూ యాదవులపై విరుచుకుపడ్డారు.

## బలభద్రుడి జననం

దేవకీదేవి సప్తమగర్భంలో 'ఆదిశేషుడు' అనే విష్ణుతేజస్సు పెరుగుతోంది. అప్పుడు శ్రీమన్నారాయణుడు యోగమాయ ద్వారా దేవకీదేవి గర్భంలోని శేషతేజాన్ని తీసి రోహిణీదేవి గర్భంలో ప్రవేశపెట్టించాడు. దేవకీదేవికి గర్భస్రావం జరిగిందన్న వార్త లోకమంతా వ్యాపించింది.

కొన్ని నెలలకు రోహిణీదేవిగర్భంలో ఉజ్జ్వల కాంతితో, ఒక కుమారుడు ఉద్భవించాడు.

ఆ బాలుడు మిక్కిలి బలవంతుడు. అందుకే బలభద్రుడన్నారు. లోకాల్ని ఆనందింపజేసేవాడు కాబట్టి రాముడన్నారు. రోహిణికి గర్భసంకర్షణంవల్ల పుట్టాడు కాబట్టి సంకర్షణు డన్నారు.

తరువాత విష్ణుతేజం దేవకీదేవి గర్భంలో ప్రవేశించింది. దాంతో దేవకీదేవి కొత్త కాంతితో ప్రకాశించింది.

బ్రహ్మాండ భాండాల్ని తన కడుపులో ఉంచుకున్న శ్రీహరి దేవకీదేవి కడుపులో ఒదిగిపోయాడు. అప్పుడు దేవకీదేవికి గర్భవతి లక్షణాలు పొడచూపాయి. ఇంకా దేవకీదేవి కంసుడి చెరసాలలోనే ఉంది. అంతకంతకూ అతిశయిస్తోన్న ఆమె దేహ కాంతిని చూసి కంసుడు భయపడ్డాడు. చెల్లెల్ని ఇప్పుడైనా చంపేస్తే? ఈ క్రూరుడు తన ప్రాణాల కోసం సొంత చెల్లెల్నే వధించాడన్న అపఖ్యాతి రాదూ! ఆ చెడ్డపేరుతో తాను ఎలా బతకగలడు? సరే! పుట్టినవాడు పుట్టినట్లే పురిట్లోనే ఆ విష్ణువును సంహరిస్తాను' అనుకొంటూ సమయం కోసం ఎదురు చూడసాగాడు. కారణం శత్రుత్వమే అయినా నిరంతరం హరిస్మరణతోనే కాలం వెళ్ళబుచ్చుతున్నాడు.

ఇతడిలా నిరంతరం హరిధ్యాసలోనే ఉంటూ ఉండగా బ్రహ్మాది దేవతలూ పరమశివుడూ, నారదాది మహర్షులూ దేవకీదేవిదగ్గరకు వచ్చి 'ఆమె గర్భంలో ఉన్న శ్రీమన్నారాయణుణ్ణి ఉద్దేశించి –

**మ. గురుపాఠీనమవై జలగ్రహమవై కోలంబవై శ్రీనృకే**
**సరివై భిక్షుఁడవై హయాననుఁడవై క్ష్మాదేవతాభర్తవై**
**ధరణీ నాథుఁడవై దయాగుణ గణోదారుండవై లోకముల్**
**పరిరక్షించిన నీకు మ్రొక్కెద మిలాభారంబు వారింపవే !** (10–1–100)

**స్వామీ! మత్స్య, కూర్మ, వరాహ, నారసింహ, వామన, హయగ్రీవ, పరశురామ, శ్రీరామాది అవతారాలతో దయాది గుణాలతో అవతరించి, లోకాల్ని పరిరక్షించిన స్వామీ, నీకు నమస్కారం, త్వరగా అవతరించి భూభారాన్ని తగ్గించు స్వామీ!** అని వేడుకొన్నారు.

వారు కోరుకున్న ఆ శుభతరుణం రాబోతోంది !

## శ్రీకృష్ణావతార ఘట్టం

లోకాలన్నీ ఆనందపారవశ్యంలో తేలియాడుతున్నవేళ అర్ధరాత్రి దేవకీదేవి గర్భం నుండి ఆదినారాయణుడు అవతరించాడు. పదహారు కళలతో ప్రకాశించే పున్నమ చంద్రుడిని పోలిన ముఖంతో స్వామి బాలుడిగా సాక్షాత్కరించాడు.

**చతుర్భుజాలలో శంఖచక్రగదాపద్మాలను ధరించి ఉన్నాడు. తామరపువ్వుల వంటి నేత్రాలతో ఒప్పుతున్నాడు. కౌస్తుభమణితో, శ్రీవత్సమనే పుట్టుమచ్చతో, మకర కుండలాల కాంతులతో, వజ్రకిరీటంతో వెలుగొందుతున్నాడు.**

**సీ. జలధరదేహు నాజానుచతుర్బాహు**
**సరసీరుహాక్షు విశాలవక్షు**
**జారుగదాశంఖ చక్రపద్మవిలాసుఁ**
**గంఠకౌస్తుభమణికాంతిభాసుఁ**
**గమనీయ కటిసూత్ర కంకణ కేయూరు**
**శ్రీవత్సలాంఛనాంచిత విహారు**

**సురుకుండల ప్రభాయుత కుంతలలలాటు**
**వైదూర్యమణిగణ వరకిరీటు**

తే.గీ. **బాలుఁ బూర్ణేందు రుచిజాలు భక్తలోక**
**పాలు సుగుణాలవాలుఁ గృపావిశాలుఁ**
**జూచి తిలకించి పులకించి చోద్యమంది**
**యుబ్బి చెలరేఁగి వసుదేవుఁ డుత్సహించె** (10-1-112)

ఈ రూపాన్ని చూసి వసుదేవుడు పులకించిపోయాడు.

ఆ దివ్యమంగళ స్వరూపాన్ని వీక్షించిన దేవకీదేవీ ఆశ్చర్యానందాలతో ఉప్పొంగిపోయింది.

దేవకీదేవి ఆ బాలుడివైపు చూసింది. ఏమా సౌందర్యం? ఎంత సౌకుమార్యం! చూసీ చూడగానే ఆమె ముఖంలో చిరునవ్వు వెల్లివిరిసింది. ఇలా అంది–

**'విశ్వేశ్వరా! ఈ విశ్వాన్ని నువ్వే నీ లీలలతో నడిపిస్తూ ఉంటావు. అది తెలుసుకొని నిన్ను ఆరాధించేవాడే వివేకి. ఆ వివేకికే శాశ్వతసుఖం, అమృతత్వం సిద్ధిస్తాయి. ఈ భౌతికమైన నేత్రాలతో నిన్ను చూడలేకపోతున్నాను. నీ ఈ స్వరూపాన్ని ఉపసంహరించు. నీకిదే నా నమస్కారం'**

అప్పుడు శ్రీ మహావిష్ణువు దేవకీదేవితో ఇలా అన్నాడు–

"అమ్మా! పూర్వం నువ్వు 'పృశ్ని' అనే మహాపతివ్రతవు. అప్పుడు ఈ వసుదేవుడు 'సుతపుడు' అనే ఒక ప్రజాపతి. మీరిద్దరూ నా గురించి ఘోర తపస్సు చేసి నన్ను ప్రసన్నం చేసుకొన్నారు. నాకు సాటిరాగల పుత్రుణ్ణి ప్రసాదించమని కోరారు. అప్పుడు నేను మీకు 'పృశ్నిగర్భుడు' అనే పేరుతో జన్మించాను. రెండో జన్మలో మీరు అదితికశ్యపులయ్యారు. అప్పుడు వామనుడిగా ఉద్భవించాను. మూడో జన్మలో ఇదుగో ఇప్పుడు ఇలా జన్మించాను. ఇదే చివరి జన్మ. మళ్ళీ నాకు మీ పుత్రుడిగా జన్మ లేదు.

శ్రీహరి సంకల్పం వల్ల వసుదేవుడికి ప్రస్తుత కర్తవ్యం స్ఫురించింది. ఆ బిడ్డను తీసుకొని చప్పుడు చేయకుండా బందిఖానాలోంచి బయటపడ్డాడు.

అక్కడ వ్రేపల్లెలో అదే సమయానికి నందుడి భార్య యశోదాదేవి గర్భంలో యోగమాయ జన్మించింది. ఆ ఊరు ఊరంతా మైకంలో నిద్రపోయింది.

వసుదేవుడు పురిటింటిని దాటి చావడిలోకి వచ్చాడు. అంతా విష్ణుమాయ. అతడి సంకెళ్ళు తెగిపోయాయి. తలుపులకు వేసిన తాళాలు ఊడిపోయాయి. ద్వారాలు అవే తెరుచుకున్నాయి.

వసుదేవుడు మెల్లగా ద్వారాలు దాటుతుంటే ఆదిశేషుడు వెనుక ఉంటూ ద్వారాలు మూస్తూ వస్తున్నాడు. పగడలు విప్పార్చి ఆ బాలుడికి గొడుగుపట్టాడు.

వసుదేవుడు చీకట్లో ముందుకు సాగిపోతున్నాడు. మధ్యలో యమునానది. ఎగిసిపడే కెరటాలతో పరవళ్ళు తొక్కుతోంది. అయినా వెంటనే దారి ఇచ్చింది. వసుదేవుడు వ్రేపల్లె చేరుకొని యశోదాదేవి ప్రక్కలో ఈ బాలుణ్ణి పడుకోబెట్టి అక్కడ ఉన్న బాలికను తీసుకొని వేగంగా తిరిగి వచ్చి దేవకీదేవి ప్రక్కలో పడుకోబెట్టాడు.

కారాగృహంలో చిన్ని పాప కేర్‌కేర్‌మని ఏడవటం విన్నారు భటులు. అప్పటికి విష్ణుమాయ తొలగిపోయింది.

ఈ వార్త విన్న కంసుడు ఉన్నఫళంగా వచ్చాడు. రోషంతో విజృంభించి ఆ చిన్ని పాప గొంతు కోయడానికి సిద్ధపడ్డాడు. దేవకీదేవి అడ్డుపడినా కంసుడు వినలేదు. తోబుట్టువును నానా మాటలూ అని ఆ బిడ్డ కాళ్ళు పట్టుకొని లాగాడు.

వెంటనే ఆ బిడ్డ రివ్వున ఆకాశంలోనికి దూసుకొనిపోయింది. ఎనిమిది చేతులు, వాటిలో ఎనిమిది దివ్యాయుధాలు, శరీరం నిండా దివ్యాభరణాలూ వెలిగిపోతూ ఉంటే ఆమె ఆకాశంలో కనిపిస్తూ కర్కశంగా ఇలా అంది–

'దుర్మార్గుడా! అంతులేని క్రోధంతో ఈ దేవకీదేవికి పుట్టిన శిశువులందరినీ మట్టుపెట్టావే! చివరికి ఆడపిల్లను కూడా చంపడానికి సిద్ధపడ్డావా? ఇదేనా నీ వీరత్వం? నిన్ను సంహరించే మహావీరుడు సరిగ్గా నేను పుట్టిన సమయానికే పుట్టి వేరేచోట పెరుగుతున్నాడు' అని బెదిరించి అదృశ్యమైపోయింది.

కంసుడి తల తిరిగిపోయింది. ఏం చేయాలో పాలుపోలేదు. చచ్చిన పాములా కోపమంతటినీ చల్లార్చుకొని, శాంతంగా దేవకీ వసుదేవుల్ని చూసి –

'శాంతస్వభావులారా! నన్ను మన్నించండి. మీ బిడ్డల్ని చంపి మీకు తీరని గర్భశోకాన్ని కలిగించాను. ఇదంతా నా కర్మ. అదే నన్ను నడిపిస్తోంది.

చంపడానికిగానీ చావడానికిగానీ ఎవరూ కర్తలు కారు. ఇప్పుడు ఒకరి నేరాలను ఒకళ్ళు ఎంచుకోవటం అనవసరం. శాంతించండి' అంటూ వాళ్ళ పాదాలపై పడ్డాడు. ఇకనుండీ మీరూ నేనూ ఒకటే' అన్నాడు. దేవకీవసుదేవులు శాంతించారు.

తరువాతరోజు కంసుడు మంత్రులతో మంతనాలు జరిపాడు. వాళ్ళందరూ ఆలోచించి 'ఎక్కడ ఏ పసిబిడ్డ ఏడుపు వినిపించినా పట్టి వధించాల్సిందే' అని సలహా ఇచ్చారు. అయితే శ్రీహరిని ఎక్కడని వెతకటం?

**మ. అమరశ్రేణికి నెల్లఁ జక్రి ముఖరుం డాచక్రి యే ధర్మమం**
**దమరున్ గోవులు భూమిదేవులు దితిక్షామ్నాయకారుణ్య స**
**త్యములున్ యాగ తపోదమంబులును శ్రద్ధాశాంతులున్ విష్ణుదే**
**హములిన్నింటిని సంహరించిన నతం డంతంబునుం బొందెడిన్**

(10-1-168)

**'గోవులు, బ్రాహ్మణులు, వేదాలు, సహనం, కారుణ్యం, సత్యం, యాగం, తపస్సు, దమం, శ్రద్ధ, శాంతి - ఇవన్నీ విష్ణువు శరీరాలే. కాబట్టి ఇన్నింటినీ అంతం చేస్తే అతడికి నిలువ నీడ ఉండదు' అని మంత్రులు అన్నారు. కంసుడు వాళ్ళ మాటలకు తలూపాడు.**

తర్వాత రాక్షసులు విజృంభించారు. సాధువుల్ని హింసించటం మొదలు పెట్టారు. అలా హింసించి హింసించి వాళ్ళ బలం క్రమంగా క్షీణించింది. పరీక్షి న్మహారాజా! అంతే! **పూజ్యులైనవారిని బాధిస్తే కీర్తి, ఐశ్వర్యం, ధర్మం, ఆయువు ఒకటేమిటి సమస్తమూ నాశనమైపోతాయి.** ఇక్కడిలా ఉంటే అక్కడ వ్రేపల్లెలో నందుడు తనకు కొడుకు పుట్టాడని సంబరాలు చేసుకొంటున్నాడు. దానధర్మాలు గొప్పగా జరిపించాడు.

## సందడే సందడి

గోకులం మొత్తం నందగోపబాలుణ్ణి చూడటానికి ఉత్సాహంగా బయలు దేరింది. పాలు పెరుగు నేతులనే వసంతాలుగా జల్లుకొంటూ ఛలోక్తులు విసురు

కొంటూ సాగిపోతున్నారు. ఇంక గోప వనితలైతే – 'ఆహా! ఏ నోముఫలమో! వేకువనే వీనులవిందుగా ఒక చల్లని కబురు చెవుల్లో పడిందమ్మా! మన యశోద ఒక చిన్న కొడుకును కన్నదట! చూసివద్దాం! రండమ్మా!' అంటూ యశోద ఇంటికి పరుగు తీశారు. తమ శక్తికొలదీ తెచ్చిన కానుకలను ఇచ్చి శ్రీకృష్ణుడిని చూసి ఆనందించారు. అక్కడితో ఆగలేదు. ఆ పాపడికి తలకు నూనె అంటి, శరీరానికి పసుపు పూసి స్నానం చేయించి 'హరిరక్ష' అంటూ నీళ్ళు చుట్టూ తిప్పి చల్లి, ఉయ్యాలలో పడుకోబెట్టి జోల పాడారు.

**కం. జో జో కమలదళేక్షణ !**
**జో జో మృగరాజమధ్య! జో జో కృష్ణా!**
**జో జో పల్లవకరపద!**
**జో జో పూర్ణేందువదన! జో జో యనుచున్** (10–1–190)

**ఆ శ్రీకృష్ణుడి మాయలూ లీలలూ ఒకటా రెండా... పుట్టీపుట్టటంతోనే మాయలు మొదలుపెట్టాడు ఆ మహానుభావుడు. లోకాలన్నింటినీ జోకొట్టి నిద్రపుచ్చి తాను మాత్రమే మేల్కొని ఉండే మాయావి ఇప్పుడు గోపికలు జోకొడుతుంటే తానూ నిద్రపోతున్నట్లే నటిస్తున్నాడు.**

జగత్తులన్నింటికీ తల్లీ దండ్రీ తానే అయినవాడు ఇప్పుడు యశోదాదేవి చనుబ్రాలు తాగుతున్నాడు.

పెరగటం, తరగటం తెలియని ఈ పరబ్రహ్మ ఇప్పుడీ యశోద ఒడిలో ఒదిగిపోయాడు. క్రమంగా పెరుగుతున్నాడు.

ఎన్ని తపస్సులు చేసినా పండని బంగారు పంట ఇప్పటికి పండింది ఈ వ్రేపల్లెలో.

## నందుడూ వసుదేవుడూ

పరీక్షిన్మహారాజా! మథురకు వెళ్ళి కప్పం చెల్లించి వసుదేవుడి ఇంటికి వెళ్ళాడు నందుడు. నందుణ్ణి చూడగానే ప్రాణం లేచి వచ్చినట్లయింది వసుదేవుడికి. ప్రేమగా కౌగిలించుకొని 'మిత్రమా! ఎన్నాళ్ళకు నిన్ను చూశాను! నా ప్రాణం లేచివచ్చింది. నేను బ్రతికానయ్యా! ఇంక నా ఆపదలన్నీ గట్టెక్కినట్లే. నీలాంటి స్నేహితుణ్ణి

చూడటం అంటే చచ్చినవాడు మళ్ళీ పుట్టటమే కదా! అంటూ క్షేమసమాచారా లడిగి తెలుసుకున్నాడు. 'నా కొడుకు ఆనందంగా ఉన్నాడా?' అనీ అడిగాడు.

దానికి నందుడు వెంటనే 'వసుదేవా! ఎంత ఘోరం.. నీ బిడ్డలందరినీ చివరికి ఆడపిల్లని కూడా కంసుడు నిర్దాక్షిణ్యంగా సంహరించాడు. నీకెంతటి కష్టం వచ్చిందయ్యా! మొత్తంమీద నీకు బిడ్డలే లేకుండాపోయారు. సరేలే! నా కొడుకునే నీ కొడుకు అనుకో! అన్నాడు.

ఇలా కొంతసేపు ఇద్దరూ ఆప్యాయంగా మాట్లాడుకున్నారు. ఇంతలో గోకులంలో ఏవో ఉత్పాతాలు కలిగే సూచనలు కన్పిస్తున్నాయని చెప్పి నందుణ్ణి సాగనంపాడు వసుదేవుడు.

## పూతన వధ

ఈలోగా కంసుడు పూతన అనే ఒక రాక్షసిని పంపాడు. పూతన అందమైన ఒక మానవ యువతి రూపంలో యశోద ఇంట్లోకి ప్రవేశించింది. మంచంపై ఉన్న శ్రీకృష్ణుడిని చూసింది.

పూతన రాకను గమనించిన గోపాలబాలుడు దొంగ నిద్ర నటించాడు. గురక కూడా పెడుతున్నాడు. పూతన మెల్లగా బాలుణ్ణి ఎత్తుకొని తన పాలిండ్లకు హత్తుకొంది. శిరసు మూర్కొని ముద్దుపెట్టుకుంది. యశోదా, రోహిణీ వద్దు వద్దు అన్నా వినకుండా నేరుగా వచ్చి ముద్దుగారే బాలుణ్ణి ఒళ్ళో పడుకోబెట్టుకొని 'చిన్నితండ్రీ! ఆకలివేస్తోందా! రా రా! నా పాలు త్రాగు' అంటూ చన్ను కుడపటానికి ప్రయత్నిస్తోంది.

బాలకృష్ణుడు మెల్లగా పాలు త్రాగటం మొదలుపెట్టాడు. అంతే గుటుక్కు గుటుక్కుమని రెండు గ్రుక్కల్లో పాలూ, ఆమె శరీరంలోని శక్తీ పీల్చివేయటం మొదలుపెట్టాడు. పూతన బాధతో తల్లడిల్లిపోయింది. చివరికి పాలతోపాటే ఆమె ప్రాణాలు కూడా పీల్చివేశాడు బాలకృష్ణుడు.

పూతన శరీరం రెక్కలు విరిగిపడ్డ పెద్ద పర్వతంలా నేలపై కూలిపోయింది. చస్తూ చస్తూ పెద్ద గావుకేక పెట్టింది. ఆ ధ్వనికి దిక్కులు అదిరిపోయాయి. భూమి అదిరిపోయింది. లోకాలు చలించిపోయాయి. ఇక గోపాలురైతే మూర్ఛపోయారు.

కూలిపోయిన రాక్షసి శరీరంపై చిద్విలాసంగా ఆడుకొంటున్నాడు శ్రీకృష్ణుడు. గోపికలు వెంటనే వచ్చి పిల్లవాణ్ణి ఎత్తుకొని, వీపుపై మెల్లగా భయపడకుండా చరిచి, ఆవు తోకతో దిష్టి తీశారు. గోధూళినీ, గోమూత్రాన్నీ బాలుడిపై చల్లారు. పన్నెండు పేర్లతో పన్నెండు అవయవాలకూ గోమయాన్ని పట్టించారు. రక్షలు కట్టారు. తరువాత యశోద తన చన్నుపాలు ఇచ్చింది. పానుపుపై పడుకోబెట్టి జోలపాట పాడింది.

నందుడు తిరిగివచ్చి 'అవును! వసుదేవుడు మహాజ్ఞాని. అతడు చెప్పినట్లే జరిగింది' అనుకొని ఆ పూతన శరీరాన్ని ముక్కలు చేయించి దహనం చేయించాడు.

పరీక్షిన్మహారాజా! ఆ పూతన శరీరం కాలుతున్నప్పుడు అగరు పరిమళం వచ్చిందట! ఎందుకో తెలుసా? ఆ శ్రీకృష్ణుడు పాలతో పాటు విషాన్నీ, శరీర మాలిన్యాన్నీ పీల్చివేశాడట! శ్రీకృష్ణుడు మీద కాళ్ళూ చేతులూ వేసి పాలు తాగాడు కదా! దానివల్ల అంత క్రూర రాక్షసికి కూడా పరమపదం లభించింది తెలుసా?!

## ఆనందం... ఆశ్చర్యం

ఆ పరమాత్మకు ఒకే ఒక్కసారి అదీ విషంతో నిండిన పాలు ఇచ్చిన ఆ పూతనకే స్వర్గం వచ్చిందంటే మరి ఎంతో ప్రేమగా రోజూ పాలిచ్చి పెంచిన ఆ యశోదకు మోక్షమే కానీ మళ్ళీ జన్మంటూ ఉంటుందా?!

రాజా! కొన్నాళ్ళకు శ్రీకృష్ణుడు బోర్లాపడ్డాడు. అందుకని ఆ రోజు యశోద పెద్ద వేడుక చేసింది. అందునా ఆ రోజు శ్రీకృష్ణుడి జన్మనక్షత్రం. పేరంటం పెట్టి సాటిలేని దానాలు చేసింది. ఎవరు ఏది కోరితే అది సమర్పిస్తూ అందరినీ అలరింపజేసింది.

బాలకృష్ణుడికి పాలుపట్టి నిద్రపుచ్చింది. యశోద ఈ దానధర్మాల హడావుడిలో ఉంది. బాలకృష్ణుడు నిద్రలేచాడు. ఆ చిన్న పొట్టలో ఆకలి చిందులువేసింది. తల్లి పాలిండ్ల కోసం తడిమాడు కానీ దొరకలేదు. కోపం వచ్చింది. కాళ్ళు ఆడిస్తూ ఆ కోపాన్ని ప్రదర్శించాడు. ఆ పాదాలలో దివ్యరేఖలు ప్రకాశిస్తున్నాయి. ఆ పాదాలతోనే ప్రక్కనే ఉన్న ఒక బండిని ఒక్క తన్ను తన్నాడు. అంతే! ఆ బండి పైకి ఎగిరి కిందపడి ముక్కలు ముక్కలైపోయింది.

అది చూసినవాళ్ళకు నోట మాట రాలేదు. ఆ బండిలో ఉన్న మధురమైన పదార్థాలన్నీ నేలపాలైపోయాయి.

అందరిలో ఏదో భయం. 'అదుగో! శ్రీకృష్ణుడి కాలు తగిలి ఈ బండి ఇలా అయింది' అని చెప్పారు చూసిన పిల్లలు కొందరు. ఆ మాటలు విని 'ఓహో! ఈ పిల్లవాడెక్కడ? ఆ బండి ఎక్కడ? ఆకాశంలో ఎగిరిపడేలా కాలితో తన్నడం ఎక్కడ? ఎందుకీ పిల్లలు అబద్ధాలాడుతున్నారు? ఎక్కడైనా ఇలాంటి నమ్మశక్యం కాని మాటలెవరైనా చెప్తారా? ఇదెక్కడి విడ్డూరం? అయినా ఇందులో ఏదో ఉంది' అని అందరూ ఆశ్చర్యంలో మునిగిపోయారు.

ఒకరోజు ఏమైందోగానీ తన ఒళ్ళో ఉన్న బాలకృష్ణుడు పర్వతమంత బరువు పెరిగిపోయాడు. యశోద మోయలేక ఆ బాలుణ్ణి నేలపై పడుకోబెట్టింది. ఆశ్చర్యపోయింది. కొంచెం భయం.

## తృణావర్తుడి సంహారం

అందుక్కారణం తృణావర్తుడు అనే రాక్షసుడు. ఇతణ్ణి పంపింది కంసుడే! వాడు సుడిగాలిలా రయ్యిమని చెలరేగిపోయాడు. వచ్చి బాలుణ్ణి ఆకాశంలోనికి తీసుకొనిపోయాడు. ఒకటే దుమ్ము. ఎవరికీ ఏమీ కనిపించలేదు. ప్రళయ ప్రభంజనంలా గాలి విసిరివిసిరి కొడుతోంది. ఒక క్షణంలోనే లోకాలన్నీ తల్లడిల్లిపోయాయి.

పసివాడు కనిపించకపోయేసరికి యశోద కలవరపడిపోయింది. లేగ కనిపించని ఆవులా ఉంది ఆమె పరిస్థితి.

పైన తృణావర్తుడు తీసుకుపోయిన శ్రీకృష్ణుడు క్రమక్రమంగా బరువు పెరిగిపోయాడు. ఆ బరువు భరించే శక్తి వాడికెక్కడిది? చివరికి కదలడం కూడా కష్టంగా ఉంది.

ఇంతలో శ్రీకృష్ణుడు తన రెండు చేతుల్నీ ఆ రాక్షసుడి మెడకు తగిలించాడు. అవి ఏనుగు తొండాల్లా ఉన్నాయి. ఆ చేతులతో వాడి మెడను పట్టుకొని వేళ్ళాడ సాగాడు శ్రీకృష్ణుడు. ఇక ఆ రాక్షసుడి పని అయిపోయింది. బాలుడి బరువు

మోయలేక పక్షిలా గిలగిలా కొట్టుకుంటున్నాడు. ఒళ్ళు పట్టుతప్పి బాలుడితో సహా కిందపడ్డాడు. పడటం పడటమే రాళ్ళకుప్పపై పడటంతో వాడి శరీరం తుక్కుతుక్కు అయిపోయింది. వెంటనే ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి.

గోపికల పెదవులపై చిరునవ్వు మొలకెత్తింది. రాక్షసుడి శరీరంపై విచ్చిన పువ్వులాంటి ముఖంతో బాలకృష్ణుడు ముచ్చటగా ఆడుకొంటున్నాడు. పిల్లవాణ్ణి యశోద చేతికందించి –

మేమంతా పూర్వ జన్మల్లో **ఏయే నోములు నోచామో! ఏ యాగాలూ దానాలూ ధ్యానాలూ చేశామో! ఏ సత్యం పలికామో! ఏ పుణ్యతీర్థాలు మెట్టామో! ఇప్పుడు ఈ బాలకృష్ణుణ్ణి ఇలా దర్శించగలుగుతున్నాం!'** అన్నారు గోపికలు. అప్పుడు నందుడికి వసుదేవుడు చెప్పిన మాటలే చెవుల్లో మార్మోగుతున్నాయి. లోలోపల భయపడుతూనే ఉన్నాడు.

పరీక్షిన్మహారాజా!

**కం. రక్షణము లేక సాధుఁడు**
**రక్షితుఁడగు సమతఁ జేసి రాయిడులందున్**
**రక్షణములు వెయి గలిగిన**
**శిక్షితుఁడగు ఖలుఁడు పాపచిత్తుం డగుటన్** (10-1-277)

**సమబుద్ధికల సజ్జనుడికి ఏ రక్షణా లేకపోయినా సమయానికి రక్షణ లభిస్తుంది. ఇది లేనందువల్ల దుర్జనుడికి ఎంత కట్టుదిట్టమైన రక్షణా ఉన్నా శిక్ష పడుతుంది.**

మరోసారి ఏమైందో విను. ఒకసారి యశోదాదేవికి పాలు చేపుకువచ్చాయి. బాలకృష్ణుడికి ప్రేమతో పాలు కుడిపింది. శ్రీకృష్ణుడు ఆవులించాడు. అప్పుడు అతడి ముఖం ఒక పెద్ద కొండగుహలా కనిపించింది. అందులో సమస్త విశ్వమూ ఉంది. అది చూసి ఆమె నివ్వెరపోయింది.

## గర్గ మహర్షి

మరోసారి గర్గమహర్షి వ్రేపల్లెకు విచ్చేశాడు. ఇతడు యాదవులకు పురోహితుడు. వసుదేవుడు పంపగా వచ్చాడు. నందుడు మహర్షికి ఉచిత సత్కారాలు చేసి –

**కం. ఊరకరారు మహాత్ములు**
**వా రథముల ఇండ్లకడకు వచ్చుట లెల్లం**
**గారణము మంగళములకు**
**నీ రాక శుభంబు మాకు నిజము మహాత్మా!** (10-1-284)

**మహాత్మా! మీలాంటి మహాత్ములు ఊరికే రారు. మీలాంటివాళ్ళు మాలాంటి అధముల ఇళ్ల వద్దకు వచ్చారంటే అది సర్వశుభాలకూ కారణమవుతుంది.' అంటూ ఆనందింపజేశారు.**

అప్పుడు గర్గమహర్షి రోహిణీ దేవి కుమారుడికి రాముడు, సంకర్షణుడు, బలుడు అని నామకరణం చేశాడు. ఇక యశోద కుమారుడికి శ్రీకృష్ణుడు, వాసుదేవుడు అని నామకరణం చేశాడు.

అంతకు ముందు అవతారాల్లో ఇతడు తెలుపు, ఎరుపు, పసుపు రంగులలో ఉన్నా ఇప్పుడు ఈ అవతారంలో నల్లగా ఉన్నాడు కాబట్టి శ్రీకృష్ణుడనే పేరు, వసుదేవుడి కుమారుడు కాబట్టి వాసుదేవుడు అనే పేరు పెట్టాడు. చేయవలసిన సంస్కారాలు రహస్యంగానే జరిపించి గర్గుడు బయలుదేరి వెళ్ళిపోయాడు.

## శ్రీకృష్ణ బలరాముల బాల్యక్రీడలు

శ్రీకృష్ణ బలరాముల బాల్య క్రీడలు నయన మనోహరం.

పరీక్షిన్మహారాజా! ఒకసారి మోకాళ్ళ మీద లేచి నిలబడతారు. ముందుకు తూలుతూ బుడిబుడి అడుగులు వేస్తూ, తల్లి కొంగు పట్టుకొని లాగుతూ ఆవుదూడల తోకలు మెలిపెడుతూ, లాగుతూ, బురదలో పొర్లాడుతూ ఇలా వాళ్ళు చేసే చేష్టలు ముద్దులొలికిస్తూ ఉంటే చూసినవాళ్ళ జన్మలు తరించిపోవూ!

వచ్చీ రాని ముద్దుమాటలు, చిటిపోటి నృత్యాలు, చిందులు, కేరింతలు ఆకాశంలో దేవతలకు ఆనందాన్ని కలిగిస్తుంటే లోకంలోని దుర్మార్గులకు దడ పుట్టిస్తున్నాయి.

ఇక బాలకృష్ణుడు తోటి బాలురకు నాయకుడైపోయాడు. అల్లరి పెరిగి పోయింది. తల్లి వారిస్తే అలిగి దూరంగా వెళ్ళిపోతాడు. యశోద ముద్దుగా చేతులు చాచి నా తండ్రీ! అని పిలిస్తే పరిగెత్తుకు వచ్చి ఎప్పటిలాగే పాలు త్రాగుతాడు.

అతడలా నడయాడుతూ ఉంటే మొలతాడుకు కట్టిన గంటలు మ్రోగుతూ ఉంటాయి. గోపస్త్రీల ఇళ్ళలోని వెన్నల్ని ఆరగించి ఏమీ ఎరగనివాడిలా తల్లి కొంగు చాటున ఒదిగిపోతాడు. 'అమ్మా! చనుబువ్వ పెట్టవూ' అంటూ గోముగా అడుగుతాడు. అంతేనా! తక్కిన పిల్లలతో కలసి ఎన్ని ఆటలు ఆడాడో చెప్పలేం. 'మీరందరూ ఆవులు. నేను ఆంబోతును' అంటూ రంకెవేసి పరుగుతీస్తాడు. 'నేను రాజుని, మీరు నా భటులు' అంటూ వాళ్ల వస్తువులు లాక్కొని పారిపోతుంటాడు. 'నేను సూత్రధారిని, మీరు వేషగాళ్ళు' అంటూ అందరినీ ఒక ఆట ఆడిస్తాడు. దాగుడుమూత లాడతాడు. ఉయ్యాల లూగుతాడు. ఇలా ఒకటా రెండా ఆ బాలకృష్ణుడి లీలలు...

ఒకసారి ఏమైందో తెలుసా.. ఈ బాలకృష్ణుడి ఆగడాలకు తట్టుకోలేక ఓపిక నశించిన గోపికలు యశోద దగ్గరకి వచ్చారు.

## గోపికల మొర

'అమ్మా! యశోదా! ఒకప్రక్క చంటిపిల్లలకు పాలు లేవని మా ఇంట్లో బాలింతలు మొరపెడుతూ ఉంటే నీ కొడుకు లేగదూళ్ళకు త్రాళ్ళు విప్పి ఆవుల దగ్గరకి వదులుతున్నాడమ్మా!' అందో గోపిక.

వెంటనే మరో గోపిక అందుకొని– 'పడతీ! నీ బిడ్డడు మా కడవలలో ఉన్న మంచి కాగిన పాలు తీసుకువెళ్ళి ఆ పడుచులకు పోసి మిగిలిన కుండలను దొరికిన కుండను దొరికినట్లుగా పగలగొట్టేశాడు.'

ఇంకో గోపిక – 'ఓ తల్లీ, మీ పాపడు మా ఇళ్ళలో దూరి పాలకోసం వెతుకుతాడు. దొరికితే సరే! దొరక్కపోతే విసురుగా కోపంలో పసిబిడ్డల్ని తొక్కుకుంటూ తోసుకుంటూ వచ్చేస్తున్నాడమ్మా!'

పక్కనే ఉన్న మరో గోపిక – 'అమ్మా, యశోదా! నిన్నగాక మొన్న పుట్టాడో లేదో! ఇంత లేడు, నీ బిడ్డడికి ఇన్ని దొంగతనాలా? మా ఇళ్ళలో జొరబడి ఉట్టి అందకపోతే కిందనుంచే కుండను చిల్లుపెట్టి దోసిళ్ళతో పాలూ మీగడలూ ఆరగించేస్తున్నాడు. ఏం చెప్పమంటావమ్మా!' అంటోంది మెటికలు విరుస్తూ.

'మొన్నటికి మొన్న నీకేమో ఆడుకోవడానికని చెప్పి ఓ ఇంట్లో దూరి పెరుగు త్రాగి వెళ్ళిపోయాడు. వెళ్ళేవాడు వెళ్లకుండా నిద్రపోతున్న కోడలి మూతికి కొద్దిగా

పెరుగు రాసి మరీ పోయాడు. ఇక చూడు! అత్తగారు వచ్చి కోడలిని చితక్కొట్టిందంటే నమ్ము!' అంది ఇంకొక గోపిక చిర్రుబుర్రులాడుతూ.

'నీ సుపుత్రుడు ఇంకా ఏం చేశాడో తెలుసా? ఒకరి ఇంట్లోకి జొరబడి ఘుమఘుమలాడే నెయ్యి కాస్తా త్రాగి ఆ కడవను తెచ్చి ఇంకొకరి ఇంట్లో పడేశాడు. ఇక వాళ్ళిద్దరూ తన్నుకున్నారు చూడూ!' అంది మరో గోపిక.

'చూడమ్మా, యశోదా! నీ బిడ్డడి కన్ను మా ఇంట్లో ఉన్న దేవతా చిత్రాల గోడలపై పడింది. 'నాకన్నా వీళ్లు గొప్పవాళ్ళా!' అంటూ ఉమ్మివేసి గోడల్ని ఎంగిలి చేశాడు. నీకు నవ్వొస్తుందేమో! ఇది విను' అందో గోపిక.

గోపికలందరూ ఒక్కొక్కరూ ఇలా చెబుతున్నారు.

'మా మగవాళ్ళు బయటకు వెళ్ళాక రహస్యంగా వచ్చి మమ్మల్ని ఆడుకుందాం వస్తారా! అని పిలుస్తాడు. అలసిపోయి నిద్రపోయిన నా కొడుకు జుట్టును లేగదూడ తోకకు కట్టి దాన్ని వీథుల్లోకి తోలాడమ్మా! నీ గారాలపట్టి. ఎంత దొడ్డ వారి బిడ్డలైతే మాత్రం మరీ ఇంత అల్లరా!'

'ఇక నా కొడుకుకైతే బలవంతంగా బానెడు వెన్న పట్టించాడమ్మా నీ కొడుకు. వాడికి ఊపిరాడితే ఒట్టు. కావాలంటే తెచ్చి చూపిస్తాను'

ఇలా ఒక్కొక్కరూ చెప్పి, చివరికి అందరూ కలిసి–

'మీరు ప్రభువులే కావచ్చు. సంపదలుంటే కడుపు నిండా తింటారు. ఒంటి నిండా నగలు దిగేసుకుంటారు. విలువైన బట్టలు కట్టుకుంటారు. అంతేగాని ఇలా బిడ్డల్ని పేదవాళ్ల కొంపలమీదికి ఉసిగొల్పుతారా ఎవరైనా? ఆలోచించు.

**కం. ఓ యమ్మ! నీ కుమారుఁడు**
**మా యిండ్లను బాలుఁ బెరుగు మననీఁడమ్మా!**
**పోయెద మెక్కడి కైనను**
**మాయన్నల సురభులాన! మంజులవాణీ!** (10–1–329)

ఓ అమ్మా! మంజులవాణీ! నీ పుత్రుడు మా ఇళ్లలోని పాలూ పెరుగూ ఉండనివ్వడు. కాబట్టి మేము ఎక్కడికైనా వెళ్ళిపోతాం. మా అన్నల మీదా, ఆవుల మీదా ఒట్టు.' అంటూ అందరూ మూకుమ్మడిగా ఏకరువు పెట్టారు.

అప్పుడు యశోద అన్నీ విని, అందరినీ ఉద్దేశించి –

'ఏమిటేమిటీ! మా కన్నయ్య ఎప్పుడూ నా ఒడి దిగడు. మా ఇల్లు తప్ప వాడికి ఇంకేదారీ తెలియదు. సరిగ్గా కళ్ళు కూడా తెరవని పసిగుడ్డుపై ఇన్నిన్ని అభాండాలు వేస్తారా? మీకిది భావ్యంగా ఉందా?

తల్లులారా! గుణవతులారా! అభం శుభం తెలియని నా బిడ్డడు తనలో తానే ఆడుకొంటూ ఉంటాడే! అలాంటి పసిపిల్లాడిని ఆడిపోసుకోకండి. మీకు దండం పెడతాను' అని చెప్పి వాళ్ళను పంపివేసిందే కానీ శ్రీకృష్ణుడిని పల్లెత్తు మాటైనా అనలేదు.

## విశ్వరూప సందర్శనం

ఒకరోజు బలరాముడు, ఇంకొందరు గోపాలురు యశోద దగ్గరకు వచ్చి 'అమ్మా! అమ్మా! శ్రీకృష్ణుడు మట్టి తింటున్నాడు' అని చెప్పారు. వెంటనే వెళ్ళి యశోద శ్రీకృష్ణుడి చేయి పట్టుకుంది. కోపంగా–

'నాన్నా! ఎందుకురా మట్టి తింటావు? నే చెప్పిన మాట ఎందుకు వినవు? మీ అన్నయ్య, స్నేహితులూ చెప్తున్నా సరే! నీకు ఈ మన్నెందుకురా? తినడానికి వేరే ఇంకేమీ దొరకలేదా? అంది. దానికి శ్రీకృష్ణుడు గడసుగా–

'అమ్మా! మన్ను తినడానికినేనేమైనా చిన్నపిల్లవాణ్ణా! ఆకలితో ఉన్నానా? లేక వెర్రివాణ్ణా! వీళ్ళ మాటలు నమ్మకు. నన్ను నీతో కొట్టించాలనే అలా చెప్తున్నారు. కావాలంటే నా నోరు వాసన చూడు. నా మాటలు తప్పైతే నన్ను దండించు' అంటూ నోరు తెరచి చూపించాడు. అప్పుడా బాలకృష్ణుడి నోట్లో సమస్త విశ్వమూ గోచరించింది యశోదకి. అది చూసి–

**మ. కలయో! వైష్ణవమాయయో! ఇతర సంకల్పార్థమో! సత్యమో**
**తలపన్ నేరక యున్నదాననొ! యశోదాదేవిగానో! పర**
**స్థలమో! బాలకుఁడెంత! యీతని ముఖస్థంబై యజాండంబు ప్ర**
**జ్వలమైయుండుట కేమి హేతువొ! మహాశ్చర్యంబు చింతింపఁగన్**

(10–1–342)

ఇది కలా? వైష్ణవ మాయా! మరేదైనా మిథ్యాసంకల్పమా! సత్యమా! నాకేమీ తెలియటంలేదే! అసలు నేను యశోదాదేవిని కానేమో! ఇది వేరే చోటా? ఈ పిల్లవాడెంత? ఇతడి ముఖంలో ప్రకాశిస్తూ కనిపించే బ్రహ్మాండమెంత? దీనికి హేతువు ఏమిటో! ఆశ్చర్యం. ఇది నిజమే అయితే ఈ బాలుడు సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడే అని నిశ్చయించుకొని భక్తితో స్తోత్రం చేసింది. శరణు వేడింది. అజ్ఞానాన్ని క్షమించమంది.

అంతలోనే మళ్ళీ విష్ణుమాయ ఆవహించటంతో ఆ సత్యజ్ఞానాన్ని మర్చిపోయింది యశోద. తన కొడుకే అనుకొని ఒడిలోనికి తీసుకొని ప్రేమగా ముద్దుపెట్టుకుంది' అన్నాడు శుకయోగీంద్రుడు.

అప్పుడు పరీక్షిత్తు 'మునీంద్రా! లోకాన్ని కని పెంచే పరమాత్ముడికే తల్లిదండ్రులైన ఆ యశోదానందులు ఎంతటి ధన్యులో కదా!' అన్నాడు. దానికి సమాధానంగా శుకమహర్షి

'మహారాజా! పూర్వం వసువులలో ద్రోణుడు అనే ఒక వసువు ఉండేవాడు. అతడి భార్య ధర. బ్రహ్మదేవుడు ఈ దంపతుల్ని భూమిపై జన్మించమని కోరాడు. విశ్వేశ్వరుడైన విష్ణుమూర్తిని సేవించే భాగ్యం కలిగిస్తే భూమిపై జన్మిస్తామని వాళ్ళు కోరారు. బ్రహ్మదేవుడు అంగీకరించాడు. అదుగో ఆ దంపతులే ఈ యశోదానందులు.'

## శ్రీకృష్ణుడి అల్లరి

ఒకరోజు యశోదాదేవి పెరుగు చిలుకుతోంది. అప్పుడే శ్రీకృష్ణుడు అల్లరి మొదలుపెట్టాడు. ఆమె పైట లాగుతూ 'పాలు కావాలి' అంటూ మారాం చేస్తూ పనిచేయనివ్వటంలేదు.

ఒకవైపు కవ్వంతో చిలుకుతూనే మరోవైపు కృష్ణుణ్ణి లాలిస్తోంది యశోద. అలాగే ఒడిలోకి తీసుకొని పాలు కూడా ఇచ్చింది. ఈలోగా అక్కడ పొయ్యిమీద పాలు పొంగుకు వచ్చాయి. శ్రీకృష్ణుణ్ణి పూర్తిగా పాలు తాగనివ్వకుండానే దింపి అక్కడికి వెళ్ళింది. దానికి కోపంతో శ్రీకృష్ణుడు ఒక రాయి విసిరి పెరుగు కుండ పగులగొట్టాడు. పగిలిన కుండలోని వెన్న తింటూ దొంగ ఏడుపు ఏడుస్తూ ఎటో వెళ్ళిపోయాడు.

యశోద తిరిగివచ్చి చూసింది. కుండ పగులుకొట్టిన శ్రీకృష్ణుడి అల్లరికి ముసిముసి నవ్వులు నవ్వుకొని చుట్టూ చూసింది. ఏడీ! శ్రీకృష్ణుడు? ఉంటేనా? పక్కవాళ్ళ ఇంట్లో ఉట్టిమీద ఉన్న వెన్నకుండలోంచి వెన్న తీసి కోతికి తినిపిస్తున్నాడు. వెతుకుతున్న యశోదకు ఆ దృశ్యం కంటపడింది. వెంటనే విసవిసా వచ్చి శ్రీకృష్ణుడి చెయ్యి పట్టుకొని –

'ఏరా! పోనీలే కదా అని ఊరుకొంటుంటే రోజురోజుకీ నీ అల్లరి మితిమీరి పోతోంది. నిన్ను ఎవరూ ఏమీ అనరనేగా నీ ధైర్యం? అసలు నా మాటంటే లెక్క లేదు నీకు. ఉండు నీ పని చెప్తాను. ఇవాళ నా చేతుల్లోంచి ఎలా తప్పించుకుంటావో చూస్తాను' అని బెదిరించింది. అయితే ఆమె మనస్సులో ఎన్నో సందేహాలు.

ఇతడు పసివాడనుకోనా, ఇలాంటి చిన్నెలు పెద్దలకూ లేవే! పోనీ కొంచెం భయపెడదామంటే లేక లేక పుట్టాడాయే! బుద్ధి చెబుదామంటే తనకు తానుగానే బుద్ధిగా ఉంటాడే! ఏమీ తెలియకుండా ఇంట్లో కూర్చుంటాడా అంటే వెళ్ళి చూడని చోటంటూ ఉందా ఈ లోకంలో! తనను ఎవరైనా చూస్తే పారిపోవడాల్లాంటి ఆలోచనలూ లేవే? అసలు భయమనేదీ ఒకటుందని తెలిస్తేగా.. కుదురు లేదు. పైగా ఎకసెక్కాలకేం తక్కువలేదు. వీడికి తగిన శాస్తి చేయటం ఎలా? మరీ గారాబం చేస్తే పిల్లలు చెడిపోతారు. అప్పుడప్పుడూ నాలుగు తగిలించాల్సిందే! మొక్కై ఒంగనిది మానై ఒంగునా? అంటూ బెత్తం పట్టుకొని వెంటపడింది.

శ్రీకృష్ణుడు భయపడుతున్నట్లు ముఖంపెట్టి రోలుమీదికి దూకాడు. పారిపోతున్నాడు. యశోద వెంటపడింది. అది చూసి గోపికలు నవ్వే నవ్వు. 'ఆగు, ఆగు' అంటూ అరుస్తూ పరిగెడుతోంది యశోద. రాజా! మహామహా యోగీంద్రులకే చిక్కని ఈ పురుషోత్తముణ్ణి ఆ యశోద పట్టుకోవాలని పరుగుతీసిందయ్యా! ఎంత అదృష్టవంతురాలో కదా!

## ఉలూఖల బంధనం

శ్రీకృష్ణుడా దొరికేది? అందకుండా పరుగు తీస్తున్నాడు. మరో పక్క 'ఇంకెప్పుడూ దొంగతనం చేయనమ్మా! నన్ను క్షమించు' అంటూ కొట్టకముందే ఏడుస్తున్నాడు. మొత్తానికి యశోద గెలిచింది. శ్రీకృష్ణుణ్ణి చిక్కించుకుంది. పట్టుకుంది

కానీ చిన్నికృష్ణుణ్ణి కొట్టడానికి ఆమెకు చేతులెలా వస్తాయి? అందుకే కొట్టకుండా కట్టేద్దామనుకొని ఇలా అంది–

ఎవరండీ వీరు! ఓహో! శ్రీకృష్ణులుగారా? ఎన్నడూ వెన్న అన్నదే చూడలేదట కదా పాపం! దొంగతనమంటే ఏమిటో కూడా తెలియదట! అసలు ఇలాంటి వాళ్ళు ఈ భూమ్మీద ఉన్నారా?

అసలు నువ్వు ఏమనుకొంటున్నావురా? ఎవరికీ పట్టుబడననీ నన్ను పట్టుకోవడం ఎవడివల్లా కాదనీ పెద్ద బడాయి. పట్టుబడితే నిన్ను పట్టుకోవడం ఏమంత కష్టమా? నాకు తెలుసు నిన్ను ఎలా పట్టుకోవాలో! ఎన్నెన్ని వేషాలు? ఎన్నెన్ని తిరుగుళ్ళు? కుదురెక్కణ్ణించి తేవాలమ్మా దొరగారికి?

అని చివరికి ఒక రోటికి కట్టివేసింది ఆ నవనీతచోరుడైన నందకిశోరుణ్ణి. పరీక్షిన్మహారాజా! చూశావా! ఎంత ఆశ్చర్యం! యశోద తననలా కట్టివేయడంతో నిజంగానే కట్టువడిపోయాడయ్యా ఆ గోపబాలుడు. ఎంతటి భక్తపరాధీనుడో చూశావా! ఇది ఒక్క యశోదకే సాధ్యమయింది. అయినా అప్పుడా యశోదకు అంతటి విరాట్ స్వరూపుడూ ఒక మామూలు పిల్లవాడే! లేకపోతే ఇలా కట్టగలదా?

యశోద శ్రీకృష్ణుడిని రోటికి కట్టడానికి ఒక తాడు తీసుకుంది. ముందు బాలుడి నడుము చుట్టూ ఒక త్రాడు చుట్టింది. తరువాత అది రెండంగుళాలు తక్కువైంది. రోలుకు చుట్టింది. మరో తాడు జతచేసింది. మళ్ళీ రెండంగుళాలు తక్కువయింది. మరో ముక్క జోడించింది. అప్పుడూ అంతే! ఏమిటీ విడ్డూరం... యశోద ఆశ్చర్యపోయింది. తక్కిన గోప స్త్రీలు అవాక్కైపోయారు. ఎంతగా అలసిపోయిందో పాపం యశోద. అయినా ప్రయత్నిస్తూనే ఉంది. ఎన్ని తాళ్ళు అతుకులు వేసినా కృష్ణుడి నడుముకు ఇంకా రెండంగుళాలు తగ్గుతూనే ఉంది. తల్లి పడుతున్న కష్టాన్ని చూసి తానే తాడుకు సరిపడి కట్టుపడ్డాడు.

రాజా! ఇంతటి అనుగ్రహానికి లక్ష్మీదేవిగానీ, పరమ శివుడుగానీ, బ్రహ్మదేవుడుగానీ నోచుకోలేదు. ఒక్క యశోదకే ఈ భాగ్యం దక్కింది. అది కేవలం యశోదకు స్వామిపట్ల ఉన్న భక్తివల్లనే సాధ్యమయింది. భక్తులకు వశమైనట్లుగా ఆ పురుషోత్తముడు ఎంతటి జ్ఞానులకుగానీ, యోగులకుగానీ దాతలకుగానీ పట్టువడడు సుమా!

## మద్ది చెట్లకు మోక్షం

సరే! యశోద శ్రీకృష్ణుడిని అలా రోటికి కట్టిపడేసి తన పనుల్లో తను మునిగిపోయింది. అల్లరి శ్రీకృష్ణుడు ఊరికే ఉంటాడా? అక్కడే ఉన్న రెండు పెద్దపెద్ద మద్ది చెట్లపై పడింది అతగాడి కన్ను. నలకూబరుడు, మణిగ్రీవుడు అనే ఇద్దరు యక్షులే నారదుడి శాపంవల్ల అలా మద్దిచెట్లుగా పడి ఉన్నారు. వీళ్ళు కుబేరుడి పుత్రులు. శివుడి సేవకులమనీ, ధనవంతులమనీ అహంకరించి నారదమహర్షిని అవమానించారు. అప్పుడు నారదుడు –

శా. **సంపన్నుం డొరుఁగానఁ లేఁడు తనువున్ సంసారమున్ నమ్మి హిం**
**సింపం జూచు దరిద్రుఁ డెత్తువడి శుష్కీభూతుఁడై చిక్కి హిం**
**సింపం డన్యుల నాత్మకున్ సములుగాఁ జింతించు నట్టౌటఁ ద**
**త్సంపన్నాంధున కంజనంబు వినుమీ! దారిద్ర్య మూహింపఁగన్**
(10–1–394)

'ధనవంతుడు ఎవరినీ లెక్కచేయడు, ఈ శరీరం, సంసారం నిజమని నమ్మి అందరినీ హింసించాలని చూస్తాడు. కానీ దరిద్రుడు తాను అష్టకష్టాలు పడుతూ కూడా ఎవరినీ హింసించాలని అనుకోడు. కాబట్టి ధనంతో కళ్ళు మూసుకుపోయిన వారికి దారిద్ర్యమే అంజనమై కనువిప్పుకలిగిస్తుంది అని చక్కగా పాటకట్టి పాడి, మీరు నూరు దివ్యసంవత్సరాలు మద్ది చెట్లుగా పడి ఉండండి. శ్రీకృష్ణావతారంలో మీకు శాపవిముక్తి కలుగుతుంది. అని చెప్పాడు.

వాళ్ళ శాపవిమోచనం కోసమే శ్రీకృష్ణుడు రోలు ఈడ్చుకొంటూ మద్దిచెట్ల వద్దకు వెళ్ళాడు. వాటి మధ్యలోనుంచి రోలును పోనిచ్చి అడ్డంగా లాగడంతో ఆ చెట్లు కూలిపోయి ఇద్దరు యువకులు ప్రత్యక్షమై 'శ్రీకృష్ణా! పరంధామా! పంకజ పత్ర నేత్రా!'

శా. **నీ పద్యావళు లాలకించు చెవులున్ నిన్నాడు వాక్యంబులున్**
**నీ పేరం బనిసేయు హస్తయుగముల్ నీ మూర్తిపైఁ జూపులున్**
**నీ పాదంబుల పొంత మ్రొక్కు శిరముల్ నీ సేవపైఁ జిత్తముల్**
**నీపై బుద్ధులు మాకు నిమ్ము కరుణన్ నీరేజపత్రేక్షణా!** (10–1–342)

'నీ పద్యాలను వినే చెవులూ, నిన్నే కీర్తించే మాటలూ, నీ పేరున పనిచేసే చేతులూ, నిన్నే చూసే చూపులూ, నీ పాదాలకు మ్రొక్కే శిరమూ నీ సేవమీదనే మనస్సు, నీపైనే బుద్ధీ మాకు ప్రసాదించవయ్యా!' అని వేనోళ్ళా కీర్తించారు. భక్తితో నమస్కరించి ఉత్తర దిక్కుకు వెళ్ళిపోయారు.

హఠాత్తుగా మద్దిచెట్లు విరిగిపడ్డ చప్పుడు. ఉలిక్కిపడ్డారు గోపకులు. పరుగు పరుగున వచ్చి చూశారు. 'చెట్లు కూలిపోయాయిగానీ పక్కనే ఉన్న బాలకృష్ణుడు ఏడవలేదు. భయపడనూ లేదు' అని ఒకరితో ఒకరు చెప్పుకుంటున్నారు.

అప్పుడు అక్కడే ఆడుకొంటున్న మరికొందరు పిల్లలు జరిగింది చెప్పారు. ఆ మాటలు ఎవరూ నమ్మలేదు. గండం గడిచింది. నందుడు ఊపిరి పీల్చుకొన్నాడు.

## బృందావన వాసం

ఒకరోజు గోకులంలో పెద్దలందరూ సమావేశమయ్యారు. వారిలో ఒక వృద్ధుడు. అతడి పేరు ఉపనందుడు. ఇలా అన్నాడు–

'ఏమిటీ విపరీతాలు? మన చిన్నికృష్ణుడిపై ఏవేవో కుట్రలు జరుగుతున్నాయి. ఏదో భగవంతుడి దయవల్ల గండాలన్నీ గడిచిపోయాయి. ఇకనైనా మనం మేలుకోవాలి. మనమందరం బృందావనానికి వెళ్ళిపోదాం! నా మాట వినండి. అక్కడ ఏ లోటూ ఉండదు.' సరేనన్నారందరూ.

వ్రేపల్లెలోని ఆబాలగోపాలమూ బృందావనంవైపు అడుగులు వేసింది. దారిలో గోపికలు ఆనందంగా మధురమైన కంఠాలతో మాధవుడిపై ఏలలు పాడుతూ నడుస్తున్నారు. వారితో పాటూ రోహిణి, యశోద, బలరామకృష్ణులూ ఉన్నారు.

బృందావనంలో గోపబృందం చక్కగా ఇళ్ళు కట్టుకొని నివసిస్తోంది. అక్కడే కాళిందీ నది ఒడ్డున బలరామకృష్ణులు దూడలను కాస్తూ ఆనందంగా గడుపుతున్నారు.

వారి ఆటలూ ఆనందం ఏమని చెప్పను మహారాజా! బలరామకృష్ణులు మనోహరంగా వేణువు లూదుతారు. పెద్దపెద్ద కంబళ్ళతో వృషభాల రూపాలను తయారుచేసి అవి శత్రువులని వాటితో యుద్ధం చేస్తారు. గుడ్డలతో బొమ్మలు చేసి వాటిని కాలితో తన్నుతూ ఆడుతుంటే వినాలి వాళ్ళ కాళ్ళ గజ్జెల మ్రోతలు. ఎంత

వినసొంపుగా ఉంటాయో! పందాలు వేసిమరీ చెట్టుమీది పళ్ళను రాళ్ళతో కొడుతూ, అడవి జంతువుల కూతలను రెట్టిస్తూ, కొలనుల్లో ఈతకొడుతూ ఆ బలరామకృష్ణుల బాల్యక్రీడలు చూసినకొద్దీ చూడాలనిపిస్తాయి. విన్నకొద్దీ వినాలనిపిస్తాయి.

## వత్సాసుర సంహారం

ఒకరోజు యమునా తీరంలో వీళ్ళు దూడలను మేపుతుంటే ఒక రాక్షసుడు వీళ్ళని చంపాలని వచ్చాడు. తానూ ఒక కోడెదూడలా మారి శ్రీకృష్ణుడి వెంటపడ్డాడు. శ్రీకృష్ణుడికి తెలియదా? దాన్ని వెంటనే పసిగట్టి బలరాముడికి సైగచేశాడు. వెంటనే బలరాముడు దాన్ని కాళ్ళూ తోకా పట్టుకొని పైకెత్తి వెలగచెట్టుకేసి కొట్టి చంపేశాడు. ఆ వచ్చిన రాక్షసుడి పేరు వత్సాసురుడు.

## బకాసుర వధ

మరోసారి దూడల్ని తోలుకొని అడవికి వెళ్ళారు. తిరిగి వస్తూ ఉంటే భయంకరమైన కొంగ ఒకటి తారసపడింది. పర్వతంలా భీకరంగా అడ్డంగా నిలబడి శ్రీకృష్ణుడిపైనే దృష్టి సారించింది. ఆ కొంగ రూపంలో ఉన్నవాడు బకాసురుడు.

ఆ కొంగను చూసి తోటి గోపాలురు భయపడిపోయారు. అది నోరు పెద్దగా తెరిచి అమాంతంగా శ్రీకృష్ణుణ్ణి మింగేసింది. కాదు కృష్ణుడే కావాలని దాన్ని మింగనిచ్చాడు. కానీ గొంతు దగ్గరే అడ్డుపడ్డాడు. ఎంతకీ మింగుడు పడకపోయేసరికి బయటికి కక్కేసింది ఆ కొంగ. ముక్కుతో పొడిచి చంపాలని చూసింది. కానీ ఆ కొంగ ముక్కును రెండు భాగాలుగా పట్టుకొని గడ్డిపరకను చీల్చినట్లు చీల్చిపారేశాడు శ్రీకృష్ణుడు.

బలరాముడూ, తక్కిన గోపబాలురూ ఆనందంతో చిందులు వేశారు. అందరూ తిరిగి ఇళ్ళకు చేరుకున్నారు. అక్కడ జరిగిందంతా విన్న పెద్దలు నివ్వెరపోయారు.

బాలరామకృష్ణులు చక్కగా ఆటలాడుతూ 'మనమందరం వానరులం. వారధి కడదామా! మనమిప్పుడు మహర్షులం. తపస్సు చేద్దామా! గంధర్వుల్లాగా పాటలు పాడదామా! ఆడవేషాలు వేసుకొని అప్సరసల్లా నాట్యం చేద్దామా? అంటూ రకరకాలుగా ఆనందించసాగారు.

## చల్దుల ఆరగింపు

ఇలా ఆనందంగా కాలం గడుస్తోంది. ఒకరోజు అందరూ కలసి వనభోజనాలు చేయాలనుకున్నారు. చద్దన్నం కావిళ్ళు, పిండివంటల మూటలూ భుజాలకు తగిలించుకొని పరుగుపరుగున దూడలతోసహా అడవికి చేరుకున్నారు.

కొమ్ముబూరలు పిల్లనగ్రోవులు ఊదుతూ తుమ్మెదలతో కలసి ఝుంకారాలు చేస్తూ, నెమళ్ళ నాట్యంలో పదం కదుపుతూ, కోకిలల పాటల్లో గళం కలుపుతూ హంసల్లా నడుస్తూ, కొంగల్లా ఒంటికాలిపై నిలబడుతూ కోతుల్లా చెట్లు ఎక్కుతూ కుప్పించి దూకుతూ ఆడుకొంటున్నారు.

ఒకడి చల్దుల్ని మరొకడు లాక్కొంటూ పారిపోతూ ఏడిపిస్తూ ఉడికిస్తూ ఊరిస్తూ ఉరకలేస్తున్నారు. పరీక్షిన్మహారాజా! మహామహా యోగులకు సైతం లభ్యం కాని శ్రీకృష్ణుణ్ణి కౌగిలించుకొంటూ అతడితో చెట్టాపట్టాలు వేసుకొంటూ నవ్వుతూ, హాస్యాలాడుతూ, ప్రేమిస్తూ, ప్రేమించబడుతూ క్రీడిస్తున్నారంటే వాళ్ళ భాగ్యం ఏమని చెప్పను?

## అఘాసుర వధ

సరే! కొంతకాలం తరువాత అఘాసురుడు అనే మరో రాక్షసుడు బయలు దేరాడు. వీడు బకాసురుడి తమ్ముడు, కంసుడి సేవకుడు. తన అన్నను చంపిన శ్రీకృష్ణుడి కోసం కొండచిలువ రూపంలో కాచుకొని ఉన్నాడు. కొన్ని యోజనాల పొడవైన పర్వతమంత ఆకారం ధరించి పడుకున్నాడు.

గోపాలురు ఆ దారిలోనే వస్తూ అడ్డంగా ఉన్న ఆ కొండచిలువను చూశారు. అదేదో గుహ అనుకున్నారు. దాని నోట్లోంచి అగ్నిజ్వాలలు రేగుతున్నాయి. అయినా భయపడితేనా? కృష్ణుడు ఉన్నాడులే అన్న ధీమా. అందరూ ధైర్యంగా దాని నోట్లోకి ప్రవేశించారు.

శ్రీకృష్ణుడూ ఇంక ఆలస్యం చేయకూడదనుకొని తానూ వారి వెనుకే దాని నోట్లోకి ప్రవేశించాడు.

ఒక్కొక్కరినీ మింగుతోందా కొండచిలువ. అప్పుడు శ్రీకృష్ణుడు దాని కంఠబిలం దగ్గర చేరి తన శరీరాన్ని పెంచాడు. దానికి ఊపిరి ఆడలేదు. లోపల గాలి లోపలే

నిలిచిపోవడంతో దాని కడుపు ఉబ్బిపోసాగింది. ప్రాణాలు విలవిలలాడిపోయాయి. చివరికి లోపలి గాలి తలనూ ప్రక్క భాగాలనూ చీల్చుకొని బయటికి వచ్చింది. దెబ్బకు చచ్చిందా రాక్షససర్పం.

గోపాలురంతా బయటపడ్డారు. ఆ కొండచిలువలోంచి ఒక దివ్యతేజస్సు వచ్చి శ్రీకృష్ణుడిలో లీనమైపోయింది. దాని చర్మం కొన్నాళ్లకు ఎండి పోయింది. దాని కళేబరం ఒక పెద్ద గుహలా ఆడుకోవడానికి ఉపకరించింది గోపబాలురికి.

శ్రీకృష్ణుడు తన ఐదో ఏటనే ఈ అఘాసురుణ్ణి సంహరించాడు. అయితే ఈ విషయాన్ని శ్రీకృష్ణుడి ఆరోయేట (పౌగండ వయస్సులో) జరిగిందని గోప బాలకులు భావించారు' అన్నాడు శుకమహర్షి.

వెంటనే పరీక్షిత్తు 'మహాత్మా! మొదటి ఐదేళ్ల వయస్సును కౌమారం అంటారు కదా! తరువాత ఐదేళ్ళను 'పౌగండం' అని అంటారు. మరి ఐదోఏట జరిగిన సంఘటన ఆరో ఏట జరిగిందని వాళ్ళు ఎలా అనుకున్నారు?

'మహారాజా! మంచి ప్రశ్నే వేశావు. నేను చెప్పేది జాగ్రత్తగా విను. నీకే అర్థమవుతుంది.

## బ్రహ్మదేవుడి మాయ

శ్రీకృష్ణుడు అఘాసురుడి నుండి తాను రక్షించిన గోవులతో, గోపాలురతో కలిసి ఇంటి ముఖం పట్టాడు. దారిలో ఒక అందమైన కొలను ఉంది. ఓహ్..... ఎంత అందంగా ఉందో ఆ ప్రాంతం.

శ్రీకృష్ణుడు ఉత్సాహంగా అందరినీ పిలిచి చల్దులు ఆరగిద్దాం రండి అన్నాడు. గోపబాలురంతా సరేనన్నారు.

లేగదూడలూ తియ్యటి ఆ కొలను నీటిని కడుపారా త్రాగాయి. ప్రక్కనే ఉన్న పచ్చిక బయళ్ళలో మేతమేస్తున్నాయి.

ఇక గోపబాలురంతా తమతమ చిక్కాల నుంచి చల్దుల మూటల్ని విప్పారు.

రాజా! తామరపువ్వుకు మధ్యలో ఒక దుద్దు ఉంటుంది చూశావూ! దాని చుట్టూ వరుసలుగా రేకులు ఉంటాయే. సరిగ్గా అలాగే శ్రీకృష్ణుడి చుట్టూ గోపాలురు,

చెట్ల ఆకుల్లోనూ తామరాకుల్లోనూ రాతి పలకల మీద పెట్టుకొని మరీ చల్దులు ఆరగిస్తున్నారు.

వాళ్ళు ఎంత కలివిడిగా తింటున్నారో తెలుసా! ఒకడు చేతివేళ్ళ మధ్యలో ఊరగాయ బద్దలు ఇరికించుకొని పక్కవాణ్ణి ఊరిస్తాడు.

మరొకడు పక్కవాడి కంచంలోనిది వాడు చూసేలోగా చట్టుక్కున మింగేసి 'ఏదీ ఏమీ లేదే' అని నోరు చూపిస్తాడు.

మరొకడు పందెం కట్టి మరీ ఐదారుగురు తినేంత చల్దిని కుక్కుకొని లాగిస్తాడు.

'అరే! నీ దగ్గర ఇన్ని ఉన్నాయే! స్నేహమంటే ఇచ్చిపుచ్చుకోవటమే' అంటూ ఒక్కొక్కటీ తీసుకొంటూ బంతెనగుండ్లు ఆడతాడు ఇంకొకడు.

'ఒరేయ్! చూడరా! శ్రీకృష్ణుడు ఎలా నవ్వుతున్నాడో! అని అటు చూసేలా చేసి ఇటు వాడివన్నీ స్వాహా చేసేవాడొకడు.

ఒకడు నవ్వుతాడు. మరొకడు నవ్విస్తాడు. ఇంకొకడు ముచ్చట్లాడతాడు. మరొకడు మురిసిపోతాడు. ఇదీ వాళ్ల ఇంపుగొలిపే చల్దులారగింపు.

శ్రీకృష్ణుడు లేచాడు. వేణువును నడుము దట్టీలో దోపాడు. కొమ్ము బూరనూ, చేతి కర్రనూ ఎడమ చంకలో ఇరికించి పట్టుకొని మీగడా, పెరుగూ కలిసి ఉన్న ఒక చల్దిముద్దను ఎడమచేతా, ఊరగాయ బద్దల్ని కుడిచేతి వేళ్ళ మధ్యా ఉంచుకొని, సరిగ్గా స్నేహితుల మధ్యలో కూర్చొని ఛలోక్తుల్ని విసిరి అందర్నీ నవ్విస్తూ ఆరగిస్తున్నాడు.

ఎంత చక్కటి దృశ్యం అది! సహస్రకోటి యజ్ఞాలలో యజ్ఞభోక్తగా ఫలాన్ని భుజించే స్వామి ఇలా స్వచ్ఛందంగా బాలక్రీడలతో అలరారుతూ ఉంటే దేవతలు నివ్వెరపోయారు. ఇక్కడ వీళ్ళు ఇలా తనివితీరా చల్ది లారగించటంలో మునిగిపోయారు.

అక్కడ లేగదూడలు పచ్చిక మేస్తూ ఎటో వెళ్ళిపోయాయి. దారి తప్పి చాలా దూరం వెళ్ళి అడవిలో చిక్కుకున్నాయి.

శ్రీకృష్ణుడు వాళ్ళకు ధైర్యంచెప్పి లేగదూడల్ని నేను వెతికి తీసుకువస్తానని బయలుదేరాడు. అరచేతిలో ఉన్న అన్నం ముద్ద అలాగే ఉంది. జులపాల జుట్టు. మెడలో హారాలు. మరో చేతిలో వెదురు కర్ర. వెళ్ళాడు. అడవంతా గాలిస్తున్నాడు. లేగదూడల అడుగుల జాడల్ని పట్టుకొని వెళ్తున్నాడు. వెతుకుతూనే ఉన్నాడు.

బ్రహ్మదేవుడు శ్రీకృష్ణుడిని పరీక్షించటం కోసం అక్కడ తప్పిపోయిన లేగదూడల్నీ ఇక్కడ చల్దులు ఆరగిస్తున్న గోపాలురనూ మాయం చేశాడు. ఒకచోట దాచి ఉంచాడు.

లేగలు కనిపించకపోవటంతో అలసి సొలసిన శ్రీకృష్ణుడు తిరిగి కొలను దగ్గరకు వచ్చాడు. ఆశ్చర్యం! అక్కడ చల్దులారగిస్తున్న గోపబాలురూ మాయమై పోయారు. ఏదో మాయ జరిగిందని గుర్తించాడు శ్రీకృష్ణుడు. ఈ విశ్వంలో అతడికి తెలియకుండా ఏదైనా ఉంటుందా? లేగలూ గోపాలురూ ఏమయ్యారో తెలుసు. ఇదంతా బ్రహ్మదేవుడి మాయ. బ్రహ్మ ఎందుకీ పని చేశాడో! అదీ తెలుసు. వెంటనే శ్రీకృష్ణుడు లేగలూ, గోపబాలుర రూపాలను ధరించాడు.

అటు గోపబాలకుల తల్లిదండ్రులకుగానీ ఇటు ఆవులకుగానీ తమ బిడ్డలపై ప్రేమ అంతకు ముందుకన్నా అతిశయించింది. అందరిలో ఉన్నది శ్రీకృష్ణుడేకదా! ఏ రోజు కారోజు ప్రేమ పెరిగిపోతున్నదేకానీ తగ్గటం లేదు. ఇలా శ్రీకృష్ణుడు ఇన్నిన్ని రూపాలు ధరించి అందరి అనురాగాన్నీ చూరగొని సరిగ్గా ఒక్క ఏడాదిపాటు ఆ ప్రేమను ఆస్వాదించాడు.

ఒకరోజు బలరాముడితో గోపబాలురతో కలిసి అడవికి వెళ్ళి లేగదూడల్ని మేపుతున్నాడు శ్రీకృష్ణుడు. దూరంగా ఎక్కడో గోపాలురు మేపుతుంటే గోవర్ధనగిరిపై ఆవులు మేస్తున్నాయి. ఆ ఆవులు ఈ దూడల్ని చూశాయి. వాత్సల్యం పొంగింది. హుంకారం చేసి అంబా అంటూ ముట్టెలు సాచి కాళ్ళు నాలుగూ రెండైనంత వేగంగా దూడల దగ్గరకు పరుగున వచ్చాయి. దూడల మూతుల్ని ఆత్రంగా నాకుతూ కడుపారా చన్ను గుడిపాయి. జరిగిందేమంటే –

గోపాలురు గోవుల్ని కాస్తూ ఉంటే, గోపబాలకులు, బలరామకృష్ణులతో కలిసి లేగల్ని కాస్తూ ఉన్నారు. బ్రహ్మదేవుడు ఆ లేగల్నే మాయం చేశాడు.

ఆ ఆవుల వెంట పడి పరుగున వచ్చారు గోపాలకులు. ఇక్కడ దూడల్ని మేపుతున్న తమ కుమారులు కనిపించారు వాళ్ళకు. వాళ్ళూ ఆ ఆవుల్లాగే బిడ్డల్ని ఎత్తుకొని ముద్దాడి వాళ్ళను వదిలి వెళ్ళలేక వెళ్ళలేక వెళ్ళిపోయారు.

ఇదంతా చూస్తున్నాడు బలరాముడు. ఏమిటి ఈ వింత? ఇంత ఎక్కువగా ఈ వాత్సల్యం ఎక్కణ్ణుంచి పుట్టుకొచ్చింది? అని జ్ఞానదృష్టితో చూశాడు. అందరిలోనూ శ్రీకృష్ణుడే కనిపించాడు. నమ్మలేక శ్రీకృష్ణుణ్ణే అడిగాడు. శ్రీకృష్ణుడు అసలు రహస్యం చెప్పాడు. బలరాముడు ఆశ్చర్యపోయాడు.

ఈ విధంగా శ్రీకృష్ణుడు తానే బాలురుగా, లేగలుగా మారి ఒక ఏడాది గడిచిపోయింది. ఇది బ్రహ్మదేవుడికి ఒకే ఒక్క త్రుటికాలం. బ్రహ్మదేవుడు వచ్చి చూశాడు. బాలురూ, లేగలూ బృందావనంలోనే ఉన్నాయి. బాలురిలోనూ ఆ లేగల్లో బాలకృష్ణుడే కనిపిస్తున్నాడు.

ఈసారి నివ్వెరపోవడం బ్రహ్మదేవుడి వంతయింది. వెళ్ళి తాను దాచి ఉంచిన గోవులనూ గోపాలురనూ చూశాడు. వాళ్ళూ అవీ తన మాయలో చక్కగా నిద్రపోతున్నాయి. మరి ఇక్కడ ఈ ఆవుదూడలూ గోపాలురూ ఎలా? అదీ నాకు తెలియకుండా. నేనే కదా సృష్టికర్తను. ఏ బ్రహ్మ వీటిని సృష్టించాడో! అంతా అయోమయంగా ఉంది బ్రహ్మదేవుడికి.

విష్ణుమాయ బ్రహ్మదేవుణ్ణి కూడా ముంచెత్తింది. మోహభ్రాంతిలో పడ్డాడు బ్రహ్మదేవుడు. అనేక విధాలుగా మనసులో ఆలోచించుకొంటూ ఆ గోపబాలకులవైపు చూశాడు. అందరూ విష్ణుస్వరూపులుగా సాక్షాత్కరించారు. అదే విష్ణుతేజం. ఆ తేజస్సును బ్రహ్మదేవుడు సైతం తేరిపారా చూడలేకపోయాడు. నిశ్చేష్టుడై చిత్రంలా కదలకుండా నిలబడిపోయాడు.

అప్పుడు శ్రీకృష్ణుడు బ్రహ్మదేవుడి పరిస్థితి చూశాడు. పాపం అనిపించింది. అహంకారంవల్ల కలిగిన అజ్ఞానమే ఇతణ్ణి ఈ స్థితికి రప్పించింది. ఇక విష్ణుమాయ చాలు. అనుకొని తన మాయ చాలించాడు. తను సృష్టించిన గోగోపబాలుర రూపాలన్నింటినీ మరుగుపడేలా చేశాడు.

బ్రహ్మదేవుడు నిద్రలోనుండి మేల్కొన్నట్లు ఈ లోకంలోనికి వచ్చాడు. చుట్టూ చూశాడు. ఎదురుగా బృందావనం. ఎదురుగా శ్రీకృష్ణుడు. అంతకు ముందు

కనిపించలేదు. ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తున్నాడు. దూడల్ని వెతుకుతూ, తన స్నేహితుల్ని పిలుస్తూ ఎంతో కలివిడిగా చేతిలో చల్దిముద్దతో కనిపించాడు శ్రీకృష్ణుడు.

వెంటనే బ్రహ్మదేవుడు శ్రీకృష్ణుడి కాళ్ళపై పడ్డాడు. తన అజ్ఞానాన్ని మన్నించి అనుగ్రహించమని వేడుకొన్నాడు. 'శ్రీకృష్ణా! నన్ను అనుగ్రహించు. నేనూ నీ సేవకుడినై నిన్ను సేవించుకొనే భాగ్యాన్ని ప్రసాదించు. ఈ జన్మలో కాకపోతే మరో జన్మలోనైనా' అని శ్రీకృష్ణుడికి మ్రొక్కి ప్రదక్షిణం చేసి సత్యలోకానికి వెళ్ళిపోయాడు బ్రహ్మదేవుడు.

శ్రీకృష్ణుడు అతణ్ణి క్షమించాడు. మాయమైన లేగలనూ, గోపాలురనూ మళ్ళీ అదే ఇసుకతిన్నె పైకి చేర్చాడు.

పరీక్షిన్మహారాజా! ఈ సంవత్సరకాలమూ శ్రీకృష్ణుడి మాయ కారణంగా ఒక త్రుటి కాలంగా గడిచిపోయింది. అదీ గోపబాలురకు ఏమీ తెలియకుండానే గడిచిపోయింది. శ్రీకృష్ణుడి కోసమే చల్దులారగించకుండా ఎదురు చూస్తున్నారా బాలురు. శ్రీకృష్ణుడి రాకతో వాళ్ళ ముఖాలు వికసించాయి. వాళ్ళందరితో పాటు కమ్మగా చల్దులారగించాడు శ్రీకృష్ణుడు. అలా ఆరగించాక అందరూ తిరిగి ఇళ్ళకు బయలు దేరారు. అలా ఐదేళ్ల వయసులోనే (కౌమారంలోనే) కృష్ణుడు అఘాసుర సంహారం చేసినా విష్ణు మాయ వల్ల ఆరేళ్ల వయసులో (పౌగండంలో) జరిగిందని గోపబాలురు భ్రమపడ్డారు. (1–5 సంవత్సరాల వరకూ కౌమారం, 6–10 సంవత్సరాల వరకూ పౌగండం అని వ్యవహారం). గోప బాలకుల జీవితంలో వాళ్ళకు తెలియకుండానే ఒక ఏడాది గడిచిపోయింది. అందుకే ఏదో ఏట జరిగినదానిని నిన్నే అంటే ఆరో ఏట జరిగింది అనుకున్నారు. నిజానికి అప్పుడు వారికి ఆరేళ్ళు. ఆ విషయం వాళ్ళకీ తెలియదు.

## ధేనుకాసుర సంహారం

రోజులు గడుస్తున్నాయి. ఒకరోజు శ్రీకృష్ణుడు సూర్యోదయానికి ముందే లేచి వేణుగానం చేశాడు. గోపాలకులంతా మందలతో సహా అతడి వద్దకు చేరారు. అందరూ అడవికి బయలుదేరారు. ఆ అడవి మొత్తం శ్రీకృష్ణుడి పాద స్పర్శతో పులకించిపోయింది.

వాళ్లంతా ఆటపాటల్లో మునిగిపోయి ఉన్నారు. ఆ ప్రక్కనే ఓ తాటితోపు ఉంది. అందులో ధేనుకాసురుడు అనే రాక్షసుడు ఉంటాడట! వాడు నరమాంస

భక్షకుడట! అయితే ఆ తోటలోంచి తాటిపళ్లవాసన మాత్రం గుప్పుగుప్పున వస్తోంది. గోపాలురంతా ఆ పళ్ళు కావాలన్నారు. ఎలాగైనా తినిపించమని పదేపదే అడిగారు. చిరునవ్వులు చిందిస్తూ సరేనన్నారు బలరామకృష్ణులు. అందరూ వెళ్ళారు.

బలరాముడు ఆ తాళవృక్షాల్ని పట్టుకొని ఒక్క ఊపు ఊపాడు. అంతే! వెంటనే రాలిపడ్డాయి బాగా పండిన తాటిపళ్ళు.

ఏదో చప్పుడు. విన్నాడు ఆ రాక్షసుడు. ఎవరో నా తాటితోపులోనికి చొరపడినట్లున్నారే! అంటూ గార్దభాకారంలో వచ్చాడు. ఆడిస్తున్న చెవులూ, ఊగుతున్న తోకతో వాడు భయంకరంగా ఉన్నాడు. పళ్ళు పటపట కొరుకుతూ వచ్చి బలరాముణ్ణి గుండెలపై వెనక కాళ్ళతో ఒక్క తన్ను తన్నాడు. దాంతో బలరాముడికి అరికాలి మంట నెత్తికెక్కింది. ఒక్కసారిగా ఆ గార్దభాసురుడి నాలుగు కాళ్ళు ఒకచేత్తో ఒడిసిపట్టుకొని గిరగిర తిప్పి చాచి నేలకేసి కొట్టాడు. అంతే! వాడి ప్రాణాలు గుటుక్కుమన్నాయి.

కడుపునిండా తాటిపళ్ళు తిన్నారు పిల్లలంతా. తరువాత ఇళ్ళకు తిరిగివచ్చారు.

## కాళియ మర్దనం

ఒకనాడు రోజూలాగే శ్రీకృష్ణుడు గోపాలకులతో కలసి గోవుల్ని తోలుకొని అడవికి వెళ్ళాడు. ఒకటే ఎండ. అందరూ దాహం దాహం అంటూ అలమటించి పోయారు. యమునా నదిలో దిగి ఆబగా నీళ్ళు త్రాగారు. త్రాగిన వెంటనే ప్రాణాలు కోల్పోయారు.

ఆ మడుగులోని నీళ్ళలో విషం కలిసింది. అదంతా గమనించిన శ్రీకృష్ణుడు చనిపోయినవాళ్లందరినీ బతికించాడు. ఇప్పుడు శ్రీకృష్ణుడి దృష్టి ఆ మడుగుపై పడింది. అందులో కాళియుడు అనే సర్పం నివసిస్తోంది. దాని విషం వల్లనే ఆ నీరు కలుషితం అయిపోయింది. ముందు ఆ మడుగును శుద్ధి చేయాలనుకొన్నాడు. మడుగులోనికి దూకాడు. విషంతో నిండిన తరంగాలు వేగంగా పైకి లేస్తున్నాయి. మడుగులో నూరు ధనువుల మేర కుతకుత ఉడుకుతూ పెద్ద బుడగలు లేస్తున్నాయి.

ఎవడో ఒక పిల్లవాడు నా మడుగును కల్లోలం చేస్తూ అల్లరి చేస్తున్నాడు. నేనున్నానన్న భయం ఏ కోశానా లేదు. నన్ను ఏమాత్రం లెక్కజేయటంలేదు.

నేనంటే ఏమిటో చూపిస్తాను. నా విషం రుచి చూపిస్తాను. అంటూ పైకి వచ్చి తన సైన్యంతో సమీపించి కాళియుడు శ్రీకృష్ణుణ్ణి కాటువేశాడు.

శ్రీకృష్ణుడికి ఏమీ కాలేదు. అర్థం కాలేదు కాళియఫణికి. వెంటనే వచ్చి తన శరీరంతో బాలుణ్ణి కట్టివేసి పడగలెత్తి కాటువేయటం మొదలుపెట్టాడు.

శ్రీకృష్ణుడు కదలకుండా కట్టుపడిపోయాడు. అది చూసిన గోపబాలకులంతా గొల్లుమన్నారు. లేగదూడలైతే ఆత్రంగా మోరలెత్తి అరిచాయి. ఆ కోలాహలానికి అందరూ పరుగున వచ్చి చూద్దురు కదా! నీళ్ళలో శ్రీకృష్ణుడు కాళియఫణికి బందీయై ఉన్నాడు. కొందరు శ్రీకృష్ణుణ్ణి రక్షించడానికి మడుగులోనికి దూకబోయారు. బలరాముడు చిద్విలాసంగా చిరునవ్వు చిందిస్తూ వాళ్ళను వారించాడు.

తనకోసం తనవాళ్ళు పడుతున్న దుఃఖాన్ని చూస్తే ముచ్చట వేసింది బాలకృష్ణుడికి. కొంచెం వేడుక చేద్దామనిపించింది. మెల్లగా శరీరాన్ని పెంచటం మొదలుపెట్టాడు. పట్టు బిగిస్తున్న కాళియుడికి తనను ఎవరో సాగదీస్తున్నట్లు అనిపించింది. ఒత్తిడి పెరుగుతోంది. ఎంత గట్టిగా నొక్కితే అంతకంటే గట్టిగా తాను సాగిపోతున్నాడు. అంత బలవంతమైన సర్పమూ ఒళ్ళు హూనమై బాధను తట్టుకోలేకపోయింది. ఒళ్ళంతా పచ్చి పుండైపోయినట్లుంది. చివరికి చేసేదేమీ లేక, బలం చాలక శ్రీకృష్ణుడిని వదిలేశాడు.

అతడలా వదిలాడో లేదో గరుత్మంతుడు సర్పాన్ని పట్టినట్లు కాళీయుణ్ణి పట్టుకొన్న బాలకృష్ణుడు అతడి పడగలపైకి ఒక్కసారిగా ఎగిరాడు. ఆ పడగల మీది కాంతులు తన పాదకాంతులలో కలిసి ప్రకాశిస్తుంటే శ్రీకృష్ణుడు ప్రఖ్యాత నర్తకుడిలా ఆ పడగలపై అత్యంత నైపుణ్యంతో నాట్యం చేయడం ప్రారంభించాడు.

బాలకృష్ణుడు చేస్తున్న ఈ ప్రచండ తాండవానికి కాళియుడు రక్తం కక్కుకున్నాడు. మాంసం ముద్దలు ముద్దలుగా బయటికి వస్తోంది. పౌరుషం చచ్చింది. బలం క్షీణించింది. నీరసించిపోయాడు. దిక్కులు చూస్తున్నాడు. అతడికి చుక్కలు కనిపిస్తున్నాయి.

## నాగస్త్రీల ప్రార్థన

ఇంతలో కాళియుడి భార్యలైన నాగస్త్రీలు వచ్చి 'హే గోపాలకృష్ణా! మహానుభావా! పాహి! పాహి! అనుగ్రహించు. మా అహంకారం అణగిపోయింది. శరణు వేడుతున్నాం.

ఈ కాళియుణ్ణి రక్షించు. ఆహా! ఈ కాళియఫణి పూర్వం ఏ తపస్సు చేశాడో! ఏ పుణ్యకార్యాలు ఆచరించాడో! ఏ సవ్యవ్రతాన్ని చేశాడో! ఇంతకు ముందు ఎంతటి మహానుభావులకు సైతం చేరువ కాని నువ్వు ఇప్పుడు ఇలా ఇంతటి వినోదంగా ఇతడి తలపై నాట్యం చేస్తున్నావయ్యా గోవిందా!

ఎంతో తపస్సు చేస్తేగానీ నీ పాద ధూళిలో ఒకే ఒక్క రేణువును తాకే భాగ్యాన్ని లక్ష్మీదేవి పొందలేకపోయిందే! మరి ఈ కాళియుడు ఏ తపస్సు చేయకుండానే ఇంతటి నీ పాదస్పర్శకు నోచుకున్నాడే! నీ పాదస్పర్శ ముందు ఇంద్రపదవైనా తీసికట్టు. బ్రహ్మపదవీ, చక్రవర్తి పదవీ అన్నీ చిన్నవే. సామాన్య జనులకు నీ పాదస్పర్శ అందుతుందా? అందునా ఈ కాళియుడిలాంటి క్రూర విష సర్పానికి లభించటం నీ మహిమ కాక ఇంకేమిటి స్వామీ!

దేవా! ఆదిపురుషా! అంతర్యామీ! పరిపూర్ణుడా! అనంత శక్తిస్వరూపా! ఈ సమస్త విశ్వమూ నువ్వే. దీన్ని నిర్మించేదీ దర్శించేదీ కూడా నువ్వే. ఈ విశ్వానికి కారకుడవూ నువ్వే.

ఏదో పంచతన్మాత్రలు, పంచేంద్రియాలు, మనోబుద్ధ్యహంకారాలూ ప్రాణమూ ఉన్నాయని మేం భ్రమలో ఉన్నాం కానీ ఇవన్నీ నువ్వే కావూ! నీ గుణాలేగా అంతటా ఆవరించి ఉన్నది.

నిర్మలాత్మా! నువ్వు కానిదీ నీకు తెలియనిదీ ఈ విశ్వంలో ఏదైనా ఉందా? మా భర్త ప్రాణాలను మాకు ప్రసాదించు' అని కాళ్ళా వేళ్ళా పడ్డారు. శ్రీకృష్ణుడు కరుణించాడు.

చావు తప్పి కన్ను లొట్టపోయినట్లున్న కాళియుడు భక్తితో శ్రీకృష్ణుడిని శరణు వేడాడు.

అప్పుడు కృష్ణుడు – 'కాళియా! నువ్వూ నీ భార్యలూ, నీ సంతానం అందరూ కలసి తక్షణం సముద్రంలోనికి వెళ్ళిపొండి. ఈ మడుగును ఖాళీచేయండి. ఈ కథ విన్నా, చదివినా ఎవరికీ ఏ సర్ప బాధా ఉండదు. అనుగ్రహిస్తున్నాను. వెళ్ళు.

ఇంతకు ముందు రమణక ద్వీపంలో ఉన్న నువ్వు గరుత్మంతుడికి భయపడి కదా ఈ మడుగులో దాక్కున్నావు. నీకిదే నా అభయం. గరుత్మంతుడివల్ల నీకు ఏ

ఆపదా రాదు. నీ పడగలపై ఉన్న నా పాదముద్రల్ని చూసి గరుడుడు నిన్నేమీ చేయడు.' అని సెలవిచ్చాడు.

కాళియుడు బాలకృష్ణుడికి నమస్కరించి సముద్రంలోనికి వెళ్ళిపోయాడు.

కాళియుణ్ణి అక్కణ్ణుంచి పంపివేశాక బాలకృష్ణుడు కాళియుడు తనకు భక్తితో సమర్పించిన దివ్యగంధాలనూ, దివ్య వస్త్రాలనూ ధరించి మడుగులో నుంచి బయటకు వచ్చాడు. ఆ గోపబాలుణ్ణి చూడగానే గోపాల బృందానికి పోయిన ప్రాణాలు తిరిగి వచ్చినట్లయింది. అందరికీ ఒకటే ఆనందం. పరమానందం.

ఆ రాత్రి అందరూ యమునాతీరంలోనే ఉండిపోయారు. ఎవరికీ అన్నమూ లేదు, నీళ్ళు కూడా లేవు. అందరూ నీరసించిపోయారు. దానిక్కారణం ఆ అడవిలో అప్పుడే పెద్ద కార్చిచ్చు పుట్టుకొచ్చింది.

తన శక్తితో ఆ దావాగ్నిని ఒక్కపెట్టున తానే త్రాగివేశాడు శ్రీకృష్ణుడు. ఆశ్చర్యం, చుట్టూ కమ్ముకొస్తున్న మంటలు ఒక్కసారిగా మాయమైపోయాయి. అందరూ జయజయ ధ్వానాలు చేశారు.

## ప్రలంబాసుర వధ

యథాప్రకారం బలరామకృష్ణులు పశువుల్ని మేపుతూ ఉంటే ప్రలంబుడు అనే రాక్షసుడు ఒక గోపబాలుడి వేషంలో వచ్చి వీళ్ళలో కలసిపోయాడు. వీళ్ళను శ్రీకృష్ణుణ్ణి చంపటం కోసం అవకాశం కోసం కాచుకొని చూస్తున్నాడు.

శ్రీకృష్ణుడు అది గమనించాడు. అయినా మౌనంగా ఉండిపోయాడు. గోప బాలకులందర్నీ పిలిచి –

'మిత్రులారా! ఇప్పుడు మనమో ఆట ఆడదాం. మనం రెండు పక్షాలుగా ఏర్పడి రాళ్ళను గురిచూసి బంతుల్లాగా విసురుదాం! ఓడినవాళ్ళు గెలిచినవాళ్ళను వీపుపై మోయాలి. ఇదీ పందెం' అన్నాడు.

ఆట మొదలయ్యింది. ఆ ఆటలో ప్రలంబాసురుడు ఓడిపోయి బలరాముణ్ణి ఎక్కించుకోవలసి వచ్చింది.

ప్రలంబాసురుడు బలరాముణ్ణి మోస్తూ వడివడిగా అడుగులు వేస్తున్నాడు. బలరాముడు క్రమక్రమంగా బరువు పెరిగిపోతున్నాడు. ఆ రాక్షసుడు బలరాముణ్ణి మోయలేక నిజస్వరూపంతో బయటపడ్డాడు. అయినా బలరాముణ్ణి అలాగే మోస్తూ పోతున్నాడు.

అప్పుడు బలరాముడు విజృంభించి పిడికిళ్లతో గుద్దుతూ ఆ రాక్షసుడి తలను బద్దలు కొట్టి చంపేశాడు. 'భలే, భలే!' రాక్షసుడు మన బలరాముడి చేతిలో నెత్తురు కక్కుకుని చచ్చాడు' అని గోపబాలకులు కేరింతలు కొట్టారు. బలరాముడిపై పుష్పవృష్టి కురిసింది.

ఆ తరువాత వర్ష ఋతువు వచ్చింది. ఉరుములు మెరుపులతో వరుణ దేవుడు కుంభవృష్టిని కురిపించాడు. ఆ జలధారలలో ప్రకృతి మొత్తం సేదతీరింది. శ్రీకృష్ణుడి దయవల్ల సముద్రుడు తనలో ఎంత నీరు వచ్చి చేరినా చెలియలి కట్ట దాటలేదు.

పరీక్షిన్మహారాజా! ఆ తరువాత శరద్రుతువు వచ్చింది. అరణ్యాలు దట్టంగా పెరిగి అందగించాయి. స్వచ్ఛమైన వెన్నెలలు అంతటా పరుచుకొన్నాయి. ఆ చల్లని వెన్నెలలో మురళీకృష్ణుడి వేణుగానం లీలావిలాసాలు, సుందరరూపం అందరినీ మోహపరవశుల్ని చేశాయి. ఆ వేణుగానం గోపికల గుండెల్లో వలపు పుట్టించింది.

ఈ హేమంత కాలంలో గోపకన్యలు అందరూ వేకువనే నిద్రలేచి కాళిందీ నదిలో స్నానమాచరించారు. ఆ నది ఒడ్డున గౌరీదేవి ప్రతిమను పెట్టి పూలతో అలంకరించి చందనం సమర్పించి ధూపదీప నైవేద్యాలతో అర్చించారు.

## గోపికా వస్త్రాపహరణం

పరీక్షిన్మహారాజా! అలా ఆ గోపకన్యలు ప్రతిదినమూ గౌరీపూజ చేస్తూ ఉంటే ఒకరోజు ఏమయ్యిందో తెలుసా? రోజూలాగే గోపికలు వేకువజామునే నిద్రలేచి అందరినీ పిలిచి యమునానదీ తీరానికి చేరుకొన్నారు. అక్కడ ఒక ఏకాంత స్థలంలో తమ చీరల్ని విప్పి ఒకచోట ఉంచి స్నానం కోసం నదిలోనికి దిగారు. అప్పుడు శ్రీకృష్ణుడు తన గోపబృందంతో వచ్చి వాళ్ళ చీరల్ని తీసుకొని, ఒక కడిమిచెట్టు మీద కూర్చున్నాడు.

'శ్రీకృష్ణా! మా చీరలు ముట్టుకోవద్దు. మామా! వాటిని తీసుకుపోవద్దు. వెళ్ళవద్దు. మమ్మల్ని మన్నించు. మా మానం తియ్యవద్దు. అయినా మా మనస్సులను దొంగిలించటమేమిటయ్యా! మానుకో! శ్రీకృష్ణా! ఇదేమంత ఘనకార్యం నాయనా! ఎవరు నీవారో ఎవరు పరాయివారో చూసుకోవా? మా వస్త్రాలు మాకు ఇవ్వవయ్యా బాబూ!' అని ప్రార్థించారు. దానికి శ్రీకృష్ణుడు 'కాత్యాయనీ వ్రతం చేస్తూ ఇలా బట్టల్లేకుండా స్నానం చేస్తే అంబికకు అపరాధం చేసినట్లు కాదూ!

సరే! మీకు వ్రతఫలం దక్కాలంటే రెండు చేతులు పైకెత్తి నాకు నమస్కరించండి' అన్నాడు కృష్ణుడు. అంతే! **ఏ ఉత్తమశ్లోకుణ్ణి స్మరిస్తే వ్రతభంగాలన్నీ తొలగి పోతాయో ఆ పరాత్పరుడికి గొల్లభామలు నమస్కరించారు** (అప్పటికి అతని వయస్సు ఆరు సంవత్సరాలే). వెంటనే శ్రీకృష్ణుడు వాళ్ళ బట్టల్ని వాళ్ళకు ఇచ్చి వ్రతభంగం కాకుండా రక్షించాడు.

## ముని భార్యల విందు

కాలం గడుస్తోంది. మళ్ళీ వేసవికాలం వచ్చింది. గోవులను మేపుతున్న గోపాలురు ఎండవేడికి తాళలేకపోతున్నారు. శ్రీకృష్ణుడు, బలరాముడు, శ్రీదాముడు, దేవప్రస్థుడు, విశాలుడు, కార్తవీర్యార్జునుడు ఇంకా తక్కిన గోపబాలకులూ అందరూ చెట్లనీడల్లో సేదతీరుతున్నారు. అప్పుడు కొందరు గోపబాలకులు ఇలా అన్నారు.

**మ. అపకారంబులు సేయ వెవ్వరికి నేకాంతంబులందుండు నా**
**తపశీతానిలవర్షవారణములై త్వగ్గంధ నిర్యాస భ**
**స్మపలాశాగ్రమరందమూల కుసుమచ్ఛాయా ఫలశ్రేణిచే**
**నుపకారంబులు సేయు నర్థులకు నీ యుర్వీజముల్ గంటిరే!**

(10-1-850)

**'ఈ చెట్లు చూడండి! ఎవరికీ కీడు తలపెట్టవు. ఎవరి జోలికీ పోవు. ఏకాంతంగా ఉంటాయి. ఎండ, గాలి, చలి, వానల నుండి ఆశ్రితుల్ని కాపాడతాయి. కోరినవారికి బెరళ్ళు, గంధం, జిగురు, బూడిద, చివుళ్ళు, తేనె, వేళ్ళు, పూలు, నీడ, పళ్ళు ఇచ్చి ఉపకారమే చేస్తాయి.'**

'అవును! అవును!' అని అందరూ మెచ్చుకున్నారు.

కొంతసేపటికి గోపబాలకులకు కడుపుల్లో నకనకలు మొదలయ్యాయి. 'శ్రీకృష్ణా! నువ్వే దిక్కు' అన్నారు. 'అక్కడే కొందరు బ్రాహ్మణులు ఆంగిరసం అనే సత్రయాగం చేస్తున్నారు. అక్కడికి వెళ్తే ఆకలి తీరుతుంది. మీరంతా వెళ్ళండి. నా పేరు చెప్పండి' అని వారిని పంపాడు శ్రీకృష్ణుడు.

గోపబాలకులు వెళ్ళి వాళ్ళను అర్థించారు. కానీ వాళ్ళకు శ్రీకృష్ణుడు పరమాత్ముడన్న జ్ఞానం ఉంటేగా! ఏదో సాధారణ గొల్లపిల్లవాడే ననుకొన్నారు. 'అతడు పంపడం, మేము ఆదరించడం బాగానే ఉంది. అన్నం లేదు, గిన్నం లేదు పొండి' అని ఛీత్కరించారు.

వాళ్ళు తిరిగి వచ్చి జరిగింది శ్రీకృష్ణుడికి చెప్పారు. ఈసారి బ్రాహ్మణ పత్నుల దగ్గరకు వెళ్లమని పంపించాడు శ్రీకృష్ణుడు. వాళ్ళు వెళ్ళారు. శ్రీకృష్ణుడు ఇక్కడే ఉన్నాడనీ మమ్మల్ని మీ వద్దకు పంపాడనీ గోపాలురు చెప్పగానే వాళ్ళు ఉబ్బి తబ్బిబ్బైపోయారు. శ్రీకృష్ణుణ్ణి చూడాలని ఉబలాటపడ్డారు. రకరకాల ఆహారపదార్థాలు తీసుకొని బయలుదేరారు.

వాళ్లను వాళ్ల భర్తలూ పిల్లలూ అందరూ వెళ్ళవద్దని అడ్డుకున్నారు. అయినా వాళ్ళ మాటలు లెక్కచేయకుండా సముద్రుడి కోసం బిరబిరా పరుగుతీసే నదీమతల్లుల్లా జగన్నాథుడైన శ్రీకృష్ణుడివద్దకు వచ్చారు.

'మీరు ఎంతో ఉల్లాసంగా వచ్చారు. నన్ను చూశారు. చాలు. వెంటనే తిరిగి వెళ్ళండి. యాగాన్ని సంపూర్ణం చేయండి' అన్నాడు శ్రీకృష్ణుడు.

దానికి వాళ్ళు విస్మయంగా 'మాధవా! నీకిలా మాట్లాడటం తగునా? వాళ్ళను కాదని వచ్చిన మమ్మల్ని తిరిగి రానిస్తారనుకొంటున్నావా? మేం వెళ్ళం. నీకు దాస్యం చేస్తూ నీ దగ్గరే ఉండిపోతాం' అన్నారు.

అప్పుడు శ్రీకృష్ణుడు 'మీకా చింత అక్కర్లేదు. వాళ్ళు మిమ్మల్ని ఏమీ అనరు. ధైర్యంగా వెళ్ళండి' అని వాళ్ళు తెచ్చిన పదార్థాలన్నింటినీ మిత్రులతో కలసి ఆరగించారు.

రాజా! శ్రీకృష్ణార్పణం అంటూ ఎవరికో భిక్షవేస్తేనే పరమపదం లభిస్తుందంటారే! మరి సాక్షాత్తూ ఆ పరబ్రహ్మ స్వరూపుడే స్వయంగా భిక్ష స్వీకరిస్తే దానివల్ల కలిగే ఫలం మాటల్లో చెప్పగలమా!

వెనక్కి తిరిగి వెళ్ళిన వాళ్ళ భార్యల్ని చూసి ఆ శ్రీకృష్ణుడే సర్వేశ్వరుడని తెలిసి బ్రాహ్మణులు తమను తాము తిట్టుకొన్నారు. పరమేశ్వరుణ్ణి గుర్తించలేనివాడు ఎన్ని యజ్ఞాలు చేసినా వృథా అని పశ్చాత్తాపంతో అలమటించారు. శ్రీహరినే స్మరిస్తూ క్షమాపణలు కోరారు. కానీ కంసుడికి భయపడి బలరామకృష్ణుల్ని చూడటానికి వెళ్ళలేకపోయారు.

## ఇంద్రయాగం - గోవర్ధన పర్వత పూజ

కొంతకాలం తర్వాత నందగోకులంలోని పెద్దలు ఇంద్రయాగం చేయాలి అని సంకల్పించారు.

'వర్షానికి అధిపతి పర్జన్యుడు. అతడే ఇంద్రుడు. అతడి ప్రీతికోసం యాగం చేస్తే సకల శుభాలూ కలుగుతాయి. అందుకే ఈ ప్రయత్నం' అన్నాడు నందుడు. దానికి శ్రీకృష్ణుడు అడ్డుతగిలి -

**అన్నింటికీ మూలమైనది కర్మ. కర్మవల్లనే ప్రాణులు పుడుతున్నాయి, పెరుగుతున్నాయి, నశిస్తున్నాయి. కాబట్టి జనులకు కర్మే దేవత. అదే సుఖ దుఃఖాలకు కారణం. ఇందులో మహేంద్రుడి ప్రమేయం ఏముంది? అతడికి భయపడటం దేనికి? అతణ్ణి ఎందుకు పూజించాలి?**

ఇంద్రయాగానికి తెప్పించిన వస్తువులతో పిండివంటలు చేయించండి. అందరికీ సంతర్పణలు చేయండి. బ్రాహ్మణులకు దానాలు సమర్పించండి. పశుపక్ష్యాదులకు సమృద్ధిగా ఆహారాన్ని అందించండి' అన్నాడు.

అందరూ అంగీకరించారు. పశువులకూ, పర్వతానికీ పూజలు చేశారు.

ఇంద్రుడికి పట్టరాని కోపం వచ్చింది. వెంటనే సంవర్తక మేఘాల్ని పంపి రాళ్ళవాన కురిపించాడు. మిన్ను విరిగి మీద పడినట్టుంది ఆ వాన. గోపాలురంతా విలపిస్తూ ఆ హోరుగాలి నుండీ, జోరుగా కురుస్తున్న వాన నుండీ రక్షించమని శ్రీకృష్ణుడిని వేడుకున్నారు.

పరిస్థితి పరికించిన శ్రీకృష్ణుడు ఆలస్యం చేయకుండా అక్కడే ఉన్న గోవర్ధన పర్వతాన్ని ఎత్తాడు.

అప్పుడెప్పుడో వరాహరూపం దాల్చి భూమిని ఎత్తిన ఈ పరంధాముడు ఒక ఏనుగు తామరమొగ్గను ఎత్తినంత అవలీలగా ముల్లోకాలకు శుభాల్ని చేకూర్చే విధంగా తన చేత్తో లీలగా ఆ పర్వతాన్ని ఎత్తి గొడుగులా పట్టుకున్నాడు.

'ఓ బంధువులారా! వీడు చూస్తే బాలుడు. ఈ కొండేమో ఇంత పెద్దగా ఉంది. దీన్ని వీడు మోయగలడో లేదో అన్న సందేహం వద్దు. బ్రహ్మాండమే నా చెయ్యిపై పడినా నా చెయ్యి చలించదు. ధైర్యంగా దీని కిందకి రండి.' అన్న శ్రీకృష్ణుడి మాటలు నమ్మిన గోపాలకులందరూ ఆ కొండ కిందికి చేరారు.

పరీక్షిన్మహారాజా! పద్మనేత్రుడి చేతిలో ఆ పర్వతం ఒక పద్మంలా ఉంది. అయినా దేవేంద్రుడు అక్కసుతో ఏడురోజులు ఎడతెరిపి లేకుండా వర్షం కురిపించాడు. ఆ ఏడు రోజులు శ్రీకృష్ణుడు గోపాలకులకు కొండగొడుగు పడుతూనే ఉన్నాడు.

దేవేంద్రుడికి కనువిప్పు కలిగింది. కామధేనువును తోడుతీసుకొని వచ్చి

**ఆ.వె. వాసుదేవ! కృష్ణ! వరద! స్వతంత్ర! వి**
**జ్ఞానమయ! మహాత్మ! సర్వపుణ్య**
**పురుష! నిఖిలబీజభూతాత్మక బ్రహ్మ!**
**నీకు వందనంబు నిష్కలంక!** (10-1-941)

అని శ్రీకృష్ణుణ్ణి స్తుతించి, అమరావతికి వెళ్ళిపోయాడు.

అది శరత్కాలం. పండు వెన్నెల. నందగోపాలుడు యమునా తీరంలో బృందావనంలో మురళిపై అందమైన రాగం ఆలపిస్తున్నాడు.

## గోపికల ఆగమనం

ఆ మోహనగీతం గోపికల చిత్తాల్ని తత్తరపడేలా చేసింది. ఎక్కడి పనులు అక్కడే కట్టిపెట్టి అందరినీ మరిచి అన్నీ విడిచి శ్రీకృష్ణుడి వద్దకు పరుగు పరుగున వచ్చారు.

'పరీక్షిన్మహారాజా! ఇంతకు ముందు నీకు చెప్పాను కదా!

**ఆ.వె. బాంధవముననైనఁ బగనైన వగనైనఁ**
**బ్రీతినైనఁ బ్రాణభీతినైన**

**భక్తినైన హరికి బరతంత్రులై యుండు**
**జనులు మోక్షమునకు జనుదు రధిప!** (10-1-973)

**బంధుత్వమో, పగో, కోరికో, ఇష్టమో, ప్రాణభయమో, భక్తో ఏదైనా కానీ హరికి పరతంత్రులై ఉన్న వాళ్ళు మోక్షాన్ని పొందుతారు. అంతేకాదు ఆ పరమ పురుషుడిని తాకితే చాలు ప్రాణులే కాదు రాళ్ళు రప్పలూ కొండలూ కోనలూ చెట్లూ పుట్టలూ కూడా ముక్తిని పొందుతాయి.**

తన కోసం తపిస్తూ వచ్చిన గోపికలను చూసి శ్రీకృష్ణుడు-

'ఎలా ఉన్నారు..? అంతా క్షేమమే కదా? అయినా ఇంత రాత్రి క్రూర మృగాలు తిరిగే ఈ అడవిలోకి ఇలా సాహసం చేసి రావచ్చునా? వచ్చింది చాలు. ఇంక వెనక్కి వెళ్ళిపోండి. మీకోసం మీవాళ్ళు ఎంత కంగారు పడతారో తెలుసా?

**నన్ను ధ్యానించండి. స్తుతించండి. నాపై పాటలు పాడండి. నాపై ధ్యాస నిల్పండి. చాలు. మీ జీవితాలు ధన్యమవుతాయి. ఇక మీ మీ ఇళ్ళకు వెళ్ళిపోండి' అన్నాడు.**

ఆ మాటలు విన్న గోపికలు విరహాగ్నితో దహించుకుపోయారు. ఏం మాట్లాడాలో తెలియటంలేదు. దుఃఖం పొంగుకు వస్తోంది. 'మమ్మల్ని అనుగ్రహించు. నువ్వు కాదంటే ఈ విరహాగ్నిలో కాలి బూడిదై నీ పాదాలను చేరుకుంటాం! అంతే!' అంటూ పరితపించారు.

మొత్తానికి శ్రీకృష్ణుడు వాళ్ళను అనుగ్రహించాడు. తన సాంగత్యాన్ని ప్రసాదించాడు.

గోపాంగనలు చుట్టూ చేరి తనను కొలుస్తూ ఉంటే చుక్కల్లో చంద్రుడిలా వెలిగిపోయాడు. ఎవరికీ చిక్కని ఆ చిద్విలాసుడు గోపికలకు చిక్కినట్లే చిక్కి చటుక్కున మాయమైపోయాడు.

అప్పుడు చూడాలి ఆ గోపకాంతల బాధ. విలవిలలాడిపోయారు. చిరుగుటాకుల్లా వణికిపోయారు. నేనే మాధవుణ్ణంటూ గోవిందుణ్ణి అనుకరిస్తూ అతడికోసం అన్వేషిస్తూ పిచ్చివాళ్ళలా తిరుగుతూ కనిపించిన చెట్టునూ పుట్టనూ అడుగుతూ తిరుగుతున్నారు.

**ఉ. నల్లనివాఁడు పద్మనయనంబులవాఁడు కృపారసంబు పైఁ**
**జల్లెడివాఁడు మౌళిపరిసర్పిత పింఛమువాఁడు నవ్వు రా**
**జిల్లెడు మోమువాఁ డొకఁడు చెల్వల మానధనంబుఁ దెచ్చె నో**
**మల్లియలార! మీ పొదలమాటున లేఁడు గదమ్మ చెప్పరే?**

(10-1-1011)

'ఓ మల్లెలారా! నల్లనివాడు, పద్మనేత్రాలవాడు, కరుణ చిలకరించేవాడు, తలపై పింఛం కలవాడు, నవ్వులు చిందే ముఖం కలవాడు అయిన శ్రీకృష్ణుడు మా గోపికల మానధనం కొల్లగొట్టి ఎక్కడో దాక్కున్నాడు. ఒకవేళ మీ పొదల్లో లేడు కదా! ఉంటే కాస్త చెప్పరూ!' అంటున్నారు.

పరీక్షిన్మహారాజా! ఇవన్నీ ఆ గోపికల వింతచేష్టలు. శ్రీకృష్ణుడి కోసమే తీవ్రంగా తపిస్తూ వెతుకుతూ యమునానదీ తీరంలో ఇసుకతిన్నెల్లో తిరుగుతున్నారు.

## గోపికా గీతలు

ఎట్టకేలకు కనిపించాడు శ్రీకృష్ణుడు. ముల్లోకాల్నీ మోహంలో ముంచెత్తే ఆ సుందర రూపాన్ని చూడగానే గోపికల ముఖాలు పద్మాల్లా వికసించాయి. పోతున్న ప్రాణాలు తిరిగి వచ్చాయి. గోపికలు సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యారు. ఆనందంగా కూర్చున్నాడు. అలా గోపికలంతా చుట్టూ చేరి ఇలా అడుగుతున్నారు–

**'నందనందనా! కొందరు తమను కొలిచినవారిని మాత్రమే అనుగ్రహిస్తారు. ఇంకొందరు కొలిచినా కొలవకపోయినా అనుగ్రహిస్తారు. మరికొందరుంటారు– వాళ్ళు కఠినాత్ములు. ఎవరినీ అనుగ్రహించరు. ఈ వ్యత్యాసాలు ఏమిటయ్యా శ్రీకృష్ణా!'**

చిన్నగా నవ్వాడు శ్రీకృష్ణుడు!

'బావుంది మీ సందేహం?'

నిజమే. కొందరు ఏదో ఒకటి ఆశించి కొలుస్తారు. ఇది స్వార్థం. నిజమైన స్నేహం కాదు. కొందరు దయాస్వరూపులు ఏ ఫలమూ ఆశించకుండా కొలుస్తారు. వారివల్ల ఎవరికీ ఒరిగేది ఏమీ ఉండదు. ఈ మూడో కోవకు చెందినవాడిగా

కఠినాత్ముడిగా మీరు నన్ను జమకట్టినట్లు ఉన్నారు. నా కోసం మీరు సర్వస్వం వదులుకొని వచ్చారు. నా ప్రత్యక్షానుభవం కోసం పరితపించారు. కానీ అది ధర్మం కాదు. నా పరోక్షానుభవం మీకు అలవాటు కావాలి. అందుకే నేను మీ మధ్య నుంచి అదృశ్యుడనయ్యాను. మిమ్మల్ని బాధించాలని కాదు సుమా! మీది అనన్య భక్తి. మీకు ఏమిచ్చినా ఋణం తీరదు.

## రాసక్రీడ

అప్పుడు శ్రీకృష్ణుడు 'రాసము' అనే క్రీడ ద్వారా ఆ గోపికలందరినీ తరింప చేయాలనుకొన్నాడు.

ఈ క్రీడలో గోపికలందరూ వలయాకారంలో నుంచుంటారు. ప్రతి గోపిక ప్రక్కనా ఒక శ్రీకృష్ణుడుంటాడు. అంటే ప్రతి ఇద్దరి గోపికల మధ్యా ఒక శ్రీకృష్ణుడన్న మాట.

ఏ గోపిక కాగోపిక శ్రీకృష్ణుడు నా ప్రక్కనే ఉన్నాడని మురిసిపోతూ ఉంటుంది. గోపికలు ఏఏ చేష్టల ద్వారా శ్రీకృష్ణుడిని అలరించాలనుకున్నారో తానే వాళ్ళందరినీ ఆయా చేష్టల ద్వారా మురిపించాడు, మైమరిపించాడు. గోపికల్ని భ్రమలో ముంచెత్తాడు. అప్పటికి శ్రీకృష్ణుని వయస్సు ఆరు సంవత్సరాలే.

ఇదంతా శ్రీకృష్ణ లీలావిలాసం. ఇదే రాసక్రీడా రహస్యం.

## సుదర్శనుడి శాపవిమోచనం

పరీక్షిన్మహారాజా! ఇదిలా ఉంటే అక్కడ నందగోకులంలో మరో ఆపద వచ్చి పడింది. ఒక పెద్ద పాము ఊరిమీద పడి చివరికి నందమహారాజునే మింగాలని చూసింది. ఆ సర్పం ఎవరో కాదు. సుదర్శనుడు అనే ఒక విద్యాధరుడు. గొప్ప అందగాణ్ణన్న అహంకారంతో ఒకరోజు విమానమెక్కి తిరుగుతూ కురూపులైన అంగిరసుడి పుత్రుల్ని అవమానించి ఇదుగో ఇలా శాపగ్రస్తుడయ్యాడు. శ్రీకృష్ణుడి పాదస్పర్శవల్ల శాపవిమోచనం కలుగుతుందని వాళ్ళు అనుగ్రహించారు. ఇప్పుడు ఆ సమయం వచ్చింది.

శ్రీకృష్ణుడు వచ్చి ఆ సర్పాన్ని కాలితో తన్నాడు. వికృతసర్పాకారం పోయి సుదర్శనుడు తిరిగి తన రూపం పొంది దేవలోకానికి వెళ్ళిపోయాడు.

ఇంకా గోపాలుడిపైనా గోకులంపైనా రాక్షసుల దాడులు ఆగలేదు.

## శంఖచూడ సంహారం

శంఖచూడుడు అనేవాడు ఒక యక్షుడు. వీడు కుబేరుడి అనుచరుడు. వీడు గోకులం మీద పడి శ్రీకృష్ణుడి రక్షణలో ఉన్న గోపకాంతలను అపహరించాలని చూశాడు.

పులివాతపడ్డ ఆవుల్లా ఆక్రోశించారు గోపస్త్రీలు. బలరామకృష్ణులు ఒకడు యముడు, మరొకడు మృత్యువు అన్నట్లుగా వాడివెంట పడ్డారు. వాడు భయపడి గోపికల్ని వదిలి ఉత్తర దిక్కుకు పరుగు తీశాడు. శ్రీకృష్ణుడు వెంటపడి మరీ వాణ్ణి పట్టుకొని చంపి వాడి తలపై ఉన్న మణిని తెచ్చి బలరాముడికి ఇచ్చాడు.

## వృషభాసుర వధ

మరోసారి వృషభాసురుడు గోపాలురపై విరుచుకుపడ్డాడు. పర్వతశిఖరం లాంటి మూపురంతో వాడు భీకరంగా ఉన్నాడు. రంకెలు వేస్తూ నేలను గిట్టలతో కుళ్ళగించేస్తూ ఆలమందపై పడ్డాడు.

గోకులం మొత్తం భయంతో కకావికలమైపోయింది. గోపాలకృష్ణుడు చూశాడు. సింహంలా వాడిపై దూకి వాడి రెండు కొమ్ములూ పట్టుకొని పద్దెనిమిది అడుగుల దూరానికి విసిరికొట్టాడు. అంతే! అయిపోయాడా రాక్షసుడు. నెత్తురు కక్కుకొని చచ్చాడు.

## కంసుడి ఆహ్వానం

పరీక్షిన్మహారాజా! కొన్నాళ్ళ తరువాత నారద మహర్షి కంసుడి వద్దకు వెళ్ళాడు. 'కంసా! దేవకీదేవి అష్టమగర్భంలో పుట్టింది ఆడపిల్ల కాదు. మగబిడ్డ. నిన్ను సంహరించగలవాడు నందగోకులంలో పెరుగుతున్నాడు. అతడి పేరు శ్రీకృష్ణుడు. నువ్వు పంపిన రాక్షసులందరినీ చంపేది అతడే' అంటూ అప్పటిదాకా జరిగినవీ కంసుడికి తెలియనివీ అన్నీ వివరంగా చెప్పాడు.

కంసుడు మండిపడ్డాడు. వసుదేవుడు తనను మోసం చేశాడని వెంటనే అతణ్ణి చంపుతాననీ కత్తి దూశాడు. ఆపకపోతే అన్నంతపనీ చేసేట్టుగా ఉన్నాడే! ఎలా ఇతణ్ణి ఆపడం అనుకొని 'కంసా! నువ్వు వసుదేవుణ్ణి చంపితే శ్రీకృష్ణబలరాములు

అజ్ఞాతంలోకి వెళ్ళిపోతారు. సమయం చూసి నీపై దాడిచేస్తారు. కాబట్టి ఓపిక పట్టు' అన్నాడు నారదుడు.

నిజమేననుకున్నాడు కంసుడు. వెంటనే దేవకీ వసుదేవుల్ని తిరిగి చెరసాలలో బంధించాడు. నారదుడు వచ్చిన పనిని పూర్తిచేసుకొని వెళ్ళిపోయాడు.

తరువాత కంసుడు అక్రూరుణ్ణి పిలిచాడు. బలరామకృష్ణుల్ని తాను చేస్తున్న ధనుర్యాగానికి ఎలాగైనా తీసుకురమ్మని చెప్పాడు.

అక్రూరుడు – 'రాజా! నీ ఆజ్ఞ. శిరసా వహిస్తాను. లోకంలో నరులు తమ శక్తి ఏపాటిదో దైవశక్తి ఎంత గొప్పదో తెలుసుకోలేరు. పట్టుదలతో పిచ్చిగా ప్రవర్తిస్తూ ఉంటారు. విధి నిర్ణయం ఎలా ఉంటే అలా జరుగుతుంది' అన్నాడు.

## కేశి వధ

కంసుడు ఈసారి 'కేశి' అనే రాక్షసుణ్ణి పంపాడు. వాడు నందుడి మందలో ప్రవేశించి బీభత్సం సృష్టించాడు. గుర్రం రూపంలో ఉన్న ఆ రాక్షసుడి కాళ్ళు పట్టుకొని గిరిగిరా త్రిప్పి నాలుగు వందల మూరల దూరానికి విసిరికొట్టాడు శ్రీకృష్ణుడు.

అయినా మళ్ళీ వేగంగా లేచి మీదికి దూసుకువస్తోందా గుర్రం. దాని నోటిలోనికి తన బాహుదండాన్ని దూర్చాడు శ్రీకృష్ణుడు. క్రమంగా కడుపులోనికి చొప్పించి ఆ చేతిని క్రమక్రమంగా పెద్దది చేశాడు. అంతే! శ్రీకృష్ణుడి చెయ్యిపట్టక దాని పొట్ట దోసపండులా రెండుగా చీలిపోయింది. దేవతలు పుష్పవృష్టిని కురిపించారు.

## వ్యోమాసుర వధ

ఈసారి 'వ్యోమాసురుడు' అనే మరో రాక్షసుడు వచ్చాడు. అప్పుడు శ్రీకృష్ణుడు గోపబాలురతో కలసి 'దాగుడుమూతలు' ఆడుతున్నాడు. ఈ రాక్షసుడూ ఒక గోపాలుడి రూపం ధరించి వాళ్ళతో కలసిపోయాడు. ఆ ఆటలో పిల్లలందరూ గొర్రెలుగా నటిస్తున్నారు. పిల్లల్ని మాయచేసి ఒక గుహలో దాచేస్తున్నాడా రాక్షసుడు.

అది కనిపెట్టాడు శ్రీకృష్ణుడు. తోడేలుపైకి దూకే సింహంలా వాణ్ణి ఒడిసిపట్టి చీల్చి చెండాడి సంహరించాడు.

## అక్రూరుడి రాక

**'అహా! నేనెంత పుణ్యం చేశానో కదా! శ్రీకృష్ణుణ్ణి చూడబోతున్నాను. ఏం ముఖమది.. ముద్దుగారే ముంగురులూ, కమలాల్లాంటి కళ్ళూ, చిరునవ్వు వెన్నెలలూ చెవికమ్మల కాంతులూ కలిసి మెరిసే చెక్కిళ్ళూ ఓహ్.... పున్నమి చంద్రుడిలా వెలిగిపోయే అతడి ముఖం నేనిప్పుడు దర్శించబోతున్నాను.' అని అక్రూరుడి మనస్సు ఉవ్విళ్ళూరుతోంది.**

వడివడిగా బృందావనం చేరుకున్నాడు.

బలరామకృష్ణులు సాదరంగా ఆహ్వానించి అతిథి మర్యాదలు చేశారు. కుశల ప్రశ్నలు వేశారు. శ్రీకృష్ణుడైతే అక్రూరుణ్ణి ఆలింగనం చేసుకొని ఆదరించాడు.

తరువాత సావకాశంగా అక్రూరుడు శ్రీకృష్ణుడు మాట్లాడుకొంటున్నారు. తన తలిదండ్రుల గురించి అడిగాడు శ్రీకృష్ణుడు. అక్రూరుడు నారదుడు వచ్చినదగ్గర్నుంచీ మొత్తం శ్రీకృష్ణుడికి చెప్పి తను వచ్చిన పని కూడా చెప్పాడు. సరే! వస్తానన్నాడు శ్రీకృష్ణుడు.

## యమునలో బలరామకృష్ణులు

అక్రూరుడు రథం నడుపుతున్నాడు. బలరామకృష్ణులు ఆ రథంపై మథురకు సాగిపోతున్నారు. నందగోకులంలోని ఆబాలగోపాలమూ వెంట నడిచింది. రథం రేపిన దుమ్మును కన్నీటితో అణచివేసింది.

దారిలో కాళిందీనది. అక్కడ ఆగింది రథం. అక్రూరుడు ఆ నదిలో దిగి స్నానం చేస్తున్నాడు. బలరామకృష్ణులు రథంలోనే ఉన్నారు.

అప్పుడు అక్రూరుడు ఒక ఆశ్చర్యకరమైన సన్నివేశం చూచాడు. స్నానం చేస్తున్న అక్రూరుడికి, నీళ్ళలో బలరామకృష్ణులు కన్పించారు. ఆశ్చర్యపోతూ మీరెప్పుడు వచ్చారిక్కడికి? అని అడిగి, అటు చూశాడు అక్రూరుడు. అక్కడ రథంలోనే ఉన్నారు బలరామకృష్ణులు. నమ్మలేకపోయాడు. మళ్ళీ చూశాడు. ఇది నిజమా! లేక నా భ్రమా! అనుకొని నీళ్ళలో మునిగాడు. ఈసారి నీళ్ళ అడుగున ఆదిశేషుడు కనిపించాడు. ఆ శేషుడిపై శయనించి ఉన్న పురుషోత్తముడు కనిపించాడు.

**పట్టుపీతాంబరం, వక్షస్థలంలో లక్ష్మి, నాభిపద్మంలో బ్రహ్మ, శుభలక్షణాలు కల శరీరం, శ్రీవత్సం అనే పుట్టుమచ్చ, కౌస్తుభమణి, తోమాల, మకర కుండలాలు, దివ్యాభరణాలు వీటన్నింటితో ప్రకాశించే దివ్యమంగళ విగ్రహాన్ని దర్శించాడు. ప్రహ్లాదాది భక్తులు కొలుస్తున్నారు. లక్ష్మి, పుష్టి, తుష్టి, కీర్తి, కాంతి, ఇల, ఊర్జ, విద్య, అవిద్య, శక్తి, మాయ అనే తేజోమూర్తులు సేవిస్తున్నారు.**

**అది చూసిన అక్రూరుడు భక్తిపారవశ్యంతో ఆవేశంగా స్తుతించాడు. శ్రీకృష్ణుడు తన స్వరూపాన్ని చూపినట్లే చూపించి అంతలోనే అంతర్ధానమైపోయాడు.** అక్రూరుడు నీళ్ళనుండి బయటకు వచ్చి రథంలో కూర్చున్నాడు. అప్పుడు కృష్ణుడు - ఏం అక్రూరా! వెళ్ళి చాలాసేపయ్యిందే! ఆ నదీజలాల్లో ఏవైనా వింతలు కనిపించాయా?' అన్నాడు.

అక్రూరుడు నవ్వి 'స్వామీ! నీకు తెలియని వింతలా? నీలో లేని వింతలా' అంటూ రథం పోనిచ్చాడు.

రథం మధురానగరం పొలిమేరలకు చేరుకుంది. అప్పటికే నందాదులు వచ్చి కంసుడు ఏర్పాటు చేసిన విడిదిలో దిగారు. శ్రీకృష్ణుడు వెళ్ళి వాళ్ళను కలుసుకొన్నాడు. అక్రూరుణ్ణి ఇంక వెళ్ళిపొమ్మన్నాడు. అప్పుడు అక్రూరుడు 'శ్రీకృష్ణా! నా ఇంటికి వచ్చి నన్ను చరితార్థుణ్ణి చెయ్యవయ్యా' అని అభ్యర్థించాడు. 'అక్రూరా! తిరుగు ప్రయాణంలో నీ కోరిక తీరుస్తాను, నువ్వు బయలుదేరు' అన్నాడు.

## మధురానగర ప్రవేశం

ఎంత అందంగా ఉందీ మధురానగరం.. అగడ్తలు, కోటలు, బురుజులు, వీథులు, భవనాలు, ఉద్యానవనాలు– అన్నీ అద్భుతమైన శోభతో ఒప్పుతున్నాయి.

శ్రీకృష్ణుడు నగర వీథుల్లో విహరిస్తున్నాడు. శ్రీకృష్ణుడిని చూడాలని అందరికీ ఒకటే ఉబలాటం.

దారిలో బ్రాహ్మణులు బలరామకృష్ణుల్ని అర్చించారు.

అటువైపు వచ్చిన ఒక సాలెవాడు మంచిమంచి బట్టలు తెచ్చి బలరామ కృష్ణులకు ఇచ్చాడు. తరువాత వారు సుదాముడి ఇంటికి వెళ్ళారు. వాళ్ల రాకతో సుదాముడు సంతోషంతో ఉప్పొంగిపోయాడు. పూమాలలు సమర్పించాడు.

శ్రీకృష్ణుడు ప్రీతుడై 'సుదామా! నీకేం కావాలో కోరుకో' అన్నాడు.

సుదాముడు 'శ్రీకృష్ణా! తాపసమందారా!

**కం. నీ పాద కమల సేవయు**
**నీ పాదార్చకుల తోడి నెయ్యమును నితాం**
**తాపార భూతదయయును**
**దాపసమందార నాకు దయసేయఁగదే** (10-1-1270)

**'నీ పాదకమలాల్ని సేవించే భాగ్యం, నీ పాదాల్ని అర్చించేవాళ్ళ స్నేహం, ఎల్లప్పుడూ అపారమైన భూతదయా నాకు అనుగ్రహించు'** అన్నాడు.

అతడు వేడుకొన్నవన్నీ అనుగ్రహించి శ్రీకృష్ణుడు రాజవీథిలోనికి దారి తీశాడు.

దారిలో ఒక గూని దాసి ఎదురువచ్చింది. ఆమె చేతిలో చందనాదిమైపూతలు ఉన్న గిన్నెలు ఉన్నాయి. శ్రీకృష్ణుడు ఆమెతో –

'సుందరీ! ఎవరు నువ్వు? నీ చేతిలో ఆ గిన్నెలేమిటి? మాకియ్యరాదా' అన్నాడు.

అతడి మాటల్లోని కొంటెతనం, చమత్కారం ఆమె గ్రహించింది.

'నువ్వు భలే అందగాడివే. చాలు చాలు, నీ సరసాలు, చమత్కారాలు. అయినా అందరికీ ఇన్ని అందాలు ఎక్కడినుంచి వస్తాయిగనుక! నేను కంసుడి దాసిని. అచ్చుమైన మైపూతలు చేయటమే నేను నేర్చిన విద్య. మీకూ కావాలా?' అంటూ బలరామకృష్ణులుకు కొన్ని మైపూతలు ఇచ్చింది.

అందుకొన్నాడు శ్రీకృష్ణుడు. కుబ్జ వంకర్లను తీసేయాలనుకొన్నాడు. దాని మీగాళ్ళ మీద తన కాలితో నొక్కిపెట్టి రెండు చేతుల బొటన వేళ్ళను ఆమె గడ్డం క్రింద పెట్టి శరీరాన్ని పైకి సాగదీశాడు. అంతే! ఒక్క క్షణంలో ఆమె గూని మాయమైపోయింది. మన్మథుడి బాణమా! అన్నట్లు అందమైన స్త్రీగా ఆమె మారిపోయింది.

ధనుశ్శాలకు వెళ్ళాడు శ్రీకృష్ణుడు. అక్కడో పెద్ద విల్లు ఉంది. దాని దగ్గరకు వెళ్ళి అల్లెత్రాడు తగిలించి ఒక మత్తగజం చెరుకుగడను విరిచినట్లుగా విరిచేశాడు.

వెన్నెల వెలుగులో మథుర వెలిగిపోతోంది. ఆ రాత్రి తోటి గోపాలురతో కలసి వెన్నెల వెలుగులో పాలబువ్వలు తిని ఆనందించారు బలరామకృష్ణులు. అక్కడ కంసుడికి కంటిమీద కునుకు లేదు. బలరామకృష్ణులు రావడం, ధనువును విరవడం, తన అనుచరుల్ని వధించడం అతణ్ణి తొలిచేస్తున్నాయి. ఏవో పీడకలలు. ఇంతలో తెల్లవారింది.

కంసుడు మల్లయుద్ధానికి రంగం సిద్ధం చేయించాడు. వెంటనే ఒక్కొక్కడు ఒక్కొక్క పర్వతమా అన్నట్లున్న చాణూరుడు, ముష్టికుడు, శలుడు, తోసలుడు ఉద్రేకంగా రంగంలోనికి దూకారు. ఒకవైపు కంసుడు, మరోవైపు నందాదులూ కూర్చున్నారు.

మల్లయుద్ధం ప్రారంభానికి సూచనగా భేరీలు గుండెలు పగిలేలా మ్రోగాయి. బలరామకృష్ణులు వాకిలి దగ్గరకు చేరుకున్నారు.

అక్కడో మత్తగజం ఉంది. దాని పేరు కువలయాపీడం. దానిని శ్రీకృష్ణుడి మీదికి తోలుకువస్తున్నాడు మావటివాడు.

## కువలయాపీడం

అది కంసుడి ఆజ్ఞ. ఏనుగుతో తొక్కించి చంపెయ్యాలన్నదే వాడి ఆలోచన. శ్రీకృష్ణుడికి ఆ పన్నాగం అర్థమయింది. కట్టుకున్న పట్టుపుట్టాన్ని బిగించి ఒక్క ఎగురు ఎగిరి దాని తోక పట్టుకుని అంతటి ఏనుగునీ గిరగిరా తిప్పి వంద మూరల దూరంలో పడేలా ఆశ్చర్యకరంగా విసిరికొట్టాడు. దాన్ని యమపురికి పంపించాడు. ఇక నేరుగా రంగంలోకి దూకారు బలరామకృష్ణులు.

అప్పుడు చాణూరుడు శ్రీకృష్ణుణ్ణి నానామాటలూ అంటూ బాగా రెచ్చగొట్టాడు. శ్రీకృష్ణుడు చాణూరుడితోను, బలరాముడు ముష్టికుడితోనూ తలపడ్డారు. జబ్బలు చరుస్తూ, వికటాట్టహాసం చేస్తూ రెండు ఏనుగులూ రెండు సింహాలూ కొట్టుకొంటున్నట్లు యుద్ధం చేస్తున్నారు. చూసేవాళ్ళంతా ఊపిరి బిగపట్టి చూస్తున్నారు. కొద్దిసేపు వాళ్ళను ఒక ఆట ఆడించి సంహరించారు బలరామకృష్ణులు.

## కంస వధ

కంసుడికి ఒకప్రక్క అసహనం, కోపం. మరో ప్రక్క భయం. ఏం చేయాలో తోచలేదు. తన సైనికుల్ని పిలిచి 'అడుగో! నందుడు. ముందు అతణ్ణి చంపి పారెయ్యండి. ఈ కుర్రాళ్ళిద్దర్నీ తరిమికొట్టండి. ఆ తరువాత వసుదేవుణ్ణీ, నా తండ్రి ఉగ్రసేనుణ్ణీ మట్టుపెట్టండి' పిచ్చిగా కేకలు వేస్తూ అరుస్తున్నాడు.

అది విన్న శ్రీకృష్ణుడు కొదమసింహంలా కంసుడిమీదికి దూకాడు. గరుడుడు సర్పాన్ని పట్టుకొనేట్లు కంసుడి జుట్టు పట్టుకొని రంగస్థలం మధ్యలోనికి విసిరివేశాడు. కిరీటం ఎగిరి ఒక ప్రక్కన పడింది. కంసుడు మరో ప్రక్కన పడ్డాడు. పౌరులు హాహాకారాలు చేస్తుంటే శ్రీకృష్ణుడు పైకి ఎగిరి కంసుడి మీదికి దూకాడు.

తన బొజ్జలో పదునాలుగు భువన భాండాలను దాచుకున్న శ్రీకృష్ణుడు మీదికి దూకితే కంసుడు ఇంకా బతికి ఉంటాడా! నెత్తురు కక్కుకొని మరణించాడు.

పరీక్షిన్మహారాజా! వైరంవల్లనైతేనేం కంసుడు శ్రీకృష్ణుడి చేతిలో మరణించి, అతడిలోనే ఐక్యమైపోయాడు. కంసుడి ఎనిమిదిమంది తమ్ముళ్ళూ శ్రీకృష్ణుడి చేతిలోనే మరణించారు.

## ఉగ్రసేన మహారాజుకు పట్టాభిషేకం

తరువాత శ్రీకృష్ణుడు దేవకీవసుదేవుల్ని చెరసాల నుండి విడిపించాడు. వాళ్ళకు తమ బిడ్డ సామాన్యుడు కాడనీ, భగవంతుడనీ తెలుసు. వాళ్ళను చూసి శ్రీకృష్ణుడు –

'మీరు మాకు జన్మనిచ్చారు కానీ మమ్మల్ని పెంచి పెద్దచేసే ముద్దూముచ్చటకు మీరు నోచుకోలేదు. మాకూ ఆ అదృష్టం లేదు.

**సామర్థ్యం ఉండీ తల్లిదండ్రుల్ని సేవించనివాడికన్నా దుష్టుడు, దుర్మార్గుడూ ఇంకొకడు ఉంటాడా? వాడు చచ్చి నరకంలో తన మాంసాన్ని తానే తింటాడు. అంతేకాదు, తల్లిదండ్రుల్ని, వృద్ధుల్ని, పసిబిడ్డల్ని, గురువులను, బ్రాహ్మణులను, సాధువులను, స్త్రీలను పోషించగల సామర్థ్యం ఉండి కూడా నిర్లక్ష్యం చేసేవాడు బతికినా చచ్చినవాడితో సమానం'** అన్నాడు.

దేవకీవసుదేవుల కళ్ళు చెమర్చాయి. బిడ్డల్ని దగ్గరకు తీసుకొని లాలించారు.

తరువాత ఉగ్రసేన మహారాజుగారికి పట్టాభిషేక మహోత్సవం ప్రారంభమయింది. యదు, వృష్ణి, భోజ, కుకుర, అంధక వీరులందరి సమక్షంలో అతడికి పట్టాభిషేకం జరిపించాడు శ్రీకృష్ణుడు.

శ్రీకృష్ణుడు నందుడు మొదలైనవాళ్ళను బృందావనానికి పంపించాడు. వాళ్ళు వెళ్ళలేక, శ్రీకృష్ణుణ్ణి వదల్లేక కన్నీరు మున్నీరై బయలుదేరారు.

శ్రీకృష్ణబలరాములు మధురలోనే ఉన్నారు.

## సాందీపని మహర్షి

వసుదేవుడు వాళ్ళకు ఉపనయనం చేయించి సాందీపని వద్దకు విద్యాభ్యాసానికి పంపించాడు. సాందీపుడు కాశిలో ఉన్నాడు. బలరామకృష్ణులు అక్కడికి వెళ్ళి వినయవిధేయలతో ఆయనకు శుశ్రూషలు చేశారు. వేదవేదాంగాలు, ఉపనిషత్తులు, ధనుర్విద్య నేర్చుకొన్నారు. రోజుకో కళ చొప్పున అరవై నాలుగు రోజుల్లో అరవై నాలుగు కళల్లోనూ ఆరితేరారు.

సాందీపని మహర్షి కుమారుడు పూర్వం ఎప్పుడో ప్రభాస తీర్థంలో మునిగి పోయాడు. అతణ్ణి తెచ్చి గురుదక్షిణగా సమర్పించమని కోరాడు సాందీపుడు. మారు మాట్లాడకుండా చనిపోయినవాణ్ణి ఎలా తేవాలన్న ఆలోచన లేకుండా బయలుదేరారు బలరామకృష్ణులు.

నేరుగా యమపురమైన సంయమినీ నగరానికి వెళ్ళారు. పాంచజన్యం పూరించాడు శ్రీకృష్ణుడు. యముడు పరుగుపరుగున వచ్చి ఆ బాలుణ్ణి అప్పగించాడు. అతణ్ణి తెచ్చి గురువు గారికి సమర్పించి గురువు గారి ఆశీస్సులు పొందారు. తిరిగి మధురానగరానికి చేరుకున్నారు.

## ఉద్ధవుడి సందేశం

మధురానగరంలో ఉన్న శ్రీకృష్ణుడికి గోపికలు గుర్తుకు వచ్చారు. వాళ్ళు ఎలా ఉన్నారో! ఏం చేస్తున్నారో, పాపం. ప్రాణాలన్నీ నామీదే పెట్టుకొని బతికారు. వాళ్ళ సమాచారం తెలుసుకోవాలి! అనుకొని వాళ్ళ దగ్గరకు ఉద్ధవుణ్ణి పంపాలను కొన్నాడు.

'ఈ శ్రీకృష్ణుడెప్పటికీ మీవాడే! మిమ్మల్ని ఎన్నటికీ విడిచిపెట్టడు. త్వరలోనే బృందావనానికి వస్తాడు' అని గోపికలతో చెప్పమని శ్రీకృష్ణుడు ఉద్ధవుడిని బృందావనానికి పంపాడు.

ఉద్ధవుడు ఉత్తముడు, బుద్ధిమంతుడు. శ్రీకృష్ణుడు చెప్పిన తియ్యటి మాటల్ని వారి చెవుల్లో వేసి వాళ్ళకు వీనులవిందు గావించాడు.

ఆ మాటలు వినడానికి బాగానే ఉన్నా నిజమేనా, నిజంగా మా కోసం మా శ్రీకృష్ణుడు వస్తాడా! అని గోపికలకు సందేహం.

'ఇప్పటిదాకా ఎలా తట్టుకున్నామో మాకే తెలియదు. ఇక మా వల్ల కాదు. నువ్వు రాకపోతే అంతే. మా ప్రాణాలు గాల్లో కలసిపోతాయి, శ్రీకృష్ణా! ఇక నీదే భారం! ఇది మా మాటగా చెప్పు' అన్నారు శ్రీకృష్ణుడి పట్ల భక్తితో గోపికలు.

పరీక్షిన్మహారాజా! ఉద్ధవుడు తిరిగి వచ్చి అక్కడ జరిగిన సంఘటనలన్నీ శ్రీకృష్ణుడికి కళ్ళకు కట్టినట్లు వినిపించాడు.

కంసవధ అయిపోయింది. తనను ఇంటికి రమ్మని పిలిచిన కుబ్జను అనుగ్రహించడానికి శ్రీకృష్ణుడు ఆమె ఇంటికి వెళ్ళాడు. అలాగే అక్రూరుడి ఇంటికి తనే స్వయంగా బలరాముణ్ణి వెంటతీసుకొని వెళ్ళాడు. పైగా అతణ్ణి హస్తినాపురానికి పంపాలన్నది శ్రీకృష్ణుడి ఆలోచన.

అక్రూరుడు ఉబ్బితబ్బిబ్బై బలరామకృష్ణులకు అర్ఘ్యపాద్యాలిచ్చాడు. వారి కాళ్ళు కడిగి ఆ పవిత్రజలం తన తలపై జల్లుకున్నాడు. అనేక సత్కారాలు చేశాడు. అప్పుడు శ్రీకృష్ణుడు–

అక్రూరా! నువ్వు మాకో సాయం చేసిపెట్టాలి. హస్తినాపురానికి వెళ్ళి పాండవుల క్షేమసమాచారాలు తెలుసుకొని రావాలి. వాళ్ళు నాకు ప్రాణంతో సమానులని నీకు తెలుసుకదా! వెళ్ళిరా' అన్నాడు.

అక్రూరుడు హస్తినాపురానికి వెళ్ళాడు. పెద్దలందరినీ కలిశాడు. అందరి క్షేమ సమాచారాలు తెలుసుకున్నాడు. మథురలో అంతా క్షేమమేనని వారితో చెప్పాడు.

కొన్నాళ్ళు అక్కడే ఉండి అందరి మనస్తత్వాలూ గ్రహించాడు. ముఖ్యంగా ధృతరాష్ట్రుడు పాండవులపై చూపించే ప్రేమ నిజం కాదని అతడికి అర్థమయింది. ధృతరాష్ట్రుడికి హితబోధ చేసి మరీ వచ్చాడు.

## శ్రీకృష్ణ జరాసంధుల యుద్ధం

పరీక్షిన్మహారాజా! కంసుడికి అస్తి, ప్రాప్తి అని ఇద్దరు పట్టపురాణులున్నారు. వీళ్ళిద్దరూ ఎవరో తెలుసా! జరాసంధుడి కుమార్తెలు. తన అల్లుణ్ణి చంపిన శ్రీకృష్ణుడిపై పగపట్టాడు జరాసంధుడు. తన 23 అక్షౌహిణుల సైన్యాన్ని తీసుకొని మథురపై దాడిచేశాడు.

ఆకాశంలోంచి రెండు దివ్యరథాలు మథురలో దిగాయి. వాటి నిండా దివ్యమైన ఆయుధాలూ, కవచాలూ ఉన్నాయి. ఆలస్యం చేయలేదు. బలరామకృష్ణులు చెరో రథం అధిరోహించారు. సూర్యతేజస్సుతో వెలిగిపోతున్న ఇద్దరు సారథులు కూడా ఉన్నారు ఆ రథాలకు.

శ్రీకృష్ణుడి రథసారథి పేరు దారుకుడు. వేగంగా జరాసంధుడివైపు రథాన్ని పోనిచ్చాడు. ఈలోగా కృష్ణుడు పాంచజన్యాన్ని పూరించాడు. శత్రుసైనికుల గుండెలు దద్దరిల్లిపోయాయి.

ఇంతలో జరాసంధుడి సైన్యం యాదవసైన్యంపై విరుచుకుపడింది. బలరాముడు తన రోకలిని ధరిస్తే శ్రీకృష్ణుడు తన విల్లును అందుకున్నాడు. ఇద్దరూ శత్రుసైన్యాన్ని చీల్చి చెండాడారు. అంత సైన్యమూ చూస్తుండగానే నామరూపాలు లేకుండా అయిపోయింది. ఏదో యుద్ధం చేస్తున్నట్లు కాక ఆట ఆడు తున్నట్లుగా బలరామకృష్ణులు ఇంత పనీ చేశారు.

జరాసంధుడి రథం విరిగిపోయింది. గర్వం అణగిపోయింది. ఎలాగో ప్రాణాలు మాత్రం మిగిలాయి. బలరాముడు సింహంలా దూకి జరాసంధుణ్ణి పట్టుకోబోయాడు. కానీ శ్రీకృష్ణుడు –

'బలరామా!' ఇప్పుడే వద్దులే.. ఇతడివల్ల ఇంకా చాలామంది దుష్టుల్ని మనం వేటాడాలి. కొన్నాళ్ళు బతకనీ అన్నాడు.

బలరాముడు అతణ్ణి విడిచి పెట్టాడు. మథురలో యాదవుల విజయోత్సవం అంబరాన్నంటింది.

## కాలయవనుడు

పరీక్షిన్మహారాజా! కాలయవనుడు యాదవుల ఆగర్భశత్రువు. అయితే యాదవుల చేతిలో మరణం లేకుండా ఇతడికి వరం కూడా ఉంది. అది అదనపు సౌకర్యం. అదే అతడికి వెయ్యేనుగుల బలం కూడా.

గోరుచుట్టు మీద రోకలిపోటులా అసలే క్రూరుడూ, వరగర్వితుడూ, బలవంతుడూ అయిన కాలయవనుడికి నారదుడు బాగా నూరిపోశాడు. జరాసంధుణ్ణి శ్రీకృష్ణుడు ఓడించిన సంగతి చెప్పి అతణ్ణి ఓడిస్తేనే నువ్వు నిజమైన వీరుడివని రెచ్చగొట్టాడు. ఆ మాటలు ఊరికే పోతాయా! సత్వరం తన మూడు కోట్ల మ్లేచ్ఛ సైన్యంతో కాలయవనుడు మథురపై విరుచుకుపడేలా చేశాడు.

శ్రీకృష్ణుడు ఆలోచిస్తున్నాడు. మొన్న జరాసంధుడు, ఈ రోజు ఈ కాలయవనుడు. రేపు ఇంకొకడు. సరే! ఇప్పుడు ఈ కాలయవనుణ్ణి ఎదుర్కొనే సమయంలోనే పగతో రగలిపోతున్న జరాసంధుడు వచ్చి మథురపై దాడిచేస్తే, ఇద్దరినీ ఒకేసారి ఎదుర్కోవడం కష్టం.

ఈలోగా జరాసంధుడు అమాయకులైన ప్రజల్ని హింసించి పారేస్తాడు. దీనికి ఏదైనా ఉపాయం ఆలోచించాలి. ప్రజలు సురక్షితంగా ఉండేలా చూడాలి అనుకొని వెంటనే విశ్వకర్మను సముద్రంలో ఒక నగరాన్ని నిర్మించి ఇవ్వమని కోరాడు.

## ద్వారకా నగరం

విశ్వకర్మ దేవశిల్పి. సముద్రంలో పన్నెండు యోజనాల వైశాల్యంలో ఒక నగరాన్నీ, దాని చుట్టూ ఒక దుర్భేద్యమైన కోటనీ అద్భుతంగా నిర్మించి ఇచ్చాడు. దిక్పాలకులందరూ ఆ నగరానికి తమ తమ కానుకలను పంపారు. దానితో ద్వారక సర్వాంగసుందరంగా సకల సౌకర్యాలతో విలసిల్లింది.

శ్రీకృష్ణుడు తన యోగశక్తితో మథురాపుర ప్రజలందరినీ ద్వారకకు తరలించాడు. ఇప్పుడు నిశ్చింతగా చేతిలో ఏ ఆయుధమూ లేకుండా వచ్చి కాలయవనుడి ముందు నిలబడ్డాడు. కాలయవనుడు కూడా నిరాయుధుడిగానే పోరాడతానని ముందుకు వచ్చాడు. కానీ శ్రీకృష్ణుడు అతడికి దొరక్కుండా పరుగు

తీశాడు. వాడు వెంటపడ్డాడు. వాణ్ణి నానాతిప్పలూ పెట్టి చివరికి శ్రీకృష్ణుడు ఒక గుహలోకి వెళ్ళాడు. వాడూ వెళ్ళాడు.

గుహ లోపల గాఢనిద్రలో ఉన్న ఒక పురుషుడు కనిపించాడు కాలయవనుడికి. అతడు శ్రీకృష్ణుడే అనుకున్నాడు కాలయవనుడు. ఆ పురుషుణ్ణి కాలితో తన్నాడు. అంతే! నిద్ర మేల్కొన్న ఆ దివ్యపురుషుడు కన్ను తెరిచి చూడటం కాలయవనుడు భస్మమైపోవటం ఏకకాలంలోనే జరిగిపోయాయి.

మహారాజా! అతడే ముచుకుందుడు.

## ముచుకుందుడు

ఇక్ష్వాకు వంశంలో మాంధాత అనే ఒక గొప్ప చక్రవర్తి ఉండేవాడు. అతడి కొడుకే ఈ ముచుకుందుడు. ఈ మహారాజు దేవతల్ని రాక్షసుల బారి నుండి రక్షించిన మహానుభావుడు. అందుకు మెచ్చిన దేవతలు ఇతడిని వరం కోరుకోమంటే ముచుకుందుడు మోక్షాన్ని ప్రసాదించమని వేడుకొన్నాడు.

అప్పుడు దేవతలు 'మహావీరా! నువ్వు మమ్మల్ని రక్షించడం కోసం రాజ్యాన్ని, భార్యాపుత్రుల్నీ, బంధుమిత్రుల్నీ విడిచి చాలాకాలం ఇక్కడే ఉండిపోయావు. ఇప్పుడు భూమిపై నీ వాళ్ళెవరూ లేరు. అందరూ మరణించారు. ఇదేనయ్యా! కాలప్రభావం అంటే. ఎంతటివారైనా కాలం నుండి తప్పించుకోలేరు.

**కం. కాలము ప్రబలులకును బలి**
**కాలాత్ముం డీశ్వరుం డగణ్యుఁడు జనులం**
**గాలవశులుగాఁ జేయును**
**గాలము గడవంగలేరు ఘను లెవ్వారున్** (10-1-1644)

**మహాబలవంతులకంటే కూడా కాలం ఇంకా బలమైనది. కాలస్వరూపుడు భగవంతుడే! అతడే అగణ్యుడు. జనుల్ని కాలవశులుగా చేసే పరమాత్ముడూ ఆయనే. కాబట్టి ఎంతటి ఘనులైనా కాలాన్ని అధిగమించలేరు. నువ్వు కోరిన మోక్షాన్ని ప్రసాదించగలవాడు భగవంతుడైన ఆ శ్రీహరి ఒక్కడే. అదికాక మరేదైనా వరం కోరుకో అన్నారు.**

అప్పుడు ముచుకుందుడు నిద్రను ప్రసాదించమన్నాడు. దేవతలు అనుగ్రహించారు. అప్పటి నుండీ ఇదుగో ఇలా ఈ గుహలో నిద్రలో ఉంటున్నాడు. ఇప్పుడు కాలయవనుడి వల్ల మేల్కొన్నాడు. కాలయవనుడు భస్మమైపోయిన తరువాత ముచుకుందుడి ముందు ముకుందుడు సాక్షాత్కరించాడు.

తన ముందు సాక్షాత్కరించిన శ్రీమన్నారాయణుడి ఉజ్జ్వలమైన రూపాన్ని చూడలేకపోయాడు ముచుకుందుడు.

'స్వామీ! నువ్వెవరు! నీకు సేవచేయాలని ఉంది' అన్నాడు.

అప్పుడు ముకుందుడు మేఘధ్వనిలాంటి కంఠంతో 'రాజేంద్రా! భూమిపై ఉండే ధూళికణాల్నయినా లెక్కించవచ్చుగానీ నా గుణగణాల్ని ఎన్నడం సాధ్యం కాదు. ధర్మసంస్థాపన కోసం యాదవ కులంలో నందుడికి నందనుణ్ణై జన్మించాను. దుష్టుల్ని వెతికి వెతికి సంహరిస్తున్నాను. పూర్వం నువ్వు నన్ను ఆరాధించావు. అందుకే నీ కోసమే నేను ఈ గుహకు వచ్చాను. నీకేం కావాలో కోరుకో! **నా భక్తులకు ఏ కష్టమూ రానివ్వను. ఇది నావ్రతం'** అన్నాడు.

అప్పుడు ముచుకుందుడు పుండరీకాక్షుడే ఇతడని తెలుసుకొని ఆనందాశ్చర్యాలతో ప్రభూ! పరంధామా! నాకు నీ పాద సేవ తప్ప ఏమీ అక్కర్లేదు. నన్ను అనుగ్రహించు అని వేడుకొన్నాడు. అప్పుడు శ్రీహరి 'రాజా! నువ్వు క్షత్రియుడివి కాబట్టి పూర్వం వేటాడి మరీ ఎంతో జీవహింస చేశావు. కాబట్టి తపస్సు చేసి ఆ పాపాన్ని బాపుకో ముందు. తరువాత జన్మలో బ్రాహ్మణుడవై పుట్టి అన్ని ప్రాణుల్నీ ప్రేమించి నన్ను చేరుకుంటావు' అని చెప్పి వెళ్ళిపోయాడు. తరువాత ముచుకుందుడు నరనాయణులకు నెలవైన బదరికాశ్రమానికి వెళ్ళి అచ్యుతుడిని ఆరాధించసాగాడు.

## ప్రవర్షణ పర్వతం

మధురకు తిరిగివచ్చిన శ్రీకృష్ణుడు తరువాత తన నగరాన్ని ముట్టడించిన యవనుల్నీ అంతం చేశాడు. మ్లేచ్ఛులనూ నాశనం చేశాడు.

ఇంతలో జరాసంధుడు మళ్ళీ దండెత్తి వచ్చాడు. అప్పుడు శ్రీకృష్ణబలరాములు అతడితో యుద్ధం చేయలేదు. సామాన్య మానవుల్లాగా భయపడిపోయిన వారివలె

అడవుల్లోకి పారిపోయారు. వాళ్ళను చూసి జరాసంధుడు ఎగతాళి చేస్తూ వెంబడించాడు. బలరామకృష్ణులు ఆగలేదు. వెళ్లి వెళ్లి 'ప్రవర్షణం' అని పేరుగల ఒక పర్వతంపైకి ఎక్కారు.

జరాసంధుడు సైన్యంతో ఆ పర్వతాన్ని ముట్టడించాడు. అంతేనా! కొండకు నిప్పుపెట్టించాడు.

ఎటు చూసినా భగభగమని మంటలు. ఆ మంటల్లో ఆ పర్వతం కాలి, బూడిదైపోతోంది. గుహలు, కొండచరియలు, శిఖరాలు, వాటిపై ఉన్న చెట్లు ఇలా ఒకటేమిటి అన్నీ అగ్నిమయం. కొండను కాల్చివేస్తున్న ఆ అగ్ని ఒక మహావృక్షంలా ఉంది.

బలరామకృష్ణులు ఆ మంటల్లో బూడిదైపోయి ఉంటారని భావించాడు జరాసంధుడు. కానీ బలరామకృష్ణులు చాకచక్యంగా శత్రువుల కళ్ళుగప్పి ద్వారకా నగరానికి చేరుకున్నారు.

## రుక్మిణీకళ్యాణం

**కం. భూషణములు సెవులకు బుధ**
**తోషణము లనేక జన్మ దురితౌఘ విని**
**శ్శోషణములు మంగళతర**
**ఘోషణములు గరుడగమను గుణభాషణముల్** (10–1–1685)

**శ్రీహరి గురించిన మాటలు – చెవులకు భూషణాలు – అలంకారాలు. పండితులకు సంతోషదాయకాలు. అనేక జన్మల పాపాలకు శోషణాలు – అంటే ఇంకింపజేసేవి. అంతేకాదు, మంగళవాద్యాల్లాగా శుభాన్ని కలిగిస్తాయి.**

రాజా! విను. విదర్భ దేశానికి రాజధాని కుండినపురం. దానికి ప్రభువు భీష్మకుడు. అతడు వీరుడు, శూరుడు. అతడికి ఐదుగురు కుమారులు. వారిలో పెద్దవాడు రుక్మి. ఒకే ఒక్క కూతురు. ఆమె పేరే రుక్మిణి.

రుక్మిణి పుట్టిన నాటినుండీ రాజు ఇంట్లో లక్ష్మీకళ తాండవించింది. అది ఆమెతోపాటే పెరుగుతూ వచ్చింది.

శ్రీహరి లీలలే కాదు, లక్ష్మీలీలలూ విచిత్రమైనవే. ఆ బాలామణి పేర్లుపెట్టి మరీ బొమ్మలకు పెళ్ళిళ్ళు చేస్తుంది. పప్పుబియ్యాలు గిన్నెల్లో పోసి గుజ్జనగూళ్ళు వండి వడ్డిస్తుంది. ఉద్యానవనాల్ని పెంచి పోషిస్తుంది. మణిభవనాలలో తూగుటుయ్యాల లూగుతోంది.

తన ఈడు పిల్లల్తో బంతులాట ఆడుతుంది. గోరువంకలకూ చిలుకలకూ మాటలూ నేర్పుతుంది. నెమళ్లకు నాట్యాలు, హంసలకు నడకలు నేర్పుతుంది. అలా విలసిల్లుతూ ఉన్న ఆమె మనస్సులో మాధవుణ్ణి పెళ్ళాడాలన్న కోరిక కొనలు సాగింది. దానిలాగే సన్నగా నాజూకు తీగలా పెరుగుతోంది రుక్మిణి. క్రమంగా ఆమె ఎలజవ్వనంలోనికి ప్రవేశించింది.

రుక్మి, రుక్మరథ, రుక్మబాహు, రుక్మకేశ, రుక్మనేత్రులనే అయిదుగురికీ ఈమె ఒక్కతే గారాబు చెల్లి. ఆమె ఆ నోటా ఈ నోటా శ్రీకృష్ణుడి గురించి వింటోంది. క్రమంగా అతడిపై ఉన్న వలపు అంతకంతకూ పెరుగుతున్నదే కానీ తగ్గటం లేదు.

శ్రీకృష్ణుడూ అంతే. రుక్మిణి గురించి విన్నాడు. ఎలాగైనా సరే, ఆమెను తన ఇల్లాలిని చేసుకోవాలని నిశ్చయించుకున్నాడు.

వీళ్ళే కాదు, బంధువర్గమంతా వీళ్ళిద్దరికీ పెళ్ళిచేస్తే బావుంటుందనే ఆలోచనలో ఉన్నారు. కానీ రుక్మి ఆలోచన వేరేరకంగా ఉంది. వాడు దుష్టులతో స్నేహం చేసి శ్రీకృష్ణుడిపై విరోధాన్ని పెంచుకొన్నాడు. అందుకే తన చెల్లిని చేది దేశాధిపతి అయిన శిశుపాలుడికి ఇచ్చి పెళ్ళిచేయాలనుకున్నాడు.

## అగ్నిద్యోతనుడి రాయబారం

రుక్మిణికి తన అన్న రుక్మి దురాలోచన అర్థమయింది. దుర్మార్గుడైన తన అన్న మాటను తన తండ్రి ఎదిరించి నిలవలేడు. తాను ఏదో ఒకటి చేయకపోతే వాడు అన్నంత పనీ చేస్తాడు. తనను ఆ శిశుపాలుడికి కట్టబెడతాడు. అందుకే తనే కొంత చొరవ తీసుకుంది. తనకు అత్యంత ఇష్టుడూ ఆంతరంగికుడూ అయిన 'అగ్నిద్యోతనుడు' అనే బ్రాహ్మణుణ్ణి పిలిచింది. శ్రీకృష్ణుడి వద్దకు అతణ్ణి పంపాలన్నది ఆమె ఆలోచన.

'ఓ బ్రాహ్మణోత్తమా! నువ్వు తక్షణం శ్రీకృష్ణుడి వద్దకు వెళ్ళు. నాకు ఇష్టం లేని పెళ్ళి చేసి నా అన్న రుక్మి నా గొంతు కోయబోతున్నాడని చెప్పు. నేను ఆ మాధవుణ్ణి తప్ప అన్యుల్ని వివాహమాడనని తేల్చి చెప్పు' అంటూ మరికొన్ని రహస్యాలు చెప్పింది.

అన్నీ విన్న అగ్నిద్యోతనుడు మెరుపు వేగంతో వెళ్ళి శ్రీకృష్ణుడి ముందు వాలాడు.

బంగారు గద్దెపై సింగారాలతో అందంగా ఉన్న శ్రీకృష్ణుణ్ణి చూడగానే అగ్నిద్యోతనుడు 'పెళ్ళికొడుకువు కా' అని పురుషోత్తముణ్ణి ఆశీర్వదించాడు. శ్రీకృష్ణుడి ముఖంలో ముసిముసి నవ్వులు. ఆ బ్రాహ్మణుణ్ణి సాదరంగా ఆహ్వానించి అర్చించాడు.

అగ్నిద్యోతనుడు రుక్మిణీదేవి సందేశాన్ని ఆమె మాటల్లోనే ఇలా విన్నవించాడు–

'ఓ మంగళమూర్తీ! పురుష సింహమా! సింహానికి చెందిన సొత్తును నక్క అపహరించాలని చూసినట్లుగా మదోన్మత్తుడైన శిశుపాలుడు– నిన్నే ఆరాధిస్తున్న నన్ను సొంతం చేసుకోవాలనుకొంటున్నాడు. ఆ నీచశిశుపాలుడికి నీ అద్భుతమైన ప్రతాపం తెలియదు కాబోలు. మరోమాట! నేను పూర్వం నిన్నే పతిగా పొందాలని ఏమైనా నోములు నోచి ఉంటే, దేవబ్రాహ్మణులకు సేవలు చేసి ఉంటే, దానధర్మాలు చేసి ఉంటే నువ్వే నా ప్రాణనాథుడివి అవుతావు. శిశుపాలుడూ మొదలైనవాళ్ళందరూ యుద్ధంలో నీముందు నిలవలేక తోకముడుస్తారు. కాబట్టి –

**ఉ. అంకిలి సెప్పలేదు, చతురంగ బలంబులతోడ నెల్లి యో**
**పంకజనాభ! నీవు శిశుపాలజరాసుతులన్ జయించి నా**
**వంకకు వచ్చి రాక్షస వివాహమునన్ భవదీయ శౌర్యమే**
**యుంకువ సేసి కృష్ణ! పురుషోత్తమ! చేకొని పొమ్ము వచ్చెదన్**

(10–1–1708)

శ్రీకృష్ణా! పురుషోత్తమా! నీలాంటి వీరుడికి ఇక్కడ ఏ ఆటంకమూ చెప్పడానికైనా లేదు. రేపే తరలిరా! చతురంగ బలంతో రా! ఓ పంకజ నాభా! అలా వచ్చి ఈ శిశుపాలుడు, జరాసంధుడు మొదలైనవాళ్ళను గెలిచి, నా దగ్గరకు వచ్చి నీ శౌర్యాన్నే కన్యాశుల్కంగా పెట్టి రాక్షస వివాహ పద్ధతిలో నన్ను చేపట్టు.

నేను రావడానికి సిద్ధంగా ఉన్నాను. ఈ పని సులభమయ్యే మరో ఉపాయం చెబుతాను. నేనే మంగళగౌరిని అర్చించడానికి ఊరి వెలుపల ఉన్న ఆలయానికి వస్తాను. అదే మంచి సమయం. వచ్చి నన్ను నిరాటంకంగా తీసుకు వెళ్ళు. నన్ను అనుగ్రహించు. అనుగ్రహించలేదో నీ అనుగ్రహానికి అర్హత సాధించటం కోసం వంద జన్మలకైనా బ్రహ్మచర్యవ్రతాన్ని ఆచరిస్తాను. నీ కోసమే ధ్యానం చేస్తూ నా ప్రాణాలు నీకే అర్పిస్తాను. ఇదే నా తుది నిర్ణయం.

ప్రాణనాథా! నీ తీయటి మాటలు వినని చెవులూ, నీకు సమర్పించని తనువూ, నిన్ను చూడని కళ్ళూ, నీ అధరామృతాన్ని ఆస్వాదించని నాలుక, నీ వనమాలికా గంధాన్ని పొందలేని నాసిక, నీకు దాస్యం చేయని జన్మ ఎందుకు? ఎన్ని జన్మలకైనా నాకు నువ్వే కావాలి.'

అగ్నిద్యోతనుడు రుక్మిణీదేవి సందేశాన్ని యథాతథంగా వినిపించాడు. ఆమె రూప గుణ లావణ్యాలూ వర్ణించి 'ప్రభూ! ఇప్పుడు కర్తవ్యం దేవరవారే ఆలోచించాలి. చివరిగా నాదో మాట.

శ్రీకృష్ణా! ఆ రుక్మిణికి నువ్వూ నీకు ఆ రుక్మిణీ తగినవారు. ఈడూ జోడు. మా గురువుల మీద ఒట్టు. మీ ఇద్దరికీ వివాహం జరుగుతుంది. ఇంక ఆలస్యం ఎందుకు? నువ్వు నీ వాళ్ళతో కలసి బయలుదేరు. ఈ పద్మముఖిని వెంట తెచ్చుకో! శత్రువుల్ని నుగ్గునుగ్గు చేసి లోకానికి మేలు చేకూర్చు' అన్నాడు.

## శ్రీకృష్ణుడి రాక

శ్రీకృష్ణుడు అగ్నిద్యోతనుడి చేతిని ఆదరంగా పట్టుకొని 'బ్రాహ్మణోత్తమా!

**కం.** **వచ్చెద విదర్భభూమికిఁ**
**జొచ్చెద భీష్మకుని పురము, సురుచిరలీలన్**
**దెచ్చెద బాలన్ వ్రేల్మిడి**
**వ్రచ్చెద నడ్డంబు రిపులు వచ్చినఁ బోరన్.** (10-1717)

వస్తాను ఆ విదర్భ దేశానికి. అలవోకగా కుండినపురంలోనికీ చొచ్చుకొని వస్తాను. రుక్మిణిని తెచ్చుకొంటాను. అడ్డం వచ్చిన శత్రువుల్ని రణరంగంలో హతమారుస్తాను అని మాట ఇచ్చాడు.

పరీక్షిన్మహారాజా! తరువాత శ్రీకృష్ణుడు అగ్నిద్యోతనుడి ద్వారానే వివాహ నక్షత్రం తెలుసుకొని బయలుదేరాడు. దారుకుడు శైబ్యం, సుగ్రీవం, మేఘపుష్పం, వలాహకం అనే గుర్రాలను పూన్చిన రథాన్ని సిద్ధం చేశాడు. ఆ రథంపై అగ్ని ద్యోతనుడితో కలిసి విదర్భకు వస్తున్నాడు శ్రీకృష్ణుడు.

అక్కడ రుక్మి దురాలోచనతో రుక్మిణికి శిశుపాలుడితో పెళ్ళి ఏర్పాట్లు చేస్తున్నాడు. తండ్రి భీష్మకుడికి ఒప్పుకోక తప్పలేదు. నగరానికి పెళ్ళి కళ ఉట్టిపడేలా అలంకారాలు చేస్తున్నారు. శాస్త్రప్రకారం పూజలు, దానధర్మాలు సాగుతున్నాయి.

శిశుపాలుడు అట్టహాసంగా బంధుమిత్రులతో రాజపరివారంతో కలిసి కుండిన నగరానికి చేరుకున్నాడు. ఎక్కడెక్కడి నుంచో రాజులూ విచ్చేశారు.

శ్రీకృష్ణుడు విదర్భదేశానికి వెళ్ళాడన్న వార్త బలరాముడికి తెలిసింది. తానూ వెనకే సైన్యంతో బయలుదేరాడు.

## రుక్మిణి ఆందోళన

ఒక ప్రక్క పెళ్ళి ఏర్పాట్లు చకచకా జరుగుతుంటే మరోప్రక్క రుక్మిణీదేవికి లోపల ఆందోళన. ఏం జరుగుతుందో! శ్రీకృష్ణుడు వస్తాడో రాడో! రాకపోతే ఆ మాట తలచుకోవడానికి కూడా ఆమెకు ధైర్యం చాలడంలేదు.

రేపే ముహూర్తం. ఇంకా రాలేదేమిటీ గోవిందుడు! అసలు ఆ వార్త అతడికి అందిందో లేదో! ఈ అగ్నిద్యోతను డేం చేస్తున్నాడు! ఏమైపోయాడు! ఇంత ఆలస్యమా! నా ప్రయత్నం ఫలిస్తుందో లేదో! దైవనిర్ణయం ఎలా ఉందో!

అసలీ బ్రాహ్మణుడు వెళ్ళాడా! దారిలో అలసిపోయి ఎక్కడైనా కునుకు తీస్తున్నాడా.. నా సందేశం విని శ్రీకృష్ణుడు తప్పుగా భావించాడా! ఈ పాటికే వచ్చి ఉంటాడా! పరమశివుడు ఈ పనికి అనుకూలిస్తాడా? పార్వతీదేవి నన్ను కాపాడుతుందో లేదో! ఏమో! నా అదృష్టం ఎలా ఉందో అని ఆందోళనకు గురయ్యింది.

ఇంతటి దుర్భర స్థితిలో ఉన్న ఆమెకు కొన్ని శుభ శకునాలు తోచాయి. ఎడమ కన్ను, ఎడమ భుజం అదిరాయి.

ఈమె పుణ్యమే వచ్చిందా అన్నట్లు అగ్నిద్యోతనుడు వచ్చాడు. అతణ్ణి చూసిన రుక్మిణి చెంగున దూకి ఎదురు వెళ్ళింది. ఆలస్యం చేయకుండా ఆ బ్రాహ్మణుడు

'మెచ్చాడమ్మా! నిన్ను. తనే స్వయంగా వచ్చాడమ్మా!' అన్న కమ్మని వార్తను ఆమె చెవిలో వేశాడు. రుక్మిణి ఆనందానికి అవధుల్లేవు.

'బ్రాహ్మణోత్తమా! బతికించావయ్యా! నా ప్రాణనాథుణ్ణి తెచ్చి నా ప్రాణాలు నిలబెట్టావు. ఏమిచ్చి నీ ఋణం తీర్చుకోను? నమస్కరించటం ఒక్కటి తప్ప' అని అంజలి ఘటించింది.

బలరామకృష్ణులు తన కుమార్తె స్వయంవరానికి వచ్చారని విన్న భీష్మక మహారాజు వాళ్ళను స్వాగతించి సత్కరించాడు. శ్రీకృష్ణుణ్ణి చూసిన వాళ్ళంతా ముక్తకంఠంతో–

వీళ్ళిద్దరూ ఒకరికి ఒకరు తగినవారు. చక్కని ఈడూ జోడు. వీళ్ళిద్దరికీ రాసి పెట్టిన బ్రహ్మ ఎంత నేర్పుగాడో కదా! ఆహా! ఈ చక్రి శత్రువుల్ని చీల్చి చెండాడి మా రుక్మిణమ్మను చేపడతాడు. ఇది మా పుణ్యఫలం అని అనుకొంటున్నారు.

రుక్మిణి అమ్మవారి ఆలయానికి బయలుదేరింది. చుట్టూ పరివారం. సైన్యం కాపలాగా వచ్చింది. రుక్మిణి అమ్మవారిని సేవించి–

**ఉ. నమ్మితి నా మనంబున సనాతనులైన యుమామహేశులన్**
**మిమ్ముఁ బురాణదంపతుల మేలు భజింతు గదమ్మ! మేటిపె**
**ద్దమ్మ దయాంబురాశివిగదమ్మ! హరింబతిసేయుమమ్మ! నిన్**
**నమ్మినవారి కెన్నఁడును నాశములేదు గదమ్మ! యీశ్వరీ** (10–1–1744)

అమ్మా! ఈశ్వరీ! పరమేశ్వరా! సనాతనులైన మిమ్మల్నే నమ్ముకున్నాను. మీరు పురాణదంపతులు అమ్మా! పార్వతీ! నువ్వు చాలా గొప్పదానివి. దయా సముద్రవు. హరిని నాకు భర్తను చెయ్యవమ్మా! నిన్ను నమ్మినవారికి ఎప్పటికీ నాశనంలేదు కదూ! అని ప్రార్థించి – బ్రాహ్మణ ముత్తైదువులకు తాంబూలాలు ఇచ్చింది. ముకుందుడు ఎప్పుడు వస్తాడా! అని అడుగడుగుకూ నిరీక్షిస్తూ కాలినడకన తిరిగి వస్తోంది.

చంద్రమండలంలాంటి ముఖమూ, సింహంలాంటి నడుమూ, పద్మనేత్రాలూ, అందమైన వక్షఃస్థలం, మేఘంలా ప్రకాశించే నల్లని శరీరం, ఐరావతం తొండంలాంటి బాహువులు, పీతాంబరం, చక్రాయుధం, వివిధ ఆభరణాలు, శంఖంలాంటి కంఠమూ కల శ్రీకృష్ణుణ్ణి చూసింది.

## శ్రీకృష్ణుడి విజయం

రుక్మిణి మనసు పులకించింది. ఎప్పుడెప్పుడు శ్రీకృష్ణుడి రథమెక్కుతానా అని తహతహలాడింది. ఆమె నిరీక్షణ ఫలించింది. నక్కల మధ్యలో ఉన్న ఆహారాన్ని సింహం ఎగరేసుకుపోయినట్లు అందరూ చూస్తుండగా శ్రీకృష్ణుడు రుక్మిణీదేవిని తన రథంపై ఎక్కించుకొన్నాడు. భూమ్యాకాశాలు దద్దరిల్లేలా పాంచజన్యం పూరించాడు. శత్రువులందరూ అడ్డగించారు. అది చూసి రుక్మిణీదేవి బెదిరి పోయింది. ఆమెకు ధైర్యం చెప్పి రథాన్ని వేగంగా నడిపించాడు శ్రీకృష్ణుడు.

యాదవ సైన్యం శత్రుసైన్యంతో తలబడింది. ఘోర భీకర యుద్ధం. యాదవుల ధాటికి శత్రువులు చెల్లాచెదురైపోయారు. జరాసంధాదులూ పలాయనం చిత్తగించారు. అది చూసి శిశుపాలుడు బిక్కమొహం వేశాడు. తక్కిన రాజులు అతణ్ణి ఓదార్చారు.

'శిశుపాలా! ఎలాగో బతికి బయటపడ్డావు. బతికుంటే బలుసాకు తిని బతకవచ్చు. ప్రాణం ఉంటే భార్య దొరక్కపోదు. పెళ్ళాం మాట దేవుడెరుగు. ముందు నువ్వు బతికావు. అదే పదివేలు. బాధపడవద్దు. **అన్నీ అనుకున్నట్లే జరగవు. మనమంతా ఈశ్వరుడి చేతిలో కీలుబొమ్మలం. అంతా దైవసంకల్పం. సుఖదుఃఖాలు శాశ్వతం అనుకోకు.'**

జరాసంధుడూ ఓదార్చాడు. 'శిశుపాలా! నేనెన్నిసార్లు (18 సార్లు) శ్రీకృష్ణుడి పైకి యుద్ధానికి వెళ్ళాను? కానీ గెలిచింది మాత్రం ఒక్కసారే! మన చేతుల్లో ఏమీ లేదు. **జయాపజయాలు దైవాధీనాలు.** ఈరోజు వాళ్ళది. మనకీ ఓ రోజు వస్తుంది. అప్పటిదాకా ఓపిక పట్టాలి' అన్నాడు.

వీళ్లందరూ సరే! శ్రీకృష్ణుడు చేసిన పనిని రుక్మి జీర్ణించుకోలేకపోయాడు. వెంటపడి శ్రీకృష్ణుణ్ణి అడ్డగించాడు. కృష్ణుడు రుక్మిని యుద్ధంలో అవలీలగా ఓడించాడు. చంపేద్దామని కత్తి పైకి ఎత్తాడు. రుక్మిణి శ్రీకృష్ణుడి పాదాలపై పడింది. తన అన్నకు

ప్రాణభిక్ష పెట్టమని అభ్యర్థించింది. శ్రీకృష్ణుడు కనికరించాడు. కానీ తగిన శాస్తి చెయ్యాలనుకున్నాడు. రుక్మిని రథచక్రానికి కట్టేసి, జుట్టూ, మీసాలు, గెడ్డాలు గొరికి విరూపిని చేశాడు.

ఇంతలో బలభద్రుడు యాదవ సైన్యంతో అక్కడికి వచ్చి రుక్మి సైన్యాన్ని తరిమికొట్టాడు.

శ్రీకృష్ణుణ్ణి ఓడించకపోతే ఈ నగరానికి రానని బీరాలు పలికాడు రుక్మి. అందుకే ఆ మాట నిలబెట్టుకోవడం కోసం నగరానికి వెళ్లలేదు. తరువాత భోజకటకం అనే పేరుతో ఒక నగరాన్ని నిర్మించుకొని అక్కడే ఉండిపోయాడు.

బలరామకృష్ణులు రుక్మిణితో సహా ద్వారకా నగరానికి చేరుకున్నారు.

మహర్షులారా! పరమ భాగవతోత్తముడైన పరీక్షిన్మహారాజు కోరికపై శుక మహర్షి భాగవత కథలను వీనులవిందుగా ఇలా వినిపిస్తున్నాడు–

## ప్రద్యుమ్న కుమార చరిత్ర

పరీక్షిన్మహారాజా! పరమేశ్వరుడి కంటిమంటలకు దగ్ధం అయిన మన్మథుడే ప్రద్యుమ్నుడు అనే పేరుతో రుక్మిణీశ్రీకృష్ణులకు విష్ణుమూర్తి అపరావతారమేమో అనిపించే విధంగా ఉద్భవించాడు.

శంబరాసురుడు అనే రాక్షసుడు ఒకడున్నాడు. వీడు ఈ ప్రద్యుమ్నుడు తనకు శత్రువని తెలిసి ఆ శిశువును అపహరించి సముద్రంలో విసిరేశాడు. ఆ శిశువును ఒక పెద్ద చేప మింగింది. జాలరివాళ్ళు వలవేయగా ఈ చేప వలలో చిక్కింది. అంత పెద్ద చేపను తీసుకువెళ్ళి జాలరులు శంబరాసురుడికే కానుకగా సమర్పించారు.

దైవలీలలు ఇలాగే ఉంటాయి. వంటవాళ్ళు ఆ చేపను కోసి దాని పొట్టలోంచి ఈ బాలుణ్ణి బయటకు తీశారు. వాళ్లలో మాయావతి అనే ఒక చెలికత్తె ఉంది. ఆమె ఎవరో కాదు. రతిదేవి. సాక్షాత్తూ మన్మథుడి భార్య. మన్మథుడు మళ్ళీ ఇలా పుడతాడని నారదుడు ఆమెకు ముందే చెప్పాడు. అందుకే ఇక్కడ నిరీక్షిస్తోంది. వంటవాళ్ళు తెచ్చి, ఆ శిశువును మాయావతికి ఇచ్చారు. ఆమె ప్రేమగా పెంచి పెద్ద చేసింది.

ప్రద్యుమ్నుడు యౌవనంలోనికి అడుగుపెట్టాడు. అతణ్ణి చూసి స్త్రీలు చూపులు తిప్పుకోలేకపోయేవాళ్ళు. మాయావతిదీ అదే పరిస్థితి. ఆమె వాలకం చూసి ఒక రోజు ప్రద్యుమ్నుడు 'తల్లివైన నీకు ఏమిటీ వింత ప్రవర్తన' అని నిలదీశాడు.

అప్పుడామె అసలు విషయం చెప్పింది. అంతేకాదు, 'శంబరాసురుణ్ణి నువ్వే సంహరించాలి. వాడు మాయల మరాఠీ. అందుక్కావలసిన మాయల్ని నేను నీకు నేర్పుతాను' అని అన్నీ నేర్పింది.

ప్రద్యుమ్నుడు శంబరాసురుణ్ణి యుద్ధానికి పిలిచాడు. అప్పుడా రాక్షసుడు ఎన్నో మాయలు పన్నాడు. యక్ష, గాంధర్వ, పైశాచ, సర్ప, రాక్షస మాయలన్నింటినీ ఛేదించి శంబరాసురుడి తలను ప్రద్యుమ్నుడు తెగనరికాడు.

అప్పుడు మాయావతి ఆకాశమార్గంలో ప్రద్యుమ్నుణ్ణి ద్వారకకు తీసుకు వెళ్ళింది. ప్రద్యుమ్నుడు అంతఃపురంలోనికి ప్రవేశించగానే అచ్చం శ్రీకృష్ణుడిలా ఉన్న అతణ్ణి చూసి అంతా ఆశ్చర్యపోయారు. రుక్మిణి కూడా తన కుమారుడే గనక జీవించి ఉంటే అచ్చం ఇలాగే ఉండేవాడని భావించింది. ఇంతలో దేవకీ వసుదేవులూ శ్రీకృష్ణుడూ అక్కడికి వచ్చారు. అదే సమయానికి నారద మహర్షి వచ్చి జరిగిన వృత్తాంతమంతా చెప్పడంతో ప్రద్యుమ్నుడు రుక్మిణీ శ్రీకృష్ణుల కొడుకేనన్న విషయం అందరికీ తెలిసింది. ఆనందం వెల్లివిరిసింది.

## శమంతకమణి

పరీక్షిన్మహారాజా! నీకు మరో వృత్తాంతం చెబుతాను విను. సత్రాజిత్తు అనే ఒక రాజు ఉండేవాడు. ఇతడు 'నిమ్నుడు' అనే యాదవ చక్రవర్తికి కుమారుడు. ఇతడు సూర్యభక్తుడు. సూర్యుడు సత్రాజిత్తుకు 'శమంతకం' అనే ఒక మణిని ఇచ్చాడు. ఆ మణి మహిమాన్వితమైనది. రోజూ ఎనిమిది బారువుల బంగారాన్ని ప్రసాదిస్తుంది. ఆ మణిని భద్రంగా పూజామందిరంలో ఉంచి పూజిస్తున్నాడు సత్రాజిత్తు.

అంత గొప్ప మణి ఉగ్రసేన మహారాజువద్ద ఉంటే మంచిదనీ, యాదవ సామ్రాజ్యం మొత్తం సుఖశాంతులతో వర్ధిల్లుతుందనీ దానిని రాజుగారికి ఇవ్వమనీ శ్రీకృష్ణుడు అడిగాడు. సత్రాజిత్తు ఇవ్వనన్నాడు.

రోజులు గడుస్తున్నాయి. ఒకరోజు సత్రాజిత్తు తమ్ముడు ప్రసేనజిత్తు ఆ మణిని కంఠంలో అలంకరించుకొని అడవికి వేటకు వెళ్ళాడు. అక్కడ ఒక సింహం అతణ్ణి చంపి ఆ మణిని తీసుకుపోయింది. ఆ సింహాన్ని భల్లూకరాజైన జాంబవంతుడు చూశాడు. దాన్ని చంపి ఆ మణిని తీసుకొని వెళ్ళి తన కుమారుడికి ఆటవస్తువుగా ఇచ్చాడు.

అడవికి వెళ్ళిన ప్రసేనజిత్తు ఎంతకీ తిరిగి రాలేదు. శ్రీకృష్ణుడే ఆ మణికోసం తన తమ్ముణ్ణి చంపి ఉంటాడని ప్రచారం చేశాడు సత్రాజిత్తు.

తనమీద పడిన ఈ అపనిందను తొలగించుకోవడం కోసం శ్రీకృష్ణుడు కొందరు పౌరుల్ని సాక్షులుగా తీసుకొని అడవికి వెళ్ళాడు. కొంత దూరం వెళ్ళాక చచ్చి పడి ఉన్న ప్రసేనజిత్తు కనిపించాడు. మణి అతడి దగ్గర లేదు. అక్కడ సింహం కాలి ముద్రలున్నాయి. వాటిని అనుసరించి ముందుకు వెళ్ళారు. అక్కడ ఒకచోట సింహం చచ్చిపడి ఉంది. అక్కడ నుంచి ఎలుగుబంటి కాలి ముద్రలు కనిపించాయి. అవి పట్టుకొని వెళ్తే కొంత దూరంలో ఒక గుహ కనిపించింది. లోపలికి ప్రవేశించిన శ్రీకృష్ణుడు అక్కడ శమంతకమణితో ఆడుకుంటున్న ఒక పిల్లవాణ్ణి చూశాడు. ఆ పిల్లవాడు ఎవరో కాదు, భల్లూకరాజైన జాంబవంతుడి కుమారుడు.

హఠాత్తుగా జాంబవంతుడు వచ్చి శ్రీకృష్ణుడి మీద పడ్డాడు. యుద్ధం హోరాహోరీగా సాగింది. ఇరవై ఎనిమిది రోజులు అలా యుద్ధం చేస్తూనే ఉన్నారు. ఎవరూ తగ్గటం లేదు. చివరికి జాంబవంతుడు అలసిపోయాడు. శ్రీకృష్ణుడు పైచేయి సాధించాడు. అప్పుడర్థమయింది జాంబవంతుడికి అతడు సాక్షాత్తూ శ్రీమహావిష్ణువేనని. భక్తితో నమస్కరించి స్తుతించాడు.

యుద్ధం చేసి ఒళ్ళు హూనం చేసుకొన్న జాంబవంతుణ్ణి శ్రీకృష్ణుడు ఆప్యాయంగా నిమిరాడు. అతడికి పోయిన శక్తి తిరిగి వచ్చింది. శ్రీకృష్ణుడూ తనపై వచ్చిన అపవాదు గురించి చెప్పాడు. వెంటనే జాంబవంతుడు ఆనందంగా ఆ మణినీ, తన పుత్రికామణి జాంబవతినీ శ్రీకృష్ణుడికి సమర్పించాడు.

శ్రీకృష్ణుడు గుహలోనికి వెళ్ళినప్పుడు పౌరులంతా గుహ బైటే ఉండి అతడు క్షేమంగా తిరిగి రావాలని దుర్గాదేవిని పూజించారు. దుర్గాదేవి అనుగ్రహించింది.

శ్రీకృష్ణుడు క్షేమంగా మణితోనూ, కన్యామణితోనూ వస్తాడని చెప్పింది. అలాగే వచ్చాడు శ్రీకృష్ణుడు. పౌరులు ఆనందించారు.

ద్వారకకు తిరిగి వచ్చాడు శ్రీకృష్ణుడు. జాంబవతీదేవిని పరిగ్రహించి, సత్రాజిత్తును సభకు రప్పించి ఆ మణిని అప్పగించాడు. సత్రాజిత్తు అనవసరంగా శ్రీకృష్ణుడిపై అభాండాలు వేసినందుకు పశ్చాత్తాపపడ్డాడు.

మణితోపాటు తన పుత్రికామణిని కూడా అతడికే ఇచ్చి కొంతైనా పాప పరిహారం చేసుకోవాలనుకొన్నాడు. అప్పుడు శ్రీకృష్ణుడు–

ఈ మణిని సూర్యుడు నీ కోసం ఇచ్చాడు. మాకు మణులకు ఏ కొదవ లేదు. నాకు నీ కన్యామణి చాలు' అంటూ సత్రాజిత్తుకే మణిని తిరిగి ఇచ్చేశాడు.

ఇదిలా ఉండగా పాండవులు కుంతీదేవితోసహా లక్క ఇంట్లో కాలిపోయి మరణించారన్న వర్తమానం అందింది. వెంటనే శ్రీకృష్ణుడు బలరాముడితో పాటు హస్తినకు వెళ్ళి కృప, విదుర, గాంధారీ, భీష్మ, ద్రోణాదుల్ని పరామర్శించాడు.

ఈలోగా ఇక్కడో దారుణం జరిగిపోయింది. శతధన్వుడనేవాడు సత్రాజిత్తును చంపి శమంతకమణిని అపహరించాడు. దీనికో కారణం ఉంది.

సత్రాజిత్తు తన కుమార్తె సత్యభామను శ్రీకృష్ణుడికి ఇచ్చి పెళ్ళిచేయటం కొంతమందికి కంటగింపు అయింది. వారిలో అక్రూరుడు, కృతవర్మ, శతధన్వుడూ ఉన్నారు. అక్రూరుడూ కృతవర్మా శతధన్వుడిని రెచ్చగొట్టారు. సత్యభామను మనకు ఇస్తానని సత్రాజిత్తు మోసం చేశాడని నూరిపోశారు. అందుకే కసాయివాడైన శతధన్వుడు ఇంతటి అఘాయిత్యానికి తలపడ్డాడు.

ద్వారకకు తిరిగి వచ్చిన శ్రీకృష్ణుడు శతధన్వుణ్ణి సంహరించాలని నిశ్చయించుకొన్నాడు. శతధన్వుడికి ప్రాణభయం పట్టుకొంది. అక్రూరుడినీ 'కృతవర్మనూ ఏదైనా ఉపాయం చెప్పమని అడిగాడు. కానీ వాళ్ళిద్దరూ బలరామ కృష్ణులు మహానుభావులనీ, వాళ్ళను ఎదురించే సాహసం చేయలేమనీ, ఇప్పటికి నీవల్ల మాకు వచ్చిన చెడ్డపేరు చాలనీ తిరస్కరించారు.

శతధన్వుడు గుర్రమెక్కి పారిపోతుంటే బలరామకృష్ణులు వెంబడించారు. మిథిలా నగర ప్రాంతంలో శ్రీకృష్ణుడు అతణ్ణి చక్రాయుధంతో సంహరించాడు.

తీరా చూస్తే అతడి దగ్గర మణి లేదు. అప్పుడు బలరాముడు 'శ్రీకృష్ణా! నువ్వు ద్వారకకు వెళ్ళి ఆ మణికోసం అన్వేషించు. నేను మిథిలా నగరంలోని జనక మహారాజును చూసి వస్తాను అని వెళ్ళాడు. ఆ సమయంలోనే దుర్యోధనుడు మిథిలకు వచ్చి, జనక మహారాజు చేత సత్కరింపబడి, అక్కడే ఉన్న బలరాముడి వద్ద గదాయుద్ధ విద్యను నేర్చుకొన్నాడు.

శ్రీకృష్ణుడు ద్వారకా నగరానికి వెళ్ళి జరిగినదంతా చెప్పి సత్రాజిత్తుకు అంత్యక్రియలు నిర్వహించాడు. అక్రూరుడూ, కృతవర్మ శ్రీకృష్ణుడికి భయపడి పారిపోయారు.

అక్రూరుడు ద్వారకలో లేకపోవడంతో అనేక ఉపద్రవాలు కలిగాయి. వర్షాల్లేవు. ప్రజలు రోగాల బారినపడ్డారు.

పూర్వం కాశిలో చాలాకాలం వర్షాలు లేవు. అక్రూరుడి తండ్రి శ్వఫల్కుడు కాశిలోనికి రాగానే వర్షాలు కురిశాయి. అందుకే కాశిరాజు తన కుమార్తె 'గాందిని'ని శ్వఫల్కుడికి ఇచ్చి వివాహం చేసి శాశ్వతంగా అతణ్ణి తన రాజ్యంలోనే ఉండేలా చేసుకొన్నాడు. ఈ అక్రూరుడూ తండ్రి అంతటివాడే. అందుకే వెంటనే అక్రూరుణ్ణి పిలిపించమన్నారు.

శ్రీకృష్ణుడు మొత్తానికి అక్రూరుణ్ణి వెతికి పట్టుకొని ద్వారకకు రప్పించాడు. మణి కూడా అక్రూరుడి దగ్గరే ఉందన్న విషయమూ శ్రీకృష్ణుడికి తెలుసు. శ్రీకృష్ణుడు అతణ్ణి ఆదరించి ప్రీతిపూర్వకంగా –

అక్రూరా! ఆ మణి నీ దగ్గరే ఉంది. ఉండనీ. కానీ ఒక్కసారి దాన్ని చూపించు. మా అన్న బలరాముడూ, ఇంకా అందరూ నేనే ఏదో చేశానని అనుకొంటారు. ఇది ఈ మణి విషయంలో నాపై పడ్డ రెండో అపనింద. ఎందుకంటే నువ్వు ఉన్నట్టుండి బంగారు వేదికలపై ఎడతెరిపి లేకుండా యజ్ఞాలు చేస్తున్నావని తెలిసింది. అంత బంగారం నీకు ఎక్కణ్ణుంచి వస్తుంది? శతధన్వుడు ఆ మణిని నీ దగ్గర దాచిపెట్టి ఉంటాడు. అవునా?' అన్నాడు.

అక్రూరుడు వెంటనే తన దుస్తుల్లో దాచిన మణిని తీసి చూపించాడు. శ్రీకృష్ణుడు దాన్ని అందరికీ చూపించి అందరి సమక్షంలో అక్రూరుడికే ఇచ్చివేశాడు.

పరీక్షిన్మహారాజా! ఈ శమంతకమణి కథను విన్నా, చదివినా, తలచినా సర్వ పాపాలూ తొలగిపోతాయి.

## ఇంద్రప్రస్థ ప్రయాణం

రాజా! ఒకసారి శ్రీకృష్ణుడు పాండవుల్ని చూసివద్దామని సాత్యకి మొదలైన యాదవులతో కలసి ఇంద్రప్రస్థ నగరానికి వెళ్ళాడు. పాండవులూ, ద్రౌపది శ్రీకృష్ణుణ్ణి భక్తితో సేవించారు. కుంతీదేవి కూడా ఆనందించింది. కష్టసుఖాలు మాట్లాడు కున్నారు. కొంతకాలం అక్కడే ఉన్నాడు శ్రీకృష్ణుడు.

ఒకరోజు శ్రీకృష్ణార్జునులు అడవికి వెళ్ళి జంతువుల్ని వేటాడారు. అలసి పోయారు. దాహం వేసింది. యమునానదిలో దాహం తీర్చుకొని అక్కడే విశ్రమించారు. అప్పుడు వాళ్ళకు ఒక సౌందర్యరాశి కనిపించింది. ఆమె సూర్యపుత్రిక. కాళింది ఆమె పేరు. శ్రీకృష్ణుడు అర్జునుడి ద్వారా ఆమె వివరాలు సేకరించాడు. ఆమె శ్రీకృష్ణుడినే భర్తగా పొందాలని తపస్సు చేస్తోందట. అందుకే ఆమెను తెచ్చి ధర్మరాజు వద్ద ఉంచాడు.

తరువాత పాండవులు కోరడంతో విశ్వకర్మ వచ్చి ఇంద్రప్రస్థాన్ని అద్భుతంగా అలంకరింపజేశాడు. తరువాత శ్రీకృష్ణార్జునులు ఖాండవవనాన్ని దహించారు. అందుకు సంతోషించిన అగ్నిదేవుడు అర్జునుడికి అక్షయ తూణీరాలు, కవచం, గాండీవం అనే ధనుస్సూ, దివ్యరథమూ, తెల్ల గుర్రాలు ఇచ్చాడు. ఖాండవవనంలో తాను దహించుకుపోకుండా కాపాడినందుకు మయుడు అర్జునుడికి ఒక అద్భుతమైన సభను నిర్మించి బహూకరించాడు.

## అష్టమహిషీ కల్యాణం

తరువాత శ్రీకృష్ణుడు ద్వారకకు కాళిందిని తీసుకొనివచ్చి పెళ్ళాడాడు. అవంతీ పాలకులైన విందానువిందులు తమ చెల్లెలు మిత్రవిందకు స్వయంవరాన్ని ప్రకటించారు. వీళ్ల తల్లి రాజాధిదేవి శ్రీకృష్ణుడి మేనత్త. కుంతీదేవికి చెల్లెలు. శ్రీకృష్ణుడు ఆ స్వయంవరానికి వెళ్ళి తన పరాక్రమంతో ఆమెను చేపట్టాడు.

రాజా! కోసల దేశపు రాజు నగ్నజిత్తు. ఇతడి కుమార్తె నాగ్నజితి. ఈ రాజుదగ్గర ఏడు పొగరుబోతు ఆంబోతులు ఉన్నాయి. వాటిని కట్టడి చేసినవాడికే

తన కుమార్తెను ఇచ్చి వివాహం చేస్తానని రాజు ప్రకటించాడు. శ్రీకృష్ణుడు వెళ్ళి ఆ వృషభాలకు ముక్కుత్రాడు వేసి, అదుపులోకి తెచ్చాడు. నాగ్నజితిని పరిగ్రహించాడు.

కేకయ దేశానికి రాజు శ్రుతకీర్తి. ఇతడి కుమార్తె భద్ర. శ్రీకృష్ణుడికి మరో మేనత్త కూతురు. ఆమెనూ పెళ్ళాడాడు.

మద్ర రాజకుమార్తె లక్షణనూ పరిగ్రహించి అష్టమహిషీ ప్రాణనాథుడై ఒప్పారాడు శ్రీకృష్ణస్వామి. అంతేకాదు, నరకాసురుడిని సంహరించి అతడి చెరలో ఉన్న పదహారు వేలమంది కన్యకామణుల్నీ చేపట్టాడు ఈ నందగోపాలుడు' అన్నాడు శుకమహర్షి.

ఆ మాటలు విన్న పరీక్షిత్తు 'యోగిపుంగవా! శుకదేవా! నాకు ఆ నరకాసుర వధ కథను వినాలని ఉంది' అన్నాడు.

శుకమహర్షి ప్రారంభించాడు.

## నరకాసురుడు

రాజా! నరకాసురుడు అనే ఘోరరాక్షసుడు అదితి కుండలాలనూ వరుణ దేవుడి ఛత్రాన్నీ, దేవతల మణిపర్వతాన్నీ అపహరించాడు. దేవేంద్రుడి అభ్యర్థనపై ఆ రాక్షసుణ్ణి వధించాలని శ్రీకృష్ణుడు గరుడవాహనంపై బయలుదేరాడు. అప్పుడు సత్యభామ – 'నాథా! దయచేసి నన్ను నీ వెంట తీసుకువెళ్ళవూ!' అని ప్రాధేయ పడింది.

సరే, మొత్తానికి శ్రీకృష్ణుడికి తప్పింది కాదు. గరుడ వాహనంపై ప్రక్కనే కూర్చోబెట్టుకొని బయలుదేరాడు.

నరకాసురుడి రాజధాని ప్రాగ్జ్యోతిషపురం. వెళ్తూ వెళ్తూనే తన గదతో పర్వత దుర్గాల్ని బద్దలుకొట్టాడు. శస్త్రదుర్గాల్ని బాణాలతో చీల్చివేశాడు. వాయు, జల, దుర్గాల్ని చక్రాయుధంతో నాశనం చేసేశాడు.

ఆ పురానికి కంటికి కనిపించని పాశాలు రక్షణ కవచంగా ఉన్నాయి. వాటినీ తన నందక ఖడ్గంతో తుంచి పారేశాడు. పాంచజన్యాన్ని పూరించి దిక్కుల్ని హోరెత్తించాడు. ఆ శబ్దానికి నిద్ర చాలించాడు మురాసురుడు. వాడు భయంకరంగా

గర్జిస్తూ తన శూలాన్ని గరుత్మంతుడిపై విసిరాడు. దాన్ని శ్రీకృష్ణుడు మధ్యలోనే పట్టుకొని మూడు ముక్కలు చేసి విసిరికొట్టి, వాడియైన బాణాలను వాడిపై కురిపించాడు.

అంతే! అయిదు తలల మురాసురుడు కాస్తా మరణించాడు. నరకాసురుడు కోపోద్రిక్తుడైపోయాడు. తన ఏడుగురు కొడుకుల్నీ పంపించాడు. శ్రీకృష్ణుడు వాళ్ళందరినీ అవలీలగా సంహరించాడు. ఇక చివరగా నరకుడే స్వయంగా రంగంలోకి దిగాడు.

నరకాసురుడు యుద్ధరంగంలోనికి రాగానే సత్యభామ తాను యుద్ధం చేస్తానని ముందుకు వచ్చింది.

## వీరనారి – సత్యభామ

ఆమెను శ్రీకృష్ణుడు ఆశ్చర్యంగా చూస్తూ

'లేమా! సత్యభామా! ఏమిటీ తొందర? ఈ మాత్రం దనుజుల్ని మేం గెలవలేమా? నువ్వెందుకు ముందుకొస్తున్నావు? ఇలా రా! ఈ ప్రయత్నాన్ని మానుకో! కాదని నువ్వే యుద్ధం చేస్తావా ! చెప్పు. రా! ఇదుగో మా విల్లు. విలాసంగా అందుకో! అంటూ విల్లందించాడు సత్య చేతికి.

ఆ విల్లు అందుకొని మహాతేజస్సుతో ప్రతాపంతో నారి సారించింది సత్యభామ. రాక్షస స్త్రీల మంగళసూత్రాలు తెగిపోయేలా ధనుష్టంకారం చేసింది. అప్పుడు చూడాలి సత్యభామ వీరశృంగారాలు.

**మ. పరుఁజూచున్ వరుఁ జూచు నొంప నలరింపన్ రోషరాగోదయా**
**విరతభ్రూకుటి మందహాసములతో వీరంబు శృంగారమున్**
**జరగన్ గన్నులఁగెంపు సొంపుఁ బరఁగం జండాస్త్రసందోహమున్**
**సరసాలోకసమూహమున్ నెఱపుచుం జంద్రాస్య హేలాగతిన్**

(10–2–178)

చంద్రముఖి ఆ సత్యభామ – నరకుణ్ణి నొప్పించటానికీ తన భర్త శ్రీకృష్ణుణ్ణి ఆనందింప చేయటానికీ చూస్తోంది.

నరకుణ్ణి చూసేటప్పుడు కనుబొమ్మలు మడిచి రోషంగా చూస్తోంది. శ్రీకృష్ణుడి వైపు ప్రేమతో చిరునవ్వుతో చూస్తోంది. కన్నుల్లో వీరం కనిపించేట్లుగా ఒకప్రక్క ఎర్రదనమూ, మరోప్రక్క శృంగారము కనిపించేట్లు చక్కదనమూ కనిపిస్తున్నాయి. శత్రువు మీద భీకరమైన అస్త్రాలనూ, శ్రీహరి మీద సరసపు చూపుల్ని గుప్పిస్తోంది. ఒక కాలు ముందుకు వేసి ప్రత్యాలీఢ పాదంతో విజృంభించింది. నుదుట చెమటలు. చెల్లాచెదురైన ముంగురులు. చెవులదాకా వింటినారిని లాగడంతో ఆమె చేతి గోళ్ళ కాంతి, చెవి కమ్మల కాంతి, బాణం తోక కాంతీ కలసి వింత శోభను కలిగిస్తున్నాయి. లక్ష్యంపై ఉంచిన చూపులతో ధనువును గుండ్రంగా వంచుతూ బాణవర్షం కురిపిస్తోంది.

ఆమె వేసిన పదునైన బాణాలకు రాక్షససైన్యం కలత చెందింది. అప్పుడు మళ్ళీ శ్రీకృష్ణుడు– 'ప్రియా! ఈ రాక్షస సైన్యం పారిపోయిందిలే. ఇక చాల్లే యుద్ధం. విజయం నీదే. అందుకో. నీ సాహసానికి మెచ్చాను. నువ్వు కోరినన్ని ఆభరణాలు ఇస్తాను తీసుకో' అంటూ మెల్లగా ఆమె కోమలమైన చేతి నుండి విల్లు అందుకున్నాడు.

నరకాసురుడు మత్తగజంపై తానూ ఒక మత్తగజంలా వచ్చి శ్రీకృష్ణుడితో తలపడ్డాడు. మరోప్రక్క అతడి సైన్యమూ ముట్టడిస్తోంది. శ్రీకృష్ణుడు వెంటనే తన శర పరంపరతో ఆ సైన్యాన్ని ఊచకోత కోశాడు. సారెకు మూడేసి బాణాలతో ఆ సైన్యంలోని గుర్రాల్నీ, ఏనుగుల్ని, రాక్షస వీరుల్నీ కకావికలం చేశాడు.

ఇక గరుత్మంతుడి ప్రతాపం చూడాలి. ముక్కుతో పొడుస్తూ, కాలి గోళ్ళతో రక్కుతూ మత్తగజాల్ని సైతం మట్టికరపిస్తున్నాడు.

నరకుడి దగ్గర ఒక అద్భుతమైన శక్తి అనే ఆయుధం ఉంది. దాన్ని గరుడుడి మీద ప్రయోగించాడు. దానికి గరుడుడు కించిత్తు కూడా చలించలేదు. ఏనుగును ఓ పూలచెండుతో కొడితే ఎలా ఉంటుందో అలా ఉంది గరుడుడికి.

ఈసారి త్రిశూలాన్ని అందుకొన్నాడు నరకుడు. దానికి ప్రతిగా తన చక్రాన్ని ప్రయోగించాడు శ్రీకృష్ణుడు.

సుదర్శన చక్రం పదునైన అంచులు భగభగమని నిప్పులు కురిపిస్తూ ఆ శూలాన్ని ముక్కలు చేసింది.

అంతేకాదు, సుదర్శనానికి తిరుగులేదు కదా! అది నరకాసురుడి శిరస్సు ఖండించింది. ధడేలుమని నేలపై బంతిలా పడింది వాడి తల. రాజా! అదెలా ఉందో తెలుసా!

'అమ్మా! ఆ శ్రీహరికి వరాహావతారంలో నువ్వు ఇల్లాలివని పదే పదే చెప్తుంటావుకదా! కనీసం నీ ముఖం చూసైనా నీ కొడుకునైన నన్ను విడిచిపెట్టలేదు. తలను నిర్దాక్షిణ్యంగా ఖండించాడు సుమా!' అని ఆక్షేపిస్తున్నట్లుగా నేలపై పడి దొర్లిందట!

అప్పుడు భూదేవి అక్కడికి వచ్చి నరకుడు అపహరించినవన్నీ తెచ్చి శ్రీకృష్ణుడికి సమర్పించింది.

## పారిజాతాపహరణం

నరకుడి సౌధంలో ఉన్నారు పదహారువేలమంది సుందరీమణులు. వాళ్ళకు విముక్తి కలిగించిన మాధవుడే మా 'ధవు'డని నిశ్చయించుకున్నారు వారు. అతడి కోసం తపించారు. శ్రీకృష్ణుడు వారికి విలువైన వస్త్రాలూ, ఆభరణాలూ ఇచ్చి అందరినీ ద్వారకకు పంపాడు.

తరవాత నేరుగా సత్యాసమేతుడై స్వర్గానికి వెళ్ళాడు శ్రీకృష్ణుడు. భూదేవి ఇచ్చిన దేవతల వస్తువుల్ని అదితికి సమర్పించాడు. దారిలో వస్తూ వస్తూ నందనవనంలోనికి ప్రవేశించి, అక్కడ ఉన్న కల్పవృక్షాన్ని పెకలించి గరుత్మంతుడి మీద పెట్టాడు. దేవతలు అడ్డుకొన్నారు. శ్రీకృష్ణుడు వినలేదు. ఇంద్రుడే యుద్ధానికి దిగాడు ఆ కల్పవృక్షం కోసం. అందరినీ ఓడించి చిటికెలో భూలోకం చేరుకున్నాడు. కల్పవృక్షాన్ని సత్యభామాదేవి పెరటిచెట్టుగా ఉద్యానవనంలో నాటించాడు.

పరీక్షిన్మహారాజా! నరకుడి బాధను పోగొట్టమని కాళ్ళా వేళ్ళా పడ్డ ఇంద్రుడే తన అవసరం తీరిపోయాక శ్రీకృష్ణుడిపై కత్తి దూశాడు. చూశావా! దేవతల అహంకారం అలా ఉంటుంది మరి! సరే, శ్రీకృష్ణుడు తననే భర్తగా భావిస్తున్న ఆ పదహారువేల మందినీ పరిణయమాడి అందరికీ వేర్వేరు భవనాలు ఏర్పాటు చేశాడు. ఆశ్చర్యం ఒకే కాలంలో అందరి దగ్గరా ఉండేవాడయ్యా! శ్రీకృష్ణుడు. అతడి లీలలు ఎవరికి అర్థమవుతాయి? అందరినీ ఒకేలా ఆలించాడు. అందరినీ

ఒకే సమయంలో పాలించాడు. దివ్యానందలోకాల్లో విహరింపజేశాడు. వాళ్ళూ భక్తిప్రపత్తులతో ఆయనను సేవించారు.

శ్రీకృష్ణుడికి రుక్మిణీదేవి వల్ల ప్రద్యుమ్నుడు, చారుధేష్ణుడు, చారుదేవుడు, సుధేష్ణుడు, సుచారువు, చారుగుప్తుడు, భద్రచారువు, చారుభద్రుడు, విచారువు, చారువు అని పదిమంది పుత్రులు. తక్కిన పట్టమహిషులకు పదహారువేలమందికీ కూడా ఒక్కొక్కరికి పదేసిమంది కుమారులు కలిగారు. ఆ పుత్రులకు పుత్రులు కలిగారు. ఈ విధంగా శ్రీకృష్ణుడి వంశం తామరతంపరగా విలసిల్లింది.

యదు, వృష్ణి, భోజ, కుకుర, అంధక మొదలైన నూట ఒక్క పేర్లతో వర్ధిల్లింది. మూడు కోట్ల ఎనభై వేల ఒక వందమంది రాజగురువులే ఉన్నారంటే వాళ్ళ సంఖ్యా వైభవం వర్ణించడం ఎవరి తరం?

## బలరాముడి విజృంభణ

రుక్మి తన కూతురు రుక్మవతికి స్వయంవరం ప్రకటించాడు. ఆ స్వయంవరానికి ప్రద్యుమ్నుడూ వచ్చాడు. తన పరాక్రమంతో శత్రువులు కాళ్లకు బుద్ధిచెప్పుకొనేలా చేసి రుక్మవతిని చేపట్టాడు. కొంతకాలానికి వీళ్ళకు ఒక పుత్రుడు జన్మించాడు. అతడే అనిరుద్ధుడు. రుక్మి కొడుక్కి రుక్మలోచన అనే కుమార్తె జన్మించింది. రుక్మిణి సంతోషిస్తుందని రుక్మలోచనను అనిరుద్ధుడికి ఇచ్చి చేయాలని భావించాడు రుక్మి. ఈ వివాహానికి బలరామకృష్ణులు, సాంబుడు, ప్రద్యుమ్నుడు మొదలైనవారందరూ వెళ్ళారు. వివాహం అత్యంత వైభవంగా జరిగింది.

పెళ్ళి అయ్యాక రుక్మి, బలరాముడు పాచికలాటకు కూర్చున్నారు. బలరాముడు ఆ ఆటలో అంత చెయ్యి తిరిగినవాడు కాదు. అందుకే అతణ్ణి ఓడించి అవమానించాలని కొందరు రాజుల ఎత్తు. రుక్మిని రెచ్చగొట్టి అతడితో ఆడేలా చేశారు. అందులో ముఖ్యంగా కళింగాధీశుడు రుక్మిని మరీ రెచ్చగొట్టాడు. 'నీకు ఇంతకు ముందు జరిగిన అవమానానికి ప్రతీకారం తీర్చుకొనేందుకు ఇదే గొప్ప అవకాశం' అని చెవిలో జోరీగలా పోరుపెట్టాడు.

ఆట మొదలైంది. ఆ వేడుకలో ఎవరెవరో ఏమేమో మాట్లాడుతున్నారు. ఆ సమయంలో మాట్లాడే మాటలు అలాగే ఉంటాయిలే అని పెద్దగా పట్టించుకోలేదు

బలరాముడు. ఆటమీద పందాలు కడుతున్నారు. వందలూ వేలూ దాటి లక్షల బంగారు నాణాల దాకా పందాలు ఒడ్డుతున్నారు. రుక్మి పందేలన్నీ గెలుస్తున్నాడు. ఈసారి ఎలాగైనా గెలవాలని పంతం పట్టి బలరాముడు ఏకంగా పదికోట్ల బంగారు నాణాల పందెం కట్టాడు. ఆ పందెం బలరాముడే గెలిచాడు. అయినా తనే గెలిచినట్లు వాదించాడు రుక్మి. చుట్టూ ఉన్న రాజులంతా అతడివైపే మాట్లాడతారని అతడి ధీమా.

ఈలోగా అశరీరవాణి బలరాముడే విజేత అని ప్రకటించింది.

ఇక రుక్మి ఎదురు దాడికి దిగి బలరాముడిపై వ్యక్తి దూషణ చేయసాగాడు. బలరాముడికి సహనం నశించింది. అసలే ముక్కోపి. ఇంతవరకూ ఎలాగో ఓపిక పట్టాడు గానీ ఇంక అతడివల్ల కాలేదు. అందుబాటులో ఉన్న ఒక పరిఘను చేతిలోనికి తీసుకొని ఒకే ఒక్క దెబ్బతో రుక్మిని పైలోకాలకు పంపించేశాడు. అది చూసి తక్కిన రాజులు పరుగు లంఘించుకొన్నారు. దొరికినవాళ్ళను దొరికినట్లు చితక్కొట్టాడు బలరాముడు.

ఇటు చూస్తే సొంత అన్న. అటు చూస్తే తన భార్యకు అన్న – ఎటు చెప్తే ఎవరికి కోపం వస్తుందోనని శ్రీకృష్ణుడు మౌనాన్ని ఆశ్రయించాడు. తరువాత అంతా సద్దుమణిగింది. ఎక్కడివాళ్ళు అక్కడికి వెళ్ళిపోయారు.

## బాణాసురుడి తపస్సు

పరీక్షిన్మహారాజా! బలిచక్రవర్తి నూర్గురు కుమారులలో పెద్దవాడు బాణుడు. అతడు గొప్ప శివభక్తుడు. శివుడు తాండవం చేస్తుంటే ఈ బాణుడు అద్భుతంగా వాద్యాలు వాయించి శివుణ్ణి మెప్పించి సాక్షాత్తు శివుణ్ణే తన నగరం శోణితపురానికి రక్షకుడిగా ఉండేలా వరం పొందాడు. అదనంగా వెయ్యి చేతుల్నీ శివుడు ఇతడికి ప్రసాదించాడు.

కొంతకాలం తర్వాత శివుడి సందర్శనానికి వెళ్ళాడు బాణాసురుడు. శివుడికి నమస్కరించాడు. కానీ అతడి మాటల్లో అంతులేని అహంభావం. శివుడు అతడికి వెయ్యి చేతుల్ని వరంగా ఇచ్చాడు కదా! ఆ చేతులతో యుద్ధం చేయడానికి సరైన వీరుడే వాడికి కనబడలేదట. అందుకని శివుణ్ణే తనతో యుద్ధం చేయమన్నాడు. అంతటి తారాస్థాయికి చేరుకుంది అతడి అహంకారం.

శివుడికి పట్టరాని కోపం వచ్చింది. 'మూర్ఖుడా! తొందరపడకు. నీ రథానికి ఉన్న కేతనం అకారణంగా కింద పడుతుంది. అప్పుడు నాతో సమానమై వాడితో నువ్వు యుద్ధం చేస్తావు. నీకు గర్వభంగం అవుతుంది' అని శపించాడు. యుద్ధోత్సాహంలో ఉన్న బాణుడు అది ఎప్పుడు జరుగుతుందా? అని ఎదురు చూడసాగాడు.

ఈ బాణుడికి ఒక అందాల రాశియైన కుమార్తె ఉంది. ఆమె పేరు ఉష. ఆమె కలలోకి ఒక అందమైన యువకుడు వచ్చాడు. అది కల కాదని వాస్తవమేనన్న భ్రమలో ఉంది ఉష. అంత అనుభూతిని పొందిందన్నమాట! తీరా మేల్కొని చూస్తే ఆ యువకుడు లేడు. అతడి కోసం ఆక్రోశించింది. బిగ్గరగా పిలిచింది. పక్కనే ఉన్న చెలికత్తెలు ఆమెను తెల్లబోయి చూశారు. ఉష సిగ్గులమొగ్గ అయింది.

ఈమె చెలికత్తెలలో చిత్రలేఖ అనే ఒక చెలికత్తె ఉంది. ఆమె ఉషకు ఇష్టసఖి. ఆమె బాణుడి మంత్రి కుంభాండుడి కూతురు. ఆమెకు తన కల గురించి చెప్పింది ఉష.

'నువ్వు మెచ్చినవాడు ఈ ముల్లోకాల్లో ఎక్కడ ఉన్నా తీసుకొచ్చే బాధ్యత నాది' అని చిత్రలేఖ మాట ఇచ్చింది. చకచకా అందమైన యువకుల చిత్రాల్ని గీసి చూపించింది. సిద్ధ, సాధ్య, గంధర్వ, యక్ష, విద్యాధరాది దేవగణాల్లో అందమైన యువకుల చిత్రాలన్నీ వేసి చూపించింది. వాళ్ళలో ఉషకు కలలో కనిపించిన యువకుడు లేడు. తరువాత మానవుల్లో ఉన్న సుందరాంగులనూ చిత్రించింది. చివరిగా అనిరుద్ధుణ్ణీ చిత్రించింది. ఆ చిత్రం చూసి ఉష 'ఇతడే! ఇతడే!' అని ఆనందంగా చూపించింది.

ఇక చిత్రలేఖ ఆలస్యం చేయలేదు. ద్వారకా నగరానికి వెళ్ళి నిద్రలో ఉన్న అనిరుద్ధుణ్ణి తన యోగశక్తితో ఉష దగ్గరకు తీసుకువచ్చింది.

అనిరుద్ధుడు ఉషాదేవి అంతః పురంలోనే ఉన్నాడన్న వార్త ఆమె తండ్రి బాణుడికి తెలిసింది. బాణుడే స్వయంగా వచ్చాడు.

అంతఃపురంలో ఉష–అనిరుద్ధులు పాచికలాటలాడుతున్నారు. అనిరుద్ధుణ్ణి చూసీ చూడటంతోనే బాణుడు బంధించమని భటుల్ని పంపాడు.

వెంటనే ఒక పరిఘను అందుకొని అనిరుద్ధుడు తన మీదికి వచ్చిన భటు లందరినీ చితక్కొట్టాడు. బాణుడు నాగపాశం వేసి అనిరుద్ధుణ్ణి బంధించాడు. అది చూసి ఉష తల్లడిల్లిపోయింది.

## శివ-కేశవ యుద్ధం

అక్కడ ద్వారకలో అందరూ అనిరుద్ధుడు ఏమయ్యాడో అని కంగారు పడుతుంటే నారదుడు వచ్చి అసలు సంగతి చెప్పాడు.

వెంటనే బలరామకృష్ణులు సైన్యంతో బయలుదేరారు. బాణుడి కోటను ముట్టడించారు.

పరీక్షిన్మహారాజా! బాణుడి నగరానికి సాక్షాత్తూ పరమశివుడే రక్షకుడని ఇంతకు ముందే చెప్పాను కదా! అందువల్ల శివుడు ప్రమథగణాల్ని సన్నద్ధం చేసి యాదవులపై యుద్ధం ప్రకటించాడు.

ఇరుసైన్యాలకూ యుద్ధం హోరాహోరీగా జరిగింది. ఆ యుద్ధంలో శ్రీకృష్ణుడిదే పైచేయి అయింది. అది చూసి బాణుడే స్వయంగా తలపడ్డాడు. శ్రీకృష్ణుడు తన శార్ఙ్గధనువు ఎక్కుపెట్టి బాణవర్షం కురిపించాడు. బాణుడు ధరించిన అయిదువందల ధనువుల్నీ తుత్తునియలు చేసి బాణుడి సారథినీ గుర్రాల్నీ సంహరించాడు.

బాణుణ్ణి రక్షించడానికి స్వయంగా అతడి తల్లి కోటర నగ్నంగా వచ్చింది. ఆమెను అలా చూడలేక శ్రీకృష్ణుడు ముఖం తిప్పుకొన్నాడు. ఈలోగా బాణుడు పారిపోయి ప్రాణాలు కాపాడుకున్నాడు.

తరువాత శివుడు జ్వర అనే ఒక శక్తిని ప్రయోగించాడు. శ్రీకృష్ణుడూ ఒక శక్తిని ప్రయోగించాడు. ఆ శక్తి ముందు శివుడి శక్తి నిలవలేకపోయింది. ఈలోగా బాణుడు మరో రథంపై అనేక ధనువులు ధరించి యుద్ధ రంగంలోనికి వచ్చాడు. శ్రీకృష్ణుడు సత్వరమే తన చక్రాయుధాన్ని పంపాడు. అది బాణుడి వెయ్యి చేతుల్లో నాల్గింటిని వదలి తక్కిన చేతుల్ని తెగనరికింది. అప్పుడు శంకరుడు –

శ్రీకృష్ణా! పరంజ్యోతి స్వరూపుడివి నువ్వు. నీ తేజస్సు ముందు సూర్య చంద్రాగ్నులేవీ నిలవలేవు. ధర్మసంస్థాపన కోసమే నువ్వు ఈ అవతారాన్ని ధరించావు. అయితే నాదోమాట! ఈ బాణుడు నా ప్రియ భక్తుడు. నేను ఇతడికి అభయ

మిచ్చాను. నువ్వూ ఇతణ్ణి అనుగ్రహించు' అన్నాడు. శ్రీకృష్ణుడు శంకరుడి మాటను మన్నించాడు.

'శంకరా! ఇతడు ప్రహ్లాదుడి వంశంలోనివాడు. ఆ వంశంలోని వాళ్ళను ఎవరినీ చంపనని నేను ముందే మాట ఇచ్చాను. అందుకే ఇతణ్ణి ఇప్పుడు విడిచిపెడుతున్నాను. అయితే ఇతడి గర్వం అణచాలనే ఇదంతా చేశాను. ఇతడికి ఇంకా నాలుగు భుజాలు మిగిలి ఉన్నాయి. వాటితోనే ఇతడు జీవిస్తాడు, అని అభయమిచ్చాడు.

బాణుడు శ్రీకృష్ణుడికి నమస్కరించి ఉషనూ అనిరుద్ధుణ్ణీ ఆదరించి అనేక బహుమతులు సమర్పించాడు.

బలరామకృష్ణులు ఉషా అనిరుద్ధుల్నీ, యాదవ వీరుల్నీ తీసుకొని ద్వారకకు తిరిగి వచ్చారు.

పరీక్షిన్మహారాజా! ఈ విజయ గాథను విన్నవారికి, పఠించినవారికి సకల శుభాలూ లభిస్తాయి అన్నాడు. అప్పుడు పరీక్షిత్తు కోరికపై ఈసారి నృగమహారాజు చరిత్రను ప్రారంభించాడు శుక మహర్షి.

## నృగ మహారాజు

రాజా! యాదవ వీరులైన సాంబుడు, ప్రద్యుమ్నుడు మొదలైనవాళ్ళు ఒకసారి ఒక ఉద్యానవనంలో విహరించారు. అలసిపోయిన వారికి దాహం వేసింది. ఆ అడవిలో ఒక బావి కనిపించింది. తీరా వెళ్ళి చూస్తే అందులో నీళ్ళు లేవుగానీ కొండలాగా ఉన్న ఒక పెద్ద ఊసరవెల్లి కనిపించింది.

యదువీరులు జాలితో దాన్ని బయటకు తీద్దామని ప్రయత్నించారు కానీ వాళ్ల వల్ల కాలేదు. వెళ్ళి శ్రీకృష్ణుడికి చెప్పారు. శ్రీకృష్ణుడు వచ్చి అవలీలగా తన ఎడమచేత్తో దాన్ని బయటకు తీశాడు. ఆ పరమాత్ముడి కరస్పర్శతో ఆ ఊసరవెల్లి ఒక దివ్య పురుషుడిగా మారిపోయింది. అతడు శ్రీకృష్ణుడికి నమస్కరించి తన వృత్తాంతం చెప్పడం ప్రారంభించాడు.

ప్రభూ! నా పేరు నృగుడు. ఇక్ష్వాకు వంశంవాడిని. నేను లెక్కలేనన్ని దానాలు చేశాను. ఎన్నో ప్రజా సంక్షేమ కార్యక్రమాలూ చేశాను. నాకు తెలిసి నేను ఏ తప్పు చేయలేదు. కానీ నేను ఒక బ్రాహ్మణుడికి దానంగా ఇచ్చిన ఆవు తప్పించు

కొని వచ్చి నా ఆవులమందలో కలిసిపోయింది. నాకు తెలియక దానిని ఇంకో బ్రాహ్మణుడికి దానం చేశాను. ఆ ఆవుకోసం ముందు దానం పుచ్చుకొన్న బ్రాహ్మణుడు, రెండోసారి దానం పుచ్చుకొన్న బ్రాహ్మణుడు నాదంటే నాదని వాదులాడుకొంటూ నా దగ్గరకు వచ్చారు.

నేను తెలియక చేసిన తప్పు నాకు తెలిసివచ్చింది. మన్నించమని వేడుకొన్నాను. ప్రతిగా చెరో లక్ష గోవులు ఇస్తానన్నాను. అయినా వాళ్ళు ఒప్పుకోలేదు.

ఆ పాపం కారణంగా మరణించాక నరకానికి వచ్చాను. యముడు నాకో అవకాశం ఇచ్చాడు. నేను చేసిన పుణ్యాన్ని, పాపాన్ని అనుభవించాలికదా! ముందు ఏది అనుభవిస్తావో తేల్చుకోమన్నాడు. నేను పాపమే అనుభవిస్తానన్నాను. అయితే వెంటనే క్రిందపడు అన్నాడు. అలా పడ్డవాణ్ణి ఇదుగో ఇలా ఊసరవెల్లిగా మారిపోయాను. ఇప్పుడు నీ స్పర్శతో మళ్ళీ మామూలువాణ్ణి అయ్యాను' అని తన వృత్తాంతం చెప్పి శ్రీకృష్ణుడికి నమస్కరించి స్వర్గానికి వెళ్ళిపోయాడు నృగుడు.

అప్పుడు శ్రీకృష్ణుడు అందరినీ ఉద్దేశించి – 'చూశారు కదా! **కాలకూట విషానికి కూడా విరుగుడు ఉంటుంది. కానీ బ్రాహ్మణ ద్రవ్యహరణం అనే విషానికి విరుగుడు లేదు. బ్రాహ్మణుడి సొత్తును అపహరిస్తే ఆ బ్రాహ్మణుడి కంటి నుండి జారిన కన్నీటి బిందువులు భూమిపై ఎన్ని దుమ్ముకణాలను తడుపుతాయో అన్ని సంవత్సరాలు ఆ సొత్తును అపహరించినవాడు కుంభీపాకం అనే నరకంలో నానాయాతనలు అనుభవిస్తాడు. అర్థమయిందా!'** అన్నాడు.

తరువాత బలరాముడు వ్రేపల్లెకు వెళ్ళి కొంతకాలం అక్కడ హాయిగా విహరించాడు.

## పౌండ్రక వధ

రాజా! నీకు మరో వృత్తాంతం చెబుతాను విను. కరూశ దేశానికి రాజు పౌండ్రక వాసుదేవుడు. మూర్ఖుడు. అహంభావి.

చుట్టూ ఉండేవాళ్ళు మితిమీరి పొగడటంతో తానే వాసుదేవుణ్ణని గర్వించాడా రాజు. విష్ణువులాగే శంఖచక్రాదులు ధరించి విర్రవీగిపోయేవాడు. అతడి పిచ్చి ముదిరి పాకాన పడింది.

తను ఉండగా శంఖచక్రాలు ధరించి తిరుగుతున్న ఆ శ్రీకృష్ణ దెవడన్నంతగా అతడి అహంకారం పెరిగిపోయింది. అందుకే ఒక దూతను పంపి 'ఈ భూమ్మీద వాసుదేవుడనేవాడు ఒకడే ఉండాలి. నువ్వు నన్ను అనుకరిస్తున్నావు. అది చెల్లదు. తక్షణం పేరు మార్చుకో! లేదంటే యుద్ధానికి సిద్ధంగా ఉండు' అని సందేశం పంపాడు.

ఆ సందేశం విని యాదవులందరూ నవ్వుకున్నారు. శ్రీకృష్ణుడు యుద్ధానికి బయలుదేరాడు. పౌండ్రకుడు, అతడి మిత్రుడు కాశిరాజు ఐదు అక్షౌహిణుల సైన్యంతో శ్రీకృష్ణుణ్ణి ఎదుర్కొన్నారు.

అచ్చం తనలాగే శంఖచక్రాదుల్ని ధరించి కృత్రిమంగా ఉన్న పౌండ్రక వాసుదేవుణ్ణి చూశాక నవ్వు ఆగలేదు శ్రీకృష్ణుడికి. పగటి వేషగాడిలా ఉన్నాడు అనుకొని తనమీదికి వచ్చిన సైన్యాన్ని చక్రాది ఆయుధాలు ప్రయోగించి అతలాకుతలం చేశాడు. పౌండ్రక వాసుదేవుణ్ణి చూసి 'ఓరీ మూర్ఖా! నా ఆయుధాల్ని వదిలేయమన్నావు కదా! ఇదుగో కాచుకో!' అంటూ చక్రాది ఆయుధాల్ని ప్రయోగించాడు.

పౌండ్రక వాసుదేవుడి రథం ధ్వంసం అయింది. చక్రం వెళ్ళి నేరుగా అతడి శిరస్సును ఖండించింది. తరువాత ఒకే ఒక్క బాణంతో కాశి రాజు తలనూ త్రుంచివేశాడు. అతడి తల వెళ్ళి కాశిరాజు రాజమందిరంలో పడింది.

రాజా! ఇక్కడో గమ్మత్తు చెప్పనా! ఆ పౌండ్రక వాసుదేవుడికి పుణ్యలోకాలు ప్రాప్తించాయి. ఎందుకో తెలుసా? నిరంతరం వాసుదేవుడిలా వేషం వేసుకొని అతణ్ణే ధ్యానించడంవల్ల.

తరువాత శ్రీకృష్ణుడు ద్వారకకు వెళ్ళిపోయాడు.

కాశిరాజు కొడుకు సుదక్షిణుడు. శ్రీకృష్ణుడిపై పగ తీర్చుకోవడం కోసం శివుడి గురించి తపస్సు చేశాడు. శివుడు ప్రత్యక్షమై దక్షిణాగ్నిని ఆరాధించి హెూమం చేయమని చెప్పాడు.

సుదక్షిణుడు శ్రీకృష్ణుణ్ణి లక్ష్యంగా చేసుకొని అభిచార హోమం చేశాడు. ఆ హోమకుండం నుంచి భీకరమైన 'కృత్య' అనే రాక్షసి (క్షుద్ర శక్తి) ఉద్భవించింది. దానిని శ్రీకృష్ణుడిపై ప్రయోగించాడు సుదక్షిణుడు.

మరణశిక్ష వేయదగినవాడి మీద మాత్రమే దానిని ప్రయోగించాలి. సుదక్షిణుడు తన తండ్రిని చంపాడన్న పగతో దానిని కృష్ణుడిపైకి పంపాడు. వెంటనే శ్రీకృష్ణుడు తన సుదర్శన చక్రాన్ని విసిరాడు. సుదర్శన తేజస్సు ముందు కృత్య నిలువలేక వెనక్కి తిరిగి వెళ్ళి తనను ప్రయోగించిన సుదక్షిణుణ్ణి, ఋత్విక్కుల్నీ సంహరించింది. చక్రం కాశీనగరాన్ని కాల్చివేసింది.

## ద్వివిదుడి వధ

రాజా! ద్వివిదుడు అనే ఒక వానరుడు నరకాసురుడితో స్నేహం చేశాడు. వీడికి రాక్షస బుద్ధులు సంక్రమించాయి. శ్రీకృష్ణుడు తన మిత్రుణ్ణి చంపాడని వీడు పగ పెంచుకొని శ్రీకృష్ణుడి రాజ్యంపై పడి విధ్వంసం సృష్టించాడు. వీడు చేయని దురాగతం లేదు. వాడి వెకిలి చేష్టలకూ, ఘోరకృత్యాలకూ ప్రజలు నానా ఇబ్బందులూ పడ్డారు. అది చూసి బలరాముడు సహించలేకపోయాడు. తన రోకలీ నాగలీ తీసుకొని వాడిమీదికి వెళ్ళాడు. ఆ వానరుణ్ణి సంహరించి రైవత పర్వతంపైకి విసిరేశాడు బలరాముడు. వాడి బరువుకి ఆ పర్వతమే వణికిపోయింది.

## బలరాముడి ప్రతాపం

రాజా! దుర్యోధనుడి పుత్రిక పేరు లక్షణ. శ్రీకృష్ణుడికీ జాంబవతికీ పుట్టిన కుమారుడు సాంబుడు. పెళ్ళి జరుగుతుంటే ఈ లక్షణను సాంబుడు ఎత్తుకొచ్చేశాడు. కౌరవులు వెంబడించి అతడిపై విరుచుకుపడ్డారు కానీ సాంబుడి ధాటికి నిలువలేకపోయారు. చివరికి కౌరవులు అంతా కూడబలుక్కొని మొత్తం సైన్యాన్ని మోహరించి అధర్మయుద్ధం చేసి సాంబుణ్ణి బంధించారు.

నారదుడి ద్వారా ఆ సంగతి విన్న యాదవులు సైన్యంతో బయలుదేరారు. కానీ బలరాముడికి కౌరవులపట్ల అభిమానం ఉంది. అందువల్ల వాళ్ళను ఉండమని తానే హస్తినకు బయలుదేరాడు సపరివారంగా. హస్తినకు సమీపంలో ఉన్న ఒక ఉద్యానవనంలో కూర్చొని కౌరవుల వద్దకు ఉద్ధవుణ్ణి పంపాడు. బలరాముడు వచ్చాడన్న వార్త విని దుర్యోధనాదులు పరుగు పరుగున వచ్చి అతడికి నమస్కరించి సేవించారు. అప్పుడు బలరాముడు

'దుర్యోధనా! ఇది మా రాజు ఉగ్రసేనులవారి ఆజ్ఞ. మీరు చేసింది తప్పు. ఇంతమంది కలిసి ఒక బాలుణ్ణి బంధిస్తారా? మా రాజు మిమ్మల్ని క్షమించాడు. సాంబుణ్ణి అప్పగించు' అన్నాడు.

ఆ మాటలు విన్న దుర్యోధనుడికి అరికాలి మంట నెత్తికెక్కింది. మా చెప్పు క్రింద తేలులా పడి ఉండవలసిన యాదవులు ఇప్పుడు తెగ పేట్రేగిపోతున్నారు. ఇది కాలం మహిమ. కాళ్ళకు తొడుక్కునే చెప్పులు తలమీదికి ఎక్కాయి. సాంబుణ్ణి విడిచిపెట్టటం అసంభవం' అని తేల్చిచెప్పాడు. పైగా నానా రకాలుగా బలరాముణ్ణే తూలనాడి నిర్లక్ష్యంగా హస్తినకు వెళ్ళిపోయాడు.

అతడి మాటలకు బలరాముడికి ఆగ్రహం కట్టలు తెంచుకుంది. 'పోనీలే అని ఊరుకొంటుంటే చిన్నా పెద్దా తేడా తెలీకుండా మాట్లాడుతున్నారు. వీళ్ళకు మాటలతో చెప్తే అర్థం కాదు' అంటూ నాగలి ఎత్తి హస్తినాపురం కొసకు దాన్ని తగిలించి ముందుకు తోస్తున్నాడు. గంగలో కలపాలని విజృంభించాడు.

ఆ నాగలి కుదుపుకి నగరంలోని గోపురాలు, సౌధాలూ ఒక ప్రక్కకి ఒరిగిపోయాయి. నగరం కొంచెం ముందుకు జరిగి నీటిలో పడవలా తేలుతోంది. వెంటనే భీష్మద్రోణాదులందరూ పరుగు పరుగున వచ్చి, అతణ్ణి స్తుతించి, శాంతింపజేసి, సాంబుణ్ణీ లక్షణనూ అప్పగించారు. వాళ్ళందరినీ తీసుకొని బలరాముడు విజయుడై ద్వారకకు తిరిగి వచ్చాడు.

## శ్రీకృష్ణుడి మహిమ

రాజా! నారదుడికి ఒక వింత కోరిక కలిగింది. అంతమందితో శ్రీకృష్ణుడు ఎలా గృహస్థాశ్రమాన్ని నిర్వహిస్తున్నాడో చూడాలనిపించింది. అందుకే స్వయంగా విచ్చేశాడు.

నేరుగా శ్రీకృష్ణుడి అంతఃపురంలోనికి వచ్చాడు. అక్కడ శ్రీకృష్ణుడు మంచంపై కూర్చొని కనిపించాడు. రుక్మిణీదేవి వింజామరలు వీస్తోంది.

శ్రీకృష్ణుడు నారదుణ్ణి చూడగానే దిగ్గున లేచి సాదరంగా ఆహ్వానించాడు. అతిథి మర్యాదలు చేసి కుశల ప్రశ్నలు వేశాడు. 'నారద మహర్షీ! ఏమిటిలా విచ్చేశారు? అని వినయంగా అడిగాడు.

నారదుడికి ఏం చెప్పాలో తోచలేదు. 'ప్రభూ! నువ్వు సర్వేశ్వరుడివి. సర్వ పాలకుడివి. నీ పాదపద్మాలే సంసార సాగరంలో పడి తపించేవారిని ఉద్ధరిస్తాయి. అటువంటి నీ దర్శన భాగ్యం దొరకడం నా అదృష్టం' అని స్తుతించి వాళ్ళ దగ్గర సెలవు తీసుకొని ఇంకో దేవి మందిరానికి వెళ్ళాడు.

అక్కడా శ్రీకృష్ణుడు ఎదురువచ్చి స్వాగతం పలికాడు. ఇలా ఎన్ని అంతఃపురాలకు వెళ్తే అన్నింటిలోనూ శ్రీకృష్ణుడు దర్శనమిస్తూనే ఉన్నాడు. ఒక్కోచోట ఒక్కో విధి నిర్వహిస్తూ నారదుణ్ణి ఆశ్చర్యానికి గురిచేశాడు.

శ్రీకృష్ణుడిమహిమ బాగా అర్థమయ్యింది నారదమహర్షికి. నారాయణ నామస్మరణ చేస్తూ ఆనందంగా వెళ్ళిపోయాడు.

## జరాసంధుడి వధ

పరీక్షిన్మహారాజా! తరువాత ఒక శుభముహూర్తంలో శ్రీకృష్ణుడు సపరివారంగా ఇంద్రప్రస్థం చేరుకున్నాడు. అతడికి ఘనస్వాగతం లభించింది.

మయసభ విడిది. కొన్ని నెలలు అందరూ అక్కడ ఆనందంగా గడిపారు.

ఒకరోజు ధర్మరాజు శ్రీకృష్ణుడివద్దకు వచ్చి తాను రాజసూయ యాగం ప్రారంభిస్తాననీ ఆ యాగంలో పురాణ పురుషుడివైన నిన్ను పూజిస్తాననీ, దయతో అంగీకరించమనీ వేడుకొన్నాడు.

శ్రీకృష్ణుడు సమ్మతించి 'ధర్మరాజా! అనన్య సాధ్యమైన యాగాన్ని నువ్వు సంకల్పించావు. దీనివల్ల నీ కీర్తి శాశ్వతంగా ఈ లోకంలో నిలచి ఉంటుంది. ఇది లోకానికి కళ్యాణకరం. అందువల్ల ప్రారంభించు. ముందుగా అపార పరాక్రమ వంతులైన నీ తమ్ముళ్ళను దిగ్విజయ యాత్రకు పంపు' అన్నాడు.

ధర్మరాజు అలాగే పంపాడు. సోదరులు దిక్కులన్నీ తిరిగి ఒక్క జరాసంధుణ్ణి తప్ప అందరినీ జయించి తిరిగి వచ్చారు. అపారమైన ధనరాశులు వచ్చి వీళ్ల కోశాగారాల్లో పడ్డాయి.

అప్పుడు శ్రీకృష్ణుడు జరాసంధుణ్ణి వధించటానికి ఒక ఉపాయం చెప్పాడు. ఆ ప్రకారంగా శ్రీకృష్ణుడు, భీమార్జునులు బ్రాహ్మణ వేషాలు వేసుకొని జరాసంధుడి వద్దకు వెళ్ళారు.

'రాజా! మాకో కోరిక ఉంది. తీరుస్తావా? నీకు మేలు జరుగుతుంది' అన్నారు. జరాసంధుడు అప్పుడే అనుష్ఠానాలు పూర్తిచేసుకొని వచ్చాడు. ఆ సమయంలో ఎవరు ఏది అడిగినా అతడు కాదనడు. వీళ్ళు చూడడానికి బ్రాహ్మణుల్లా లేరు. ముఖంలో రాచకళ ఉట్టిపడుతోంది. కండలుదేరిన శరీరాలు, చేతులు ఆయుధాల్ని పట్టుకోవడంవల్ల కాయలు కాశాయి. ఇవన్నీ గమనించాడు. అయినా ఇవ్వడానికే సిద్ధపడ్డాడు.

**'వచ్చినవాడు తనను చంపుతాడని తెలిసీ దానం ఇచ్చి బలి చక్రవర్తి కీర్తిమంతుడయ్యాడు. ఈ శరీరం ఎప్పటికైనా నశించేదే! ప్రాణం ఉన్నప్పుడే కాసింత కీర్తి సంపాదించుకోవాలి'** అని నిశ్చయించుకొని సరేనన్నాడు.

అప్పుడు శ్రీకృష్ణుడు తామెవరో చెప్పి 'మాలో ఒకరితో నువ్వు ద్వంద్వ యుద్ధం చేయాలి. ఎవరు కావాలో నువ్వే ఎంచుకో' అన్నాడు.

దానికి జరాసంధుడు నవ్వి 'శ్రీకృష్ణా! నువ్వు నాకు భయపడి సముద్రంలో దాక్కొన్న పిరికిపందవి. అర్జునుడేమో కుర్రకుంక. నాకు సరైన జోడీ భీముడే! అని తొడకొట్టాడు.

యుద్ధం ప్రారంభమైంది. భీముడూ జరాసంధుడూ గదలతో కొట్టుకొన్నారు. అవి విరిగిపోయాయి. ముష్టియుద్ధం చేశారు. ఒకరినొకరు పిడిగుద్దులు గుద్దు కున్నారు. పడదోసుకున్నారు. పట్టుమీద పట్టు, దెబ్బమీద దెబ్బ. ఎవరూ తగ్గటం లేదు. ఎవరూ తీసిపోవటంలేదు. యుద్ధం తెమలటంలేదు.

చుక్కలు రాలిపోతాయా! దిక్కులు వణికిపోతాయా! సముద్రాలు అల్లకల్లోలం అయిపోతాయా, భూమి కంపిస్తుందా అన్నట్లుంది వాళ్ళ యుద్ధం. ప్రక్కలూ చెక్కిళ్ళూ, మెడలూ, ముక్కులూ పగిలేలా గ్రుద్దుకుంటున్నారు. అంతలోనే విడిపడుతున్నారు. మరుక్షణమే హుంకరిస్తూ శరీరాలతో ఢీకొట్టుకొంటున్నారు. ఎగిరి పడుతున్నారు, రొప్పుతున్నారు. అయినా యుద్ధం మానడంలేదు. వాళ్ళ పరాక్రమం అంతటిది మరి.

శ్రీకృష్ణుడికి జరాసంధుడి పుట్టుపూర్వోత్తరాలు తెలుసు. ఏంచేస్తే వాడు చస్తాడో కూడా తెలుసు. ఒక చెట్టుకొమ్మను తీసుకొని రెండుగా చీల్చి భీముడికి చూపించి కనుసైగ చేశాడు. భీముడు అలాగే ఒక తాటిచెట్టును రెండుగా చీల్చినట్లుగా ఒక

కాలిని తన కాలితో నొక్కిపట్టి రెండో కాలును చేత్తో పట్టుకొని నిలువునా రెండుగా చీల్చి అపసవ్యంగా విసిరివేసి జరాసంధుణ్ణి సంహరించాడు. ఆ దృశ్యాన్ని చూసిన పురజనులు హాహాకారాలు చేశారు.

## శ్రీకృష్ణ స్తుతి

రాజా! తరువాత చెరసాలలో పడి మగ్గిపోతున్న రాజులందరినీ శ్రీకృష్ణుడు మర్చిపోకుండా విడిపించాడు. వాళ్లందరూ వాసుదేవుడి పాదాలపై పడి **'మాధవా! మానవులు చివరిదాకా ఐహిక సుఖాల కోసం పాకులాడి వ్యర్థమైన కోరికలతో ఉంటారు. చివరికి సంసార సముద్రాన్ని దాటలేక అలాగే నశించిపోతూ ఉంటారు. మేము అలాంటి కష్టాలను అనుభవించలేము స్వామీ! మాకు నిరంతరం నీ పాదకమల సేవను ప్రసాదించు'** అని వేడుకొన్నారు.

అప్పుడు దామోదరుడు **'ఓ రాజులారా! మీరన్నది నిజం. సజ్జనుల్నీ అమాయక ప్రజల్నీ హింసించడం వల్లనే వేనుడు, నహుషుడు, రావణుడు, కార్తవీర్యార్జునుడు, ఇదుగో ఇప్పుడీ జరాసంధుడు నాశనమయ్యారు. ధర్మాన్ని పాటిస్తేనే కులం, బలం, ఆయువు, కీర్తి, ఔన్నత్యం వృద్ధి పొందుతాయి. కాబట్టి ఈ శరీరం శాశ్వతం కాదని గుర్తించండి. ధర్మమార్గంలో పరిపాలించి మోక్షాన్ని పొందండి.'** అని వాళ్ళందర్నీ వాళ్లవాళ్ల రాజ్యాలకు సాగనంపాడు. వాళ్ళు –

**ఆ.వె. వరద! పద్మనాభ! హరి! కృష్ణ! గోవింద!**
**దాసదుఃఖనాశ! వాసుదేవ!**
**యవ్యయాప్రమేయ! యనిశంబుఁ గావింతు**
**మిందిరేశ! నీకు వందనములు** (10–2–749)

అంటూ నమస్కరించి వెళ్ళిపోయారు.

## శిశుపాల వధ

యజ్ఞం ప్రారంభమయింది. వేదవ్యాసుడు, కశ్యపుడు, భరద్వాజుడు మొదలైన మహర్షులూ, భీష్మద్రోణాది ప్రముఖులూ కౌరవులూ, ఇంకా బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్ర ముఖ్యులు, రాజులూ అందరూ వచ్చారు.

ధర్మరాజే స్వయంగా అతిథి మర్యాదలు చూసుకొంటున్నాడు. యజ్ఞ దీక్ష

పట్టాడు ధర్మరాజు. దుర్యోధనుణ్ణి రాజులు సమర్పించే కానుకల్ని తీసుకొనే పనిలో పెట్టాడు. అలాగే తక్కిన వాళ్ళకూ తలా ఒక పని అప్పగించాడు.

పరీక్షిన్మహారాజా! **శ్రీమన్నారాయణుడి పాదపద్మాలనే నమ్ముకోవాలిగానీ ఈ విశ్వంలో దొరకని సౌభాగ్యమంటూ ఉంటుందా!**

మంత్రాలు మార్మోగుతున్నాయి. అగ్నులు ప్రజ్వరిల్లుతున్నాయి. యాగంలో ఎవరికో ఒకరికి అగ్రతాంబూలం ఇవ్వాలి. పూజించాలి.

ధర్మరాజు శ్రీకృష్ణుడి కాళ్ళు కడిగి ఆ పవిత్ర జలాన్ని సకుటుంబంగా శిరస్సుపై జల్లుకున్నాడు. అందరూ చూసి ఆనందిస్తుంటే శిశుపాలుడు మాత్రం అది సహించలేకపోయాడు. అందరూ వినేలా–

'ధర్మరాజా! ఇంతమంది పెద్దలూ పూజ్యులూ సభలో ఉంటే నీకీ యాదవుడు తప్ప ఎవరూ దొరకలేదా?' అంటూ శ్రీకృష్ణుణ్ణి తక్కువజేసి మాట్లాడటమేకాక తీవ్రంగా నిందించాడు.

శ్రీకృష్ణుడు వాడి మాటలు పట్టించుకోలేదు. అక్కడ ఉన్న ప్రతి ఒక్కరూ ఎంతగానో బాధపడ్డారు. పాండవులకూ కోపం వచ్చింది. ఊ అంటే చాలు చంపేద్దామన్నట్లుగా ఉన్నారు కొందరు క్షత్రియ వీరులు.

శ్రీకృష్ణుడు అందరినీ వారించాడు. వాణ్ణి కొంతసేపు వాగనిచ్చాడు. అప్పటికి పాపం పండిందేమో అన్నట్లుగా సుదర్శన చక్రాన్ని పంపాడు. అది శిశుపాలుడి శిరస్సును మొండెం నుంచి వేరుచేసింది.

అందరూ చూస్తూ ఉండగా శిశుపాలుడి శరీరం నుండి ఒక దివ్యకాంతి వచ్చి శ్రీకృష్ణుడిలో ఐక్యమయింది.

చివరిగా ధర్మరాజు అవభృథ స్నానానికి వెళ్ళాడు. అందరూ అతణ్ణి అనుసరించారు. ఎంతో వైభవంగా గంగానదికి వెళ్ళి భార్యాసమేతుడై శాస్త్రోక్తంగా అవభృథ స్నానమాచరించాడు. తిరిగి నగరానికి వచ్చి భూరిదానాలు చేశాడు. అందరినీ సత్కరించి పంపాడు. శ్రీకృష్ణుడు కొన్నాళ్ళక్కడే ఉన్నాడు.

పరీక్షిన్మహారాజా! కురువంశం నాశనం కోసమే పుట్టాడన్నట్లుగా దుర్యోధనుడు పాపాత్ముడై వ్యవహరిస్తున్నాడు. వాడు ఎవరి మాటా వినడు. అంతమంది యాగానికి

వచ్చారా! అందరూ ఎంతో ఆనందించారా! కానీ దుర్యోధనుడికి పాండవుల వైభవం కంటగింపుగా మారింది. అతడి కడుపు మండిపోయింది.

మయుడు పాండవులకు ఒక సభను నిర్మించి ఇచ్చాడు. భూలోకంలోని అందరి రాజుల సంపదలూ, చివరికి దేవేంద్రుడి ఐశ్వర్యమూ ఆ మయసభలో ఉన్న సంపదలకు సాటిరాదంటే నమ్ము. ఇది దుర్యోధనుడికి మరింత అసూయను కలిగించింది.

ఒక రోజు ధర్మరాజు శ్రీకృష్ణుడితో సోదరులతో కలసి మయసభలో కొలువుతీరి ముచ్చట్లాడుతున్నాడు. అప్పుడు దుర్యోధనుడు అక్కడికి వచ్చాడు. సభలోనికి అడుగు పెట్టాడు. ఒకచోట నీళ్ళు ఉన్నట్లుగా కనిపించింది. బట్టలు పైకి ఎత్తి పట్టుకొని నడిచాడు. నిజానికి అక్కడ నీరు లేదు. మరోచోట నీళ్ళు ఉన్నాయి. లేవనుకొని భ్రమపడ్డాడు. అతడి వస్త్రాలు తడిసి పోయాయి. అతడు అలా భ్రమలో పడి నానా తిప్పలు పడడాన్ని చూసి భీమసేనుడు నవ్వాడు. ధర్మరాజు వారిస్తూనే ఉన్నాడు. కానీ తక్కిన రాజులూ, స్త్రీలూ పెద్దగా పకపకా నవ్వారు. దుర్యోధనుడు చిన్నబుచ్చుకున్నాడు. శ్రీకృష్ణుడూ అక్కడే ఉన్నాడు కానీ మౌనం వహించాడు. అప్పట్నుంచీ దుర్యోధనుడు ఆ అవమాన భారంతో మరింత రగిలిపోయాడు.

తరువాత కొన్నాళ్ళకు శ్రీకృష్ణుడు తనవాళ్ళనందరినీ తీసుకొని ద్వారకకు వెళ్ళిపోయాడు. వీళ్ళు వచ్చేలోగా ద్వారకకు ఒక పెద్ద ప్రమాదం ముంచుకొచ్చింది. అది సాల్వుడి రూపంలో.

## సాల్వుడి దండయాత్ర

రాజా! శ్రీకృష్ణుడు రుక్మిణీదేవిని ఎత్తుకొనివచ్చిన సందర్భంలో శిశుపాలుడితో కలిసి పోరాడిన వారిలో సాల్వదేశానికి రాజు సాల్వుడు కూడా ఒకడు. అతడు యాదవుల్ని సర్వనాశనం చేస్తానని ప్రతిజ్ఞ చేసి అందుకోసం ఈశ్వరుడిని ఆరాధించాడు. పరమేశ్వరుడి అనుగ్రహంతో ఆకాశంలో సంచరించే వాహనాన్ని వరంగా పొందాడు. అదే 'సౌభకం' అనే పురం. శివుడి ఆదేశంతో మయుడు దీనిని నిర్మించి సాల్వుడికి ఇచ్చాడు. ఈ పురం ఆకాశంలో ఎక్కడికైనా ఎగిరి పోగలదు. ఇంకేముంది? దానిపై వచ్చి ద్వారకను ముట్టడించాడు. ద్వారకా నగరాన్ని ధ్వంసం చేయసాగాడు. ప్రజల్ని దారుణంగా పీడించడం మొదలుపెట్టాడు.

అప్పుడు ప్రద్యుమ్నుడు అతణ్ణి ఎదిరించి పోరాడాడు. సాత్యకి, చారుధేష్ణుడు, సాంబుడు ఇలా యాదవవీరులూ చతురంగ సైన్యాలతో వెంబడించారు.

ప్రద్యుమ్నుడికి మహామాయావిద్యలు తెలుసు. అందుకే అతడు సాల్వుడి మాయలన్నింటినీ అరికట్టగలిగాడు. ప్రద్యుమ్నుడి పరాక్రమానికి సాల్వుడూ అతడి సైన్యమూ తీవ్రమైన క్షోభకు గురయింది. ఇక సౌభక పురం మీద తిరుగుతూ దాడి చేశాడు సాల్వుడు. ఆ పురం ఒకసారి కనిపిస్తుంది. అంతలోనే మాయ మవుతుంది. యాదవ వీరుల ప్రతాపానికి సాల్వుడి సైన్యమూ, అతడి సౌభక నగరమూ దెబ్బతిన్నాయి.

ఇదంతా చూస్తూ సహించలేకపోయాడు సాల్వుడి మంత్రి ద్యుముడు. అతణ్ణి కూడా ప్రద్యుమ్నుడు బాణాలతో ఉక్కిరిబిక్కిరి చేశాడు. ఇక భరించలేక ఆ నగరం నుండి కిందికి దూకి మెరుపులా వచ్చి ప్రద్యుమ్నుణ్ణి గదతో గుండెలపై గట్టిగా కొట్టాడు. ప్రద్యుమ్నుడు మూర్ఛపోయాడు. సారథి రథాన్ని దూరంగా నడిపి అతణ్ణి రక్షించాడు. కొంతసేపటికి తేరుకొన్న ప్రద్యుమ్నుడు తిరిగి రణరంగానికి వచ్చి ద్యుముణ్ణి సంహరించాడు. తక్కిన యాదవ వీరులు బాణవర్షం కురిపించి శత్రు సైనికుల తలల్ని ఎగరగొట్టారు. అవి వెళ్ళి సముద్రంలో పడ్డాయి.

ఇంద్రప్రస్థం నుండి ద్వారకకు వస్తూ దారిలోనే ఈ యుద్ధం జరగడాన్ని చూసి బలరామకృష్ణులు రంగప్రవేశం చేశారు. శ్రీకృష్ణుణ్ణి చూడగానే సాల్వుడు శక్తి ఆయుధాన్ని ప్రయోగించాడు. దాన్ని బాణాలతో ఖండించి సుదర్శన చక్రంతో వాడి శిరస్సు ఖండించాడు శ్రీకృష్ణుడు.

## దంతవక్త్రుడి వధ

ఈ సాల్వుడికి మరో మిత్రుడు ఉన్నాడు. వాడే దంతవక్త్రుడు. శ్రీకృష్ణుడిపై పగతో రగిలిపోయేవాడు.

పళ్ళు పటపటా కొరుకుతూ, కన్నుల నుంచి నిప్పులు రాలుస్తూ భూమి కంపించేలా నడుస్తూ శ్రీకృష్ణుడి మీదికి వచ్చాడు దంతవక్త్రుడు. 'కృష్ణా! నువ్వు బంధువు రూపంలో ఉన్న శత్రువ్వి. నిన్ను మేనమామ కొడుకని కూడా చూడను.

ఇదుగో నా గదాఘాతంతో నిన్ను నేరుగా యమపురికి పంపిస్తాను. నా మిత్రుల ఋణం తీర్చుకొంటాను. అని గదతో శ్రీకృష్ణుడి తలపై మోదాడు.

అంకుశంతో పొడిస్తే మత్తగజం ఎలా రెచ్చిపోతుందో అలాగే శ్రీకృష్ణుడు రెచ్చిపోయి తన గదతో వాడి వక్షఃస్థలాన్ని పగలగొట్టాడు. దెబ్బకు వాడు రక్తం కక్కుకుంటూ నేలకొరిగాడు. అప్పుడు ఒక దివ్య తేజస్సు అతడి శరీరంలో నుండి వచ్చి శ్రీకృష్ణుడిలో కలిసిపోయింది. దంతవక్త్రుడి తమ్ముడు కూడా శ్రీకృష్ణుడి మీదకు వచ్చి అతడి చేతుల్లోనే మరణించాడు. విజయోత్సాహంతో శ్రీకృష్ణుడు ద్వారకకు విచ్చేశాడు.

## బలరాముడి తీర్థయాత్రలు

రాజా! తరువాత కొన్నాళ్ళకు బలరాముడు తీర్థయాత్రలకు బయలుదేరాడు. అందుకో కారణం ఉంది. కురుక్షేత్ర సంగ్రామం ప్రారంభం కాబోతోంది. పాండవులూ కౌరవులూ ఇద్దరికీ తను కావలసినవాడు. ఎవరికి మద్దతు ఇవ్వాలో ఎవరివైపు పోరాడాలో తేల్చుకోలేక మధ్యేమార్గంగా తీర్థయాత్రల్ని ఎంచుకున్నాడు.

మొదట ప్రభాస తీర్థంలో స్నానమాచరించాడు. తరువాత నైమిశారణ్యానికి వెళ్ళాడు. అక్కడ సూతుడు తనను చూసి లేవలేదని కోపించి, అది తనను అవమానించినట్లుగా భావించాడు. కోపంతో 'ఎంత చదివితే ఏం లాభం? సభ్యతా సంస్కారం ఉండవద్దూ? ఇంద్రియ నిగ్రహం లేనివాడూ, గర్వీ, వినయం లేనివాడూ, తనను తాను గొప్ప పండితుణ్ణని అనుకొనే వాడు ఎంత విద్య నేర్చినా వాడికి వంటపట్టదు. అక్కరకు రాదు. ఎదుటివాళ్లకి చెప్పడానికే నీతులు. ఆచరించడానికి కాదని వీడు నిరూపించాడు' అని నిందిస్తూ అతణ్ణి వధించాడు. తక్కిన ఋషులందరూ హాహాకారాలు చేశారు.

'బలరామా! సూతుడు బ్రహ్మజ్ఞాని. సర్వసంగ పరిత్యాగి. ఇతడికి బ్రహ్మాస్థానం ఇచ్చింది మేమే! అతణ్ణి వధించి నువ్వు బ్రహ్మహత్యా పాపాన్ని కొనితెచ్చుకొన్నావు. అన్నారు మహర్షులు.

బలరాముడు నిజమేనని అంగీకరించి ప్రాయశ్చిత్తం చెప్పమన్నాడు. తన యోగశక్తితో సూతుణ్ణి బతికిస్తానన్నాడు. 'అంతేకాదు. ఈ సూతుడే తన భార్యకు

పుత్రుడిగా పుట్టి ఉగ్రశ్రవసుడు అనే పేరుతో మీకు సకల పురాణాలనూ బోధిస్తాడు. అందువల్ల ఈ సూతుడు (రోమహర్షణుడు) ప్రత్యక్షంగా జీవించకపోయినా పుత్రుడి రూపంలో మీ మధ్య ఉంటాడు. మీరు చేస్తున్న సత్రయాగంలో చివరిదాకా పురాణాలు చెబుతూనే ఉంటాడు. మరి నాకు ప్రాయశ్చిత్తం సెలవియ్యండి.' అన్నాడు. దానికి ఋషులు 'బలరామా! ఇక్కడ పల్వలుడు అనే రాక్షసుడు అమావాస్య, పౌర్ణమి రోజుల్లో వచ్చి మా యాగాన్ని ఆటంకపరుస్తున్నాడు. వాణ్ణి సంహరించు. తరువాత పుణ్యతీర్థాల్లో స్నానం చెయ్యి. నీ పాపం పోతుంది' అన్నారు.

బలరాముడు పల్వలుణ్ణి తన ముసలానికి బలి ఇచ్చి తీర్థయాత్రలకు వెళ్ళిపోయాడు.

తీర్థాల్ని సేవించుకొని చివరిగా కురుక్షేత్ర యుద్ధరంగ ప్రాంతానికి వచ్చాడు.

అప్పటికి యుద్ధం దాదాపు పూర్తయింది. కురుపాండవ యుద్ధంలో ఎందరో రాజులు మరణించారని తెలుసుకొని 'హమ్మయ్య! భూభారం తగ్గిందిలే' అనుకున్నాడు. చివరిగా భీముడు, దుర్యోధనుడు గదాయుద్ధం చేస్తున్నారని బ్రాహ్మణుల ద్వారా తెలుసుకొని అక్కడికి వెళ్ళాడు. 'వీళ్ళిద్దరూ సమానమైన వీరులు. ఎప్పటికీ విజయం తేలదు. కాబట్టి యుద్ధం విరమించండి.' అని సలహా ఇచ్చాడు. కానీ వాళ్ళు వినలేదు. 'వాళ్ళ కర్మ!' అనుకొని తాను మళ్ళీ నైమిశారణ్యానికి వెళ్ళిపోయాడు.

## కుచేలోపాఖ్యానం

**ఓ మహారాజా! కుచేలుడు అని శ్రీకృష్ణుడి సహాధ్యాయి. బ్రాహ్మణోత్తముడు, ఆత్మాభిమానం కలవాడు, జ్ఞాని, శాంతమూర్తి, జితేంద్రియుడు, ధర్మాత్ముడు. ఒకప్రక్క కటిక దారిద్ర్యాన్ని అనుభవిస్తూ కూడా ఎవరినీ నోరు తెరిచి యాచించిన పాపాన పోలేదు.**

అతడి భార్య కూడా అంతే! భర్తకు తగ్గ భార్య. ఇతణ్ణి పల్లెత్తు మాట అని ఎరుగదు. ఇంట్లో పిల్లలు ఆకలికి అలమటిస్తున్నారు. పెదవుల్ని నాలుకలతో తడుపుకొంటూ ఆకులూ గిన్నెలూ పట్టుకొని అమ్మా! అన్నం పెట్టవూ అని అంటుంటే ఆమె ఒకరోజు భర్తతో –

'స్వామీ!

చం. వరదుఁడు సాధుభక్తజనవత్సలుఁ డార్తశరణ్యుఁ డిందిరా
వరుఁడు దయాపయోధి భగవంతుఁడు కృష్ణుఁడు దాఁ గుశస్థలీ
పురమున యాదవప్రకరముల్ భజియింపగ నున్నవాఁడు నీ
వరిగిన నిన్నుఁజూచి విభుఁడప్పుడ యిచ్చు ననూనసంపదల్

(10-2-970)

**వరప్రదాత, సజ్జనులైన భక్తులపై వాత్సల్యం కురిపించేవాడు, ఆర్తులకు దిక్కైనవాడు, లక్ష్మీపతి, దయాసాగరుడు, భగవంతుడు అయిన మీ మిత్రుడు శ్రీకృష్ణుడు కుశస్థలీపురంలో యాదవులు కొలుస్తూ ఉంటే అత్యంత వైభవంగా ఉన్నాడు కదా! ఒక్కసారి నువ్వు వెళ్తే నిన్ను చూసి ఆ విభుడు సాటిలేని సంపదలను ఇస్తాడు కదా! అంతేకాదు, కలలో కూడా తనను స్మరించని దుర్మార్గుడైనా సరే! ఆపదలో ఉన్నప్పుడు ఒక్కసారి ఆ దేవుడి పాదాలను స్మరిస్తే చాలు. కనికరించి ఆదుకొంటాడు. అంతటి మహనీయుడు నీలాంటి భక్తుణ్ణి ఆదరించడా!'**

ఆమె మాటలు నిజమే ననిపించాయి. ప్రయాణమయ్యాడు. ఏం తీసుకువెళ్ళాలి? అని అనుకొంటుంటే ఆ భార్య కొన్ని అటుకుల్ని తెచ్చి ఇతడి చినుగుల ఉత్తరీయంలో ముడివేసి పంపింది.

కుచేలుడి మనసులో ఏవేవో ఆలోచనలు. మొత్తానికి శ్రీకృష్ణుడి అద్భుతమైన మణిసౌధానికి చేరుకొన్నాడు. లోపలికి వెళ్ళాడు. అక్కడ ఒకచోట ఒక వధూమణి వింజామరలు వీస్తుంటే హంసతూలికా తల్పంపై చిద్విలాసంగా కూర్చొని యదుకుల చంద్రుడు ఆమెతో ముచ్చటిస్తున్నాడు.

చూశాడు కుచేలుడు. అంతలో శ్రీకృష్ణుడి దృష్టి అలవోకగా కుచేలుడిపై పడింది. దిగ్గున లేచి కుచేలుణ్ణి సాదరంగా ఆహ్వానించి, ఆప్యాయంగా కౌగిలించు కొన్నాడు. తన మంచంపై కూర్చోపెట్టి కుశల ప్రశ్నలు వేశాడు. బంగారు కలశాలలోని నీళ్లతో అతడి పాదాలు కడిగాడు. ఆ జలాన్ని నెత్తిన జల్లుకున్నాడు. మైపూతలు పూశాడు. వింజామరలు వీచాడు. హారతులు పట్టాడు. సిగలో పువ్వులు ముడిచి, కర్పూర తాంబూలం ఇచ్చి గోదానం చేసి స్వాగతించాడు.

కుచేలుడి శరీరం పులకించిపోయింది. కన్నుల నుండి ఆనందాశ్రువులు స్రవించాయి. శ్రీకృష్ణుడి పట్టపురాణి రుక్మిణీదేవి కరకంకణాలు ఘల్లుఘల్లుమనేలా వింజామరలు వీచింది. ఇది చూసిన అంతఃపురవాసులు –

**ఉ. ఏమితపంబు సేసెనొకొ! యీధరణీదివిజోత్తముండు దొల్**
**బామున! యోగివిస్ఫురదుపాస్యకుఁడై తనరారు నీ జగ**
**త్స్వామి రమాధినాథు నిజతల్పమునన్ వసియించి యున్నవాఁ**
**డీ మహనీయమూర్తి కెనయే మునిపుంగవు లెంతవారలున్?**

(10–2–985)

'ఆహా! ఈ బ్రాహ్మణుడు ఎంత గొప్ప తపస్సు చేశాడో కదా! యోగివంద్యుడైన శ్రీకృష్ణుడి పాన్పుపై కూర్చొనే భాగ్యానికి నోచుకొన్నాడు. ఎంతటి గొప్ప మహర్షులైనా ఇతడికి సాటివస్తారా? పక్కనే ఉన్న రుక్మిణి ఏమన్నా అనుకొంటుందేమోనని కూడా లేకుండా ఎంతలా అతడికి సపర్యలు చేస్తున్నాడు స్వామి!' అని ఆశ్చర్యపోయారు.

శ్రీకృష్ణుడు కుచేలుడి చేతిని తన చేతిలోకి తీసుకొని చిన్ననాటి మధుర స్మృతుల్ని నెమరువేసుకొంటున్నాడు.

'బ్రాహ్మణోత్తమా! నీ భార్య ఎలా ఉంది? నీకు అనుకూలంగానే ఉందా? ఇంతకూ నీకు సంసారంపై దృష్టి ఉన్నట్లు లేదు. కొందరు మహానుభావులు ఇంతే. లోకశాంతి కోసమే తన కర్మల్ని ఆచరిస్తారు. కర్తవ్య నిష్ఠతో జీవిస్తారు.' మనం మన గురుకులంలో ఎంత హాయిగా కాలక్షేపం చేసేవాళ్ళమో గుర్తుందా!

**తే.గీ. తివిరి యజ్ఞానతిమిరప్రదీప మగుచు**
**నవ్యయంబైన బ్రహ్మంబు ననుభవించు**
**భరితసత్త్వుండు సత్కర్మ నిరతుఁ డతుల**
**భూసురశ్రేష్ఠుఁ డలఘుండు బుధనుతుండు** (10–2–994)

గురువు అజ్ఞానం అనే చీకటికి దీపం. బ్రహ్మానందాన్ని అనుభవించే సత్త్వగుణ సంపన్నుడు. నిత్యం సత్కర్మల్ని ఆచరించే సత్పురుషుడు. సాటిలేని బ్రాహ్మణ శ్రేష్ఠుడు. గొప్ప వాడు. పండితులు కొనియాడేవాడు.

గుర్తుందా! మనం గురుపత్ని ఆదేశంపై అడవికి వెళ్ళి కట్టెలు తెచ్చిన సంగతి. అప్పుడు పెద్ద వర్షం వచ్చింది. ఒకటే ఉరుములు మెరుపులు. చీకటి

పడింది. ఒకటే చలి. మనం దారితప్పి అడవిలో ఎక్కడికో వెళ్ళిపోయాం. తెల్లవారే వరకూ అక్కడే ఉండిపోయాం. అప్పుడు మన గురువు సాందీపనిమహర్షే మనల్ని వెతుక్కొంటూ వచ్చి మనకోసం కంగారుపడలేదూ! మనల్ని నిండు నూరేళ్ళు ఐశ్వర్యంతో వర్ధిల్లమని దీవించలేదూ!'

కుచేలుడు అన్నాడు – 'మనం ఎన్ని చేయలేదు? అన్నీ గుర్తున్నాయి. ముల్లోకాలకూ నువ్వే గురువ్వి. నీకు మళ్ళీ గురువుంటాడా! అంతా నీ లీల! అన్నాడు.

శ్రీకృష్ణుడికి అతడి మాటల్లోని ఆంతర్యం అర్థమయింది. మిత్రమా! ఏం తెచ్చావయ్యా నా కోసం? అది ఎంత లేశమైనా నాకు మహాప్రసాదమే.

**కం. దళమైనఁ బుష్పమైనను**
**ఫలమైనను సలిలమైనఁ బాయనిభక్తిం**
**గొలిచిన జను లర్పించిన**
**నెలమిన్ రుచిరాన్నముగనె యేను భుజింతున్** (10–2–1010)

పుష్పం, ఫలం, పత్రం, జలం ఏదైనా భక్తితో అర్పిస్తే అది నాకు పరమాన్నమే! ఇష్టంగా స్వీకరిస్తాను. ఆ మాటలు కుచేలుడికి అమృతంలా తోచాయి. ఇంతలా చెప్పినా కుచేలుడు తను తెచ్చిన అటుకుల్ని శ్రీకృష్ణుడికి ఇవ్వలేకపోయాడు. మౌనం వహించాడు.

శ్రీకృష్ణుడు కుచేలుడు వచ్చిన కారణాన్ని తెలుసుకున్నాడు. పూర్వం ఐశ్వర్యాన్ని కోరి తను నన్నర్చించలేదు. ఇప్పుడు కూడా తన భార్య కోరగా వచ్చాడు. అందుకే ఇంద్రాదులకు సైతం దుర్లభమయిన సంపదలు ఇతడికి ఇవ్వాలి అనుకున్నాడు.

శ్రీకృష్ణుడే చనువుగా 'ఇదేమిటి కుచేలా?' అని అటుకుల ముడిని విప్పి గుప్పెడు అటుకులు తీసుకున్నాడు. 'నాకు ఇవి చాలవా?' అంటూ వాటినే ఆరగించాడు. మరో పిడికెడు అందుకున్నాడు. అప్పుడు రుక్మిణి – 'స్వామీ! ఇతడికి సకల సంపదలూ అందించడానికి ఇప్పటికి మీరు తిన్న ఈ అటుకులు చాలు. ఇంకానా? వద్దు' అని వారించింది.

కుచేలుడికి ఆ రోజు గొప్ప ఆతిథ్యం లభించింది. మరునాడు ఉదయం తన నగరానికి బయలుదేరాడు. అతడి హృదయం ఆనందంతో తేలిపోతోంది. ఆగర్భ దరిద్రుడయిన నేనెక్కడ? లక్ష్మీనివాసుడైన శ్రీకృష్ణుడెక్కడ? ఆహా! నన్ను ఎంత ఆదరించాడు! ఎంత సత్కరించాడు! అరె! అతడి పట్టపురాణి రుక్మిణీదేవి కూడా నాకు వింజామరలు విసిరిందే! నా మిత్రుడు నా కాళ్ళు పట్టాడు. ఏమి నా భాగ్యం! అనుకొంటూ తన నగరం చేరుకున్నాడు. చేరుకొని ఆశ్చర్యపోయాడు.

ఎక్కడ చూసినా చంద్రకాంత శిలానిర్మాణాలు, చక్కటి ఉద్యానవనాలు. నానావిధ భూషణాలు ధరించిన దాసదాసీ జనులతో ఒక సుందర భవనం కనిపించింది. ఇది ఏ పుణ్యాత్ముడి భవనమో అనుకొన్నాడు. కానీ అంతలోనే ఆ భవనంలో నుంచి వచ్చిన సుందరీమణులు కుచేలుణ్ణి సాదరంగా లోపలికి తీసుకువెళ్ళారు. మానవరూపం ధరించిన లక్ష్మీదేవిలా ఉన్న ఒక ఇల్లాలు ఎదురు వచ్చి కుచేలుడికి స్వాగతం పలికింది. కుచేలుడు ఆమెను చూసి ఆశ్చర్యపోయాడు. ఆమె ఎవరోకాదు, సాక్షాత్తూ తన భార్యే!

అయ్యో! నేను ధనం కోసమే శ్రీకృష్ణుడి వద్దకు వెళ్ళాను. నేను అడక్కపోయినా అది గ్రహించి నాకు సకల సంపదలూ అనుగ్రహించాడు. అని భక్తిప్రపత్తులతో శ్రీకృష్ణుడినే ధ్యానిస్తూ భార్యాసమేతుడై జీవించాడు.

రాజా! ఈ కుచేలోపాఖ్యానం విన్నవారికి, చెప్పినవారికి ఇహలోక సౌఖ్యాలు, పరలోక సౌఖ్యాలూ, హరిభక్తీ, యశస్సూ కలుగుతాయి.

## ఆత్మీయుల కలయిక

కొన్నాళ్ళు బలరామకృష్ణులు ద్వారకలోనే సుఖంగా ఉన్నారు. ఒకసారి సూర్యగ్రహణం వచ్చింది. శమంతపంచకం అనే పవిత్ర క్షేత్రానికి చేరుకొని పుణ్యస్నానాది విధుల్ని నిర్వహించి, భూరిదానాలు ఇచ్చి, భోజనాలు చేసి అక్కడే పొన్నచెట్ల నీడలో విశ్రమించారు. ఎందరో రాజులు ఆ క్షేత్రానికి వచ్చి శ్రీకృష్ణుణ్ణి సందర్శించారు. బలరామకృష్ణులు వాళ్ళందరినీ సత్కరించారు. ఆ రాజులు, అందరూ వినేలా –

**మ. మన శాస్త్రంబులు వాక్కులున్ మనములున్ మాంగల్యముం బొంది పా**
**వనమై యొప్పెడి నే రమావిభుని భాస్వత్పాదపంకేజ సే**
**చనతోయంబుల, నే మహాత్ముని పదాబ్జాతంబు లెందేని సోఁ**
**కిన చోటెల్లను ముక్తిహేతువగు నీ కృష్ణుండె పో! చూడఁగన్**
(10-2-1047)

మన శాస్త్రాలూ, వాక్కులూ, మనస్సులూ ఏ పరంధాముడి పాదపద్మతీర్థం వల్ల పవిత్రాలౌతున్నాయో, ఏ మహాత్ముడి పాదస్పర్శకు నోచుకున్న ప్రదేశమంతా ముక్తికి హేతువవుతుందో అటువంటి మహానుభావుడీ శ్రీకృష్ణుడు.

**చం. సనక సనందనాది మునిసత్తము లంచిత యోగదృష్టిచేఁ**
**బనివడి యాత్మలన్ వెదకి పట్ట నగోచరమైన మూర్తి యి**
**ట్లనవరతంబు మాంస నయనాంచల గోచరుఁ డయ్యె నట్టె! యే**
**మననగు? వీరి పుణ్యమున కాదట నెట్టి తపంబు సేసిరో!** (10-2-1048)

సనక సనందనాది మహర్షులు గొప్ప యోగశక్తితో ఆత్మలలో వెదికి పట్టుకోవాలని ఎంతగా ప్రయత్నించినా తపించినా గోచరం కాని ఈ మంగళస్వరూపుడు మాంస నిర్మితాలైన మీ కళ్ళకు ఇలా సాక్షాత్కరిస్తున్నాడు. వీళ్ళంతా ఎంత పుణ్యం చేశారో కదా! ఎంత తపస్సు చేశారో మరి!" అంటూ ఆ రాజులు అందరూ వినేలా యాదవుల అదృష్టాన్ని కొనియాడారు.

కుంతీదేవి కూడా వచ్చినవారిలో ఉంది. తన పుట్టింటివారిని చూడటంతో ఆమె మనస్సుకు స్వస్థత చేకూరింది. తన అన్న వసుదేవుడితో కష్టం సుఖం మాట్లాడింది.

వచ్చిన రాజులందరినీ బలరామకృష్ణులు సత్కరించి పంపారు. వెళ్తూ వెళ్తూ అందరూ ఉగ్రసేన మహారాజును కీర్తిస్తూ వెళ్ళిపోయారు.

ఈలోగా యశోదానందులు వచ్చారు. వీళ్ళను చూడగానే శ్రీకృష్ణుడు ఆప్యాయంగా కౌగిలించుకున్నాడు. పుత్రుడిపై ప్రేమ ఆనందబాష్పాలుగా జాలు వారింది. కంఠం మూగవోయింది. 'పసిగుడ్డుల్ని అప్పగిస్తే వాళ్ళను పెంచి పెద్దవాళ్ళను చేసిన నీ ఋణం ఎలా తీరుతుంది యశోదా!' అంటూ రోహిణీ దేవకీదేవులు యశోదను కొనియాడారు.

పాండవులూ వచ్చారు. శ్రీకృష్ణుడూ వాళ్ళకు కుశల ప్రశ్నలు వేశాడు. ద్రౌపదీ శ్రీకృష్ణుడి భార్యలూ ఒకచోట చేరారు. కబుర్లు చెప్పుకున్నారు.

## వసుదేవుడి యాగం

తరువాత కొంతకాలానికి ద్వారకలో ఉన్న బలరామకృష్ణుల వద్దకు నారద వ్యాసకణ్వాది మహర్షులు విచ్చేశారు. శ్రీకృష్ణుడిని సేవించారు. శ్రీకృష్ణుడూ వాళ్ళకు అతిథి సత్కారాలు చేసి భక్తితో అర్చించాడు. 'మహాత్ములారా! మిమ్మల్ని సేవిస్తే పుణ్యతీర్థాలను సేవించిన ఫలం వస్తుంది?' అన్నాడు. అప్పుడా మునులు –

'శ్రీకృష్ణా! నువ్వు పరమాత్మస్వరూపుడివి. విశ్వమంతా అనేకరూపాలలో ఉన్నది నువ్వే. ఒకే మట్టి, ఎన్నో రూపాల్ని పొందుతుంది. అలాగే నువ్వూనూ. అన్ని ప్రాణుల్లోని ఆత్మ నీవే! **లోకసంరక్షణం కోసమే మానవుడిగా పుట్టి ఆదర్శ జీవనం కోసం నీవిలా ప్రవర్తిస్తున్నావు. నీ దర్శనంవల్ల సకల పాపాలూ బంధాలూ తొలగి పోతాయి. మమ్మల్ని అనుగ్రహించు' అన్నారు. అప్పుడు వసుదేవుడు ఆ మహర్షులతో 'అయ్యా! భగవంతుడి అనుగ్రహానికి ప్రతిబంధకంగా నిలిచేవి పూర్వకర్మలే. వాటిని రూపుమాపుకొనే పుణ్యకర్మలు ఏవో సెలవియ్యండి'** అని అడిగాడు.

వసుదేవుడి అజ్ఞానానికి నవ్వుకున్నారు మహర్షులు. ఇతడింకా శ్రీకృష్ణుణ్ణి తన కొడుకే అనుకొంటున్నాడు. పెరటిచెట్టు వైద్యానికి పనికిరాదు అన్నట్లు, దగ్గరలోనే ఉన్న పెన్నిధానాన్ని గుర్తించలేనట్లు ఇతడు శ్రీకృష్ణుడిని గుర్తించలేదు. నిజమే, ఇది లోకసహజం. పుణ్యతీర్థాల కోసం ఎక్కడెక్కడినుండో ప్రజలు తండోపతండాలుగా వచ్చి సేవించుకొంటూ ఉంటారు. నిత్యం అక్కడే ఉండేవాడికి దాని విలువ తెలియదు' అనుకొని–

'వసుదేవా! ప్రతివ్యక్తికీ దేవ–ఋషి–పితృ ఋణాలు ఉంటాయి. యజ్ఞాలు చేసి దేవఋణాన్నీ, అధ్యయనం ద్వారా ఋషిఋణాన్నీ, మంచి సంతానాన్ని పొందడం ద్వారా పితృఋణాన్నీ తీర్చుకోవాలి. కాబట్టి నువ్వు క్రతువు చేసి దేవ ఋణాన్ని తీర్చుకో!' అని సూచించారు.

వసుదేవుడు వెంటనే యజ్ఞం ప్రారంభించి వైభవంగా పూర్తిచేశాడు.

కాలక్రమంగా వసుదేవుడికి శ్రీకృష్ణుడే పరమాత్మ అనే సత్యం బోధపడింది. 'ఇంతకాలం ఎంత అజ్ఞానంలో బతికాను! భగవద్భక్తిని అలవరచుకోలేకపోయాను. ఇప్పుడు చూస్తే వయస్సు మించిపోయింది' అని బాధపడ్డాడు. శ్రీకృష్ణుడు తండ్రితో–

'నాన్నా! నేనూ బలరాముడూ, మీరూ ఈ ద్వారకావాసులూ అంతా బ్రహ్మ మయమే. ఒకే బ్రహ్మం – భిన్నరూపాలు. అంతే!' అన్నాడు. మాటల్లో తాను అలనాడు చనిపోయిన గురుపుత్రుణ్ణి తీసుకువచ్చిన విషయం ప్రస్తావనకు వచ్చింది. అక్కడే ఉన్న దేవకీ దేవికి కంసుడి చేతిలో మరణించిన తన పుత్రుల్ని చూడాలనిపించి వారిని సజీవంగా తెచ్చియిమ్మని మహానుభావులైన బలరామకృష్ణుల్ని ప్రార్థించింది.

వెంటనే శ్రీకృష్ణుడు బలరాముడితో కలసి సుతలానికి బయలుదేరారు. సుతలానికి అధిపతి బలిచక్రవర్తి. అతడిని అడిగి తన అన్నలను తీసుకువచ్చాడు. వాళ్ళే స్మరుడు, ఉద్గీరుడు, పరిష్వంగుడు, పతంగుడు, క్షుద్రభువు, ఘృణి. వాళ్ళను చూసి దేవకీదేవి సంతోషించింది. తరువాత వాళ్ళు తమ లోకాలకు వెళ్ళిపోయారు.

## సుభద్రా పరిణయం

పరీక్షిత్తు మళ్ళీ అడగడంతో సుభద్రాపరిణయ వృత్తాంతాన్ని అందుకున్నాడు శుకమహర్షి.

రాజా! అర్జునుడు తీర్థయాత్రలు చేస్తూ ప్రభాస తీర్థానికి వెళ్ళినప్పుడు అక్కడ తన మేనమామ కూతురు సుభద్ర గురించి విన్నాడు. అయితే ఆమెను దుర్యోధనుడికి ఇవ్వాలని ఆమె అన్న బలరాముడి ఆలోచన.

యతివేషంలో ద్వారకకు వచ్చి భిక్షకోసం బలరాముడి మందిరానికి వెళ్ళాడు. అక్కడ సుభద్రను చూసి చూపులు తిప్పుకోలేకపోయాడు. సుభద్ర కూడా అతణ్ణి ఇష్టపడింది.

ఒకరోజు అక్కడ 'దేవతా మహోత్సవం జరుగుతోంది. సుభద్ర తన ఆంతరంగికులతో రథంపై బయటకు వచ్చింది. శ్రీకృష్ణుడి అనుమతితో అర్జునుడు ఆమెను తీసుకువెళ్ళిపోయారు. ఈ వార్త విన్న బలరాముడు మొదట కోపగించినా అందరూ నచ్చచెప్పటంతో మెత్తపడ్డాడు.

సాటిలేని మేటి కానుకల్ని అరణంగా ఇచ్చి తన చెల్లిని అర్జునుడితో పంపాడు బలరాముడు.

## మిథిలానగర సందర్శనం

శ్రీకృష్ణుడు ఒకసారి మిథిలానగరానికి ఋషులతో కలిసి వెళ్ళాడు. అక్కడ బహుళాశ్వుడు అనే జనక మహారాజు విదేహ రాజ్యాన్ని పరిపాలిస్తున్నాడు.

అదేకాలంలో శ్రుతదేవుడు అనే ఒక మహాపండితుడు అక్కడే ఉండేవాడు. అతడు పరమశ్రీకృష్ణభక్తుడు. నిశ్చలమైన భక్తి తప్ప మరే కోరికా లేనివాడు. దొరికిన దాంట్లోనే తృప్తిగా జీవితాన్ని గడిపేవాడు. అందుకే శ్రీకృష్ణుడు అతడికి దర్శనమివ్వాలనే మిథిలకు వెళ్ళాడు.

శ్రీకృష్ణుడికి బహుళాశ్వుడూ ఒకటే శ్రుతదేవుడూ ఒకటే! ఇద్దరినీ ఒకేలా ఆదరించాడు. ఒకేలా పలకరించాడు. వాళ్ళ ఆహ్వానంమేరకు తన మాయ ప్రభావంతో ఇద్దరి ఇళ్ళకూ ఒకేసారి ఋషుల్ని తీసుకొని వెళ్లాడు.

**తే.గీ. కృష్ణ! పరమాత్మ! యదుకులక్షీరవార్ధి**
**పూర్ణచంద్రమ! దేవకీపుత్త్ర! సుజన**
**వినుత! నారాయణాచ్యుత! వేదవేద్య!**
**భక్తజనపోషపరితోష! పరమపురుష!** (10-2-1187)

అని బహుళాశ్వుడు స్తుతించాడు. శ్రుతదేవుడూ భక్తితో శ్రీకృష్ణుణ్ణి అర్చించాడు.

**'నా భక్తుల్ని పూజిస్తే నన్ను పూజించినట్లే! పరమ భాగవతోత్తములైన నా భక్తుల్ని నిర్లక్ష్యం చేసి నాకు ఎన్ని ఉపచారాలు చేసినా అవి నాకు పట్టవు'** అన్నాడు.

కొన్నాళ్ళు వాళ్ళిద్దరి ఆతిథ్యమూ స్వీకరించి తర్వాత ద్వారకకు వచ్చాడు శ్రీకృష్ణుడు.

## శ్రుతిగీతలు

పరీక్షిత్తు ఈసారి మరో సందేహాన్ని శుకమహర్షి ముందు ఉంచాడు. 'మహర్షీ! పరమాత్మను వేదవేద్యుడు అంటారు. మరి పరమాత్మ నిర్గుణుడూ కదా! శబ్దాలు ఎలా ప్రతిపాదిస్తాయి?' అని అప్పుడు శుకమహర్షి –

'రాజా! పూర్వం నారదుడు ఇదే ప్రశ్నను నారాయణమునిని అడిగాడు. పూర్వం సనందన మహర్షి శ్వేతద్వీపవాసులకు బోధించాడు. అదే శ్రుతిగీత. భగవంతుడు సమస్త ప్రాణులకూ జ్ఞానప్రదాత. అందుకే వేదాలు అతణ్ణి కీర్తిస్తాయి. అలాంటి శ్రుతిస్తోత్రం ఉపనిషత్తులతో సమానమైనది' అంటూ పరమాద్భుతమూ, పరమాత్మగుణ, రూప, వైభవలీలల్ని ఆవిష్కరించేదీ అయిన శ్రుతిస్తోత్రాన్ని ఉపదేశించాడు. ఆ తరువాత విష్ణు సేవా ప్రాశస్త్యాన్ని చెప్తున్నాడు.

## విష్ణు సేవా ప్రాశస్త్యం

రాజా! శివుడు సత్త్వరజస్తమోగుణాలతో కూడినవాడు. అందువల్ల అతణ్ణి సేవించే భక్తులు ఐశ్వర్యవంతులౌతారు. శ్రీహరి గుణాతీతుడు. అతణ్ణి కొలిచేవారు కూడా రాగరహితులే. వాళ్ళు సంపదలను కోరరు. ఒకప్పుడు శ్రీకృష్ణుడే ఇలా చెప్పాడు –

**'నాకు ఏ ఉత్తముడిపై అనుగ్రహం కలుగుతుందో అతడి సమస్త సంపదలూ నేను హరిస్తాను. ధనం లేక అతడు ఏడుస్తాడు. బంధువులంతా అతణ్ణి వదిలివేస్తారు. ఇలా నానా కష్టాలూ పడి చివరికి నా భక్తులతో స్నేహం చేస్తాడు. క్రమంగా విజ్ఞానాన్ని పొంది మోక్షాన్ని పొందుతాడు.**

ఇదీ ముక్తిని పొందే పద్ధతి. అలా కాక కొందరు ఐశ్వర్యం కోసం దేవతలను ఆరాధిస్తారు. అక్కడివరకూ బాగానే ఉంది. ఐశ్వర్యం వచ్చాక దాన్ని ప్రసాదించిన దేవతల్ని కూడా మరిచిపోతారు. కృతఘ్నుల్లా ప్రవర్తిస్తారు. దానికో కథ చెబుతాను విను.

## వృకాసుర సంహారం – భస్మాసుర

వృకాసురుడు శకుని అనే రాక్షసుడికి పుత్రుడు, పరమ దుర్మార్గుడు. ఒకసారి త్రిమూర్తులలో త్వరగా ఎవరు వరాల్ని ప్రసాదిస్తారో చెప్పమని నారద మహర్షిని అడిగాడు. అందుకు నారదుడు శివుడి పేరు చెప్పాడు.

వృకాసురుడు కేదార తీర్థంలో ఘోర తపస్సు చేసి, తన శరీరాన్ని ముక్కలు చేస్తూ ఆహుతిగా వేస్తున్నాడు. అయినా శివుడు ప్రత్యక్షం కాలేదు. ఇక తన తలనే ఖండించి అగ్నికుండంలో వేయడానికి సిద్ధపడ్డాడు. ఇంతలో శివుడు ప్రత్యక్షమై 'ఏం వరం కావాలో కోరుకో' అన్నాడు.

అందుకా రాక్షసుడు – 'స్వామీ! నా హస్తాన్ని ఎవరి శిరస్సుపై ఉంచుతానో వాడి శిరస్సు భస్మమైపోవాలి' అన్నాడు. శివుడు అనుగ్రహించాడు. 'ఏదీ నీ వరం ఎలా పనిచేస్తుందో చూడనీ!' అంటూ శివుడి తలపైనే చేయి పెట్టాలని చూశాడు. శివుడు పరుగుతీశాడు. వీడు వెంటపడ్డాడు. అప్పుడు శ్రీహరి తానే స్వయంగా ఒక వటువు వేషంలో ఈ రాక్షసుడి వద్దకు వచ్చాడు. వినయంగా నమస్కరించి 'వృకాసురా! ఏమిటి? చాలా అలసిపోయినట్లున్నావు' అన్నాడు.

వృకాసురుడు అప్పటిదాకా జరిగినదంతా చెప్పాడు. అప్పుడు వటువు నవ్వి 'పిచ్చివాడా! నువ్వు శివుడి మాటలు నమ్ముతున్నావా? దక్షుడి శాపంతో శివుడు ప్రేతలతో తిరుగుతున్నాడు. అతడు వరం ఇవ్వడం, నువ్వు నమ్మడమూనూ. అయినా నువ్వు అశుచిగా శివుణ్ణి తాకకూడదు. వెళ్ళు. స్నానం చేసి సంధ్యవార్చి రా! అప్పుడు చూద్దాం ఆ శివుడి సంగతి.' అన్నాడు. ఆ మాటలు నమ్మి వెళ్ళిన వృకాసురుడు తన నెత్తిమీద తానే చేయిపెట్టుకొని మరణించాడు. (ఇతడికే భస్మాసురుడు అని ప్రసిద్ధి.)

## భృగువు పరీక్ష

పరీక్షిన్మహారాజా! ఒకసారి ఒక విచిత్ర సంఘటన జరిగింది. సత్రయాగం చేస్తున్నప్పుడు బ్రహ్మర్షులకు త్రిమూర్తులలో ఎవరు గొప్ప అన్న సందేహం కలిగింది. దాన్ని తీర్చే బాధ్యత భృగుమహర్షి తీసుకున్నాడు. నేరుగా బ్రహ్మసభకు వెళ్ళాడు. బ్రహ్మకు నమస్కరించాడు. స్తుతించకుండా నిలబడ్డాడు. బ్రహ్మకు కోపం వచ్చింది కానీ ఏమీ అనలేదు, నిగ్రహించుకున్నాడు.

ఈసారి శివుడి దగ్గరకు వెళ్ళాడు. శివుడు భృగువును ఆదరించి కౌగిలించు కోబోయాడు. అయితే భృగువు అతణ్ణి నిందించడం మొదలుపెట్టగా శివుడికి కోపం వచ్చింది. త్రిశూలంతో అతణ్ణి చంపబోయాడు. పార్వతీదేవి వల్ల శాంతించాడు.

తరువాత భృగువు వైకుంఠానికి వెళ్ళాడు. అక్కడ లక్ష్మీదేవి ఒడిలో తలపెట్టుకొని పడుకున్నాడు పరమాత్మ. భృగువు నేరుగా వెళ్ళి విష్ణువును గుండెలపై తన్నాడు. నారాయణుడు లేచి మహర్షికి నమస్కరించాడు. అతడి రాకను గుర్తించనందుకు మన్నించమని వేడుకొన్నాడు. 'నీ పాద స్పర్శవల్ల నా వక్షఃస్థలం పరిశుద్ధమయింది. ఇకనుండీ ఇదే లక్ష్మీనివాసం' అన్నాడు వినయంగా.

భృగువుకు నోట మాట రాలేదు. వచ్చి బ్రహ్మర్షులకు జరిగినదంతా చెప్పాడు. **ఎంత పెద్ద తప్పుచేసినా ఏ వికారమూ లేకుండా క్షమించడమే గొప్పతనం** అని తెలుసుకున్నారు బ్రహ్మర్షులు.

## బ్రాహ్మణ పుత్రులు

మహారాజా! ద్వారకానగరంలో ఒక సంఘటన జరిగింది. ఒక బ్రాహ్మణుడికి ఒక పుత్రుడు కలిగాడు. వీడు పురిట్లోనే కన్నుమూశాడు. ఆ బ్రాహ్మణుడు ఆ బాలుడి మృత కళేబరాన్ని రాజద్వారం వద్ద ఉంచి రోదిస్తున్నాడు.

'ఈ పాపం రాజుదే! సత్ప్రవర్తన లేని రాజువల్లే ఇలాంటి అనర్థాలు జరుగుతాయి' అన్నాడు. ఇది ఇక్కడితో ఆగలేదు. ఆ తరువాత కూడా అతడికి కొడుకులు పుడుతున్నారు. పురిట్లోనే కన్నుమూస్తున్నారు.

ప్రతిసారీ రాజద్వారం వద్ద మృతశిశువును ఉంచి రాజును నిందించేవాడు.

తొమ్మిదోసారి అర్జునుడు అతడి తిట్లు విన్నాడు. 'శ్రీకృష్ణుడు సత్రయాగంలో ఉన్నాడు. నేనున్నాను. ఈసారి నీకు పుట్టబోయే బిడ్డను రక్షిస్తాను' అన్నాడు.

'బలరామకృష్ణులే నా బిడ్డల్ని కాపాడలేకపోయారు. నీ వల్ల ఎలా అవుతుంది? అన్నాడు బ్రాహ్మణుడు. అప్పుడు అర్జునుడు తన గురించి చెప్పి 'మృత్యువునైనా జయించి నీ బిడ్డను కాపాడతా' నని ప్రతిజ్ఞ చేశాడు. అలా చేయలేకపోతే 'నేను అగ్నిలో ప్రవేశిస్తాను' అనీ అన్నాడు. అప్పుడా బ్రాహ్మణుడికి కొంత నమ్మకం కలిగింది.

కొంతకాలానికి బ్రాహ్మణుడి భార్యకు నెలలు నిండాయి. ప్రసవించబోతోంది. అప్పుడా బ్రాహ్మణుడు అర్జునుణ్ణి ప్రార్థించాడు. తన గాండీవాన్ని ధరించి దివ్యాస్త్రాలను సంధించి పురిటింటి చుట్టూ దుర్భేద్యమైన పంజరాన్ని బాణాలతో నిర్మించాడు.

బ్రాహ్మణుడికి కుమారుడు జన్మించి కేర్‌కేర్‌మని ఏడుస్తూ అందరూ చూస్తుండగానే ఆకాశంలోనికి వెళ్ళి మాయమైపోయాడు.

బ్రాహ్మణుడు గుండెలు బాదుకొంటూ మళ్ళీ రాజప్రాసాదానికి వచ్చాడు. అక్కడ శ్రీకృష్ణుడితోపాటూ అర్జునుడూ ఉన్నాడు. వచ్చి 'ప్రభూ! ఈ అర్జునుడు

చేతకానివాడని తెలియక ఇతడి మాటలు నమ్మాను. కల్లబొల్లి కబుర్లు చెప్పి ఇతరులనే కాదు తనను కూడా మోసం చేసుకొనే ఈ అర్జునుడు ఒక వ్యర్థుడు. ఇతడి చేతిలో ఆ గాండీవమెందుకు? అదీ వ్యర్థమైనదే!' అంటూ తీవ్రంగా విరుచుకుపడ్డాడు.

అర్జునుడు యోగవిద్యద్వారా యమపురికి వెళ్ళిచూశాడు. ఈ బాలుడు అక్కడా లేడు. ఇతర దిక్పాలకుల నగరాలకీ వెళ్లాడు. ఆ బాలుడు అక్కడా లేడు. మాట నిలబెట్టుకోలేకపోయానన్న బాధతో అగ్ని ప్రవేశానికి సిద్ధపడ్డాడు.

శ్రీకృష్ణుడు అతణ్ణి వారించి రథంపై ఎక్కించుకొని తీసుకువెళ్ళాడు. సప్తద్వీపాలు, సప్తసాగరాలు, లోకాలోక పర్వతం, చక్రవాళ పర్వతాన్ని కూడా దాటించి తీసుకువెళ్ళాడు. చుట్టూ చిమ్మచీకటి. కళ్ళు పొడుచుకున్నా కనిపించనంత చీకటి. అయినా గుర్రాలు పరుగుతీస్తూనే ఉన్నాయి. అందుక్కారణం శ్రీకృష్ణుడు చక్రాన్ని ప్రయోగించాడు. దాని నుండి దేదీప్యమానమైన వెలుగు. ఆ వెలుగులో రథం సాగిపోయి ఒక సముద్రంలోనికి ప్రవేశించింది.

ఆ సముద్రంలో ఒక దివ్య భవనం. దానిలో వెయ్యి పడగల అనంతుడు. అతడిపై ఒక దివ్యతేజస్సు ప్రకాశిస్తోంది. ఆ జ్యోతిస్వరూపుడే శ్రీమన్నారాయణుడు.

పట్టుపీతాంబరం, కౌస్తుభమాల, శ్రీవత్సం, వనమాల ధరించి ప్రసన్నవదనంతో విరాజిల్లుతున్నాడు ఆ స్వామి. శ్రీకృష్ణార్జునులిద్దరూ ఆ దేవదేవుడికి నమస్కరించారు. వాళ్ళను చూసి వైకుంఠవాసుడు గంభీరంగా –

'మీరు ఎవరికోసం వెదుకుతున్నారో ఆ బ్రాహ్మణ పుత్రుణ్ణి నేనే కావాలని తీసుకువచ్చాను. ఆ బాలుడి కోసం మీరు వస్తారని, మిమ్మల్ని చూడాలని మునీశ్వరులు కోరారు. అందుకే ఇలా రప్పించాను. మీరిద్దరూ నా అంశతో పుట్టినవాళ్ళే. ధర్మ సంస్థాపన కోసమే మీరు అవతరించారు. నరనారాయణులు అనే ఋషులు మీరు. పూర్ణకాములై లోకానికి ఆదర్శవంతంగా మసలుకోండి. ధర్మాన్ని ఆచరించి చూపించండి' అన్నాడు.

శ్రీకృష్ణార్జునులు నమస్కరించారు. అప్పుడు శ్రీమన్నారాయణుడు ఆ బ్రాహ్మణ పుత్రులందరినీ తెచ్చి అప్పగించాడు. ఆ బాలురందరూ వారి వారి వయసులకు తగ్గ రూపాలు కలిగి ఉన్నారు.

శ్రీకృష్ణుడు వారిని బ్రాహ్మణుడికి అప్పగించాడు. ఆ బ్రాహ్మణుడి ఆనందానికి అవధుల్లేవు. శ్రీకృష్ణుణ్ణి భక్తిప్రపత్తులతో స్తుతించాడు.

రాజా! ఈ విధంగా వేదవేద్యుడైన శ్రీకృష్ణుడు అత్యంత వైభవంగా ద్వారకా నగరం వేంచేసి ధర్మసంస్థాపన చేస్తూ ప్రకాశించాడు. తనవారినందరినీ ఆనంద ప్రవాహంలో ఓలలాడించాడు.

**ఎంతటి మూఢులైనా ఒకసారి హరికీర్తన వింటే చాలు, ముక్తిని పొందుతారట!** ఆ విశ్వాత్ముణ్ణి చూస్తూ కౌగిలించుకొంటూ, స్పృశిస్తూ, అతడితో కలిసి నవ్వుతూ మాట్లాడుతూ ఉంటే ఇంక ఆనందపారవశ్యంలో మునిగిపోవడంలో ఆశ్చర్యమే ముంటుంది?

రాజా! వేదోక్త పద్ధతిలో ఆ శ్రీకృష్ణుడు గృహస్థాశ్రమం స్వీకరించి ఉత్తము లందరికీ తానే దిక్కై ఆదర్శంగా నిలబడి ఒక సంసారిలా నటిస్తున్నాడయ్యా!

రుక్మిణీ మొదలైన అంతఃపురకాంతలకు ప్రద్యుమ్నాదులుగా పుత్రులు జన్మించారు కదా! వాళ్ళు జగత్ప్రసిద్ధులయ్యారు. త్రివక్రకు శ్రీకృష్ణుడివల్ల ఉపశ్లోకుడు అనే పుత్రుడు కలిగాడు. అతడు శ్రీకృష్ణభక్తుడై నారదుడికి శిష్యుడై 'వైష్ణవస్మృతి' అనే గ్రంథాన్ని రచించాడు. ఇది ముక్తిమార్గాన్ని చూపె అద్భుత గ్రంథం. శ్రీకృష్ణుడి వంశం పుత్రపౌత్రాభివృద్ధిగా సిరులతో తులతూగుతూ విలసిల్లింది.

# ఏకాదశ స్కంధం

## మహర్షుల ఆగమనం

కొన్నాళ్ల తర్వాత విశ్వామిత్రుడు, వసిష్ఠుడు, నారదుడు మొదలైన మహర్షులు శ్రీకృష్ణుడి దర్శనానికి వచ్చారు. శ్రీకృష్ణుణ్ణి చూసి నమస్కరించారు.

శ్రీకృష్ణుడు వాళ్ళను సాదరంగా ఆహ్వానించి అర్ఘ్యపాద్యాలను సమర్పించి బంగారు సింహాసనాలపై కూర్చోబెట్టాడు.

అప్పుడా మునులు శ్రీకృష్ణుణ్ణి –

**శా. తరణంబులు భవజలధికి**
**హరణంబులు దురితలతల కాగమముల కా**
**భరణంబు లార్తజనులకు**
**శరణంబులు నీదు దివ్యచరణంబు లిలన్** (11–15)

'శ్రీకృష్ణా! నీ దివ్యమైన పాదాలు సంసారసాగరాన్ని దాటిస్తాయి. పాపాల తీగలను త్రుంచివేస్తాయి. ఆగమాలకు ఆభరణాలు అవుతాయి. ఆర్తులకు శరణవుతాయి' అంటూ స్తుతించి అక్కణ్ణుంచి 'పిండారకం' అనే పుణ్యతీర్థానికి వెళ్ళారు.

అదేసమయంలో యాదవ బాలకులు కొందరు పొగరెక్కి ఇష్టం వచ్చినట్లు ఆడుకుంటున్నారు. సాంబుడికి ఒక అందమైన ఆడవేషం వేసి కట్టూ బొట్టూ దిద్ది తయారుచేసి మహర్షుల వద్దకు తీసుకెళ్ళారు. సాష్టాంగపడ్డారు. సాంబుణ్ణి చూపిస్తూ–

మహర్షులూ! ఇదుగో! ఈ అమ్మాయి కడుపుతో ఉంది. లోపల ఉన్నది ఆడపిల్లా, మగపిల్లవాడా! అని అడిగారు వెటకారంగా.

మహర్షులకు కోపం వచ్చింది. 'మమ్మల్నే ఆటపట్టిస్తారా! చూడండి. యదు వంశాన్ని నాశనం చేసే రోకలి ఒకటి ఈ బాలికకు పుడుతుంది పొండి' అని శపించారు.

## ముసలం పుట్టింది

యాదవుల మత్తు వదిలిపోయింది. వణికిపోయారు.

సాంబుడికి కట్టిన చీరను విప్పుతూ ఉంటే లోపలి నుండి ఒక రోకలి ఊడిపడింది. దాన్ని తీసుకువెళ్ళి శ్రీకృష్ణుడిముందు పెట్టి జరిగిందంతా చెప్పారు.

వాసుదేవుడు ఏమీ తెలియనట్లు విన్నాడు.

'మీలాంటి మూర్ఖులెక్కడా ఉండరు. మీ పొగరుబోతుతనం వల్ల భారీ మూల్యం చెల్లించుకోవలసి వస్తోంది. మహర్షుల శాపానికి తిరుగులేదు. సముద్రం ఒడ్డున ఒక పెద్ద కొండ ఉంది. దాని బండమీద ఈ రోకలిని అరగదీసి సముద్రం నీళ్ళలో కలపండి' అన్నాడు.

వాళ్ళు అలాగే చేశారు.

రోకలి చివర ఉండే ఇనుప ముక్కను మాత్రం అరగదీయలేక అలాగే సముద్రంలోనికి విసిరేశారు. దాన్ని ఒక చేప మింగింది. ఆ చేప ఒక బోయవాడి వలలో చిక్కింది. దాని కడుపులో ఉన్న ఇనుపముక్కను తన బాణం చివర ములికిగా తగిలించుకొన్నాడు ఆ బోయవాడు.

## విదేహర్షభ సంవాదం

రాజా! ఒకసారి నారదుడు ద్వారకకు వచ్చి శ్రీకృష్ణుణ్ణి సందర్శించడానికి వెళ్ళాడు. అప్పుడు శ్రీకృష్ణుడు 'మునీంద్రా! మోక్షాన్ని పొందే ధర్మాల్ని ఉపదేశించండి' అని వేడుకొన్నాడు. నారదుడు చెప్పటం ప్రారంభించాడు.

స్వాయంభువుడు అనే మనువుకు ప్రియవ్రతుడు అనే కుమారుడు జన్మించాడు. అతడి పుత్రుడు ఆగ్నీధ్రుడు. లోకప్రసిద్ధుడు. ఇతడి కొడుకు నాభి. ఇతడు బలిచక్రవర్తి స్నేహితుడు. శత్రురాజ్యాలను ఆక్రమించి రాజ్యాన్ని విస్తరింపజేశాడు.

ఈ నాభికుమారుడే ఋషభుడు. ఇతడు హరిభక్తుడు. ఇతడికి నూరుగురు కుమారులు. వారిలో భరతుడు పెద్దవాడు. ఇతడు గొప్ప తపస్సంపన్నుడు. శ్రీమన్నారాయణుడికి ప్రీతిపాత్రుడై ముక్తిని పొందాడు.

ఇతడి పేరు మీదే భూఖండానికి భరతవర్షం అనే పేరు వచ్చింది. తక్కిన తొమ్మిదిమందీ తొమ్మిది ఖండాలకు పాలకులయ్యారు. మరో 81 మంది బ్రాహ్మణత్వాన్ని స్వీకరించారు.

ఇక మిగిలిన తొమ్మిదిమంది బ్రహ్మవిద్యోపాసకులై దేవలోకాల్లో విహరించ సాగారు. అలా తిరుగుతూ వాళ్ళు 'విదేహుడు' అనే రాజు చేస్తున్న యజ్ఞవాటికకు వచ్చారు.

యజ్ఞం ముగింపుకు వచ్చింది. విదేహుడు వాళ్ళను సత్కరించి –

'మహాత్ములారా! తమరు శ్రీహరి భక్తులు. ఈ లోకంలో అల్పబుద్ధులూ, నీరసులూ తరించే మార్గం ఏదైనా ఉంటే సెలవియ్యండి. జన్మలన్నింటిలో మానవ జన్మ దుర్లభం. ఆ జన్మను పొంది అందులో హరిభక్తిని పొందడం మరీ కష్టం. ప్రపత్తి మార్గం ద్వారా సేవించే భక్తులకు శ్రీహరి సారూప్యం ఎలా ప్రసాదిస్తాడు?' అని వినయంగా అడిగాడు.

అప్పుడు వారిలో కవి అనే మహానుభావుడు ఇలా చెప్పటం మొదలుపెట్టాడు.

'రాజా! కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలను అరిషడ్వర్గం అంటారు. దారేషణ, ధనేషణ, పుత్రేషణ అనేవి ఏషణత్రయం. వీటిలో చిక్కుకున్న మానవుడికి మాధవుణ్ణి సేవించాలన్న ఆలోచన ఎలా కలుగుతుంది? విశ్వమూ, ఆత్మా వేరనుకొనేవాడు నిత్యమూ భయపడుతూ బతుకుతాడు. వాడు పరబ్రహ్మను చేరుకోలేదు.

**కం. కరణత్రయంబుచేతను**
**నరుఁ డే కర్మంబు సేయు నయ్యైవేళన్**
**హరికర్పణమని పలుకుట**
**పరువడి సుజ్ఞాన మండ్రు పరమమునీంద్రుల్** (11-42)

**త్రికరణ శుద్ధిగా చేసే ప్రతి కర్మనూ 'కృష్ణార్పణం' అని చేయడమే అసలైన జ్ఞానం. ఇది మహర్షులమాట. జ్ఞానం, అజ్ఞానం మధ్య ఊగిసలాడుతూ ఉంటే మతి భ్రమిస్తుంది. కాబట్టి గురువునే దేవుడిగా భావించి శ్రీహరిని అర్చించాలి.** కానీ మానవుడు కోరికలు అనే కలలలో తేలిపోతుంటాడు. దానివల్ల ఏ ప్రయత్నమూ నిలబడదు. **కోరికలను నియంత్రించుకొని హరిని ధ్యానించేవాడికి ముక్తి కరతలామలకం.**

**సర్వ కాల సర్వావస్థల్లోనూ శ్రీకృష్ణ సంకీర్తన వీనులవిందుగా వినాలి. హరినామ స్మరణ చేయాలి.** లోకానికి అంటీ ముట్టనట్టు ఉంటూ విశ్వమయుణ్ణి కీర్తించాలి. ఈ సృష్టి అంతా విష్ణుమయం అని తెలుసుకోవాలి. భేదబుద్ధి ఏ మాత్రమూ పనికిరాదు' అన్నాడు.

ఆ మాటలు విన్న విదేహరాజు 'భాగవత ధర్మం అంటే ఏమిటి? భాగవతుల్ని గుర్తించడం ఎలా? అని అడిగాడు. దానికి 'హరి' అనే మహాముని ఇలా చెప్తున్నాడు–

శంఖచక్రాది ఆయుధధారియై శ్రీమన్నారాయణుడు నిత్యమూ మన ఆత్మలోనే ఉన్నాడని విశ్వసించేవాడే భాగవతుడు. చతుర్వర్ణాలు, ఆశ్రమాలూ, కర్మమూ, ధర్మమూ వీటిలో వేటిలోనూ మునిగిపోకుండా భక్తిమార్గాన్ని ఆశ్రయించడం ద్వారా శ్రీహరిని ధ్యానించేవాడే పరమ భాగవతోత్తముడు' అన్నాడు.

తర్వాత అంతరిక్షుడు అనే మరో ముని –

'రాజా! పరమపదం, పరమేశ్వరుడు, శ్రీకృష్ణుడు ఇలా ఎవరు ఏ పేరుతో పిలిచినా అతడే శ్రీమన్నారాయణుడు. విశ్వమంతా నిండి ఉన్న పరంజ్యోతి స్వరూపుడు అన్నాడు.' అది విన్న విదేహరాజు మళ్ళీ ఇలా అడిగాడు–

'మహర్షులారా! మరి ఈ మాయను అంతమొందించుకొని వైకుంఠానికి చేరే మార్గం ఏమిటో సెలవియ్యండి' అని. అప్పుడు ప్రబుద్ధుడు అనే ముని అందుకొని–

'రాజా! **రోజురోజుకీ మానవుడి ఆయుష్షు తరిగిపోతూ ఉంటుంది. అయినా మమకారం చావదు. భవబంధాలలో చిక్కుకొని, దాని నుండి విడివడే దారి తోచదు. వివేకం కలగదు. చీకటిలో ఉంటూ భూత భవిష్యత్ వర్తమానాలు తెలియని గుడ్లగూబలలాగా మానవులు పుట్టుక, ముసలితనం, రోగాలు, ఆపదలు, మృత్యువూ**

కల శరీరాన్నే ఎంతో మేలైనదిగా భావిస్తారు. ఇంద్రియ విషయాలపై ఆసక్తి పెంచుకుంటారు. తామెవరో తెలుసుకోలేరు. విరక్తి మార్గం అంతకన్నా తెలియదు. అజ్ఞానంతో ఏవేవో దారులు తొక్కుతారు. అటువంటి మూఢమానవుల్ని దగ్గరకు రానివ్వకూడదు. తానూ వెళ్ళకూడదు. సద్గురువును ఆశ్రయించి ఉత్తమమైన భాగవత ధర్మాన్ని అనుష్ఠించాలి.

**1.** సత్త్వగుణంతో ఉండటం, **2.** భూతదయ, **3.** హరికథ అనే అమృతాన్ని ఆస్వాదించడం, **4.** ఇంద్రియ నిగ్రహం, **5.** సాధుసంగమం, **6.** సజ్జన సాంగత్యం, **7.** బ్రహ్మచర్య వ్రతం, **8.** వినయసంపద, **9.** శుచిగా ఉండటం, **10.** తపస్సు, **11.** క్షమ, **12.** మౌనవ్రతం, **13.** వేదశాస్త్రాలను అధ్యయనం చేయడం, **14.** అహింస, **15.** సుఖదుఃఖాలపట్ల సహనం, **16.** ఈశ్వరుడు అంతటా ఉన్నాడని విశ్వసించడం, **17.** మోక్షం పొందాలనే కోరిక, **18.** దుష్టులకు దూరంగా ఉండటం, **19.** నారవస్త్రాలు ధరించడం, **20.** లభించినదానితోనే సంతృప్తిని పొందటం, **21.** వేదాంతశాస్త్రాల అర్థాలను తెలుసుకోవాలనే కుతూహలం, **22.** ఇతర దేవతలను నిందించకుండా ఉండటం, **23.** త్రికరణశుద్ధి, **24.** సత్యవ్రతం, **25.** శమదమాది గుణాలు కలిగి ఉండటం, **26.** ఐశ్వర్యాన్ని పరమేశ్వరార్పణంగా భావించడం, **27.** భక్తులు కానివారిని ఆశ్రయించకుండా ఉండటం. ఇవి భాగవతులు పాటించాల్సిన ధర్మాలు.

**కం. హరిదాసుల మిత్రత్వము**
**మురరిపుకథ లెన్నికొనుచు మోదముతోడన్**
**భరితాశ్రు పులకితుండై**
**పురుషుఁడు హరిమాయ గెల్చు భూపవరేణ్యా!** (11-55)

హరిభక్తులతో స్నేహం చేస్తూ హరిలీలలను తలచుకొంటూ కళ్ళలో ఆనందబాష్పాలతో ఒళ్ళు పులకరిస్తూ ఉంటే అప్పుడు హరిమాయను గెలుస్తాడు' అన్నాడు.

దానికి ద్రమిళుడు అనే మహర్షి తన మాటల్ని జోడించి ఇలా చెప్తున్నాడు –

'రాజా! ఆకాశంలోని చుక్కల్ని లెక్కపెట్టవచ్చు. భూమిపైగల మట్టిరేణువుల్ని కూడా లెక్కబెట్టవచ్చు. బ్రహ్మాదులు సైతం నారాయణ లీలల్ని వర్ణించలేరు' అన్నాడు.

అప్పుడు విదేహరాజు 'మందబుద్ధులకు సైతం మోక్షాన్ని పొందే మార్గమేదైనా ఉందా? ఉంటే సెలవియ్యండి' అని అడిగాడు.

దానికి 'చమసుడు' అనే మహర్షి బదులివ్వసాగాడు–

రాజా! శ్రీహరి శరీరం నుండే వర్ణాలన్నీ పుట్టాయి తెలుసుకదా! బ్రాహ్మణులు వేదకర్మల్ని ఆచరిస్తూ కూడా గర్వంతో భక్తుల్ని అవహేళన చేస్తూ 'నిరయం' అనే నరకంలో పడతారు. **జీవహింస చేసేవారికీ పాపం తప్పదు. స్త్రీలోలురకూ నరక బాధలు చుట్టుకొంటాయి. ప్రాపంచిక మోహాలతో హరిని మరిచినవాడు దుర్గతుల పాలవుతాడు. అలాకాక నిరంతర హరినామస్మరణ చేస్తే ఎంతటి జడుడైనా ముక్తిని పొందుతాడు అన్నాడు.**

అప్పుడు విదేహరాజు – 'మహానుభావులారా! ఆ శ్రీపతి ఏ రీతిన వర్తిస్తాడో తెలుసుకోవాలని ఉంది' అన్నాడు. దానికి 'కరభాజనుడు' ఇలా అంటున్నాడు.

'ఆ స్వామికి అనంతరూపాలు. అనంత నామాలు. **దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కోసమే ఆ స్వామి అవతరిస్తాడు.** కృతయుగంలో తెల్లని దేహకాంతితో, నాలుగు బాహువులతో, జటావల్కలాలు ధరించి తపస్విగా వర్ధిల్లుతాడు. ఈ స్వరూపాన్ని మహర్షులు హంసుడిగా, సువర్ణుడిగా, వైకుంఠుడిగా కీర్తిస్తారు.

త్రేతాయుగంలో స్వామి రంగు రక్తవర్ణం. హిరణ్యకేశుడై, వేదస్వరూపుడై విష్ణుడు, యజ్ఞుడు, పృశ్నిగర్భుడు అనే అనేక నామాలతో ప్రకాశిస్తాడు.

ద్వాపరంలో శ్యామల వర్ణం ఈ పరంధాముడిది. పీతాంబరాన్ని ధరిస్తాడు. రెండు చేతులు ఉంటాయి. దివ్యాయుధాలు ధరించి కౌస్తుభవనమాలికాధారియై **జనార్దన వాసుదేవ సంకర్షణ ప్రద్యుమ్న అనిరుద్ధ నారాయణ విశ్వరూప సర్వభూతాత్మకాది నామాలతో ప్రవర్తిల్లుతూ ఉంటాడు.**

**కలియుగంలో కృష్ణవర్ణుడై 'కృష్ణ' అనే పేరుతో భక్తసంరక్షణ కోసం ఆవిర్భవించి ప్రస్తుతుల్ని పొందుతాడు. 'హరి రామ నారాయణ నృసింహ కంసారి నలినోదర'** మొదలైన నామాలతో మునీంద్రులు నుతిస్తారు.

దేవకీ వాసుదేవులారా! ఈ విధంగా ఋషభ కుమారులు ఆ విదేహరాజుకు భగవత్ స్వరూపాన్ని వివరించి అంతర్ధానమయ్యారు.

తరువాత విదేహ రాజు జ్ఞానయోగం ద్వారా ముక్తిని పొందాడు అని నారదుడు చెప్పాడని శుకయోగీంద్రుడు చెప్పగానే పరీక్షిత్తు 'మునీంద్రా! యాదవులు చివరికి ఏమయ్యారు? ఆ వృత్తాంతం చెప్పండి' అని కోరడంతో చెప్పడం ప్రారంభించాడు శుకమహర్షి.

## వైకుంఠానికి ఆహ్వానం

'ఓ పరంధామా! వైకుంఠవాసా! నువ్వు భూమిపై అవతరించిన సంకల్పం నెరవేరింది స్వామీ! తిరిగి నీ నిజస్థానానికి వేంచేయవయ్యా!' అని బ్రహ్మాది దేవతలు శ్రీహరిని ప్రార్థించారు. తాను అవతరించి అప్పటికి 125 సంవత్సరాలు అయింది. సరేనన్నాడు సర్వాత్ముడు. తాను అవతారం చాలించడానికి కావలసిన రంగాన్ని సిద్ధం చేసుకున్నాడు.

ద్వారకలో దుశ్శకునాలు కనిపిస్తున్నాయి. వాటిని చూసి శ్రీకృష్ణుడు యాదవులందరినీ పిలిచి 'యాదవులారా! మీరు ఇంక ఇక్కడ ఉండటం మంచిది కాదు. వెంటనే ప్రభాస తీర్థానికి వెళ్ళండి' అని ఆజ్ఞాపించాడు. యాదవులు ద్వారకను విడిచిపెట్టారు.

## శ్రీకృష్ణుడి ఉపదేశం

అప్పుడు ఉద్ధవుడు మెల్లగా శ్రీకృష్ణపరమాత్మను సమీపించి–

'స్వామీ! నువ్వు లేని ఈ లోకంలో మేం ఎలా బతుకుతామయ్యా! నీతో గడిపిన ఆ క్షణాలు పదేపదే గుర్తుకువస్తున్నాయి' అన్నాడు విచారంగా. అప్పుడు పరంధాముడు–

'ఉద్ధవా! నేటికి సరిగ్గా ఏడోరోజున ద్వారకా నగరం సముద్రంలో మునిగి పోతుంది. యదువంశం నశించిపోతుంది. తరువాత కలియుగం ప్రారంభమవుతుంది.

**ఆ యుగంలో మానవులు ధర్మవిరహితులై, రోగపీడితులై, అన్యాయపరులై, మందమతులై అల్పాయువులై ఇంకా అనేక అవలక్షణాలతో ఉంటారు. నాస్తికులై ఒకరినొకరు మెచ్చుకోరు. కాబట్టి నువ్వు వీటికి అతీతంగా నడుచుకోవాలి సుమా!**

అందర్నీ విడిచి పుణ్యతీర్థాల్ని సేవించు. ఇంద్రియాల్ని అదుపులో ఉంచుకో! ఈ వస్తువులన్నీ అశాశ్వతాలని తెలుసుకో! మోహాన్ని త్రుంచుకో! ఈ విశ్వమే నన్నుగా భావించి ప్రవర్తించు' అన్నాడు.

దానికి ఉద్ధవుడు సంతోషంతో శ్రీకృష్ణుడికి నమస్కరించి–

'మహాత్మా! సన్యాసాశ్రమం స్వీకరించి నిన్ను పొందాలనుకోవడం పామరులకు సాధ్యం కాని పని. పోనీ సంసారంలో ఉంటూ ముక్తిని పొందాలంటే నీ మాయలో పడి భవాబ్ధిని దాటలేక అక్కడే మళ్ళీమళ్ళీ పుడుతూ అలమటిస్తూ ఉంటారు. అయితే నీ భక్తులు మాత్రం ఆ మాయను నిరసిస్తారు.

**యతులకైనా సంసారులకైనా నీ నామస్మరణ ముక్తిని ప్రసాదిస్తుంది.** కాబట్టి నేను నీ చరణాలనే ఆశ్రయిస్తాను. నన్ను అనుగ్రహించు. నాపై నీ దయను ప్రసరింపజేయి' అని వేడుకొన్నాడు.

అప్పుడు శ్రీకృష్ణుడు 'ఉద్ధవా! పురుషుడికీ, ఆత్మకూ గురువు ఆత్మే. ఈ సత్యం తెలుసుకో! సన్మార్గంలో వర్తిస్తూ నా నివాసానికి చేరుకో!

**సమస్త జీవజాలంలో మానవజన్మ శ్రేష్ఠమైనది. వారిలో యోగీంద్రులు శ్రేష్ఠులు.** వారిలో పరమ యోగీంద్రులు కొందరు ఉంటారు. వీళ్ళు ఇంకా శ్రేష్ఠులు. ఎందుకంటే నన్ను సత్త్వగుణస్వరూపుడిగా తెలుసుకొని తమ ఆత్మలలో జీవాత్మ పరమాత్మలను ఐక్యం చేసి కొలుస్తారు. వాళ్ళే పరమజ్ఞానులు.

**భూమి నుండి ఓర్పు, వాయువు నుండి పరోపకారం, నీటివల్ల శుచిత్వం, అగ్నివల్ల నిర్మలత్వం ఇలా పంచభూతాల నుండి, ప్రకృతిలో నుండి జీవరాశుల నుండి, ప్రతి వస్తువు నుండి సద్గుణాలను గ్రహిస్తారు. అరిషడ్వర్గాన్ని జయించి, శరీర పోషణ కోసం మాత్రమే ఆహారం స్వీకరిస్తూ ఇంద్రియాల్ని జయించి ఆత్మనిష్ఠతో నాలో ఐక్యమౌతారు.**

**ధనంపై ఆశగల మానవులు ఊహాపోహలు తెలియక శరీరాన్ని కష్టపెట్టుకుంటారు. భగవంతుడిపైన మాత్రమే మనస్సును లగ్నం చేస్తే మానవులు ముక్తిని పొందుతారు.**

యోగీశ్వరులు విద్యగానీ అవిద్యగానీ నా మాయగానే భావిస్తారు. పశు మార్గంలో ఎన్నటికీ ప్రవర్తించరు. అలా యోగీశ్వరుల్లా సుఖాలపై వ్యామోహాన్ని త్రుంచుకొనేవాళ్ళు మాత్రమే ముక్తిని పొందుతారు.

కాబట్టి సర్వమూ విష్ణుమాయ అని తెలుసుకో! అన్నాడు శ్రీకృష్ణుడు. అప్పుడు ఉద్ధవుడు 'పరమాత్మా! నీ రూపాన్ని ఏ విధంగా తెలుసుకోవాలో సెలవియ్యి' అన్నాడు. దానికి శ్రీకృష్ణుడు అవధూత యదుసంవాదాన్ని చెప్పడం ప్రారంభించాడు.

## అవధూత – యదు సంవాదం

ఒకసారి యదుచక్రవర్తి వద్దకు ఒక అవధూత వచ్చాడు. అతణ్ణి చూసి యదు చక్రవర్తి 'యోగీంద్రా! తమరు ఎక్కడ నుండి వస్తున్నారు?' అని అడిగాడు.

'రాజా! నేను 24 మంది గురువుల ద్వారా విజ్ఞానినై వచ్చాను' అన్నాడు ఆ యోగి.

అది విన్న రాజు తనకు ముక్తిమార్గం బోధించమని అతణ్ణి ప్రార్థించాడు. ఆ అవధూత ఇలా సెలవిస్తున్నాడు.

**'రాజా! పరధన, పరదార, పరదూషణ, పరవస్తు చింతనలను ముందు విడిచి పెట్టాలి.**

**రోగంవల్లనో ముసలితనంవల్లనో శరీరం కృశించక ముందే శ్రీహరి భక్తిని అలవరచుకోవాలి. అప్పుడే కర్మనుంచి విముక్తి.**

భోగాలపై ఆసక్తి ఉంటే దుఃఖం తప్ప సుఖం ఎక్కడిది? ఆ దుఃఖంవల్ల నైతికత నశిస్తుంది. నీకో కథ చెబుతాను విను.

ఒక అడవిలో ఒక పావురం తన భార్యతో కలిసి కాపురముంటోంది. వాటి అన్యోన్యతకు ప్రతిరూపాల్లా కొన్ని పిల్లలు పుట్టాయి. అవి స్వేచ్ఛగా తిరుగుతూ ఒకసారి తల్లితో సహా ఒక వలలో చిక్కుకున్నాయి.

అది చూచిన మగపావురం విలవిలలాడింది. ఆ దుఃఖం దానిని బాగా కృంగదీసింది.

**వ్యామోహం ఎంత పనిచేస్తుందో చూశావా? నిరంతరం హరినే ధ్యానించే యోగులు అన్ని ప్రాణులలోనూ విష్ణుమూర్తే ఉన్నాడని తెలుసుకొంటారు. దానివల్ల**

**వ్యామోహం నశిస్తుంది. ఈ కపోత కథ ద్వారా వ్యామోహం పనికిరాదన్న సందేశం అందుతుంది.**

అలాగే **భూమినుండి ఓర్పు, వాయువునుండి పరోపకారం, నీటివల్ల శుచిత్వం, అగ్నివల్ల నిర్మలత్వం, ఇలా పంచభూతాల నుండి, ప్రకృతిలోనుండి, జీవరాశుల నుండి, ప్రతి వస్తువునుండి మనం నేర్చుకోవాలి.** బతకడం కోసమే ఆహారం స్వీకరించాలి. జనసంచారంలేని పర్వతాలపైనా, అరణ్యాలలోనూ జీవిస్తూ ఇంద్రియాల్ని జయించి ఆత్మనిష్ఠతో ఉంటూ నాలో ఐక్యమవ్వాలి. యోగులు ఇలాగే జీవిస్తారు.

ధనంపై ఆశగల మానవులు నానాకష్టాలు పడతారు. దీనికి మిథిలానగరంలో ఉన్న పింగళ అనే వేశ్య చక్కటి ఉదాహరణ. ఈమెను ఒక విటుడు పోషిస్తున్నాడు. అయినా ధనంపై ఆశ చావక ఎందరో విటులకోసం వెంపర్లాడేది. చివరికి అలసిపోయి శరీరం క్షణభంగురమేనని గ్రహించింది. శ్రీహరి పాదపద్మాలను ఆశ్రయించింది. ముక్తిని పొందింది. నీకు మరో కథ చెప్తాను విను.

**పూర్వం కనకావతీపురంలో ఒక బ్రాహ్మణుడు ఉండేవాడు. అతడికి ఒక పుత్రిక ఉండేది. ఆమె రత్న కంకణాల్ని ధరించేది. ఆమె ఒడ్లు దంచేటప్పుడు ఆ కంకణాలు మ్రోగుతూ ఉండేవి. ఆ మ్రోతను భరించలేక చేతికి ఒక్క కంకణాన్నే ఉంచుకొని తక్కిన వాటిని తీసివేసింది. అలాగే భగవంతుడొక్కడిపైన మాత్రమే మనస్సును లగ్నం చేస్తే మానవులు ముక్తిని పొందుతారు.**

యోగీశ్వరులు విద్యగానీ అవిద్యగానీ నా మాయగానే భావిస్తారు. పశు మార్గంలో ఎన్నటికీ ప్రవర్తించరు. అలా యోగీశ్వరుల్లా సుఖాలపై వ్యామోహాన్ని త్రుంచుకొనేవాళ్ళు మాత్రమే ముక్తిని పొందుతారు. కాబట్టి సర్వమూ విష్ణుమాయ అని తెలుసుకో!' అన్నాడు శ్రీకృష్ణుడు.

అప్పుడు ఉద్ధవుడు 'పరమాత్మా! నీ రూపాన్ని ఏ విధంగా తెలుసుకోవాలో సెలవియ్యి' అన్నాడు. దానికి శ్రీకృష్ణుడు చెప్పడం ప్రారంభించాడు.

**ఉద్ధవా! భక్తిభావంతో, దయాహృదయంతో, మితభాషియై, సత్యవ్రతుడై, ఏ పనిచేసినా 'కృష్ణార్పణం' అనుకొంటూ చేసేవాడు పరమభాగవతుడు. నా కథల్ని**

**వింటూ, ధ్యానిస్తూ, స్తుతిస్తూ కాలం గడుపుతూ నా భక్తులకు ఆతిథ్యం ఇస్తూ వాళ్ళను సేవించేవాడు పరమభాగవతుడు. అటువంటి పుణ్యాత్ముడు బతికున్నంత కాలమూ నన్నే పొందుతాడు. మరణించాక కూడా నా స్థానాన్ని చేరుకొంటాడు.**

సనకసనందనాది మహర్షులు, అంబరీష విభీషణ రుక్మాంగదాది భాగవతులు, మథురానగరంలో బలరాముడు, గోపికలు ఇలాగే ముక్తిని పొందారు.' అన్నాడు.

తరువాత ఉద్ధవుడు ధ్యానం గురించి చెప్పమని వేడుకొన్నాడు. శ్రీకృష్ణుడు చెప్తున్నాడు.

ఉద్ధవా! ఏకాంతంగా కూర్చొని తొడలమీద చేతుల్ని సంధించి, ముక్కుకొన పైనే దృష్టిని నిలిపి ప్రాణాయామం చెయ్యాలి.

ఆ ప్రాణాయామం ద్వారా నన్ను హృదయంలో నిలుపుకొని, 18 రకాల ధారణసిద్ధుల్ని తెలుసుకొని, ఇంద్రియాలను బంధించి, మనస్సును ఆత్మలో చేర్చి, ఆత్మను ఆత్మతో లగ్నం చేస్తే బ్రహ్మపదాన్ని పొందవచ్చు. ఇదే ప్రశ్నను ఇంతకు ముందు అర్జునుడు కురుక్షేత్ర సంగ్రామంలో వేశాడు. అతడికి చెప్పినదే నీకూ చెప్తున్నాను.

ఈ విశ్వం నా స్వరూపమే అని తెలుసుకో! దేవతలలో బ్రహ్మ, వసువులలో అగ్ని, ఆదిత్యులలో విష్ణువు, రుద్రులలో నీలలోహితుడు, బ్రహ్మలలో భృగువు, ఋషులలో నారదుడు, ధేనువులలో కామధేనువు, సిద్ధులలో కపిలుడు, దైత్యులలో ప్రహ్లాదుడు, గ్రహాలలో చంద్రుడు, ఏనుగులలో ఐరావతం, గుర్రాలలో ఉచ్చైశ్శ్రవం, నాగులలో వాసుకి, మృగాలలో సింహం ఇలా అన్నీ నా విభూతులే.

**'సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ'.**

అన్ని ధర్మాల్ని విడిచిపెట్టి నన్ను మాత్రమే శరణు వేడుకో! అన్న గీతావాక్యాన్ని ఉపదేశించి, మరిన్ని ముఖ్యమైన విషయాలను ఇలా బోధిస్తున్నాడు–

'మౌనవ్రతం, బ్రహ్మచర్యం, సహనం, జపం, తపం, అతిథి సత్కారం, పరహితం, దొంగబుద్ధి లేకపోవడం – ఇటువంటివి నియమాలు. ఇంద్రియాలను అదుపులో ఉంచుకోవడం, శత్రువుల్నీ మిత్రుల్నీ ఒకేలా చూడగలగడం, శమం అంటారు.

**మూఢులకు జ్ఞానాన్ని ఉపదేశించడం, కోరికలను విడిచిపెట్టటం, సమదర్శనం, వైష్ణవభక్తి, ప్రాణాయామం, మనోనైర్మల్యం వీటిని విద్యలు అంటారు.**

**శమదమాది గుణాలు లేకపోవడం, నాపై భక్తి లేకపోవడం, అవిద్య.**

**చిత్తశుద్ధితో ఎప్పుడూ సంతృప్తిగా జీవించడమే దమం.**

**ఇలాంటి నియమాలు, గుణాలు కలిగి, నాపై భక్తితో మెలగడమే సుఖం. నన్ను తెలుసుకోలేక తమోగుణంలో ఉండటమే దుఃఖం.**

బంధువులపట్ల, గురువులపట్ల భేదబుద్ధితో శరీరాన్ని తన ఇల్లుగా భావించే వాడు ఐశ్వర్యవంతుడు కాడు. కటిక దరిద్రుడు.

ఇంద్రియాలను జయించి సంపూర్ణ వైరాగ్యాన్ని పొందినవాడే ఈశ్వరుడు.

**మానవుడు జీవితం తొలిదశల్లోనే నన్ను తెలుసుకొంటే చరితార్థుడవుతాడు.**

**ఐశ్వర్య గర్వంతో విర్రవీగేవాడు చీకటి బావిలో పడిపోతాడు. వాడు దరిద్రుడౌతాడు. నా పాదాలను సేవించిన ఐశ్వర్యవంతుడు మోక్షాన్ని పొందుతాడు.**

**కాబట్టి శరీరంపై అభిమాన్ని వదిలి ఈ లోకానికీ పరలోకానికీ చెందిన సుఖాలను కోరుకోకుండా మనస్సును నిగ్రహించుకొని నిత్యమూ నన్నే స్మరించాలి. అలా చేసినవాడు వైకుంఠాన్ని పొందుతాడు. నేనూ అతణ్ణి విడిచిపెట్టకుండా అతడి వెనుక వెళ్తుంటాను. నారదాది మునులు భక్తిభావంవల్ల నా సారూప్యాన్ని పొందారు.**

సాధారణంగా మానవులకు ధ్యానంచేయడం చాలా కష్టం. మనస్సు ఒక పట్టాన మాట వినదు.

ఒక దేవతా ప్రతిమను ఏర్పరచుకొని, శుచిగా సకల ఉపచారాలతో నైవేద్య సమర్పణలతో నన్ను అర్చించవచ్చు. లేదా మానసిక పూజా పద్ధతుల ద్వారా కూడా నన్ను పూజించవచ్చు.

ఉద్ధవా! నువ్వు కూడా బదరికాశ్రమానికి వెళ్ళి ఇప్పుడు నేను చెప్పిన సాంఖ్యయోగం ద్వారా నన్ను అర్చించు. కలియుగం చివరిదాకా జీవించి ఉండు' అని ఆజ్ఞాపించాడు.

ఉద్ధవుడు ఆ ఆజ్ఞను శిరసావహించి బదరికాశ్రమానికి దారితీశాడు.

శుకయోగి చెప్పిన ఈ అద్భుతవిషయాలు పరీక్షిత్తుకు మహానందాన్ని కలిగించాయి. తరువాత శ్రీకృష్ణుడు ఏంచేశాడో ఎక్కడ ఉన్నాడో చివరికి ఎలా అవతారం చాలించాడో తెలుసుకోవాలని ఆసక్తి కలిగింది. అందుకే చెప్పమని అడిగాడు. శుకుడు చెప్పడం ప్రారంభించాడు.

## అవతార పరిసమాప్తి

మహారాజా! తర్వాత శ్రీకృష్ణుడు బలరాముడితో సహా ద్వారకను విడిచి వెళ్ళిపోయాడు. నాథుడు లేని రాజ్యం ఎలా ఉంటుంది? పతనానికి పరాకాష్ఠలా మారిపోతుంది. యాదవులు మద్యపానమత్తులై తమలో తాము కొట్టుకోవడం మొదలుపెట్టారు. అది చిలికిచిలికి గాలివానయ్యింది. యుద్ధం దాకా దారితీసింది. దీనికంతటికీ కారణం మునుల శాపమే. ఒకరికొకరు యమధర్మరాజుల్లా మారిపోయారు. పొడుచుకొని చచ్చారు.

ఇదంతా చూసి చిరునవ్వు చిందిస్తూ శ్రీకృష్ణుడూ బలరాముడూ కొంత దూరం వెళ్ళిపోయారు. అలా వెళ్ళాక ఇద్దరూ చెరోదారీ పట్టారు. బలరాముడు వెళ్ళి యోగమార్గంలో అనంతుడిలో కలిసిపోయాడు.

శ్రీకృష్ణుడు మరో మార్గంలో వెళ్ళి ఒక పొదచాటున విశ్రమించాలనుకొని ఒక కాలుమీద ఇంకో కాలు పెట్టుకొని నిద్రపోయాడు. ఆ కాలు ఇటూ అటూ కదుపుతున్నాడు.

ఆ సమయంలో అటువైపే వస్తున్న ఒక బోయవాడికి పొదల మాటున కదులుతున్న పరమాత్ముడి పాదం ఒక జింక చెవిలా కనిపించింది. వెంటనే బాణం గురిచూసి కొట్టాడు. అది నేరుగా వచ్చి శ్రీకృష్ణుడి పాదంలో గుచ్చుకుంది.

'హాహా...' అని అరిచాడు శ్రీకృష్ణుడు. బోయవాడు తీరా దగ్గరకి వచ్చి చూస్తే అక్కడ ఉన్నది జింక కాదు శ్రీకృష్ణుడు. భయంతో వణికిపోయాడు. 'పెద్ద తప్పే చేశాను. నన్ను మన్నించు దొరా!' అంటూ కాళ్ళపై పడ్డాడు. దానికి శ్రీకృష్ణుడు–

**'నువ్వెందుకయ్యా! బాధపడతావు? ఇది నా కర్మఫలం. చేసిన కర్మ ఊరికే పోతుందా? ఎంతటివాళ్ళైనా అనుభవించి తీరవలసిందే! నువ్వు నిమిత్తమాత్రుడివి,' అన్నాడు.**

అయినా ఆ బోయవాడు అపరాధ భావంతో తిండి తినటం మానివేసి ప్రాణాలు వదిలిపెట్టి, వైకుంఠానికి చేరుకొన్నాడు. ఆ సమయంలో రథసారథి దారుకుడు వచ్చాడు. సర్వజ్ఞుడు, సర్వేశ్వరుడూ అయిన శ్రీకృష్ణుడు ఒంటరిగా ఉండటాన్ని చూసి భయంతో చేతులు జోడించి-

**తే.గీ.** **నిన్నుఁ జూడని కన్నులు నిష్ఫలములు**
**నిన్ను నొడువని జిహ్వ దా నీరసంబు**
**నిన్నుఁ గానని దినములు నింద్యములగుఁ**
**గన్నులను జూచి మమ్మును గారవింపు** (11-121)

'స్వామీ! నిన్ను చూడని కళ్లు నిష్ఫలం కదా! నిన్నే కీర్తించని నాలుక రస హీనమైనదే ప్రభూ! నిన్ను చూడని రోజులు నింద్యాలు కావూ! అందుకే ఒక్కసారి కళ్ళు తెరిచి చూసి మమ్మల్ని గౌరవించు దేవా!'

సముద్రమంతటి యాదవ వంశం నాశనమైపోయింది. తక్కినవాళ్ళు చెల్లాచెదరైపోయారు. ఇప్పుడు నేను ద్వారకకు వెళ్ళి మిగిలినవాళ్ళ కేం చెప్పాలి?' అని విలపిస్తున్నాడు.

అంతలోనే శ్రీకృష్ణుడి దివ్యాయుధాలు, గుర్రాలు మాయమైపోయాయి. అప్పుడు శ్రీకృష్ణుడు దారుకుడితో 'దారుకా! ఇక్కడ జరిగినదంతా అక్రూరుడితో చెప్పు. స్త్రీలను, పిల్లల్ని, పెద్దవాళ్లను, ముసలివాళ్ళనూ హస్తినాపురానికి తీసుకు వెళ్ళమని అర్జునుడితో చెప్పు' అన్నాడు.

దారుకుడు హుటాహుటిన వెళ్ళాడు.

అర్జునుడు శ్రీకృష్ణుడి ఆజ్ఞప్రకారం అందరినీ హస్తినకు చేర్చాడు. తరువాత ద్వారక పూర్తిగా నీటిలో మునిగిపోయింది.

తరువాత పరంధాముడు శతకోటి సూర్యుల తేజస్సుతో నారదాది మునులూ, బ్రహ్మాది దేవతలూ జయజయ ధ్వానాలు చేస్తుంటే వైకుంఠానికి వెళ్ళిపోయాడు.

# ద్వాదశ స్కంధం

రాజశేఖరా! శుకమహర్షి చెబుతున్నాడు-

**కం. గజతురగాదిశ్రీలను**
**నిజమని నమ్మంగరాదు, నిత్యమును హరిన్**
**గజిబిజిలేక తలంచిన**
**సుజనులకును నతనియందుఁ జొరఁగా వచ్చున్** (12-7)

అశ్వాలు, గజాలు మొదలైనవి నిజమైన సంపదలు కావు. అవి శాశ్వతాలని నమ్మకూడదు. అనునిత్యం శ్రీహరిని గజిబిజి లేకుండా ప్రశాంత చిత్తంతో స్మరిస్తే చాలు. అలా స్మరించిన సుజనులు అతడిని చేరుకుంటారు. అంటూ భవిష్యద్రాజుల గురించి విపులంగా చెప్పాడు.

## కల్కి అవతారం

కలియుగంలో ప్రజలు చెడ్డదారుల్లో విచ్చలవిడిగా సంచరిస్తూ ఉంటారు. తీవ్ర సంక్షోభం తాండవిస్తూ ఉంటుంది. వాళ్ళ ఆయుర్దాయమూ అంతంత మాత్రమే.

తినడానికి తిండి, త్రాగడానికి నీళ్ళూ లేక గొప్పగొప్ప రాజులు కూడా దోపిడీ దొంగలై కనిపించినవాడినల్లా దోచుకొంటూ ఉంటారు. ఆశ్రమ ధర్మాలు మంటగలసిపోతాయి.

వానలు కురవవు. ఓషధులు పండవు. ఒకవేళ ఏ పంటైనా పండినా అందులో సారం ఉండదు. **ఈ విధంగా లోకంలో ధర్మం పూర్తిగా క్షీణించిపోయి అధర్మం విలయతాండవం చేస్తున్న సమయంలో శ్రీమన్నారాయణుడు దుష్టశిక్షణ కోసం**

**శిష్టరక్షణ కోసం 'విష్ణుయశుడు' అనే బ్రాహ్మణుడికి కుమారుడై శంబల గ్రామంలో జన్మిస్తాడు. అదే కల్కి అవతారం.**

దేవదత్తం అనే పేరుగల అశ్వాన్ని అధిరోహించి వచ్చి దుష్టులైనవాళ్ళను తన ఖడ్గంతో తెగనరుకుతాడు. అప్పుడు భూమండలం సజ్జనులతో ప్రకాశిస్తుంది. అప్పుడే **కలియుగం కృతయుగ ధర్మాలతో విలసిల్లిపోతుంది.** చంద్రుడు, సూర్యుడు, శుక్రుడు, గురుడు ఒకే రాశిలో ఉంటే అది కృతయుగం.

తరువాత శ్రీమన్నారాయణుడు దుష్టశిక్షణ చేసి వైకుంఠానికి చేరుకొంటాడు. సప్తర్షి మండలంలోని పూర్వ నక్షత్రాలు (పూర్వాషాఢ, పూర్వభాద్ర) రెండింటికీ సమంగా మధ్యలో రాత్రిపూట ఒక నక్షత్రం కనిపిస్తుంటుంది. అది కనిపించాక నూరు సంవత్సరాలకు శ్రీకృష్ణుడు అవతారం చాలించాడు. అప్పుడే కలి ప్రవేశం జరిగింది.

శ్రీకృష్ణుడు ఉన్నంతకాలమూ కలి భూమిపై కాలు మోపలేదు. సప్తర్షులు మఘానక్షత్రంలో ప్రవేశించిన రోజుకు కలి ప్రవేశించి 1200 సంవత్సరాలు. ఈ ఋషులు పూర్వాషాఢలో ప్రవేశించినప్పుడు కలి ప్రవర్ధమానుడవుతాడు. శ్రీకృష్ణుడు లోకాన్ని విడిచి పరమపదానికి చేరుకొన్నరోజునే కలి ప్రవేశించాడు. ఈ విధంగా వెయ్యి దివ్య సంవత్సరాల తర్వాత అంటే **కలియుగం నాలుగోపాదంలో కృతయుగ ధర్మం వర్ధిల్లుతుంది.**

**రాజా! ఈ కాల ప్రవాహంలో రాజులూ రాజ్యాలూ వైభవాలూ ఐశ్వర్యాలూ అన్నీ కొట్టుకుపోయాయి. ఒక్క కీర్తిమాత్రమే శాశ్వతంగా నిలిచి ఉంది.**

శంతనుడి తమ్ముడు దేవాపి, అలాగే ఇక్ష్వాకు వంశంలో జన్మించిన మరుత్తు కలాప గ్రామంలో నివసిస్తూ యోగమార్గం ద్వారా ముక్తిని పొందారు.

**కలియుగాంతంలో వాసుదేవుడి కరుణ ప్రసరిస్తుంది. ప్రజలందరూ హరిభక్తులై ముక్తిని పొందుతారు.**

మహారాజా! చూశావుగా. ఈ నాలుగు యుగాలలోనూ రాజ్యంపైనా, ఐశ్వర్యం పైనా, శరీరంపైనా వ్యామోహం పెంచుకున్న ఎందరో కాలగర్భంలో కలిసిపోయారు. మా పెద్దలు మాత్రం విష్ణుభక్తులై సద్గుణాలతో విలసిల్లి కీర్తిమంతులయ్యారు.

కం. ధర్మము సత్యముఁ గీర్తియు
నిర్మల దయ విష్ణుభక్తి నిరుపమ ఘనస
త్కర్మ మహింసావ్రతమును
నర్మిలి గలవారె పుణ్యు లవనీనాథా! (12–16)

**ఓ మహారాజా! ధర్మం, సత్యం, కీర్తి, దయ, విష్ణుభక్తి, సత్కర్మ, అహింసావ్రతం కలవాళ్ళే పుణ్యాత్ములు. గర్వంతో మన్నూ మిన్నూ కానకుండా చెలరేగిపోయే రాజుల్ని చూసి భూదేవి నవ్వుకుంటుంది సుమా!**

రాజ్యకాంక్ష ఎంతకైనా తెగించేలా చేస్తుంది. చివరికి తండ్రీ కొడుకులకూ, అన్నదమ్ములకూ చిచ్చుపెడుతుంది. ఈ రాజ్యకాంక్షా వ్యామోహంలో ఐనవాళ్ళే కలహించుకుంటారు. మరణిస్తారు.

ఎందరో రాజులు భూమిని 'నాది' అనుకున్నారు. నాశనమైపోయారు. కాబట్టి ఇది యథార్థం కాదు.

**సర్వస్వాన్ని విడిచిపెట్టి 'జనార్దనా! వైకుంఠ! వాసుదేవా! నృసింహా అని నిరంతరం హరికథామృతపానం చేస్తే వృద్ధాప్యపు వికారాలు, వ్యాధి బాధలూ సోకకుండా వైకుంఠాన్ని చేరుకోవచ్చు.**

రాజా! నువ్వు కూడా ఆ పరమేశ్వరుడి దివ్యగుణాలను కీర్తించి, తరించు, అన్నాడు. వెంటనే పరీక్షిత్తు ఇలా అడిగాడు–

**'మునివర్యా! ఈ కలియుగం ఘోరమైన పాపాలకు ఆలవాలమని అంటారు కదా! మరి ప్రజలు ఈ పాపాలబారిన పడకుండా ఎలా తప్పించుకోవడం? అసలు కాలం ఎలా నడుస్తుంది? కాలస్వరూపుడైన ఈ పరంధాముడి ప్రభావం ఎలా తెలుస్తుంది? లోకాలన్నీ ఎలా నిలుస్తాయి? సెలవియ్యండి'** అన్నాడు.

శుకమహర్షి చెబుతున్నాడు.

## ధర్మస్వరూపం

**రాజా! నాలుగు యుగాలలో ధర్మం ప్రవర్తిస్తుంటుంది. ఆ ధర్మానికి సత్యం, దయ, తపస్సు, దానం ఈ నాలుగూ నాలుగు పాదాలు. మొదటిదైన కృతయుగంలో**

శాంతి, దాంతి, ఆత్మజ్ఞానం, వర్ణాచారాలు, ఆశ్రమాచారాలు మొదలైనవాటితో ధర్మం నాలుగు పాదాలలో నడుస్తుంది.

త్రేతాయుగంలో శాంతి, దాంతి, కర్మాచరణలతో ధర్మం మూడు పాదాలపై నడుస్తుంది. ద్వాపర యుగంలో బ్రాహ్మణ పూజ, జపతపాలు, అహింసావ్రతం మొదలైన లక్షణాలతో ధర్మం రెండు పాదాలపై నడుస్తుంది.

ఇది కలియుగం. ఇక్కడ జనులు దుర్గుణాలతో ఉంటారు. వర్ణాశ్రమ ధర్మాలను విడిచిపెడతారు. దురాచారాలు, నిర్దయ, హింస, పాపశీలత, అసత్య భాషణం, అకారణవైరం ఇలా ఒకటి కాదు ఎన్నో దుర్గుణాలకు నెలవై ఉంటారు.

కాబట్టి ఈ కలియుగంలో ఒక్క క్షణమైనా ఏమరిపాటు లేకుండా 'శ్రీనృసింహా! వాసుదేవా! సంకర్షణా!' అంటూ భక్తితో శ్రీహరిని స్మరించాలి. ఆ విధంగా హరిస్మరణ పరాయణులైనవారికి వంద యజ్ఞాలు చేసిన ఫలం వస్తుంది. కాబట్టి ఓ రాజా! నిరంతరం హరి నామ స్మరణ చెయ్యి' అన్నాడు.

ఈసారి కల్పప్రళయం గురించి వివరించవలసిందిగా కోరాడు పరీక్షిత్తు.

శుకమహర్షి ఆ విశేషాలన్నీ వివరంగా చెప్పి చివరిగా–

'రాజా! నువ్వు మృత్యుభయం విడిచిపెట్టు. పుట్టిన ప్రతి వ్యక్తికీ మరణం ఒక శాశ్వతధర్మం. కాబట్టి శ్రీమన్నారాయణుడిని ధ్యానించు. దీనివల్ల మళ్ళీ మానవ లోకంలో జన్మించవు. నీకు తప్పక వైకుంఠం లభిస్తుంది' అని బోధించి శుకమహర్షి యథేచ్ఛగా వెళ్ళిపోయాడు.

## సర్పయాగం

సూతమహర్షి ఇలా చెబుతున్నాడు. 'మహర్షులారా! అప్పుడు పరీక్షిత్తు దర్భలపై కూర్చొని శ్రీహరిని ధ్యానిస్తున్నాడు.

శృంగి ప్రోత్సాహంవల్ల తక్షకుడు ఒక బ్రాహ్మణుడి రూపంలో వస్తున్నాడు. అతడికి దారిలో కాశ్యపుడు అనే ఒక బ్రాహ్మణుడు కలిశాడు. ఇతడు ఎలాంటి విషాన్నయినా హరించగల సమర్థుడు. పరీక్షిత్తును రక్షించడానికే అతడు వస్తున్నాడు. అది తెలుసుకున్న తక్షకుడు అతడికి అపారధనమిచ్చి వెనక్కి పంపి వేశాడు.

తరువాత తక్షకుడు నేరుగా పరీక్షిత్తు అంతఃపురానికి చేరుకున్నాడు. ఒక పండును రాజసేవకులకు ఇచ్చి పరీక్షిత్తుకు ఇవ్వమని పంపాడు.

తక్షకుడు తరువాత తానే ఒక పురుగుగా మారి ఆ పండులో దూరి లోపలికి ప్రవేశించాడు. రాజు ఆ ఫలాన్ని తినబోతుండగా తక్షకుడు మహాసర్పమై పరీక్షిత్తును కాటువేశాడు.

పరీక్షిత్తు మరణానికి తీవ్రంగా కలత చెందిన జనమేజయుడు అనే పరీక్షిత్తుకుమారుడు సమస్త సర్పాలనూ భస్మం చేయడానికై ఒక సర్పయాగాన్ని ప్రారంభించాడు.

వేలకొద్దీ సర్పాలు వచ్చి ఆ యాగాగ్నిలో పడి భస్మమైపోతున్నాయి. తక్షకుడు మాత్రం రాలేదు. కారణం అతడు స్వర్గంలో ఇంద్రుణ్ణి ఆశ్రయించుకొని ఉన్నాడు.

అది తెలుసుకున్న ఋత్విక్కులు 'సహేంద్ర తక్షకాయానుబ్రూహి' అనే మంత్రాన్ని చెప్పారు. అంతే, ఇంద్రుడితో సహా తక్షకుడు పడడానికి వస్తున్నాడు. అప్పుడు బృహస్పతి అక్కడికి వచ్చి రాజును బహువిధాలుగా కీర్తించి,

'రాజా! జనన మరణాలు ప్రాణికోటికి సహజం. శాంతించు. కోపాన్ని విడిచిపెట్టు. ఇప్పటికే లెక్కలేనన్ని పాములు మంటగలిసిపోయాయి' అన్నాడు. జనమేజయుడు తన గురువైన ఆంగిరసుడి మాట మన్నించాడు. తన నగరానికి వెళ్ళి మాయావికారాలను విడిచిపెట్టి శ్రీహరి పాదాలపైనే దృష్టి నిలిపి కాలం గడుపుతున్నాడు. అతడు తప్పక విష్ణుపదాన్ని చేరుకుంటాడు.

## వేదపురాణాల వ్యాప్తి

'మహర్షులారా! పైలుడు, సుమంతుడు, జైమిని, వైశంపాయనుడు అనే నలుగురు వేదవ్యాస మహర్షి శిష్యులు. వీళ్ళు నాలుగు వేదాలనూ లోకంలో ప్రచారం చేశారు.

ఇక త్రయ్యారుణి, కశ్యపుడు, సావర్ణి, అకృతవ్రణుడు, వైశంపాయనుడు, హారీతుడు అనే ఆరుగురూ పురాణ ప్రవక్తలుగా ప్రసిద్ధులయ్యాయి. వీళ్ళు వ్యాసులవారి శిష్యుడూ మా తండ్రీ అయిన రోమహర్షణుడి వద్దనే విద్య నేర్చుకొన్నారు.

పురాణం పంచసర్గలతో కూడి ఉంటుంది. కొందరు పురాణానికి అయిదు లక్షణాలు ఉంటాయని చెప్తారు అన్నాడు సూతుడు.

అప్పుడు శౌనకాది మహామునులంతా వినమ్రంగా 'సూతమహర్షీ! ఇప్పటి దాకా నువ్వు శ్రీమన్నారాయణ గుణవైభవాన్ని మాకు వినిపించావు. అలాగే ఈ పరమాత్ముడి మహిమాన్వితాలైన కథలనూ మనోహరంగా చెప్పావు. మాదో విన్నపం.

**పాపాత్ములు సైతం తరించడానికి ఏదైనా మార్గం ఉందా? ఉంటే చెప్పి పుణ్యం కట్టుకో మహానుభావా!' అన్నారు. దానికి సమాధానంగా సూతమహర్షి 'మహర్షులారా! నిరంతరమూ చేసే భగవన్నామస్మరణమే అందరూ తరించడానికి ఒకే ఒక్క మార్గం. అది ఎంతటి పాపాత్ములనైనా తరింపజేస్తుంది'** అంటూ మార్కండేయుడి వృత్తాంతాన్ని చెప్పడం ప్రారంభించాడు.

## మార్కండేయోపాఖ్యానం

'మహర్షులారా! అది కృతయుగం.

మృకండుడు అనే పేరుగల ఒక గొప్ప ఋషి బ్రహ్మచర్య వ్రతాన్ని చేపట్టి ఘోరతపస్సు సాగిస్తున్నాడు. అతడి తపస్సుకు మెచ్చారు శివకేశవులు. అతడి ముందు ప్రత్యక్షమయ్యారు. వరం కోరుకోమన్నారు.

అప్పుడా మహర్షి సుగుణ సంపన్నుడైన ఒక పుత్రుణ్ణి తనకు ప్రసాదించమని వేడుకొన్నాడు. వాళ్ళు అనుగ్రహించారు.

అలా కొంతకాలానికి మృకండు మహర్షికి ఒక పుత్రుడు జన్మించాడు. అతడే మార్కండేయుడు. ఈ బాలుడు పరమనిష్ఠాగరిష్ఠుడు. నిత్యమూ తపస్సులో ఉండే మార్కండేయుడిని మృత్యువు కబళించబోయింది. పాశంతో కట్టివేయసాగింది. అప్పుడు మార్కండేయుడు మృత్యువుతో పోరాడాడు. దానిని గడ్డిపోచలా తిరస్కరించి మళ్ళీ తపస్సులో మునిగిపోయాడు.

అతడి తపస్సును చూసి ఇంద్రుడు కలవరపాటు చెందాడు. తపస్సును భగ్నం చేయడానికి అప్సరసలను పంపాడు. వాళ్ళు వచ్చి ఎంతగానో ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. చివరికి వెనక్కి తిరిగి వెళ్ళిపోయారు.

మార్కండేయుడిని అనుగ్రహించటానికి సాక్షాత్తు విష్ణువే ఆయన ముందు ప్రత్యక్షమయ్యాడు.

మార్కండేయుడు విష్ణుదేవుణ్ణి చూసి భక్తిప్రపత్తులతో 'దేవదేవా! నిత్యం నీ నామస్మరణ గావిస్తూ ఈ శరీరంతోనే అనేక యుగాలు జీవించే భాగ్యాన్ని నాకు ప్రసాదించు' అని వేడుకొన్నాడు.

విష్ణువు 'తథాస్తు' అన్నాడు. మార్కండేయుడు శ్రీహరి వైభవాన్ని నోరారా కీర్తించి, విష్ణుతత్త్వాన్ని విశదం చేయమని అభ్యర్థించాడు. కరుణాంతరంగుడైన ఆ విష్ణుదేవుడు తన స్వరూపాన్ని అతడికి తెలిపి, వైకుంఠానికి వెళ్ళిపోయాడు.

తరువాత మార్కండేయుడు శివనామస్మరణ చేయడం ప్రారంభించాడు. హరినామస్మరణం మర్చిపోయాడు. నూరు సంవత్సరాలు గడిచాయి. ఈ నూరు సంవత్సరాల పాటు మేఘాలు కుండపోతగా వర్షిస్తూ భూమిని జలప్రవాహంలో ముంచెత్తాయి. చుట్టూ చీకటి. కళ్ళు పొడుచుకున్నా కానరాని కారుచీకటి.

ఆ సమయంలో ఆ నీటి మధ్య ఒక వటపత్రంపై పద్మరాగమణుల కాంతులతో ప్రకాశించే పాదపద్మాలు కల ఒక అందమైన బాలుడు కనిపించాడు. ఆ బాలుడిని చూసి నమస్కరించాడు మార్కండేయుడు. ఆ బాలుడి శరీరంలోనికి ప్రవేశించాడు. చాలాకాలం అతడి ఉదరంలోనే సంచరించాడు. అతడి పాదపద్మాలనే స్మరించాడు. తర్వాత బయటకు వచ్చి కౌగిలించుకోబోయాడు. కానీ ఆ బాలుడు అంతర్ధాన మైపోయాడు. ఇక మార్కండేయుడు యథాప్రకారంగా తన ఆశ్రమంలో ఉంటూ తపస్సు చేసుకుంటున్నాడు.

ఒకరోజు ఆకాశమార్గంలో పార్వతీపరమేశ్వరులు విహరిస్తూ ఈ మహర్షిని చూశారు.

శరీరం నిండా విబూది. మెడలో రుద్రాక్ష మాలలు. ఘోరమైన తపస్సు చేస్తున్న మార్కండేయ మహర్షిని చూసింది పార్వతీదేవి. వెంటనే 'స్వామీ! ఈ మహర్షితో నాలుగు మాటలు ముచ్చటించి వెళ్దాం!' అని అడిగింది. శివుడు సరేనన్నాడు. ఇద్దరూ ఆకాశం నుండి కిందకు దిగి అతడి ముందు నిలిచారు.

మార్కండేయుడు ఏకాగ్రచిత్తంతో ఉన్నాడు. అప్పుడు శివుడు యోగమహిమతో అతడి హృదయంలోనికి ప్రవేశించాడు.

కళ్ళుతెరిచాడు మార్కండేయుడు. చతుర్బాహువులతో, రుద్రాక్ష మాలికాధరుడై ఒక చేత్తో త్రిశూలాన్ని, మరో చేత్తో డమరుకాన్ని ధరించి, పార్వతీ దేవితో కలిసి వృషభ వాహనంపై కూర్చొని పరమశివుడు అతడికి సాక్షాత్కరించాడు.

మార్కండేయుడు ఆశ్చర్యపోయాడు. అనేక విధాలుగా శివుణ్ణి కీర్తించాడు. పరమేశ్వరుడు అతడి తపస్సుకు మెచ్చి వరం కోరుకోమన్నాడు.

దానికి మార్కండేయుడు 'పరమేశ్వరా! ఆ శ్రీమన్నారాయణుడి మాయా ప్రభావం అంత తేలికగా లభించేది కాదు. కానీ నీ దర్శన భాగ్యం వల్ల నాకు ఆ అదృష్టం దక్కింది. ఇంత మాత్రం చాలు. అయినా నిన్ను ఒక వరం కోరుకొంటాను. నిరంతరమూ నారాయణ పాదపద్మాలను ధ్యానించే బుద్ధినీ, మరణాన్ని జయించే శక్తినీ నాకు అనుగ్రహించు' అన్నాడు.

ఈశ్వరుడు దయాసాగరుడు. వృద్ధాప్యంగానీ రోగాలుగానీ దరి చేరని కోటి కల్పాల ఆయుర్దాయాన్ని మార్కండేయుడికి ప్రసాదించాడు. అలాగే నారాయణుడి అనుగ్రహం కూడా నీకు లభిస్తుందని ఆశీర్వదించి అంతర్ధానమైపోయాడు.

మహర్షులారా! ఇంతటి మహిమాన్వితమైన ఈ మార్కండేయుడి వృత్తాంతాన్ని విన్నా, చదివినా, రచించినా మరణం దరిదాపులకు రాదు. హరిభక్తుడు ఇతర మంత్రాలను, ఇతర దేవతలను, ఇతర సాధనాలను విడిచిపెట్టాలి. దుష్టులకు దూరంగా ఉంటూ సజ్జన సాంగత్యం చేస్తూ **'నారాయణ! గోవింద!'** అంటూ నామస్మరణం చెయ్యాలి. ఇలా చేయడంవల్ల పుణ్యం లభిస్తుంది. ఆ పుణ్యంతో వైకుంఠం లభిస్తుంది' అన్నాడు సూతుడు. దానికి శౌనకుడు 'మహర్షీ చివరిగా నాదో సందేహం? సూర్యుడు ప్రపంచానికి నేత్రంలాంటివాడు కదా! ఆ సూర్య భగవానుడు చైత్రమాసం మొదలుకొని ఏఏ నెలల్లో ఏయే పేర్లతో, ఎలా సంచరిస్తాడో తెలుసుకోవాలని ఉంది. దయచేసి వివరించు' అన్నాడు వినమ్రంగా.

సూతుడు ప్రారంభించాడు.

'శౌనకా! ఈ విషయాన్ని పూర్వం శుకమహర్షి విష్ణురాతుడికి చెప్పాడు. ఆ క్రమంలోనే నేనూ నీకు చెప్తాను విను.

## ద్వాదశాదిత్యులు

సూర్యుడు శ్రీమన్నారాయణుడి స్వరూపం. ఇతడికి ఒక్కటే రూపం ఉన్నప్పటికీ మహర్షులు దేశ కాల క్రియా భేదాలనుబట్టి అనేక విధాలుగా వర్ణిస్తున్నారు. ఆ వివరాలు చెబుతాను–

చైత్రమాసంలో సూర్యుడి పేరు ధాత. కృతస్థలి, హేతి, వాసుకి, రథకృత్తు, పులస్త్యుడు, తుంబురుడు ఇతడి పరిజనులు.

వైశాఖంలో సూర్యుడికి అర్యముడు అని పేరు. పులహుడు, ఓజుడు, ప్రహేతి, పుంజికస్థలి, నారదుడు, కంజనీరుడు అనుచరులు.

జ్యేష్ఠంలో సూర్యభగవానుడికి మిత్రుడు అనే పేరు. అత్రి, పౌరుషేయుడు, తక్షకుడు, మేనక, హాహా, రథస్వనుడు అనే పరిజనులతో సంచరిస్తూ ఉంటాడు.

ఆషాఢ మాసంలో ఇతడి పేరు వరుణుడు. వసిష్ఠుడు, రంభ, సహజన్యుడు, హూహువు, శుక్రుడు, చిత్రస్వనుడు ఇతడి పరివారం.

అలాగే శ్రావణమాసంలో ఇంద్రుడు, భాద్రపదంలో వివస్వంతుడు, ఆశ్వయుజంలో త్వష్ట, కార్తికంలో విష్ణువు, మార్గశీర్షంలో అర్యముడు, పుష్యంలో భగుడు, మాఘంలో పూషుడు, ఫాల్గుణంలో క్రతువు అనే పేర్లతో పరివార గణాలతో సంచరిస్తూ లోకాన్ని పరిపాలిస్తాడు.

ఇలా 12 నెలలలో ప్రకాశించే సూర్యుడి వైభవం 'ఇంత' అని చెప్పడానికి వీలుకానిది. ఉభయసంధ్యలలో తనను ఉపాసించేవాళ్ళ పాపాలను రూపుమాపుతూ ఉంటాడు. సూర్యుడికి ముందువైపు వేదమంత్రాలతో, ఋషులు స్తుతిస్తూ ఉంటారు. వెనుకవైపు అప్సరసలు నాట్యం చేస్తూ ఉంటారు. గంధర్వుల గానం సాగుతూ ఉంటుంది. వాలఖిల్యమహర్షులు – 60వేల మంది ఎదురుగా నిలిచి స్తోత్రం చేస్తుంటే అమితవేగమూ బలమూ కల సర్పరాజాలు రథాన్ని లాగుతూ ఉంటే ఆదిత్యదేవుడు కాలాన్ని నడిపిస్తూ ప్రతికల్పంలోనూ తేజరిల్లుతూ ఉంటాడు.

ఇవన్నీ వాసుదేవమయాలేనని తెలుసుకో, అని చెప్తూ సూతమహర్షి భాగవత పురాణ ప్రాశస్త్యాన్ని ప్రకటిస్తున్నాడు.

## భాగవత పురాణ ప్రాశస్త్యం

'మహర్షులారా! ఈ భాగవతం మహాపురాణం. పురాణాలన్నింటిలోకెల్లా శ్రేష్ఠమైనది. అందుకే దీనిని పురాణతిలకం అన్నారు.

భాగవతాన్ని భక్తితో నిష్ఠతో చదివేవాళ్ళు శ్రవణం చేసేవాళ్ళూ, రాసేవాళ్ళు, ఆయురారోగ్య ఐశ్వర్యాలతో విష్ణుసాయుజ్యాన్ని పొందుతారు.

**పుష్కరతీర్థంలో గానీ, ద్వారకాపట్టణంలో గానీ మథురానగరంలో గానీ ఆదివారంనాడు భక్తిశ్రద్ధలతో భాగవతాన్ని చదివిన భక్తుడు సంసార సాగరాన్ని అవలీలగా దాటగలిగే శక్తిసంపన్నుడౌతాడు.**

లక్ష్మీరమణుడి దివ్యకథలను వినాలనే ఆసక్తికలవాడూ, చక్రవర్తీ అయిన పరీక్షిన్మహారాజుకు శుకమహర్షి విపులంగా పన్నెండు స్కంధాలలో భాగవత పురాణాన్ని వినిపించాడు. ఈ పురాణంలో పద్దెనిమిది వేల శ్లోకాలు ఉన్నాయి. అష్టాదశ పురాణాలన్నింటిలోనూ మొత్తం నాలుగు లక్షల శ్లోకాలు ఉన్నాయి.

భాగవత పురాణం – నదులలో గంగ, దేవతలలో బ్రహ్మ, నక్షత్రాలలో చంద్రుడు. సముద్రాలలో క్షీరసముద్రం, పర్వతాలలో మేరువు, గ్రహాలలో సూర్యుడు, రాక్షసులలో ప్రహ్లాదుడు, రత్నాలలో పద్మరాగం, చెట్లలో హరిచందనం, ఋషులలో నారదుడు. గోవులలో కామధేనువు, సూక్ష్మమైన వాటిలో జీవుడు, అలాగే జయించలేని వాటిలో మనస్సు, వసువులలో హవ్యవాహనుడు, అదితి సంతానంలో విష్ణువు, రుద్రులలో నీలలోహితుడు, బ్రహ్మలలో భృగువు, సిద్ధులలో కపిలుడు, గుర్రాలలో ఉచ్చైశ్శ్రవం, సర్పాలలో వాసుకి, మృగాలలో సింహం, ఆశ్రమాలలో గృహస్థాశ్రమం, వర్ణాలలో ఓంకారం, శస్త్రాలలో ధనువు, యజ్ఞాలలో జపయజ్ఞం, వ్రతాలలో అహింస, యోగాలలో ఆత్మయోగం, ఓషధులలో యవలు, వాక్కులలో సత్యవాక్కు, ఋతువులలో వసంతం, మాసాలలో మార్గశీర్షం, యుగాలలో కృతయుగం, ఎలా శ్రేష్ఠమైనవో అదే విధంగా **పురాణాలలో భాగవతం కూడా శ్రేష్ఠమైనది. అందుకే ఈ పురాణాన్ని చదివినవారు విష్ణుసాయుజ్యాన్ని పొందుతారు.**

అటువంటి భాగవత పురాణాన్ని ప్రవచించిన మహనీయుడు శుక యోగీంద్రుడు. ఆ మహానుభావుడు –

సకల ఆగమాల అర్థాన్ని కడదాకా తెలుసుకొన్నవాడు, ఏ కళంకమూ లేని గుణాలతో ఒప్పుతూ ఉంటాడు. దేవతలు సైతం అతడికి పాదాభివందనం చేస్తారు. అంతటి శుకయోగి పాదపద్మాలకు నేనూ నమస్కరిస్తాను.

## అంతా హరిమయమే

**గుణాతీతుడు, సర్వజ్ఞుడు, సర్వేశ్వరుడు, సర్వాధారుడు, ఆదిదేవుడు, దయామయుడు, దేవవందితుడు, సాగరశయనుడు, ఆశ్రితుల పాలిటి కల్పవృక్షం, ఆద్యంతరహితుడు, వేదవేద్యుడు, విశ్వమయుడు, శ్రీవత్సం, కౌస్తుభం వక్షఃస్థలంపై ధరించినవాడు, శంఖ, చక్ర, గదా ఖడ్గాది ఆయుధాలను ధరించినవాడు, మనోహరుడు, రత్నకిరీటధారి, పద్మనేత్రుడు అయిన దేవకీనందనుణ్ణి నేను నిత్యం స్మరిస్తూ, స్తుతిస్తూ ఉంటాను.** అని భక్తిపారవశ్యంతో చెబుతూ తన హృదయపీఠంపై కొలువుతీరిన వాసుదేవుడికి నమస్కరించాడు సూతమహర్షి.

అదే భక్తి పారవశ్యంతో ఆనందసాగరంలో ఓలలాడుతున్న శౌనకాది మహర్షులుసైతం దేవదేవుడైన విష్ణుదేవుణ్ణి హృదయంలో నిలుపుకొన్నారు. నోరారా ఆ స్వామి వైభవాన్ని కీర్తిస్తూ, ఉత్సాహంగా బయలుదేరి తమతమ నివాస స్థానాలకు తరలిపోతున్నారు.

ఎక్కడ చూసినా శ్రీమన్నారాయణుడే కన్పిస్తున్నాడు. వాళ్ళ ఆనందానికి అవధుల్లేవు.

# ఉపయుక్త పద్యానుక్రమణిక


| క్ర.సం. | పద్యం | స్కంధం - పద్యసంఖ్య | పుట |
|---|---|---|---|
| 1. | శ్రీకైవల్య పదంబు | 1 - 1 | 1 |
| 2. | చేతులారంగ శివుని | 1 - 14 | 1 |
| 3. | పలికెడిది భాగవత | 1 - 17 | 1 |
| 4. | భూషణములు వాణికి | 1 - 46 | 3 |
| 5. | హరినామస్తుతి | 1 - 96 | 7 |
| 6. | నిగమములు | 1 - 140 | 8 |
| 7. | శ్రీకృష్ణా! యదు | 1 - 200 | 10 |
| 8. | కుప్పించి యెగసినఁ | 1 - 221 | 12 |
| 9. | ఒక సూర్యుండు | 1 - 226 | 12 |
| 10. | ఓడితివో శత్రువులకు? | 1 - 352 | 16 |
| 11. | తప్పితివో యిచ్చెదనని | 1 - 353 | 16 |
| 12. | అడిచితివో భూసురు | 1 - 354 | 16 |
| 13. | హరిమయము విశ్వ | 2 - 17 | 21 |
| 14. | రక్షకులు లేని | 2 - 22 | 22 |
| 15. | విశ్వాత్ముఁడు | 2 - 100 | 22 |
| 16. | వరయోగీంద్రులు | 3 - 703 | 35 |
| 17. | భూరి మదీయ | 3 - 869 | 37 |
| 18. | అనఘా! విను లోకమున | 4 - 67 | 42 |
| 19. | అనయముఁ బిలువక | 4 - 68 | 42 |
| 20. | పురుషుఁడు దవిలి | 4 - 244 | 45 |
| 21. | హరి! పరమాత్మ! | 4 - 276 | 46 |
| 22. | పొగడొందు జనని | 4 - 780 | 53 |
| 23. | వేదప్రణిహిత | 6 - 84 | 63 |
| 24. | ఎఱుక గలుగు | 6 - 113 | 64 |
| 25. | డెందంబు పుత్రు | 6 - 121 | 64 |
| 26. | హరిభక్తులతో | 6 - 153 | 65 |
| 27. | చావు ధ్రువమైన | 6 - 382 | 69 |
| 28. | కామోత్కంఠత | 7 - 18 | 75 |
| 29. | గాలిం గుంభిని | 7 - 90 | 77 |
| 30. | తనయందు నఖిల | 7 - 115 | 77 |
| 31. | పానీయంబులు ద్రావుచుం | 7 - 123 | 78 |

| క్ర.సం. | పద్యం | స్కంధం - పద్యసంఖ్య | పుట |
|---|---|---|---|
| 32. | చదువనివాఁ డజ్ఞుండగు | 7 - 130 | 78 |
| 33. | ఎల్ల శరీరధారులకు | 7 - 142 | 79 |
| 34. | మందార మకరంద | 7 - 150 | 80 |
| 35. | చదివించిరి | 7 - 166 | 81 |
| 36. | తనుహృద్భాషల | 7 - 167 | 81 |
| 37. | కమలాక్షు | 7 - 169 | 82 |
| 38. | తన్ను నిశాచరుల్ | 7 - 193 | 84 |
| 39. | బలయుతులకు | 7 - 264 | 85 |
| 40. | లోకము లన్నియున్ | 7 - 267 | 85 |
| 41. | కలఁడంభోధి | 7 - 274 | 86 |
| 42. | ఇందుఁ గల డందు | 7 - 275 | 86 |
| 43. | హరియందు జగము | 7 -450 | 92 |
| 44. | కరిఁ దిగుచు మకరి | 8 - 54 | 95 |
| 45. | ఎవ్వనిచే జనించు | 8 - 73 | 96 |
| 46. | లోకంబులు లోకేశులు | 8 - 75 | 97 |
| 47. | నర్తకుని భంగి | 8 - 76 | 97 |
| 48. | కలఁ డందురు | 8 - 86 | 98 |
| 49. | కలుగఁడే నాపాలి | 8 - 87 | 98 |
| 50. | లావొక్కింతయు | 8 - 90 | 99 |
| 51. | వినుదఁట జీవుల | 8 - 91 | 99 |
| 52. | ఓ కమలాప్త ! | 8 - 92 | 99 |
| 53. | విశ్వమయత | 8 - 94 | 100 |
| 54. | అల వైకుంఠ | 8 - 95 | 100 |
| 55. | సిరికిం జెప్పఁడు | 8 - 96 | 101 |
| 56. | తన వేంచేయు | 8 - 100 | 101 |
| 57. | పూరించెన్ హరి | 8 - 116 | 102 |
| 58. | ఎఱుఁగుదు తెఱవా | 8 - 130 | 103 |
| 59. | పరహితము సేయు | 8 - 235 | 105 |
| 60. | మ్రింగెడు వాడు | 8 - 241 | 105 |
| 61. | హరిహరి సిరి | 8 - 526 | 108 |
| 62. | వెడవెడ నడకలు | 8 - 541 | 109 |
| 63. | ఒంటివాఁడ నాకు | 8 - 566 | 110 |
| 64. | వ్యాప్తిం బొందక | 8 - 574 | 111 |

| క్ర.సం. | పద్యం | స్కంధం - పద్యసంఖ్య | పుట |
|---|---|---|---|
| 65. | ఆశాపాశము దాఁ | 8 - 575 | 111 |
| 66. | వారిజాక్షులందు | 8 - 585 | 112 |
| 67. | కారే రాజులు? | 8 - 590 | 112 |
| 68. | నిరయంబైన | 8 - 593 | 113 |
| 69. | బ్రదుకవచ్చుఁగాక | 8 - 598 | 113 |
| 70. | ఇంతింతై వటుడింతయై | 8 - 622 | 114 |
| 71. | చెలియే మృత్యువు? | 8 - 647 | 115 |
| 72. | చుట్టాలు దొంగలు | 8 - 648 | 116 |
| 73. | హరియని సంభావించును | 9 - 86 | 121 |
| 74. | నాకు మేలుఁగోరు | 9 - 119 | 123 |
| 75. | తనువు మనువు విడిచి | 9 - 121 | 123 |
| 76. | సాధుల హృదయము | 9 - 123 | 124 |
| 77. | ఒక మాటెవ్వని | 9 - 142 | 124 |
| 78. | హరిఁ గొల్చుచుండు | 9 - 150 | 125 |
| 79. | మానుషదేహము | 9 - 243 | 128 |
| 80. | భూతల నాథుఁడు రాముడు | 9 - 263 | 129 |
| 81. | చపలత్వంబున డాఁగి | 9 - 300 | 131 |
| 82. | ఇతఁడే రామనరేంద్రుఁ | 9 - 325 | 132 |
| 83. | చిన్నయన్నలార! | 9 - 353 | 134 |
| 84. | నల్లనివాఁడు | 9 - 361 | 135 |
| 85. | మంతనములు | 9 - 363 | 135 |
| 86. | తాలిమి మనకును | 9 - 462 | 137 |
| 87. | క్షమ గలిగిన సిరి | 9 - 463 | 137 |
| 88. | పనుపక చేయుదు | 9 - 559 | 140 |
| 89. | అన్నము లేదు కొన్ని | 9 - 648 | 141 |
| 90. | ఎప్పుడు ధర్మక్షయ | 9 - 726 | 144 |
| 91. | మంగళహరికీర్తి | 9 - 731 | 144 |
| 92. | నగుమొగమున్ | 9 -733 | 144 |
| 93. | నీ ముఖాంబుజాత | 10 - 1 - 11 | 145 |
| 94. | మానవేంద్ర! | 10 - 1 - 48 | 148 |
| 95. | తిరుగుచుఁ గుడుచుచు | 10 - 1 - 85 | 149 |
| 96. | గురుపాఠీనమవై | 10 - 1 - 100 | 151 |
| 97. | జలధరదేహ | 10 - 1 - 112 | 151 |

| క్ర.సం. | పద్యం | స్కంధం - పద్యసంఖ్య | పుట |
|---|---|---|---|
| 98. | అమరశ్రేణికి నెల్లఁ | 10 - 1 - 168 | 154 |
| 99. | జో జో కమలదళేక్షణ! | 10 - 1 - 190 | 155 |
| 100. | రక్షణము లేక సాధుఁడు | 10 - 1 - 277 | 159 |
| 101. | ఊరకరారు మహాత్ములు | 10 - 1 - 284 | 160 |
| 102. | ఓ యమ్మ! నీ కుమారుఁడు | 10 - 1 - 329 | 162 |
| 103. | కలయో! వైష్ణవ | 10 - 1 - 342 | 163 |
| 104. | సంపన్నుం డొరు | 10 - 1 - 394 | 167 |
| 105. | నీ పద్యావళు లాలకించు | 10 - 1 - 342 | 167 |
| 106. | అపకారంబులు సేయ | 10 - 1 - 850 | 181 |
| 107. | వాసుదేవ! కృష్ణ! | 10 - 1 - 941 | 184 |
| 108. | బాంధవమునసైనఁ | 10 - 1 - 973 | 184 |
| 109. | నల్లనివాఁడు పద్మ | 10 - 1 - 1011 | 186 |
| 110. | నీ పాద కమల | 10 - 1 - 1270 | 192 |
| 111. | కాలము ప్రబలులకు | 10 - 1 - 1644 | 199 |
| 112. | భూషణములు సెవులకు | 10 - 1 - 1685 | 201 |
| 113. | అంకిలి సెప్పలేదు | 10 - 1 - 1708 | 203 |
| 114. | వచ్చెద విదర్భ | 10 - 1 - 1717 | 204 |
| 115. | నమ్మితి నా మనంబున | 10 - 1 - 1744 | 206 |
| 116. | పరుఁ జూచున్ వరుఁ | 10 - 2 - 178 | 215 |
| 117. | వరద! పద్మనాభ! | 10 - 2 - 749 | 229 |
| 118. | వరదుఁడు సాధు | 10 - 2 - 970 | 235 |
| 119. | ఏమితపంబు | 10 - 2 - 985 | 236 |
| 120. | తివిరి యజ్ఞాన | 10 - 2 - 994 | 236 |
| 121. | దళమైనఁ బుష్ప | 10 - 2 - 1010 | 237 |
| 122. | మన శాస్త్రంబులు | 10 - 2 - 1047 | 239 |
| 123. | సనక సనందనాది | 10 - 2 - 1048 | 239 |
| 124. | కృష్ణ! పరమాత్మ! | 10 - 2 - 1187 | 242 |
| 125. | తరణంబులు భవజలధికి | 11 - 15 | 248 |
| 126. | కరణత్రయంబు | 11 - 42 | 250 |
| 127. | హరిదాసుల మిత్రత్వము | 11 - 55 | 252 |
| 128. | నిన్నుఁ జూడని | 11 - 121 | 261 |
| 128. | గజతురగాదిశ్రీలను | 12 - 7 | 262 |
| 130. | ధర్మము సత్యముఁ గీర్తియు | 12 - 16 | 264 |